# కథా కౌముది

## 2013 - Part 2




శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
కౌముది ప్రచురణలు - 83

కౌముది మాసపత్రికలో

2013 జూలై నుంచి డిసెంబర్ 2013

వరకూ

వచ్చిన కథలు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. ఆ నలుగురు | కాకాని చక్రపాణి | 5 |
| 2. నీహారిక | డా. భైరవభట్ల విజయాదిత్య | 14 |
| 3. కలహాల కాపురం తాడికొండ | కె. శివకుమార శర్మ | 21 |
| 4. అయినవాళ్ళు | వారణాసి నాగలక్ష్మి | 27 |
| 5. టీ కప్పులో .. | కాశీభట్ల శశికాంత్ | 35 |
| 6. తాతయ్యలు - తకరారు | డా.మూలా రవికుమార్ | 41 |
| 7. ఫోటో | చెన్నూరి సుదర్శన్ | 48 |
| 8. మేలిముసుగు | డా.యండమూరి కమలేంద్రనాధ్ | 54 |
| 9. తారుమారు | డి.కామేశ్వరి | 60 |
| 10. స్టింగ్(స్టింక్)ఆపరేషన్ | విజయభాస్కర్ | 67 |
| 11 మీసాలాడి పెళ్ళాం | స్ఫురిత మైలవరపు | 72 |
| 12. ఊర్వశి - పురూరవ | వెంకట్ | 76 |
| 13. భీష్ములకి కొదవలేదు | ఎలక్ట్రాన్ | 81 |
| 14. మనసుకు రంగులు | సి.యమున చింతలపాటి | 85 |
| 15. మిథ్యాబింబాలు | ఆచార్య పి.కె.జయలక్ష్మి | 92 |
| 16. పార్టనర్ | డి.సుధ | 99 |
| 17. పరిమళం | సన్నిహిత్ | 106 |
| 18. కుటీచకుడు | మంథా భానుమతి | 111 |
| 19. రెప్పపాటు ప్రయాణం | శారద పోలంరాజు | 118 |
| 20. చేతకానివాడు | బాలి | 126 |
| 21. ప్లాసిబో | చామర్తి ఆచార్య | 132 |
| 22. సబ్బుబిళ్ళ | కుంతి | 143 |
| 23. సినేమా కథ | ఎస్.ఎస్.వి.రమణరావు | 147 |
| 24. సాయం | అనామకుడు | 153 |

| | | |
|---|---|---|
| 25. పీర్ల కోనేరు | వాసుదేవ్ | 158 |
| 26. సీతమ్మ లోగిలి | పి.కె.జయలక్ష్మి | 164 |
| 27. అహం బ్రహ్మోస్మి | దూర్వాసుల విజయభాస్కర్ | 169 |
| 28. ఆనందభవన్ | డా.చిత్తర్వు మధు | 175 |
| 29. తెలుగు గోల | డా.పుట్టపర్తి తులజాదేవి | 184 |




# ఆ నలుగురు

కాకాని చక్రపాణి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

**"వీడు మీ వాడే నీకు తెలీదుకానీ, మీకు బంధువు.** ఏదో ఆశ్రయం కల్పించమన్నాడు. నీకేం ఇబ్బంది లేదుగా, ఈ ఇంట్లో వీణ్ణి ఉంచుకో" అని చెప్పాడు దేవుడయ్య పాతికేళ్ళ క్రితం. దేవుఁడయ్య నాకు దూరపు బంధువు. నాకంటే పెద్దవాడు కనుక, 'బాబాయి' అని పిల్చేవాడిని. నిజానికి స్నేహితుడని చెప్పుకోవాలి. ఏ అవసరమొచ్చినా నేనతని సలహా తీసుకుంటుండేవాడిని. మమ్మల్ని తెలిసిన వాళ్ళు 'నరనారాయణుల'ని పిల్చేవాళ్ళు.

కానీ, ఇది మనిషిని ఇంట్లో ఉంచుకోవాలిసిన వ్యవహారం. అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మంచిదన్నారు. అందుకే, "నాకవసరంలేదు. ఎవణ్ణో నా ఇంట్లో పెట్టుకోలేను" అని నిర్మొహమాటంగా చెప్పేశాను.

దాంతో దేవుఁడయ్య నా మీద ఇంతెత్తున ఎగిరాడు. "ఇతడు మీ అమ్మవైపు బంధువు. నువ్వే ఉంచుకోనంటే ఎవడుంచుకుంటాడు? ఈ కాలంలో జనాలకు బంధుప్రీతి లేకుండా పోతున్నది. ఉంచుకుంటావో, వదిలించుకుంటావో నీ ఇష్టం!" అని వెళ్ళిపోయాడు.

"ఏం పేరు?" అనడిగాడతన్ని.

"మధు. భయపడకు. నాకు ఇబ్బంది కలిగించనంత వరకు నేను నీకు కష్టంగా మారను."

"నీ బొంద. నా కొంపలో ఉంటూ నన్నే బాధపెడ్తావా? అనడిగాను నేను అతన్ని కోపంగా.

అతడు జవాబివ్వలేదు గానీ నవ్వాడు, తియ్యగా, మధురంగా. అతడి నవ్వుకే అతణ్ణి ఇంట్లో ఉంచుకుని పోషించుకోవచ్చు.

వాడు నా కొంపకు వచ్చిన కొత్తల్లోనే మళ్ళా దేవుఁడయ్య నా సంగతి విచారించటానికి వచ్చాడు. మధు తీరు అతడికి నచ్చినట్లు లేదు. "ఒరే మర్త్యుడూ! ఇదివరకటిలా లేదు వీడి వాలకం. ఇల్లుగుల్లచేసేవాడిలా ఉన్నాడు. వీణ్ణి త్వరగా పంపించెయ్యి" అన్నాడు. అయితే నేను వాడితో అలవాటు పడిపోయాను. కనుక అతడి మాటలు నేను అంతగా పట్టించుకోలేదు.

ఇన్నేళ్ళల్లో మధు నన్ను పెద్దగా బాధపెట్టిందిలేదు. అతడొచ్చాక, నీరసంగా ఉన్నదనిపిస్తే, పరీక్ష చేయించుకున్నాను. డాక్టరు డయబెటిస్ అన్నాడు. "భయపడకు, కంట్రోల్‌లో ఉన్నంతవరకూ అది నిన్నంత బాధపెట్టదు" అని మధు ఆశ్వాసన పలికాడు. నాకెంతో సాయం చేసేవాడు. నాకు వంట చేసి పెట్టేవాడు. నాతో పాటు వాకింగ్‌కు వచ్చేవాడు. నేనెప్పుడైనా బద్ధకించినా, నాకు బుద్ధులు చెప్పేవాడు, వాకింగ్ ఒంటికి మంచిదనేవాడు, మంచిది కాదని స్వీట్లు తిననిచ్చేవాడు కాదు. కనీసం మామిడి పండ్లు తిననిచ్చేవాడు కాదు. ఎప్పుడో ఎండాకాలంలోనే కదా అవి వచ్చేవి.

ఒకసారి ఇలా కాదని వాడిని ఏమర్చి బజారుకెళ్ళి, అక్కడే రెండు మామిడి పళ్ళు తిని వచ్చాను. మర్నాటికల్లా లేస్తే కళ్ళు తిరుగుతున్నాయి. వాడే తీసుకెళ్ళి షుగరు పరీక్ష చేయించాడు. పరగడుపునే 250 ఉంది. వాడికెలా తెలిసిందో మరి, "దొంగతిండి తింటే మరేమవుతుంది. రోజూ మామిడి పళ్ళు తిను, కిడ్నీ ఫెయిలయి చస్తావు!" అన్నాడు వాడు.

"జన్మంతా ఉండేదానికి ఛస్తామా? నీ తిండి తిన్నాక, జిహ్వ చచ్చి, బతుకుదామన్న ఇచ్ఛ లేకుండా పోయింది" అన్నాను.

"తిరుగుతూ తిరుగుతూ పోవాలి. తిక్క మనిషివి. భార్యపోయింది. కొడుకుల్ని, బంధువుల్ని నీ అహంకారంతో దూరం చేసుకుంటున్నావు. మంచాన పడ్తే నీకు చేయలేక చావాలి. తింటే తిన్నావు, కనీసం మితంగానయినా తిన్నావా?" అన్నాడు.

కబీరుదాసు చెప్పాడు,

**"నిందక్ నియరై రాఖియే, అంగన్ కుటీ ఛవాయ్**

**బిన్ పానీ బిన్ సాబునా, నిర్మల్ కరై సుభాయ్"**

అంటే నిన్ను విమర్శించేవాడెవడయినా ఉంటే, వాడిని ఇంట్లో తెచ్చిపెట్టుకో, నీళ్ళూ సబ్బు లేకుండానే నీ స్వభావం బాగుపడుతుంది అని. అందుకే వాడు నన్నింతగా విమర్శిస్తున్నా సహించి ఊరుకున్నాను. ఇప్పుడు వచ్చి నా ఇంట్లో తిష్టవేసి ఎన్నో ఏళ్ళయింది, వాడు పొమ్మన్నా పోడు.

కొన్నేళ్ళయాక, ఓ రోజు ఎవడ్నో కొంపకు తీసుకువచ్చాడు. నేను ప్రశ్నార్థకంగా వాడి వంక చూశాను.

"మనవాడే, పాపం ఆధారం చూపించేవాళ్ళు లేక ఇబ్బంది పడుతున్నాడు. మన దగ్గరే ఉంటాడు" అన్నాడు మధు.

"ఆధారం లేని వాళ్ళకందరికీ, మనకొంపే ఆధారమా?" అన్నాను కోపంగా.

"కోపం వద్దు. 'తన కోపమె తన శత్రువు' అని పెద్దలు చెప్పారు గుర్తులే?" అని మధురంగా నవ్వాడు.

"మీ నాయన కూడా మహా కోపిష్టికదా? అందుకే త్వరగా పోయాట్ట."

"ఎవరు చెప్పారు?" అనడిగాను ఆశ్చర్యపోతూ.

"వీడే చిన్నప్పటినుండీ వీడికి విద్యాబుద్ధులు చెప్పించి పైకి తీసుకొచ్చాట్ట ఆయన. నీ వయసే గుర్తులేదూ?"

"ఏమో, ఇలాంటి అమాంబాపతులాంటి వాళ్ళు ఎంతోమంది మా ఇంట్లోపడి తినిపోతూండేవాళ్ళు. మంచి మనిషి, కోపిష్టయితేనేం, నలుగురికి పెట్టి తాను తిన్నవాడు" అన్నాను. మా నాయన స్మరణకొచ్చి నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నీ లాగ వాడికి పెన్షను లేదు, కాలుమీద కాలు వేసుకుని తినటానికి. నాలాంటివాడే ఒంటరి. నిన్న బజార్లో కనబడి నిలువనీడ లేకుండా తిరుగుతూంటే, 'నువ్వు కూడా మా ఇంటికి వచ్చెయ్యి, హాయిగా కల్సి ఉండొచ్చు ముగ్గురం' అన్నాను. సరేనని వాడొచ్చాడు."

వాడా మాట అనంగానే నాకు మండిపోయింది. "ఎవడిదిరా ఈ కొంప? నీదా! నీ బాబుదా? కొంపలోకి అడ్డమైన వాళ్ళనందర్నీ తెచ్చి పెడుతున్నావు. అసలు నువ్వు కూడా నా కొంపలోనుండి వెళ్ళిపో" అన్నాను రౌద్రంగా. ఆ కోపంలో, పెద్దగా దగ్గు తెరకూడా వచ్చింది. కాసేపు దగ్గుతూనే ఉండిపోయాను.

"కూల్ బాబూ కూల్. ఇట్లా కొంపలెగిరిపోయేట్లు అరిస్తే, నీకు బి.పి రావటం ఖాయం. అయినా అతడెవరనుకుంటున్నావు. మీ నాయనకు కొడుకులాంటివాడు. వాడిని కూడా ఉంచుకుంటే నీ కొంపేం మునిగిపోదు"

వాడలా నాకు సమర్థాయిస్తున్న సమయంలో, ఆ కొత్తగా వచ్చిన మనిషి నాకు ఓ గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చిచ్చాడు గుడ్ సమరిటన్ 'పోన్లే, ఉండనీ మా నాయన ఇంట్లో ఎంతమంది ఉండి తినిపోలేదు. ఆయన పోయాడు కానీ, మిగిలింది ఆయన దాతృత్వ గుణమేగా. రేపొద్దున మనం పోయినా మిగిలేదదే కదా? పిల్లలకు ఎలాగో ఆస్తి పంచిపెట్టేశాను. నేను పోయాక, ఉన్న ఈ ఇల్లు కూడా

వాళ్ళమ్ముకుంటారో, ఉంచుకుంటారో ఆధారం లేని వాడంటున్నాడు మధు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించటం పుణ్యమనే అంటారు కదా?'

ఆ మాట నేననలేదు పైకి. మధు వట్టి భౌతికవాది. హేతువాది. దేవుడు, దయ్యం వాడికి పట్టవు. బతికి ఉన్నంత వరకు నలుగురికి సాయం చేయాలంటాడు. "కావాలంటే నన్ను ఎగ్జాంపుల్‌గా తీసుకో. నాకంటూ ఏముంది ఇక్కడ? మీ అమ్మ నాకు బంధువనే కదా నీ దగ్గరకొచ్చి ఇన్ని సేవలు చేస్తున్నాను" అంటాడు వాడు. వాడితో వాదించటం తలనొప్పి నాకు. ఎప్పుడైనా వాదించినా, వాడితో గెలవలేక 'శేషం కోపేన పూరయేత్' అయిపోయేది నా పని. అందుకే పుణ్యం సంగతి వాడి దగ్గర ఎత్తలేదు. ఇంక దానిమీద కూడా పెద్ద లెక్చరిచ్చేస్తాడు.

"సరే, నీ పేరేందయ్యా?" అనడిగాను ఆ నవాగంతకుడిని.

"వేరే పేరెందుకు, బి.పి అని పిల్చుకో. నీకు కొత్తగా వచ్చిన ఆభరణమదేగా?" అన్నాడు మధు.

"చంపుతా? రోగాలు మనుషులకు కాక మానులకొస్తాయా?"

"అదే నేనూ చెప్పేది. వచ్చిన బి.పి.ని ఏ గుండె జబ్బుకిందో మార్చుకోవద్దని. సరే, నీతో వాదన ఎందుగ్గానీ, వాడిని బి.పి అని ఇంగ్లీషు పేరుతో పిలవటం ఇష్టంలేకపోతే, ఎంచక్కా తెలుగులో 'రక్తపోటు' అని పిల్చుకో. దుష్ట సమాసం అనుకుంటే 'రక్తపీడనం' లేక 'పీడనమూర్తి' అని పిల్చుకో. 'వాట్సిన్ నేమ్?' అన్నాడు కదా షేక్స్‌పియర్. ఏ పేరు పెట్టి పిల్చినా పలుకుతాడు నీ బోటి మూర్ఖులంటారు కదా?"

"దేవుడి పేరెత్తకు, నాకు ఫాస్టస్ కథ గుర్తుకు వస్తుంది" అన్నాడు.

"ఎవడా ఫ్యాస్టసుడు, ఏమా కథ? అయినా నీకంత పాండిత్యం కూడ ఉందా?" అనడిగాడు మధు.

"ఒక రిలవెంటు పుస్తకం గురించి చెప్తా. మీ ఇద్దరూ డయాబెటిక్ పేషెంట్లు కనుక, అందులో నుండి నీతిని కూడా గ్రహించవచ్చు. ఓ జర్మను కథను ఇంగ్లీషులో క్రిష్టఫర్ మార్లో నాటకంగా రాశాడు."

"ఓర్నీయమ్మ, నేనే డయబెటిస్ అయితే నన్ను డయబెటిక్ పేషెంటంటావు. ఆ మార్లో మీ ఊరోడా?"

"తప్పు! క్రిష్టఫర్ షేక్స్‌ఫియరుకు పూర్వీకుడు. సరే, విను. ఫాస్టస్ పెద్ద పండితుడు. ఆయన విద్యల పారమ్యం చూశాడు. అయినా, జ్ఞాతృష్ణ తీరలేదు. నిషిద్ధ మంత్రశాస్త్రం - నా క్రొమాన్సీ - నేర్చుకోవాలనుకున్నాడు. అందుకు యముడు - అంటే వాళ్ళ లూసిఫర్‌ని ఆవాహన చెయ్యాలి. ఆ పనే చేశాడు. లూసిఫర్ ప్రత్యక్షమయాడు. 'నీకు సకల భోగాలూ పాతికేళ్ళపాటు ప్రసాదిస్తాను. బదులుగా ఆ కాలావధి తర్వాత నీ ఆత్మ శాశ్వతంగా నా పరమవుతుంది. మధ్యలో దేవుణ్ణి తల్చుకోవటం లాంటి పాతకప్పనులు జరక్కూడదు' అంటాడు లూసిఫర్"

"అదేందయ్యా! వాళ్ళ లూసిఫర్ యమధర్మరాజు కాదా? మన యముడ్ని సమదర్శి, సమవర్తి అంటారు కదా? వాళ్ళ లూసిఫర్ అలాంటాడు కాదా? తెలీక అడిగాను, తప్పయితే కోప్పడక" అనడిగాను. పండితుడని తెలిసాక అతడంటే నాకు గౌరవం పెరిగింది.

"నేను మధులాంటి మూర్ఖుణ్ణా, అనవసరంగా కోపగించుకోటానికి?" అంతలో మధు, ఏదో చెప్పబోతే, అతడిని నివారిస్తూ, "సర్లే, నోరెత్తకు, నిన్నేమన లేదు, ఉన్నమాట చెప్పాను. టైమ్ వేస్ట్ చెయ్యటంలో నీకు నువ్వే సాటి. సరే, వాళ్ళ లూసిఫర్ అంటే శాటన్ అంటే సైతాను జనాల చేత పాపం చేయించి నరకానికి పట్టుకెళ్తుంటాడు. అతడు దేవుఁడికి ప్రత్యర్థి. దేవుఁడు మానవాళికి మంచి చేస్తాడు కనుక వాళ్ళకు కీడు చెయ్యటమే సైతాను పని. సరే, ఫాస్టస్ కండిషనుకు ఒప్పుకున్నాడు. అతని కోరికలన్నీ తీర్చటానికీ, అతడు

పొరపాటునైనా దేవుడి పేరు తల్చుకోకుండా కాపలా ఉండటానికి ఓ బంటును నియోగించాడు. అతని పేరు మెఫిస్టోఫిలిస్. 'ఫాస్టస్' సినిమా చూశారా, మీలో ఎవరయినా?"

నేను, మధు నోరు వెళ్ళబెట్టాం.

"చూస్తే తెలిసేది, మెఫిస్టోఫిలిస్ రూపం ఎంత భయంకరంగా ఉంటుందో! 'నిన్నిలా చూడలేనురా, బాబూ, సాధువు రూపంలో కనిపించమ'ని ఫాస్టస్ అంటే, అలాగే రూపం మార్చుకున్నాడు. సరే, ఇంక కథలోకి వస్తే, పాతికేళ్ళ వరకు ఈ బంటు అతనికి సర్వ ప్రాపంచిక భోగాలను సమకూరుస్తాడు. హెలెన్ ఆఫ్ ట్రాయ్‌ని సమకూర్చి పెట్టాడు. ఆమె అపురూప సౌందర్యవతి. 'క్లియోపాత్రా' సినిమాలో ఎలిజబెత్ టైలర్ వేసిందే, ఆమె కంటే కూడా రూపవతి."

"నీ కెట్టా తెల్సురా?" అన్నాడు మధు ఎగతాళిగా.

"ఎలిజబెత్ టైలర్‌ను చూస్తే నువ్వు నా మాట కాదనవు. సరే, ఫాస్టస్ దేవుణ్ణి తల్చుకుంటే మాత్రం అతడు ఊరుకోడు. తన ఆత్మకు విముక్తి లేదని తెలుసు ఫాస్టస్‌కు. పాతికేళ్ళు అయాక, తను నిరంతరం నరకాగ్నిలో వ్రేలాడాల్సి ఉందనీ తెల్సు. కానీ అతనేం చెయ్యలేడు. అతని చివరి క్షణాలని అద్భుతంగా చిత్రించాడు క్రిష్టఫర్ మార్లో. 'నువ్వు పాపులకోసం చిందించిన ఒక్క రక్తపు బొట్టయినా చాలు దేవా, నా పాపాన్ని కడిగేయటానికి' అని ఏడుస్తాడు ఫాస్టస్. దగ్గర బంటులా పనిచేస్తున్న మెఫిస్టోఫిలిసే చివరికి అతని మెడవిరచి పట్టుకుపోతాడు నరకానికి."

"ఇందులో మేం నేర్చుకునేందుకు నీతేముంది?" అనడిగాడు మధు.

"మరదే, తొందర. చెప్పనిస్తావా? యముడు ముందే జాగ్రత్తపడతాడు. మనిషి వయసు యాభై దాటగానే తన కింకరులను పంపుతాడు. యమకింకరులంటే ఎవరూ? వాళ్ళు మన కళ్ళకు కనబడరు. ఒంట్లో బావుండలేదనిపిస్తుంది. మనం డాక్టరు దగ్గరకు వెళ్తాం. ఏ రోగమో నిర్ధారించటానికి కావల్సిన క్లినికల్ టెస్టులు, తన జేబులోకి పోవటానికి కావల్సిన క్లినికల్ టెస్టులు డాక్టరు చేయిస్తాడు. అదుగో, అప్పుడు కనిపిస్తాడు ఆ యమకింకరుడు. వాడు డయాబిటిస్ రూపంలోనో, హృద్రోగం రూపంలోనో, మరో రూపంలోనో మనలో తిష్టవేసి ఉంటాడు."

"అంటే, మనవాడి దగ్గరకు అప్పుడే యంకింకరులు వచ్చారన్నమాట! ఇతడు డయబెటిక్, బి.పి పేషెంటు కూడ!"

అందుకు జవాబు చెప్పలేదు పీడనమూర్తి. "పాపం, ఈ మధ్యే పోయాడు మా స్నేహితుడొకడు డయాబిటిస్. ఏవో ఆకుపొడుములు తిన్నాడు. తగ్గిందనిపించింది. 'నాకు షుగరు తగ్గిపోయిందిరా!' అన్నాడు. 'ఎక్కడ తగ్గుతుందిరా! వచ్చింది పోతుందా! కంట్రోలులో ఉందేమో?' అన్నాను. తగ్గిపోయిందనుకుంటూ, కూర్చుని రోగాన్ని నిర్లక్ష్యం చేశాడు, యమకింకరుణ్ణి కింగ్‌కాంగ్‌ని పోషించినట్లు పోషించాడు. పోయాడు. కనుక, నీతి ఏమిటంటే, యమకింకరుడు మన దగ్గరే ఉంటాడు. మనం ఆహార వ్యవహారాల్లో నియమబద్ధంగా ప్రవర్తించినంత వరకు కనపడడు. ఏ మాత్రం పొరపాటు చేసినా తొడ మెలిపెడతాడు. అప్పటికీ నిర్లక్ష్యం చేశావనుకో మన మెడ విరచి పట్టుకెళ్ళిపోతాడు. డాక్టర్ ఫాస్టస్ దగ్గర లూసిఫర్ అపాయింట్ మెంట్ చేసిన మెఫిస్టోఫిలిస్ లాంటి వాడు.."

"బావుంది" అన్నాడు మధు.

"కనుక ఇంకెప్పుడూ నన్ను చిన్న చూపు చూడకు, పిచ్చి కూతలు కూయకు, నాకేం రాదని, నేనేం చదువుకోలేదని తెలిసినవాడు అణిగి మణిగి ఉంటాడు, నాలాగా 'ఎదిగిన కొద్దీ ఒదగమని' చెప్పాడు ఆయనెవరో"

"ఆయనెవరో తెలిసి చావటానికి సినిమాలు చూసి ఛస్తేకదా!" అన్నాడు మధు.

అలా ఆ పీడనమూర్తి కూడా నా కొంపలో చేరాడు. పండితుడు కదా అని నేనతన్ని మర్యాదగా చూడసాగాను. అతడూ తిన్న విశ్వాసం మర్చిపోకుండా బజారు పనులు చూడసాగాడు. ఇద్దరూ కలిసి నన్ను కొంపలో నుండి కదలకుండా అన్ని పనులు వాళ్ళే చేసిపెడుతున్నారు. అంతకు ముందు నేను వాకింగుకు వెళ్ళకపోతే ఊరుకునే వాడు కాదు మధు. "నువ్వు హాయిగా ఇంట్లో కూర్చో. నీ వాకింగ్ కూడా నేను చేసి వస్తాను" అనసాగాడు.

"నువ్వు చేస్తే నేను చేసినట్లలా అవుతుందిరా?" అన్నా వినిపించుకునేవాడు కాదు.

ఇలా ఉండగా మా మేనమామ చుట్టమంటూ ఒక ఆడమనిషి కడుపుబ్బరంతో ఆసుపత్రిలో చూపించుకోటానికి వచ్చింది. ఆయన ఫోను చేసి చెప్పాడు "కాస్త ఆమెకు సాయం చెయ్యరా!" అని. అయితే, ఆమె నా దగ్గరకే ఎందుకొచ్చిందో నాకు ఆ తర్వాత తెలిసింది.

నేను మధుకు చెప్పాను, ఆమెను గురించి, అడ్జెస్టు చేసుకోవాలనీ చెప్పాను.

వాడికి వాచాలత్వం ఎక్కువ. "ఈ రోగిష్టి నెక్కడ పట్టుకొచ్చావు? మనకంటుకుంటుంది ఆ రోగం" అన్నాడు.

"గాస్టిక్ ట్రబుల్ అంటు రోగం కాదురా, అనవసరంగా అనుమానించకు" అని నచ్చచెప్ప ప్రయత్నించాను.

అయితే, కడుపుబ్బరం మనిషి రాకడ పీడనమూర్తికీ ఇష్టం లేనట్టు ఉంది. 'యాచకో యాచకః శత్రుః' అన్నారు కదా?

"పులుపు పడదని దానికి తెలుసు. అయినా మామిడికాయ, నిమ్మకాయతో చేసిన పప్పు అంటే చచ్చేంత ఇష్టం దానికి. సాంబార్లు, చార్లు ఇక సరేసరి. మనం చేసే వంట దానికి నచ్చటం లేదు. ఇప్పుడు వంటింట్లోకి ఎవర్నీ రానివ్వటంలేదు. 'మీ బొంద మీకు వంటరాదు, పెంట చేస్తున్నారు. కనీసం నేనిక్కడున్నన్ని రోజులు వంట చేసిపెడతాను. పొట్ట పగిలేట్టు తిని చావండి' అంది నోటి దురుసు మనిషి. ఇప్పుడు మధుక్కూడా ఆమె వంట నచ్చుతోంది. పనీ పాటల్లేక, ఇంట్లో కూర్చుని ఆపసోపాలు పడుతున్నాడు. అంటురోగం కాకపోయినా ఆ వంట తింటే మనకా జబ్బు రావటం ఖాయం" అన్నాడు పీడనమూర్తి.

అప్పుడే నాలుగు సంచులతో కూరలు మోయలేక మోస్తూ మార్కెట్టునుండి వచ్చిన ఉబ్బరాన్ని చూశాక ఇంక వాళ్ళెవరూ నోరు మెదపలేదు.

నేనే చెప్పాను, "ఇప్పటిదాకా మధు వంట చేస్తున్నాడు కదా? చుట్టం చూపుగా వచ్చిన మీకెందుకీ భారం? వాడు చూస్తాడు లెండి" అని. నిజానికి ఆడాళ్ళంటే నాకు గౌరవం. పీడనమూర్తి ఆమెను అదీ, ఇదీ' అనటం కూడా నాకిష్టం లేదు.

"చుట్టంగా వచ్చానని ఎవరు చెప్పారు, నీకు? ఈ పీడగాడూ, ఆ మధుగాడూ చెప్పారా? ఆ చేతగాని వెధవల మాటలు నమ్మక. 'మా వాడికి వంట చేసి పెట్టే దిక్కుకూడా ఎవరూ లేరమ్మా! వాడికి వంట రాదు. పెళ్ళాం పోయినప్పటినుండి చేతులు కాల్చుకుంటున్నాడు. నీకిక్కడ మాత్రమేముంది? వాడికి సాయం చెయ్యి. పనిలో పనిగా నీ మొగుణ్ణీ వెతుక్కో' అని మీ మేనమామగారు బతిమాలితే, కాదనలేక వచ్చాను. అయితే. ఆ మొగుడు నాకొడుక్కూ, మీకూ షడసోపేతంగా వంట చేసి పెట్టటానికే వచ్చాను. నేను వచ్చానంటే పోయే మనిషిని కాను. నా తిండి తిన్నప్పటి నుండి నువ్వు మాత్రం మనిషి నిగనిగలాడటంలా?" అందామె.

"ఆఁ, చిరుబొజ్జ కూడా వచ్చింది. అంతా నీ దయే!" అన్నాడు మధు.

"ముయ్యరా నోరు అందుకే, కృతజ్ఞత లేని మనుషులంటే నాకు మంట. రోజూ లొట్ట లేసుకుంటూ రుచిగా ఉందని పొట్టపగిలేట్టు తింటున్నావు. అసలు చిరుబొజ్జలేని వాడు మొగాడేనా అంట?"

"చిరుబొజ్జేమిటి లెండి. మీలాంటి భారీ బొజ్జలు మాత్రం ఎంతమంది జీవితంలో సాధించగలరు? నిజానికి మీరు ప్రశంసార్హులు. మీ బొజ్జ చూసి కదుపుకుట్టి వాడలా పిచ్చికూతలు కూస్తున్నాడు" అన్నాడు పీడనమూర్తి.

"బోడి గౌరవాలు చూపకు, వ్యంగ్యపు కూతలు మానెయ్యి, మగడా!" అందామె.

"అదేంది, వాడు నీ మొగుడా?" అడిగాడు మధు ఆశ్చర్యపోతూ.

"మరి నేనిక్కడికి వచ్చిందెందుకూ? ఈ మొగుడు నాకొడుకు చెప్పకుండా పారిపోతే, ఈణ్ణెతుక్కుంటూ వచ్చా."

మాకు సత్యం తెలిసిపోయిందని పీడనమూర్తి ముఖం చిన్నబుచ్చుకున్నాడు. నాకూ బాధ కలిగింది. అలాంటి సంస్కృతి కలిగిన వ్యక్తికి ఈ ఎడ్డి మనిషి ఎలా పెళ్ళాంగా దొరికిందా అని. వదిలేసి మంచిపనే చేశాడనిపించింది నాకు.

అప్పుడు నాకు పీడనమూర్తి చెప్పిన మాట గుర్తుకు వచ్చింది, "అది నెలకు ఐదుకిలోల నూనె వాడేస్తున్నది. మనకు కొలెస్ట్రాల్ పెరిగి, హార్ట్ అటాక్ వచ్చే ప్రమాదముంది. నేను చెపితే ఫ్రేటేగిపోయింది 'నూనె లేకపోతే వంటకు రుచెలా తగలడుతుంది? అసలే సన్నగా పీనుగులా ఉంటావు. బతికినన్నినాళ్ళు బతికి ఛస్తావా? శుభ్భంగా తిని చావు' అని నన్ను తిట్టింది" అని. అతడు, ఆమెనెలాగయినా వదిలించుకోవాలనే ప్రయత్నం చేశాడని ఇప్పుడు నాకర్థమయింది. నా పెన్షను మొత్తం ఇంటి సరుకులకోసమే వాడాల్సి వస్తోంది. అందుకే, కడుపుబ్బరంతో అన్నాను, "అది సరే, మన ఇంటి ఖర్చుకూడా పెరిగి పోయింది. పెన్షనంతా వాటికోసమే ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అందరం ముసలివాళ్ళమే. రేప్పొద్దున, మనలో ఎవరైనా ఆస్పత్రిలో చేర్చాల్సి వస్తే కష్టమవుతుంది" అన్నాను.

"నా వంట తిన్నాక, ఎవడికీ ఏ రోగమొచ్చే అవకాశమే లేదు. నువ్వూర్కో. నా మొగుడు పీనుగు, మధు రాక్షసుడు చెప్పిన మాటలు పట్టుకుని నన్ను అదుపులో పెట్టాలని చూడక. నా మొగుడు ఆ ప్రయత్నం చేసి, సాధ్యంకాక, ఇక్కడికి పారిపోయి వచ్చాడు. తినక ఛస్తామా, బతికినందుకు మరి సార్థకత ఏమిటి?" అని కోపంగా విసవిసలాడుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆమెకు నా మాటలు లెక్కలేదు. ఓ రోజు నన్ను చూడటానికి వచ్చిన దేవుఁడయ్యను కడుపుబ్బరం ఇంట్లోకడుగుపెట్టనివ్వలేదు. "ఆయనసలే గ్యాస్ట్రిక్ ట్రబుల్‌తో బాధపడుతున్నాడు. ఇప్పుడు ఆయన ఎవర్నీ చూడడు, వెళ్ళు" అంది.

"నువ్వెవరు, మా మర్త్యుడి పనిమనిషివా?" అని అతడడిగాడు.

"ఆయన మేనత్త కూతుర్ని. నీకెందుకయ్యా ఆ వివరాలు, వెళ్ళమంటే నీక్కాదూ?" అని అతడిని బయటకు తోసి తలుపులేసేసింది.

నాకా మాటలు వినబడుతూనే ఉన్నాయి. నేను లేచి వెళ్ళి అతడిని ఇంట్లోకి తీసుకు వద్దామనుకుంటూనే ఉన్నాను, అంతలో అతడు వెళ్ళిపోవటంతో హతాశుడినై కూర్చుండిపోయాను. అసలే గాసు ఎగదన్ని, గుండెనొప్పి వచ్చినట్లుంది.

"అతడు నా స్నేహితుడు. తప్పు, అలా నా వాళ్ళు వస్తే పంపించెయ్యక" అని హెచ్చరిక చేసినట్టు ఆమెకు గట్టిగానే చెప్పాను.

నాలుగు రోజుల తర్వాత కడుపుబ్బరం ఓ మనిషిని వెంటబెట్టుకుని వచ్చింది.

"వీడు శ్లేష్మం. మా తమ్ముడు. 'అక్కా నువ్వు లేకపోతే నా మనసుండబట్టలేదే నువ్వు ఇంత మూకకి వంట చెయ్యలేక కష్టపడిపోతున్నావని తెల్సినాది. నేనొచ్చి నీకు సాయం చేసి పెడతాలే' అని ఫోను చేస్తే, చేతికింద పని చేస్తాడని రమ్మన్నాను" అని చెప్పింది కడుపుబ్బరం.

రాకముందే మమ్మల్నందర్నీ 'మూక' కింద జమకట్టిన అతని మీద నాకసలు గౌరవం లేకుండా పోయింది.

"అదేం పేరు, శ్లేష్మం కొత్తగా ఉంది?" అని అడిగాను కడుపుబ్బరన్ని.

"మ నాయనకో శత్రువు ఉండేవాడు. వాడు ఉబ్బసం జబ్బుతో బాధపడి చచ్చాట్ట. నిజానికి అదేదో ఉబ్బసంలో మరో రకంట. ఏందిరా అది? సివోపిడినంట. ఈ ఇంగ్లీషు పేర్లు నాకు వచ్చి చావవు. ఆ జబ్బులో ఊపిరి తిత్తులు, కుంచించుకు పోయి, వాటి నిండా శ్లేష్మం నిండి, చివరకు ఊపిరి ఆడక చస్తారంట. ఆ రోగిష్టి గొంతులో నిత్యం శ్లేష్మం పేరుకునుంటుంది. దాన్ని మింగలేక, కక్కలేక తన

శత్రువు చచ్చిపోతూంటే మా నయన ఆనందంతో పరవశమైపోయేవాడు. ఆ కళ్ళతోనే వాడు చచ్చాట్ట. ఆ కళ్ళె పట్ల అంత ప్రేమ కలిగిన మా నయన కొడుక్కు ఆ పేరు పెట్టుకున్నాడు. బావుండలా?" అన్నాడు.

"ఈ మాత్రానికి సంస్కృతం ఏడుపెందుకు? శుభ్రంగా తెలుగులో 'కళ్ళె' అని పెట్టుకోవచ్చుగా?" అనడిగాడు ఎగతాళిగా మధు.

"మధు కైటభులను విష్ణువు సంహరించాడంటారు, కానీ అది నిజం కాదు. పోయింది కైటభుడే మధు రాక్షసుడిని నిన్ను జనాల్ని పీడించుకు తినమని వదిలి వేసినట్టున్నాడు. మాయబ్బ కొడుకు వీడు. వీడిపేరు ఆయనకిష్టమొచ్చినట్టు పెట్టుకుంటాడు. పిల్లల్లేని పక్షివి నీకేం తెలుస్తుంది, పిల్లల్ని ఎంత ముద్దుగా పిలుచుకుంటారో?" అని కడుపుబ్బరం అనంగానే మధు నోరు పడిపోయింది.

నా మాటసలు వినకుండా వినకుండా ఇల్లంతా తనదే అన్నటు వ్యవహరిస్తున్నాడు వాడు. ఏమన్నా అంటే, నేను ఇంటి యజమానినట్టు కూడ గుర్తించకుండా, వాడు నన్ను మాటలతో సతాయించసాగాడు. వాడి మాటలు వింటుంటే, నాకు ఊపిరి ఆడేదికాదు. ఒకసారి వాడితో పడలేక వాడినీ, వాడక్కనీ బయటకు నెట్ట ప్రయత్నించి విఫలమయ్యాను. "నేను వచ్చాక పోనని చెప్పలా? నేను రాకముందే జాగ్రత్తపడాలి. ఇంక ఇట్లాంటి ప్రయత్నాలు చేశావంటే, నిన్ను చంపేస్తాను. నా మొగుడెక్కడుంటే నేనక్కడుంటాను. నేనెక్కడుంటే నా తమ్ముడక్కడుంటాడు" అని కడుపుబ్బరం నన్ను బెదరించాక, నేను ఆ అక్కా, తమ్ముళ్ళ జోలికి పోవటం మానుకున్నాను.

రెండేళ్ళు గడిచిపోయాయి. ఒకరోజు దేవుఁడయ్య నన్ను చూట్టానికొచ్చాడు. ఏ బుద్ధినున్నాడో శ్లేష్మంగాడు అనుమతించాడు. నాకు ఒంట్లో బాగుండటం లేదు. అతడు నా మంచం పక్కన కూర్చున్నాడు. సైగచేసి ఎట్లావున్నావని అడిగాడు. నేను 'పోయే రోజు దగ్గరపడినట్లుంది' అని అర్థం వచ్చేలా చెయ్యి ఊపి చెప్పాను. దగ్గర కూర్చుని అవీ ఇవీ చెప్పాడు. చిన్ననాటి విషయాలు చెప్పాడు. చివరికి,

"ముప్పునఁ గాలకింకరులు ముంగిల వచ్చిన వేళ రోగముల్
గొప్పరమైనచోఁ గఫము కుత్తుక నిండిన వేళ బాంధవుల్
గప్పిన వేళ మీ స్మరణ గల్గునో, గల్గదో నాఁటికిప్పుడే
తప్పక చేతు మీ భజన దాశరథీ కరుణాపయోనిధీ!' అన్నాడు మహానుభావుడు. ఓపికలేకపోతే, పడుకునయినా ఆ దేవుఁడిని స్మరించుకో. అంతకంటే, నేను చెప్పగలిగేదేముంది." అని అతడు చెప్తూనే ఉన్నాడు అంతలోనే యమకింకరుడిలా వచ్చాడు శ్లేష్మం.

"చాల్చాల్లేవయ్యా! ఇంకెంతసేపు? ఆయనకసలే ఒంట్లో బాగాలేదు. వెళ్ళెళ్ళు" అని అతడి రెక్కపట్టుకు బయటకు తీసుకుపోయాడు.

శ్లేష్మం గాడికి చుట్టలు తాగే అలవాటుంది. 'ఖళ్ళు ఖళ్ళు' మంటూ దగ్గుతూ, కొంపనిండా ఊస్తూంటే ఇంట్లో బతకటం కష్టమై పోయింది. "ఆ చుట్టలు మానరా, ఆ కంపు భరించలేక ఛస్తున్నాం" అని చెప్పాను వాడికి.

"ఓసారి తాగిచూసి చెప్పవయ్యా ఆ మాట! అనుభవం లేని మాటలు నేను పట్టించుకోను" అనేశాడు వాడు నిర్మొహమాటంగా.

కడుపుబ్బరమే నయం. వీడి నోట్లో నోరు పెట్టి బతకలేం. అయినా, ఒకరోజు ధైర్యం చేసి, "ఏందిరా ఇది, ఉబ్బరానికి సాయం చేస్తానని తిష్టవేసి, ఎక్కడబడితే అక్కడ ఊస్తుంటే మేం ఎట్లా బతకాలిరా?" అని వాడనడిగాను నేను.

హాల్లో కూర్చున్నవాడు, పక్కనే ఖళ్ళు ఖళ్ళుమంటూ దగ్గి, నోటి కళ్ళెను పక్కనే ఊసి, "బతకలేకపోతే చావండి. నువ్వు రమ్మంటే నేను రాలేదు. ఈ ఇంట్లో బతకలేకపోతే, ఇల్లొదిలేసి వెళ్ళిపో" అన్నాడు కరాఖండిగా.

ఓ రోజు రాత్రి తెల్లవారు ఝామున దేవుఁడయ్య నాకు కలలో కనబడ్డాడు.

"ఏందయ్యా, ఆ శ్లేష్మంగాడు నన్ను నా ఇంటి నుండి ఖాళీ చేసి పొమ్మంటున్నాడు. ఇంత దుర్మార్గమెక్కడయినా ఉందా? ఇదంతా ఆ మధుగాడిని నువ్వు నా కొంపలో ప్రవేశపెట్టినప్పటినుండే జరిగింది. నువ్వే బాధ్యుడివి" అన్నాను.

"ఇల్లు ఖాళీ చేసెయ్యి, ఆ నల్గురి పీడా నీకూ వదిలి పోతుంది" అని అంతర్ధానమయ్యాడతడు.

నాకు బుర్ర పోయినట్లయింది. నా ఇల్లు ఖాళీ చేసి నా కొంప గుల్లచెయ్యటానికొచ్చిన మూషికాలకు వదిలెయ్యమనటం అతడికి మాత్రం న్యాయమా? తెల్లవారినట్టుంది. అంతలో, కడుపుబ్బరం కాఫీ కప్పుతో వచ్చింది. నన్ను తట్టిలేపింది. నాకంతా తెలుస్తూనే ఉంది గానీ, లేవలేకపోయాను. గాలి అందటం లేదు. ప్రాణం పోయేట్టుంది.

"ఒరేయ్! రండిరా వీడు కొంప ఖాళీ చేసి వెళ్ళిపోయినట్లున్నాడు. ఇంక మనదే రాజ్యం. అమ్మో, ఎంత సతాయించి చంపాడు" అని ఆనందంగా కేరింత లేస్తూ మిగిలిన ముగ్గురినీ పిలిచింది కడుపుబ్బరం. నా ఇంటిని కబ్జా చెయ్యటానికొచ్చిన ఆ నలుగురి ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. శ్లేష్మంగాడు నా ముక్కు అదిమేశాడు. నా ప్రాణం గిలగిలలాడింది.

"ఇంక వీడిక్కడెందుకూ? పదండి పట్టుకెళ్దాం" అన్నాడు శ్లేష్మంగాడు.

"పాపం! పెద్దాయన మనం కొంపలో వచ్చి తిష్టవేసినా అదేమని అడగలేదు, మర్యాదస్తుడు" అన్నాడు పీడనమూర్తి.

"మెల్లగా ఎత్తిపెట్టండి, ఎంతయినా చిరకాల మిత్రుడు" అన్నాడు మధు.

ఆ నల్గురూ, నన్ను ఎత్తిపట్టుకు వెళ్తూంటే, ఆసుపత్రికేమో ననుకున్నాను.

అటుగా వస్తున్న దేవుఁడయ్య వాళ్ళనడిగాడు, "ఏమయింది మర్త్యుడికి? ఎక్కడికి తీసుకెళ్తున్నారు?" అని.

"చచ్చినవాడిని ఎక్కడకు తీసుకెళ్తారు పోవయ్యా, పిచ్చి దేవుఁడూ?" అని అతడిని ఒక్కతోపు తోసింది కడుపుబ్బరం. అతడు కిందపడ్డాడు. అతణ్ణి పట్టించుకోకుండా ఆ నలుగురూ నన్ను ఏడుపుట్ల కట్టెలతో ఊరికి ఉత్తరాన దహనానికి పట్టుకెళ్తున్నారని తెల్సింది. నా చిరపరిచయస్తుడు మధును పిలవ ప్రయత్నించాను. నాకు గొంతు పెగలలేదు.

**"వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోऽపరాణి,**

**తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ"**

అని ఘంటసాల పాడిన భగవద్గీత శ్లోకం నాకెక్కడనుండో వినిపిస్తున్నది. చివరకు నాకు అర్థమైంది వాళ్ళు యమకింకరులని. నన్ను పట్టుకెళ్ళటానికి యముడు నియమించిన భటులు. మెఫిస్టోఫిలిస్ మిత్రులు. నా ఇల్లు కబ్జా చేసిన దుర్మార్గులు, ఆ నలుగురూ!

## కథ వెనుక కథ

## కథ వెనుక కథ

ఎం.ఏ(ఇంగ్లీషు) చదువులో భాగంగా ఎన్నో ఏళ్ళ క్రితం క్రిస్టఫర్ మార్లో రాసిన ఫాస్టస్ నాటకం చదవటం పడింది. అతడు షేక్స్పియరుకు ముందుకాలం వాడు. ఫాస్టస్ కథను టూకీగా 'ఆ నలుగురు' కథలోనే చెప్పాను. భౌతిక జీవన లాలసలో ఫాస్టస్ తన ఆత్మను లూసిఫర్ (సైతాను)కు తాకట్టు పెట్టాడు. అతనికి అన్ని సౌఖ్యాలు కూర్చటానికి సైతాను బంటు మెఫిస్టోఫిలిస్‌ను ఫాస్టస్ దగ్గర ఉంచుతాడు. గడువయిపోగానే ఆ బంటు అతడి మెడవిరిచి పట్టుకెళ్తాడు. ఇది ఎప్పుడో పాతకాలం కథ. అయితే, దీని ప్రాసక్తత ఇప్పటికీ ఉంది. మనిషి సుఖజీవనానికి అలవాటుపడి, వ్యసనాల్లో మునిగిపోయి, మెఫిస్టోఫిలిస్‌లను (యమకింకరులను) తన చేతులతో తాను ఆహ్వానించి తెచ్చి పెట్టుకుంటున్నాడు, పెంచి పోషిస్తున్నాడు. చివరకు ఆ రోగాలతో తీసుకునే మనిషి చనిపోతుంటాడు. మనిషి డబ్బు సంపాదనలో పడి ఆరోగ్యం చెడగొట్టుకోటమే కాదు, ప్రాణాలమీదకు కూడా తెచ్చుకుంటాడు. 'సచ్ మెన్ సర్వ్ మామెన్, నాట్ గాడ్!' అన్నది పాత మాట. వాళ్ళు తమకు కూడా ప్రయోజనం కలిగించుకోవటం లేదు. జీవితంలో డబ్బు ఊరికే రాదు. న్యాయమైన సంపాదన కూటికి, గుడ్డకు, కొంతమేరకు సుఖంగా గడపటానికి సరిపోతుంది. తన సుఖమే కాదు, తన వారసులు పది తరాల వరకూ హాయిగా గడపాలనే మానవుడి భ్రమ పడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ సంపాదనతో పాటు, అతడు రోగాలను రొష్టులను కూడా సంపాదించుకుంటాడు. ఫాస్టస్ పాతకాలపు కథ, ఈనాటి మానవ జీవితంలోని వెంపరలాటల మధ్య ఉన్న ఎనాలిజీ నన్నీ కథ రాయటానికి పురికొల్పింది.

ఇందులోని పాత్రలన్నీ అల్లెగారికల్ పాత్రలే. ముఖ్యపాత్ర పేరు మర్త్యుడు, అంటే చావబోయేవాడు. 'జాతస్యహి ధ్రువో మరణం' అని మనవాళ్ళు చెప్పారందుకనే. వంశ పారంపర్యంగా తల్లినుండి మర్త్యుడికి మధుమేహం వచ్చింది. మిగిలినవన్నీ అతడు తన జీవిత విధానం వల్లనే తెచ్చుకుంటాడు. దేవుడయ్య ఈ కథలో దేవుడు, మధు తల్లినుండి సంక్రమించిన జబ్బు. అందుకే మధు (చక్కెర వ్యాధి) ఆ వ్యాధిని అదుపులో ఉంచుకోటానికి సాయపడతాడు. రక్తపోటు, గ్యాస్టిక్ ట్రబుల్, సివోపిడిలు అతడు తెచ్చుకున్నవే. మిగతా పాత్రల పేర్లు కూడ ప్రతీకాత్మకమే. పీడనమూర్తి వచ్చినప్పటినుండి మర్త్యుడు ఇంట్లోనే తిష్ఠవేసి కూర్చుంటాడు. 'ముప్పున కాలకింకరులు మింగిన వచ్చినవేళ, రోగముల్ గొప్పరమైనచో, కఫము కుత్తుక నిండిన వేళ' గుర్తుంటుందో ఉండదో, ఇప్పుడే దేవుణ్ణి స్మరించుకోమంటాడు దేవుడయ్య. ఇతడు మర్త్యుడికి బాబాయిట. మర్త్యుడు మరి అతడి బంధువే కదా? పరమాత్మ, ఆత్మలు! అందుకే ఆ సలహా. కానీ సైతాను బంట్లు అలాంటి అవకాశమివ్వరు, మెఫిస్టోఫిలిస్‌కి లాగానే. శ్లేష్మం దేవుడయ్యను వెళ్ళగొట్టటమదే చివరలో, దేవుడయ్య వచ్చి తనవాడినెక్కడకు తీసుకెళ్తున్నారని అడిగితే, సైతానుకింకరులకు దేవుడు విరోధి కనుక, అతణ్ణి పక్కకు తోసేసి, "వచ్చినవాడిని తీసుకెళ్ళే చోటికే తీసుకెళ్తున్నామయ్యా" అంటారు.

**ఇదీ ఈ కథ వెనుక కథ.**

**కాకాని చక్రపాణి**

**సికిందరాబాదు,**

**29-05-2013**

# నీహారిక డా.భైరవభట్ల విజయాదిత్య

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

మెల్లగా కళ్ళు తెరచాను. మనసెంతో ప్రశాంతంగా,హాయిగా అనిపించింది. నిన్ననే కాంప్రీ అయ్యింది. బహుశా అందుకేనేమో! సమయం 5.00 అయ్యింది. 7.00 గంటలకు నీహారికని కలవాలి.

నీహారిక!!..ఆమె!!...ఆహ్!!!....ఇదేమిటి సమయం 6.00 గంటలుగా గడియారం చూపిస్తోంది!! ప్రేమంటే ఇదేనేమో! ఆమె తలపు రానంతవరకూ ప్రపంచమంతా ఆనందమయంగా తోస్తుంది. ఆమె తలపున రాగానే అసలు ప్రపంచమే వుండదు!..కాలం తెలియదు!

ఎలాగో ఈ ఆలోచనలతోనే తయారయ్యి ఫంక్షన్ హాలు దగ్గరకు చేరాను. సమయం 7.00 అవుతోంది. ఆమె ఇంకా రాలేదు. ఇంత ప్రొద్దున్నే ఇక్కడ జనసంచారం వుండదు. ఇక్కడ ఈ సమయం అర్ధరాత్రితో సమానం! ఇంతలో ఎవరో అమ్మాయి అటుగా వచ్చి నేనక్కడ వుండడం చూసి కొంచం తడబడి ఎదురుగా వున్న ఏరోస్పేస్ డిపార్టుమెంటు దగ్గర నిలుచుంది. ఆమెను ఇదివరకు చూసిన గుర్తు వుంది. ఆమెదీ నా మెస్సే. అనవసరపు ఆర్భాటాలు లేకుండా చక్కగా ముస్తాబై వున్నది. చూడడానికి తెలుగమ్మాయిలాగే వుంది. ఆమె ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుగా వుంది. ఆమె మొహంలోని ప్రశాంతత, కళ్ళల్లో మెరుపు ..ఆమె ఎవరినో ప్రేమిస్తోందని చెప్పకనే చెబుతున్నయి. బహుశా అతని కోసమేమో. ఆమె నా వైపు చూసింది. ఆ చూపులో స్వచ్ఛత వుంది. నేను చూపు మరల్చలేదు. నా మనసులో ఏదురాలోచనా లేనప్పుడు మొహం చాటేయవలసిన అవసరం ఏముంది? నా చూపు కూడా స్వచ్ఛంగానే వుంది. నిజమైన ప్రేమలో వున్న వారికి వేరే ఆకర్షణలు కలగవు.

కాలం గడుస్తోంది. ఆమెలో ఏమాత్రం అసహనం లేదు. నాలోనూ లేదు. ప్రేమ ఎల్లవేళలా మనిషిని ఒక ఆనందమైన ప్రపంచంలో ఉంచుతుంది. కనుక వారి పై సుఖదుఃఖాల ప్రభావం అంతగా వుండదు. జీవితంలో ఏది ఎదురైనా సులువుగా భరించగలరు. ఎందుకంటే వారు ఆనందంకోసం బయట వెతుకనవసరంలేదు. అది వాళ్ళ మనసుల్లో ఎప్పుడూ పొంగుతుంటుంది. విచిత్రమేమిటంటే ఇది నాకు నీహారికని చూడకముందే అనుభవంలోకి వచ్చింది. వ్యక్తిని చూస్తే పుట్టేది ఆకర్షణ. అది ప్రేమగా పెరగుతుంది అని అంతా అనుకుంటారు. అది నిజంకాదు. ప్రేమే ముందు మనలో వచ్చిచేరుతుంది తరువాతే రూపం కనులముందు మెదలుతుంది. ఆ విషయాన్ని గ్రహించడం కొంచం కష్టం.

నేను ఇక్కడ కాలేజీలో రీసెర్చ్‌కి చేరిన మొదటి రోజునే ఏదో తెలియని అనుభూతి మనసులో నిండిపోయింది. క్రొత్త వాతావరణం అనుకున్నాను. అయితే ఎంత కాలం గడిచినా అదే ఆనందం అలానే నిలిచి వుంది. ఏ పని చేస్తున్నా ఉత్సాహంగా... ఆసక్తిగా..ఆనందంగా.. కష్టాలు కూడా ఎప్పుడూ కష్టంగా లేవు!!నా పరిస్థితి నాకే వింతగా అనిపించింది. ప్రతీ క్షణంలోనూ ఎవరో నా ప్రక్కనే వుండి నా వైపు చూస్తున్నట్లు నన్ను పిలుస్తున్నట్లు..మనసులో చక్కిలిగింతలు పెట్టే తలపులు.

అప్పటికి ఇంకా ఆమెను చూడలేదు. అలాంటిది ఒక రోజు... సాయంకాలం ...ఆకాశంలో దట్టంగా కమ్మిన మబ్బులు. నా TVS Victor సర్వీసింగ్ కి ఇచ్చాను కనుక మెస్ కి నడుచుకుంటూ బయలుదేరాను. వర్షం పడేటట్టుందని గొడుగు తీసుకున్నాను. దారిలో చినుకు

మొదలయ్యింది. మేనులో ఏదో క్రొత్త పులకింత! గొడుగు తెరవబోయాను. అప్పుడు చూశాను. ఎదురుగా తను!! రివ్వున వీస్తున్న గాలి ఆమె ముఖాన్ని కనపడనివ్వకుండా ఆమె ముంగురులను అడ్డుపెడుతున్నది. ఆమె వాటినిసవరిస్తూ వానలో తడవకుండా వుండాలని వడి వడిగా వస్తున్నది. నేను నడుస్తున్నాను. ఆమెను సమీపించాను. ఆమె చూసింది. నా చేతిలోని గొడుగు ఆమె చేతులోకి చేరింది. ఆమె అడగలేదు..వద్దనలేదు!! వాన పెద్దదయ్యింది. ఆమె కదిలింది. నేను తడుస్తున్నాను. ఆమె గొడుగు విప్పలేదు. తన గుండెలకు హత్తుకొని అలాగే వెళ్ళిపోయ్యింది...తడుస్తూ! ఇద్దరి మనసుల్లోనీ తృప్తి ..ఒకటయ్యామని! ఆ రోజు నుంచీ మాకు సమయం ఎలా గడిచిందో తెలియలేదు.

సమయం 10.00 అయ్యింది. ఆమె ఇంకా రాలేదు. ఎదురుగా వున్న అమ్మాయి కదలలేదు. ఈ లోపల సమన్విత అటుగా వచ్చింది. ఆమె నీహారిక కి మంచి స్నేహితురాలు. చాలా కలివిడి మనిషి. మేమిద్దరం అంటే ఆమెకు చెప్పలేనంత అభిమానం. ఆమె నన్ను చూసినట్టులేదు. ఏరొస్పేస్ దగ్గర వున్న అమ్మాయి దగ్గరకు వెళ్ళింది. ఏదో మాట్లాడుకుంటున్నారు. సమన్విత చుట్టూ చూసింది. నేను కనిపించాను. నన్ను చూపించి ఏదో అంది. ఆమె తెల్లబోయింది. సమన్విత ఆమె చేయి పట్టుకు నావైపు తీసుకు వచ్చింది.

“హాయ్ ఆదిత్యా! ఎవరికోసం చూస్తున్నావు” అడిగింది సమన్విత.

“నీహారిక కోసం. ఆమె ఎక్కడవుందో నీకు తెలుసా?” అడిగాను నేను.

ఇద్దరూ ఒక్కసారి నిర్ఘాంతపోయారు.

సమన్విత ముందు తేరుకొని “జోక్ చెయ్యకు ఈమేగా నీహారిక” అంది.

ముందు ఏమందో అర్ధం కాలేదు. అర్థమయ్యాక నవ్వొచ్చింది. ఇందుకన్నమాట నీహారిక ఇక్కడకు రానిది. నన్ను ఆటపట్టించాలని తన స్నేహితులతో ఈ నాటకం ఆడుతున్నది.

“ఓ ! చాలా సంతోషం. మీరే నా నీహారిక! నమస్కారం! నన్ను ఆదిత్య అంటారు!” అన్నాన్నేను ఆమె వంకచూసి.

ఆమెను చూస్తే నాటకం ఆడుతున్నట్లు లేదు ఆమె సమన్విత వైపు తిరిగి “ఇంక నాటకం ఆపి ఆదిత్య ఎక్కడ వున్నాడో చెప్పు” అన్నది.

నేను గతుక్కుమన్నాను. ఇది ఇంకా తికమకగా వుంది. తను నీహారికగా నాటకం ఆడుతూ, ఎదురుగా నన్ను పెట్టుకొని వేరే ఆదిత్యను చూపించమంటుందేమిటి.

“సమన్వితా..!ఎందుకు ఇలా సమయం వృధా చేస్తావు? నీహారిక ఎక్కడ వుందో చెప్పుదు నీకు పుణ్యం ఉంటుంది” బేలగా ముఖాన్ని పెట్టి మరీ అడిగాను.

ఇప్పుడు ఆమె అర్ధం కానట్లు చూసింది.

సమన్విత మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తోంది.

“అసలు నీకు నీహారిక ఏలా తెలుసు? నీకు ఆదిత్య ఎలా తెలుసు?” మమ్మల్ని నిలదీసింది.

“మేమిద్దరం ప్రేమించుకున్నాం” ఇద్దరం ఏకకంఠంతో అన్నాం.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని తెల్లబోయాం!

“నాకు తెలియకుండా మీ ఇద్దరూ ఇంత నాటకం ఆడారా!” ఆశ్చర్య పోతూ చూసింది సమన్విత.

“ఏంటా మాటలు! నేను నీహారిక ప్రేమించుకున్నం!” అన్నాను నేను.

“అబద్ధం! నేను ఆదిత్య ప్రేమించుకున్నాం” అంది ఆమె.

“అమ్మా! బాబూ! నువ్వు నీహారికవి నువ్వు ఆదిత్యవి. ఇప్పుడు చెప్పండి ఏం చెబుతారో.” అంది సమన్విత.

"అబద్ధం" మళ్ళీ ఇద్దరం ఒకేసారి అన్నాం.

"ఓహో! మీకు ఇలా వుందా. మీ ఐడి కార్డ్స్ తీయండి. నన్నే మాయ చేద్దాం అనుకుంటున్నరా!" అంది సమన్విత.

హమ్మయ్యా నాటకం ఇంక ముగుస్తుందిలే అని అనుకుంటూ నా ఐడి కార్డు తీసి ఇచ్చాను. సమన్విత ఒకరి ఐడి కార్డు మరొకరికి చూడమని ఇచ్చింది. ఆశ్చర్యం!! ఆమె పేరు...నీహారిక!! ఆమె వైపు చూశాను. ఆమె కూడా ఆశ్చర్యంగా నా వైపు చూస్తోంది. అందులో నటనలేదు. ఇదెలా సాధ్యం. ఆమె కూడా ఇదే ఆలోచిస్తున్నట్లు వుంది. ఆమె మనసు ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. అది కూడా ఆమె ముఖం లాగే కడిగిన ముత్యంలా వుంది.

"ఏమిటిలా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ వుండిపోయారు. నేనిక్కడ ఒకదాన్ని ఉన్నాను. నన్ను మాయ చేసి మోసం చెయ్యాలని చూస్తారా! నాదగ్గర ఆ పప్పులేం ఉడకవు." అన్న సమన్విత మాటలతో మళ్ళీ ప్రపంచంలోకి వచ్చా.

అదికాదు మేమూ...అని మేము ఏదో చెప్పబోయాం. "ఇంక ఆపండి బాబూ. ఈ రోజు మనం షాపింగ్ కి వెళ్ళాలి మర్చిపోయావా రా రా!"అంటూ ఆమెను సమన్విత లాక్కు పోయింది.

జరుగుతున్నది పూర్తిగా అర్థం కాక ఇద్దరం మౌనాన్ని ఆశ్రయించాం.

సాయంత్రం అయ్యింది. ప్రొద్దున జరిగిన సంఘటన మనసులో తిరుగుతోంది. ఇప్పుడిప్పుడే దాని పరిణామాలు తెలుస్తున్నాయి. ఆమె ఎందుకు అలా అంది? ఆమె పేరు అదేనేమో! ఎందుకైనా మంచిది ఒకసారి వాళ్ళ డిపార్టుమెంట్ వెబ్ సైట్ చూడాలి.

అసలు తొలిచూపు తరువాత నీహారికని కనుక్కోవడానికి నేను ఇలాగే ప్రయత్నించాను. లేబ్ లో కూర్చుని వెతకడం మెదలుపెట్టాను. పేరు వివరాలు తెలుసు కాబట్టి చిటికెలో కనుక్కున్నాను. ఆమె పెర్సనల్ సైట్ ఎడ్రెస్స్ వుంది. దాన్ని తెరిచాను. ఇంటెర్ నెట్ నెమ్మదిగా వుంది. ఆమె పేరు వివరాలు ఒక్కొక్కటే వస్తున్నాయి. అన్నీ నీహారికవే!! బొమ్మా కొంచం కొంచం వస్తోంది. నా గుండె వేగం పెరుగుతోంది. కాలం చాలా మెల్లిగా గడుస్తున్నట్లు వుంది. అరే....! ఇదేమిటి.. ఈ ముఖం...!! ప్రొద్దున్న కనిపించిన అమ్మాయిది! మనసులో ఓ మూల ఇలాగే జరుగుతుందని ఊహిస్తున్నా, జరిగిన తరువాత దాన్ని తీసుకోవడం కష్టం. గుండె ఒక్కసారిగా 50 కిలోల బరువు పెరిగి క్రిందకు లాగినట్లు వుంది.

ఇంక అక్కడ ఉండడానికి మనస్కరించక బయటకు వచ్చాను. అలా నడుస్తూ వుంటే. ఆమె కనిపించింది.

"హాయ్" మెల్లగా పలుకరించాను.

ఆమె అయోమయంగా చూసింది.

"మీ వెబ్ సైట్ చూశాను" అన్నాను నేను.

"నేనూ మీ బ్లాగ్ చూశాను"అందామె.

నా బ్లాగ్??!! ఎప్పుడు తయారుచేశాను? చేశాననుకుంటాను, ఇదెలా మర్చిపోయాను. చేశానా చెయ్యలేదా??

"చూడండి ఇది నాకు అర్థం చేసుకోవడానికి కష్టంగా వుంది. నేను ఆదిత్యని ప్రేమించాను. మీరు మీరే ఆదిత్య అని అంటున్నారు. మీ ఐడి కార్డు మీ బ్లాగ్ వివరాలు ఆదిత్యవే. కానీ మిమ్మల్ని అప్పుడప్పుడు చూసిన గుర్తే కానీ పరిచయం లేదు. నా ఆదిత్య సంగతి తెలియడంలేదు. ఈ పరిస్థితిని ఎలా తీసుకోవాలో తెలియడంలేదు." అన్నది.

ఆమె చెప్పింది,.. నేను చెప్పలేదు అంతే తేడా!

ఎందుకో ఆమె మీద చాలా జాలి కలిగింది. పాపం ఎలా తట్టుకుంటోందో. ఆమె నిజమే చెబుతోంది.

"మీరు ఇప్పుడున్న పరిస్థితి లోనే నేనూ వున్నాను" చెప్పాను నేను.

ఆమె నమ్మింది. ఇద్దరి హృదయాలు భారంగా నిట్టూర్చాయి. ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా విడిపోయాం.

రోజులు గడుస్తున్నాయి. నీహారిక కోసం నేను చేస్తున్న సర్వప్రయత్నాలు ఆమె దగ్గర ఆగిపోతున్నాయి. ఆమె కూడా గట్టిగానే ప్రయత్నం చేస్తున్నట్లుంది. కానీ నేను ఆదిత్యనైనప్పుడు అవన్నీ నాతోనేగా ఆగేది. సందేహం లేదు. ఆమె నీహారికయే! ఇదెలా సాధ్యం. బహుశా సమస్య నాలోనే వుందేమో. జాగ్రత్తగా ఆలోచించ సాగాను. నాకు తెలిసిన నీహారిక, ఈమె ఒకరే. కానీ నా మనసులో రూపం మాత్రం ఈమెదికాదు. మరి నేను నీహారికతో గడిపిన క్షణాలు, మా అనుభూతులు, మా తొలిచూపూ..ఇవన్నీ నిజమా కాదా??! అవి నిజమైతే..ఈమెకు ఆ విషయాలు తెలుసా? ఈమెను కనుక్కోవాలి.

నా సమస్యను ఈ విషయాలు ఎలా పరిష్కరిస్తాయో తెలియక పోయినా ఆమెను కలిసి మాట్లాడాలని నిశ్చయించాను. ఆమె లేబ్ వైపు బయలుదేరాను.

దారిలో ఆమె ఇటే వస్తూ కనిపించింది.

"మీ కోసమే వస్తున్నాను. కొంచం మాట్లాడాలి." అంది.

సరే అని టీ బోర్డుకు దారితీశాను ఇన్నాళ్ళ పరిచయం వల్ల కలిగిన చనువుతో.

"మీకు టీ,కాఫీ అలవాటు లేదనుకుంటాను" అనుమానంగా అడిగింది.

ఆశ్చర్యపోతూ తలూపాను "అవును! మీకు బాదం మిల్క్ తెస్తాను" అన్నాను ప్రశ్నార్థకంగా చూస్తూ.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం ఆమె వంతయ్యింది.

ఆమె ముందు కప్పు పెట్టి కూర్చున్నాను.

"అరటిపండు తెచ్చుకోలేదేం" ఏమాత్రం సంశయం లేకుండా అడిగింది.

"అయిపోయాయి" చెప్పాను.

ఆమెవి ఖచ్చితంగా నీహారిక అలవాట్లే. పైగా ఆమెకు నా అలవాట్లన్నీ తెలుసు. ఆలోచిస్తున్నాను.

ఆమె అంది "చూడండి. కొన్ని విషయాలు మీతో మాట్లాడాలనుకొంటు న్నాను. నేను మనసులో అనుకుంటున్న ఆదిత్య రూపం మీది కాదు. మిగిలిన విషయాలు అన్నీ సమానం. ఇది నా ఆలోచనల లోపమో ఏమో తెలియదు. ఐతే నా ఊహలలో మేము గడిపామని అనుకుంటున్న జీవితం, జరిగాయనుకుంటున్న సంఘటనలు ఎన్నో వున్నాయి. అవి మీకు తెలుసో లేదో తెలియదు. అవి జరిగినవి మీతోనో కావో తెలియదు. ఈ విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నను."

ఆమె పట్ల ఆరాధనగా చూశాను. మంచులా కరిగిపోయే మనస్థత్వం. ఐతే ఎంత కరిగినా హిమాలయం ధృడంగానే నిలుస్తుంది. ఈమె కూడా అంతే.

"మీరేమి అడగాలనుకుంటున్నారో అడగండి" అన్నాను.

"మనం...అదే ఆదిత్యా నేను తొలిసారి చూసుకున్న సంఘటన చెప్పగలరా?"

నేనూ నీహారిక కలిసిన విధానం చెప్పాను. ఆమె స్థాణువైయ్యింది. ఆమెకు జరిగినదీ అదే! నేను కొన్ని ఆమెను అడిగాను. ఆమె అన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది. తనే నీహారికగా.. నా TVS Victor మీద తిరగడం.... ఆమెకు నేను డ్రైవింగ్ నేర్పడం.... కొంత సేపటికి ఇద్దరం కలిసి చెప్పుకుంటునాం!! మేమిద్దరం ఎక్కడెక్కడ తిరిగిందీ..ఏమేమి చూసింది.. ఆమె పుట్టినరోజుకు నేను వెండి పట్టీలు తెచ్చి ఆమె కాళ్ళకు

పెట్టడం...అప్పుడు ఆమె ఎడమ పాదం మీద పుట్టుమచ్చను చూసి దానిపై కవిత వ్రాయడం...ఆ కవితా..ఆ కవితను చదివిన నా పెదవులకు ఆమె ఇచ్చిన కానుక...హఠాత్తుగా!!

ఇదేమిటి ఈమెను నేను నీహారికగా భావించి మాట్లాడేస్తున్నాను!!

ఆమె కూడా ఆగింది. మళ్ళీ మౌనంగా విడిపోయాం.

ఈ మధ్య ఆలోచనలు చాలా వరకూ ఆమె మీదనే వుంటున్నాయి.

అప్పుడప్పుడు పాత విషయాలు గుర్తుకు వస్తున్నప్పుడు నీహారికకి బదులు ఈమె కనిపిస్తోంది.

తనకీ అలానే అవుతోందట.

ఒక రోజు సరదాగా "నీ ఆదిత్య బొమ్మ వేయకోడదూ. చూడాలని వుంది" అన్నాను.

"నువ్వు నీ నీహారిక బొమ్మ వేస్తేనే" అంది ఆమె. సరే అన్నాను.

నాకు బొమ్మలు వేయడం రాదు. అందులో ముఖాలను వేయడం అసలే రాదు. ప్రయత్నిద్దాం అని మొదలు పెట్టాను. నీహారికని గుర్తుకు తెచ్చుకుంటూ గీస్తున్నాను. పది నిమిషాలయ్యింది. నీహారిక రూపం కాగితాన్ని చేరింది. నేనింత బాగా వెయ్యగలనని నాకే తెలియదు. అచ్చు నీహారిక ఎదురుగా వుండి చూస్తున్నట్లు వుంది. వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళి ఆమెకు చూపుంచాను. ఆమె ఆదిత్య బొమ్మ తెచ్చింది.

"నేను ఇదే మొదటిసారి బొమ్మవేయడం కానీ అచ్చు గుద్దినట్లు వచ్చింది. నిజంగానె నేను బాగా గీస్తాననుకొని మా ఫ్రేండ్సువి ట్రై చేశా కానీ అవేవీ బాగారాలేదు." అన్నది.

అతని బొమ్మ చూశాను! చూపులో ఏదో తెలియని ఆత్మీయత తొణికిసలాడుతోంది. రెండు బొమ్మలనీ ప్రక్కకుచేర్చి చూశాం. ఆశ్చర్యం! రెండూ ఒకే ఫొటోలోంచి విడినట్లుగా వున్నాయి. ఓహ్! ఎంత అద్భుతమైన జంట! సాక్షాత్తూ శివ పార్వతుల్లా వున్నారు. ఆ జంటని చూస్తూ తన్మయత్వంతో వుండి పోయాం. అప్రయత్నంగా ఆమె తల నా భుజంపై వాలింది. నా చేయి ఆమెను చుట్టింది. అలా ఎంతసేపయ్యిందో తెలియదు. చీకటి పరిసరాలను ఆవరించింది. మెల్లిగా ఇద్దరం లేచాం. మౌనంగా విడిపోయాం. మేము విడిచిన ప్రతి మౌనంలో ఎన్నో భావాలు అర్థాలు దాగి వున్నయి. ఇంద్రియాలకు అతీతమైన వాటిని ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేం, వ్యక్తపరచలేం!!

కాలం గడుస్తోంది. మేమిద్దరం ఎప్పటికప్పుడు కలుస్తున్నాం. జరిగిన దాని గురించి ఏమీ చేయలేమని దాని గురించి ఆలోచించడం మానేశాం. నా ఊహలలో నీహారిక ఇప్పుడు గుర్తుకురావడంలేదు. ఇప్పుడు ఈమె నాకు నీహారిక! ఈమె పట్ల నాలో పెరుగుతున్న అభిమానం, అనురాగం నాకు తెలుస్తునే వుంది. పాత ఊహలు మెల్లమెల్లగా చెరుగుతున్నాయి. ఆ సంఘటనలూ మెల్లగా చెరుగుతున్నయి. ఈమెతో గడిపిన క్షణాలే ఇప్పుడు నా ఆలోచనలలో, ఊహలలో నిండిపోయాయి. ఇది తప్పని నాకు అనిపించటంలేదు.

ఒకనాడు ఆమె మామూలుగా అడిగింది. "నీ Victor ఎక్కడవుంది?!" ఉలిక్కిపడ్డాను.

అవును నా bike ఏది? నాకు bike ఎక్కడ వుంది?! నాకు డ్రైవింగే రాదుకదా!! పిడుగు పడ్డట్టయ్యింది.

అంటే నా ఊహలలో ఆమె ఆమెకాదు....నా ఊహలలో నేను కూడా..నేను కాదు!!! ఆమెకు చెప్పాను.

ఆమె మెదడు చురుకుగా పనిచేసింది. వెంటనే ఆమె ఎడమ పాదం చూసుకుంది. అక్కడ పుట్టుమచ్చలేదు!

ఇంతవరకూ మా గతం నిజంగా జరిగిందోలేదో తెలుసుకోవాలన్న ఆలోచన రాలేదు. ఇప్పుడు ఈ నిజం ...అంటే మా గతం అని మేము భావిస్తున్నదంతా నిజం కాదు.

"ఆదిత్యా! ఇదెలా జరుగుతోందో నాకు తెలియదుకానీ, ఒకటి నిజం. మనిద్దరం కలవాలని వ్రాసి వుంది. అందుకే ఇలా జరుగుతోంది. ఇది మాయో..కలో..పిచ్చో..తెలియదు! కానీ మనం కలవాలన్నది నిజం. లేకపోతే ఒకరిపై వున్న ప్రేమ ఇంకొకరిపైకి మారే అవకాశంలేదు. నా మనసులో నీ పై ప్రేమ వుంది. అది సత్యమైనది. నా మనసులో ఇప్పుడు వున్న ఆదిత్యవు నువ్వే"

నా మనసులో మాటే అన్నది. నాచేతిని ఆమెకు అందించాను. ఆమె అందుకుంది. మామనసుల్లో సంతృప్తి ..ఒకటయ్యామని!

ఆ రోజు  రాత్రి ల్యాబ్ లో వున్నాను. మనసులో నీహారిక ఆలోచనలే. అటువంటి అమ్మాయి దొరకడం నా అదృష్టం. నా ఊహలలో భావనలలో ఇప్పుడు పరిపూర్ణంగా ఆమె వుంది. ఇంతకుముందు రూపం..కేవలం కలలా వుంది..అసలేంజరిగినట్టే లేదు. జరగేలేదు. మరి ఎందుకు నాలో ఈ ఆలోచనలు రేగాయి? విచిత్రంగా నీహారికలో కూడా ఇవే ఆలోచనలు రావడం ప్రతీ చిన్న విషయంలోనూ ఇద్దరికీ ఒకే తలపులు రావడం ..ఇది ఏదో మాయగా వుంది. ఏదో శక్తి ఈ పని చేసింది. అది ఏమయ్యుంటుంది?? తెలుసుకోవాలన్న కోరిక నాలో బలంగా కలిగింది. ఇంతలో గాలి చల్లగా వీచింది. గుండెను వెచ్చగా తాకింది.

సమయం రాత్రి 12 అవుతోంది. ల్యాబ్ లో ఎవరూ లేరు. ఇంక రూము కి వెళ్దాం అని బయలుదేరాను.బయటకు వచ్చి సైకిలు ఎక్కాను. ఎదురుగా నాలుగు కుక్కలు నావైపు పరిగెట్టుకుంటూ వస్తున్నయి.ఒక్క సారిగా ఆగాయి. ఆ ఊపులో ఆగడంతో జారి పడ్డాయి. అయినా పట్టించుకోకుండా మరింత వేగంతో వెనక్కి పరిగెట్టాయి. చాలా ఆశ్చర్యం వేసింది. వెనక్కి చూశాను. ఎవరూలేరు. బయలుదేరాను. సైకిల్ ఒక్కసారిగా బరువెక్కినట్లు అయ్యింది. వెనుక ఎవరో ఎక్కినట్లుంది. వెనుక ఖాళీగానే వుంది. కానీ ఎవరో వున్నట్లే అనిపిస్తోంది. ఆలోచిస్తూ తొక్కుతున్నాను. అంతలో సైకిలు ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా కదలలేదు. లాభంలేదని దిగి నడిపిద్దామని ప్రయత్నించాను. అదీ సాధ్యంకాలేదు. అప్రయత్నంగా నా చేతులు సైకిల్ ని స్విమ్మింగ్ పూల్ వైపు నడిపాయి. ఇప్పుడు నాకు భయంగాలేదు. ఏదో ఉత్సుకత మనసులో పొంగుతోంది. నాతో సంబంధం లేకుండానే నా కాళ్ళు నడుస్తున్నాయి. చుట్టూ చీకటి గా వుంది. అక్కడ ఎదురుగా ...నా ఊహలలో కనిపించిన నీహారిక!!! స్వచ్ఛమైన వెన్నెల లాంటి కాంతి ఆమె నుండి ప్రసరిస్తోంది. ఆమె నన్ను చూసి నవ్వింది. నాలో ఆమె పట్ల అనిర్వచనీయమైన ఆరాధన కలిగింది. చిన్నగా అలికిడి అయ్యింది. ప్రక్కకు తిరిగిచూస్తే ...నా నీహారిక!! ఈమె ఇక్కడికి ఎలా వచ్చింది? ఏ శక్తి తీసుకువచ్చిందో!! ఆమె ఎటో చూస్తోంది. అటు చూశా. అక్కడ.... నీహారిక ,ఆదిత్య!! ఆహా ఆనందం అంతటా ఆవరించుకున్నట్లున్నది.

వారు మాట్లాడలేదు. కానీ ఆ మాటలు వినిపిస్తున్నయి. మాకేసి ఆప్యాయంగా చూసే ఆ చూపులు మాతో చెబుతున్నాయి..

"నా పేరు విరించి ఈమె ప్రణవ. మా మధ్య ప్రేమ ఈ కేంపస్ లోనే మమ్మల్ని కలిపింది. ఇది ఆకర్షణ తో మొద లైనది కాదు. ఒకరికి ఒకరు తెలియక ముందే మా ప్రేమ మమ్మల్ని చేరింది. మీకు కలిగిన అనుభూతులు, జరిగాయనుకున్న అనుభవాలు మావే. మా ప్రేమకు మా శరీరాలతో సంబంధం లేదు. అవి ఎప్పుడు పోయాయో కూడా తెలియలేదు. అలాగే వున్నాం. ప్రేమకు మనసుతోటే సంబంధం. మనసులు కలిస్తే ప్రేమ , అలాగే ఆత్మలు కలిస్తే ముక్తి. మా మనసులు కలిపిన ప్రేమ ఇప్పుడు మా ఆత్మలను కూడా శాశ్వతంగా కలుపుతోంది. ప్రేమకు అంత శక్తి వుంది. అందుకే భగవంతుడు ప్రేమ స్వరూపుడు. సాధారణంగా ప్రేమ వ్యాపిస్తుంది. దానికి అంతంలేదు. నిర్మలమైన ప్రేమ ఎవరిదగ్గర వుంటుందో ఆ చుట్టూ ప్రపంచం అంతా ఆనందమయమవుతుంది. మా ప్రేమ కూడా అలాంటిదే. ఒకటయ్యే ముందు, మేము వేరుగా గడిపిన క్షణాలు మళ్ళీ జ్ఞప్తికి తెచ్చుకోవాలనీ, ఇద్దరు మనుషులను ప్రేమ ఎలా కలుపుతుందో మళ్ళీ చూడాలనీ అనిపించింది. విధి మీ ఇద్దరికీ ఎప్పుడో ముడి పెట్టింది. అందుకే మిమ్మల్ని ఒకటి చేయాలనే సంకల్పం మాలో కలిగింది. ఆ రోజు, నీ కాంప్రీ పూర్తి అయ్యిన రాత్రి...నీ

నిదురలో కలల ద్వారా నీ మనసును మా మనసుతో కలిపాను. అందుకే నా అనుభవాలన్నీ నీవిగా భావించావు. మా ఇద్దరి ప్రేమా మీ ఇద్దరినీ దగ్గరకు తెచ్చింది. మాలో ప్రేమా మీలో చేరసాగింది. మాలో మరింత బలపడ సాగింది. మేము మెల్లగా మీ మనసులలోంచి బయటకు వచ్చాము. ఇప్పుడు మీలో స్వచ్ఛమైన ప్రేమ నిండి వుంది. మాలో అది మరింత బలపడి ఈనాడు మా ఆత్మలని కలుపుతోంది. నిష్కల్మషమైన ప్రేమ ఎంత పంచితే అంత పెరుగుతుంది. అంత బలపడుతుంది. కనుక అందరిలోనూ ఈ ప్రేమను కలిగింపచేసి మీ జన్మ సార్ధకం చేసుకోండి.” అతను తన చేతిలోకి ఆమె చేయిని తీసుకున్నాడు. ఇద్దరూ ఒకరిలో ఒకరు ఒదుగుతున్నారు. వాళ్ళ రూపాలు అస్పష్టమవుతున్నాయి.

వాళ్ళు మెల్లగా కనుమరుగవుతున్నారు. పూర్తిగా మాయమయ్యారు.

మమ్మల్ని ఆవరించుకున్న మౌనంలో వారే నిండి వున్నారు.

***

కథ వెనుక కథ

బెంగళూరు స్నేహితునికోసం ఎదురుచూస్తున్నప్పుడు అతని బైకు చూసి వచ్చాడనుకుని, ఆ బైక్ పైన దర్జాగా కూర్చొని, తీరా ఆ బైకు దగ్గరకు వేరొకడు వచ్చి నాకేసి చిరాగ్గా చూస్తే, ఒక వెర్రి నవ్వు పులుముకుని ప్రక్కకు పోయి నిల్చుని, ఆ బైకు వాడు ఇంకెవరికోసమో ఎదురుచూడడం గమనించి.. మొత్తానికి పనీపాటు లేక తచ్చాడుతున్న ఒకానొక పరిస్థితులలో ''అతడు నా స్నేహితుడే అయ్యి నాకోసం ఎదురు చూస్తుంటే ..?'' అన్న ఆలోచన కలిగింది. మన కళ్ళ మీద మనకు ఎంత నమ్మకమో కదా అనిపించింది. నిజానికి అప్పుడైతే థ్రిల్లర్ రాయాలని భావించా.
అయితే భయాన్ని పంచడం కన్నా ప్రేమని పంచడం ఉత్తమమనిపించింది. ఒక మంచి అనుభూతి కలగాలని ఉద్దేశం. అంతే. స్వస్తి,

ఆదిత్య

# కలహాల కాపురం

తాడికొండ కె.శివకుమార శర్మ

అలెప్పీలో ఆరోజు జరగబోయే సంగీత కచేరీ వార్తని నా నాడులు ఎప్పుడో తెలియజెయ్యడం వల్ల యుద్ధప్రాతిపదికన ప్రతిభాస్త్రాన్ని ఎదుర్కొనడానికి ఆ క్షణాన అక్కడ నేనుండడం జరిగింది.

అసమాన ప్రతిభగల సంగీత విద్వాంసుడట! ఆయన శిష్యుని చిరకాల కోరికను మన్నించి ఆ రోజున అక్కడకు విచ్చేశాడట. గురువుగారికి గాత్ర సహకారాన్నందిస్తూ పుట్టిన ఊళ్ళోనే వేదికమీద కూర్చునే అవకాశం ఈనాటికి కలిగినందుకు ఆ శిష్యుడు పులకించిపోతున్నాట్ట! కలియుగ నంది మృదంగవాద్య సహకారాన్నందిస్తాట్ట.

వేదికమీద కూర్చున్న విద్వాంసుని నుదుటిమీద రంగధాముని నామాలు దివ్యంగా వెలిగిపోతున్నాయి. పేరు అరైకుడి రామానుజ అయ్యంగార్. అతని చుట్టూ తిరుగుతూ నా మీద ప్రయోగించబడ్డ ప్రతిభాస్త్రపు విజయ తారకలు దేదీప్యంగా చిందులు తొక్కుతున్నాయి. ఓటమిలోని ఆనందాన్ని చప్పరించడం తప్పకపోయినా కొంతసేపేగా! ఆ తరువాత అమితమైన విజయంలోని ఆనందం స్వంతమవుతుంది.

"హెచ్చరికగా రారా! హే రామచంద్రా

హెచ్చరికగా రారా! హే సుగుణసాంద్ర"

యదుకులకాంభోజిలో నాదబ్రహ్మ గుండెగొంతుకల్లోంచి వెలువడినదా ఆర్తి నాదం! "మరుజన్మ వుంటే తెలుగువాడిగా పుట్టాలని కోరుకుంటాను – త్యాగరాజు కీర్తనల్లోని మాధుర్యాన్ని తనివితీరా ఆనందించేటందుకు" అన్నాట్ట ఆ గాయకుడు. ఆ ఆర్తి ఆ నాదంలో ప్రతిధ్వనిస్తోంది. ఏమా మృదంగపు పోకడలు! నందిగానీ ఆ మణి అయ్యర్ వేళ్ళని ఆవహించాడా?

తోడిలో జాలిని జాలువారిస్తూ రాతిహృదయాల్లోకూడా కరుణని ఊటబావుల్లోనుండి వెల్లువలా వెల్లివిరిసేలా చెయ్యగలిగిన ఆ ప్రతిభముందు నా ఓటమిని ఆనందంగా ఆస్వాదిస్తాను. ఎందుకంటే, అతను మొదలుపెట్టిన కీర్తన అసాధారణమైనది మరి.

"కొలువమరెగద కోదండపాణి"

ఎక్కడటా? నాదబ్రహ్మ యింటిలో! ఆ అదృష్టం ఎలాంటిదటా?

"నలువకు పలుకులచెలియకు రుక్మిణికి

లలితకు సీతకు లక్ష్మణుని కరుదైన" దట!

అంతటి అదృష్టం ఆ త్యాగరాజు ఆత్మానందంలో నిబిడీకృతమై నిలిచిపోలేదు. నిలపాలనే నా ప్రయత్నాలని విఫలంచేస్తూ ఇదిగో, ఇలాంటి గాయకులతో వచ్చి నా ముందు నిలిచి నా ఓటమిని పరిహసిస్తుంది.

శంకరాభరణంలో రాగం తానం మొదలైంది. ఆభరణాన్నే ఇంతగొప్పగా చూపించాడీయన. తన శక్తితో శంకరుణ్ణి చూపగలడేమో కూడా! పల్లవి నందుకున్నాడు – "మహిమ తెలియ తరమా!" ఒక అరవ గాయకుడు మళయాళీల మధ్య తను కల్పించిన తెలుగు పల్లవిని ఆలాపిస్తున్నాడు. ఆ ఆభరణపు మెరుపుల్లో ఈ ఓటమి వెల్లువలో మృదంగ వాద్యగాని లయవిన్యాసం విసురుతున్న ఉరుముల విరుపుల్లో నా

ఓటమి పరిపూర్ణం కాకూడదు.  తన విజయపు పరిహాసపు కాంతిని దిగంతాలకి చేరనీయకుండా ఆపాలంటే వికృతపదవిభజనాస్త్రాన్ని సంధించక తప్పదు.

★ ★ ★

తిరువాయూరులో త్యాగరాజు సమాధి వద్ద సంప్రదాయాన్ని అనుసరించి జరుపుతున్న వర్ధంతిలో భాగంగా సంగీత విద్వాంసులు పంచరత్న కీర్తనలని ఆలాపిస్తున్నారు. వందల చేతులు గాలిలోకి లేచి తాళం వేస్తున్నాయి. కొన్ని తలకాయలు ఆవేశంతో ఊగిపోతున్నాయి. భక్తిభావం ఆవేశాన్ని కలుగజేస్తున్నట్లుగాక ఆవేశం భక్తిభావానికి ఊపిరిపోస్తుందన్న నమ్మకానికి ప్రతిరూపంగా ఉన్నదా సమూహం. తన్మయత్వము, తాదాత్మ్యములు గాక అక్కడ ఉండడము, పాడడమే ప్రధానంగా పెట్టుకున్నట్టున్నారు గాయనీగాయకులు.  ఎట్టకేలకు చివరి కీర్తన – నా వికృతపదవిభజనాస్త్రపు విజయాన్ని దిగంతాలకు చాటే కీర్తన – మొదలయింది.

"ఎందరో మా ....హానుభావూ ...లందరికీ వందనములు

చందురూ వానూనీ అందచందమూనూ హృదయారా ...

విందమూనా జూచి బ్రహ్మ ......నందమా... నూ...భా...వించు...వా "

త్యాగరాజు "చందురు వర్ణుని అందచందములు హృదయారవిందమున జూచి బ్రహ్మానంద మనుభవించువారెందరో మహానుభావులు" అని రాస్తే, దాన్ని నా వికృతపదవిభజనాస్త్రపు విజయం ముక్కలు ముక్కలుగా చూపిస్తే, ఆవిడ "వా వా" అని కళ్ల నీళ్లు పెట్టుకుంటే నా విజయం ఒక్కో మెట్టు పైకెక్కుతున్నట్లు గాదూ? లెట్ ద వార్ బిగిన్ అని నేనన్నానా?

అయినా కళ్ల నీళ్ల విషయంలో కూడా విజయాన్ని నాకు దూరంగా ఉంచితే నాగతేమిట్టా?

"కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ నేల ఏడ్చెదో ...

హాటకగర్భురాణి –" అన్నాడు పోతన. అంతటితో ఊరుకున్నాడా?

"నల్లనివాడు పద్మనయనమ్ములవాడు కృపారసంబు వెద

జల్లెడివాడు –" అన్నాడు.  ఇంకా,

"ఇంతింతై వటుడింతయై మరియు తానంతై నభోవీధిపై

నంతై తోయదమండలాభ్రమున కల్లంతై – " అన్నాడు.

ఇంకా చాలా చాలానే అన్నాడు. వీటిలో వేటికి కాలం చెల్లించగలను?  భక్తిభాషాసమ్మిళిత భావుకాస్త్రానికి ఎదురు వెయ్యడానికి ప్రయత్నం చెయ్యాలన్నా ధైర్యం విలోలమవడం, ప్రాణంబులు ఠావుల్ దప్పడం తప్పదు – ఎందుకంటే అది పెద్దాయనతో ఆటలాయె! డామిట్, మళ్ళీ పోతనే!

దీనికి తగిన అస్త్రం దొరకడానికి సమయం పట్టింది – ప్రాంతీయ దురభిమానాస్త్రం. దాని ప్రయోగఫలితం వల్లనే పోతన మావాడన్నారు కొందరు తెలంగాణా వాళ్ళు. కాదు, మా గోదావరీతీరం వాడన్నారు కొందరు ఆంధ్రావాళ్ళు. ఇద్దరూ కూడా ఆంగ్లపు చదువుల వెంటబడి మాతృభాషని అశ్రద్ధచేసినవాళ్ళే, పట్టుమని పది పోతన పద్యాలు కూడా చెప్పలేనివాళ్ళే! అవునూ, ఈ పరభాషా వ్యామోహాస్త్రాన్నీ, మాతృభాషా విసర్జనాస్త్రాన్నీ నేనెప్పుడు వదిలానబ్బా?

అయినా భాషా నిర్మూలనాస్త్రాన్ని ఎన్నో వేలయేళ్ళ క్రితమే ప్రయోగించానుగా! గుణాఢ్యుని పైశాచికభాష అంతరించిన దందుకే. తెలుగు భాష కూడా యాభయ్యేళ్ళలో అంతరిస్తుంది నా అస్త్రాన్ని ఎదుర్కోకపోతే. సంస్కృతంగూర్చే చాలాకాలంగా ఓపికపట్టవలసివస్తోంది.

రామాయణ భారత భాగవతాలకి మూలాలు సంస్కృతంలోనేగదా వున్నాయి! అదుగో, ఆ పెద్దాయన మళ్ళీ ఏమంటాడో అనే సంస్కృతానికి కాలంచెల్లించడంగూర్చి కొద్దిగా ఆగుతున్నా. కానీ ఓ రహస్యం చెప్పనా? రామాయణమన్న పేరేగానీ వాల్మీకి రామాయణానికి సంస్కృతంలోనే ఎన్ని పాఠాంతరాలని జేర్చాను అన్న సంగతి మీకు కూడా చెప్పను. అది మీరు ఆ పెద్దాయనకి జేరవేస్తే నా ఇంకో పుచ్చె లేచిపోవచ్చు.

విజయాన్నే ధ్యేయంగా పెట్టుకున్నప్పుడు విభజనాస్త్రాన్ని వాడకపోవడ మేమిటనుకున్నాను. మతాస్త్రాన్ని ప్రజలకు అందించాను. కానీ దాన్ని పరమత సహనాస్త్రంతోనేగాక సంగీతాస్త్రంతోనూ, భావుకాస్త్రంతోనూ కూడా ఆమె ఎదుర్కొంటుందని నేననుకోలా.

"సుందర నారి కర్‌కె సింగార్

మధ్యే బిందియా నయనేనె కాజర –"

అని పాడాడు పాకిస్తానీ గాయకుడు బుందూఖాన్ – నుదుట బొట్టున్న సుందరి అందాన్ని వర్ణిస్తూ.

"హరి ఓం తత్‌సత్" అని పాడాడు బడే గులాం ఆలీఖాన్. ఆయనకి సరితూగే గాయకులు ఈనాటికీ లేరనే హిందువులు ఆవిడ విశాలహృదయాస్త్రపు ప్రయోగానికి గురయినవారే. ఆ విజయాన్ని అంత తేలిగ్గా వదిలేస్తానేమిటీ? మనఃక్లేశకారకాస్త్రాన్ని ప్రయోగించాను. దేశవిభజన తరువాత ఆయన విద్యకి ఆయన జన్మభూమి ఉన్న దేశంలో పాకిస్తానీయులు విలువనివ్వకపోవడం ఆ ప్రయోగం వల్లనే. ఎంతో ఆదరించే భారతదేశానికి వలస వచ్చి స్థిరపడడం ఆయనకి ఆనందాన్ని కలిగించినా, జన్మభూమికి దూరమయ్యానన్న భారంతో ఆయన కుంగిపోవడం కూడా ఆ అస్త్రపు ప్రభావమే.

సర్వమత సమానాస్త్ర ప్రయోగానికి గురయిన గాంధీకి విరుగుడుగా సంకుచిత మనస్తత్వాస్త్రాన్ని గాడ్సే రూపంలో ప్రయోగించాను. అంతేకాక మతమౌఢ్యాస్త్రాన్ని ప్రయోగించి మతమౌఢ్యాన్ని దీపావళి కాంతులతో వెల్లివిరిసేలా చేశాను. అది కూడా ఎలా? తనవేలితో తనకన్నే పొడుచుకునేలా చేసి! కాదు. అంతకన్నా ఎక్కువగానే. సంగీత సాహిత్యాలు స్తనద్వయాలనిగదా నానుడి? సాహిత్యపు పాలని కడుపారా నింపుకున్న తస్లీమా నస్రీన్ ముస్లిం అయ్యుండికూడా బంగ్లాదేశ్‌లో హిందువులమీద జరుగుతున్న అత్యాచారాలని గూర్చి రాస్తే హైదరాబాద్‌లోని కొందరు ముస్లింలచేత ఆవిడమీదకు కుర్చీలను విసిరించాను. అంతే కాక, సాహిత్యేన ప్రాణప్రమాదకారకాస్త్రాన్ని ప్రయోగించి ఆవిడకు మాతృదేశం భద్రతనివ్వలేనని చేతులెత్తేస్తే భారతదేశం కూడా తనవల్ల కాదనేలా చేశాను.

యుద్ధంలో సమవుజ్జీ ఉంటేగానీ ప్రతాపం బయటపడదు. ఆ విషయంలో మాత్రం నా సర్వశక్తులనీ ప్రదర్శించే అవకాశాన్ని నాకు అందిచ్చినందుకు కృతజ్ఞత చెప్పుకోవాలనిపిస్తోందిగానీ అహంకారం అడ్డువస్తోంది. ప్రత్యక్ష యుద్ధంలో బరిసెలతోనూ, కత్తులతోనూ, గదలతోనూ, విల్లంబులతోనూ రకరకాలుగా నైపుణ్యాన్ని పరీక్షించినట్లుగా తను నామీద ఎన్నిరకాల అస్త్రాలను ప్రయోగించిందో! వాటిలో శిల్పకళాస్త్రం, చిత్రలేఖనాస్త్రం ముఖ్యమైనవి – కనులద్వారా ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి గనుక. అవంటే నాకూ యిష్టమే సంగీతసాహిత్యాల్లాగా. అయితే మరి ఇది యుద్ధం కదా! అందుకే సోమనాథ దేవాలయాన్నీ, బాబ్రీ మసీదునీ, ఆఫ్ఘనిస్తాన్లోని పురాతన బుద్ధ విగ్రహాన్నీ పరమత అసహనాస్త్ర ప్రయోగంచేత ధ్వంసం చేయించాను. అజంతా, ఎల్లోరా గుహల్లోని చిత్రాలనీ, శిల్పాలనీ మరుగున పడేలా చేశాను. వాటిమీద కాలప్రభావాస్త్రాన్ని ప్రయోగించి నామరూపాలు లేకుండా చేసే ప్రయత్నంలో వున్నాను.

బుద్ధుడంటే గుర్తొచ్చింది – మా యుద్ధంలో నాకు తీవ్ర మనస్తాపాన్ని కలిగించినవాడు ఆదిశంకరుడు. ఆ ఇద్దరికీ లింకేమిటంటే బుద్ధుని శిష్యులు శంకరునితో వాదించారుకాబట్టి. ఆ శంకరుడు ఆమె నామీద దాదాపు సాధించిన విజయానికి ప్రతీక – చతుష్షష్టికళాప్రవీణుడు గనుక. శంకరుడు రచించిన అనేక స్తోత్రాలు ఈనాటికీ ప్రజలు చదువుకుంటారు. అంత సంపూర్ణ విజయాన్ని నేనెలా అడ్డుకోకుండా వుంటాను? మితకాలాస్త్రాన్ని శంకరునిమీద ప్రయోగించి, ఒక్క సాహిత్యానికి తప్ప మిగతా కళలమీద వెచ్చించడానికి అతనికి

సమయం లేకుండా చేశాను. కాకపోతే, శంకరుడు మలచిన ఒక శిల్పఖండాన్నో, గీచిన ఒక చిత్రాన్నో, కాక అతని వాగ్గేయకారకత్వానికి ఉదాహరణగా ఒక పాటనో చెప్పండి, చూద్దాం! అంతేకాక, జ్ఞానార్జన ప్రతిబంధకాస్త్రాన్ని ప్రయోగించి, ప్రజలు స్తోత్రాల అర్ధాన్ని పట్టించుకోకుండా వుండేలా చేశాను. దానివల్లనేగా వాళ్ళు కనకధారాస్తవంలోని అందాన్ని అనుభవించడాన్ని కోల్పోయారు! పాపం, కాళిదాసు రచించిన శ్యామలాదండకంలోని మాధుర్యాన్ని కూడా!

ఆవిడ శస్త్రాల్లో ప్రముఖమైనది విజ్ఞానాస్త్రం. దానితో వచ్చే ఇబ్బందులు ఎన్నో చెప్పక్కర్లేదు. విజ్ఞానం అంతా గాలిలాగా వెలుతురులాగా అందరికీ ప్రయాసలేకుండా ఉచితంగా దొరికితే ఇంక నేనెందుకు, దేవలోక మెందుకు? స్వేచ్ఛకి పరిమితి ఎంత ముఖ్యమో విజ్ఞానానికీ అంతే. అందుకే దీనికి ప్రత్యస్త్రం అజ్ఞానాస్త్రం.

కాదనే ముందు గెలీలియో నడగండి. సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడని మానవులు మైమరచి వుంటే తను నా మీదకు అతణ్ణి వదిలింది. అతడేమో, భూమి సూర్యుడిచుట్టూ తిరుగుతోందన్నాడు. అజ్ఞానుణ్ణొకణ్ణి పట్టుకుని, వాడికి "ఏకోనేకోహమస్మి" అన్న మంత్రాన్ని నేర్పి ఏం చేయించాను? మీరివ్వాళ గెలీలియో భజన చెయ్యొచ్చు. అయితే, అజ్ఞానులు అతణ్ణి జైల్లో బందీని చేసి ఆ తరువాత ప్రాణాన్ని కూడా తీయించిన తరువాత అతనికేం లాభం?

విజ్ఞానాస్త్రాన్ని ఎదుర్కోవడానికి నేను అపహాస్యాస్త్రాన్ని కూడా ప్రయోగిస్తాను; "ఆలుజీబరా గుండె గాభరా" దాని ప్రభావమే. అయితే, దానికన్నా కూడా అధికశక్తి కలది అధివిజ్ఞానాస్త్రం. అణువుని ఛేదించి దాన్నుంచీ అపరిమిత శక్తిని సాధించవచ్చని శాస్త్రవేత్తలచేత ఆవిడ మీకు తెలిపిస్తే, నా జవాబేమిటి? అధివిజ్ఞానాస్త్రపు ప్రయోగం! ఫలితం, అణ్వస్త్రాన్ని మానవజాతి నిర్మూలనకి ఉపయోగించవచ్చని నియంతలకీ, మతిభ్రమించినవాళ్ళకీ తెలిసేలా చెయ్యడం.

మానవుడిలో ఉత్తమగుణాలని మాత్రమే పెంపొందిస్తూ విశ్వకళ్యాణాన్ని చేకూర్చాలంటుంది. అది మానవ లోకంలో ఎలా కుదురుతుంది? పైగా, "దేవలోకంలో కుదురుతుందా?" అని ఎదురు ప్రశ్న వేస్తుంది. "ఎందుకు కుదర" దన్నాను. "ముందు సంగీతంలో హిమోన్నత శిఖరాలని ఎక్కినవాళ్ళని చూద్దాం," అని మొదలుపెట్టి, "సంగీతం అనగానే నారదుడనీ, తుంబురుడనీ అంటారుగానీ ఏ ఇంద్రుణ్ణో, చంద్రుణ్ణో చూపరే" మంటుంది. "వాళ్ళకి అవి అవసరంలే" దన్నాను. "అవసరం లేకపోయినా సంగీతం మనసుని ఆహ్లాదపరుస్తుందని అర్థం చేసుకున్న మనుషులు ఈ దేవతలకన్నా గొప్పవాళ్ళు కాదా?" అంటుంది. "మానవులతో పోల్చి దేవతలని కించపరచలేవు" అన్నాను. "దేవతలు రాసిన ఒక కావ్యాన్ని ఉదహరించ" మంటుంది. "వాళ్ళు చేసిన ఒక ఘనకార్యమే" దంటుంది. "పాలకడలిని చిలికి అమృతాన్ని సాధించా" రన్నాను. "మీ తండ్రిగారి సహాయం లేకపోతే అది కుదిరేదా? పైగా రాక్షసులని మోసం చేసిగదా అది సాధించింది?" అంటుంది.

అదిగో, ఈ మోసమనేది ఆవిడ వీక్ పాయింట్. దానికీ తనకూ ఏమీ సంబంధం లేదని వాదిస్తుంది. ఆ వీక్ పాయింట్‌మీద దెబ్బకొట్టడానికే "మోసం ఒక విద్యే" ననీ, "మోసం కూడా ఒక కళే" ననీ మానవుల్లో ఋజువులను చూపించాను. దానికి మా అమ్మ సహాయం ఉండనే వుంది. నా మోససమ్మోహనాస్త్రం ఆవిడ ప్రయోగించిన మోసప్రతిఘటనాస్త్రాన్ని ఎలా తుత్తునియలు చేసింది! చరిత్రలో మోసంతో ఎన్ని యుద్ధాలు గెలవబడలేదు? మోసంవల్ల కాకపోతే బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని ఎలా ఆక్రమించి పాలించగలిగేవాళ్ళు?

మరి ఇప్పుడు? చదువుకుని వృద్ధిలోకి వచ్చిన అబ్దుల్ కలాంనో లేక ఇన్ఫోసిస్ నారాయణమూర్తినో తల్లిదండ్రులు పిల్లలకు ఉదాహరణలుగా చూపిస్తున్నపుడు, చదువువల్ల డబ్బు సంపాదించుకుని సుఖంగా వుండచ్చని నూరిపోస్తున్నప్పుడు, వేలిముద్రమీదే ఆధారపడుతూ ప్రభుత్వంలో ఎంతో చిన్న పొజిషన్లో వున్నా కూడా ఒక రాజుగారి కోశాగారాన్ని నింపడానికి సరిపడేటంత డబ్బును ప్రజలని

మోసంచేస్తూ సమకూర్చుకుంటున్న రాజకీయ నాయకులను టీవీలో ఆ పిల్లలకు చూపిస్తాను. "మోసంచేస్తేనే జీవితంలో పైకి రాగల" మన్న భావనని వాళ్ళ మెదళ్ళల్లో నాటుకునేలా చేస్తాను. అప్పుడు, ఆవిడమీద అది తిరుగులేని దెబ్బ కాకేంజేస్తుంది, "తల్లీ నిన్ను దలంచి చేతపట్టిన పుస్తకం" మూలపడకేంజేస్తుంది? కాదని వాళ్ళు చదువుకుంటే, నా మోసమమ్మోహనాస్త్రానికి గురై అకవుంటింగ్‌లో జిమ్మిక్కులని చూపించేవాళ్ళు, చిట్‌ఫండ్ కంపెనీలనిపెట్టి ప్రజల డబ్బుతో పరారీ అయ్యేవాళ్ళలాగా తయారవుతారు. తిరుపతిలో వెంకటేశ్వరుని ఆభరణాలే గల్లంతుకావడం ప్రజలు మోసవిద్యలోనూ చోరవిద్యలోనూ ప్రాభవాన్ని సంపాదించడంవల్లనే అని నేనంటే మా నాన్నకూడా ఊరుకున్నాడు మరి! భారత, శ్రీలంక జట్ల మధ్య జరిగిన వన్‌డే క్రికెట్ మాచ్‌లో సెహ్వాగ్ 99 పరుగులతో వున్నప్పుడు, భారత జట్టు ఒక పరుగుతో గెలవడానికి సిద్ధంగా వున్నప్పుడు రణ్‌దివ్ సెహ్వాగ్‌కి నో బాల్ వేసి అతణ్ణి సెంచురీ చెయ్యనీకుండా ఆపడం కూడా మోసవిద్యకు పరాకాష్ఠే!

అసలివ్వాళ్ళ నేనూ, హాటకగర్భురాణీ ఈ పరిస్థితికి రావడం నేను ఉన్నమాటని వున్నట్లు చెప్పడం వల్లనే కదా! అయినా, సత్యలోకంలో సత్యం చెప్పకుండా ఎలా?

"నువ్వేదో విద్యలతల్లి వనుకుంటున్నావు గానీ, విద్యలబ్బడంలో నీ ప్రమేయమేమీ లే" దన్నాను. లేకపోతే, శ్రీరాముడికి విలువిద్య అబ్బడం తనవల్లేనని అంటుందా, మామగారని కూడా చూడకుండా! పైగా, అంతకు ముందరి ఏ అవతారంలోనూ ఆయనకి ఏ విద్యలూ అబ్బలేదంది. మొదటి అయిదవతారాల్లో ఆయనకు విద్యల అవసరమేముందని? తను ఇలా అడిగిందని ఆయనకి తెలిసే వుండాలి. లేకపోతే నందుడు అక్షరాభ్యాసం చేయిస్తున్నప్పుడు సరస్వతీదేవికి నమస్కారం పెట్టమంటే బాలకృష్ణుడు కొంటెనవ్వు ఎందుకు నవ్వుతాడు?

"మరి, దేవతల్లోగానీ, రాక్షసుల్లోగానీ నా దయవల్ల ఎవరికయినా విద్య అబ్బిందా?" అనడిగింది. ఆవిడ కోపం సత్యలోకపుటంచులని చేరడం తేలిగ్గానే గమనించాను.

"దేవతలందరూ దాయాది సంతతి గనుక వాళ్ళు నీ దయతో అవసరం లేకుండానే మనగల్గుతున్నారు. రాక్షసులకు నీ దయ అవసరం లేదు – నువు శతృజాతి వనితవు గనుక."

"రావణుడు సీత నెత్తుకుపోవడం రాక్షసజాతికి పరిమితమైన మోస విద్యవల్లనే అనుకుందాం – వాళ్ళకి నా దయతో అవసరంలేదని తమరే కదా సెలవిచ్చారు! మరి దేవేంద్రుడు అహల్యని పొందడానికీ తమరి తండ్రిగారు అమృతాన్ని రాక్షసులకు పంచకుండా వుండడానికీ రాక్షసుల్లో ఎవరివద్ద ఆ విద్యనభ్యసించినట్లుటా?"

మా తండ్రిగారిని పట్టుకుని మోసగాడని అంటుంటే జవాబెలా ఇస్తాను? ఇవ్వదల్చుకోలేదు.

"మరి వేదాల సంగతి?" తనని ప్రసన్నం చేసుకోవడానికయినా అర్ధనారీశ్వరత్వాన్ని నేనుకూడా ఆపాదించుకుంటానని ఆశించి వుండాలి. కానీ ఇది సత్యలోకం. అందుకే, "అవి నేను రాసినవి," అన్నాను.

వీణమీద కదనకుతూహల రాగాన్ని ఒక్క క్షణం ఆలపించిన తరువాత, "మరి సంగీతం సంగతేమిటి?" కోపంగా అడిగింది కోమలాంగి.

"సామవేదంలో రాశాను కదా!" అన్నాను జాలిగా చూస్తూ.

"మరి నేను ఈ చదువుల పోర్ట్‌ఫోలియో పట్టుకుని చెయ్యవలసినదేమిటి?" సత్యలోకపుటంచులు ఆ కోపాన్నాపలేకపోయాయి.

"ఆ మానవులకి మాత్రం కొంచెం పరిజ్ఞానాన్నిస్తూండటం."

"దేవతలెలాగో నిరక్షరకుక్షులు. ఏ పనీ చెయ్యకపోయినా, ఏ తెలివితేటలు లేకపోయినా, మాయ విద్య తప్ప మరే విద్యలూ రాకపోయినా, అమృతం తాగి కూడా రాక్షసులతో యుద్ధాల్లో ఓడిపోయినా మీ తండ్రిగారి దయవల్ల భోగలాలసత్వాల్లో మునిగితేలుతున్నారు.

ఆయన ఎత్తిన ఏ అవతారంలో కూడా కోతికయినా కొంచెం విలువనిచ్చారేమోగానీ ఆయనని తప్ప వేరే ఏ మానవుడినీ గొప్పగా చూపలేదు. పాండవులగూర్చి మాట్లాడొద్దు. వాళ్ళు దేవతాంశలతో పుట్టినవాళ్ళు. కృత, త్రేత, ద్వాపర యుగాల్లో ఋషులందరూ మానవమాత్రులైనా వేదాలని మాత్రం వల్లించుతూ జీవితమంతా గడిపారు గనుక వారు తమంత తాముగా మానవ ప్రగతికి తోడ్పడిన దాఖలాలేవీ లేవు. ఆ మూడు యుగాల్లోనూ సంగీతం, సాహిత్యం, నృత్యం, విజ్ఞానం ఏవీ పెంపొందలేదు. అందుకే, నా శక్తితో మానవులని దేవతలకంటే గొప్పవాళ్ళగా తయారుచేస్తాను. అయితే, అది నేను ఈ లోకంలో వుండి మాత్రం కాదు." అని అంతర్ధానమయింది.

అప్పటినించీ తనని వెదుక్కుంటూ తిరగడమే సరిపోతోంది – ఎలాగయినా ఆమెను ఓడించాలనే పట్టుదలతో వున్నాను గనుక. లేకపోతే, దేవతలని మించేలా మానవులని తయారుచేస్తుందట! అందుకే విద్యలు, కళలు ఏ రూపంలో కనిపించినా తుంచెయ్యాలన్న నిర్ణయాన్ని దీక్షతో అమలులో పెడుతున్నాను. అయినా, ఏ పొరపాటువల్లనో ఒక ఆదిశంకరుడూ, గెలీలియో, బీథోవెనూ, పోతనా, కృష్ణదేవరాయలూ, త్యాగరాజూ, రామనుజం అయ్యంగారూ, పాల్ఘాట్ మణి అయ్యరూ, ఇంకా శ్రీనివాస రామానుజమూ, ఐన్‌స్టీనూ, స్టీఫెన్ హాకింగు వంటి మేధావులూ బయటపడుతూంటారు. కళాపోషణకు రాజుల్లేకుండా చేసి, మా అమ్మ సహాయంతో కళలను నమ్ముకున్నవాళ్ళకి బ్రతుకును గతుకులబాట చేశాను. ఆవిడ సాయంతోనే తెలివితేటలున్న పిల్లలకు పేదతనంవల్ల చదువును అందుబాటులో లేకుండా చేసి వాళ్ళు మానవ ప్రగతికి తోడ్పడకుండా చూశాను. ఒక్కోసారి అసహాయ మానవులనికూడా చూడకుండా యుద్ధాన్ని వాళ్ళతోనే చేస్తాను. బీథోవెన్‌ని చెవిటివాణ్ణి చేశాను. అరైకుడికి గొంతుబాధ కల్గించాను. స్టీఫెన్ హాకింగు కయితే క్రమంగా శరీరంలోని ఏ అంగమూ పనికిరాకుండా చేశాను.

అయినా సరే, బీథోవెన్ గొప్ప సింఫొనీలని తయారుచేశాడు. అరైకుడి దీక్షతో గొంతును స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. గొంతు మూగబోయినా, శరీరంలో ఒక్క తలమాత్రమే కదపగలిగినా, విశ్వం ఎలా ఆవిర్భవించిందన్న రహస్యాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తూ హాకింగ్ నోటితో గాలిని మానవులు తయారుజేసిన యంత్రంలోకి ఊదుతూ తన ఆలోచనలని శిష్యులకి తెలియబరుస్తూనే వున్నాడు.

ఎందుకీ పరాజయం?

అరెరే! సత్యం కళ్ళముందు కనపడుతూనే వుంటే ఇంతకాలం గమనించలేకపోయానా! ఎన్నో వందల ఏళ్ళకోమాటు తన ప్రతిభకి ప్రతిరూపాలు నా ముందుకొస్తున్నాయనీ అప్పుడు వాటిని నేను ప్రత్యస్త్రాలనేసి ఎదుర్కొంటున్నాననీ మురిసిపోయానుగానీ, ఆ రూపాల్లో ప్రత్యక్షమవుతున్నది నా రాణేనన్న సంగతి గమనించలేకపోయిన నా తెలివితేటల నేమనాలి? ఏ రూపంలో ముందుకు రాబోతున్నదీ ఎప్పుడూ ముందుగా చెప్పలేదు. పైగా, ఒక రూపంలో వచ్చినది మళ్ళీ ఆ రూపంలో దర్శనమివ్వడంలేదు.

ఇంతకాలం యుద్ధం అయిన తరువాత ఇప్పుడు ఒప్పుకుంటున్నాను – పరాజయమైనా తను ఎదురుగా వుంటే సంతోషించేవాణ్ణి. చెప్పడానికి అహం అడ్డొస్తోందిగానీ ఒప్పుకోక తప్పట్లేదు. తన ఉనికిలేక సత్యలోకం అంధకారబంధురమై వుంది. తను సంగీత సాహిత్య సమలంకృతే మాత్రమే కాదు; సర్వ విద్యలకూ నిలయం. ఏ అంగం ఏ విద్యకు ఆలవాలమో నాకుమాత్రమే తెలుసు. అందుకనే అన్ని విద్యలనూ ఏ ఒక్క మానవుడికీ పరిమితం గాకుండా ఆమె జాగ్రత్తపడుతున్నది – లేకపోతే నేను ఆ పరిపూర్ణత్వాన్ని పట్టుకుని నా వెంటరమ్మని ప్రాధేయపడే అవకాశమున్నది. ఇప్పుడయితే తనకోసం ఎక్కడని వెదకను?

"నాల్ముగం నావిల్ వీట్టిరుక్కుం దేవి" అన్నాడు పాపనాశం శివన్. ఆవిడే నా నాలికమీదుంటే నాకీ వెతుకులాట ఎందుకయ్యా? అర్థమయింది. ఆ వాక్యం సంగీతాన్ని సంధించి ఆవిడ నామీదకు వదిలిన వ్యంగ్యాస్త్రం! దీనికి ప్రత్యస్త్రాన్ని వెయ్యకుండా ఎలావుంటాను?

@ @ @

కలహాల కాపురంలో బాధలుపడేది పిల్లలే! కాలగమనంలో ఆది ఎక్కడో తెలియని ఈ అంతంలేని కలహమే మానవులంతా ఐన్‌స్టీన్లూ, ఆర్యభట్టలూ, ఎమ్మెస్ సుబ్బులక్ష్ములూ కాకపోవడానికీ, మానవులలో మత, భాషా భేదాలని దురభిమానాలుగా విరగబూయించి శాంతినీ సమైక్యతనీ కొల్లగొట్టించడానికీ కారణమంటాను. కారణభూతుణ్ణి వేలెత్తిచూపించడానికి, తండ్రిని దైవంగా కొలవాలి అని తల్లి చేసిన బోధనని పిల్లలు మరిస్తే ఆమెకి కోపమొస్తుందంటాను. కాదంటారా?

***

కథ వెనుక కథ

అరైకుడి రామానుజ అయ్యంగార్ ఇరవయ్యవ శతాబ్దంలో అసమాన కర్ణాటక సంగీత విద్వాంసులుగా ప్రఖ్యాతిచెందారు. నా ముగ్గురు గురువుల్లోనూ ఇద్దరివల్ల రామానుజ అయ్యంగార్ నా పరమగురువు అవడం నా అదృష్టం. రామానుజ అయ్యంగార్, త్యాగరాజ కీర్తనల్లోని రసానుభూతిని పూర్తిగా పొందడంకోసం రాబోయే జన్మలో తెలుగువాడిగా పుట్టాలని కోరుకున్నారని ఆయన దగ్గర గురుకులవాసం చేసిన నా మొదటి గురువుగారు ప్రతాపగిరి నటేశ అయ్యర్ చెప్పారు. రామానుజ అయ్యంగార్ అలెప్పీలో చేసిన సంగీత కచేరీ అద్వితీయం. ఆ కచేరీలోనే ఆయన కొలువమరెగదా అన్న తోడిరాగంలోని కీర్తన, శంకరాభరణంలో "నీ మహిమ తెలియ తరమా!" అన్న పల్లవితో రాగం, తానం, పల్లవి పాడారు. ఆయన ఎన్నుకున్న తెలుగు పల్లవి - అదికూడా మళయాళీయుల మధ్యలో చేస్తున్న కచేరీలో - నన్నిప్పటికీ మంత్రముగ్ధుణ్ణిచేస్తుంది. ఆ కచేరీని బ్రహ్మ స్వయంగా వచ్చి వినివుంటే? అన్న ఆలోచనవచ్చింది. సరస్వతీదేవి పక్కనుండగా ఆయనకి భూలోకానికి రావలసిన పనేమిటి? అన్న సందేహం కలిగింది. సరస్వతీదేవి సత్యలోకంలో లేకపోవడంవల్ల ఆయన రావలసి వచ్చింది అని జవాబు చెప్పుకున్నాను. ఆవిడ ఎందుకు సత్యలోకాన్నుంచీ వెళ్లిపోయింది? తిరిగి అక్కడికి వెడుతుందా? అన్న ప్రశ్నలకి జవాబు చెప్పడంకోసం ఆకాశాన్నుండీ పాతాళందాకా విస్తరించిన మానవుల్లోని హెచ్చుతగ్గులూ ఉపయోగపడ్డాయి.

శివకుమార శర్మ

# అయినవాళ్ళు      వారణాసి నాగలక్ష్మి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

తిరుగు ప్రయాణం పూర్తై ఇల్లు చేరిన గంటకే ఫోను గణ గణా మోగింది. !

శారద అప్పుడే స్నానం చేసి బయటికి వచ్చింది. పని మనిషి పక్కింట్లోనే పని చేస్తూండడం, తాము రాగానే పని అందుకుని ఒకటి తర్వాత ఒకటి చేసుకు పోతుండడంతో శారద దంత ధావనం పూర్తి చేసి కాస్త కాఫీ కలిపితెచ్చింది తనకీ భర్తకీ పనమ్మాయికీ . స్నానం చేసొచ్చి , ప్రయాణం అలసట నించి కొంచెం తేరుకుని వంట మొదలు పెడదామనుకుంటుంటే రేవతి ఫోను.

తీసీ తియ్యగానే "అమ్మా! రమ ఎలా వుందీ ?"ఆత్రంగా ప్రశ్నిం చింది. శారద నవ్విం ది.

"ఎందుకే అంత బెంగ నీకు? అది హాయిగా వుంది!" అంది సంతోషంగా .

" వాళ్ళత్త గారు ఎలా వున్నారమ్మా మీతో? దాన్నెలా ట్రీట్ చేస్తున్నారు ? నిజం చెప్పు" అంది ఆత్రంగా

" అయ్యో రామా! నిజం కాక అబద్ధం ఎందుకు చెప్తానే?మరీ విడ్డూరంగా మాట్లాడతావు? .."అంటుండగానే డోర్ బెల్ మోగింది.

"అమ్మలూ! నేను మళ్ళీ మాట్లాడతానే. ఇప్పుడే వచ్చాం గదా! పాలవాడొచ్చినట్టున్నాడు.ఒక్క గంట తర్వాత నేనే చేస్తా ...సరేనా?"అంటూ పెట్టేసింది శారద. ఎంతో మాట్లాడాలన్పించి చేసిందేమో రేవతికి ఏమీ తోచలేదు. రమ గురించిన ఆలోచనలు చుట్టుముడుతుంటే పిల్లలు వదిలేసిన వస్తువులన్నీ ఎక్కడివక్కడ సర్దుతూ, రమ పెళ్ళి విషయాలన్నీ గుర్తు చేసుకుంది.

★★ ★★ ★★ ★★ ★★

ఆపుకోలేని ఉక్రోషంతో రేవతికి కళ్ళ నీళ్ళొచ్చాయి.

"పెళ్ళిచేసి పంపగానే ఈ ఇంటితో నాకు సంబంధం తెగిపోయినట్టేనా ? ఇంత పెద్ద నిర్ణయం నాతో ఒక్కమాట కూడా చెప్పకుండా తీసుకున్నారు! " గొంతు పూడుకుపోయి, చివరి మాట పెగల్లేదు.

శారద విభ్రాంతిగా చూస్తూండి పోయింది .

" ఇప్పుడేమైందక్కా? ఎందుకంత ఎమోషనల్ గా ఉన్నావు?"రమ అక్క చెయ్యి పట్టుకుని అనునయంగా అడుగుతుంటే , ఆ చెయ్యి విదిలించేసి పూర్వం తన గదిగా చెప్పుకున్న గదిలోకి విసురుగా వెళ్ళి, మంచం మీద వాలిపోయింది రేవతి.అగని కన్నీళ్లు జలజలా రాలిపోయాయి.

వెనక్కాలే రమ వచ్చి పుస్తకాల బల్ల పక్కనున్న కుర్చీలో కూర్చోవడం తెలుస్తూనే ఉంది. ఎవరితోనూ మాట్లాడాలనిపించని దు:ఖం. ఎవరికీ ఏమీ చెప్పాలనిపించని విరక్తి. తన పెళ్లి అయి ఆరేళ్ళే అయిందంటే ఆశ్చర్యంగా ఉంది. ఈ ఆరేళ్ళ క్రితంవన్నీ క్రితం జన్మ తాలూకు విషయాల్లా అనిపిస్తున్నాయి! ఒక్క ఆరు సంవత్సరాల్లో తన జీవితం ఇంత అతలాకుతలం అయిపోయిందేమిటి? పుట్టి ఇరవై రెండేళ్ళు పెరిగిన పుట్టింటికి దూరమైపోయింది. అత్తింట్లో భాగం కాలేకపోయింది. ఎవరికీ చెందని దానిలా బతుకుతున్నా ఏక నిరంజన్ లాగా స్వేచ్ఛగా బతికే అవకాశమూ లేదుగా . ఉమ్మడి కుటుంబంలో కోడలిగా, ఇద్దరు పసిపిల్లల తల్లిగా, ఒక వ్యసన పరుడి భార్యగా తనని చుట్టేసిన బాధ్యతలకి అంతులేనట్టు కనిపిస్తోంది.

పాల పిట్టలా రివ్వున ఎగురుతూ, కోకిలమ్మలా కూనిరాగాలు తీస్తూ, స్వేచ్ఛకి మారుపేరులా జీవించిన తనేనా ఇప్పుడిలా వుంది? ఆలోచనలు ఆగని దు:ఖాన్ని కురిపిస్తుంటే పొగిలి పొగిలి ఏడుస్తూ ఉండిపోయింది రేవతి.

ఎన్నో జ్ఞాపకాలు. అంతస్తుల భేదం ఉన్నా పట్టించుకోకుండా గోపాల్ తల్లిదండ్రులు తనని కోడలుగా చేసుకుంటామని కబురు చేయడం, అతని చదువు, ఉద్యోగం, రూపురేఖలు నచ్చి, అమ్మా నాన్నా తననడగడం ....అన్నీ గుర్తొచ్చాయి. అతని వ్యక్తిత్వం, అభిరుచులూ, ప్రవర్తనా ఏవీ తెలియకుండా ఒప్పేసుకోడానికి మనసొప్పకపోయినా నాన్న బాధ్యత తేలిగ్గా తీరుతుందని అనుకునీ, ఆయన సంతోషం చూసీ సరే అనడంతో పెళ్ళయిపోయింది. అంతవరకు పెళ్ళి గురించిన మధురోహలు, తనదైన సంసారం పట్ల మమకారం అందరిలోనూ అంతర్గతంగా ఉంటాయనుకుని పొరబడింది తను. అలాంటి ఊహలు గాని, సరదాలు గాని , ప్రేమావేశం గాని ఏమీ లేని గోపాల్ తో

నిస్సారమైన సంసారం మొదలై పోయింది. అత్తగారి నిరాదరణ, తృణీకార ధోరణి, ఆ ఇంట్లో తన స్థానం ఏమిటో అర్ధంకాని అయోమయం! అతని వ్యసనాలూ, బలహీనమైన అతని మనస్తత్వం తన ఆశల్నీ, కోరికల్నీ మొదలంటా తుంచేశాయి. పరిస్థితి ఇదీ అని అర్ధమయ్యేసరికి ఆలస్యమైపోయింది. ప్రతి సాయంత్రం ఎంతకీ ఇల్లు చేరని భర్తకోసం నిండు యవ్వనంలో ఉన్న తను ఎదురు చూస్తుంటే , ఏదీ పట్టనట్టు తీరువుగా తయారై , మామగారి వెంట అత్తగారు పెళ్ళిళ్ళకీ ,పార్టీలకీ వెళ్ళిపోయేవారు .

ఆ ఇంటిని తన ఇల్లుగా భావించి ఎంతగా అంకితమైపోయినా, అత్త గారు గాని, తరచు వచ్చి పోతూ ఉండే ఆడబడుచులుగాని , భర్త గాని .. ఎవ్వరూ తనని ఆ ఇంట్లో భాగంగా మననివ్వలేదు. తనకీ తన హక్కులని సాధించుకోవడం ఎలాగో తెలియలేదు. ప్రేమ కోసం, ఆదరణ కోసం తపించే మనసు ఏ అమావాస్యకో, పున్నమికో చాచిన అతని చేతుల్లో తన దు:ఖాన్ని ,అభిమానాన్ని విడిచి కరిగి పోయేది. మళ్ళీ మామూలే.

తన మీద అంత పెద్ద కుటుంబపు బాధ్యతలైతే పెట్టారు గాని తన పిల్లల పెంపకంలో గాని, భర్తని సరైన దారిలోకి మళ్ళించడం లోగాని ఎవ్వరూ తనకి తోడుగా నిలబడలేదు. తన బాధ మనసు విప్పి తల్లిదండ్రులకి గాని, చెల్లెలు రమకి గాని ఎందుకు చెప్పుకోలేకపోయిందో తనకే తెలీదు! అసహజమైన ఈ సంసారాన్ని , తన తెలివితేటలతో,విజ్ఞతతో చక్కదిద్దుకోవాలని ప్రయత్నించి , ప్రయత్నించి విఫలమైంది. పాకుడు రాళ్ళమీద పట్టు దొరకనట్టే, నలుగురూ వచ్చేపోయే ఆ ఉమ్మడి కుటుంబంలో తనకి నిర్ణయాధికారంగాని, భర్తని సరిదిద్దడం కోసం తను వేసుకున్న ప్రణాళికల్ని అమలు పరచే అవకాశం గాని దొరకలేదు. అతనికీ తనకీ మాత్రమే సొంతమైన స్పేస్ అంటూ ఏమీ మిగల్లేదు. ఆఫీసు నించి ఆలస్యంగా మందు సేవించి మత్తు తలకెక్కుతుంటే ఇంటికి చేరడం, తిండి తినేసి పక్కమీదికి చేరడం, దుంగలాగా నిద్రపోయి పొద్దెక్కాక లేచి ఆదరాబాదరా ఆఫీసుకెళ్ళిపోవడం! ప్రేమరాహిత్యంలో దహించుకుపోయి, స్వాతి వానకోసం ముత్యపు చిప్పలా తపించిపోయి ఎప్పటికో నిద్రలోకి జారిన తనని, ఏ రాత్రి వేళో తన స్పర్శతో మేల్కొలిపి, తను పూర్తిగా మేలుకుని అతన్నించి ఒక ఆప్యాయతనీ,ఆత్మీయతనీ ఆశించి స్పందించే సమయానికి నిద్రలోకి జారిపోవడం....

ఒకే ఇంట్లో జీవిస్తూ కూడా తన వ్యధని అర్ధం చేసుకోకపోగా సూదుల్లాంటి చూపుల్తో, ములుకుల్లాంటి మాటలతో అత్తగారూ, వచ్చినపుడల్లా గురిచూసి సంధించే విమర్శనాస్త్రాలతో ఆడబడుచులూ తన మనసుకి మానని గాయాలు చేశారు. ఎన్నోసార్లు ఈ ఎదురీతనీదలేక బయటికి వచ్చేయాలన్పించినా రిటైరై ఆర్ధికంగానూ, ఆరోగ్యపరంగానూ సమస్యల్లో ఉన్న తల్లిదండ్రులమీద అదనపు భారం మోపలేకా, పసివాళ్ళిద్దరినీ తండ్రికి దూరం చేయడానికి మనసొప్పకా ఊగిసలాటలోనే ఇన్నేళ్ళూ గడిపేసింది. తెలుగు నేలకి దూరంగా ఉండడంతో తన జీవితం గురించి పుట్టింట్లో వివరంగా తెలియకుండా జాగ్రత్తపడగలిగింది.

చిన్నప్పటినుంచి రమంటే తనకీ, తనంటే రమకీ ప్రాణం. తన పెళ్ళయినప్పటినుంచీ ఎలా పెరిగిందో ఇంత దూరం! ఇవాళ తనకి తెలియకుండా, తన అభిప్రాయం కూడా అడగకుండా దాని పెళ్ళి నిశ్చయమైపోయింది!

వీపు మీద మెల్లిగా కదిలిన రమ చెయ్యి రేవతిని ఆలోచనల్లోంచి బయటికి లాక్కొచ్చింది.

"అక్కా!ఏం జరిగిందో నాకు చెప్పవూ?"ప్రేమగా అభ్యర్ధనగా అడిగింది రమ.

అప్పటికి దుఖోద్వేగం తగ్గిన రేవతి లేచి కూర్చుంది. ఎర్రబడ్డ కళ్ళు తుడుచుకుని "ఇంకా ఏం కావాలి? నువ్వెవరినో ఇష్ట పడడం, అతను నిన్నిష్టపడడం, నాన్న వాళ్ళని అప్రోచ్ చెయ్యడం ,వాళ్ళు సరేననడం అన్నీ జరిగిపోయాయి! నిశ్చయ తాంబూలాలకి రమ్మని నాకు ఫోన్ చేసేవరకు నేను మీకు గుర్తే రాలేదు."

మళ్ళీ జల జల రాలుతున్న కన్నీటిని కొంగుతో తుడుచుకుంది రేవతి.

"అక్కా ! అలా అనకు ...ప్లీజ్! ఎమ్మెస్ కి ప్రిపేరయే హడావిడిలో కొన్నాళ్ళు , అక్కడికి వెళ్ళాక హెక్టిక్ షెడ్యూల్స్ తో కొన్నాళ్ళు నీతోనే కాదు, అమ్మా నాన్నలతో కూడా ఎక్కువగా మాట్లాడే వీలు దొరకలేదు. అక్కడి వాతావరణానికి సర్దుకునే క్రమంలో అనిల్ సాయాన్ని తీసుకోవల్సి వచ్చింది. అతను మన స్కూల్ మేట్ అని చెప్పాగదా. ఎన్నోసార్లు ఒక ట్రూ ఫ్రెండ్ లా నాకు సాయపడ్డాడు.అతను ప్రొపోజ్ చేసే వరకు అతని ఉద్దేశ్యం నాకు తెలీదుకదా. అతనికి మంచి ఉద్యోగం వచ్చాక నా గ్రాడ్యుయేషన్ సెరిమోనీ రోజు పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. ఎలాగూ ఇండియా వస్తున్నా కదా అని ఆ వారం రోజులూ ఆగి ఇంటికి రాగానే అమ్మకీ నాన్నకీ చెప్పాను. అభ్యంతరం చెప్పేదేమీ కనిపించక వాళ్ళు ఒప్పుకున్నారు.....అనిల్ పేరెంట్స్ కూడా ఇక్కడి వాళ్ళే అవడంతో అన్నీ చక చకా జరిగిపోయాయి. అనిలేమో సరిగ్గా రెండు వారాల సెలవు మీద వచ్చాడు ! అందుకే వీలయినంత త్వరలో నిశ్చితార్ధం పెట్టాలని తొందర పడ్డారు. వాళ్ళు ఓకె అనడం, వెంటనే ముహూర్తం పెట్టడం ..."సంజాయిషీ చెప్తున్నట్టుగా అంటున్న రమ మెరుస్తున్న కళ్ళూ,, నునుసిగ్గుతో, సంతోషం తో కందిన బుగ్గలూ చూస్తూ పెళ్ళి కుదిరిన కొత్తల్లో తన భావాల్ని గుర్తు తెచ్చుకుంది రేవతి.ముందుకొచ్చి తొందరపెట్టి చేసుకునే వాళ్ళలో ఏ ఉద్దేశ్యాలు దాక్కున్నాయో ఎలా కనుక్కోవడం?

"రమా ! నువ్వేం చెపుతున్నావో నాకర్ధం కాక పోలేదే. అంతా హడావిడిగా జరిగిపోయింది అంటావు సరే..అంత హడావిడి ఎందుకు? తొందరపడి ముందుకి వెళ్ళిపోయాక వెనక్కి రాగలిగే అడుగులు కావే ఇవి! నీకేం తక్కువ?పెళ్ళి కాదేమో అని భయమా? అనిల్ గురించి నీకేం తెలుసని అంత ధైర్యం గా నిర్ణయం తీసుకున్నావు?" ఉద్వేగంగా అంది రేవతి.

"అదేంటక్కా అలా అంటావు? రెండేళ్ళుగా అతన్ని గమనిస్తున్నాను. ఎప్పుడూ అతని ప్రవర్తన డీసెంట్ గా ఉంటుంది ! ఇంకేం తెలుసుకోవాలి? స్కూల్లో నీకు జూనియర్ గా బానే తెలిసి ఉండాలి! ఎందుకంత అనుమానిస్తున్నావు?

రేవతి ఏం చెప్పాలో తెలియ నట్టు ఆగిపోయింది కొంత సేపు.

మెల్లిగా తేరుకుని "అవును ..అనిల్ గురించే కాదు వాళ్ళమ్మ గురించి కూడా తెలుసు. ఆవిడంత గయ్యాళిని ఇంకెవరూ ఉండరని చెప్పుకునే వాళ్ళం మా క్లాసులో. అస్తమానూ స్కూలుకి వచ్చేసి, అతని పుస్తకాల కోసమో, పరీక్ష పేపర్లలో తక్కువ పడ్డ మార్కుల కోసమో, అతనికి జ్వరం వస్తే క్లాసులో బాగా చదివే పిల్లల నోట్సుల కోసమో ఎప్పుడూ స్కూలుకి వస్తూ ఎవరితోనో ఒకరితో గొడవ పడుతూ ఉండేది. ఒకసారి వాడేదో తోటి పిల్లల్తో గొడవ పడితే తగుదునమ్మా అని పిల్లల వ్యవహారంలో తలదూర్చి ,ప్రిన్సిపాల్ దాకా లాక్కెళ్ళి, గోటితో పోయే విషయాన్ని గొడ్డలి దాకా తెచ్చింది"

కందిన మొహంతో అక్క చెపుతున్న విషయాన్ని ఆశ్చర్యంగా వింటూండిపోయింది రమ. సంవత్సరం జూనియర్ అయిన అనిల్ ఇంత గుర్తున్నాడా అక్కకి! అతను తను చదువుకున్న స్కూలు విషయం ప్రస్తావించేవరకూ తనతన్ని స్కూల్ మేట్ గా గుర్తించనే లేదు.

ఇంతలో పిల్లలిద్దరూ ఒకళ్ళమీదొకళ్ళు ఫిర్యాదు చేసుకుంటూ రావడంతో సంభాషణ అక్కడ ఆగిపోయింది.

★★ ★★ ★★ ★★ ★★

నది నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. ఒడ్డున ఉన్న బండరాళ్ళ మీద చదునుగా ఉన్న చోటు చూసుకుని కూర్చున్నారు రేవతీ, రమా. పిల్లలిద్దర్నీ అమ్మ దగ్గర వదిలేసిన రేవతికి, ఎడతెగని పని నుంచి చిన్నపాటి విశ్రాంతి దొరికినట్టనిపించింది. నిశ్చితార్ధానికి ముందే రమతో ఎన్నో మాట్లాడాలని, అనిల్ తో పెళ్ళి విషయంలో పునరాలోచన అవసరమని చెప్పాలని ఒకటే అరాటపడింది రేవతి. ప్రయాణంతో అలిసిపోయిన శరీరం రాత్రి పిల్లల్ని నిద్ర పుచ్చేసరికే నిద్రలోకి జారిపోయింది. మధ్య రాత్రి మెలకువ వస్తే ఆందోళనతో నిద్ర పట్టలేదు.

తెల్లవారిందగ్గర్నించి రోజువారీ పనులే గాక పెళ్ళి గురించిన మాటలూ, ఏర్పాట్లూ ముందుకి సాగిపోతుంటే రేవతిలో అసహనం ,ఆందోళనా పెరిగిపోయాయి. సాయంత్రమవుతూనే గోదారి వొడ్డుకి వెళదాం పదమని రమని బయల్దేరదీసింది. అక్క లోపల సాగుతున్న మథన ఏమిటో, ఎందుకో తెలుసుకోవాలని ఎదురుచూస్తున్న రమ వెంటనే బయలుదేరింది.

చిన్నప్పుడంతా అలవాటైన చోటికి చేరగానే ఇద్దరూ మూగబోయారు. నీరెండలో మెరుస్తున్న గోదారి పెళ్ళికూతురిలా కళ కళలాడుతూ కనిపించింది రమకి.

అదే గోదారి మోయలేని బరువుని మోస్తూ, లేని సహనాన్ని అరువు తెచ్చుకుంటూ కూడా తన కల్లోలాన్ని తనలోపలే దాచుకున్నప్రౌఢలా కనిపించింది రేవతికి. మనిషి విచక్షణారహితంగా విసర్జించే రకరకాల కాలుష్యాలని ఎదురుచెప్పలేని అశక్తతతో తనతో మోసుకుపోతోంది. తనను అన్నివిధాలా వాడుకుంటూ కూడా అనుక్షణం అవమానిస్తున్న మనిషిని, ఆదుకుంటూ, ఆదరిస్తూ, క్షమిస్తూ ఎందుకలా ఉంటుంది? అలా అని తనలా నిరాశగా ఉదాశీనంగా ఉందా? లేదే..

తలెత్తి దూరానికి చూపు సారించింది రేవతి. పశ్చిమాన అస్తమించే అలోచనలో ఉన్నాడు సూర్యుడు. మేఘాలు లేని ఆకాశంలో గుండ్రని బంతిలా కనిపిస్తున్నాడు. అరచెయ్యి అడ్డుపెడితే అంతకన్నా చిన్నగా ఉన్నాడు! అయితేనేం ఆ కాస్తంత రంగుముద్దనించి ఎన్ని రంగులు,ఎన్ని ఛాయలు, ఎన్ని తళుకులు తీస్తుంది ఈవిడ! అవలి తీరం బంగారు రంగులో మెరిసిపోతూ, ఈవలి తీరం లేత నీలంగా, ఒడ్డుదగ్గర ముదురు నీలంగా, మధ్యలో చమ్కీల తళుకులతో....మధ్య మధ్యలో చిత్ర విచిత్రమైన కలనేత రంగులతో ఎంత అందంగా తయారవుతుంది! తనకైతే ఎక్కడికైనా వెళ్ళాలన్నపుడు కూడా చక్కగా తయారవాలని ఉండదు. కాస్త మంచి చీర కట్టుకోవాలనీ, మొహానికి కాస్త పౌడరో,క్రీమో అద్దుకుని,కళ్ళకి కాటుక తీర్చుకోవాలనికూడా అనిపించదు! ఈవిడకి మాత్రం ముప్పొద్దులా మూడు రకాల సింగారాలు! మిల మిలలూ,తళతళలూ..ఇంక రాత్రయిందంటే ఆ తళుకు బెళుకుల సోయగం ఎవరు వర్ణించగలరు?తనైతే అలిసిపోయి ఒక్కోసారి బట్టలు కూడా మార్చకుండా నిద్రపోతుంది. కోటానుకోట్ల నీటి అణువుల్ని పోగుచేసుకుంటూ,పిల్ల తెమ్మెరల్ని చల్ల బరుస్తూ,దప్పిక తీరుస్తూ, పొలాలకి నీళ్ళందిస్తూ ,పడవల్ని గమ్య స్థానాలకి చేరవేస్తూ... ఒకటా రెండా ఎన్ని పనులు చేస్తుంది! అలసట లేకుండా? అంత ఉత్సాహంగా ఎలా ఉంటుందో ?

ఎంత ప్రయత్నించినా తనలో ఉత్సాహమే కలగట్లేదు! ఇద్దరు పిల్లలతో తన జీవితం ఒక చిక్కు ప్రశ్నలా కనిపిస్తోంది!

ఇపుడు తన చిన్నారి చెల్లెలు రమ జీవితం ఏం కానుంది?

అనిల్ తల్లి పదే పదే గుర్తొస్తుంటే ఆ ఇంట్లో రమ సుఖ పడుతుందన్న నమ్మకం తనకే కోశానా కలగట్లేదు.కొడుకు జోలికెవరొచ్చినా సహించలేని ఆవిడ రమ కాపురాన్ని సవ్యంగా సాగనిస్తుందా? కొడుకు జీవితంలో భార్యగా రమ ప్రాముఖ్యతని అంగీకరిస్తుందా? ఇంత వివరంగా చెప్పినా దీనికి తన తాపత్రయం అర్ధమవుతున్నట్టే లేదు!

ఆలోచనలు మాటలుగా రూపాంతరం చెందేసరికి పడమటి ఆకాశం పూర్తిగా ఎర్రబారింది. అక్క సంసారం గురించి తెలుసుకున్న కొద్దిపాటి విషయాలకే రమ కళ్ళు నీటి చెలమలయ్యాయి. పక్షులు గుంపులుగా ఎగురుతూ గూళ్ళవైపు సాగిపోతుంటే

"రమా! వాటిలో ఒక పక్షిలా స్వేచ్ఛగా ఎదిగిన నేను ఇవాళ పంజరంలో బందీలా ఉన్నాను తెలుసా ? స్వచ్ఛమైన ఆనందాన్ని ,ఆత్మీయతనూ అనుభవించి ఎన్నాళ్ళయిందో ! నా పెళ్ళి ఒక పెద్ద పొరబాటు.ఇంక దాని గురించి చెయ్యగలిగిందేమీ లేదు. కనీసం నువ్వైనా సుఖపడాలని, అందమైన సంసారాన్ని సొంతం చేసుకోవాలని, ఎప్పుడైనా అవకాశం దొరికినప్పుడు నేనూ పిల్లలతో వచ్చి మీ పొదరింట్లో రెండు

రోజులు గడపాలని నా ఆశ..నా కోరిక! ఇతని పట్ల విడదీయలేని ప్రేమ ,అనుబంధం ఇప్పటికే ఏర్పడి ఉండక పోతే మాత్రం ఇక్కడే ఆగిపోవే! ఎందుకు చెపుతున్నానో ఆలోచించు!.."

"అక్కా! నీబాధ నాకర్ధమయింది. కానీ అనిల్ ఎంతో మంచి వాడు. వాళ్ళమ్మ ఎలా వుంటే మనకెందుకు? అతను పరిణత మనస్కుడైతే చాలుకదా!"

రేవతి నిస్సహాయంగా తల కొట్టుకుంది. "ఒసే వెర్రి పెద్దమ్మా! పిచ్చి మొద్దూ! ఆవిడెలా వుంటే మనకెందుకు అంటున్నావు..బుర్ర లేదే నీకు! మా అత్తగారు తెలిసిన వాళ్ళందరి దృష్టిలోనూ దేవత తెలుసా? అలాంటి ఆవిడే నా సంసారంలో శాంతి లేకుండా చేస్తోంది. అనిల్ వాళ్ళమ్మ గారు ఎంత గండ్ర మనిషో అప్పట్లోనే అంతా చెప్పుకునే వారు. నీ సంసారంలో మేజర్ రోల్ ఆవిడే పోషించబోతోంది! ఎంత చెప్పినా నీకర్ధం కావడం లేదు. అతన్ని విడిచి ఉండలేనంత ప్రేమతో కాదుకదా నువ్వీ పెళ్ళికి ఒప్పుకున్నది. అంత మాత్రం చదువూ, ఉద్యోగం ఉన్న ఇంకొకడు నిన్నిష్టపడి రాకపోతాడుటే ?"

రేవతి వ్యక్త పరుస్తున్న ఆందోళననీ , దిగులునీ చూస్తుంటే రమకి ఏమనడానికీ తోచలేదు.ఇప్పటికే అనిల్ తో ఏర్పడ్డ అనుబంధం గాఢమయినది కాకపోయినా ఎంతో మధురంగా తోస్తోంది ! తను వాళ్ళింటికి వెళ్ళగానే ఎదురొచ్చి గాఢంగా తనను హత్తుకున్న మణి ఆంటీ గయ్యాళి,ఖతర్నాక్ అంటుంటే నమ్మ బుద్ధి కావటం లేదు.

అలా అని అక్క మాటలు మరీ తోసిపారేసేవిగానూ లేవు. చదువులోనూ,కెరీర్ బిల్డింగ్ లోనూ కూరుకు పోయి ఈ మధ్య చాలాకాలంగా అక్కని సరిగ్గ గమనించనే లేదు. తన మాటలు వింటూ తనని పరికించి చూస్తుంటే రేవతి, తన పూర్వపు అక్కలా, ఒకప్పటి వాసంత సమీరంలా ,ఆనాటి ఉల్లాసతరంగం లా కనిపించడం లేదు.ఆ కళ్ళకింద నల్లటి చారలు చూస్తుంటే కలలు కల్లలై నశించిపోయిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి!

చూస్తూండగానె చీకట్లు ముసురుకున్నాయి. నది మీద అక్కడొకతటీ, అక్కడొకటీ పడవలు సాగిపోతున్నాయి. కాస్త దూరంలో బట్టలుతుక్కుంటున్న చాకలి వాళ్ళు పని ముగించి వెనుదిరుగుతున్నారు. స్నాన ఘట్టం దగ్గర నీళ్ళలో ఖాళీచేసిన చిప్సు పాకెట్లూ,బిస్కెట్ పాకెట్లూ,అయిస్ క్రీం కప్పులూ ,వేరుసెనగ తుక్కులూ పోగుపడి ఉన్నాయి.

"ఆ నదిని చూస్తే నాలాగే కనిపిస్తోంది రమా! తనని వాడుకుంటూ, లబ్ధి పొందుతూ కూడా అబ్యూస్ చేస్తుంటే సహిస్తూ, భరిస్తూ సాగిపోతుంది. ఎందుకో మరి ఎదురుతిరగదు !" అంది రేవతి ఉదాశీనంగా.

“నదిని చూస్తే నాలా ఉంది, మేఘాన్ని చూస్తే నాలా ఉందీ.. అంటూ ఈ వ్యర్ధమైన పోలికలెందుకక్కా పెట్టుకుంటావు? నది నీలా ఎందుకుంది? బరువెక్కువేస్తే పడవల్ని ముంచేస్తుంది. తన భూభాగాన్ని దురాక్రమణ చేస్తే వరదై పొంగి , జనావాసాల్ని ముంచేస్తుంది. ఈదడం నేర్చుకోకుండానే తనతో ఆటలకొస్తే తీవ్రంగా హెచ్చరిస్తుంది. ఎవరు కొట్టుకు పోయినా ఎవరు మునిగి పోయినా తన ప్రవాహాన్ని అరక్షణం కూడా ఆపదు సరికదా ఆ వేగాన్ని కూడా తగ్గించదు. ఎందుకొచ్చిన పనికిమాలిన పోలికలు? ఇంక బయల్దేరుదాం పద! " అంది రమ మృదువుగానూ, ఖచ్చితంగానూ.

ఇల్లు చేరేలోగానే రమ ఒక అభిప్రాయాన్నికొచ్చేసింది. తాముండబోయేది వేరే దేశంలో. నిజంగా అనిల్ తల్లి పేచీకోరూ ,గయ్యాళీ అయినా తన జీవితాన్ని ఆవిడ అంతగా ప్రభావితం చెయ్యలేదనీ, ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే తను మెతకగా సహిస్తూ కూర్చోననీ చెప్పి, గోపాల్ కీ, అనిల్ కీ ఆ విషయం లో పోలిక లేదు కనక అక్క బెంగ పెట్టుకోవడం లో అర్ధం లేదనీ తేల్చింది.

ఇంక తను చేయ గలిగిందేమీ లేదని రేవతి ఊరుకుంది.

★★ ★★ ★★ ★★ ★★

పెళ్ళై మూడేళ్ళు అమెరికాలో ఉన్నాక అనిల్ కి బెంగుళూరులో మంచి ఆఫర్ వచ్చింది. రమకీ అనిల్ కీ కూడా తమ వాళ్ళకి దగ్గరగా ఉండాలన్న కోరిక బలపడడం, పిల్లలకోసం ప్లాన్ చేసుకోవాలనీ, వాళ్ళు అయిన వాళ్ల మమతానురాగాల మధ్య పెరగాలనీ అనిపించడంతో స్వదేశానికి తిరిగి వచ్చేశారిద్దరూ. రమ ఉద్యోగం ఇంకా తేలలేదు. ఇల్లూ వాకిలీ స్థిర పడగానే అనిల్ తల్లిదండ్రులిద్దర్నీ తమ దగ్గరికి తెచ్చుకున్నాడు. ఈ వివరాలన్నీ తెలుస్తున్న కొద్దీ రేవతికి చెల్లెలి కాపురం గురించి బెంగ మొదలయింది. ముందు ముందు ఎలా ఉండబోతోందో అన్న ఆందోళన ఆమెని స్థిమితంగా ఉండనివ్వలేదు.

అంతా సజావుగా ఉందనీ, అత్తకీ తనకీ మధ్య ఎలాంటి సమస్యలూ లేకపోగా ఆదరాభిమానాలు పెరుగుతున్నాయనీ రమ చెప్పినా రేవతికి నమ్మకం కలగలేదు. మొదట్లో అలాగే ఉంటుందనీ, రాను రాను సమస్యలు రాకుండా ఉండవనీ , హాయిగా ఉన్న జీవితాన్ని వదులుకుని వెనక్కొచ్చి రమ చాలా తప్పు చేసిందనీ రేవతి అనుకుంటూ వచ్చింది. కొడుకూ కోడలూ దగ్గర తమ నివాసం స్థిరపడగానే ఆశ్చర్యకరంగా రమ అత్తగారు, శారద కి ఫోన్ చేసి కూతురి కాపురం చూడడానికి రమ్మనీ, ఇప్పుడు రమ ఇంకా ఉద్యోగంలో చేరలేదు గనక హాయిగా వచ్చి వారం పదిరోజులుండి కూతురితో గడిపి వెళ్ళమనీ ఆహ్వానించి భర్త చేత కూడా దంపతులిద్దరికీ చెప్పించింది.తల్లీదండ్రీ వెళ్ళి రమ ఇంట్లో వారం రోజులుండి ,ఇంటికి తిరిగి వెళ్ళగానే ఫోన్ చేసింది రేవతి.

★★★

గంట తర్వాత చేస్తానన్న శారద మళ్ళీ ఫోన్ చేసేదాకా అస్థిమితంగా పనుల్లో గడిపిన రేవతి, తల్లి ఫోన్ కాల్ అందుకుంటూనే మళ్ళీ అదే ప్రశ్న అడిగింది.

శారద "నిజమే చెప్తున్నా తల్లీ! ఆవిడ ఊరందరికీ గయ్యాళి కావచ్చు గాని తన వాళ్ళ మీద ఈగ కూడా వాలనివ్వదు! కొడుకంటే ఎంత ప్రాణమో కోడలన్నా అంతే! వీళ్ళు వెనక్కొచ్చిన పది రోజులకే వైరల్ ఫీవరొచ్చి రమ మంచానికతుక్కుపోతే, దగ్గరుండి కూతురి కన్న ఎక్కువగా చూసుకుంది తెలుసా?" అంది గొప్పగా.

వింటున్న రేవతి" అవునమ్మా..రమ ఆ విషయం చెప్పింది గాని నాకే పూర్తి నమ్మకం కలగలేదు" అంది.

"లేదు అమ్మలూ!దాని సంగతి నీకు తెలీదూ?ఉన్నదున్నట్టు ఖచ్చితంగా మాట్లాడ్డం దానికలవాటని. ఆవిడ దాన్ని నిజంగానే ఎంతో ఆపేక్షగా చూసుకుంటున్నారు! వాళ్ళ మామగారు ఎక్కువగా మాట్లాడరని తెలిసిందేగా. అసలాయన మెతకదనం వల్లే ఈవిడ గట్టిగా నిలబడాల్సి వచ్చిందేమో! వాళ్ళ గతం మనకి తెలీదు. తన వాళ్ళని కమ్ముకుని కాపాడుకోవడం ఆవిడకి అలవాటని నాలుగురోజులు చూస్తే ఎవరికైనా అర్థమైపోతుంది! కొడుకూ, కోడలూ అన్యోన్యంగా ఉంటే చాలు ఆవిడకి. సినిమాలకీ షికార్లకీ వెళ్ళమని ఆవిడే పంపుతుంది."

విస్మయంగా వింటూ "నిజంగానే?"అంది రేవతి.

“ అంతేకాదు..ఇంట్లో వంటలోనూ, పనుల్లో కాకుండా పిల్లల ఆరోగ్య విషయంలో కూడా ఆవిడకి ఎంత తాపత్రయమో! రమది డ్రై స్కిన్ అని తెలుసుగా. వారానికోసారి నలుగుపెట్టుకుని స్నానం చెయ్యాల్సిందే! బారెడు జుట్టు కాస్తా దాని అశ్రద్ధకి పెళ్ళికి ముందే సగం ఊడిపోయింది కదా. ‘నూనె సరిగ్గా రాయక , పోషణ లేకపోతే అలాగే అవుతుందే అమ్మాయీ’ అంటూ రేపు తలంటు అంటే ఇవాళ రాత్రి ఓపిగ్గా తలకి నూనె రాసి మర్దనా చేస్తుంది”

తల్లి మాటలకి మరింతగా ఆశ్చర్య పోయింది రేవతి.

"దీని సాఫ్ట్ వేర్ ఉద్యోగపు అలవాట్లు మనకి తెలీనివి కావు. రాత్రి పన్నెండూ ఒంటిగంట దాకా కంప్యూటర్ మీద పని చేసుకుంటూ కూర్చోడం, పొద్దున్న తిఫిను సరిగ్గా తినక పోవడం, మధ్యాన్న భోజనం ఏ మూడింటికో తినడం..అన్నిటికీ చెక్ పెట్టేసిందావిడ. పొద్దున్న లేటుగా లేచినా ఏమీ అనదు గాని లేవగానే చక చకా తయారై టిఫిన్ తినెయ్యాలి. ఇదింకా ఉద్యోగం లో చేరలెదుగా..మధ్యాహ్నం ఒంటిగంటకి ముగ్గురూ భోజనం చేసెయ్యాలి. రాత్రి ఎనిమిది కల్లా భోజనానిక్కూర్చోవాలి. కొడుకూ, కోడలూ తొమ్మిదికల్లా చల్ల గాలిలో వాకింగుకి వెళ్ళాల్సిందే. పదింటికి లాప్ టాప్ స్టడీ రూములో వదిలేసి బెడ్రూం లో కెళ్ళి తలుపేసుకోవాలి! ఇవన్నీ కటువుగానో , అజమాయిషీగానో చెప్పదేవ్! గారం చేసుకుంటూ ముద్దుగా చెపుతుంది !"

" మరి ఇన్ని రూల్స్ మన జగమొండి పాటిస్తుందా?"వింతగా అడిగింది రేవతి.

"అదే తమాషా..మన మొండి ఘటం ఆవిడ మాటలన్నీ చక్కగా వింటుంది. అన్నీ దాని మంచికేగా. ఆ జ్ఞానం దానికీ వచ్చిందేమో! నే చెప్పినవి మచ్చుకి కొన్నే..ఇంకా ఎన్నో చెప్పాల్సినవున్నాయి! ఆవిడని చూస్తే నాకర్ధమైందేమిటో చెప్పనా?"

చెప్పు అన్నట్టు "ఊ"అంది రేవతి.

"ఆవిడ తనవాళ్ళు అని ఒక గిరి గీసుకుంటుందనుకుంటానే....అందులో ఉండేవాళ్ళ పట్ల ఆవిడకి హద్దులేని ప్రేమ! ఇప్పుడు అలా గీసిన గిరిలోకి మేం కూడా చేరి పోయాం తెలుసా?" నవ్వింది శారద.

---

" 'ఏమిటండీ వదినగారూ? మమ్మల్ని మరీ మొహమాట పెట్టేస్తున్నారు ' అంటే ఏమందో తెల్సా ఆవిడ? 'కోడల్ని కని పెంచిన తల్లిదండ్రుల్ని అభిమానంగా చూడకపోతే దాని మనసుకి హాయిగా ఎలా ఉంటుందండీ? ' అంది! " వింటున్న రేవతికి సంతోషంతో మాట పెగల్లేదు."ఎపుడో వీలు చూసుకుని వెళ్ళిరండే అమ్మలూ మీరు కూడా! నీకూ మార్పుగా ఉంటుంది.స్వయంగా చూసి వస్తే నీ మనసూ కుదుట పడుతుంది" అని ముగించింది శారద.

'నిజమే అందరికీ దేవత అయినా, అయినవాళ్ళకి కాక పోవచ్చు. ఊరందరి మీదా విరుచుకు పడే వ్యక్తి కోడలిని అమ్మలా చూసుకోనూ వచ్చూ' అనుకుని నవ్వుకుంది రేవతి.

"ఎంతసేపూ ఆ ఫోన్లోనే పడి ఉండకపోతే వాడి బట్టల ఇస్త్రీ పూర్తి చేసుకోవచ్చు కదా! పనికిమాలిన కబుర్లు కూటికా గుడ్డకా?" తృణీకారంగా వినపడ్డ అత్తగారి మాటలకి

"నేను చెయ్యవలసిన పన్లు నే చూసుకుంటాలే అత్తమ్మా! మీరు అనవసరంగా వర్రీ అవకండి" మూగబోయిన గొంతు పెగుల్చుకుని సమాధానమిచ్చింది రేవతి.

********

## కథ వెనుక కథ

కొత్తగా వచ్చే కోడలు తమ ఇంటిలో భాగంగా ఇమిడిపోవాలని ఆశించే అత్తమామలు, ఆమె సమస్యలు, వేదనలు తమవి కూడా అన్నట్టు భావించక పోవడం మన వ్యవస్థలో కనిపిస్తుంది. కోడలికి వంట్లో బాగుండకపోతే ఆమె పుట్టింటి వాళ్ళు చూసుకోవాలనీ, ఆమె ఆరోగ్యం కుదుటపడ్డాక తిరిగి వచ్చితమకు సేవలు చెయ్యాలనీ ఆశించడమూ పరిపాటే. అత్తా కోడళ్ల అనుబంధానికి పునాది వెయ్యవలసింది అత్తగారేననీ , అది సరిగా పడితేనే ఆ పైన నిర్మించే సౌధం పటిష్టంగా

నిలబడే అవకాశం ఉంటుందనీ ' చెపుతూ ఇంద్రగంటి జానకి బాల గారు ఒక కథ రాశారు. ఫలశ్రుతి అనే కథలో..... ఇద్దరు ఆడవాళ్లు ఒకే ఇంట్లో బతకాల్సి వచ్చినపుడు వారిద్దరి మధ్య స్నేహం, ప్రేమ, అవగాహనకు బదులుగా పోటీ, ద్వేషం , అపార్థాలు, అనుమానాలు చోటుచేసుకోవడం గురించి ప్రస్తావించి, "మనం తూలనాడి ద్వేషం ప్రదర్శించి, వాళ్లు మనల్ని ప్రేమించి, గౌరవించాలని ఆశించడం అవివేకం. అలాంటి అవివేకమే మన మధ్యతరగతి కుటుంబాలలో కరడు కట్టుకుపోయి ఉండిపోయింది .... మన వ్యవస్థలో పెళ్లి అనేది రెండు కుటుంబాల మధ్య స్నేహానికి బదులు శత్రుత్వాన్ని నెలకొల్పిన దాఖలాలే మనకి కనిపిస్తాయి "అంటారు. ఆ కథ చదివాక, బంధు మిత్రులందరిలో దేవతగా పేరు తెచ్చుకున్నఒక స్త్రీ , కోడలి పట్ల మాత్రం కర్కోటకంగా ప్రవర్తిస్తుండడం గురించిన చర్చ వచ్చింది. అపుడు మా మేనత్త సూర్యదుర్గ ఒక అరుదైన అత్తాకోడళ్ల జంట గురించి చెప్పారు. ఊరందరిలో గయ్యాళిగా పేరు పడ్డ ఆ అత్తగారు, తన కోడలిని ఎంతో అపురూపంగా చూసుకుంటుందనీ , ఆ పిల్ల బాగోగులన్నీ పట్టించుకుని , ఆమెని తన కూతురికంటే ఎక్కువగా చూసుకుంటుందనీ వర్ణిస్తుంటే నాకు ఈ కథ రాయాలనే ఆలోచన వచ్చింది.

-రచయిత్రి

---

# టీ కప్పులో .. కాశీభట్ల శశికాంత్

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

**ప్రకాష్ టీపాయ్ మీద ఉన్న కప్పుని** చేతుల్లోకి తీసుకుని కొద్దిసేపు దానివైపు చూసి మళ్ళీ తీసిన చోటే పెట్టేసాడు. నేను అతనివైపు చూస్తూ కూర్చున్నాను.

అతన్ని కలవాలని నాలుగురోజులుగా అనుకుంటున్నా కుదరలేదు. ఈ రోజు ఫోన్ చేసి అడిగితే సాయంత్రం ఇంటిదగ్గరే ఉంటాను వచ్చి కలవమన్నాడు. క్లబ్బులో పేకముక్కగానో, బార్లో విస్కీగ్లాసుగానో ఉండవలసిన సమయంలో ఇంటిదగ్గర ఉంటాను అన్నాడంటే అతనిలో మార్పు వచ్చిందన్నమాటే అనుకున్నాను.

రెండుసార్లు కాలింగ్‌బెల్ కొట్టాక గుమ్మానికి పక్కనున్న కిటికీ తలుపు తెరచి చూసి మరీ వీధి తలుపు తెరిచాడు. "ఏడింటికే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నావే. మంచిదేలే, ఈ మధ్య దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి" అని నవ్వాను.

ప్రకాష్ నవ్వలేదు. కొద్దిసేపు నా వైపు అలాగే చూసి 'రా' అని లోపలికి నడిచి సోఫాలో కూర్చున్నాడు. నేను వెళ్ళి అతనికి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాను.

"ఈ మధ్య ఊళ్ళో లేకపోవడం వలన విషయం తెలియలేదు. నరేంద్ర మార్కెట్లో కలిసినపుడు చెప్పాడు. ఎలా జరిగింది?" అన్నాను. అతను ఏదో ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"చాలా అదృష్టవంతుడివి. ఇది నీకు పునర్జన్మే" అన్నాను.

అతను అప్పటికీ మాట్లాడలేదు. ప్రమాదం చేసిన సంతకాలు అతని శరీరం మీద అసహ్యంగా కనబడుతూనే ఉన్నాయి.

కొద్దిసేపు ఏకపాత్రాభినయం చేసేవాడిలా నేను ఒక్కడినే మాట్లాడాను. అతను మాత్రం టీ కప్పునీ, ఇంటికప్పునీ మార్చి మార్చి చూస్తూ ఏకాక్షర వ్రతం పాటిస్తున్నవాడిలా 'ఆ' 'ఊ'లతో కాలక్షేపం చేసాడు.

అతని వాలకం చూసి "నేను వచ్చి నిన్ను ఇబ్బంది పెట్టలేదు కదా!?" అన్నాను.

తల అడ్డంగా ఊపాడు.

"ఇంకా నెప్పి తగ్గలేదా?"

మళ్ళీ తల అడ్డం.

"ఎవరికైనా బాగుండలేదా?"

మళ్ళీ తల

"బిజినెస్‌లో ఏదైనా ప్రాబ్లమా?"

తల మళ్ళీ..!

నాకు ఇబ్బందిగా అనిపించింది. ఇక బయల్దేరడం మంచిది అనుకుంటుండగా పరీక్షించి పరీక్షించి మౌనం వీడిన మునిలా నోరు విప్పాడు.

"నా మీద నీ అభిప్రాయం?" అన్నాడు.

"బోలెడు ఆస్థి, చక్కని భార్య. నీకేమిటి అదృష్టవంతుడివి"

"నేనూ అదే అనుకునేవాడిని" అని కొన్ని క్షణాలు ఆగి "నీకు కొన్ని విషయాలు చెప్పాలి. ఇవి ఎవరితో పంచుకోవాలా అని కొన్ని రోజులుగా ఆలోచిస్తున్నాను. సమయానికి నువ్వే ఫోన్ చేసావు. అందుకే నిన్ను రమ్మన్నాను. లేకపోతే ఎవర్నీ కలిసే మూడ్‌లో లేను" అన్నాడు భారంగా. నాకు ఆశ్చర్యం వేసింది.

"ఇంత ఆస్థి ఉందికదా. తను ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఏముంది చెప్పు. మానమన్నా వినదు"

"ఇదా విషయం. నేను ఏమిటో అని ఖంగారుపడ్డాను. చదువుకున్నది. తన కాళ్ళమీద తను నిలబడాలనుకోవచ్చుకదా" తేలికగా అన్నాను.

"మొదట్లో నేను కూడా అదే అనుకున్నాను" అని కొన్ని క్షణాలు ఆగి "నాకు పిల్లలంటే చాలా ఇష్టం. కానీ పెళ్ళయి రెండేళ్ళయినా అప్పుడే పిల్లలు వద్దంటుంది" అన్నాడు.

"ఇప్పటినుంచీ పిల్లలు ఎందుకు అనుకుని ఉండొచ్చు. అయినా మీకు ఇప్పుడు వయసేమైపోయింది."

"మొదట్లో నేను కూడా అదే అనుకున్నాను. బస్సుల్లో తిరిగి ఇబ్బంది పడకూడదని స్కూటర్ కొనిచ్చాను. ఒక్కరోజు కూడా దాన్ని బయటకు తియ్యదు."

"ఈ ట్రాఫిక్‌లో డ్రైవ్ చెయ్యాలంటే ఎంతో అనుభవమున్న మనకే భయం వేస్తోంది. దానికన్నా బస్సే బెటర్" అన్నాను.

"మొదట్లో.."

"ఇప్పుడు ఏమనుకుంటున్నావో అది చెప్పు" అతని స్టాక్ డైలాగ్ కట్ చేసి చిరాకుగా అన్నాను. అతను కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత టీ కప్పుని మరోసారి చేతుల్లోకి తీసుకుని మళ్ళీ యథాస్థానంలో పెట్టేసాడు. అతని ప్రవర్తన నాకు వింతగా అనిపించింది.

"టీ చల్లారిపోయినట్టుంది" అన్నాను. అతను నావైపు కొన్ని క్షణాలు దీర్ఘంగా చూసి కళ్ళుమూసుకున్నాడు.

"ఆఫీసులో అంతసేపు మాట్లాడుకుంటారు. ఇంటికి వచ్చాక మళ్ళీ ఫోన్లు మెసేజ్‌లు. శలవు రోజుల్లో మరీను. ఇక ఉద్యోగం ఎలా మానుతుంది" అన్నాడు. నాకు మతిపోయింది. నేను నోరు తెరిచేలోగానే "తను చాలా మామూలుగా బస్టాపుకి వెళుతుంది. అతనుకూడా చాలా సహజంగా బైక్ మీద వస్తాడు. ఆ బైక్ మీద అతని నడుం చుట్టూ చెయ్యివేసి.. " అని ఆపేసాడు.

"ఎవరి గురించి చెబుతున్నావు" అర్థమైన నిర్ధారణ కోసం అడిగాను.

"ఇంకెవరు.. నా భార్య"

"ఛ. తప్పుగా ఆలోచిస్తున్నావు" మందలింపుగా అన్నాను.

"వినడానికే నీకు అసహ్యంగా ఉంది కదూ?" పేలవంగా నవ్వుతూ అన్నాడు.

"చూడు. ఉద్యోగం చేసే ఆడవాళ్ళు మగవాళ్ళతో చనువుగా ఉండక తప్పదు. ఆ మాత్రం దానికి ఆవిడని తప్పు ఏదో ఊహించేసుకుని మనస్సు పాడు చేసుకోకు"

"నీకు తన గురించి ఏమీ తెలియకపోయినా నేను చెప్పిన దానిని నమ్మవు. ఎందుకు. అది మన సంస్కారం. కానీ నాది ఊహకాదు. నమ్మకంగా తెలుసు" అన్నాడు సీరియగా. నాకు ఇబ్బందిగా అనిపించింది.

"ఇంతకాలం నా మనస్సులో దాచుకున్నాను. ఇక నావల్లకాదు. పరిస్థితి నా చెయ్యి దాటిపోయింది. ఇప్పుడు చెప్పకపోతే ఇక ముందు ఆ అవకాశం కూడా ఉండదేమోనని హాయం వేస్తోంది" అన్నాడు భారంగా. బావురుమంటున్న ఆ ఇల్లు, సీరియస్‌గా ఉన్న వాడి మొహం, ఆ మాటలు అర్థంకాకపోయినా భయంవేసింది.

"ఏం జరిగింది?" ఆదుర్దాగా అడిగాను.

"మరోసారి ప్రమాదం నుంచి తప్పించుకున్నాను"

"అంటే.. మళ్ళీ కరెంట్"

"మరోసారి అలాగే ప్రయత్నిస్తారా ఎవరైనా?" అన్నాడు. నిర్ఘాంతపోయాను.

"అది ప్రమాదం కాదా. ఎవరు చేసారు?"

"ఎవరు చేస్తారు? నేను పోవడం వలన ఎవరికి లాభం ఉంటుందో వారు చేస్తారు"

"అర్థం లేకుండా మాట్లాడకు. నువ్వు పోతే ఎవరికి లాభం?"

"నేను పోతే ఈ ఆస్థి ఎవరికి వస్తుంది?" అన్నాడు తాపీగా. భయం స్థానంలో చిరాకు చోటు చేసుకుంది.

"ఇలా అంటున్నందుకు ఏమీ అనుకోకు. మంచి సైక్రియాటిస్టుకు చూపించుకో" తొందరపడి అనేసాను. ఆ మాటకి ప్రకాష్‌కి కోపం వస్తుందనుకున్నాను. కానీ అతని మొహంలో కోపం ఛాయలు కనపడలేదు.

"నువ్వు నమ్మవు. నాకు తెలుసు" అన్నాడు నిట్టూర్చి.

"ఎలా నమ్మమంటావు, ఎక్కడైనా నా భార్య భర్తను చంపుకుంటుందా! అది అలా ఉంచు. హత్యచేసి చేతులు దులుపుకుని వెళ్ళిపోవడానికి ఇదేమైనా అడవా. పోలీసులు చూస్తూ ఊరుకుంటారా?"

"నువ్వు అమాయకుడివి అని తెలుసుకానీ మరీ ఇంత అనుకోలేదు" అన్నాడు. నాకు కోపం వచ్చినా తమాయించుకున్నాను.

"ఇంటి దొంగల్నే కాదు హంతకులని కూడా పట్టుకోలేం. నాకు కరెంట్ షాక్ కొట్టడం ప్రమాదం కాదు అని నేనే స్వయంగా చెప్పినా నువ్వు నమ్మలేకపోతున్నావు. ఒకవేళ అదే ప్రయత్నంలో నేను పోయాననుకో ప్రపంచానికి అది ప్రమాదం అవుతుంది తప్ప హత్యకాదు"

"ఇలాంటి పనులు చేసి తప్పించుకున్న మగవాళ్ళు లోకానికి కొత్తకాదు. కానీ ఒక ఆడది" తల అడ్డంగా ఊపాను.

"అదే నేను చెబుతున్నది. మీ నమ్మకమే తనకి రక్ష. రాత్రి నేను మామూలుగా భోజనం చేసి పడుకుంటాను. తెల్లవారుతూనే నీకో, మరొకరికో ఫోనొస్తుంది. 'ఆయన ఎంతలేపినా లేవట్లేదు. నాకు భయం వేస్తోంది' అని ఖంగారుగా అంటుంది."

"రాత్రి లేటుగా ఇంటికి వచ్చారు. భోజనం చేసి టీ.వీ చూస్తూ కూర్చున్నారు. నాకు నిద్రవచ్చి పడుకుండిపోయాను. ఆయన ఎప్పుడు వచ్చిపడుకున్నారో కూడా తెలియదు. పొద్దున్న లేచి చూసేసరికి.." అని వచ్చిన వాళ్ళందరి దగ్గరా కన్నీళ్ళ రికార్డు వేస్తుంది. ఇందులో నిజం ఎంతుంది అని ఆలోచించే తీరికగానీ, అవసరంగానీ ఎవరికుంది. నాకేమైన ఒక అన్న, తమ్ముడా, దగ్గర చుట్టమా ప్రశ్నించడానికి ఎవరున్నారని. విని నిట్టూర్చి ఎవరిదారిన వారు పోతారు. నీలాంటివాళ్ళు మహా అయితే స్మశానం వరకూ వస్తారు. దహనకాండతో సాక్ష్యాలు మటుమాయం" అన్నాడు ఆవేశంగా.

నాకు ఒళ్ళు జలదరించింది. నా ప్రపంచంవేరు. అక్కడ భార్య, పిల్లలు, ఉద్యోగం, ఇంటిపనులు, పిల్లల చదువులు, అపుడపుడు అప్పులు, చిన్న చిన్న సరదాలు, పెద్ద పెద్ద ఆశలు, అంతలోనే నిరాశలు అంతేగానీ ఇదేమిటి అనుమానాలు. పథకాలు. హత్యలు.

"ఇక భార్య భర్తని ఎందుకు చంపుకుంటుంది అన్నావు కదూ. నీకు కొంత చెప్పాలి. తనని ఒక పార్టీలో చూసి నేను ఇష్టపడటం నీకు తెలుసుకదా" అన్నాడు. తలూపాను.

"అప్పుడు నేను మా బాబాయ్ చేత వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడించాను. అదే నేను చేసిన తప్పు. నేనే తనను డైరెక్ట్‌గా అడిగివుంటే తనకి నేనంటే ఇష్టంలేదని తెలిసి ఉండేది. ఆమె తల్లితండ్రులు తనని బలవంతంగా ఒప్పించారని నాకు అప్పట్లో తెలియదు. బహుశా రమేష్ పరిచయం కాకపోయుంటే ఆమె చాలామంది ఆడవాళ్ళలా నన్ను ప్రేమించడానికి కనీసం భరించడానికి అలవాటు పడుండేదేమో" అని ఆగాడు. ఇది నిజమే. ఆమె కజిన్ నాకు బాగా తెలుసు. అతని ద్వారా అయిష్టంగానే ఆమె ఈ పెళ్ళి చేసుకుందని తెలిసింది.

నేను అందవికారుణ్ణి కాకపోవచ్చు. కానీ తన ముందు దివిటీనే. నా వ్యాపారాల్లో, సరదాల్లో పడి తనని నిర్లక్ష్యం చెయ్యడం కూడా నిజమే. నా తప్పుని నేను గ్రహించేలోగానే చేతులు కాలాయి" అని నిట్టూర్చాడు.

"తనకి అంతగా ఇష్టం లేకపోతే విడిపోతుంది. అంతేగానీ ఈ పథకాలు, హత్యలు .... నీ ఆలోచనలు తప్పు" అన్నాను స్థిరంగా.

"విడిపోయి ఇంత ఆస్థిని చేజార్చుకుంటుందా ఏ మూర్ఖురాలైనా?" అన్నాడు నేను లేచాను.

"నీతో చాలా చెప్పాలి. ప్లీజ్ కొద్దిసేపు కూర్చో. నా మనస్సులోని భారం తీర్చుకోనీ. నమ్మొద్దు. కనీసం విను" అన్నాడు అభ్యర్ధనగా. ఎప్పుడూ కమాండింగ్‌గా మాట్లాడే ప్రకాష్ అలా అనేసరికి కాదనలేక కూర్చున్నాను. కొద్దిసేపు మౌనంగా ఉండి "మొన్న జరిగిన ఎలక్షన్లలో ఓటుకి రెండువందలు ఇచ్చారట కదా తీసుకున్నావా?" అన్నాడు అసందర్భంగా.

"ఆ గొడవ ఇప్పుడు ఎందుకు అయినా నా సంగతి నీకు తెలియదా?"

"నిజమే రెండు వందలు తీసుకోవు ఒప్పుకుంటాను. అదే రెండు వేలు ఇస్తే?"

"ఎంత ఇచ్చినా సరే నా మాట మారదు" ఖచ్చితంగా అన్నాను.

"మరీ అలా అనెయ్యకు. ఓటుకి ఇరవైవేలు ఇచ్చారనుకో"

"ఎవరైనా అంత డబ్బు ఇస్తారా?" అన్నాను చిరాకుగా.

"అంత మొత్తం ఎవరూ ఇవ్వరు కనుక నువ్వు అమ్ముడుపోవు. అంటే నువ్వు ఆశించే లేదా అమ్ముడుపోయే మొత్తంకన్నా వాళ్ళు ఇవ్వజూపేది చాలా తక్కువగా ఉండటం వలన నువ్వు, నీలాంటి వాళ్ళు నిజాయితీపరులుగా మిగిలిపోతున్నారు" అన్నాడు.

నేను ఆవేశాన్ని బలవంతంగా అణుచుకున్నాను.

"ఇది నిన్ను అవమానించడానికి అనడం లేదు. నువ్వు అమ్ముడుపోవడానికి ఒక రేటు ఉంటే నాకు వేరే రేటు ఉంటుంది. అమ్ముడుపోవడం మాత్రం ఖాయం. ఇరవై వేలకి నువ్వు మనస్సును చంపుకుంటే ఇన్ని కోట్ల ఆస్థికోసం తను నన్ను చంపాలి అనుకోవడంలో ఆశ్చర్యం ఏముంది?"

"నువ్వు చెప్పిన దాంట్లో లాజిక్ లేదు. నీ భార్యగా తను ఇప్పుడు కోటీశ్వరురాలేగా"

"రమేష్ కావాలంటే ఆస్థి ఉండదు. ఆస్థి కావాలంటే రమేష్ ఉండడు. రెండూ కావాలంటే నేను ఉండకూడదు. ఇంత పథకం తను ఒక్కర్తే వేసిందని నేనూ అనుకోను" అని కొద్దిసేపు ఆగి టీ కప్పుని మళ్ళీ చేతుల్లోకి తీసుకుని "చల్లారిపోయిందని తాగలేదు అనుకుంటున్నావు కదూ. నేను తాగకపోవడం వలనే చల్లారిపోయింది. ఇదికాస్తా తాగేస్తే అందరి సమస్య తీరిపోతుంది" అన్నాడు. నాకు అర్థం కాలేదు.

"నా భార్య బయటకు వెళ్ళేముందు మరీ మరీ చెప్పింది మరచిపోకుండా తాగమని"

"ఎందుకు ఇదంతా చెబుతున్నావు?"

"ఇంకా అర్థంకాలేదా. ఇదే రెండవ ప్రయత్నం" అన్నాడు.

"నిజమా నీకు ఎలా తెలుసు?" ఆశ్చర్యంగా అన్నాను.

"నా ఏర్పాట్లు నాకు ఉన్నాయి" అన్నాడు గుంభనంగా

"నువ్వు ఎన్ని చెప్పు. నేను ఇదంతా నమ్మను. టీలో ఏదో కలిపారనేగా నీ అనుమానం. అది ఇలా ఇవ్వు. నేను తాగి తాగి చూపిస్తా"

"మధ్యలో నువ్వు ఎందుకు చావడం. ఈ పరిస్థితికి కారణం నేను, నేనే తాగుతా. నేనుపోతే అప్పుడైనా నమ్ముతావా లేక అప్పుడు కూడా నేనే విషం కలుపుకున్నాను అంటావా?" అన్నాడు ఆవేదనగా. నేను నోటమాట రాక అలాగే ఉండిపోయాను.

"నువ్వు అన్నట్టు ఇదంతా అబద్ధమైతే ఎంత బాగుండును అని ఒకోసారి అనిపిస్తుంది. ఇంత సంఘర్షణ ఎందుకు తాగేస్తే పోలా అని మరోసారి అనిపిస్తుంది" అన్నాడు. కొద్దిసేపు మౌనం.

"నీకు తెలుసుగా మా పేరెంట్స్ నా చిన్నప్పుడే పోయారు. నన్ను పెంచిన బాబాయ్ ఈ మధ్యే పోయాడు. పిన్నికి నేను ఉన్నానో చచ్చానో కూడా అక్కరలేదు. నా భార్య తప్ప నాకు ఇంకెవరూ లేరు. తనని నేను ఎంతగా ప్రేమించానో కూడా నీకు తెలుసు. తనే నా మరణాన్ని కోరుకుంటుంటే నేను ఎవరికోసం బతకాలి? బతికి ఏం సాధించాలి?" అన్నాడు. ప్రకాష్ కళ్ళల్లో నీళ్ళు చూసి నేను చలించిపోయాను.

డిగ్రీలో మేం ఇద్దరం క్లాస్‌మేట్స్. ఆ కాలేజ్ రోజుల్లోనే ఎంత దర్జాగా ఉండేవాడని. ఎవర్నీ లెక్క చేసేవాడు కాదు. ఫ్రెండ్స్, సినిమాలు, పార్టీలు ఇదే జీవితం అన్నట్లు ఉండేవాడు. ఎవరికైనా డబ్బు అవసరమైతే ఠక్కున తీసి ఇచ్చేవాడు. మా కళ్ళకి అతనొక

రాకుమారుడే అలాంటివాడు ఈ రోజు సర్వం కోల్పోయినవాడిలా నిస్సహాయంగా చావుని ఆహ్వానిస్తున్నాడంటే మనసుని ఎవరో కెలికేసినట్టయిపోయింది. నేను వెళ్ళి అతని పక్కన కూర్చుని అతని చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను.

"నువ్వు ఇందాక అన్నావు చూడు నీకేమిటి అదృష్టవంతుడివి అని. నిజానికి నేను కాదురా నువ్వు అదృష్టవంతుడివి. నువ్వు ఒక చీర కొని తీసుకువెళితే నీ భార్య సంతోషిస్తుంది. క్రికెట్ బ్యాట్ కొనిస్తే నీ కొడుకు సంతోషిస్తాడు. వాళ్ళ ప్రేమైనా, అలకైనా స్వచ్ఛంగా నీకు కనబడుతుంది. నాకు ఆ అవకాశం లేదు. నన్ను అందరూ ప్రేమిస్తారు. ఎవరు నన్ను నన్నుగా ప్రేమిస్తున్నారో ఎవరు నా డబ్బుని చూసి ప్రేమిస్తున్నారో చెప్పలేం"

"పరిస్థితి ఇంతదాకా వచ్చాక విడిపోవచ్చుగా?"

"దానికి తను ఒప్పుకోవడంలేదు. చెప్పుకోవడానికి కారణాలూ లేవు. చూపించడానికి ఆధారాలు లేవు అన్నట్టు తయారైంది నా పరిస్థితి"

"ఇంతకన్నా పెద్ద ఆధారం ఏం కావాలి. టీలో విషం కలిపిందని పోలీస్ రిపోర్టు ఇవ్వచ్చుగా?"

"ఆ విషం నేనే కలుపుకున్నానని అంటుంది. స్నేహితుడివి నిన్ను నమ్మించడానికే ఇంత కష్టమైంది. ఇక బయటివాళ్ళను ఎలా నమ్మించగలను. ఈలోగా నాకు మతి భ్రమించిందని ప్రచారం చేస్తుంది. దానిని మాత్రం అందరూ తేలికగా నమ్మేస్తారు. ఇందాక నువ్వే అన్నావుగా సైక్రియాటిస్టుని కలవమని" అని ఏదో వింటున్నట్టు మొహం పెట్టాడు. బయట బైక్ వచ్చి ఆగిన చప్పుడు వినిపించింది. కొద్దిసేపటికి కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరై ఉంటారు?"

"ఇంకెవరు. తనే. నేను ఈ పాటికి చచ్చి ఉంటానని అనుకుంటుంది. నేనే వెళ్ళి తలుపు తీస్తే గుండె ఆగి చస్తుంది. నువ్వు తలుపు తియ్యి" అన్నాడు. నేను వెళ్ళి తలుపు తీసాను. నన్ను చూసి నిర్ఘాంతపోయింది.

"మీరు ఎప్పుడు వచ్చారు?"

"చాలా సేపయింది" అని పక్కకి తప్పుకున్నాను. ఆమె లోపలికి అడుగుపెట్టి భర్తకేసి చూసింది. ప్రకాష్ ఆమె వైపు నిర్లక్ష్యంగా చూసాడు. ఆమె ప్రకాష్ వైపు నాలుగు అడుగులు వేసి "టీ తాగలేదా?" అంది సీరియస్‌గా.

"లేదు" నిర్లక్ష్యంగా అన్నాడు.

"ఎందుకు తాగలేదు?"

"కారణం నీకు తెలుసు"

"అంటే మీ ఉద్దేశ్యం?" తీవ్రంగా అంది. కోపంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. ఆవేశం ఆమె అందాన్ని మింగేసింది. పూనకం వచ్చిన దానిలా ఉంది. అలా ఆమెని చూడటానికి నాకే భయం వేసింది. వాడిని పీక పిసికి చంపెయ్యదు కదా. అంతపని చేసాక సాక్షిని వదులుతుందా. వాడికోసం రెండు చేతులూ ఉపయోగించాలి. నా ప్రాణానికి ఒక చెయ్యి చాలు. ఒక్క దూకు దూకి పారిపోవాలని అనిపించింది. కానీ కాళ్ళు సహకరించలేదు. ప్రకాష్ మాత్రం తగ్గలేదు. రొమ్ము విరుచుకుని నుంచున్నాడు.

ఆమె గబగబా వెళ్ళి టీ గ్లాసుని చేతుల్లోకి తీసుకుంది. ప్రకాష్ ముక్కు మూసి బలవంతంగా టీ నోట్లో పోసెయ్యదుకదా అనుకుంటూ భయం భయంగా చూస్తుండిపోయాను. ఆమె టీ తాగేసి విసురుగా లోపలకు వెళ్ళిపోయింది!!!!

# తాతయ్యలు - తకరారు డా.మూలా రవికుమార్

"అవునూ, విజినారం తాతని చూస్తే, తాత ఎందుకంతలా మొహం మాడ్చుకుంటారమ్మా? విజినారంతాతమాత్రం తాతని ఎప్పుడూ బావగారూ అని మామూలుగా పలకరిస్తారు." పదేళ్ళ చింటూ, వాళ్ళమ్మని అడిగాడు. ఒకటే, ఇద్దరూ ముభావంగాఉండాలి, లేదా ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకోవాలి కదా, అన్నది చింటూసందేహం. అమ్మ వచ్చేనవ్వు ఆపుకుంది. నాన్న మొహం మాడ్చుకున్నారు. విజినారం తాతయ్య అంటే చింటూ మాతామహుడు. ఆయన విజయనగరంలో ఉంటారు. తాత అంటే చింటూపితామహుడు. వీళ్ళతోపాటే ఉంటారు.

"దీనికి మీరుకూడా మొహం మాడ్చుకోవాలా? అదేమైనా కావాలని జరిగిందా? ఐనా అప్పటికి, మీనాన్నా, మానాన్నా కనీసం వియ్యమందుదామన్న ఆలోచనలో కూడా లేరుకదా!?" అమ్మ సంజాయిషీకి, నాన్న రాజీపడ్డట్టు కనిపించినా, మొహం పైకెత్తలేదు. చింటూ మరింత గందరగోళంలో పడ్డాడు.

ఇదివరకు విజినారంతాత మామూలుగా ఉండగా, తాత మొహం మరింతమాడిన సందర్భాలు గుర్తుచేసుకున్నాడు. ఒకసారి అందరూ ఉండగా, తాత మందులోకి తేనె తీసుకెళ్ళటానికి అమ్మ జంకుతూ ఉండాగా, చింటూ (తెలియక) చెంచాతో తేనెతీసుకెళ్ళి 'తాతయ్యా తేనె' అనగానే, తాతయ్య అందరివంకా చూడటం, అందరూ మొహాలు పక్కకి తిప్పుకోవటం, వెంఠనే తాతయ్య, చెంచాడు తేనెనీ పారబొయ్యటం జరిగాయి.

ఇంకోసారి, చింటూ నీళ్ళుతాగుతుండగా, పొరపాటున పక్కనే కూర్చొన్న చెల్లిమీద నీళ్ళుపడ్డాయి. అది అన్నయ్యను దెబ్బలాడుతూ ఉంటే, మిగిలినవాళ్ళు తగువుతీర్చటనికి ప్రయత్నిస్తూ ఉండగా తాతయ్య వీళ్ళగదిలోకి రావటం, తాతయ్యను చూసి అందరూ మాటలు ఆపటం, చెల్లి చేసిన ఆరోపణలూ, చింటూ ఇచ్చిన సంజాయిషీ వినగానే, అందరూ ఏదోపని ఉన్నట్టు, మొహాలు తిప్పుకోవటం, విజినారం తాత వేరే గదిలోకి వెళ్ళిపోవటం, తాతయ్య మళ్ళీ మొహం మాడ్చుకోవటం, ఈ ప్రక్రియలో చెల్లి తిట్లు ఆపటం జరిగేయి.

ఈరోజు సంభాషణతో ఒక్కవిషయం అర్థమయ్యింది. ఇద్దరు తాతయ్యలకీ మధ్య ఏదో జరిగింది. అదికూడా, అమ్మానాన్నలకు పెళ్ళి సంబంధం కుదరకముందే జరిగింది. ఏం జరిగిందో ఎవరు చెప్పగలరు? అప్పటికీ కొన్నాళ్ళక్రితం ఒకసారి అమ్మమ్మని ఈవిషయం అడిగేడు. 'నీకు ఇద్దరూ తాతయ్యలే. వాళ్ళిద్దరూ ఎలా ఉన్నా నీకనవసరం. వెళ్ళి చదువుకో' అని కోపంగా అంది. ఎప్పుడూ సరదాగా కబుర్లు చెప్పే అమ్మమ్మ అలా కోపంగా మాట్లేదేసరికి ఇంకెవర్నడగాలో అర్థం కాలేదు.

ఆరోజు రాత్రి విజినారంతాతనుంచి ఫోన్. ఆయన సహోద్యోగి ఈఊరు, తనకూతురింటికి, వస్తున్నాడనీ, వీలైతే వెళ్ళి కలవమనీ. అలా వచ్చిన సహోద్యోగిపేరు, సుబ్బారావు, ఎలియాస్ సుబ్బుతాత. విజినారంతాతలానేమంచి చమత్కారి. "సుబ్బుతాతగారూ కథలు చెప్పండి." అని అడిగే చింటూని, 'గారూ' ఏమిట్రా అని దెబ్బలాడి, బలవంతపెట్టి, "సుబ్బుతాతా కథలు చెప్పు." అనే వరకూ నిద్రపోని మనిషి. అలాంటి సుబ్బుతాతయ్య, ఈరోజు వస్తున్నాడని తెలియగానే, ఇద్దరు తాతయ్యల మధ్య ఉన్న దశాబ్దాల కోల్డ్ వార్ గురించి ఏమైనా తెలుస్తుందని అనిపించింది. అదీకాక, సుబ్బుతాత కూడా, తాతకు అపోజిషనే కనుక (కాకపోతే ఇంటికే వచ్చేవాడుకదా?) తనకు తెలిసిన మేరకు చెప్పే అవకాశం ఉందనిపించింది.

మర్నాడు సాయంత్రం అమ్మతోపాటు సుబ్బుతాత దగ్గరికి వెళ్ళేడు. అమ్మేమో సుబ్బుతాతా వాళ్ళమ్మాయితో లోపలిగదిలో కబుర్లు మొదలెట్టగానే, హాల్లో కూర్చున్న సుబ్బుతాతని విషయం అడిగేడు. "డాబామీద గదిలోకి వెళ్ళిమాట్లాడుకుందాంరా. ఇక్కడైతే మధ్యలో మీ అమ్మవచ్చి, నిన్ను కోపంగానూ, నన్ను మెత్తగానూ కసురుతుంది." అన్నాడు సుబ్బుతాత. చింటూకైతే మరోక్షణంలో నిధి రహస్యం తెలిసేటప్పటి ఆనందం, ఆతృత కలిగాయి. రెండునిమిషాల్లో ఇద్దరూ మేడమీద గదిలోకెళ్ళిపోయారు.

సుబ్బుతాత ఉవాచా. కథా ప్రారంభః.

"మీఅమ్మకూడా పెళ్ళైన కొత్తలో విషయం తెలియక, తేనెవిషయంలో ఒకసారి, ఇంకోసారి మీనాన్నమీద నీళ్ళు పొరపాటున ఒలకబోసి, కోప్పడుతున్న మీనాన్నని సమాధానపరచే ప్రయత్నంలో ఉండగా వాళ్ళమధ్యకు వచ్చిన మీతాత మొహం మాడ్చుకోవటం చూసింది. విషయం తెలీక నన్నడిగింది."

"వినాయకచవితి కథాప్రభావంనుండి బయటపడి త్వరగా చెప్పు తాతయ్యా." చింటూ విసుగ్గా అడిగేడు.

"వినాయకచవితి కథ ఏమిట్రోయ్?"

"అందులో సూతుణ్ణి, శౌనకాదిమునులు అడిగిన సందేహాలకు సూతుడు నేరుగా సమాధానం చెప్పకుండా, పూర్వం, ఇదేప్రశ్న ధర్మరాజు నారదుణ్ణడిగాడనీ, నారదుడుకూడా ధర్మరాజుతో నేరుగా సమాధానం చెప్పకుండా పూర్వం కైలాసంలో కొలువుతీరిన ఈశ్వరుణ్ణి, కుమారస్వామి ఇదే ప్రశ్న అడుగగా... అంటూ మొదలౌతుందికదా, అలా అన్నమాట."

"సరిగ్గా గుర్తు చేసేవ్. ముందే విషయం చెప్పేస్తే నాకూ మజా ఉండదు. ఎలాగో మీ అమ్మ మాటల్లోంచి బయటపడేసరికి ఓగంట పడుతుంది కదా." సుబ్బుతాత చెప్పటంతో ఇంక తప్పదన్నట్టు వినసాగాడు.

"ఇప్పటికి పదిహేనేళ్ళక్రితం, నేనూ మీవిజినారంతాతా మరో రెండేళ్లలో రిటైరవుతామనగా, మీ అమ్మకి సంబందాలు చూట్టం మొదలెట్టేం. మధ్యవర్తుల్ద్వారా తెలిసిన సంబంధానికి పెళ్ళి చూపులకు మీనాన్న, అప్పటికే పెళ్ళైన మీ మేనత్త, మీ నానమ్మ వచ్చారు. మీతాత ఎక్కడో ఆడిట్ ఉండటంతో రాలేకపోయాడు. కట్నకానుకల విషయాలేవీ పెళ్ళిచూపుల్లో ప్రస్తావించవద్దని తనతరపువాళ్ళందరికీ గట్టిగానే చెప్పాడు. ఎంతైనా పెళ్ళికొడుకు బేంక్ఆఫీసరు, తను గవర్నమెంటు ఆడిటరు కదా! పెళ్ళిచూపులు అయిన తరువాత, కట్నకానుకలు మాటలకు కబురు పెట్టినప్పుడు, నాకూ మీ విజినారంతాతకీ కలెక్టరాఫీసులో స్పెషల్ డ్యూటీ వేసారు. మాకు పెర్మిషన్ ఇవ్వాల్సిన బాసు, ఎడం చేతికి గ్లూకోజ్ ఎక్కించుకుంటూ, కుడిచేత్తో సంతకాలు పెడుతున్నాడు. నాలాంటి క్లర్కూ, ఎటెండరూ, ఫైళ్ళు చదవటంలో ఆయనకు సహకరిస్తున్నారు. మేం పెర్మిషన్ అడక్కుండానే వెనక్కి వచ్చేసి, పెళ్ళిమాటలు వాయిదా వేయొద్దని, మీ తాత, తన శక్తిసామర్ధ్యాలు తనతరపున కూర్చొనే వాళ్ళకు చెప్పారు. పెళ్ళిచూపులకొచినవాళ్ళకి మీ అమ్మ అద్భుతంగా నచ్చటం, జాతకాలు బ్రహ్మాండంగా కలవటం, మీనాన్నకు అడగుదామనుకున్న కట్నం, మేమిద్దామనుకున్నదానికంటా తక్కువ అవటం, ఇవన్నీ కలిసి, పెళ్ళిమాటల్ని పావుగంటలో తేల్చి, వారంలో నిశ్చితార్ధానికి దారితీసాయి. అంటే నిశ్చితార్ధం వరకూ, వియ్యంకులిద్దరూ ఎదురుపడటం జరగలేదు."

"అబ్బా ఇవన్నీ నాకెందుకు తాతా?" చింటూ విసుగ్గా అడిగేడు.

"ఎందుకంటే, పెళ్ళిచూపులకి మీతాత వచ్చినా, పెళ్ళిమాటలకి మీ విజినారంతాత వచ్చినా, ఇద్దరూ ఎదురుపడి వియ్యం రద్దయ్యేదికాబట్టి."

"సరే. తర్వాత?"

"నిశ్చితార్థంలో వియ్యంకులిద్దరినీ ఎదురుపెట్టగానే, మీ విజినారంతాత, కాబోయే వియ్యంకుడితో, మీరు పదేళ్ళక్రితం పార్వతీపురం దగ్గర ఆడిట్‌కి వచ్చారా? అని అడిగారు"

"అవును. మీకెలా తెలుసు?" అని మీ తాత అప్పటికే మొహం చిట్లించగా, నేను కల్పించుకొని, "అప్పటి సూపర్నెంటు వీరేనండీ, నేను అప్పటి జూనియరసిస్టెంటునండీ." అన్నాను.

"ఆమర్యాదలయిపోయాయి. ఈమర్యాదలు మిగిలిపోయాయి," అని మొహం తిప్పుకున్నాడు, మీతాత.

"ఏమైంది బావా?" అంటూ, మీ నానమ్మా వాళ్ళ అన్నదమ్ములు, చుట్టుముట్టినా విషయం చెప్పకుండా, "ఏమైనా ఇప్పుడు నాచేతులో ఏముంది? నిశ్చితార్థం కానివ్వండి," అన్నాడు ముభావంగానే.

పెళ్ళికొడుకు తండ్రికీ, పెళ్ళికూతురి తండ్రికీ ఏదో పూర్వపరిచయం ఉందనీ, అదికూడా పెళ్ళికొడుకు తండ్రికి చేదుజ్ఞాపకమనీ అందరికీ అర్థం అయినా, ఈవిషయం అందరూ వదిలేసి నిశ్చితార్థం కానిచ్చేసాం. విషయం తెలిసిన నేనూ, మీనాన్నా ఎవరికీ, ఆఖరకు మీ అమ్మకీ,, అమ్మమ్మకీ కూడా, చెప్పకూడదని అనుకున్నాం.

"ఆ తర్వాత?"

"పెళ్ళిలో కూడా మీతాతయ్య ధుమధుమలాడుతూనే ఉన్నాడు. పెళ్ళివారి మర్యాదలన్నీ, మీతాత తప్ప మిగిలినమగపెళ్ళివాళ్ళందరూ అందుకున్నారు. మీ అమ్మమ్మా, తాతయ్యా వియ్యంకుడి అలకకు నొచ్చుకుంటూ ఉంటే, మగపెళ్ళివారంతా వెళ్ళి, 'వీడింతే, మీరు యదావిధిగా కార్యక్రమం ముగించెయ్యండి, వీడి సంగతి మేం చుసుకుంటాం' అన్నారు. పెళ్ళిమధ్యలో పురోహితుడు పంచామృతాలు కలపటానికి తేనె దొరకలేదని అన్నప్పుడు, మీ తాత మళ్ళీ మొహం గంటుపెట్టుకున్నాడు. అలాగే, ఇంకోఘట్టంలో పురోహితుడు, ఒకచేత్తో రాగిచెంబుతో నీళ్ళు పట్టుకొని, అందులో తమలపాకుముంచి, సంప్రోక్షణ చేస్తూ, పొరపాటున ఈచేతికిబదులు ఆచేతిని విదిలించటంతో చెంబుడు నీళ్ళలో తడిసిన పెళ్ళికొడుకు తండ్రిని చూసి పదేళ్ళలోపుపిల్లలు నవ్వారు. పురోహితుడు కుడిచేయికిబదులు ఎడంచెయ్యి విదిలించినందుకు లెంపలేసుకున్నాడు. అతణ్ణి తెచ్చుకున్నది కూడా మగపెళ్ళివారే కావటంతో, ఆడపెళ్ళివారిని తప్పుపట్టటానికేమీలేకపోయింది. దిగ్గునలేవబోతున్న మీతాతను, మిగిలిన మొగపెళ్ళివారంతా బలవంతంగా కుర్చోబెట్టి, పూజమధ్యలో లేవకూడదని చెప్పి, తడిసిన బట్టలతో లాంచనం పూర్తయ్యాకా, బట్టలు మార్చుకోనిచ్చారు."

"ఆ తరువాత నేను ఏదో విషయమై మగపెళ్ళివారి విడిదికి వెళ్ళినప్పుడు, పేకాటలోకూర్చొన్న మిగిలిన వాళ్ళు, నన్ను బలవంతపెట్టి, అసలువిషయం చెప్పమన్నారు. నేను ఎంతకీ చెప్పకపోవటంతో మీ నానమ్మా వాళ్ళ అన్నయ్య నాతో, 'మాబావ అలగటం మాకు కొత్తకాదు. తనపెళ్ళైనకొత్తలో సంక్రాంతికి మాఇంటికి వచ్చినపుడు, మేం పెట్టిన పేంటు కొంచెం పొడవైంది. టైలరు ఎంతబిజీగా ఉన్నా కొత్తల్లుడు కదాని, ఒకటికి నాలుగుసార్లు వెళ్ళిపిలిస్తే వచ్చాడు. పేంటునీ ఈయన్నీ చూసి, మరోసారి కొలిచి, పేంటు మడతపెట్టి తీసుకెళుతూ, 'పొడవైన కాళ్ళు తెగ్గొట్టేద్దాంలెండి' అన్నాడు, తేలిగ్గా. విషయం మేం మరచిపోయినా, గంటతరువాత టైలరుదగ్గరకెళ్ళి మేం తెచ్చిన పేంటు కట్టుకోకుండా అలిగేడు. విషయం ఎంతకీ చెప్పకపోవడంతో మాచెల్లిచేత అడిగించాం. టైలరు కాళ్ళు తెగ్గొట్టేద్దాం అన్నందుకు అలిగాడట. మేం అంటే లెంపలేసుకునో, సారీ చెప్పో సముదాయించగలం గానీ, టైలరుచేత ఏం చెప్పించగలం. అప్పటినుంచి ఇప్పటివరకూ, మాచెల్లికీ, పిల్లలికీ బట్టలుపెట్టి, ఈయనబట్టలకి డబ్బు ఇవ్వడమే గానీ, మానుంచి బట్టలు తీసుకోనని భీష్మించుక్కూర్చొన్నాడు.

"అలా మీతాతా వాళ్ళ బావమరిది గతం చెప్పి, వాతావరణం తేలికపరచేసరికి నేను మెత్తబడి విషయం చెప్పేను. ఆవిషయాన్నే పెళ్ళైన రెండేళ్లకు మీవిజినారంతాత మీఅమ్మమ్మకీ, ఆవిడ మీ అమ్మకీ చెప్పటం, మీనాన్న తనమేనమామలద్వారా విషయం తెలుసుకొని, మొహం గంటు పెట్టుకోవాలో, నవ్వుకొని వదిలెయ్యాలో తెలీక సతమతమవటం, గత దశాబ్ద చరిత్ర"

"ఇప్పటికైనా సస్పెన్స్ ఆపుతావా, సుబ్బుతాతా?"

"ఇప్పుడు అసలు వృత్తాంతం. అది పంతొమ్మిదివందల ఎనబయ్యయిదు, సంక్రాంతికి నెలముందు. భయంకరమైన చలికాలం. నేనూ మీతాతా అప్పుడు, పార్వతీపురం ఏజెన్సీ ప్రాంతంలో చేసేవాళ్ళం. మీతాత ఆఫీస్ సూపరింటెండెంట్. అది మన తెలుగువాళ్ళనోట్లో 'సూపర్నెంటు'గా మారిపోయింది. నేను జూనియర్ అసిస్టెంటు. మేమక్కడ జాయినవకముందు ఏఆఫీసూ లేదు. రహదారులూ భవనాలశాఖలో అక్కడ ఒక అసిస్టెంట్ ఇంజనీరు కార్యాలయం తెరిచి, ఇంజనీరుకన్నా ముందు మమ్మలినిద్దరినీ పంపించి, ఎటెండెరుగా టెంపరరీగా ఎవరినైనా తీసుకోమని మాకు ఆదేశాలిచ్చారు. లోకల్ ఎమ్మెల్యే సిఫార్సుమేరకు, రొద్దన్నదొర (లోకల్ భాషలో రొద్దందొర) అనే నలబయ్యేళ్ళ నిరక్షరాస్య గిరిజన యువకుణ్ణి ఎటెండరుగా వేసేరు. అసిస్టెంటు ఇంజనీరు వచ్చాకా మా ఆఫీసుకి జీపు ఎలాట్ చేస్తామన్నారు పైవాళ్ళు.

ఒకరోజు మాకు ఆదేశం వచ్చింది. పద్దులతనిఖీశాఖ ఒకాయన్ని ఆడిట్‌కి పంపుతున్నదనీ, రికార్డులన్నీ సిద్ధంగా ఉంచమనీ, ఇనస్పెక్షన్ వారంపాటు సాగుతుందనీ దాని సారాంశం. మేం ఆశ్చర్యపోయాం. ఎందుకంటే, ఆర్నెల్లక్రితం కొత్తగా తెరిచి, ఆఫీసరు నియామకంలేక, ముఖ్యమంత్రిలేని సచివాలయంలా ఎదురుచూస్తున్నచోట, వారంరోజుల ఇనస్పెక్షనుకి ఏముందో అర్ధం కాలేదు. మాకు విషయం తెలిసేసరికి ఒకరోజే టైముంది.

మర్నాడు మీతాతను ఆఫీసులో ఉంచి, నేను పార్వతీపురం బయలుదేరాను. మధ్యాహ్నానికి బస్టాండులో ఆడిటరుగా వచ్చిన మీతాత, అక్కడున్న షరబత్తు బండివాణ్ణి, మాఆఫీసుగురించి అడుగుతూ ఉంటే, నేనే పలకరించి, షరబత్తు తాగినతరువాత, ఎద్దులబండి కట్టించి, మరో గంట తరువాత మా ఆఫీసుకి తీసుకెళ్ళాను.

సూపర్నెంటుగారూ ఆడిటరుగారూ పరిచయాలు చేసుకొన్నాకా, వాళ్ళిద్దరి మొహాలూ చూస్తే నాకెందుకో వీళ్ళిద్దరికీ జనజన్మల బంధమేదో ఉందనీ, అదికూడా ఉప్పూనిప్పూ లాంటిదనీ, ఈఆడిట్ తరువాత కూడా ఇదికొనసాగబోతోందనీ అనిపించి, నా ఎడంకన్ను అదిరింది. ఆపూట మాకోసం వండించుకున్నదే ఆయనకు కూడా పెట్టేం. రేపట్నించీ ఆడిట్ మొదలెడతానని చెప్పి, తనని విశ్రాంతికోసం గదికి పంపమన్నాడు. మీతాత, ఆఫీసులోనే ఓగది చూపించేరు.

"ఇక్కడా!!??"

"మేమిద్దరం ఇక్కడే ఉంటామండీ."

"ఎక్కడికెళ్ళినా ఆడిటర్లకోసం రూం తీసుకుంటారే."

"ఇక్కడకి నాలుగుమైళ్ళవతల గానీ లాడ్జీలు లేవు. అక్కడికీ ఇక్కడికీ రోజూ ఏవాహనమూ తిరగదు. మేంకూడా వారానికోసారే పార్వతీపురం వెళ్ళి, క్షవరం, కూరలు కొనుక్కోవటం లాంటివి చేస్తాం. ఈ వేసవి తరువాత, ఫేమిలీస్ తీసుకొచ్చేదాకా ఈ ఆఫీసు గదిలోనే మా మకాం."

"మరి మీకిచ్చిన ఫర్నీచరంతా వరండాలో ఉందేమిటీ?"

"ఇది స్థానిక జమిందార్లు రహదారి నౌకర్లకు కట్టించిన ఇరుకు ఇల్లు. రాజభరణాలరద్దు తరువాత ఈ కట్టడం ప్రభుత్వానిదైంది. పన్నెండేళ్ళు భూత్ బంగ్లాలా ఉన్నతరువాత ఆర్నెల్లక్రితం మాకొచ్చింది. పంపిన ఫర్నీచర్ ఏదీ ఈద్వారాల్లోంచీ దూరట్లేదు. అందుకని, వరండాలో పెట్టేం. రొద్దన్నదొర పగలూ రాత్రీ వరండాలోనే పడుక్కుంటాడు. ఇల్లు ఇక్కడికి అరమైలు లోపలే. మేం కూడా ఇందులో ఒకగదిలో రికార్డులూ, ఒకగదిలో వంటా, ఇంకోగదిలో పడకా. మీరున్నన్నాళ్ళూ, మేం వంటగదిలోకి మారి, మిమ్మల్ని విడిగా మా గదిలో ఉంచుతాం. మాతోపాటే వంటా వగైరాలూ." సూపర్నెంటుగారు కుండ బద్దలుకొట్టేసారు.

"మరిఫర్నిచర్ కోయించటమో, ద్వారం వెడల్పుచేయటమో చేయాలికదా?" ఆడిటరుగారు.

"ఇలాంటివి ప్రతిపాదించే అధికారాలుకూడా మాకులేవండీ. రెగ్యులర్ ఏఈగారొచ్చాకా వారి ప్రతిపాదనలను పైవాళ్ళు ఆమోదించాలి. ఇవేవీ లేకుండా మేం ఏంచేసినా ఆడిటర్లూరుకోరు. వాళ్ళివన్నీ అర్ధం చేసుకోరు." అని, నాలిక్కరుచుకున్నారు సూపర్నెంటుగారు.

"సరే సరే." అప్పటికి ఊరుకున్నారు, ఆడిటరుగారు.

సాయంత్రం టీ తాగుతుంటే, "టీ బావులేదు." ఆడిటరుగారు.

"మాకు ఆర్నెల్లగా అలవాటైపోయింది."

"రేపట్నించీ వేరేచోట తెప్పించండి. లేదంటే ప్రత్యేకంగా పెట్టించండి. ఉదయం కాఫీ కావాలి."

"ఇక్కడికి అరమైలు అవతల ఉన్న స్కూల్లో పిల్లలకి జంతికిచేగోడీలూ, మేష్టర్లకు టీలూ అమ్ముకుంటూ ఒకేఒక్క బక్కవ్యాపారి ఉన్నాడు. వాడు ఇచ్చినదితప్ప ఇంకోటి వీలుపడదు." సూపర్నెంటుగారి ధోరణికి ఆడిటరుగారు మొహం మాడ్చుకున్నారు.

ఓ గంటతరువాత సూపర్నెంటుగారు బయటికెళ్ళటం చూసి, నాతో అన్నాడు. "నేను పదేళ్ళగా కనీసం వంద ఆఫీసులు తిరిగుంటాను. ఆడిటర్లకు ఇంత అమర్యాద ఇంకెక్కడా లేదండీ."

"మీరు శివాలయం లాంటి ఆఫీసుకొచ్చేరు మరి." నేనన్నాను.

"శివాలయమేంటీ?"

"శివాలయంలో బూడిద తప్ప బోగాలుండవు. అదే వైష్ణవాలయంలో అయితే, చక్రపొంగలీ, వడలూ, పులిహోరా, దద్ధోజనం అన్నీ ఉంటాయి. మీరు గతంలో వెళ్ళిన ఆఫీసులన్నీ అలాంటివి. ఈ ఆఫీసుకూడా, మరో ఐదేళ్ళుపోయాకా, ఆఫీసరూ, జీపూ, కంట్రాక్టర్లూ, రోడ్లకోసం గేంగుమేన్లూ చేరి కళకళ్ళాడుతుంది. అప్పుడు మీ మర్యాదలన్నీ బాగా జరుగుతాయి."

రాత్రి బోజనం అయ్యాకా అన్నాడు. "ఇంత పెద్దదోమలు నేనెక్కడా చూడలేదండీ."

"ఈ ప్రాంతంలో ఇంతకన్నా చిన్నదోమలు మేమూ చూడలేదు." సూపర్నెంటు కౌంటర్.

మర్నాడు నేనూ సూపర్నెంటూ కలిసి మా ఆఫీసులో రికార్డులు ఆడిటరుగారికిచ్చేం. మొత్తం పదిలోపే ఉన్నాయి రికార్డులు.

"ఇవేనా?" ఆశ్చర్యపోయేడు.

"ఆర్నెల్ల వయసున్న ఆఫీసులో ఇంతకన్నా ఏముంటాయండీ. ఒకటి రిజిస్టరాఫ్ రిజిస్టరు. ఒకటి ట్రెజరీ బుక్. ఒకటి ఎటెండెన్సు, స్టాకూ, ఆఫీసు కంటింజెన్సీ (చిల్లరఖర్చూ) వగైరాలు." సూపర్నెంటు చెప్పారు.

పుస్తకాలన్నీ తిరగేసిచూస్తే, దేనిలోనూ పట్టుమని పదిపేజీలుకూడా నింపిలేవు. 'ఇందులో ఆడిట్ చేయటనికేముంది?', అని తనలో తాను గొణుక్కున్నట్టు అనుకున్నాడు. గట్టిగా అంటే మీతాత కౌంటర్ వేస్తాడన్న భయం వేసిననట్టుంది. ఎన్నిరికార్డులుంటే, ఆడిటర్లకు అంతపని. అందులో ఎన్నిపేజీలుంటే అంత మంచిది. దాన్నిబట్టే, ఆడిట్ చేయించుకొనే ఆఫీసువాళ్ళుచేసే మర్యాదలుంటాయి.

"మీరు ఆడిట్ చేసుకొండి. ఏవైనా సందేహాలుంటే, రొద్దన్నదొరతో మమ్మల్ని పిలిపించండి." అంటూ, మేమిద్దరం ఆఫీసుబయట చెట్టుకింద కూర్చున్నాం.

కాసేపటికి దారమ్మట ఒక మైదానప్రాంత గిరిజనుడు తాటాకు రేకల్లో తేనె పట్టుకొని వెళుతూ మా ఆఫీసుముందుకొచ్చి 'తేనండీ' అని అరిచాడు.

"రేక అంటే ఏంటి తాతయ్యా?"

"లేత తాటాకుని వెడల్పుచేసి, వంచి, రెండుకొనలూ కడితే, ఒక దొప్పలా తయారవుతుంది. రెండుమూడులీటర్ల నీటిని ఆపుతుంది. అప్పట్లో అక్కడ పల్లెల్లో, బావుల్లోంచీ నీళ్ళు తోడుకోవటానికి రేకలకి తాళ్లుకట్టి వాడేవారు. జాగ్రత్తగా వాడుకుంటే ఒకరేక నెల్లాళ్ళు వచ్చేది. వస్తుమార్పిడిలో దోసెడు బియ్యానికోరేక వచ్చేది. మాలాంటి ఉద్యోగులు అర్ధరూపాయికి కొనుక్కొనేవాళ్ళం. తేనెపట్టుని ఇందులో పెడితే, దానినుంచి కారే తేనె, కిందికి కారిపోకుండాఆపుతుంది. అమ్మేటప్పుడు, తేనెపట్టుని ఇందులోనే పిండి, కొలిచి అమ్మేవారు."

"మైదానప్రాంత గిరిజనుడంటే?" చింటూ మరో సందేహం

"అప్పట్లో పూర్తిగా అడవుల్లో ఉండే గిరిజనులకి అటవీఉత్పత్తులు డబ్బుకి అమ్ముకోవటం తెలీదు. వాటిని సంతలోకితెచ్చి, పావలా విలువచేసే అగ్గిపెట్టెకి, మూడు రూపాయలు విలువచేసే చింతపండు, అలాంటి అడివి ఉత్పత్తులిచ్చి, వస్తుమార్పిడితో గడిపే రోజులవి. మైదానప్రాంత గిరిజనులకు మాత్రం అటవీఉత్పత్తుల ఆర్థిక విలువ కొదిగా తెలుసు."

"సరే అప్పుడేమైంది?"

"కేకవిన్న ఆడిటర్ గారు, రొద్దన్నదొరతో తేనెవాణ్ణిపిలిపించేరు. రెండురేకల్లోనూ తేనె సుమారు నాలుగు కేజీలుంటుంది. కొంతసేపటి తరవాత రొద్దన్నదొర బైటికి వచ్చి, తేనెని వందరూపాయలకు బేరం చేసేరండీ. వందా మిమ్మల్ని ఇమ్మంటున్నారు అన్నాడు. అప్పట్లో మా ఇద్దరి నెలజీతాలూ వెయ్యిలోపే.

"ఇవ్వనన్నారని చెప్పు" సూపర్నెంటుగారు.

మరో అరనిమిషంలో, ఆడిటర్ గుమ్మంలోకొచ్చి, పోనీ ఒకరేకలోదానికి యాభై ఇవ్వండి అన్నాడు.

"అయ్యా ఆడిటరుగారూ, మీరున్నన్నాళ్ళూ, మీకేమీ ఖర్చుకాకుండా, మేం తినేది పెడతాం. మేమిద్దరం ఇరుకుగదిలో ఉండి, మీకొక్కరికీ విశాలమైన గది ఇస్తాం. అంతకుమించి మావల్లకాదు." సూపర్నెంటుగారు.

ఆడిటరు మొహం మాడ్చుకొని వెళ్ళిన అరక్షణంలో తేనెవాడి బూతులు వినపడ్డాయి. రొద్దన్నదొర వాణ్ణివారించబోతూ ఆడిటరు గొప్పతనం గురించి చెప్పబోతూ 'ఐదరాబాదునుంచొచ్చార్రా,' అన్నాడు.

గొప్పోడైతే వొల్లకాట్లోకి వెళ్ళమను (అసలు పదం వల్లకాడు కాదు, సెన్సారు చెయ్యదగ్గపదం) అంటూ ఆగొప్పతనం నెపంతో మరిన్ని బూతులు మొదలెట్టేడు. అసలు స్థానికయాసలో తిట్లు ఆడిటరుకర్థం కాక మామూలుగా ఉన్నా, వాటి అర్థం తెలిసిన రొద్దన్న, అలా తిట్టకూడదని వారించే ప్రయత్నంలో వాటి అర్థాలు మాక్కూడా తెలిసాయి. మొత్తానికి మేము లోపలికెళ్ళి, తేనెవాడికి సర్దిచెప్పి పంపించేం.

"బేరం చేసిన వస్తువును కొనకపోతే అంతకోపం ఎందుకొచ్చింది సుబ్బుతాతా?"

"మామూలుగా ఐతే రాదు. మేం డబ్బిస్తామన్న ఉద్దేశ్యంలో ఆయన సరిగ్గా బేరమాడకుండా మొత్తం నాలుగు కేజీలూ ఖాయపరచేసాడు. తేనె ఎప్పుడూ అరకేజీకి మించి కొనరు. పైఆఫీసర్లకీ బంధుమిత్రులకీ కానుకగా ఇద్దామనుకున్నాడో ఏమో. మేం డబ్బివ్వం అనేసరికి వెళ్లిపొమ్మన్నాడు. అమ్ముకొనేవాడికి, రోజంతా పార్వతీపురం పట్టణంలో తిరిగి, ఒక్కో ఇంట్లో ఐదేసిరూపాయల తేనె అమ్ముకుంటే సాయంత్రానికి అరవైరూపాయలొచ్చే తేనెకి ఒక్కచోటే వందరూపాయలనగానే కట్టుకున్న గాలిమేడలు కూలిపోయేసరికి అంతకోపం వచ్చింది."

"ఓహో. అప్పటినుంచీ ఈవిషయం తెలిసిన వాళ్ళెవరిముందైనా తేనె ప్రసక్తి వస్తే తాత అప్సెట్ అవుతున్నారన్నమాట. మరి నీళ్ళు మీదపడ్డప్పుడో?"

"తేనె సంఘటన జరిగినరోజు సాయంత్రం, ఆడిటరుగారు వెళ్ళిపోదామనుకున్నా, మేం ఐదురోజుల తర్వాత తారీఖుతో ఆడిట్ రిపోర్టుమీద సంతకం పెట్టేందుకు ముందుకు రాకపోవటంతో ఉదయం కొంతసేపు, సాయంత్రం కొంతసేపూ, రొడ్డన్నదొరతో కలిసి చిన్నచిన్న గ్రామాలు తిరుగుతూ గడిపారు.

"ఆడిటరు పొద్దున్నా సాయంత్రం విధిగా యోగా చేసేవాడు. అప్పటికి మాకు తెలిసిన యోగా, శవాసనమూ, పద్మాసనమే. కానీ ఆడిటరు, పద్మాసనంలో కూర్చొని భుజాలు సవ్యదిశలోనూ, తల అపసవ్యదిశలోనూ తిప్పగలిగినంతమేర తిప్పుతూ అష్టవంకర్లుపోతూ, శ్వాశలో బుసల్లాంటి శబ్దాలు చేసే, అనేక ఆసనాలు మాకు వింతగా అనిపించినా, మాకూ అతడికీ అంతంతమాత్రమే కావటంతో యోగా వివరాలు అడగలేదు.

"రేపు ఆడిటరు వెళ్ళిపోతారనగా ముందురోజు సాయంత్రం చిరుచీకటివేళ, మేం చిరుచలితో వరండాలో కూర్చొన్నాం. లోపలగదిలో యోగా జరుగుతోంది. వరండాలో నించున్న రొడ్డన్నదొరని లోపలికెళ్ళి సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తెమ్మన్నాం. లోపలేం జరిగిందో గానీ, ఆడిటరు కెవ్వున కేకలేస్తూ పరిగెత్తుకొని బయటకొచ్చారు. మేం గాబరా పడి లేచి చూస్తే ఆయన పైనుంచి కిందవరకు తడిసి నీళ్ళోడుతూ, కొంతకోపంతోనూ, కొంతచలితోనూ వణుకుతున్నాడు. వెనుక రొడ్డన్న భయంగా నిలబడ్డాడు. హుటాహుటిన నేను లోపలికెళ్ళి మాతువ్వాలు, పొడిలుంగీ తెచ్చివ్వబోయాను.

"ఏమిటండీ ఈఅవమానం? సూపర్నెంటుని కోపంగా, వణుకుతున్న గొంతుతో అని, నేనివ్వబోయిన గుడ్డల్ని తోసేసారు.

"ఏంజరిగిందండీ?" సూపర్నెంటు.

"తెలియనట్టడుగుతారేమిటి? యోగా చేసుకుంటున్న నామీద మీ ఎటెండరుచేత బాల్చీడు నీళ్ళుపొయ్యమని పురమాయించి, ఏమీ తెలీనట్టు మాట్లాడుతున్నారు."

మాకు విషయం కొంత అర్ధమయీ, కాకపోవడంతో, "ఏం జరిగింది రొడ్డన్నా?" అని అడిగేం.

రొడ్డన్న వాడిన పదాలు ఇప్పుడు చెప్పలేను గానీ, సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె తేవడానికి లోపలికెళ్ళిన రొడ్డన్నకి, చాపమీద పడుక్కొని మెలికలు తిరిగిపోతూ, ఎగశ్వాశ తీసుకుంటున్నట్టు కనిపించిన ఆడిటరుగారిచూసి, మూర్ఛరోగం వచ్చిందనుకొని, బకెట్టుడు నీళ్ళు పోసి, ఆయనకెవ్వుమనగానే హమ్మయ్య అనుకొని, ఆయన కోపం చూసి మళ్ళీ భయపడ్డాడు. విషయం, ఆడిటరుగారికి చెప్పి, యోగా అనే పదం గానీ, అదిచేసే విదం గాని, తెలీని అమాయకప్రాణి రొడ్డన్న అనీ, ఐనా అతడితరపున మేం క్షమాపణ చెబుతున్నామనీ చెప్పాకా, మేం ఇచ్చిన పొడి గుడ్డలు వాడారు. అప్పటి చలి అతడిచేత ఆపని చేయించింది గానీ, మానిర్దోషత్వాన్ని మాత్రం నమ్మినట్టు కనపడలేదు.

"మేం ఆ ఒక్కరోజూ ఉగ్గబట్టుకొని, ఆయనెళ్ళేకా తనివితీరా నవ్వుకున్నాం." సుబ్బుతాత కథ ముగించాడు.

నెలతర్వాత, నానమ్మ తేనెతెమ్మన్నా, తాతయ్య బాత్రూంకెళ్ళిన సమయం చూసి మరీ తేనె అందించిన చింటూని చూసి, 'అయ్యో వీడికీ తెలిసిపోయిందా!?' అని తలపట్టుకుంది.

*******

కథ వెనుక కథ

ఈ కథకు ప్రేరణ, వాస్తవ సంఘటనలే. మా పెదమామగారైన, శ్రీ వడ్డాది వెంకటరావుగారికి ఎదురైన అనుభవాలే. ఆయన 1985 ప్రాంతంలో రంపచోడవరంలో పనిచేసేటప్పుడు, అక్కడ ఆడిట్ చేయటానికి వచ్చిన ఆడిటరు తేనె బేరం చేయటం, వీళ్ళు డబ్బులివ్వకపోయేసరికి అతన్ని వెనక్కి పంపటం, మర్నాడు యోగా సమయంలో అమాయక గిరిజనుడు ఆడిటరు యోగాసనాలు చూసి, మూర్ఛ వచ్చిందంకొని నీళ్ళు పోయటం, అన్నీ వాస్తవాలే. ఫ్లేష్‌బేక్ చెప్పించటం కోసం మాత్రమే, చింటూ పాత్రనీ, చింటూ తల్లిదండ్రుల పెళ్ళి సంఘటనలనీ కల్పించటం జరిగింది.

రచయిత

## ఫోటో — చెన్నూరి సుదర్శన్

**ఆ యింటిని** చూడగానే మనం సిటీలోనే ఉన్నామా అనే అనుమానం రాక మానదు. దానిని యిల్లు అనే కంటే అలనాటి శ్రీరామచంద్రుని పర్ణశాల అంటే బాగుంటుందేమో. దాదాపు యిల్లు కనబడకుండా చుట్టూ పచ్చని చెట్లు.

వేపచెట్టు, రావి చెట్టు పెనవేసుకొన్న తీరు జూస్తుంటే చాలా ముచ్చటేస్తుంది. కొబ్బరిచెట్లు, మామిడి చెట్లు సరేసరి.

యింటి వెనకాల నిత్యం పూజలందుకొనే తులసి చెట్టు ఆయింటి పవిత్రతకు ప్రతీకగా పలుకరిస్తుంది. పలు వరుసల్లో ఉన్న గులాబి, చామంతి మొక్కల పూల పరిమళాలు ఆయింటి సొగసు నినుమడింప జేస్తున్నాయి.

గేటు చప్పుడైంది...

గేటు తెరుచుకొని వాకిట్లో అడుగు బెట్టిన పరంధామయ్యకు అక్కడి వాతావరణ చల్లదనానికి , అప్పటి వరకూ తాను వచ్చిన ఏ.సీ. కార్లో చల్లదనానికి వ్యత్యాసం యిట్టే పసిగట్టి పరవశించి పోయాడు.

మొక్కలకు పైపుతో నీళ్ళు పడ్తున్న శాంతమ్మ వెనక్కి తిర్గి చూసింది. సంధ్యాసమయం కావడం మూలాన వస్తున్న వ్యక్తిని వెంటనే గుర్తు బట్టలేక పోయింది. నీళ్ళ పైపు క్రింద పడేసి వాల్వ్ కట్టేసి తడి చేతులను కడకొంగుతో తుడ్చుకొంది. చీర కుచ్చిళ్ళను సరి జేసు కుంటూ

నాలుగడుగులు తనూ ముందు కేసేసరికి...

" నమస్కారం శాంతమ్మా..." అంటూ చిరునవ్వుతో రెండు చేతులు జోడించాడు పరంధామయ్య.

శాంతమ్మకింకా గుర్తుకు రావడం లేదు .అప్రయత్నంగా తనూ నమస్కరిస్తూ చూడసాగింది. అది గమనించిన పరంధామయ్య

" నేనమ్మా... పరంధామయ్యని..." అంటుండగానే అతని చేతి ఉంగరాలను, బ్రాస్లెట్‌ను, తెల్లని బుర్ర మీసాలను జూసి గుర్తు బట్టింది.

" ఆ...ఆ... అన్నయ్యా...నమస్కారాలు ... రండి ...రండి..." అంటూ ఎంతో ఆప్యాయంగా యింట్లోకి ఆహ్వానించింది శాంతమ్మ.

యింట్లో కడుగు బెడ్తున్న పరంధామయ్య పవిత్ర దేవాలయంలో అడుగు బెడ్తున్నట్లు తన్మయత్వం చెందాడు.

" ఒక ముఖ్యవిషయం చెబుదామని వచ్చాను శాంతమ్మా..." అంటూ చెక్క కుర్చీలో కూర్చుంటూ నింపాదిగా అన్నాడు పరంధామయ్య. అతని ప్రక్కనే ఉన్న మరో చెక్క కుర్చీని కాస్తా ఎడంగా లాక్కొని శాంతమ్మ కూర్చుంది " ఏంటన్నయ్యా..." అంటూ.

వారిద్దరి మధ్యనున్నది పాత నమోనా టీపాయ్ చెక్కతో చేసిందే. అధునాతన ఫర్నీచరేమీ లేదింట్లో. "అందుకేనేమో...వేసవి కాలమైనప్పటికీ కూర్చున్న కుర్చీ చల్లగానే ఉంది. యింట్లోకి ధారాళంగా వీస్తున్న చల్లని గాలి యింటి వాస్తును బలపరుస్తున్నది." అని మనసులో అనుకుంటూ హాల్లో మరో మూల నున్న పాతకాలపు గ్రాంఫోన్ రికార్డరును ఆశ్చర్యంగా చూడసాగాడు.

యింతలో ట్రేలో రెండు గ్లాసుల నిమ్మరసం తీసుకొచ్చింది అర్చన. ఆ అమ్మాయిని చూడగానే తాను చెప్పవలసిన ముఖ్య విషయం మర్చి పోయి " ఎవరీ అమ్మాయి శాంతమ్మా..." అంటూ ఆశ్చర్యంగా అడిగాడు పరంధామయ్య. శాంతమ్మకు ఏకైక సంతానం అబ్బాయనే అతనికి తెలుసు.

" అక్షరా... యిలా రామ్మా..." అంటూ శాంతమ్మ పిలుస్తూ అర్చన తెచ్చిచ్చిన నిమ్మరసం గ్లాసు నొకదానిని పరంధామయ్య కిచ్చి మరొకటి తను తీసుకొంది.

శాంతమ్మ పిలుపుతో వంట గదిలో నుండి వచ్చిన అక్షర, అర్చన వెనకాల నిలబడింది.

"యిది అర్చన. వెనకాలుండే అది అక్షర. నామేన కోడళ్ళు. అంటూ శాంతమ్మ పరిచయం చేసింది. అర్చన ట్రేను టీపాయ్ మీద బెట్టి గాలికి కదలాడుతున్న ముంగురులను ఎడం చేత్తో సరిజేసుకుంటూ

" నమస్కారం అంకుల్..." అంటూ అభివాదం చేసింది. అక్షర గూడ అర్చనతో శృతి గల్పింది.

పిల్లలిద్దరూ రత్నాల్లా వెలిగి పోతున్నారు. ఆ వినయం...పెదవి దాటని నవ్వులతో గూడిన తొణికిసలాడే మోములు పరంధామయ్యను ముచ్చట గొల్పాయి. తన హృదయంలో ఏదో తెలియని ఉబలాటం మొదలైంది. ఉత్సుకత నాపుకోలేక

" ఏం చదువుకుంటున్నారమ్మా..." అంటూ ఆప్యాయంగా అడిగాడు.

" నేను బి.ఎస్సి కంప్యూటర్స్...చెల్లాయి బి.కాం. కంప్యూటర్స్" అంటూ అర్చన చెబ్తుంటే పరంధామయ్యకది కోకిల కంఠంతో సరిగమపదనిస...సనిదపమగరిస అన్నట్లుగా వినబడ సాగింది. ఎంతో ముగ్ధుడయ్యాడు. ఏదో ఊహకందని అనుభూతి తనను మైమరపిస్తున్నది. వీళ్ళంతా నా వాళ్ళే అన్నట్లుగా మనసు ఊయలలూగుతున్నది.

శాంతమ్మ ఏదో చెప్ప బోతున్నట్లనిపించి అర్చన, అక్షర లోపలికి వెళ్తుంటే వాళ్ళ వెనకాలే వెళ్తున్న దృష్టిని మరల్చి యీలోకానికొచ్చాడు పరంధామయ్య. శాంతమ్మ ఏవేవో జ్ఞాపకాలు వెన్నంటు తుంటే యింకా వాళ్ళ వైపే దీనంగా చూస్తూ ఉబుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక భోరుమంది శాంతమ్మ.

"అత్తయ్యా..." అంటూ అర్చన, అక్షర వెను దిర్గి పరుగెత్తుకుంటూ వస్తుంటే...పరంధామయ్య కళ్ళల్లో హంస, నెమళ్ళ నడకలు

గోచరించాయి. కొంగుతో కళ్ళు ఒత్తుకుంటూ కాస్తా నెమ్మదించి "మీరు వెళ్ళండమ్మా...మీ పని చూసుకోండి...ట్యూషన్ పిల్లలు వచ్చే వేళైంది..." అంటూ వాళ్ళను పంపించే ప్రయత్నం చేసింది శాంతమ్మ.

" ఏంటత్తయ్యా...మన యింటికి క్రొత్తగా వచ్చిన అంకుల్‌కు మన విషయాలన్నీ చెబ్తూ మనఃశ్శాంతి లేకుండా చేస్తావా..." అంటూ గదుమ బట్టుకొని బేలగా అడుగ సాగింది అర్చన. వెనకాలే కాస్తా వంగి నిల్చున్న అర్చన కనుకొనుకుల్లో నుండి ముత్యాల్లాంటి అశ్రుబిందువులు ఒకదాని వెనుక మరొకటి జల,జలా రాలసాగాయి.

" కడుపులోని దుఃఖాన్ని ఆత్మీయులతో పంచుకుంటే కొంచెం హృదయం తేలిక పడ్తుంది. యీ అంకుల్‌కొత్తవాడేమీ కాదమ్మా...మన విషయాలన్నీ తెలిసినవాడే. అయినా ఏయిబ్బంది పెట్టనులే. మీరు వెళ్ళండమ్మా..." అంటూ సముదాయించి పంపించేసింది.

ఆ సన్నివేశం పరంధామయ్య హృదయాన్ని కదిలించి వేసింది, అనుకోకుండా కళ్ళు చెమ్మగిల్లాయి. చేతిరుమాలుతో కళ్ళు ఒత్తుకుంటూ ఎదుర్గా గోడకు అమర్చిన శాంతమ్మ భర్త, కొడుకు ఫోటోలు చూడ్డానికి లేచి వెళ్ళాడు.

యింతలో శాంతమ్మ బీరువాలోనుండి తమ ఫ్యామిలీ ఫోటోలున్న ఆల్బం తీసుకొచ్చింది పరంధామయ్యకు చూపిద్దామని. ఆల్బం పైన తన కొడుకు ఫోటో చూడగానే " అమ్మా..." అని పిలిచినట్లైంది.

★★★ ★★★ ★★★

" అమ్మా...షిర్డీకి వెళ్దామే..." అన్నాడు సాయి గారాబంగా..." అమ్మా... నాన్న షష్ఠి పూర్తి షిర్డీలోనే జరుపుదాం. నాన్నకు షిర్డీ సాయి బాబా అంటే ప్రాణం గదా...". శాంతమ్మ 'నో' అనకుండా లంకె పెట్టాడు.

సాయి ఎంతో కాలంగా ఎదురి చూడగా కల్గిన ఏకైక సంతానం.

శాంతమ్మ భర్త శేషసాయి షిర్డీ సాయి బాబా పరమ భక్తుడు.

ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా జేసి రెండేళ్ళ క్రితమే రిటైరయ్యాడు. ఉపాధ్యాయి వృత్తి అయినా ప్రవృత్తి మాత్రం పిల్లల జాతకాలు నిస్వార్థంగా వ్రాయడం, సాయంత్రం చిన్న పిల్లలకు ఉచితంగా తెలుగు పాఠాలు చెప్పడం...

జాతకరీత్యా తన కొడుకు పేరు సాయి సంజీవ్ అని నామకరణం చేశాడు. ప్రస్తుతం సాయి ఇంజనీరింగ్ ఫైనలియర్. చాలా ఇంటెలిజెంట్. ఏదురలవాట్లూ లేవు, దయార్ద్ర హృదయుడు పైగా చాలా సున్నిత మనఃస్తత్వం కూడానూ. వచ్చే సంవత్సరం సాయిని పెళ్ళికి ఒప్పించాలనే ప్రయత్నంలో ఉన్నాడు శేషసాయి.

సాయికి నాన్నంటే ప్రాణమే గాని అమ్మ దగ్గర ఉన్నంత చనువు గాని, చొరవగాని లేదు. అందుకే ఏప్రపోజలైనా అమ్మ దగ్గరి నుండి వెళ్ళాల్సిందే.

" సరేలేరా... వెళ్దాం...నాన్న గారిని గూడా ఒప్పిస్తాను. నీ కోరిక ఎందుకు కాదనాలి..." అంటూ ఎంతో ప్రేమతో సాయి తల నిమిరింది. సాయి మోములోని వెలుగు జూసి ' పిచ్చి పిల్లాడు'... అనుకొంది మనసులో ముద్దుగా...

అనుకున్నట్లుగానే శేషసాయి కుటుంబం తన ఒక్కగానొక్క బావమర్ది కుటుంబాన్ని తీసుకొని ఒక ప్రైవేటు బస్సులో షిర్డీకి బయలు దేరింది పంచాంగం ప్రకారం లెక్కలేసుకొని.

అర్థ రాత్రి దాటింది...బస్సులో అంతా నిద్ర మత్తులో జోగుతున్నారు...

బస్సు వేగం కాంతి వేగంతో పోటీ పడ్తుంది...

మరో రెండు గంటల్లో షిర్డీ చేరుకునే సమయంలో బస్సు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుండి రాకెట్టులా దూసుకెల్లి లోయలో పడిపోయింది.

కళ్ళు పొడ్చుకున్నా కానరాని కటిక చీకటి. హా..హా..కారాలు, ఆర్తనాదాలు మిన్నునంటాయి. ప్రదేశమంతా రక్తసిక్తమైంది. తెగిపోయిన కాళ్ళూ, చేతులూ, పగిలిపోయిన తలలు ఎవరివో... ఎవరివెవరివో...అంతా భయానకం...భీభత్సం....

★★★ ★★★ ★★★

శాంతమ్మ కళ్ళు తెరిచేసరికి సాయి, అర్చన మరియు అక్షర కన్నీళ్ళ పర్యంతమైన మొహాలతో పైన పడి భోరు మన్నారు.

షష్ఠి పూర్తి చేసుకోవాల్సిన శేషసాయి అర్థాంతరంగా అంతర్థాన మయ్యాడు. మరీ పట్టుబట్టి తీసుకొచ్చిన అర్చన, అక్షర తల్లి దండ్రులు పరలోకానికి తరలి పోయారు. తన రెండు చేతులతో ముగ్గురినీ తన హృదయానికత్తుకుంది శాంతమ్మ.

శేషసాయి కర్మకాండ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. రోజులు గడుస్తున్నాయి...సాయి కోలుకోవడంలేదు...మదినిండా తండ్రి ఆలోచనలే...

సాయి మనసును మరల్చే నెపంతో శాంతమ్మ " సాయీ... పరీక్షలు దగ్గర పడ్తున్నాయి...చదువుకో నాన్నా..." అంటూ బతిమాల సాగేది.

" తలంతా భారంగా ఉంటుందమ్మా...చదువుమీద మనసు లగ్నం కావడం లేదు..." అంటూ సాయి కన్నీరు పెట్టుకొనే వాడు.

శాంతమ్మ మనసు ఆవిరయ్యేది...

ఓ రోజు ఉదయం సాయి చదువుకుంటూ కుర్చీలో నుండి దభాల్న క్రింద పడిపోయాడు...

శాంతమ్మ గాబరా పడింది. అప్పుడు తను ఒక్కర్తే ఉంది యింట్లో...

అర్చన, అక్షర వాళ్ళ అమ్మమ్మ సీరియస్‌గా ఉందంటే చూడ్డానికి వెళ్ళారు. ఎటూ తోచక ఏడుస్తూ సాయి ముఖం మీద చల్లని నీళ్ళు చల్లింది. అయినా సాయిలో చలనం లేక పోయేసరికి వెంటనే యింటి ప్రక్కవారి సహాయంతో దగ్గర్లో ఉన్న కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళింది.

డాక్టర్లు పరీక్షించి వెంటనే తల స్కానింగ్ చేయాలన్నారు. ముందుగా కొంత డబ్బు డిపాజిట్ చేయమన్నారు.

శాంతమ్మ గబ, గబా యింటికి వెళ్ళింది. యింట్లో నగదు డబ్బు లేదు.

కాని కొన్ని బంగారు ఆభరణాలుమాత్రమే ఉన్నాయి. కాబోయే కోడలుకని చేయించారు. ’ కన్న కొడుకు ఆపదలో ఉన్నప్పుడు నగలేం చేసుకుంటాం...పైగా ఎంత డబ్బు అవసరమౌతుందో ఏమో...’ అని మనసు ఆరాట పడ్తుంటే నగలన్నీ ఎవరికీ అనుమానం రాకుండా ఒక పాత సంచీలో వేసుకొని అమ్ముదామని బయలు దేరింది.

పట్టపగలు...వేసవి కాలమాయె...వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. వడి, వడిగా అడుగులేయ సాగిందిశాంతమ్మ. మరో నాలుగడుగులు వేస్తే మేన్ రోడ్‌ను ఎక్కి ఆటోలో వెళ్ళి పోయేదే. కాని ’ దైవోప హతులు పోవుగడకున్ పోవుం గదా...ఆపదల్...’ అన్నట్లు శాంతమ్మను దురదృష్టం వెంటాడుతునే ఉంది.

వెనకాలే టూ వీలర్‌పై వచ్చిన యిద్దరు ఆగంతకులు ఆమె చేతిలోని సంచిని లాక్కున్నారు. ఆమె కొడుకు ప్రాణాలు సంచిలోనే ఉన్నాయన్నట్లు...ఆవేశంతో అరుచు కుంటూ ఎదురు తిర్గింది. పెనుగులాటలో వారి పశు బలం ముందు ఆమె ఓడి పోయింది. అడ్డొచ్చిన కొమ్మలా అడ్డు తొలగించుకొని నగల సంచితో పారిపోయారు. ఆమె రోదన...ముష్కరులకేం వేదన?

కన్నీళ్ళు జలపాతాలయ్యాయి.

శాంతమ్మ కారోజు డబ్బు డిపాజిట్ చేయడం వీలు గాలేదు. హాస్పిటల్‌కు వెళ్ళి వాకబు చేస్తే సాయికి కాస్తా స్పృహ వచ్చిందని ఐ.సి.యు.లో ఉన్నాడని వెళ్ళనివ్వలేదు. తల స్కానింగ్ చేయనిదే ఎలాంటి ట్రీట్‌మెంటు చేయడం వీలుగాదని వీలైనంత తొందరగా డబ్బు

డిపాజిట్ చేయు మన్నారు.

ఆరాత్రంతా డబ్బు కోసం ప్రయత్నించింది. చివరికి శేషసాయి ఆప్తమిత్రుడు సహాయం చేశాడు.

ఆ మరునాడే డబ్బు పట్టుకొని హాస్పిటల్‌లో అడుగు పెట్టింది శాంతమ్మ.

డ్యూటీ డాక్టర్ శాంతమ్మ కెదుర్గా వచ్చి సూపరింటెండెంట్ గారు రమ్మంటున్నారంటూ తీసుకెళ్ళాడు. అక్కడ మరో యిద్దరు డాక్టర్లున్నారు. శాంతమ్మ ఒంట్లో వణుకు పుట్టింది. వాళ్ళు నెమ్మదిగా అవయవ దానం గూర్చి చెప్పసాగారు.

"ముందు ఏంజర్గిందో చెప్పండి" అంటూ శాంతమ్మ బిగ్గరగా రోదించే సరికి సూపరింటెండెంట్ గారు " సాయికి ఆమధ్య జర్గిన ప్రమాదంలో తల లోపల బలమైన గాయమైంది. మీరు నిర్లక్ష్యం చేశారు. తల స్కానింగ్ చేద్దామంటే మీరు సకాలంలో డబ్బులు డిపాజిట్ చేయలేదు...అయినా మా ప్రయత్నం మేము చేశాం...కొన్ని పరీక్షలు నిర్వహించాం. కాని ఘోరం జర్గి పోయింది. సాయి సంజీవ్ బ్రెయిన్ డెడ్..." అంటూ నింపాదిగా చెప్పాడు. శాంతమ్మ కుప్పలా కూలి పోయింది. డాక్టర్ల శుశ్రూతతో కాసేపటికి స్పృహలోకి వచ్చింది.

" చూడు శాంతమ్మా... యిలాంటి సమయాల్లోనే గుండె దిటవు చేసుకోవాలి. నీబిడ్డను బతికించ లేక పోయాం గాని నీ బిడ్డకు మరో యిద్దరిని బతికించే శక్తి ఉంది. అతని పేరే సంజీవ్...సాయి అవయవ దానం చేయండి. మరో యిద్దరికి ప్రాణ భిక్ష పెట్టండి...వారిలో నీబిడ్డను చూసుకునే అవకాశముంది" అంటూ డైరక్టర్ గారు ఎంతగానో బతిమాల సాగాడు. " ఒక్కసారి ఆపేషంట్స్ ను చూడండి వారి మీద మీకు దయ గల్గక మానదు" అంటూ శాంతమ్మను ఐ.సి.యు. కు తీసుకెళ్ళాడు.

శాంతమ్మ ఆపేషంట్స్ ను చూడగానే తన గుండెలో ఎవరో చెయ్యి బెట్టి కెలికి నట్లైంది. వాళ్ళు తన కొడుకు వయస్కులే.

యింత చిన్న వయసులో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే శాంతమ్మ హృదయం తల్లడిల్ల సాగింది...

అవయవ లోపంతో కొడుకు అంత్యక్రియలు చేయడం శుభమా?...అవయవ దానం చేసి సాయిని మరో సారి పునర్జీవుని చేయడం శ్రేయస్కరమా?...అని మానసిక సంఘర్షణకు లోనైంది...

చివరికి తన మనసు మూఢాచారాలను ప్రక్కకు త్రోసేసి సాయి అవయవ దానానికే మొగ్గు చూపింది.

★★★ ★★★ ★★★

పరంధామయ్య ఆల్బం తిరుగేయడం పూర్తవగానే " శాంతమ్మా... మీకో ముఖ్యమైన విషయం చెబుదామని వచ్చానన్నాను గదా..." అంటూ మిగిలి పోయిన నిమ్మరసాన్ని పూర్తిగా త్రాగేసి గ్లాసు ఖాళీ చేశాడు పరంధామయ్య.

" నాకూ ఎదురి చూపు సంతానమే...యిద్దరు కవల పిల్లలు. పిల్లలు పుట్టిన కొన్నాళ్లకే నా భార్య కాలం చేసింది. తల్లి లేని పిల్లలు గదా అని కాస్తా గారాబం చేశాను. చదువులో అంతంత మాత్రమే. ఎలాగో అలాగా ప్రైవేట్ యింజనీరింగ్ కాలేజీలో ఫైనలియర్ దాకా నెట్టు కొచ్చారు. డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు జేసే వారు. వీకెండ్ పబ్బులకు వెళ్ళి త్రాగి తందనాలాడేవారు. అలా ఫైనలియర్ తప్పింది...యిక లాభం లేదను కొని డబ్బు దగ్గర కళ్ళెం వేశాను. మంచి స్నేహితుడిలా చెప్పి చూశాను. అయినా వారిలో మార్పు కన్పించ లేదు." అంటూ ఒక నిట్టూర్పు విడిచాడు.

యింతలో గుమ్మం ముందు కొందరు చిన్న పిల్లలు స్కూల్ బ్యాగ్స్ భుజాలకు వేళ్ళాడేసుకొని వచ్చి నిలబడ్డారు "నమస్కారం టీచర్.."అంటూ.

శాంతమ్మ చీర కొంగుతో కళ్ళు ఒత్తుకుంటూ గొంతు సవరించుకొని " అర్చనా...పిల్లలు వచ్చారు చూడు" అంటూ కుర్చీలో నుండి లేచి గుమ్మం దగ్గరికి వెళ్ళింది. పిల్లల నుద్దేశించి "నాన్నాలూ...మీరంతా యీరోజు వెనక వసారాలో చదువుకోండమ్మ..." అంటూ పిల్లలంతా

వెళ్ళే వరకు వేచి ఉండి తిర్గి వచ్చి కుర్చీలో కూర్చుంది.

" యింతలో ఆక్సిడెంట్. మీ దాతృత్వంతో నీ కొడుకు అవయవదానంతో నా పిల్లలను పునర్జీవితులను చేశారు. నేనివ్వ జూసిన బ్లాంక్ చెక్‌ను సహితం మీరు తృణీకరించారు. నేను ఎన్ని జన్మలెత్తినా మీ ఋణం తీర్చుకోలేను..." అంటూ కంట తడి బెట్టాడు పరంధమయ్య.

సిటీలో తనొక ప్రముఖ వ్యాపార వేత్త. తర, తరాలు తిన్నా తరగని ఆస్థి ఉంది. దానికి తోడు రాజకీయ పలుకు బడీ ఉంది. అయినా శాంతమ్మ ఔదార్యం ముందు అంతా దిగతుడుపే ననిపించింది పరంధామయ్యకు.

" అసలు విషయమేమిటంటే..." అంటూ తిర్గి చెప్పసాగాడు పరంధామయ్య.

"అదేమి చోద్యమో గాని శాంతమ్మా...ఆపరేషన్ తర్వాత నాపిల్లల్లో చాలా మార్పు వచ్చింది. చెడు తిరుగుళ్ళు మానేశారు. వాళ్ళ మాటల్లో ఎంతో పరిపక్వత కనబడుతుంది. యీ మధ్యే ఫైనలియర్ పరీక్షలకు ప్రిపేరౌయున్నారు. అలా వాళ్ళు చదవడం నేనెన్నూ చూడలేదు. ఆ ఆనందం పట్టలేకే మీకీ విషయం చెబుదామని వచ్చాను. నాపిల్లలకు బ్రతుకునివ్వడమే గాదు, మంచి జీవితాన్నిచ్చారు...సాయి సంజీవ్ లక్షణాలన్నీ నా పిల్లలకు ప్రసాదించారు. శాంతమ్మా...అడుగమ్మా...మీరేమడిగినా యిస్తాను దయచేసి ఏం కావాలో చెప్పమ్మా...మీకేమైనా సహాయం చేయంది నాకు మనఃశ్శాంతి ఉండదు" అంటూ ప్రాధేయ పడ సాగాడు పరంధామయ్య.

" అన్నయ్యా...మాకు ఆ భగవంతుడిచ్చిన ఆత్మవిశ్వాసముంది. ఆయనకు మనకేం గావాలో తెలుసు. అదే ప్రసాదిస్తూ ఉంటాడు. అంతకంటే మాకింకేం గావాలి?...మీరేమీ అనుకోవద్దు" అంటూ అతి సౌమ్యంగా సమాధాన మిచ్చింది శాంతమ్మ.

పరంధామయ్య మస్తిష్కంలో ఏదో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ముఖంలో ముడతలు విచ్చుకున్నాయి. "శాంతమ్మా...మీరెలాగూ ఏమీ అడగరు. అభిమాన వంతులు. మీలాంటి వారు యీలోకంలో అరుదు. కాని నామనసులోని ఆవేదన మీకెలా చెప్పాలో అర్థం గావడం లేదు. పోనీ నేనే మరొక్క వరం కోరుకుంటాను ప్రసాదించండి." అంటూ శాంతమ్మ పాదాలనంట బోయాడు.

"వద్దన్నయ్యా...అదేంటి?..." అంటూ కంగారు పడింది శాంతమ్మ.

"శాంతమ్మా...నీకోడళ్ళిద్దరిని నాయింటి కోడళ్ళుగా చేసుకునే భాగ్యాన్ని కల్గించమ్మా. మీరు మాట యివ్వందే నేను మీయింటి ముందు నుండి కదలను..." అంటూ శాంతమ్మ ముందు చిన్న పిల్లవాడై పోయాడు.

శాంతమ్మ ససేమిరా అంది. " చూడన్నయ్యా...పిల్లల మనసులు ఏసమయంలో ఎలా మారుతుంటాయో చెప్పలేము. మనం వాళ్ళ పెళ్ళిళ్ళు నిర్ణయించడం సమంజసం గాదు. వాళ్ళకు నచ్చిన వారి తోనే వారి పెళ్ళిళ్ళు చేయడం మన కర్తవ్యం...."

ఆమె దూర దృష్టికి మనసులోనే అభినందనలు తెల్పుకున్నాడు పరంధామయ్య. కాని తన మదిలోని వెలితి ఆరాట పడ్తూనే ఉంది...

" అన్నయ్యా...మీరింతగా అడుగుతున్నారు...నాకు అడగక తప్పడంలేదు...దయచేసి నాకు మీ పిల్లల ఫోటో ఒకటి పంపించండి. వాళ్ళలో నాకొడుకును చూసుకోవాలనే ఆశ పడ్తుంది నామనసు" అంటుంటే శాంతమ్మ కళ్ళు వర్షించ సాగాయి.

" అదేం భాగ్యమమ్మా...తప్పకుండా ఫోటోలు తీసుకొచ్చి యిస్తాను. పరీక్షల తర్వాత నాపిల్లలను గూడా తీసుకొస్తాను ప్రత్యక్షంగా చూద్దురు గాని..." అంటూ రెండు చేతులా నమస్కరిస్తూ వీడ్కోలు తీసుకున్నాడు పరంధామయ్య.

కాని ఆపిల్లలు తనను చూసి తట్టుకోగలరా?...అనే ప్రశ్న ఉద్భవించింది శాంతమ్మ మదిలో... ఆరోజు తనపై దాడి చేసి నగల సంచిని లాక్కుపోయింది పరంధామయ్య కొడుకులే. సాయి అవయవ దానం వారికి చేయాలా వద్దా...అని తానా రోజు ఎంత మానసిక ఘర్షణకు లోనైందో ఆభగవంతునికే తెలియాలి. ఆ నిజం చెప్పి పరంధామయ్యకు క్షోభ కల్గించడం భావ్యం కాదనుకొని, ఆ రహస్యాన్ని తన గుండెల్లోనే దాచుకొంది శాంతమ్మ.

# మేలిముసుగు డా. యండమూరి కమలేంద్రనాధ్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ**

**ట్రైన్ ఎక్కి కూపేలో కూర్చున్నాను.** బయలుదేరడానికి ఇంకా పదినిమిషాలుంది. పై బెర్త్‌లో ప్రయాణికుడు ఇంకా రాలేదు. సామాను సర్దుకుని పుస్తకం చదవటంలో లీనమయి పోయాను.

''జాగ్రత్త నాన్నా - నెమ్మదిగా నడు'' అంటూ ముప్పై సంవత్సరాల యువతి సుమారు అరవై -అరవై అయిదు సంవత్సరాల వ్యక్తిని కూపేలోకి తీసుకువచ్చింది. అంత పొడగరి కాదు. అని పొట్టికూడా అనలేం. జుట్టూ - మీసాలు నెరిసిపోయాయి. తెల్లటి లాల్చీ - పైజమా.

''కూర్చోండి నాన్నా'' అంటూ బెర్త్ మీద కూర్చోబెట్టి - సూట్ కేసు బెర్త్ క్రింద సర్ది నా వైపు చూస్తూ ''ఎక్కడిదాక వెళ్తున్నారు?'' అని అడిగింది.

''బెంగళూరు'' సమాధానం చెప్పాను.

''మీరేమీ అనుకోకపోతే, నాన్నగారు కూడా బెంగుళూరు దాకా వస్తారు. అక్కడ మా ఆయన వచ్చి రిసీవ్ చేసుకుంటారు. పెద్ద వయసు ఏదైనా సహాయం అవసరం అయితే చూస్తారు కదా!'' అంది.

''ఫర్లేదమ్మా! కంగారుపడకండి. నేనుచూస్తాను'' అన్నాను.

ఆ మాట వినగానే ఆ యువతి మొహంలో ఆందోళన తగ్గింది. ''చాలా థాంక్సండీ'' అని తండ్రి వైపు తిరిగి ''నాన్నా! నీకు అసలే మొహమాటం ఎక్కువ. ఏం కావల్సి వచ్చినా ఆయన్ని నిస్సంకోచంగా అడుగు'' అంది.

''తప్పకుండా తల్లీ! తోడుగా ఆయన ఉంటారు కదా! నువ్వేం కంగారు పడక. ఎలాగు అల్లుడుగారు స్టేషన్‌కి వస్తారు. ట్రైన్ కదులుతుందేమో, నువ్వెళ్ళు, కంగారు పడక. నువ్వు మాత్రం త్వరగా వచ్చేయి. నిన్ను వదిలి ఎక్కువరోజులు ఉండలేను'' అన్నాడు

''ఏ అవసరం వచ్చినా చూస్తారుకదా! మళ్ళీ మళ్ళీ అడిగి మిమ్మల్ని శ్రమపెడుతున్నందుకు క్షమించండి'' అంది కళ్ళు చెమరుస్తుండగా.

''మీ అయనకి - నాన్నగారిని ఒప్పగించే బాధ్యత నాది సరేనా? మీరు నిశ్చింతగా వెళ్ళండి'' అన్నాను.

ట్రైన్ బయలుదేరింది.

''మీ పేరు'' అడిగాను

''భాస్కరం''

''ఏం ఉద్యోగం చేసేవారు''

''చిన్న ఉద్యోగం - దేవదాయశాఖలో చేసి రిటైర్ అయ్యాను''

''బెంగుళూర్‌లో ఎక్కడ ఉంటున్నారు?'' అన్నాను.

"నాగవర, రజితా ఎపార్ట్‌మెంట్స్‌లో"

"నేను కూడా అదే ఎపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నాను. కానీ నేను వచ్చి రెండు నెలలే అయింది. ఏ బ్లాకులో ఉంటున్నారు?" అడిగాను.

"డి బ్లాక్ - మూడువందల మూడు"

"అందుకే కలవలేక పోయాం. నేను ఎ బ్లాక్ లో నాలుగువందల ఆరులో ఉంటున్నాను. అయితే రేపట్నుంచీ అప్పుడప్పుడు మనం కలుసుకోవచ్చన్నమాట" అన్నాను నవ్వుతూ.

"తప్పకుండా"

రజితా ఎపార్ట్‌మెంట్స్‌లో నాలుగు బ్లాకులుంటాయి, నాలుగు దిక్కులా. మధ్యలో చిన్న పార్క్ - పిల్లలు ఆడుకోవటానికి ఊయలలు , జారుడు బల్లలు ఉంటే - పెద్దలు కూర్చోవడానికి బల్లలు ఉంటాయి. సాయంత్రం పూట పెద్దలు, మనవలు మనవరాళ్ళని తీసుకొచ్చి కాలక్షేపం చేస్తుంటారు.

"తినడానికి ఏమైన తెచ్చుకున్నారా?" అడిగాను.

"నేను రాత్రిళ్ళు చపాతీలు తింటాను. కానీ అమ్మాయి ప్రయాణంలో అరగదేమోనని ఇడ్లీలు ఇచ్చింది"

కూతురికి తండ్రి మీద ఉన్న అభిమానానికి ఆనందమనిపించింది, అందునా నేటి సమాజంలో.

"మీరు పెద్దవారు - పై బెర్త్ ఎక్కలేరు. క్రింద బెర్త్ మీద పడుకోండి - పై బెర్త్ మీద నేనుపడుకుంటాను" అన్నాను.

"థాంక్సండీ" అన్నారు.

మరుసటి రోజు ఉదయం ట్రైన్ రెండుగంటలు ఆలస్యంగా కంటోన్మెంట్ స్టేషన్ చేరింది. ఆయన అల్లుడు వచ్చి రిసీవ్ చేసుకున్నాడు. భాస్కరంగారు ఆయన అల్లుడికి నన్ను పరిచయం చేస్తూ "నాయనా! ఈయన రావుగారు. రజితా ఎపార్ట్‌మెంట్స్‌లోనే ఉంటారట" అంటూ "ఇతను మా అల్లుడు శ్రీరాం" అని పరిచయం చేశారు.

శ్రీరాం "మీరు కూడా మాతో వచ్చేయండి. ఎలానూ కారులో ఖాళీ కూడా ఉంది కదా! " అంటూ నన్ను కూడా తీసుకుని వచ్చాడు. "థాంక్స్" చెప్పి నేను నా ఎపార్ట్‌మెంట్‌కి వెళ్ళిపోయాను.

సాయంత్రం పూట పార్క్‌లో కూర్చునే అలవాటుంది. భాస్కరంగారికి. ఆయనకి కూడా మనవడు వచ్చి పార్కులో ఆడుకునేవాడు. మధ్య మధ్యలో నేను కూడా పార్క్‌లో భాస్కరంగారిని కలవడం - పిచ్చాపాటి మాట్లాడుకోవడం జరిగేది. క్రమేపీ కుటుంబాల మధ్య స్వవిషయాలు మాట్లాడుకునేంత సాన్నిహిత్యం పెరిగింది.

పదిరోజులుగా భాస్కరం గారు కనపడకపోయేసరికి - నేనే వాళ్ళింటికి వెళ్ళి - తలుపు తట్టాను. కూతురు అన్నపూర్ణ తలుపు తీసింది "భాస్కరంగారు ఊళ్ళో లేరా?" అడిగాను.

"ఉన్నారు. ఒంట్లో బాగోలేదు - పడుకున్నారు" అంది.

"నిద్రపోతున్నారా?"

"లేదు రండి" అంటూ లోపలికి తీసుకుని వెళ్ళింది.

భాస్కరంగారు లేవబోయేసరికి వారించి పడుకోమన్నాను. మనిషి చాలా నీరసించిపోయారు. ఎంతో వయస్సు మీద పడ్డట్టుగా అయిపోయారు.

"ఏం జరిగింది?"

మొదట్లో రొంప, జ్వరం, ఒళ్ళు నొప్పులు వచ్చాయి. మాత్ర తెచ్చివేశాం - రెండు రోజుల తర్వాత ఆయాసం మొదలైంది. డాక్టరుగారి దగ్గరకు తీసుకుని వెళితే 'న్యుమోనియా' అని మూడు రోజులు హాస్పిటల్‌లో ఉంచారు. ఇప్పటికి పదిరోజులయింది. నిన్నటి నుంచి జ్వరం రావడంలేదు. కొంచెం దగ్గువస్తోంది. మనిషి మాత్రం చాలా నీరసపడిపోయారు" అంటూ కన్నీళ్ళు తుడుచుకుంది అన్నపూర్ణ.

"అన్నపూర్ణా! తగ్గింది. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాను కదా! కన్నీళ్ళు ఎందుకు?" అంటూ ఆయనకూడా అదే పనిచేశారు.

భాస్కరంగారు కోలుకోవడానికి మూడువారాలు పట్టింది. మళ్ళీ యధాప్రకారం పార్క్‌కి రావడం మొదలు పెట్టారు.

ఒకేరోజు నేను వెళ్ళేసరికి భాస్కరం లేరు. ఇంట్లో అన్నపూర్ణ ఒకతే ఉంది మాటల్లో తల్లి ప్రస్తావన వచ్చింది. "మీ అమ్మగారు లేరా?" అడిగాను.

"నా తల్లిదండ్రులు నా చిన్నప్పుడే చనిపోయారు. బంధువులు ఎవరిమటుకు వారే ఆడపిల్ల భారం అవుతుందని వదిలేశారు. అనాధాశ్రమంలో పెరిగాను. నా అదృష్టం కొద్దీ శ్రీరాం గారితో వివాహం అయింది" అంది.

"మరి భాస్కరంగారు?" ఆశ్చర్యంగా అడిగాను.

"తండ్రి కాని తండ్రి"

"అంటే"

"ఉండండి" అంటూ తలుపు దగ్గరకు వెళ్ళి - కారిడార్‌లో చూసి - తలుపు దగ్గరకు వేసి వచ్చి కూర్చుని చెప్పడం మొదలుపెట్టింది.

సుమారు పదిసంవత్సరాలక్రితం - మేమూ - భాస్కరంగారు హైదరాబాద్‌లో ప్రక్క ప్రక్క పోర్షన్స్‌లో ఉండేవాళ్ళం. అప్పుడే నాకు - శ్రీరాంకి పెళ్ళయింది. క్రొత్త కాపురం - శ్రీరాందీ శ్రీకాకుళం జిల్లాలో పల్లెటూరు. ప్రక్క పోర్షన్‌లో భాస్కరంగారు, భార్య కొడుకూ, కోడలూ ఉండేవారు.

మూడు సంవత్సరాలలో రక్తసంబంధీకుల్లా కలిసిపోయాం. నేను ఆయనలో తండ్రిని - ఆమెలో తల్లిని చూసుకునేదానిని. వాళ్ళిద్దరూ మాకు పెద్ద దిక్కు ఉండేవారు.

నేను గర్భవతిని అని తెలిసిన నాలుగునెలలకి భాస్కరం గారి కోడలు కూడా గర్భవతి అయింది. వారింట ఆనందానికి హద్దులు లేవు. కారణం వారు పూజించని దేవుడు, తిరగని గుడిలేదు. పెళ్ళయి పదిసంవత్సరాలు.

కోడల్ని ఎంత అపురూపంగా చూసుకునేవారో నన్ను కూడా అలానే చూసేవారు నాతో కనీసం బరువు కూడా ఎత్తనిచ్చేవారు కాదు. కోడలికి నాలుగు నెలలు నిండగానే కుటుంబం టాక్సీలో తిరుపతి వెళ్ళారు. భాస్కరంగారు మాత్రం నాకు తోడుగా ఉండిపోయారు. అప్పటికే మావారు బెంగుళూర్‌లో ఉద్యోగం చేస్తున్నారు.

అప్పుడే ఊహించని సంఘటన. తిరుపతి నుంచీ వస్తూ కారు లోయలో పడి ముగ్గురూ మరణించారు. అది విన్న వెంఠనే భాస్కరంగారు కళ్ళు తిరిగి పడిపోయారు. నేను భాస్కరంగారిని హాస్పిటల్‌లో జాయిన్ చేసి శ్రీరాంకి ఫోన్ చేశాను. తను వెంటనే బయలుదేరి వచ్చారు. రెండు రోజులవరకూ భాస్కరంగారు షాక్‌లోనే ఉన్నారు. పిచ్చి పిచ్చిగ మాట్లాడేవారు. బట్టలు ఉంచుకునేవారు కాదు.

ఆ తర్వాత పూర్వస్మృతులన్నీ మర్చిపోయారు. నన్ను ఆయన కూతురుగా భ్రమించి "పూర్ణ" అని పిలవటం మొదలుపెట్టారు. భార్య, కొడుకు, కోడలు అందర్నీ మరిచిపోయారు. అదీ ఒకందుకు మంచిదే అయింది. ఆ వయస్సులో ఆ వ్యధని తట్టుకోవడం కష్టం. మేము కూడా ఏమీ గుర్తుచేయదలచుకోలేదు.

ఆయన్ని మాతోపాటే బెంగుళూరు తీసుకుని వచ్చేశాం. నేను కూడా ఆయన్ని నాన్నా అని పిలవడం మొదలుపెట్టాను. ఆయన కూడా నన్ను కూతురులానే చూస్తారు. నాకు జీవితంలో కోల్పోయిన పెన్నిధి దొరికినట్లయింది. ఆయనలో ఊహ తెలియనప్పుడు పోయిన నా తండ్రిని చూడసాగాను.

నా కాన్పు సమయంలో ఆయన చేసిన కంగారు చూస్తుంటే స్వంత తండ్రి కూడా ఏ కూతురి గురించి అంత కంగారు పడడేమో అనిపించింది. బాబు పుట్టాడు. ఆయన ఆనందం వర్ణనాతీతం. సంవత్సరం వచ్చిన దగ్గర్నించి బాబుని ఆయనే దగ్గరే పడుకోబెట్టుకునేవారు. ఇప్పటికీ వాడు "తాతయ్య" అంటూ ఆయన చుట్టూ తిరుగుతూ ఉంటాడు. ఆయనే స్కూలుకి తీసుకుని వెళ్ళడం సాయంత్రంపూట పార్కులో ఆడించటం చేస్తుంటారు.

నాక్కూడా భగవంతుడు ఆయన్ని చూపించి తండ్రిలేని లోటు తీర్చాడేమోననిపిస్తుంది. నేను కూడా ఆయన్ని చూడకుండా ఉండలేని స్థితిలోకి వచ్చాను. ఋణానుబంధం ఎలా వచ్చిందో తెలియదు - కానీ ఈ విషయంలో నేను అదృష్టవంతురాల్ని.

ఆయన గత స్మృతుల్ని కోల్పోవటం కూడా ఒక విధంగా అదృష్టమనే చెప్పాలి. లేకపోతే ఈ వయస్సులో గతాన్ని తల్చుకుంటూ కుమిలిపోయి - ఏమయి ఉండేదో ఆలోచిస్తుంటే భయమేస్తోంది" అంది.

స్వంత తండ్రి కాకపోయినా - ఆయనలో తండ్రిని చూసుకుంటూ భాస్కరంగారి మీద చూపే వాత్సల్యం - అభిమానం, ఆప్యాయత చూస్తే అలాంటి కూతురు ఉంటే జీవితం ధైర్యమనిపించింది. ఏమైనా భాస్కరంగారు అదృష్టవంతులు.

ఈ విషయాలేవీ నేను నా భార్యకు కూడా చెప్పలేదు. ఒకరి దగ్గర్నించి మరొకరికి అలా - అలా భాస్కరంగారి చెవులదాకా సోకితే - ఇంతకాలం తండ్రీ కూతుళ్ళ మధ్య పెనవేసుకుపోయిన బంధం తెగిపోవటానికి బాధ్యుణ్ని నేనేకదా!

రోజులు గడిచిపోతున్నాయి. ఒకనాటి రాత్రి భాస్కరంగారికి తీవ్రమయిన గుండెనొప్పి వచ్చి - ఆసుపత్రికి తీసుకుని వెళ్ళే సమయం కూడా లేక ఇంట్లోనే చనిపోయారు.

ఎపార్ట్‌మెంట్ సెల్లార్‌లో పడుకోబెట్టారు. ఆ మొహంలో ప్రశాంతత చూస్తే హృదయభారమంతా తీరి - గాఢ నిద్రలో ఉన్నట్లుగా ఉంది. మిగిలిన ఎపార్ట్‌మెంట్స్‌లోని వ్యక్తులు ఆయన శవానికి దూరంగా నిలబడి ఆయన సౌమ్యత - మంచితనం గురించి చర్చించుకుంటున్నారు. "తాతయ్యకి ఏమయింది? ఎందుకు మాట్లాడటంలేదూ?" అంటూ తల్లీ - తండ్రీ చుట్టూ తిరుగుతున్నాడు. బయటకు వచ్చే దుఃఖాన్ని - కొంగునోట్లో పెట్టుకుని ఆపటానికి అన్నపూర్ణ ప్రయత్నిస్తోంది శ్రీరాం నిర్వికారంగా నిలబడి ఉన్నాడు.

నాకు మాత్రం మరణం భాస్కరంగారికి వరమేమో అనిపించింది. సాయంత్రానికి కర్మకాండలన్నీ స్వంతకొడుకులా శ్రీరాం నిర్వర్తించాడు.

నా మనస్సులో ఉన్న రహస్యం - భాస్కరంగారితో జరిగిన ఒప్పందం ప్రకారం - ఇక బహిరంగపరచవచ్చు - అది పన్నెండవరోజు చెప్పాలని నిర్ణయించుకున్నాను.

ఆరు నెలల్క్రితం జరిగిన సంఘటన.

"ఏమిటీ ఈ మధ్య అమావాస్య చంద్రుడిలా అయిపోయారు?" భాస్కరంగారు అడిగారు.

"ఒంట్లో బాగోలేదండి. అందుకే పార్క్‌కి కూడా రాలేకపోయాను" అన్నాను.

"ఏమయింది?"

"జ్వరం వచ్చింది. డాక్టరుగారి దగ్గరకు వెళితే "మలేరియా" అన్నాడు మందులు వాడిన తర్వాత జ్వరం తగ్గింది కానీ విపరీతమైన నీరసం. ఆకలి కూడా చచ్చిపోయింది. నడిచే ఓపిక కూడా నశించింది. "హిమోగ్లోబిన్" తగ్గిందని దానిక్కూడా ఏవో టానిక్కులు ఇచ్చారు. ఇప్పుడిప్పుడే కాస్త కోలుకుంటున్నాను" అన్నాను.

"ఇంట్లో చాలా కంగారు పడిపోయి ఉంటారు కదా. మాలో ఎవరికైనా చెప్పొచ్చు కదా! పిల్లలకైనా కబురు చేశారా లేదా?" అడిగారు.

"భాస్కరంగారూ.. ఈ విషయంలో మీరు చాలా అదృష్టవంతులు - పువ్వుల్లో పెట్టి చూసుకునే సంతానం ఉండటం మీ పూర్వజన్మ సుకృతం" ,అన్నాను.

ఏదో చెప్పబోయి ఆగిపోయారు. కొంతసేపు తర్వాత "సమయం - సందర్భం వచ్చింది కాబట్టీ చెపుతున్నాను. ముఖ్యంగా ఈ రహస్యం మీలోనే దాచుకోండి. నా తదనంతరం పిల్లలకి చెప్పండి. ఈ రహస్యం తెలిసిన వ్యక్తి మరొకరు ఉండటం చాలా ముఖ్యం. మీరు నా హితులు - సన్నిహితులు కాబట్టి - మీమీద నమ్మకంతో చెపుతున్నాను" అని ఆగారు.

ఈయనకి అంత రహస్యం ఏమిటో అర్థం కాలేదు. "మీ మాట వమ్ము చేయను" చెప్పండి అన్నాను.

చెప్పటం మొదలు పెట్టారు.

రెండు సంవత్సరాల క్రితం శ్రీరాం చుట్టాల ఇంట్లో పెండ్లికి అందరం వెళ్ళాం. నాలుగురోజులు ఉండిపోయాం. రెండోరోజున ఏమీ తోచక కల్యాణ మండపం దగ్గరగా నడుస్తూంటే ఒక వీధిలో తిరగగానే ఎప్పుడో ఆ వీధిలో పరిసరాలు పరిచయమున్నట్లుగా తోచింది. ఆ వీధిలో అటూ ఇటూ రెండు - మూడుసార్లు తిరిగేసరికి - రెండు పోర్షన్ల ఇల్లు చూడగానే ఆ ఇంటిలో నేను ఉన్నట్లనిపించింది. ఆ ఇంటి ముందు నిలబడి తలుపు తట్టాలా? వద్దా? అనే మీమాంసలో ఉండగా సుమారు డెబ్భై సంవత్సరాల వృద్ధురాలు తలుపు తీసి నన్ను చూసి "ఎవరు కావాలి?" అని అడిగింది.

""అమ్మా ఈ ఇంటితో నాకేదో పరిచయం ఉన్నట్లు గుర్తుకువస్తోంది. పూర్తిగా జ్ఞాపకం రావటంలేదు. ఒకసారి మీరు కనికరించి లోనికిరానిస్తే - చూడగానే ఏదైనా గుర్తుకువస్తుందేమోననిపిస్తోంది. కాస్త అనుమతి ఇస్తారా?" అడిగాను.

ఆ మహాతల్లి దయతో లోపలికి తీసుకుని వెళ్ళి చూపించింది. నిస్సందేహంగా అది నేను నివసించిన ఇల్లే. గతం గుర్తుకు వచ్చింది. కానీ పూర్తిగా నిర్ణయించుకోలేకపోయాను. ఆ మరుసటిరోజు సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళి పాత పేపర్లు అన్నీ చూశాను. నాక్కావలసిన పేపరు దొరికింది. వివరాలు తెలిసాయి.

మనసులో అలజడి మొదలయింది. మా ప్రక్క పోర్షన్‌లో అన్నపూర్ణ, శ్రీరాం ఉండేవారు.

నా భార్య - కొడుకు, గర్భవతిగా ఉన్న కోడలు ఆక్సిడెంట్‌లో పోయారు. నేను వినగానే మతిస్థిమితం కోల్పోయాను. అన్నపూర్ణని నా కూతురిగా భ్రమించాను. ఆ దేవత నన్ను స్వంత తండ్రిగా భావించి నన్ను చేరదీసింది. ఆ అమ్మాయికి తగిన భర్త శ్రీరాం.

నేను ట్రెజరీలో పనిచేసి రిటైర్ అయ్యాను. ఆఫీసుకి వెళ్ళి నా సంబంధిత కాగితాలు తీసుకుని బ్యాంక్‌కి వెళ్ళాను. బ్యాంక్‌లో లైఫ్ ఇవ్వలేదని పేమెంట్ ఆపుచేశారు. నోటరీని పట్టుకుని - డాక్టరుగారి దగ్గర లైఫ్ సర్టిఫికెట్ తీసుకుని బ్యాంక్ అధికారులకి నిరూపణ చేసి - నా అకౌంట్ రెన్యువల్ చేయించాను. నా అకౌంట్‌ని బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ చేయించాను.

బెంగుళూరు వచ్చిన తర్వాత పిల్లల మీద ఆధారపడిపోయాననే వ్యధ రోజూ నన్ను నిద్రకి దూరం చేసేది. ఏరోజు కారోజు ఉదయాన్నే చెప్పేయాలనుకుంటూ మధ్యరాత్రి నిద్రపోవటం, ఉదయాన్నే నిర్మలంగా నవ్వుతున్న అన్నపూర్ణ మొహం చూడగానే వెనకంజ వేయడం జరుగుతూ ఉండేది. అన్నపూర్ణ నన్ను చాలా అభిమానంగా చూస్తుంది. నాతో తన తండ్రిని చూసుకుంటోందని తెలుసు. అసలు

విషయం చెప్పి ఆ అమ్మాయి ఆనందాన్ని హరింపచేయాలనుకోవటం ఇష్టం లేకపోయింది. కానీ నాకు పెన్షన్ వస్తోంది. వ్యర్థంగా బాంకులో ఉంటోంది. వారసులు అంటూ ఉంటే అది అన్నపూర్ణే.

ఈ రోజుల్లో ఒక మనిషిని భరించటం ఆర్థికంగా చాలా కష్టం. అందుకని ఓ రాత్రి నేను నోరు విప్పి చెప్పలేని విషయాన్ని రాసి ఇద్దామనుకుని నా గదిలో కూర్చుని రాస్తుండగా ప్రక్క గదిలో నుంచి మాటలు వినపడ్డాయి.

"ఏమండీ నాన్నగారి విషయంలో మీరేమైనా భారంగా అనుకుంటున్నారా! ఆయన ఉన్నందుకు బాధగా ఏమైనా ఉందా?" అన్న అన్నపూర్ణ గొంతు.

"చూడు పూర్ణా.. ఆయనలో నీ తండ్రిని చూసుకుంటూ నువ్వు పొందే ఆనందం - ఎంత డబ్బు ఖర్చుపెట్టి కొనుక్కుంటే వస్తుంది. బాబుకూడా ఆయన్ని తాతయ్యా అంటూ కూడా తిరుగుతాడు. ఆయన నీలో కన్నకూతుర్ని చూసుకుని సంతృప్తితో ఉన్నారు. అయినా నీకా సందేహం రావటమే తప్పు. ఆయన బ్రతికి ఉన్నంత కాలం చివరిరోజు వరకూ మనతోనే ఉంటారు. నీ తండ్రిగానే ఉంటారు ఇహ ఇలాంటి ఆలోచనలు మనసులోనికి రానీయక" శ్రీరాం గొంతు.

ఆ మాటలు వినేసరికి హృదయమంతా తడి. పూర్వజన్మలో చేసుకున్న పాప పుణ్యాలు రెండూ అనుభవించాను. ఒకటి కుటుంబాన్ని కోల్పోవడం - రెండవది అన్నపూర్ణకి తండ్రిని కావటం.

రాస్తున్న కాగితాన్ని చింపేశాను. నిజాన్ని మనస్సులోనే పాతేశాను. అప్పటిదాకా బ్యాంక్‌లో ఉన్న డబ్బు మనవడి పేర పది సంవత్సరాలకి డిపాజిట్ చేశాను. అప్పటినుంచీ వస్తున్న పెన్షన్ రెండుగా విడివిడిగా రికరింగ్ డిపాజిట్ చేస్తూ శ్రీరాంని అన్నపూర్ణని నామినీలుగా ఉంచాను.

నాకు చెయ్యవలసిన సహాయం ఇదే నా తదనంతరం బ్యాంక్‌లో ఉన్న డబ్బంతా వారికి అందేలా చేస్తే నా ఆత్మ శాంతిస్తుంది"

ఇంతకాలం మరో మనిషితో మరో మనిషితో పంచుకోలేక మనస్సులో నిబిడీకృతమయిన సంఘర్షణ, ఆందోళన - ఉద్వేగం సముద్రపులోతుల్లోనుంచి పెల్లుబికిన లావాలా ఆయన మాటల్లో ద్యోతకమయింది. మాట్లాడుతూ తట్టుకోలేక ఎక్కి ఎక్కి ఏడ్చేశారు. ఏనాడూ ఆయన మొహంలో చూడని అశ్రుధారలు చూసేసరికి చలించి పోయాను. నా మనసంతా ఏదోలా అయిపోయింది

●●●

పన్నెండోరోజున నేను వెళ్ళేసరికి - శ్రీరాం అన్నపూర్ణ విచారవదనాలతో కూర్చుని వున్నారు. అన్నపూర్ణ కుర్చీ చూపించి "కూర్చోండి" అంది.

"నాన్నగారు పోయిన తర్వాత నాకు శూన్యంగా ఉందండి. ఆయన ఉన్నప్పుడు అటూ ఇటూ తిరుగుతూ - చాలా హడావుడి చేసేవారు బాబుకూడా బెంగపెట్టుకున్నాడు" అంది.

"మీరిద్దరు జాగ్రత్తగా వినండి. మీ అభిమానం ప్రేమ వాత్సల్యం ముందు ఆయన తలవంచేశారు. నిజాన్ని మనస్సులో నిమజ్జం చేసేశారు" అంటూ ఆయన నాకు చెప్పిన విషయాన్ని విడమర్చి చెప్పేశాను. నా చేతిలో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ బ్యాంక్ పాస్ బుక్స్ అన్నపూర్ణ చేతిలో పెట్టాను.

ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

'నీలో కన్నతండ్రిని చూశానే కానీ - నువ్వు మాత్రం మనస్సులో బడబాగ్ని రగులుతున్నా - మొహం మీద దాని ఛాయలు ఏ మాత్రం పడనీయకుండా ఇంతకాలం కన్నకూతురికంటే ఎక్కువగా ప్రేమించావు నాన్నా - నీ మనస్సులో వ్యధని నువ్వే అనుభవించావు కానీ నాకు తెలిస్తే మన బంధానికి ఏ విధమైన ఆటంకం వస్తుందోనని - శూన్యత ఏర్పడుతుందేమోనై నీలో నువ్వే కుమిలిపోయి, నాకు

మాత్రం కూతురి ప్రేమ ఇవ్వగలిగావు. నీ ప్రేమాన్విత హృదయానికి నా ధన్యవాదాలు ఎలా సమర్పించాలో అర్థంకావటంలేదు నాన్నా" అంటూ ఆయన పటం ముందు మోకరిల్లింది అన్నపూర్ణ.!!

****

### *కథ వెనుక కథ*



*నేనొకసారి కలకత్తాలో ప్రయాణిస్తున్నప్పుడు ఓ చిన్నపాప , ఒక ముసలాయన్ని నడిపించుకుంటూ వెళ్తున్న దృశ్యం కనిపించింది.. "వీళ్ళద్దరూ ఎలాంటి రక్తసంబంధం లేని వాళ్ళైతే ఎలా ఉంటుంది ?" అన్న చిన్న ఆలోచన మనసులో మెదిలింది. దీన్ని కథగా ఎలా మలుద్దామా అని ఆలోచిస్తున్న రోజుల్లో ఓసారి రైల్లో ఫస్ట్‌క్లాస్‌లో బెంగుళూరుకి ప్రయాణిస్తున్నాను. ఒకామె వాళ్ళ నాన్నగారిని తీసుకొచ్చి నా పక్కన కూర్చోబెట్టింది. "ఈయన్ని కొంచెం జాగ్రత్తగా బెంగుళూరులో దించుతారా?" అని అడిగింది. అంతకు ముందు సంఘటనా, ఇదీ కలిపి కథగా రూపుదిద్దుకునే అవకాశం కనిపించింది. ఆరోజు రైల్లోనే ఒక వెర్షన్ రాసుకున్నాను. రెండు మూడు రోజుల తర్వాత కాస్త మార్చి ఇప్పుడు మీరు చదువుతున్న వెర్షన్ తయారైంది. అనుబంధాలు పెరగడానికి రక్తసంబంధమే అవసరం లేదు - అనే విషయం హైలైట్ చెయ్యాలనేది నా ఉద్దేశం. ఈ అనుబంధాల్లో ఒకరినొకరు తెలుసుకునీ, చెప్పుకోకుండా ఉండడం వల్ల 'మేలిముసుగు ' అనే టైటిల్ సరిపోతుందనిపించింది.*

*- రచయిత*

# తారుమారు

## డి.కామేశ్వరి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

**కాలింగ్ బెల్ విని తలుపు తెరిచిన కల్యాణికి** - ఓ అమ్మాయి జీన్ ప్యాంట్ పై తెలుపు కుర్తీ, బాబ్డ్‌హెయిర్, భుజాన పెద్ద హేండ్ బ్యాగ్‌తో, చదువుకుని మంచి కుటుంబం నుంచి వచ్చినట్లున్నామ్మాయి కనిపించింది. తెలివైన మొహం, పెద్ద కళ్ళు, చూడ్డానికి చక్కగా ఉంది. కల్యాణి ప్రశ్నార్థకంగా చూసింది.

"కల్యాణిగారేనా మీరు, లోపలికి రావచ్చా?" ఆ అమ్మాయి అడిగింది.

"ఎవరు. ఎవరమ్మా నువ్వు? ఏం కావాలి?" మర్యాదగా అదిగింది కల్యాణి.

"నా పేరు శ్రుతి. నేను సంకల్ప్ కొలీగ్స్‌మి. కొలీగ్స్ అంటే ఆయన సీనియర్ అనుకోండి."

"ఓ మా వాడి ఆఫీసులో పనిచేస్తున్నావా?" కల్యాణి తేలికగా నవ్వి "రా, అమ్మా లోపలికి" అంటూ ఆప్యాయంగా భుజం పట్టి లోపలికి నడిపించి సోఫా దగ్గర కూర్చో అంటూ తనూ కూర్చుంది.

"సంకల్ప్ నీవూ ఒకే కంపెనీలో పనిచేస్తున్నారన్నమాట - శృతీ నీ గురించి మావాడెప్పుడూ చెప్పినట్టు గుర్తులేదు. వాడేడి ఇంక ఆఫీసులోనే ఉన్నాడా? - నీవు ఒక్కర్తివే వచ్చావేం?" - గబగబా ప్రశ్నలు కురిపించింది.

శృతి చూపు తప్పించి "నేను మీతో మాట్లాడాలని వంటరిగా వచ్చాను" అంది.

కల్యాణి మొహంలో రంగులు మారాయి - సంకల్ప్ ఏం చేశాడు - కలవరపడుతూ "వాడి గురించేం మాట్లాడాలి - చెప్పు.. ఏం చెప్పాలి నాతో?" అంది.

"అంటీ నేను సంకల్ప్ ప్రేమించుకున్నాం" శృతి మాటలమధ్యలోనే

కల్యాణి "ప్రేమించుకున్నాం అంటే ఇప్పుడు కాదా?" సూటిగా చూస్తూ అడిగింది.

శృతి కాస్త తడబడి - తల అడ్డంగా తిప్పి - "అదికాదు, ప్రేమించుకున్నాం పెళ్ళిచేసుకోవాలనుకున్నాం. కానీ ఇప్పుడు సంకల్ప్ పెళ్ళి చేసుకోనని చెప్పాడు. మీరు కొంచెం చెప్పండి. ఆరేడు నెలలుగా ఇద్దరం ఎంతో కలిసి మెలిసి... "

"అంటే మీ ప్రేమ కథకి ఆరునెలలకే ముగింపు కార్డు పడిపోయిందన్న మాట" కల్యాణికి సగం సంగతి అర్థమైంది.

"ఆంటీ, మీరు చదువుకున్నారు. ప్రొఫెసరుగా పనిచేస్తున్నారు. సంకల్ప్ ఎందుకిలా చేశాడో అడగాలి - ఓ స్త్రీగా మీరు నన్ను సపోర్ట్ చేస్తారన్న ఆశతో మీ దగ్గరకి వచ్చాను" ఆరాటంగా అంది.

"చూడమ్మా మీ ఇద్దరూ ప్రేమించుకునే ముందు నాకు చెప్పారా? అని అడగను. ఎందుకంటే ప్రేమించుకునే ముందెవరూ తల్లిదండ్రులకి చెప్పి అనుమతి తీసుకోరని నాకు తెలుసు - ఇంతకీ సంకల్ప్ పెళ్ళి చేసుకోనని ఎందుకన్నాడు? అసలు ముందు పెళ్ళి చేసుకుంటానని నీకేమైనా చెప్పాడా?" లా పాయింట్ తీస్తూ అడిగింది కల్యాణి.

"ఆంటీ, ముందు పెళ్ళిచేసుకుంటావా అని అడగరు కదండి. కొన్నాళ్ళు కలిసి మెలిసి తిరిగాక, నచ్చాక కదా అనుకుంటాం" తనూ లా పాయింట్ మాట్లాడింది.

"సరే, కొన్నాళ్ళు తిరిగాక చెప్పాడా పెళ్ళిచేసుకుంటానని?"

"ఇద్దరం అనుకున్నాం"

"ఎప్పుడనుకున్నారు - ఆ నిర్ణయానికి ఎందుకు వచ్చారు?"

"రెండు నెలల్కితం అనుకున్నాం - ఎందుకనుకున్నాం అంటే, ఇద్దరం ఒకరికొకరు నచ్చి, ఒకరినొకరు అర్థం చేసుకున్నాం అనుకున్నాం" కల్యాణి వంక సూటిగా చూస్తూ ధైర్యంగా అంది.

"సరే, బాగుంది మరి ఇప్పుడెందుకు చేసుకోనని చెప్పాడు. కారణం చెప్పాడా?"

"సరిగా చెప్పలేదు - మన పెళ్ళి వర్క్ అవుట్ అవుతుందనిపించడంలేదు మనం గుడ్ బై చెప్పుని స్నేహితుల్లా విడిపోదాం" అంటూ ఏదో మాట్లాడాడు - ఇన్నాళ్ళు తిరిగి ఇప్పుడిలా అంటున్నారు." కోపంతో మాటలు తడబడ్డాయి శృతికి.

"వాడలా అన్నాడంటే, కారణం మీ ఇద్దరికి తెల్సుండాలి - ఈ విషయంలో నేనేం చెయ్యగలనని నీవు అనుకుంటున్నావు" కల్యాణి శృతి వంక సూటిగా చూసింది.

"మీరు తన తల్లిగదా. ఓ ఆడపిల్లతో తిరిగినన్నాళ్ళు తిరిగి పెళ్ళిమాట ఎత్తేసరికి ఇలా అనడం ఏం న్యాయం- అని ఓ తల్లిగా నచ్చచెప్తారని, ఓ చదువుకున్న తల్లిగా మీరు పరిస్థితి అర్ధం చేసుకుని సరిదిద్దుతారని" ఆమె కళ్ళల్లో బాధకంటే పౌరుషం, అవమానం కనిపించాయి.

"చూడమ్మా, ఇందాక అనను అన్నమాట ఇప్పుడనక తప్పడంలేదు - మీరిద్దరూ కలిసి తిరిగినపుడు, ప్రేమించుకున్నప్పుడు నాకు చెప్పారా, నా అనుమతి తీసుకున్నారా? ఇప్పుడు తల్లిగా నేనేదో నా కొడుక్కి చెప్పేసి, మందలించేసి పరిస్థితి చక్కదిద్దాలని ఆశించడం అత్యాశేమో. ఇంతకీ నా కొడుకు నే చెప్పినంత మాత్రాన మాట వినేస్తాడా?! ఈ రోజుల్లో పిల్లలు తల్లి తండ్రుల మాటకి విలువ, గౌరవం ఇస్తున్నారా? ఇదే స్థితిలో నువ్వుంటే నీ తల్లి మాటవింటావా - తల్లితండ్రుల మాట వినివుంటే మీ ఇద్దరూ ప్రేమవ్యవహారం నడిపి ఉండేవారా?"

శృతి ఆవేశంగా ఏదో అనబోయింది. కల్యాణి చేత్తో వారించి "చూడమ్మా అసలు మీ ఇద్దరి మధ్య ఏం జరిగిందో, వాడెందుకలా అన్నాడో నాకేం తెలీదు. నీ వైపు నీవు చెప్పావు - వాడి వర్షన్ కూడా వినాలికదా! వాడ్ని అడుగుతాను, వాడు చెప్పింది విన్నాక. .. ఇంతకీ ఓ విషయం చెప్పు - మీ ప్రేమ సినిమాలు షికార్లు, డిన్నర్ల వరకేనా అంతకంటే ముందుకు వెళ్ళిందా?"

శృతి కళ్ళు వాల్చుకుంది. జవాబుకి తడుముకుంటూ "చాలా దూరమే వెళ్ళింది. కానీ మీరనుకున్నంత దూరంకాదులెండి, ఇంత ఇంటిమెసిగా మెలిగాక ఓ ఆడపిల్ల భవిష్యత్తు ఏమవుతుందో మీకు తెలుసు."

"ఫరవాలేదు. ఇంకా ఈ మాత్రం ఆలోచించగలిగే విచక్షణ నీకు మిగిలినందుకు సంతోషం - మీ యువత ఎవరినీ లెక్క చెయ్యక్కరలేదనుకుంటుంది కానీ, ఇంక ఈ సమాజం మీరు ఆశించినంత ఎదగలేదు, కనీసం పెళ్ళిళ్ళ విషయంలో ఇలాంటివన్నీ పట్టించుకుంటుంది. ప్రేమించుకోడానికి పెద్ద వాళ్ళ ప్రమేయం అక్కరలేదు - కానీ సమస్యలెదురయినపుడు పెద్దవాళ్ళు గుర్తుకు వస్తారు, చిక్కుముళ్ళు విప్పడానికి. పిల్లలు చేసిన తప్పులకి పెద్దలని బాధ్యత చేస్తారు. అలాగే నీవిపుడు నన్ను."

"మిమ్మల్ని నేనేం అనలేదు - ఓ తల్లిగా ఓ ఆడపిల్లకి బాసటగా నిలుస్తారని ఆశించానంతే. అది తప్పంటారా?" నిలేసింది.

"శృతీ, నీవు మంచి తెలివైన అమ్మాయివని, మాటకారివని ఈ తెలివితేటలతో నీ ప్రయత్నాలు నీవు చేసే ఉంటావనిపిస్తూంది. సరే, నీవు ఈ వ్యవహారం నాదాక తెచ్చావు కనుక ముందు సంకల్ప్ ఏం చెప్తాడో విని నీకు నేను ఫోను చేసి చెప్తాను - వీటన్నింటికంటే ముందు మీ కుటుంబం గురించిన వివరాలు, నీ బయోడేటా నాకు కావాలి. నా ఇ మెయిల్ అడ్రసుకి పంపు" అంటూ కాగితం మీద ఇ మెయిల్ అడ్రసు రాసి ఇచ్చింది -

"థాంక్స్ ఆంటీ, మీ నుంచి మంచి న్యూస్ వింటానని ఆశిస్తా" అంటూ బయటికి వెళ్ళిపోయింది - ఆమె వెళ్ళినవైపు అలా చూస్తూ కూర్చుండిపోయింది కల్యాణి -

●●●

"ఓ, ఆవిడగారు నీ దగ్గరకొచ్చిందా కంప్లైంట్ చేయడానికి?" కాస్త కోపం, కాస్త హేళన కలిపి అన్నాడు అన్నం తింటూ.

"అసలు ఏమిటిదంతా, మీ ఇద్దరి మధ్య సమస్య ఏమిటి, అసలు ఇన్నిరోజులు మీ పరిచయం గురించి ఎప్పుడూ చెప్పలేదు నీవు - పెళ్ళిచేసుకుందాం అనుకున్నప్పుడైన మాతో చెప్పాలని నీకనిపించలేదా?" నిష్టూరంగా అంది కల్యాణి.

సంకల్ప్ చూపు తప్పించి, చిన్నగా దగ్గి, నీళ్ళు తాగి" చెప్పాలనుకున్నానమ్మా! కానీ మేం ఇద్దరం పూర్తిగా నిర్ణయించుకున్నాక, మీ దగ్గరకి తీసుకొచ్చి చెప్పాలనుకున్నాను - కాని, ఈలోగానే" ఆగాడు.

"ఈలోగానే ఏం అయింది, ఎందుకు మనసు మార్చుకున్నావు? - ఒక అమ్మాయితో తిరిగినన్నాళ్ళు తిరిగి పెళ్ళిమాటవచ్చేసరికి మనసు మార్చుకున్నానని చెప్పడం సంస్కారమా?" కొడుకుని నిలేసినట్లడిగింది కల్యాణి.

"కూల్ డౌన్ అమ్మా! నీవు స్త్రీ పక్షపాతివని నాకు తెలుసు. నీ ఆశయాలు, ఆదర్శాలు పక్కన పెట్టి ఓ తల్లీ కొడుకుల్లా మాట్లాడుకుందాం"

"సరే చెప్పు, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోన్నావుట - కారణం ఏమిటో తల్లిగా అడిగే హక్కు నాకుందా? ఉందంటే చెప్పు -"

"అమ్మా, ఆ అమ్మాయిని చేసుకుంటే నా జీవితం సులువుగా ఉండదనిపించింది. ఆమెతో చనువు పరిచయం పెరిగిన కొద్దీ, ఇద్దరి అభిప్రాయాలు కలవడం లేదనిపించింది. పెళ్ళిచేసుకునే ముందే అభిప్రాయాలు కలవకపోతే ఆ తర్వాత ఆ కాపురం ఎలా ఉంటుంది? లక్కీగా ముందే ఇలా నిర్ణయం తీసుకోగలిగినందుకు ఎంత రిలీఫ్‌గా ఉందో తెలుసా -?"

"సంకల్ప్ - ఏడెనిమిది నెలల పరిచయంకదా! - ఇంతదూరం వెళ్ళేముందే అన్నీ సరిగా ఆలోచించుకుని ప్రొసీడ్ అవాల్సింది -"

"ఏంటమ్మా అలా మాట్లడుతావు. ముందే ఎవరెలాంటివారో ఎలా తెలుస్తుంది? అమ్మాయి బాగుంది - చదువుకుంది, తెలివుంది అని స్నేహం మొదలుపెడతాం. తర్వాత అది ప్రేమగా మారాక కదా పెళ్ళిదాకా వెళ్తాం ఎవరన్నా - కొన్నాళ్ళు దగ్గరగా కలిసిమెలిసి తిరిగాక కదా ఎవరెలాంటివారో అసలు సంగతులు అర్థమవుతాయి -"

"సరే, ఇప్పుడా అమ్మాయిలో నీకు నచ్చనిది ఏమిటి?"

సంకల్ప్ జవాబు చెప్పకుండా భోంచెయ్యసాగాడు.

"చెప్పు అసలు సంగతి ఏమిటో తెలిస్తే కదా నేనా అమ్మాయికి జవాబు చెప్పగలను -"

"నీవెందుకు చెప్పడం- చెప్పాల్సింది నే చెప్పానుకదా - 'ఇది మీఇద్దరికి సంబంధించింది, మధ్యలో నేనెందుకు' అని చెప్పు -" నిర్లక్ష్యంగా అన్నాడు.

"చూడరా, అలా చెప్పి వదుల్చుకోడానికి అరనిమిషం పట్టదు. ఓ ఆడపిల్ల తల్లిగా అంత బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే నా చదువుకి అర్థంలేదు. ఇదే పరిస్థితిలో నా కూతురు ఉంటే, నీ చెల్లెలు ఉంటే ఇంత నిశ్చింతగా వదిలేస్తామా? మనచేతనయినంతగా సరిదిద్దాలని తాపత్రయపడ్తాంగదా! ఈ అమ్మాయి ఇంటికి వచ్చి నా సాయం కోరింది. ఏం జరిగిందో, జరిగిందానిలో నీ తప్పేంటో తెలుసుకోకుండా నిశ్చింతగా ఉండడం నా మనసుకి నేను నచ్చచెప్పుకోలేని విషయం - నీవు నా కొడుకువి. విషయం నాదాక వచ్చాక పట్టనట్టు ఎలా ఉండమంటావు?" పట్టుదలగా అంది.

"అబ్బ, అమ్మా! నీవు చాలా సెన్సిటివ్. అతిగా ఆలోచిస్తావు - చూడమ్మా ఆ అమ్మాయితో నాకు సరిపడదమ్మా - ఊరికే వాడుకుని వదిలేసే రకం కాదు నీ కొడుకు - నీ పెంపకం మీద నీకామాత్రం నమ్మకం ఉంటే నేనేం తనని అన్యాయం చెయ్యలేదని నమ్ము - అమ్మా చెప్పడానికి పెద్దకారణం లేదు - ఆ అమ్మాయి స్వభావం నాకు నచ్చలేదంతే.

"ఉదాహరణ చెప్పు.. ఆ కారణం నన్ను నమ్మించగలిగితే నిన్ను ఇబ్బంది పెట్టను"

"అమ్మా, కొన్ని విషయాలు చెప్పడానికి ఉండవు. అనుభవంలోకి వస్తాయి. అవి చెప్పినా చిన్న విషయాలుగా నీకు కనపడచ్చు. కానీ అవతలివాళ్ళకి విముఖత కల్గించవచ్చు - సరే, అడుగుతున్నావుగా, విను, తను నన్నెందుకు చేసుకోవాలనుకుంటుందో తెలుసా! నా ఉద్యోగం, డబ్బు, నా ఆస్థి, హోదా, అంతస్థు చూసి. మొదట్లో తను నిజంగా నన్ను ప్రేమిస్తూందనే అనుకున్నాను, నా మీద చాలా అభిమానం అనుకున్నాను. నా గురించి, మీ గురించి, మీ ఉద్యోగాలు, మనిల్లు అన్నీ చూపించాను."

"మన ఇల్లు చూపించావా? ఎప్పుడు తీసుకువచ్చావు" ఆశ్చర్యంగా అడిగింది.

"మీరిద్దరూ తాతగారికి బాగోలేదని వైజాగ్ వెళ్ళారు చూడు అపుడు" చూపు తప్పించి అన్నాడు.

కొడుకు వంక ఓ చూపు విసిరి కల్యాణి - "ఊ, సరే చెప్పు" అంది

"అమ్మా - మన ఇల్లు, హోదా, మన కార్లు, అంతస్థు అన్నీ చూసింది మొదలు పెళ్ళి పెళ్ళి అంటూ ఊదరగొట్టడం మొదలుపెట్టింది - 'పెళ్ళికాకుండా నీతో తిరిగితే మా వాళ్ళు ఒప్పుకోవడంలేదు. వెంటనే చేసుకో అంటున్నారు' అని రోజూ ప్రెషరైజ్ చేయడం మొదలు పెట్టింది. ఓ రోజు బలవంతంగా వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళి వాళ్ళ నాన్నచేత అడిగించి నన్ను ఇబ్బందిలో పడేసింది. అమ్మా వాళ్ళు చాలా మామూలు సంసారులు. ఆయనకేదో చిన్న ఉద్యోగం, తల్లి టీచరు. ముగ్గురమ్మాయిలు. ఒక అమ్మాయి పెళ్ళి అయింది. ఇంకో అమ్మాయి చదువుతోంది. లోను పెట్టి ఇంజనీరింగు చదివిందట. నేను తనకి మొదట్లోనే చెప్పాను. 'పెళ్ళి యిప్పుడప్పుడే చేసుకోను. నన్ను కంపెనీ అమెరికా పంపిస్తోంది. అక్కడెన్నాళ్ళుండాలో ఏడాదా, రెండేళ్ళా ఇవన్నీ తేలకుండా చేసుకోను' అన్నాను. అప్పటినుంచీ నేను తనకందకుండా ఎక్కడ జారిపోతానో అని, 'పోనీ ముందు ఎంగేజ్ మెంట్ చేసుకుందాం - మీ వాళ్ళని కలిసి మా వాళ్ళు మాట్లాడతారు' అంటూ చంపడం మొదలు పెట్టింది. అంతేకాదమ్మా తను చాలా గ్రీడి అని చాలా సందర్భాలలో అర్థమయ్యాక తన మీద సదభిప్రాయం జారిపోసాగింది" సంకల్ప్ విముఖత మాటల్లోనే కనిపించింది కల్యాణికి.

"అంటే - ఎందుకలా అనిపించింది.?" రెట్టించి అడిగింది.

"అమ్మా ఈ ఆరునెలలలోనే నా చేత ఎంత ఖర్చుపెట్టించిందో తెలుసా - ఫైవ్ స్టార్ హోటళ్ళకి వెళ్ళాలి నీలాంటివాడు, ఈ హోటల్‌కంటే అనేది. బర్త్‌డేకి ఇదేం గిఫ్ట్? అంటూ బుంగమూతి పెట్టి హాస్యంగా అంది. 'వాలెంటైన్స్ డేకి ఏమిస్తావో చూస్తా ఇలాంటలాంటిదయితే ఊరుకోను' అంటూ జోక్‌గా అంటున్నట్టు అనేది. ఓసారి చనువుగా నా పర్స్ తీసి మూడు, నాలుగు క్రెడిట్ కార్డులు చూసి హాస్యంగా అన్నట్టు 'ఇన్ని కార్డులా? నా కోటి ఇచ్చిచూడు ఒక్కరోజులో నీబ్యాంక్ బాలెన్స్ జీరో అయిపోతుంది - యూ ఆర్ లక్కీ యార్! మీ ఇంట్లో అందరూ ఇంత సంపాదిస్తున్నారు - మీకు ఒక బంగళాయేనా ఇంకా ఇళ్ళున్నాయా - నీవు వేరేగా ఏదన్నా అపార్ట్ మెంట్ కొనుక్కున్నావా? - పెళ్ళి అయ్యేసరికి పెద్ద అపార్ట్ మెంట్ రెడీగా ఉండాలి తెలుసా? నా ఇష్టం వచ్చినట్టు డెకరేట్ చేస్తాను. నాకో కారు కావాలి తెలుసా..' ఇలా కోరికలు - డబ్బుపట్ల ఆమె గ్రీడీనెస్, అసహ్యంగా ఓపెన్‌గా బహుమతులు అడగడం, మన ఆస్తుల గురించి ఆరాలు ఇవన్నీ నాకెందుకో ఆమెది ఛీప్ మెంటాలిటీలా కనిపించింది. పెళ్ళికాకముందే ఇంత డిమాండ్, ఇన్ని కోరికలు. రేపు పెళ్ళయ్యాక ఆమె ఆశలు, కోరికలకి అంతుండదేమో. ఎందుకో నాకు ఆమె మీద సదభిప్రాయం పోయింది అమ్మా! అంతేకాదు వాళ్ళ నాన్న మాటలూ అంతే - నా జీతం, మనిల్లు, ఆస్థి గురించి ఆరాలు -"

"సరే ఆయన తండ్రిగా మన ఆస్థిపాస్తులు తెలుసుకోవాలనుకుని ఉండచ్చు."

"అమ్మా, తెలుసుకునే పద్ధతి ఉంటుంది. లేకిగా మొహం మీదే అడగరు - ఏమోనమ్మా నాకెందుకో మొత్తం వ్యవహారం నచ్చలేదు. మనకి తగినవారు కారు"

"అంటే, హోదా, అంతస్థు"

"అదికాదమ్మా వాళ్ళు మనకంటే తక్కువ అంతస్థులో ఉండడంలో తప్పులేదు. అంతస్థు తక్కువయినా ఆత్మాభిమానం తక్కువ ఉండకూడదు - డబ్బులేకపోయినా హుందాతనం ఉండాలి. అది ఆ ఫ్యామిలీలో కరువు అని అర్థమయిందమ్మా" విసుగ్గా అన్నాడు.

"ఆడపిల్లకదా, కాస్త లేనింటినుంచి వచ్చింది, కోరికలు తీర్చుకోవాలని కలలు కనడం సహజం." కల్యాణి సాలోచనగా అంది"

"అమ్మా ప్లీజ్ అలా తనని సమర్థించవద్దు - నీకు తెలియదు తన సంగతి - దగ్గిరనుంచి కలిసి మెలిసి తిరిగినపుడే తెలుస్తుంది స్వభావాల సంగతి - అంతేకాదమ్మా తనతో తప్ప ఆఫీసులో ఇంకెవరితోనైనా మాట్లాడితే అలకలు - అసూయ"

"అదేరా ఇప్పుడు సమస్య - కలిసి మెలిసి తిరిగాం - చాలా క్లోజ్‌గా మూవ్ అయ్యాం అంది. అలాంటప్పుడు ఇప్పుడు కాదనడం తప్పుకదా, అదే నన్ను ఆలోచింపచేస్తోంది."

"ఏమిటమ్మా తన మాటలు అంత సులువుగా నమ్మావు. మా మధ్య మీరనుకునేటంత సీను ఏం లేదు. డిన్నర్లకెళ్ళాం - సినిమాలకెళ్ళాం - హద్దులేం దాటలేదు. స్నేహితుల్లా దగ్గిరగా ఫోటోలు - చేతిలో చెయ్యేసి షికార్లు ఇవన్నీ బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ మధ్య చాలా మామూలు విషయం - అమ్మా, నిజం చెప్పాలంటే, తనే నాకు దగ్గిరకావాలని ప్రయత్నించేది - కారులో నా భుజం మీద తలవాల్చేది. పార్కులో చేతిలో చెయ్యేసి బిగించేది - డిన్నర్లలో స్పూన్‌తో తినిపించేది- సినిమాలో ఓసారి తనే చటుక్కున బుగ్గమీద కిస్ చేసింది - పెద్ద ఏదో జరిగిపోయినట్టు చెప్పినవి ఇవే సీనులు - ఇంతకంటే ఏంలేదు నన్ను నమ్ము " నిజాయితీగా అన్నాడు.

"ఏమిటో నాయనా మీ ప్రేమలు, స్నేహాలు. చెట్టా పట్టాలేసుకు తిరుగుతారు. మళ్ళీ నచ్చలేదంటారు - ఏదో పెద్దవాళ్ళు చూసిన సంబంధం చేసుకుంటే వివాహ బంధంలో, ఆ బంధం అంత సులువుగా విడిపోనీయదని నమ్మేవారం - పెళ్ళికాకముందు తిరగడాలు మూన్నాళ్ళ ముచ్చటగా మురిపాలు ముగిసిపోవడం, పెళ్ళికాకముందే అన్ని అనుభవాలు పూర్తయిపోయి, అసలు రంగులు బయటపడిపోవటం - వద్దనుకోడాలు - ఒకళ్ళమీద ఒకరు నెపాలు, కక్షలు. ఏమిటో మీ యువత ధోరణి మాలాంటివారికి అర్థంకాదు - సరే పాపం ఆ అమ్మాయి నీమీద ఆశలు పెట్టుకుంది. ఏం చెప్పాలి అని"

"అబ్బ అమ్మా ఇంత చెప్పినా ఇంకా జాలిపడ్తావేమిటి? నేనే మళ్ళీ తనతో చెప్పుకుంటా - నీవేం మాట్లాడకు" సంకల్ప్ తేలిగ్గా అన్నాడు.

●●●

కల్యాణి చెప్పింది అంతా విన్నాక సారథి చిన్న నిట్టూర్పు విడిచి "ఏం చేద్దాం అనుకుంటున్నావు?" అన్నాడు భార్యవంక చూసి అడిగాడు.

"అదే ఆలోచిస్తున్నా"

"చూడు ఆ అమ్మాయి మనింటికి వచ్చి అడిగింది కనక నీవూ వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళ పేరెంట్స్ ముందే సంకల్ప్ అభిప్రాయం చెప్పిరా. జరిగిందానిలో మన ప్రమేయం లేదు కనక మనం దోషులుగా నిలబడక్కరలేదు - మర్యాదగా చెప్పి వచ్చేయ్" సలహా ఇచ్చాడాయన.

●●●

"శృతీ.. శనివారం మీ ఇంటికి వస్తాను, మీ వాళ్ళని కూడా ఉండమను"

"తప్పకుండా ఆంటీ" శృతి గొంతులో ఆనందం. ఇంటికొచ్చి అందరితో మాట్లాడతాననడం సంబరంగా తల్లితండ్రులతో వార్త చెప్పింది.

●●●

"శృతీ నేను మా అబ్బాయితో మాట్లాడాను. చూడమ్మా సిఫార్సులతో పెళ్ళిళ్ళు చేయగలం కాని కాపురం చేయించలేం అన్నది వాడితో మాట్లాడాక అర్థమైంది - సారీ, నీకు నేనేం సాయం చెయ్యలేకపోయాను"

శృతి మొహం మీద ఒక్కసారి నీళ్ళు జల్లినట్టు ఉలిక్కిపడింది. ఆమె మొహం కళావిహీనం అయింది.

"కారణం ఏం చెప్పాడు సంకల్ప్?" ఆమె గొంతులో మార్దవం పోయి కాఠిన్యత చోటుచేసుకుంది.

"ప్రత్యేకంగా ఇది అని చెప్పలేదు" కొడుకు చెప్పిన కారణం శృతికి ఎలా చెప్పాలో అర్థంకాక నసిగింది. "అమ్మా చూడు.. వాడిష్టపడనప్పుడు బలవంతంగా ఒప్పించలేం - అలా పెళ్ళాడుతే ఆ పెళ్ళిలో నీకేం సుఖం దొరుకుతుంది? నీకు నచ్చిన వాడిని చేసుకో"

"నచ్చినవాడనే తిరిగాను మీ అబ్బాయితో. ఆడపిల్లలతో ప్రేమాయణాలు జరిపి ఇప్పుడిలా అనడం... పెద్దవారు మీరు ఒప్పిస్తారని ఆశపడ్డాను" ఆవేశంగా అంది.

"చూడండమ్మా మేం ఆడపిల్లవాళ్ళం. మా అమ్మాయికేం తక్కువని మీ అబ్బాయి ఇపుడు వెనక్కి తగ్గాడు. కనీసం కారణం చెప్పాలికదా!" దురుసుగా అన్నాడు శృతి తండ్రి.

"చూడండి, ఇది మనం కుదిర్చిన సంబంధం అయితే మీకు ప్రశ్నించే అధికారం జవాబు చెప్పాల్సిన బాధ్యత మాకుండేది. వాళ్ళిద్దరూ ఇష్టపడి ప్రేమించుకున్నారు, కలిసి తిరిగారు - మా ప్రమేయం కాని దానికి మేము జవాబుదారి కాలేం. మా అబ్బాయి వద్దనుకోడానికి వాడికారణాలు వాడికున్నాయి. వాడిని బలవంతం పెట్టి పెళ్ళిచేయించలేం కదా. నన్ను అనేముందు మీ అమ్మాయిని మీరు అదుపులో పెట్టుకున్నారా? వాళిద్దరూ కలిసి తిరుగుతున్నప్పుడే ఆరా తీయాల్సింది. మీకు వీలయితే కట్టడి చేసుకోవలిసింది. ఈనాటి యువత ప్రేమించుకోడం వాళ్ళ హక్కు అనుకున్నప్పుడు కేవలం అక్షింతలు జల్లే బాధ్యత మనకిస్తున్నారు. ఇది మీకూ తెలుసు. వారిద్దరూ స్వవిషయం అనుకున్నప్పుడు నా జోక్యం ఎంతవరకన్నది మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మా అబ్బాయి మీ అమ్మాయితో చెప్పేశానని చెప్పినా మీ అమ్మాయి నా దగ్గరకొచ్చి సాయం అడిగింది కనక మర్యాదగా చెప్పాలని వచ్చాను - నాకూ ఓ ఆడపిల్ల ఉందన్న సానుభూతితో" శృతి తండ్రి మాట్లాడిన ధోరణి నచ్చక కాస్త ధృఢంగానే అంది కల్యాణి.

"మీ సానుభూతి కోసం అడగలేదు" విసురుగా అంది శృతి.

"సరే అమ్మా, ఇందాక చెప్పినట్లు సిఫార్సులతో కాపురాలు, పెళ్ళిళ్ళు నిలబడవు వస్తా!" కల్యాణి లేచి గుమ్మం వైపు నడిచింది.

"మీ అబ్బాయికి చెప్పండి. అంత ఈజీగా తప్పించుకోలేడని. నేను అందరమ్మాయిల లాంటిదాన్నికానని. నా దగ్గరున్న ఆధారలతో ఏదన్నా చెయ్యగలను" కసిగా అంది శృతి వెనకనుంచి.

గుమ్మం దగ్గిర నుంచి వెనక్కి తిరిగి శృతివంక ఓసారి సూటిగా చూసి వెనక్కి తిరిగిన కల్యాణికి ఆ క్షణంలో రెండురకాల భావాలు మనసుని చుట్టుముట్టాయి. అమ్మగా కొడుకు తీసుకున్న నిర్ణయానికి ఓ పక్క సంతోష పడాలా - అతివగా అబ్బాయి అమ్మాయిల స్థానాలు తారుమారు అయిపోతున్నందుకు మరోపక్క సంతోష పడాలా.!!??

****

*కథ వెనుక కథ*

*కొన్ని దశాబ్దాలుగా స్త్రీ సమస్యల గురించి, స్త్రీల ధైర్యసాహసాల గురించి కథలు వ్రాస్తున్నాను. ఐతే 30-40 సంవత్సరాల క్రిందటి అమ్మాయిల మనస్తత్వాలకి, ఈ కాలం అమ్మాయిల మనస్తత్వాలకి చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. కాలం మార్పుతో అది సహజమే ఐనా కొంతమంది అమ్మాయిల ప్రవర్తన అప్పుడప్పుడు కాస్త విడ్డురంగా అనిపిస్తోంది. కొన్ని విన్న, మరికొన్ని చూసిన సంఘటనల ఆధారంగా అల్లిన కథ ఇది.*

- రచయిత్రి

కౌముది

# స్టింగ్(స్టింక్) ఆపరేషన్ విజయభాస్కర్

అసెంబ్లీ హాలు కిటకిటలాడుతోంది, స్టేజీ మీద అతిరథ మాహారథులు అందరూ ఉన్నారు. వ్యాఖ్యాత, పేరు పేరునా స్వాగతిస్తున్నాడు. సిటిజెన్ జర్నలిస్ట్స్ కి అవార్డ్స్ ఇచ్చే సమావేశం అది. రాజకీయ, ప్రభుత్వ మరియు మీడియా ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆ హడావిడి చూసి బిక్క చచ్చిపోయి ఉన్నాం, నేనూ మా ఆవిడ. ఇంకా నయమే చిట్టి గాడిని తీసుకురాలేదు, వాడైతే ఏడుపు లంకించుకునేవాడు. మైకులో ప్రకటనల పరంపర కొనసాగుతోంది, ఒకరి తరువాత ఒకరు స్టేజీ మీద కి వెళ్ళి అవార్డ్లు తీసుకుంటున్నారు. తదుపరి నా పేరులానే ఉంది, నిర్వాహకుల్లో ఒకాయన ముందు వరసకి రమ్మని సైగ చేసాడు, ఈ లోగా మైకులో నా పేరు వినిపించింది. ముచ్చెమటలు నాకు, నడక కాస్త సరిచూసుకుని స్టేజీ మీదకు వెళ్ళాను, మా ఆవిడ క్రిందే ఉండిపోయినట్టుంది. CM చేతుల మీదుగా ఆ యేడాది మేటి సిటిజెన్ జర్నలిస్ట్ గా, నేర పరిశోధన విభాగం లో అవార్డ్ నాకు బహుకరించారు. మనసంతా ఉద్వేగం, ఉత్సాహం, అంతకు మించిన భయం. మైకు నా చేతికిస్తూ, ఏదైనా మాట్లాడమన్నారు.

నేను సరిగ్గా మొదలు పెట్టేసరికి పవర్ కట్, 'ఇంత పెద్ద కార్యక్రమానికి కూడా కరెంటు కోతేనా..' అని నేను విస్తుపోయేలోపే,

'ఏమండీ ఆ బ్యాటరీ ఫ్యాను ఆన్ చెయ్యండీ' అని అంటోంది మా ఆవిడ.

అంత హడావిడిలో, అన్ని శబ్ధాల మధ్య, తన గొంతు మాత్రం నాకు నిక్షేపంగా వినిపిస్తోంది. అదెలా సాధ్యం..

'అబ్బా ఆన్ చెయ్యండీ.. అని ఒక కుదుపు.'!

ఇంకా తెలవారలేదు.. వెలుగు దోబూచులాడుతోంది. సీలింగ్ ఫ్యాన్ అప్పుడే ఆగినట్టుంది. బ్యాటరీ ఫ్యాన్ ఆన్ చేసాను. చిట్టి గాడు లేవలేదు. పెద్దగా నిట్టూర్చాను. సో అదంతా నా కల అన్నమాట.. ఎంత మంచి కల, చివర్లో కరెంటు పోవడం తప్ప. అసలే తెల్లవారు జామునొచ్చే కలలు నిజమౌతాయంటారు, ఏమో ఈ కలా ఓ రోజు నిజమౌతుందేమో. మళ్ళీ పడుకోడానికి ప్రయత్నిస్తున్నా కానీ, ఒక వేళ ఆ పరిస్థితే వస్తే, నా ప్రసంగం ఎలా ఉండాలి. మొదట ఎవరిని ప్రస్తుతించాలి.. ఆలోచనలు అక్కడే ఉండిపోయాయి. మీడియా వాళ్ళకి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పడం మరచిపోకూడదు అనుకున్నా.

అలా కొంతసేపు మంచం మీదే దొర్లి ఇంక లేచేసాను. హాల్లోకొచ్చి ఈనాడు తీసాను, ఈలోగా అపార్ట్ మెంట్ క్రింద మళ్ళీ ఏదో గొడవ. "ప్రధాని రాజీనామా చెయ్యాలన్న BJP, జగన్ కి బెయిల్ ఇవ్వద్దన్న CBI", ఇంత కంటే ఏముంటుంది న్యూస్ అనుకొని, ఆ సందడేంటో చూద్దామని క్రిందకి దిగా. ఎప్పుడూ ఉండే సమస్యే, కాలువ నిండిపోయింది, ఆ చెత్త అంతా అపార్ట్ మెంట్ లోకి ప్రవహిస్తోంది. సెక్రెటరీ అర్జున రావు, ఇలాంటి టైంపాస్ విషయాల్లో ముందుండే చక్రవర్తి ఇద్దరూ అక్కడే ఉన్నారు. వాచ్ మాన్ ఏదో చెప్తున్నాడు. నన్ను చూసిన వెంటనే, చక్రవర్తి అందుకున్నాడు, అదిగో "మన రాజేష్ గారు కూడా వచ్చారు" అంటూ.

"అవునండీ మీరు కూడా ప్రభుత్వ ఉద్యోగే కదా, ఈ కార్పొరేషన్ వాళ్ళతో ఓ సారి మాట్లాడకూడదూ ?"

నేను పని చేస్తోంది నీటి పారుదల శాఖే కానీ, ఇంటి ముందు మురికి కాలువ మా పరిధిలోకి రాదే అని ఎన్ని సార్లు

మొత్తుకున్నా వీళ్ళకి అర్థం అయ్యి చావదు. మళ్ళీ ఇద్దరూ యూనివెర్సిటీలో ప్రొఫెసర్లు. వీళ్ళకి చెప్పడమే కానీ, వినడం చేతనవ్వదు పాపం.

"అలానే చూద్దాం లెండి, దానికేముందీ " అన్నా ఓ వెర్రి నవ్వుతో.

ఈ లోగా వాచ్ మాన్ తన FIR రిపోర్ట్ మొదలెట్టాడు. ఏదో చెత్త లారీ వాళ్ళు, వీధిలో ఉన్న చెత్తని పట్టుకెళ్తూ, మన ఫ్లాట్స్ ముందే సగం వొంపేస్తున్నారని.. దాని వల్లే కాలువ లో ఈ సునామి అని..

"అవునూ, మరి మొన్న దసరాల్లప్పుడు వాళ్ళు అడిగిన పదో పరకో పడేస్తే పోయేది " అన్నాడు చక్రవర్తి.

అసలు సమస్య బోధపడింది నాకు. అయినా సహాయ నిరాకరణ అంటే, చెత్త ఎత్తడం మానెయ్యాలి కానీ, మరీ ఇలా ఊర్లో చెత్త మన ఇంటి ముందు గుమ్మరించడం అన్యాయం అనిపించింది నాక్కూడా. మరో ఫిర్యాదు, బ్లీచింగ్ పౌడర్ ని సంచీల్లోకి ఎత్తి బయట అమ్ముకుంటున్నారని. ఎవరైనా కంప్లైంట్ చెయ్యాలి సార్ అంటున్నాడు వాచ్ మాన్ బావమరిది. సెక్రెటరీ, చక్రవర్తి ఆ బాధ్యత నాకే అప్పజెప్పారు. ఏమంటాం ఊ కొట్టి ఇంటికి తిరిగొచ్చా. అప్పటికే మా ఆవిడ "తిక్క తీరిందా" అనే రియాలిటీ షో లో ఏ టీం నెగ్గుతుందని పక్కింటి ఆవిడ తో చర్చలు. నన్ను చూసి చల్లారిన కాఫీ గ్లాసు చేతిలో పెట్టింది.

స్నాన పానాదులు ముగించుకుని, ఇడ్లీ వడ తో బ్రేక్ ఫాస్ట్ అయ్యిందనిపించి ఆఫీసుకు బయలుదేరాను. మధ్య దారిలో ఆ చెత్త గొడవ గుర్తొచ్చి, ఆశీల మెట్ట దగ్గరున్న కార్పొరేషన్ ఆఫీసులో దూరాను. అక్కడ సూపెరెండెంట్ నా పాత స్నేహితుడే, రాజారావ్. చూసిన వెంటనే పలకరించాడు, కుశల ప్రశ్నలు అయ్యాక అసలు విషయం చెప్పాను.

"మీ ఏరియా సానిటరీ ఇన్స్ పెక్టర్ ఎవరు ? " అడిగాడు రాజారావ్.

" ఏమో ఎవడికి తెలుసు," అన్నా.

"నువ్వు ఇలా ఏ వివరాలు లేకుండా వస్తే, ఇక్కడ పని జరగదు. ఇదంతా హైటెక్ యుగం, ఏదైన చెప్పాలంటే ముందు ప్రూఫ్ ఉండాలి మరి" అన్నాడు.

"అంటే ఎలాంటిది ? ఓ కేజీ చెత్త ఓ సంచిలో పెట్టి తేనా" అన్నా, ఒళ్ళు మండి.

"అలా కాదు రా, వాళ్ళు చేస్తున్న స్కాం ని కంటికి కట్టినట్టు చూపించగలగాలి. ఫర్ సపోజ్, ఒక ఫొటో నో, వీడియోనో, తెచ్చావనుకో, ఇదీ పరిస్థితి అని కమీషనర్ గారికి చెప్పొచ్చు. నా మాట సాయం నేను చెస్తాననుకో. కాని ముందు ఓ నిఖార్సైన సాక్ష్యం సంపాదించు" అని సలహా ఇచ్చాడు.

వాడన్నదీ నిజమే అని అనుకుని, ఇంక ఆట్టే వ్యవధి లేకపోవడం తో ఆఫీసుకి వెళ్ళి నా పనిలో మునిగిపోయాను.

సాయంత్రం పాం బీచ్లో టీ తాగి ఓ దమ్ము లాగుతుంటే, మెరుపులాంటి ఒక ఆలోచన వచ్చింది. తెల్లవారుజామునే ఆ కల రావడం ఏంటి.. తరువాత ఈ చెత్త కేసు నాకు తగలడం ఏంటి.. ఆలోచించి చూస్తే, నాకోసమే ఒక అవకాశం కాలింగ్ బెల్లు టింగూ టింగూ అని కొడుతున్నట్టు లేదూ ? .. అవును. నేనే ఒక స్టింగ్ ఆపరేషన్ని చేసి, అక్కడ జరుగుతున్న తతంగాన్ని వీడియో తీసి, ఏ TV9 వాడికో ఇచ్చేస్తే. ఇంకేముంది, సాక్ష్యానికి సాక్ష్యం.. పేరుకు పేరు.. అవార్డ్ కి అవార్డ్. అవిడియా అనుకోడానికి అణుబాంబు లానే ఉంది, కానీ తీయడం ఎలా.. నా దగ్గర ఉన్న ఈ డొక్కు ఫోన్ తో వీడియో తీస్తే, ఏంపడుతుంది, ఎవడు పట్టించుకుంటాడు. తీస్తే మంచి క్లారిటీ తో తియ్యాలి. అక్కడ హీరోలు, విలన్లు.. హీరోయిన్లూ అందరూ బాగా కనిపించాలి. అది కూడా విత్ డైలాగ్స్. టీవీ లో కనీసం ఓ నలభై సార్లైనా మన వీడియో ప్రసారం కావాలంటే, ఆ మాత్రం క్వాలిటీ తప్పదు. మరి ఇంక ఆలోచించలేదు. ఎలానో ఎప్పటినుంచో ఫోన్ మార్చాలని అనుకుంటున్నా, ఇంక ఆ తరుణం వచ్చింది అని డిసైడ్ అయ్యి, సిగెరెట్ క్రింద పడేసి, స్కూటర్ అధిరోహించి డాబా గార్డెన్స్ వైపు పోనిచ్చా. అక్కడ కాస్తో కూస్తో పేరు,

పార్కింగ్ ఉన్న ఓ షాపు లోకి దూరాను. నాకు కావల్సింది ఇదీ అని స్థూలంగా చెప్పా, షాపు వాడు ఐ ఫోన్ లానే ఉన్న ఒక మామోలు ఫోన్ చూపించాడు.

"సార్ ఇది చైనా ఐ ఫోన్, దీని ఫీచర్స్ మీకు లేటెస్ట్ ఐ ఫోన్ లో కూడా దొరకవు" అన్నాడు.

"మరి రేటో ?"

"పది వేలే, మీది తెలిసిన మొహం కాబట్టి, 9850 ఇవ్వండి. దీని వీడియో క్వాలిటీ తో మీరు రాం గోపాల్ వర్మ లా సినిమాలు తీసేయచ్చు. మీరు నమ్మరేమో, ఈ మధ్య పెళ్ళిళ్ళలో వీడియో వాళ్ళు ఈ ఫోనే వాడుతున్నారు" అని తేల్చాడు.

నిజానిజాలు ఇంక ఆలోచించలేదు. ఇప్పటికే అవార్డ్ లేటు అయిపోతోంది. జేబులో ఉన్న కార్డ్ గీకి, ఆ ఫోను బ్యాగులో పెట్టుకుని ఇంటికి బయలు దేరాను. స్కూటర్ మీద వెళ్తున్నా, ఫ్రేం ఎలా ఉండాలి.. ఏ డైరెక్షన్ లోంచి తియ్యాలి.. ఇవే ఆలోచనలు.

ఇంటికొచ్చేసరికి మా ఆవిడ చాలా బాధలో ఉంది, "మీ ఓదార్పు కావాలి" అంటూ తలుపు తీసింది. ఏంటి విషయం, ఎవరైనా దూరపు బంధువులు ఇంకా దూరం అయ్యారా అని అడిగా..

"కాదండీ, మన ఛీంకార్ షో "రివెంజ్" లో నేను ఎంతగానో అభిమానించే కంటెస్టంట్ ఈ రోజు ఎలిమినేట్ అయిపోయాడు."

"అవునూ, జడ్జ్ మీద చెప్పు విసిరాడు మరి" అన్నాడు చిట్టి గాడు.

"నువ్వుండ్రా.. అతనికి ఉన్న కష్టాలు మామూలువి కాదండీ.. అన్నీ సినిమా కష్టాలు." అంది మా ఆవిడ దీనంగా.

"సినిమ కష్టాలైనా, సీరియల్ కష్టాలైనా, మనం ఏంచెయ్యగలం" అన్నా, అమాయకంగా.

"వైల్డ్ కార్డ్ ఎంట్రీ ద్వారా తిరిగి అతను షో లోకి రావడం మన చేతిలోనే ఉందండీ. జస్ట్ ఓ వెయ్యో, రెండు వేలో SMS లు పంపాలంతే" అని ముగించింది వీజీగా.

మెసేజ్ ల సంగతి తర్వాత చూద్దాం లే, ఈ ఫోన్ ఎలా ఉందో చెప్పు అని నా కొత్త చైనా ఐ ఫోన్ ని బయటకి తీసా. ఇద్దరికీ ఫోన్ తెగ నచ్చేసింది. టెస్టింగ్ కోసమని ఓ రెండు వీడియోలు తీసాను, నిజంగానే చాలా బాగా వచ్చాయి. అవార్డ్ ఎంతో దూరం లో లేదు అని తేలిపోతోంది. భోజనాల టైం లో నా స్టింగ్ ఆపరేషన్ ప్లాన్ గురించి చెప్పాను. మా ఆవిడ నా వైపు ఓ రకంగా చూసింది, చిట్టి గాడు మాత్రం తన నైతిక మద్దతు ప్రకటించాడు. ఎంతైనా నా వారసుడు కదా, వాళ్ళ స్కూల్లో కూడా ఈ స్టింగ్ ఆపరేషన్ల గురించి మాట్లాడుకుంటున్నారంట. మా ఆవిడ కి ఈ చెత్తాపరేషన్ పెద్ద రుచించలేదు కానీ, అవార్డ్ సంగతి చెప్పాక, కాస్త కుదుట పడింది. ఆ కార్యక్రమానికి మాత్రం కొత్త చీర కొంటేనే రైలు ఎక్కుతానని ఫిక్స్ అయిపోయింది. ఇంక ఆట్టే లేట్ చెయ్యకుండా, మా ప్లాన్ ఇంప్లిమెంట్ చెయ్యాలని తీర్మానించాం.

"ఉదయం ఆ చెత్త లారీ వాళ్ళు, వచ్చేది ఆరు గంటలకి, అంటే మనం మన ఫొన్ తో అయిదున్నరకే రెడీ గా ఉండాలి", అని చిట్టి గాడికి ప్రోగ్రాం చెప్పాను. వాడు ఓ.కే అన్నాడు. పడుకున్నానే కానీ, అవార్డ్ స్పీచ్ ఆలోచనలు వదలవే నన్ను. మా ఆవిడ SMS లు పంపాలండీ.. అని గొణుకుతోంది. చిట్టిగాడేమో వాళ్ళ తెలుగు మాస్టారి మీద కూడా స్టింగ్ చెయ్యాలి అంటున్నాడు. నా బుర్రలో ఇంకా ఎన్నో మెదులుతున్నాయి.. రేషన్ షాపులు, బెల్టు షాపులు.. ఇవన్నీ. ఇన్ని రోజులూ ఓ సరైన ఆయుధం లేకపోవడం వల్ల సమాజం లో ఇంతటి అరాచకాల్ని చూస్తూ ఊరుకుంటున్నామనే ఆలోచనే బాధ పెట్టేస్తోంది. ఇంక ఓ భారతీయుడు, ఓ అపరిచితుడు, వాళ్ళ పెద్దనాన్నగారి అబ్బాయి.. ఇలా వీళ్ళందరిలా నేనూ అవినీతిని, అక్రమాలని ఎండగట్టాలని గట్టిగా అనేసుకుని, ముసుగేసుకుని పడుకున్నా.

ఉదయాన్నే లేచి మా ఆపరేషన్ కి తయారయ్యాను, చిట్టి గాడు కూడా సిద్ధంగా ఉన్నాడు. ఉన్నంతలో కాస్త మంచి చొక్కా

ప్యాంటూ వేసుకుని (మనం బిహైండ్ ది సీన్స్ అని తెలిసినా) రోడ్డు మీద కొచ్చాం. కాలువ ప్రక్కనే గోడ వారగా ఒక ప్రదేశం చూసి, ఆ యాంగిల్ ఐతే సరిగ్గా ఉంటుంది అని నిర్ధారించుకున్నాం. ఇంకా వీధిలో పెద్ద అలికిడి లేదు. ఓ చిన్న స్యాంపిల్ వీడియో తీసి చూసా, సరిపోతుంది. మాటలు ఎలా రికార్డ్ అవుతాయో మరి, అనుకుంటున్న టైం కి.. దూరంగా ఏదో చెత్త లారీ కొంత మంది స్టాఫ్ తో సహా వస్తోంది. రోడ్డు కి రెండో వైపు చిట్టిగాడిని ఉండమన్నా. నేను గట్టు మీదే స్తంభం పట్టుకుని, కాస్త ఎత్తులో చిన్న దిమ్మ లాంటి దానిపై నిలబడి వీడియో తియ్యడానికి సిద్ధం అయ్యాను. అనుకున్నట్టే, లారీ సరిగ్గా ఆక్కడే ఆగింది. చిట్టిగాడు కనిపిస్తున్నాడు, నా వైపు చూడొద్దని ముందే చెప్పా. క్లీనింగ్ స్టాఫ్ బ్లీచింగ్ పౌడర్ బస్తాలు ఇప్పారు, నేను వీడియో తీయడం మొదలు పెట్టాను. ఆ బస్తాల్లోది మెల్లగా సంచీల్లోకి నింపేస్తున్నారు. అలా ఓ అయిదు సంచీలు అయ్యాక, వాటిని ఓ వార పెట్టుకున్నారు. అప్పటికే లారీ ఫుల్ గా ఉంది, కాలనీలో చెత్త అంతా దాంట్లోనే ఉన్నట్టుంది. వాళ్ళల్లో వాళ్ళు ఏదో మాట్లాడుకున్నారు, "ఈ అపార్ట్ మెంటే" అని అనుకోవడం నా ఫోన్ చెవిన పడింది. ఓ పార తీసి కొంత చెత్తని మా కాలువలోకి తోసేసారు. ఇదేం ఘోరం అని నేను షాకు అయిపోయి, షేకు మాత్రం అవ్వకుండా, జార్తగా ఫోన్ ని ఫోకస్ చేస్తున్నాను. ఈ లోగా ఎక్కడి నుంచీ దూరిందో ఓ పాడు కుక్క ఆ లారీలోంచీ క్రిందకి దూకింది. సరిగ్గా వీళ్ళు పోస్తున్న చెత్తలో ఓ రాయి దాని మీద పడ్డం, అదేమో "కుయ్యో" అంటూ నేను ఉన్న స్తంభం వైపు ఉరకడం, ఆ అనుకోని సంఘటనకి బెంబేలెత్తిపోయి నేను "మొర్రో" అంటూ ఆ దిమ్మ మీంచి కాలువ గట్టు మీద పడడం.. చేతిలో ఉన్న నా కొత్త ఫోన్ కాస్తా ఆ పొంగి ప్రవహిస్తున్న డ్రైనేజీలో పడిపోవడం.. అంతా ఒక్క క్షణం లో జరిగిపోయాయి. "బాబూ చిట్టీ" అన్న నా అరుపుకి, అటు వైపున్న చిట్టిగాడు.. "నాన్నా ఫోన్", అంటూ ఇటువైపు పరిగెట్టాడు. ఇంకెక్కడి ఫోన్. నా అదృష్టం బావుండి, తలకాయి ఏ రాయిమీదో పడలేదు, లేకపోతే నా మెమొరీ కార్డ్ గోవిందా అయ్యేది. ఒళ్ళంతా మట్టి, చెత్త కంపు. మా వాచ్ మాన్ బావమరిది అక్కడే ఉన్నాడు, నేను గమనించనే లేదు.

"ఏటి బాబూ స్టింకాపరేషనా, బాగా పడిపోయినట్టున్నారు. పోన్లెండి, ఈ సారి సరిగ్గా తీద్దురు" అని చెయ్యిచ్చాడు.

"దేంతో ?", అంటూ, బట్టలు కొంచం దులుపుకుని, పూర్తిగా లేచే లోపే, "మీ పేస్ట్ లో ఉప్పుందా" టైప్ లో ఓ రెండు కెమేరాలు, పొడుగాటి బూజు మైకు పట్టుకుని ఒక యాంకరమ్మ ప్రత్యక్షం అయ్యింది. ఇది మళ్ళీ కలా అని నేను డవుటు పడదామనుకున్నా, నడ్డి నొప్పి కల కాదు అని తీక్షణంగా చెప్తోంది.

"సార్ వెల్కం టూ "మా చెత్త మీ ఇంట్లో" రియాలిటీ షో, మీరు ఇప్పుడు "ఛీ టీవీ" లో పడుతున్నారు. ఇలా రోజూ ఇంటి ముందు చెత్త వేస్తే మన నగర వాసులు ఎలా స్పందిస్తారన్నది మా షో కాన్సెప్ట్. ఎన్నో కాలనీల్లో మేము ఈ ప్రయోగం చేసాం, చెప్పుల్తోనో కర్రల్తోనో కొట్టేవాళ్ళనే చూసాం కానీ, మీ అంత క్రియేటివ్ గా దాన్ని ఒక స్టింగ్ ఆపరేషన్ గా మార్చేసిన వాళ్ళు ఇంతవరకూ మాకు ఎవరూ తారస పడలేదు. మీరు దగుల్ బాల్జీ బ్రదర్స్ తరఫున నూటా పదహారు రూపాయల విలువైన గిఫ్ట్ హాంపర్ గెలుచుకున్నారు. చెప్పండి సార్, మీ ఫీలింగ్ ఏంటి, అసలు మీకు ఇలాంటి ఐడియా ఎలా వచ్చింది, ఇలా అనుకోకుండా ఒక ప్రఖ్యాత చెత్త, సారీ, రియాలిటీ షో లో భాగమైనందుకు మీ అనుభూతి.. ". అని ఆపకుండా వాయించేస్తోంది యాంకరమ్మ.

నాకు ఇంకేమీ వినిపించడం లేదు. పదివేల ఫోన్, CM చేతుల మీదుగా అవార్డ్, అసెంబ్లీ హాల్లో నా స్పీచు, అన్నీ ఆ మురికి కాలవలో కొట్టుకుపోతున్నాయి.

"మిమ్మల్ని భయపెట్టిన మా కుక్క పేరు, "TRP", దానితో మీరు ఒక పోజ్ ఇస్తారా, మేము ప్రోమో లో వేసుకుంటాం" అంది యాంకరమ్మ. నా రెస్పాన్స్ తో ఏ నిమిత్తం లేకుండానే.

"ఇంటి ముందు చెత్త వేస్తుంటే, దాన్ని ఒక స్టింగ్ ఆపరేషన్ తో పట్టించచ్చు అనే ఆలోచన ఎంతమందికి వస్తుంది, ఈ రోజు

మన షో మూలాన మనకి అలాంటి ప్రత్యేకమైన వ్యక్తి పరిచయం అయ్యారు. ఆపరేషన్ లో భాగం గా చిన్న గాయాలు అవ్వడం వల్ల, ప్రస్తుతానికి మనతో మాట్లాడే పరిస్థితి లో లేరు ఆయన. ఏం పర్వాలేదు, మనం కాసేపట్లో ఆయన్ని ఇంటర్వ్యూ చెయ్యడానికి మళ్ళీ ప్రయత్నిద్దాం. అంతవరకూ చూస్తూనే ఉండండి మన చిలిపి ఛీ చానల్. గుర్తుంది గా మా కేప్షన్.. ఛీ చానల్ చూడని వాడు గాడిద. " .. ఇలా సాగదీస్తోంది ఆ టీవీ యాంకర్.

ఓ నిర్వేదపు నవ్వుతో, వాళ్ళ కెమేరాల్ని తప్పించుకుని, ఫోన్ కొట్టుకొని వెళ్ళిన వైపు కాస్త దూరం వరకూ చూసాం, నేనూ చిట్టిగాడు. దాని జాడ తెలీలేదు. ఒక వేళ తెలిసినా, ఇంక అది బతికి సిమ్ము కట్టదు ఎలానో. తూర్పు ఎటు వైపా అని చూసి, ఓ దండం పెట్టి ఇంటికి చేరుకున్నాం. వాచ్ మన్ బావమరిది అప్పటికే సంగతి అందరికీ మోసేసాడు. మా ఆవిడ నన్ను చూడ్డమే, మహదానందంగా ఏంటండి మిమ్మల్ని ఛీ టీవీ వాళ్ళు తీసారంట ? ఇంటెర్వ్యూ చేస్తారంట ? నిజమా ? మమ్మల్నీ తీస్తారా ? నేను మొన్న పండక్కి మా అన్నయ్య పంపించిన చీర కట్టుకోనా ? లేక నా పుట్టిన రోజుకి మీరు కొన్నదా ? అని ప్రశ్నల వర్షం. మా ఆవిడ రియాలిటీ షో సరదా తీరినందుకు ఆనందించాలో, నా స్టింగ్ ఆపరేషన్ కాస్తా ఇలా ఫ్లాప్ అయ్యి కూర్చున్నందుకు ఏడవాలో తెలీ లేదు. గదిలోకి వెళ్ళి మంచం మీద కూలబడి, కాస్త సద్దుకునే లోపే, పరామర్శలు, మరికొందరేమో ఆ చెత్త టీవీ లో పడ్డందుకు లోపల కుళ్ళిపోతూ బయటకి చెప్పే అభినందనలు. మొగుడుకొట్టాడని కాదు, తోటికోడలు దెప్పినందుకు అన్నట్టు తయారయ్యింది నా పరిస్థితి.

సరిగ్గా పావుగంట, ఛీ టీవీ వాళ్ళు కెమేరాలతో రెడీ అయ్యారు. వాళ్ళకి కావాల్సింది నా నోటితో చెప్పించుకుని, "ఛీ ఛీ" అనిపించి బయలు దేరారు. మా ఆవిడ ఆ లోపే మూడు చీరలు మార్చింది. హడావిడి తగ్గాక, మెల్లగా ఆఫీసుకు వెళ్ళాను. సాయంత్రం ఇంటికి వచ్చేటప్పటికి, అపార్ట్ మెంట్ సెక్రెటరీ మా ఇంట్లోనే ఉన్నాడు. వెలుగుతున్న మా ఆవిడ మొహం చూస్తుంటేనే నా గుండెల్లో రైళ్ళు పట్టాలు తప్పి మరీ పరిగెడుతున్నాయి. ఆయనే విషయం చెప్పడం మొదలు పెట్టాడు. మా అపార్ట్ మెంట్ పేరు టీవీ లో వచ్చేట్టు చేసినందుకు మా వాళ్ళంతా ఎంతో గర్వపడుతున్నారంట, అందుకని అసోసియేషన్ తరపున ఓ చిన్నపాటి సన్మానం చేస్తారంట నాకు, అదీ ఆయన మోసొకొచ్చిన విరగ (బ్రేకింగ్) వార్త. టీవీ లో "విధి చేయు వింతలెన్నో" అని పాటొస్తున్నా, నాకు మాత్రం "తలచినదే జరిగినదా దైవం ఎందులకు.." అనే పాట గుర్తొచ్చింది. ఆలోచనలో పడ్డాను.

***

## కథ వెనుక కథ

ఈ రోజుల్లో వార్తా చానళ్ళకి, ఎంటర్టైన్మెంట్ చానళ్ళకి పెద్దగా వ్యత్యాసం మిగల్లేదు. మన తెలుగు నాట ఈ వెర్రి మరీ ఎక్కువగా ఉంది. న్యూస్ ని రిపోర్ట్ చెయ్యడం కాకుండా, దాన్ని క్రియేట్ చెయ్యడమూ, అక్కర్లేని అర్థంలేని మెరుగులు దిద్దడమూ వాళ్ళ అలవాటుగా, మన గ్రహపాటుగా మారింది. ఒకప్పుడు ప్రింట్ లో వచ్చింది అంతా నిజమే అనుకునేవాణ్ణి, ఇప్పుడు దానికి విరుద్ధంగా, టీవీ లో వచ్చింది కనుక, అబద్ధమే అయ్యుంటుంది అనిపిస్తోంది. స్టింగ్ ఆపరేషన్లు, ఒకరి స్టింగ్ మీద మరొకడి స్టింగు. చూపించే దృశ్యానికి, వినిపించే గొంతులకి ఏమాత్రం పొంతన ఉండదు, దానికి తోడు, ఏ సస్పెన్సు సినిమా నుంచో ఎత్తుకొచ్చిన బ్యాక్ గ్రౌండ్ సంగీతం. వెరసి, ''కాదేది స్టింగుకి అనర్హం'' లా తయారయ్యింది. వీటికి తోడు, కన్నీళ్ళతోనూ, గిల్లికజ్జాలతోనూ కూడా TRP లు పెంచుకోవచ్చని నిరూపిస్తున్న రియాలిటీ షోలు. నాగరికత పేరుతో మనం ఉపకరణాలకి దగ్గరై, బాంధవ్యాలని దూరం చేసుకుంటుంటే, మనం పోగొట్టుకున్న ఎమోషన్స్ ని మనకే ప్యాక్ చేసి అమ్ముతున్నాయి ఈ షోలు. ఇందులో నటిస్తోంది, పాల్గొనే అభ్యర్థులో, న్యాయనిర్ణేతలో, లేక చప్పట్లు కొట్టి, ఈలలు వేసి

జరుగుతున్న డ్రామాకి తమ సంఘీభావం తెలియజేసే ప్రేక్షకులో చెప్పలేం మనం. ఈ రెండు జాడ్యాలని స్పృశిస్తూ, కొంచం సరదా టోన్ లోనే కథగా రాయాలని చేసిన ప్రయత్నమే ఈ "స్టింగ్ (స్టింక్) ఆపరేషన్".

\- రచయిత

# మీసాలాడి పెళ్ళాం స్ఫురిత మైలవరపు

కిటికీ వూచలు పట్టుకుని వేలాడుతూ చెయ్యి బయటకి చాపి, సన్నగా పడుతున్న వాన తుంపరలని పట్టుకుంటూ ఆడుతోంది చిట్టి. చిట్టీ వాళ్ల నాన్నకి ట్రాన్స్ఫర్ అయ్యి ఆ పల్లెటూరికి వారం క్రితమే వచ్చారు. ఇన్నాళ్ళూ.. మామ్మ తాతా, బాబాయ్ పిన్నీ, గున గునా తన వెంటే పరిగెడుతూ అల్లరి చేసే బుజ్జి బంటిగాడూ, ఇంతమంది మధ్యలో...అల్లరి చేస్తూ చిలో పొలో మంటూ తిరిగిన చిట్టికి ఇక్కడేం తోచడం లేదు. అసలే శుద్ధ పల్లెటూరు, ఊళ్ళో కట్టుబాట్లూ, ఆచార వ్యవహారాలు ఎక్కువగా వున్నాయని కనిపెట్టిన చిట్టీ వాళ్ళమ్మ, చిట్టిని ఆటలకని ఎక్కడకీ కదలనివ్వడం లేదు.

పోనీ ఇంటిగల మామ్మగారితోనో, తాతగారితోనో కాస్సేపు కబుర్లు చెబ్దామా అంటే...ఏవిటో ఎప్పుడూ మహా సీరియస్సు గా వుంటారు. వచ్చిన రెండో రోజు పెరట్లో ఎన్ని రకాల పూల మొక్కలున్నాయో అని చూసి మురిసిపోతుంటే ఒక బుల్లి సన్నజాజుల దండ చేతిలో పెట్టి 'ఓయ్ పిల్లా ఎప్పుడూ పువ్వులు కొయ్యకేమ్. నన్నడుగు ఎప్పుడైనా కావాలంటే అని జాగర్త చెప్పేసారు' మామ్మగారు.

'మీరెప్పుడైనా వూరెళ్తేనో..?' చనువుగా అడిగేసింది కనకాంబరాలకేసీ పందిరి మల్లెల కేసీ మెరిసే కళ్ళతో చూస్తూ, అమ్మ చేత ఎంత పెద్ద పువ్వుల జెడ కుట్టించుకోవచ్చో మనసులో లెక్కలేసేసుకుంటూ, ఆవిడకి మాత్రం నచ్చినట్టులేదు అలా అడగడం. 'మేవు వూరెళ్ళినా సరే...మొక్క మీద వేలెయ్యడానికి వీల్లేదు.నేనొచ్చేసరికి రాలిపోయి పడున్నా ఫరవాలేదు' అని చెప్పేసి విస విసా లోపలకెళ్ళిపోయింది.

ఆ మర్నాడు మధ్యాన్నం వేళ, వున్న ఆ బుల్లి మూడు గదుల ఇంట్లో వీధి గదిలో నుంచి వంటింట్లో కి రైమని కాస్త పరిగెట్టిందో లేదో పక్క వాటాలోనుంచి "యేయ్ అమ్మాయ్ ఏవిటా అల్లరి...చెవులు చిల్లులు పడిపోతాయ్ ఇక్కడ" అని తాతగారి గొంతు ఖంగు మనడంతో హడిలిపోయిన చిట్టికి ఏడుపొచ్చినంత పనయ్యింది. చిట్టీ వాళ్ళమ్మ చిట్టిని దగ్గరకి తీసుకుని...

"మన మామ్మా తాతగారూ కాదు కదమ్మా నువ్వు అల్లరి చేస్తే ముద్దు చెయ్యడానికి...వాళ్ళకి కొంచెం ఛాదస్తం ఎక్కువలాగుంది...నువ్వు బుద్ధి గా వుండాలి...మంచి పిల్ల అనిపించుకోవాలి" అని నచ్చ చెప్పింది.

ఏమర్ధమయినా అవ్వకపోయినా "మంచి పిల్ల అనిపించుకోవాలి" అన్న మాట అర్ధం అవుతుందనీ దానికోసం ఏమైనా చేస్తుందనీ చిట్టీ వాళ్ళమ్మకి తెలుసు.

ఆ రోజునుంచీ చిట్టికి ఆ ఇంట్లో బాగా నచ్చిన చోటు వీధి గది గోడకి వున్న బుల్లి కిటికీ...దాన్లో కూచోడానికి ఒక చిన్న గట్టు

లా కూడా వుండటంతో చదివేసే మహా మూడో తరగతికీ ఇచ్చిన కాస్త హోమ్ వర్కూ అందులో కూచునే చేసుకునేది...మిగతా టైమ్ అంతా ఆ కిటికీ లోంచి బయటకి చూస్తూ గడపటమే. ఎండయినా వానయినా మబ్బయినా ఆ కిటికీ లోనుండి కనపడేవే. ఆ కిటికీ లో నుంచి చూస్తే కనపడే రెండు ఇళ్ళే చిట్టి ప్రపంచం...కాలక్షేపం. స్కూలు నుంచి వచ్చి, తన పని అయిపోయాకా ఆ ఇళ్ళవాళ్ళని గమనిస్తూ కూచునేది. ఎప్పుడూ ఆ కిటికీ పట్టుకునే వేళ్ళడతావేవిటే అని చిట్టీ వాళ్ళమ్మ ఎప్పుడైనా కేకలేసినా......పోన్లే పాపం...దానికీ అంతకంటే తోచుబాటు ఏముంది అని చిట్టీ వాళ్ళనాన్న వెనకేసుకొస్తూ వుండేవారు. చిట్టికి కనపడే ఆ బుల్లి ప్రపంచమే దాని చిన్ని బుర్రకి ఒక టీవీ ఐపోయింది, టీవీలు ఇంకా ప్రతీ ఇంటిలోనూ భాగం అయిపోని ఆ రోజుల్లో.

ఆ రెండు ఇళ్ళల్లో ఒక ఇల్లు బాగా వెనకగా వుండి ముందంతా పెద్ద పెరడు వుండేది. ఆ ఇంట్లో వోణీలు వేసుకునే వయసమ్మాయి రోజూ సాయంకాలం పూట ఆ పెరడంతా తుడిచి...కళ్ళాపి చల్లి పెద్ద పెద్ద ముగ్గులు పెడూతూ వుండేది. తుడవడం మొదలు ముగ్గు పూర్తయ్యేవరకూ ఆ మొత్తం పని చిట్టికి కి మహా సరదాగా అనిపించేది. అప్పుడప్పుడూ చిట్టి ముగ్గు చూడ్డం గమనించీ "ఏం బుజ్జీ, బాగా యెట్టానా ముగ్గూ ..." అని పలకరించేది. ఆ పలకరింపుకి చిట్టి లోపలకి తుర్రుమని పరిగెట్టేది.

రెండో ఇల్లు మాత్రం బాగా ముందుకి వుండేది. పేడతో అలికిన మట్టి పెంకుటిల్లు. ఇంటి ముందు పెద్ద అరుగు వుండేది. పొద్దున్న లేచింది మొదలూ ఎప్పుడు చూసినా ఆ అరుగు చివర గొంతుక్కూచుని ఇంచుమించు అరవయ్యో పడిలో వున్న ఒకతను వుండేవాడు. అతన్ని చూడగానే, మొహం లో ముందు కొట్టొచ్చినట్టు కనపడేవి పెద్ద పెద్ద తెల్లటి బుంగ మీసాలు. ఆ వయసులో కూడా మనిషి బలంగా, మంచి దిట్టంగా వుండేవాడు. అతనే ఆ ఇంటి పెద్ద. లోపల ఒక్కోగదిలో ఒక్కోసంసారం చొప్పున ముగ్గురు కొడుకులు..కోడళ్ళు పిల్లలూ వుండేవారు. అతని పేరేవిటో తెలియదు గానీ అందరూ అతని గురించి మీసాలాడు అనే చెప్పుకునేవారు. ఆ దారే పోయేవాళ్ళందర్నీ ఏదో ఒక మాటని వేళాకోళం చేసేవాడు. చాలా వరకూ అందరూ తలొంచుకునో, ఎటో చూస్తూనో...అతన్ని తప్పించుకుని పారిపోవాలనే చూసేవారు. అయినా మొత్తానికి దొరికిపోయేవారు. ఎవరోగానీ వాళ్ళంతట వాళ్ళు అతన్ని పలకరించే ధైర్యం చేసేవాళ్ళు కాదు. తననంతగా భయపెట్టే ఇంటిగల తాతగారు కూడా అతన్ని చూసి తప్పించుకుని తిరగటానికి చూడటం మాత్రం చిట్టికి భలే అనిపించేది.

అతని భార్య పేరూ ఎవరికీ తెలీదు. మీసాలాడి పెళ్ళాం అనే చెప్పుకునేవారు. గడకర్రకి చీరకట్టినట్టు పొడవుగా సన్నంగా వుండేది. చింపిరి జుట్టూ, నలిగిపోయిన చీర. ఎప్పుడూ రెండే రెండు చీరలు కనపడేవి ఆవిడ వంటి మీద. మనిషి మొహంలో ఏ భావమూ లేకుండా నిర్వికారంగా వుండేది. తన పని తను చేసుకు పోవడం తప్ప పెద్దగా ఎవ్వరితోనూ మాటాడినట్టు కనిపించేది కాదు. వారానికో పదిరోజులకో ఇల్లంతా పేడతో అలికి ముగ్గు కర్ర పట్టుకుని, తిన్నంగా గీతలు గీస్తూ , వంచిన నడుము ఎత్తకుండా ఇల్లంతా ముగ్గు పెట్టేది. ఆ గీతల మధ్య కొల్చినట్టున్న ఖాళీ, కాస్త కూడా వంకర పోకుండా ఉన్ననిట్టనిలువు రేఖలూ తను స్కేలు పెట్టి గీసినా గియ్యలేదు, ఆవిడ ఎలా గీస్తుందో అని చిట్టి ఆశ్చర్యంగా గమనిస్తూ వుండేది. ఆ రెండు ఇళ్ళల్లో చిట్టికి ఆవిడే ఎక్కువ ఆసక్తి కలిగించేది. అసలు ఎప్పుడూ నవ్వదు, కోప్పడదు, ఏడవదు అసలు అలా ఎలా వుంటుందో అస్సలు అర్ధమయ్యేది కాదు.

మీసాలాడు మధ్యాన్నం పూట మాత్రం ఓ గంటా రెండు గంటలు బజారు మీద పడి కొట్ల వాళ్ళతో ఆ కబురూ ఈ కబురూ చెప్పి కూరో నారో పట్టుకొచ్చి పడేస్తూ వుండేవాడు. అతనలా వెళ్ళినప్పుడు మాత్రమే అతని కోడళ్ళు వీధరుగు మీదకొచ్చి ఇరుగమ్మతోటీ పొరుగమ్మతోటీ పిచ్చాపాటీ మాట్లాడుతూ వుండేవారు. ఆదివారాలు చిట్టీ వాళ్ళమ్మ కునుకు తీస్తుంటే, చిట్టి పుస్తకాలు వొళ్ళో వేసుకుని తన స్థావరం లో చతిగిలపడేది. ఇంటిగల మామ్మగారు కూడా పని చక్కపెట్టుకుని...తాతగారు బయటకి వెళ్ళిన రోజు ఆ టైముకి వీధరుగు మీద చేరి, ఆ బాతాఖానీ లో మాటకలుపుతూ వుండేవారు.

అసలు మా మావ, మా అత్త వల్లే అలా తయ్యారయ్యాడండీ...వండిందంతా ఆడికే వూడిచి పెట్టి మేపుతా వుంటదీ...మేవేమన్నా ఇచ్చినా ఆడికే ఎట్టేత్తదీ...లాంటి మాటలు వాళ్ళ కబుర్ల మధ్య దొర్లుతూ వుండేవి....పుస్తకాలు ముందేసుక్కూచ్చుని ఏ బొమ్మలో వేసుకుంటున్న చిట్టి  చెవులకి వాళ్ళ కబుర్లు రేడియో నాటకంలా వినపడుతూ...అర్ధమయ్యీ అవనట్టు వుండేవి.

మూడో తరగతి లోంచి చిట్టి ఏడో తరగతిలోకి వచ్చేసింది కానీ...ఎదురింటి దినచర్యలో ఏ మార్పూ రాలేదు. ఒక రోజు చిట్టి స్కూలు నుంచి ఇంటికి వస్తుంటే...ఎదురింటి అరుగుమీద ఒక చిన్న చీరల మూట వాడినీ...వాడి చుట్టూ చేరి బేరాలాడుతున్న అమ్మలక్కలనీ చూసింది. "ఒక్క సీరే కదే...తీసుకో...నీ సీరలు బాగా సిరుగు పట్టేసినియ్...ఏవనదులే" అంటోంది పెద్ద కోడలు...అప్రయత్నంగా చిట్టి మీసాలాడి పెళ్ళాం మొహం లోకి చూసింది. కొత్త చీర వొళ్ళో పెట్టుకుని అపురూపరంగా తడుముతున్న ఆమె మొహంలో ఒక చిన్న వెలుగు. ఆమె మొహం చూడగానే చిట్టికి ఎందుకో మనసులో సంతోషం గా అనిపించింది. అది కాదే దీనికి పైసలు ఏడ్నుంచి తేవాలా అంటోంది ఆమె. ఇన్నేళ్ళల్లో చిట్టీ ఆవిడ గొంతు వినడం బహుశా అదే మొదటిసారి. అంతా ఇప్పుడే ఇచ్చెయ్యమన్నానేటమ్మా...వారం వారం కొంత కొంత సొప్పున ఇద్దువులే అంటున్నాడు చీరలబ్బాయ్.

ఆ రోజు రాత్రి, చిట్టీ వాళ్ళు అన్నాలు తినేసాకా కరెంటు పోవడంతో...వీధి గదిలో కూచుని దీపం వెలుగులో లెక్కలు చేసుకుంటుంటే...ఎదురింట్లోనుండి పెద్ద పెద్దగా కేకలూ తిట్లూ...వీధి మొత్తం వినబడేలా అరుస్తున్నాడు. అది మీసాలతని గొంతే. నీ మొహానికి కొత్త సీర కావలిసొచ్చిందేటి...రేపాసీరలోడి మొగాన్న కొట్టకపోయావో కాళ్ళిరగ్గొడతా...అని ఇంకా ఏవేవో తిట్లు గట్టిగట్టిగా అరుచుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. లోపలనుంచి సన్నగా అతని పెళ్ళాం ఏడుపు వినపడుతూనే వుంది.ఆ ఇంట్లోంచి ఇంకెవ్వరి మాటా వినపడట్లేదు...తిట్టడమే కాదు కొట్టాడేమో కూడా... ఆ అలోచన రాగానే.చిట్టికి ఏమీ చదవబుద్ధి కాలేదు....చదువుతున్నది కళ్ళ వరకే చేరుతోంది...బుర్రలోకి ఏదీ ఎక్కడంలేదు...గుండె బరువెక్కినట్టనిపించింది...ఏదో తెలియని నిస్సహాయత...ఇదని తెలియని బాధా ఆ చిన్ని గుండెని చుట్టుముట్టాయి...

అది జరిగిన వారం రోజులకి చిట్టి స్కూలునుండి వస్తూ వీధి మళుపు తిరిగేసరికి...తమ ఇంటి అరుగుల నిండా...ఎదురింటి చుట్టూ జనాలు మూగి వున్నారు...ఏవిటా ఇంతమంది వున్నారు అనుకుంటూ నడుస్తున్న చిట్టికి దగ్గరకి వచ్చేసరికి మీసాలాడి కూతురి ఏడుపు పెద్దగా వినపడింది...ఇంటికి దగ్గరవుతున్నకొద్దీ...మనసు ఏదో కీడు శంకిచింది...ఆ జనాలందరినీ చూస్తూ నడుస్తున్న చిట్టికి ఆ గుంపు మధ్యలోనుంచి ఎవరినో చాప మీద పడుకోబెట్టినట్టు కనపడుతోంది...కాళ్ళూ, చీర మాత్రం కనపడుతున్నాయి...ఆ చీర...ఆ చీర తనకి చాలా పరిచయమున్నదే...ఎన్నో ఏళ్ళుగా చూస్తున్నదే...

గుండె చాలా వేగంగా కొట్టుకోవడం చిట్టికి తెలుస్తూనే వుంది...కడుపులో తిప్పుతున్నట్టనిపించింది ఒక్కసారిగా...ఇంటికి వొక్క పరుగున వచ్చింది...తనకి తెలిసిపోతున్న నిజమే అయినా ఎందుకో వస్తూనే కంగారుగా అమ్మని అడిగింది ఏమయిందమ్మా? అని...తననుకుంటున్న జవాబు, అమ్మ మనోట్లోంచి రాకూడదని ఆ చిన్నిగుండె ఆరాట పడుతోంది. కానీ రాకూడదని తననుకున్నదే అమ్మ నోట్లోంచొచ్చింది...పాపం ఇవాళ మధ్యాన్నం పోయిందే మీసాలాడి పెళ్ళాం అని...వెళ్ళు వాళ్ళ పక్కనుంచి వచ్చావ్ గా వెళ్ళి స్నానం చేసి బట్టలు తడిపెయ్ అంటోంది అమ్మ...తనకేవిటో బాధ ఆగట్లేదు...కళ్ళమ్మట నీళ్ళూ రావడం లేదు...

చిట్టి స్నానం చేస్తుంటే, మార్చుకోవడానికి తెచ్చిన బట్టలు పట్టుకుని వాళ్ళమ్మ స్నానాల గది ముందు నుంచుంది...అప్పుడే పెరట్లోకొచ్చిన ఇంటిగల మామ్మగారూ, అమ్మా మాట్లాడుకోటం చిట్టికి వినపడుతూనే వుంది. "వొంట్లో నల్తగా వుందనిపించి పొద్దున్న పదింటికి ఆసుపత్రికి వెళ్ళొచ్చిందటమ్మాయ్, బాగా నీరసంగా వున్నావ్, రక్తం లేదు...మంచి తిండి తిను అని చెప్పి బలానికేదో టానిక్కు

రాసిచ్చిందిటా డాక్టరమ్మ...ఆ చీటీ తెచ్చి కోడలికి చూపించి పక్కన పడేసి, ఇంత వుడకేసి వాడికి పెట్టిందిట...వాడు బయటకి పోయాక మంచం మీద వాలిందిట...ఎంతకీ లేచి నాలుగు మెతుకులు తిన్న అలికిడి కాకపోటం తో కోడలు లేపిందిట...అప్పటికే ప్రాణాలు గాల్లో కలిసిపోయాయిట... హ్మ్" అని నిట్టూర్చింది మామ్మగారు...పుణ్యాత్మురాలు, సునాయాస మరణం...బతికున్నన్నాళ్ళు ఎన్ని పడ్డా పాపం అంటోంది చిట్టీ వాళ్ళమ్మ...

ఆ రోజంతా చిట్టి చాలా దిగులుగా వుండడం చూసి ఎలా బతుకుతుందో వెర్రి పిల్ల అనుకున్నారు వాళ్ళ అమ్మా నాన్నా...

ఆవిడ పోయిన పదోరోజు సెలవు కావడం తో కిటికీ లో కూచుని ఎదురింట్లో హడావుడి చూస్తోంది చిట్టి...వూరంతా పిలిచి భోజనాలు పెడుతున్నారు...మధ్యాన్నం మూడింటికి రెండు కావెళ్ళనిండా కొత్త చీరలు పట్టుకొచ్చి...పునిస్త్రీ గా పోయింది పుణ్యాత్మురాలు అని పదే పదే చెబుతూ వాళ్ళ చుట్టాలకీ...వూళ్ళో కావలసిన వాళ్ళకీ అందరికీ మీసాలాడి చేతులమీద గానే కొడుకులు ఇప్పిస్తున్నారు...వొక్క సారి చిట్టికి వొళ్ళో కొత్త చీర పెట్టుకుని తడుముతున్న మీసాలాడి పెళ్ళాం మొహం మనసులో మెదిలింది...కళ్ళల్లోంచి ఒక్క సారిగా నీళ్ళు తన్నుకొచ్చాయి...టప్ మని ఆ కిటికీ తలుపులు మూసేసొచ్చి లోపలకెళ్ళి పడుకుంది...ఆ వూర్లో వున్నన్నాళ్ళల్లో మళ్ళీ ఎప్పుడూ ఆ కిటికీ లోంచి చూడాలనిపించలేదు చిట్టికి...

## కథ వెనుక కథ

కథలు మన చుట్టూ వుండే పరిసరాల్లోంచే పుడతాయని బలంగా నమ్మే మనిషిని నేను. నేను నా చిన్నప్పుడు చూసిన వాతావరణంలోనుంచి పుట్టినదే ఈ కథ. చిట్టి పాత్ర నేనే అని చెప్పొచ్చు. నా వరకూ మీసాలాడి పెళ్ళాం, నా చిన్ననాటి జ్ఞాపకం. ఎన్నేళ్ళు గడిచిపోయినా ఆమె రూపం, వ్యక్తిత్వం కళ్ళముందు మెదులుతూ వుంటాయి. ముఖ్యం గా నాకు బాగా కోపం వచ్చినప్పుడూ, ఎవరినైనా కసిగా తిట్టుకున్నప్పుడూ ఆమె కళ్ళముందు కదులుతూ వుంటుంది. అసలు వేటికీ చెలించకుండా ఎలా వుండేదో ఇప్పటికీ నా మనసుకి అర్ధంకాని ప్రశ్నే. వూరంతా ఆమెని అమాయకురాలు, చేతగానిదీ అని లెక్క గట్టేసినా, నా మటుకూ అన్నింటికీ అతీతంగా వుండడం అలవాటు చేసేసుకున్నఅనుభవశాలా? వూరంతా వెలేసినట్టు చూసే ఆమె భర్తని కూడా అంతగా ప్రేమించగనలిగిన ప్రేమ మూర్తా ? ఏమో ఏళ్ళు గడుస్తున్న కొద్దీ వొక్కోలా అర్ధం అవుతూ వుంటుంది. ఇలాంటి మనుషులు ఇంకా చాలా మందే వుంటూ వుంటారు. నా మనసులో చిక్కటి జ్ఞాపకం గా మిగిలిపోయిన ఆమె గురించి కథ గా రాయాలన్న ప్రయత్నమే "మీసాలాడి పెళ్ళాం".

# ఊర్వశి - పురూరవ

వెంకట్

**ప్రస్తావన**

సుఖంలో కథేముంటుంది గనక?

కథ ముందుకు నడవాలంటే

కొంచెమైనా కష్టం ఉండాల్సిందే!

మోహాశ్వంలా పరుగులు తీసే మధురమైన ఊహ ఉంది

ఋషి మనస్సులో ఊర్వశిని గుటించిన తలపు ఉంది

కానీ కథ మాత్రం పురూరవుని శోకంలోనే కదా దాక్కుని ఉంది!

ఊర్వశి ఊహ

పురూరవుడు ప్రత్యూహ

ఊర్వశి మత్త

పురూరవుడు ఉన్మత్త

ఊర్వశి అంతం

పురూరవుడు అనంతం...

★★★ ★★★

సుఖం ఫులుస్టాపూ

దుఃఖం కామా...

**ఒకటి**

ప్రతి మానవుని అంతఃకరణంలో ఒక స్వప్నలోకం ఇమిడి ఉంటుంది. చేతనలో ప్రత్యక్షానుభవాలకూ, అనుభూతులకూ కళ్ళు గవాక్షాలుగా మెలుగుతాయి. చేతనో, అచేతనో తెలియనటువంటి ఒక సందిగ్ధ చేతనావస్థలో కలిగే అనుభూతులకు స్వప్నం గవాక్షమనుకుంటే, ఆ గవాక్షంలోంచి తమకంతో ఆవలి వైపుకు తొంగిచూసే ప్రయత్నం చేసిన ఒక తృషితుడికి, ఆవలి వైపు కనిపించిన చిత్రం – ఊర్వశి.

మహా సౌందర్యవతి. ముగ్ధుడై అతడామెను ఆహ్వానించాడు. ఆమె రానన్నది. అతడు రావలసిందే అన్నాడు. ఆమె మళ్ళీ రాననే అన్నది. అతడు రెట్టించాడు. ప్రతిగా ఆమె ఒకసారి బాగా ఆలోచించుకోమన్నది. బాగా అలోచించుకునే అడుగుతున్నానన్నాడితడు. నన్ను

నువ్వు భరించలేవు అన్నదామె.  అతడు పరిహాసంగా నవ్వి, ఊహించుకున్న వాడిని భరించలేనా? అన్నాడు.  పిచ్చివాడా, ఊహ వేరు, భరించడం వేరు. మళ్ళీ ఒకసారి ఆలోచించుకోమన్నదామె.  అతడు వినలేదు.  మోహుడా, నేను తప్తను. ఇలా పడిఉన్న దానిని ఇలాగే ఉండనీ, నన్ను కదిలించకు. నా స్పర్శ నీకంత మంచిది కాదు. నన్ను వహించి పరితప్తుడవౌతావు అని హెచ్చరించిందామె.  పరవాలేదు, నాకా సుఖం కావాలి అన్నాడితడు.  సుఖం కాదది, దుఃఖం, భరించలేవు అంది.  భరించగలను, నీకేం తెలుసు, ఏ దుఃఖమూ లేకుండా బతుకు ఎంత దుర్భరంగా ఉందో? అన్నాడు.  అలాగా, మూర్ఖుడా, అయితే అనుభవించు, నీ కర్మ. నీ లాంటి ఇంకొకడిని సృష్టించికోవడానికి సిద్ధంకా, అంటూ ఆమె కదిలింది.  ఆనందం పట్టలేక అతడూ కదిలిపోయాడు.  ఊహారూపయై అతడి హృదయంలో కుదురుకుందామె.  మరుక్షణం హతాశుడై పడిపోయాడతడు.

## రెండు

ఎన్నాళ్ళతరువాతనో తెలివొచ్చి "ఇంత బాధా?" అన్నాడతడు.

"చెప్పానా?" అందీమె.

"తెలుసుకోలేక పోయాను. ఎవ్వరికీ తెలీకుండా నేనొక్కడినే ఇంత సౌందర్యపు బాధను అనుభవించలేను!" అన్నాడు.

"మరిప్పుడేమిటి?" అందీమె.

"నన్నొదిలి వెళ్ళిపో!" అన్నాడతడు.

"జరగని పని అది.  నేనేమిటో ఎవ్వరికీ తెలియకుండా పడిఉన్నంత వరకూ నాకే చింత, చింతనా లేవు. నిన్ను చూస్తుంటే నేనింతటి బాధనేనా? అనిపిస్తోంది. ఇప్పుడు నిన్ను నేను వదలను!" అందీమె.

"అర్థమైంది. ఒక్క క్షణం ఆగు.  నీకో చిత్రం చూపిస్తాను" అంటూ క్షణకాలం కళ్ళు మూసి తెరిచి "అటు చూడు!" అన్నాడతడు. చూసిందామె.

అలవిమాలిన శోకంతో ఉన్నాడక్కడ మరొకడు, వీరుడు.

"ఎవరతడు? ఎందుకా శోకం?" ప్రశ్నించిందామె.

"నన్ను నేను తిరగరాసుకో మన్నావుగా...రాసుకున్నాను.  దగ్గరగా వెళ్ళి చూడు!" అన్నాడు.

"ఊహూ...అంత తొందరగానా? ఇంకాసేపు విలపించనీ! వలపించడంగురుంచి తరవాత ఆలోచిద్దాం. ఇంతకీ ఎవరతడు?" అడిగిందామె.

"పేరు పురూరవుడు. మహావీరుడు! అదిచూసేగా నువ్వూ అతడిని ప్రేమించిందీ!" అన్నాడితడు.

"నేనా? ఇదెప్పటిమాట?" ప్రశ్నించిందామె.

"నీ జ్ఞాపకాలలో ఇంకా పుట్టలేదులే అది. ఇప్పుడేగా నా ఊహలో ఊపిరిపోసుకుందీ!" అన్నాడితడు.

"వలపన్ని నన్ను బంధించే యత్నం చేస్తున్నావా ఋషీ?" అంటూ కళ్ళు మూసుకుందామె.

## మూడు

కొన్ని క్షణాల తరువాత కళ్ళుతెరిచి మందహాసం చేస్తూ "మరీ ఇంత తల్లకిందులు కథనా కథకుడా?" అంది ఊర్వశి.

నవ్వి ఊరుకున్నాడతడు.

"ప్రాణాన్ని వెతుక్కుంటూ పోయిన శరీరంలాగా, పురూరవునితో నేనిప్పుడు ప్రేమ నటించాలన్నమాట?" అంది ఊర్వశి.

"నటించే కర్మం నీకు దేనికి? అనుభవించూ!" అన్నాడతడు.

"అనుభవించడమా? ఏముందని అతనిలో అనుభవించడానికి?" అడిగింది ఊర్వశి.

"లేకపోవడమేవిటి ఊర్వశీ? మహావీరుడతడు. నిన్ను రక్షించిన వాడూ..!" అన్నాడతడు.

"రక్షించడమా? నన్నా? దేని నించీ?" హేళనగా అడిగింది ఊర్వశి.

"నువ్వు మాలోకంలో ఉన్నంతవరకూ మానవమాత్రురాలివే అన్న సంగతి మరవకు ఊర్వశీ!" అన్నాడతడు హెచ్చరిస్తున్నట్లుగా.

"ఓహో...ఇదొకటిగూడానా? ఇక కథకేం తక్కువ...నేనూ రచిస్తాను చూసుకో ఋషీ!" అంది ఊర్వశి.

"ఆట మొదలౌతోందన్న మాట! నిన్ను పట్టి ఉంచుకోవాలని పురూరవుడూ...వదిలించుకుని వెళ్ళిపోవాలని నువ్వూ...భేషుగ్గా కుదురుకుంది సందర్భం!" అన్నాడతడు.

ఒకింత ఆగి, బాధగా నిట్టూర్చింది ఊర్వశి.

"ఇంతలోనే ఆ నిట్టూర్పేవిటి ఊర్వశీ?" అడిగాడతడు.

"ప్రేమంటున్నాడు పిచ్చివాడు!" అంది ఊర్వశి.

"నిన్ను ప్రేమించి నీచేతనే పిచ్చివాడనిపించుకుంటున్నాడు పాపం పురూరవుడు...అంతటి వీరుడు!" అన్నాడు.

"ఆహా..వీరుడూ...శూరుడూ! కాదన్నానా? నాకెందుకీ పీడ అనికదా నా ప్రశ్న!" అంది ఊర్వశి.

"సమాధానం నీలోనే ఉంది ఊర్వశీ! అలవిమాలిన సౌందర్యంతో ఎవ్వరికీ చిక్కనంటూ నువ్వున్నావు, అంతులేని శూరత్వంతో దేన్నయినా సరే దక్కించుకోవాలని అతడున్నాడు. ఈ రెంటికీ సాపత్యం ఎలా కుదురుతుంది?"

"ఏడిసినట్టేఉంది నీ సిద్ధాంతం. సౌందర్యం, శూరత్వం లేని లోకాన్ని ఏమి చేసుకుంటావు నువ్వు ఋషీ?" అడిగింది ఊర్వశి.

"రెండూ అనలేదు నేను. ఈ రెంటిలో ఏదో ఒకటని గదా చెప్పాను!" అన్నాడు.

"అదీ అంతే దౌర్భాగ్యం. అడవిలో పుట్టే కార్చిచ్చు అడవినే దహించేట్లుగా, సౌందర్యంలేని లోకంలో శూరత్వమూ, శూరత్వంలేని లోకంలో సౌందర్యమూ వాటికవే నాశకాలవుతాయి. ఇంతెందుకు...దుఃఖం లేకుండా జీవితం భరించలేనంత దుర్భరంగా ఉందని నీవేగా అన్నావ్...అప్పుడే మర్చిపోయావా?" అంది ఊర్వశి.

### నాలుగు

"మరేది మార్గం?" అడిగా డతడు.

"మూర్ఖత్వాన్ని వదలడమే!" చెప్పింది ఊర్వశి.

"అదంత సులువైతే పురూరవుడీపాటి కెప్పుడో ఆపని చేసుండేవాడుగా?" అన్నాడతడు.

"ఏడుస్తూ ఉండమనేగా నీ సందేశం మొదటినుంచీ?" అంది ఊర్వశి.

"కథ నడవాలిగా ఊర్వశీ!"

"కథ కాదు...వినోదంకావాలిగా అను!"

"ఎంత మాట!"

"పురూరవుడి శోకాన్ని వినోదంగా చూసుకుని ఆనందిస్తూ నువ్వుంటే, పురూరవుడు నన్ను రాక్షసిననుకుంటున్నాడు చూడు?" అంది ఊర్వశి.

"నేను పడే వింత గూడా అదే ఊర్వశీ!" చెప్పాడు అతడు.

"అట్లాగా! అయితే అప్పుడే ఇదెంత మాత్రం వింతని? అసలు విషయం పురూరవుని చెవిలో వేస్తే, మర్మం తెలుసుకున్న పురూరవుడు కత్తి దూసి నీ కుత్తుక కొయ్యడానికి వెంట పడితే...ఆ వింత చూడాలనుంది నాకు!" అంది ఊర్వశి.

"అంత విజ్ఞత అతడికివ్వలేదులే ఊర్వశీ...నీ కంత సంతోషం అక్కరలేదు!" అన్నాడతడు.

"ఎంతటి నిర్దయుడివి నువ్వు? ఇంత ద్వేషం ఎందుకు?"

"నన్ను బాధించావుగా మరి. ఆ బాధని అజరామరం చెయ్యెద్దూ!"

"మరే...ఒక లోకం మొత్తంగా ఆ మాయలో పడి శగ తగిలిన మిడతల్లాగా కొట్టుకోవద్దూ?" అంది ఊర్వశి.

అతడు నవ్వాడు.

**ఐదు**

"ప్రేమ సుఖం కావాలన్నాడు, పుష్కలంగా ఇచ్చాను.  పుత్రుడు కావాలన్నాడు, అదీ ఇచ్చాను. అయినా పట్టుకుని వదలడు, ఇంకా ఉండిపోవాలంటాడు...ఎందుకలా?" అంది ఊర్వశి.

"నీది ప్రకృతి హృదయం, పురూరవుడిది పురుష హృదయం. దేనినీ పట్టించుకోవు నువ్వు. ఒకసారి పట్టించుకుంటే వదలనే వదలడతడు. ఈ నియమం ఇలా కొనసాగాల్సిందే!"

"ఎన్ని నియమాలు నేను రచించాను.  అన్నింటికీ సరేనన్నాడు పిచ్చివాడు.  అవన్నీ నేను ఎప్పటికైనా తప్పించుకు పోవడానికి తెరచి ఉంచుకున్న ద్వారాలని తెలుసుకోడు. ఈ పీడ నించి నేను తప్పించుకోగోరుతున్నానన్న తలపే రానివ్వడు...మూర్ఖుడు!"

"అంతగా దూషించకు ఊర్వశీ!" అన్నాడతడు అహం దెబ్బతిన్న మొహంపెట్టి.

"ఏం? మీ కెక్కడ బాధ కలుగుతోంది మహర్షీ?" అంది ఊర్వశి గాయాన్ని ఇంకొంచెం పెద్దది చెయ్యాలన్న తలపుతో అన్నట్లుగా.

"అతడు ప్రేమంటున్నాడు దానిని!"

"వాడి తలకాయ ప్రేమ. బంధించి తాళాలేసుకు చూసుకోవాలనుకోవడం ప్రేమెలాగవుతుంది?"

"ప్రేమకు అర్థమేమిటి మరి?"

"నాకు అనుభవంలోకి వచ్చినపుడు చెబుతాను!"

"విడ్డూరంగా ఉంది. పురూరవుడితో ఇన్నేళ్ళ సహవాసంలో ప్రేమంటే ఏమిటో అనుభవానికి రాలేదా నీకు?" ప్రశ్నించాడతడు.

"వచ్చింది. చాలాసార్లు వచ్చింది. అలా వచ్చేగా నేనిక వెళతానన బయలుదేరిందీ?" అంది ఊర్వశి.

"ఆఁ...!"

"అందులో అంత విడ్డూరానికేముంది మహర్షీ? నేను ఊహా రూపను. బంధించబడడం నా నైజం కాదు.  అది నీకూ తెలుసు.  కానీ, పురూరవుడికి అది తెలిసేలా నువ్వు చెయ్యవ్.  చేస్తే కథ కంచికి చేరుతుందని నీ భయం.  పరమానందంలో నీ వంతు కొరవడుతుందని నీ ఏడుపు.  పురూరవుడి విచక్షణని ప్రేమనే వెర్రి మాయలో కప్పెట్టేశావ్.  పురూరవుడు ఇక కళ్ళు తెరిచి చూసే ప్రసక్తే లేదు.  'నువ్వే..నువ్వే!' అని

నన్ను తలుచుకుని తలుచుకుని ఏడుస్తూనే ఉంటాడు. అతని శోకానికి అంతమే లేదు. అదొక అనంతమైన మాయ. అంతులేని విలాపం. తనలోంచి తనే మళ్ళీ మళ్ళీ పుట్టుకుంటూ అనందిస్తూండే వింత రోగం! ...సరే, నేనిక వెడతాను!"

"ఎక్కడికి?"

"ఎక్కడికేమిటి? ఎక్కడినుంచి వచ్చానో అక్కడికి!"

"అంటే, మళ్ళీ నాలోకా?!"

"నీలోకా? అక్కడినుంచా వచ్చాను నేను? ఎంత అహంకారివి మహర్షీ!"

"ఊర్వశీ!"

"ఏం? నిజం కాదూ?"

"సరే...మరి పురూరవుడు?"

"పురూరవుడు?...అతగాడికి నన్ను శాశ్వతంగా కట్టిపడెయ్యందే నీకు సుఖంలేదా మహర్షీ?"

"సుఖం కాదు. న్యాయం కదూ!"

"న్యాయం! దేనికి? నీ వినోదానికా?""

"కాదు ఊర్వశీ, కానే కాదు. ఇది లోక కళ్యాణం కోసం!"

***

**కథ వెనుక కథ**

ఋగ్వేదం పదవ మండలంలో ఊర్వశి, పురూరవులకు సంబంధించిన కథ ఊహామాత్రంగా ఉంది. ఆ కథ ఊర్వశి పురూరవుని వదిలి వెళ్ళడంతో మొదలవుతుంది...చివర మొదలుగా, తలకిందులుగా అన్నట్లుగా. తనను వెళ్ళనివ్వమని పురూరవునికి సర్ది చెబుతూ ఋక్కులు ముందుకు నడుస్తాయి. మొత్తంగా పదిహేడు ఋక్కులు అవి. అందులో పురూరవుడు ఎంతగా విలపించి ప్రాథేయపడినా కూడా చెవినపెట్టకుండా చివరికి ఊర్వశి పురూరవుని వదిలి వెళ్ళిపోవడం జరుగుతుంది.

తరువాతి కాలంలో అంటే ఉపనిషత్తులకాలానికి ఈ కథ పూర్తిగా మార్చబడి, చివరికి ఊర్వశి పురూరవునికి దక్కేలాగా తిరగ రాయబడి, ఒక మామూలు తరహా ప్రేమకావ్యంగా మార్చబడి అధ్వాన్నం చేయబడింది. అధ్వాన్నం అని ఎందుకు అనడం జరిగిందంటే, ఉపనిషత్తుల కాలానికి ఊర్వశి అనే ఊహ ఈ లోక ఆచారాలకు అనుగుణంగా వంచబడింది. ఋగ్వేదకాలపు ఋషి ఊహకు ఇది పూర్తిగా విరుద్ధం. ఒకరకంగా ద్రోహం.

ఈ కథను ఊహించడంలోనూ, చెప్పడంలోనూ ఋగ్వేదకాలపు ఋషి ఆలోచనకూ, ఉపనిషత్తుల కాలపు ఋషుల ఆలోచనకూ ఎంతగా తేడా ఉందో ఇది చూపిస్తుంది. కథను ముగింపుతో మొదలెట్టడం

అన్న అమోఘమైన ఆలోచనకు మొట్టమొదటి ఉదాహరణగా ఋగ్వేదంలోని ఊర్వశి పురూరవులకు సంబంధించిన ఋక్కులను నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ ఋక్కులకు కర్త ఎవరో స్పష్టంగా తెలియకపోవడం దురదృష్టం. అయితే, ఆ ఋషి ఎవరయినప్పటికీ, కథను ఊహించడంలోనూ, సృష్టించడంలోనూ ఆ కాలంలోనే అతడు అవలంబించిన ఈ కొత్త పద్ధతిని తలుచుకుంటే, ఆ ఋషి ఎంతగా నూతనత్వాన్ని కాంక్షించాడో అర్థమవుతుంది.

ఇది ఈ రచనకు ఆధారం. ఇందులో ఋషి, ఋగ్వేదకాలపు ఋషికి ఉపనిషత్తుల కాలపు ఋషికీ సమ్మిశ్రణంగా, ఇద్దరూ ఒకారుగానే ఊహించబడడం జరిగింది. విషయ ప్రాధాన్యత చెడకుండానూ, క్లుప్తత చెడకుండా ఉండడానికోసంగానూ సౌలభ్యం కోసం చేసుకున్న మార్పు అది. నిజంలో ఇద్దరూ ఒకరు కాదు. ఋగ్వేదకాలానికి ఉపనిషత్తుల కాలనికి ఎంత కాదన్నా నాలుగైదు వందల సంవత్సరాల అంతరం ఉంది.

# భీష్ములకి కొదవలేదు

ఎల్కశ్ట్రాన్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ**

**ఏ విధమైన సంరక్షణాలేని** ఆ పార్కులో ఓ మూల పగుళ్ళు బారిన సిమెంట్ బెంచీ మీద కూర్చుని కబుర్లాడుకుంటున్నారు మిత్రులు కేశవరావూ, మాధవరావూ. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. ఉద్యోగాలు వేరు వేరు ప్రాంతాల్లో చేసినా, ఒకటి రెండు నెలల తేడాతో పదవీ విరమణలు చేశారు. తలలు పండినా రంగుల జోలికి పోలేదు.

"మన చిన్నప్పుడు ఈ చెట్లమీద ఎన్నో పక్షులుండేవి. ఈ రోజున చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. పిచికలు అంతరించిపోతున్నాయని చాలా సర్వేలు తెలుపుతున్నాయి. కానీ కాకులకి కూడా కరువొచ్చేసినట్టుంది. మొన్న మా అమ్మగారి తిధి రోజున శాస్త్రప్రకారం కాకులకని పిట్టగోడమీద పిండం పెడితే ఒక్క కాకి కూడా రాలేదు. పైగా కనబడలేదు కూడా!" అన్నాడు కేశవ.

"ఆ మూలనున్న సెల్ టవర్ చూడు. అది ప్రసరించే విద్యుదయస్కాంత తరంగాలు విహంగాల దిశాలక్ష్యాన్ని చెదురుమదురు చేయడంతో, ప్రకృతి నిర్ణయించిన వాటి జీవనశైలికి ఆటంకాలు కలిగి, దిశ తెలియని అయోమయంలో ఆహారం లభించక, గూళ్ళు కట్టలేక అంతరించి పోతున్నాయి. వేలలో లభించే ద్విచక్రవానాలని స్థాయీ, అవసరాల బేధం లేకుండా ఋణాలతో కొంటూన్న ఈ రోజుల్లో, కేవలం వందల్లో లభించే సెల్ ఫోన్లను కోట్లాది మంది సమకూర్చుకుంటున్నారు. అలా అంతరించిపోతున్న పక్షిజాతులు మానవ రూపాలెత్తుతున్నాయి. జనాభాపెరుగుతోంది" అన్నాడు మాధవ కాస్త వేదాంత ధోరణిలో.

''మాటంటే చాలు ఎన్నో వివరణలిస్తావు. ఈ పార్కులో మొక్కలన్నీ ఎండిపోయాయి. చెట్లకు ఆకులు లేక నీడపట్టు అనేది లేనేలేదు. నీళ్ళు పోసే నాధుడే లేడు. దీనికీ ఆ సెల్ టవరే కారణమా?'' కేశవ ప్రశ్నించాడు.

''ఏదో తర్కముపయోగించి సంబంధంలేని రెండు విషయాలకి లంకె పెట్టొచ్చు. కారణమేదైనా జనాభా పెరుగుతోంది. పెరిగిన జనాభా జీవన విధానాలవల్ల పర్యావరణం దెబ్బతింటోంది. వర్షాభావం తోడవడంతో నీటిఎద్దడి పెరిగింది. భూగర్భజలాలు లోలోతుల్లోకి పోతున్నాయి. చెట్ల వేళ్ళకి నీళ్ళందటల్లేదు. ఈ పార్కులో ఉన్న కుళాయిలో రెండేళ్ళుగా నీళ్ళు రావడంలేదు. నీళ్ళు కనక ఉంటే నేనే ఓ గొట్టం కొని మొక్కలికి నీళ్ళు పెట్టేవాణ్ణి'' అన్నాడు మాధవ.

మాధవ మాటలు విని కేశవ కొద్దిగా ఇబ్బందిలో పడ్డాడు. ''తెలిసో తెలియకో నా అధిక సంతానం మీద విసురు విసిరావు. నీ మాటల్లోని అంశాలన్నీ నా జీవితానికి వర్తిస్తాయి. నీళ్ళందని చెట్లలాగే ఎండిపోతున్న మా జీవితాలకి ఆర్థికవనరులు లభించటల్లేదని నీకు తెలుసు.''

''నిన్ను గురిచేసి ఆ మాటలనలేదు. మాటసందర్భంగా కేవలం పెరుగుతున్న జనాభా గురించి అన్నానంతే. నీ పరిస్థితులు నాకు తెలియనివి కావు. అయితే మన ఆలోచనా విధంలో మార్పులేనంతకాలం కనిపెంచిన సంతానం ఆర్థికంగా మనల్ని ఆదుకోవటల్లేదని, ఒకవేళ మన బతుకులు మనం బతుకుతున్నా ఆదరణ కరువైందని కలిగే ప్రకృతి సహజమైన బాధ మరింత ప్రస్ఫుటమౌతుంది. ఏ స్థాయికి తగ్గట్టుగా ఆ స్థాయిలో వలస జీవితాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోక గూటిపట్టునే ఉండిపోవుకదా? ఊరు విడిచి నగరం పోయే శ్రామికులకీ, దేశం విడిచి విదేశాలకిపోయే ఉద్యోగులకీ కుటుంబపరమైన భావోద్రేకాలు, సమస్యలు కాస్త హెచ్చు తగ్గులుగా ఒకేలా ఉంటాయి. నీ ఇద్దరు కొడుకులూ ఈ ఊళ్ళోనే ఉంటున్నారు కాబట్టి వాళ్ళతో ఓ మాట మాట్లాడతాను.'' అన్నాడు మాధవ.

''వద్దు, వాళ్ళమీద చాడీలు చెప్పాననుకుంటారు'' కేశవ గాభరాగా అన్నాడు.

''నువ్వు చెప్పావని కాదుకానీ, మీ పరిస్థితిని గమనించినవాడిలా చెబుతాను. మీ కుర్రాళ్ళతో చనువు తీసుకుని మాట్లాడ్డంలో తప్పేమీ లేదు.''

తన మాటలకి కేశవ మౌనంగా ఉండిపోవడంతో దాన్ని అంగీకారంగానే తీసుకున్నాడు మాధవ.

●●●

ఓ శనివారం సాయంత్రం మాధవ కేశవ పెద్దకొడుకు శ్రీధర్‌ని ఆఫీసు ముగిసే వేళకి కలుసుకుని అదే పార్కుకి తీసుకుపోయాడు. ''చూడు శ్రీధర్ ఇబ్బంది, డొంక తిరుగుడూ లేకుండా మీ ఇద్దరన్నదమ్ములతోటీ కొన్నివిషయాలు మాట్లాడదల్చుకున్నాను. పెద్దవాడవు కాబట్టి ముందు నీ నాడి చూసి నీ తమ్ముడితో మాట్లాడతాను. మాట నాన్చకుండా నీ మనసులో ఉన్నది చెప్పేయ్. మీ నాన్న మీ మిగిలిన ఇద్దరి చెల్లెళ్ళ వివాహమై బెంగెట్టుకున్నాడు. మీరా ఊసే ఎత్తటల్లేదని మధనపడిపోతున్నాడు'' అన్నాడు విషయానికి తిన్నగా వచ్చేస్తూ.

''అంకుల్ ఏదో ఒకరోజు మా నాన్న మీద్వారా సందేశం పంపుతాడే అనుకుంటున్నాను. నిజమే అయింది,'' అన్నాడు శ్రీధర్.

''ఈ విషయంలో మీ నాన్నని నిందించకు. తను వద్దంటూన్నా చిన్ననాటి స్నేహితుణ్ణవడం మూలాన నేనే సంగతి తెలుసుకుందామని నీతో మాట్లాడ్డానికి చిన్నపాటి సాహసమే చేశాను'' అన్నాడు మాధవ.

''మాతో మాట్లాడ్డానికి సాహసమెందుకు అంకుల్? మీకు అధికారముంది కూడా. వేరే నాందీ ప్రస్తావనలు లేకుండా, మేమిద్దరమూ మా తల్లిదండ్రుల విషయమై పట్టించుకోకుండా వేరు కాపురాలు పెట్టామన్నది మీ మొదటి అభియోగం. అవునా కాదా?''

"ఎలా కాదనగలను?"

"మా తల్లితండ్రులకి తగినంత, లేక పూర్తిగా ఆర్థిక సహాయం చేయటల్లేదన్నది రెండో అభియోగం అయ్యుండొచ్చు. ఇక ప్రత్యేకించి, భారతీయ సాంప్రదాయాల ప్రకారం పెద్దవాడు తండ్రి బాధ్యతల్నీ, భారాల్నీ భుజాలకెత్తుకోవాలని మీ మూడో అభియోగం కావొచ్చు. కనిపెంచిన తల్లితండ్రుల ఋణం జన్మజన్మలకీ తీర్చుకోలేనిదని చివరిగా ఓ ఉపదేశం. అంతేనా?"

"నేను చెప్పదలచిన మాటల సారాంశమను లేదా ప్రశ్నల శరాలను, నాకు ఇబ్బంది లేకుండా నువ్వే చెప్పేశావు లేదా వదిలావు. జవాబులు కూడా నువ్వే చెప్పాలి మరి?"

"మాధవ అంకుల్.. వితండవాదనలు చేస్తున్నాననుకోకండి. ఏ వ్యక్తీ తనంతతానుగా, ఆ మాటకొస్తే ఏ జీవీ ఈలోకంలో పుట్టరు. ఓ వ్యక్తియొక్క ఉనికికి ఆ వ్యక్తి తల్లిదండ్రుల కామయజ్ఞం కారణం కాదా? ఆకలి, దప్పికలని తీర్చుకుని బతకాలంటే గాలితోబాటు నీళ్ళూ, ఆహారమూ అవసరమౌతాయి. పునరోత్పత్తికోసమని వయసుతో వచ్చే కొన్ని దాహాల్నీ, అగ్నుల్నీ ప్రకృతి నిర్దయగా దేహాలకి జోడించేసింది. వాటి ఉపశమనంకోసం ఆరోగ్యకారణాల దృష్ట్యా సమాజం వివాహమనే వ్యవస్థని ఏర్పాటు చేసింది. తద్వారా పుట్టిన సంతానానికి ఓ గుర్తింపు కట్టబెట్టింది. కని, పెంచినందుకు తల్లిదండ్రుల్ని గౌరవించాల్సిన, ఆదుకోవాల్సిన బాధ్యత సంతానం మీద ఉంది. వృద్ధాప్యంలో అండగా నిలిచి, తలకింద కొరివి పెట్టాల్సిందీ కొడుకులే. కాదనను. కానీ, కన్న అధికారంతో అంతా తమ ఇష్టప్రకారమే జరగాలని తల్లిదండ్రులనుకుంటే సంతానం ఇరుకులో పడిపోతుంది. చదువూ, ఉద్యోగం, సంపాదన - ఈ మూడింటినీ వ్యక్తి స్వయంగా కష్టపడి సాధించాలి. ఈ మూడూ వరించిన వారికి తల్లిదండ్రులని గౌరవ ప్రపత్తిలతో చూడ్డం కష్టంకాదు. చివరికి తేలిందేమిటంటే సంతానం యొక్క ఆర్థిక పరిస్థితి ఒక ముఖ్యమైన అంశం. అతి స్వార్థం చోటు చేసుకుంటేనే తప్ప ఏ పిల్లలూ తమ తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చెయ్యరు.

"బిల్ గేట్స్ 'పుట్టడం నీ చేతుల్లో లేదు. కానీ ఎలా మరణిస్తావన్నది నీ చేతుల్లో ఉందం'టాడు. మా తల్లిదండ్రుల జీవితాల్ని మేము శాసించలేదు. కుటుంబ నియంత్రణపట్ల అవగాహన కలిగిన రోజుల్లో కూడా ఆ వైపు మా తల్లిదండ్రులు దృష్టి సారించలేదు. కారణాలేమిటో మా పైతరం మనుషులు కాబట్టి మీకే తెలియాలి. వాళ్ళేం చేసి మాకీ ఆస్తిత్వాన్ని కలిగించారు అనుకుంటే కారణం ముందే చెప్పాను. వయసుతో వచ్చిన కోరికల తీవ్రతలు స్త్రీపురుషులకి ఒకలాగే ఉన్నా, ఆడపిల్ల పెళ్ళికి తల్లిదండ్రులు కంగారు పడ్డారు. ఆర్థికపరిస్థితిని పక్కన పెడితే, మౌలికంగా అవాంఛనీయమైన సంఘటనలు జరగకూడదన్న భయం దీనికి కారణం కావొచ్చు. డబ్బు లేకపోతే ఈ భయం ద్విగుణీకృత మౌతుంది. అంకుల్, మీరు కాలేజీ చదువుల తర్వాత ఉద్యోగకాలమంతా ఉత్తర భారతంలోనే గడిపారు. ఏదో అవసరానికి సెలవు తీసుకుని రావడం తప్ప ఇతరత్రా మీరక్కడే ఉండిపోయారు. మా కుటుంబంలో జరిగిన కొన్ని విషయాలు మీకు తెలియవు. ఒకదానితో మరొకటి లంకెపడి కొన్ని మార్పులు అవాంఛనీయమే అయినా సహజంగా సంభవించాయి.

నాకు ఉద్యోగం దొరగ్గానే పెళ్ళికి తొందరచేశారు. తను చేస్తున్నది ఉపన్యాసకుడి ఉద్యోగమైనా ఆదర్శాల ఊసెత్తకుండా, వాటి జోలికి పోకుండా దండిగా కట్నం తీసుకున్నారు. దానికి మరికొంత సొమ్ముజోడించి మొదటి చెల్లిపెళ్ళిచేశారు. తమ్ముడికి ఉద్యోగం దొరగ్గానే వాడికీ పెళ్ళిచేశాడు. కట్న ప్రసక్తి ఉన్నా లేకపోయినా వివాహమైన తర్వాత స్త్రీకి 'నేనూ, నా భర్తా, నా పిల్లలూ' అన్న ఓ సహజసిద్ధమైన స్వార్థం వస్తుంది. ఆ ఒక్క సుఖమూ అందిస్తున్న కారణంగా ఎంతటి విద్యాధికుడైనా కట్టుకున్న ఆడదానికి లొంగే ఉంటాడు. పుట్టింటి గడప వదిలి అత్తింటి గడపలో అడుగుపెట్టిన స్త్రీ మనస్తత్వం - ఆమె భర్త అతని తల్లిదండ్రుల మీద చూపే శ్రద్ధాభక్తుల్ని నియంత్రిస్తుంది. అలాగే కోడలి పట్ల అత్తమామలు ప్రవర్తించే విధానం కూడా తన ప్రభావాన్ని చూపుతుంది. మా అమ్మానాన్నలు మరి కోడళ్ళని సరిగానే చూసుకున్నారు. కానీ, తాము ఇచ్చిన కట్నాలతో ఆడపడచుల పెళ్ళిళ్ళు జరిపించారన్న ఓ

స్వాతిశయం ఇంట అశాంతికి కారణమైంది. ఇంగితజ్ఞానం లేకుండా ఆడపడుచు అధికారం చూపించబోయి ఇద్దరు చెల్లెళ్ళూ మరింత ఆజ్యం పోశారు. నాకూ, తమ్ముడికీ వేరు కాపురాలు పెట్టక తప్పలేదు. ఏతా వాతా తేలిందేమిటంటే మా తల్లితండ్రులు మా ఇద్దర్నీ పెట్టుబడి యంత్రాలుగా చూసినట్టే కదా?

ఇప్పుడు నాన్నగారికి ఇంకా ఇద్దరు ఆడపిల్లలకి పెళ్ళి చేయాల్సి ఉంది. కట్నపసక్తితో బాటు వివాహం వైభవంగా జరగాలన్నా ఓ కొత్త సంస్కృతి నెలకొన్న కారణంగా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. మాకూ చెల్లెళ్ళంటే ప్రేమా, అభిమానం లేదని కాదు. వాళ్ళిద్దరూ మంచి కుటుంబాల్లో పడాలన్నది మా అభిమతం కూడా. నేను ఉద్యోగంలో చేరి ఆరేళ్ళయింది. తమ్ముడికి నాలుగేళ్ళయింది. నాన్నకేసహాయం చేయాల్సి వచ్చినా మా కొచ్చే జీతాలలో ఆదా చేసిన సొమ్ముతోనే చేయాలి. అదీ నయానో భయానో కట్టుకున్నవాళ్ళని ఒప్పించో, లేదా వారికి తెలియకుండానో సహాయం చేయాలి. కార్లూ, ఫ్లాట్లూ కొనడానికి అప్పులిచ్చే బ్యాంకులు పెళ్ళిళ్ళకివ్వవు. ఆఫీసులవాళ్ళు ఇచ్చే ప్రావిడెంట్ ఫండ్ లోన్లు ఈ కాలం పెళ్ళిఖర్చులకే మూలకొస్తాయని? అదీకాక మాకున్న సర్వీస్‌తో, పోగుపడిన ఆ ఫండ్‌లోంచి వచ్చే ఋణం మూడు నాలుగు వేలకి మించదు. ఇలాంటి ఋణాల సంగతీ మీకు తెలియంది కాదు. ఇక మిగిలిన మార్గాలు? అధిక వడ్డీలతో ప్రైవేటు ఋణాలు తీసుకోవాలి. హామీకోసం పెద్దమనుషులుండాలి, తాకట్టుకోసం స్థిరాస్తులుండాలి, ఋణం తిరిగి చెల్లించడానికి తగిన సంపాద నుండాలి.

చట్ట విరుద్ధమైనా కట్నం ఓ ఆనవాయితీగా ఇంకా పరిగణించటల్లేదు. అయితే జీతానికి మించిన సంపాదన సంపాదించాలంటే అవినీతి మార్గాలు అన్వేషించాలి. లంచాలు పట్టాలి, మోసాలు చెయ్యాలి. కట్నాలకి తలొగ్గిన మనుషులు లంచాలకి తలొగ్గుతారా అంటే అదీ ప్రశ్నార్థకమే. నాకు వీలున్నా మనసొప్పదు. మనసును చంపుకున్నా సాహసం చేయలేను. తమ్ముడీ మధ్య, అన్యాయంగా ఓ లంచం కేసులో ఇరుక్కుపోయాడు. పై అధికారి తీసుకునే లంచాలు బయటపడ్డంతో కింద పనిచేసే తమ్ముడు తన ప్రమేయం లేకపోయినా చాలా సమాధానలే ఇచ్చుకోవాల్సి వచ్చింది. చివరికి గండం గడిచి బయట పడ్డాడు. వాడికిప్పుడో కూతురు. చాలనుకుని ఆపరేషన్ చేయించుకున్నాడు.  ఆ పిల్ల భవిష్యత్ కోసమని మరదలు వాడిచేత అనేకమైన పొదుపు పథకాల్లో సొమ్ము ఆదా చేయిస్తోంది. ఆమెకి తెలియకుండా ఓ పథకంలో అమ్మానాన్నలకి సహాయం చెయ్యాలని కొంత దాస్తున్నాడు. మరి నా సంగతేమిటని మీరు ప్రశ్నించవచ్చు. సంతానం ఇప్పుడప్పుడే వద్దనుకుని జాగ్రత్తలు పడ్డాను. అయితే తమ్ముణ్ణి ఆస్పత్రికి తీసుకెళ్ళిన రోజూ నేనూ బల్లెక్కాను. అప్పుడు ఏదో శుభకార్యమని  ఆవిడ ఓ రెండు వారాలు పుట్టింటికి వెళ్ళింది. ఆమెకీ సంగతి తెలియదు. తమ్ముడి సంగతి ఎవరికీ చెప్పనని ఒట్టేశాడు. కుటుంబ నిర్వహణకి అదనపు ఖర్చులెన్నో చూపించి నా తల్లిదండ్రులకోసం సొమ్ము ఆదా చేస్తున్నాను. ఇప్పుడు నేనూ తమ్ముడూ కూడా మాకు జన్మనిచ్చిన వారికి కొంత ఆదా చేస్తూనే మా వృద్ధాప్యం కోసం కూడా ఆదా చేసుకోవాలికదా? చెల్లెళ్ళంటే ఇష్టపడే ఇద్దరు కుర్రాళ్ళు మాకు తెలుసు. కులం వేరైనా సంప్రదాయం చాలా మంచిది. ఏదో కేవలం సంతకాల వివాహం కాకుండా సాంప్రదాయబద్ధంగా, గౌరవప్రదాయకంగ నిరాడంబరంగా వివాహం చేసే స్తోమత మాకిద్దరికీ ఉంది. వెదకబోయిన తీర్థం కాళ్ళదగ్గరకొచ్చినట్టుగా అనుకోకుండా మీతో మనసు విప్పడం జరిగింది.

నాన్నగారిని చెల్లెళ్ళ వివాహ విషయమై ఒప్పించండి. కట్నాలివ్వలేక ప్రేమల పేరిట కులాంతర వివాహాలకి పరుగులు తీశారని బంధువర్గాలలో కొంత అలజడి రేగినా అది సర్దుకుపోతుంది. ముఖ్యమైన విషయమేమిటంటే మా చెల్లెళ్ళిద్దరూ కూడా వాళ్ళంటే ఇష్టపడుతున్నారు. మీరు వేరే తమ్ముడితో మాట్లాడనవసరంలేదు.''

''నీ తమ్ముడి మాటటుంచు. నీకిప్పుడు సమాధానం చెప్పటందుక్కూడా నా దగ్గర ఏమీలేదు. ఇక మీ నాన్నని ఒప్పించ లేకపోతే మా స్నేహం వృధాయే. మెడలు వంచైనా ఆ ప్రయత్నం చేస్తాను. నిశ్చింతగా ఉండి.'' మాధవక్కణ్ణుంచి కదిలాడు.

"తల్లిదండ్రుల పట్ల నిర్ధయులుగా ఉండే సంతానం శాతం ఎంతని? భార్యల పట్ల క్రూరంగా ప్రవర్తించేవారి శాతం ఎంతని? అత్తమామల్ని గౌరవించని కోడళ్ళ శాతం ఎంతని? అతి స్వల్పం. వెదికితే వీటికీ కారణాలు దొరుకుతాయి. తీరు మారుతున్న కాలం వైపు నేరం నెట్టేసినా, అదొక ఆర్థిక సంబంధాలు నియంత్రించే వాస్తవం. ప్రతివారూ ఏదో ఒక సందర్భంలో తల్లిదండ్రులతో తీవ్రంగా విభేదించినా మౌలికమైన పేగుబంధాన్ని తెంపుకోవడం అరుదైన విషయమే. విదేశాలు వెళ్ళి డాలర్లు పంపుతున్నా వదిలి వెళ్ళారన్న నెపం. స్తోమతలేక సహాయం చేయలేకపోతే అప్పైనా చేసి ఆదుకోలేదని రోషం. కలిసి ఉన్నా రోజూ పలకరించరని ఉక్రోషం. భార్యావిధేయులై స్వార్థపరులయ్యారన్న భావన. ఇవేమీ అవాస్తవాలు కాదు. ఇరుపక్షాలా మనసులు ఎక్కడో రాజీ పడాలి.

'భార్యామోహంతో దశరథుడు రాముణ్ణి అడవికి పంపాడు. తండ్రిమాట జవదాటని రాముడు సతీసమేతంగా అరణ్యావాసం చేశాడు. భీష్ముడు తండ్రి శంతనుని కోసం బ్రహ్మచారిగానే ఉండిపోయాడు. కేశవ దంపతులు కన్న సంతుకోసం, కొడుకులు భార్యల వద్ద తమ వ్యక్తిత్వాలని కోల్పోయి జీవితాల్ని కొంత త్యాగమే చేసారనుకోవాలి. కేశవ పెద్దకొడుకుని భీష్మునితో పోల్చడం అపసవ్యమేమీ కానేరదు' మాధవ ఆలోచనలు పరిపరివిధాల పరుగులెత్తాయి.

కేశవ కొడుకులు చేసిన త్యాగాన్ని చెప్పకుండా కేశవని ఎలా ఒప్పించాలా అని మాధవ పథకం వేసుకోసాడు. ఆ నిజాన్ని ఆఖరి అస్త్రంగానే వాడాలి. అప్పటికీ వినకపోతే కేశవకి కొడుకుల మీద నేరం మోపే అధికారం లేదు. అతను సృష్టించుకొన్న జీవితానికి అతనే బాధ్యుడు.

# మనసుకు రంగులు

సి.యమున చింతలపాటి

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

**"అరే ఇవాళ లేటయ్యింది" అనుకుంటూ** బిల్డింగ్‌లోకి అడుగుపెట్టాను.

నా ఫ్లాట్‌కి చేరువవుతున్నకొద్దీ నడకలో వేగం, మనసులో ఉత్సాహం ఎక్కువవుతూ ఉంటుంది. ఇంటికి చేరుకోగానే నాకు లభ్యమయ్యే అనుభవం అలాంటిది.

ఆటోమాటిక్ డోర్ లాక్ తీసుకుని లోపలికి వెళ్ళగానే పిల్లలొచ్చి 'అమ్మా' అంటూ చుట్టేశారు. అది రోజూ జరిగేదే అయినా నా మనసులో కలిగే ఆనందం ఎప్పటికప్పుడూ నూతనంగా ఉంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు స్వాతి, అనిల్. స్వాతికి పదేళ్ళు, అనిల్‌కి ఎనిమిదేళ్ళు. నేను రాగానే వాళ్ళ కబుర్లు, కంప్లైంట్స్ మొదలవుతాయి. ఈ రోజు కూడా అలాగే మొదలయ్యాయి.

"అమ్మా! కేరమ్స్‌లో స్వాతి నన్ను ఛీట్ చేసింది"

"లేదమ్మా వాడికి రూల్స్ అర్థం కాక అలా చెపుతున్నాడు. నేను కరక్టే ఆడాను"

"లేదు.. స్వాతి లైయింగ్"

"నువ్వే లైయింగ్. మమ్మీ, వాడు స్కూల్ నుండి వాళ్ళ ఫ్రెండ్ 'బర్త్‌డే' అని ఇచ్చిన చాక్లెట్ తీసుకొచ్చాడు. ఏదైనా మమ్మల్ని షేర్ చేసుకోమని చెప్పావుకదా! కానీ మొత్తం వాడే తినేసాడు. అడిగితే మర్చిపోయానని చెపుతున్నాడు"

"పాపం వాడు నీతో షేర్ చేసుకుందామనే ఇంటికి తెచ్చి ఉంటాడు. లేకపోతే ఇంటికి తీసుకురాడు కదా! నిజంగానే మర్చిపోయుంటాడు" అని పాపను సర్దిపుచ్చాను.

వాడిని అర్థంచేసుకున్నందుకో ఏమో నన్ను ముద్దుపెట్టుకున్నాడు అనిల్.

వాళ్ళ కబుర్లతో నాకు టైమే తెలీదు.

కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీస్తే ఎదురుగా ఎవరో ఒకమె నిలబడి ఉంది. వయసు యాభైపైనే ఉన్నట్లులుంది. అర్థంకానట్లు చూసాను.

"నన్ను గుర్తుపట్టలేదా? ఏడాది క్రితం ఒకసారి మీ ప్రక్కనున్న మా అపార్ట్ మెంట్ ఎలాఉందో చూసుకోవటానికి వచ్చినపుడు 'ఇరుగుపొరుగు వారిని పరిచయం చేసుకోవాలని' వచ్చి కలిసి వెళ్ళాను. మీ ప్రక్కింటి ఆంటీని. మీ అంకుల్ రిటైర్ అయ్యారు. అందుకే

ఫ్లాట్ ఖాళీ చేయించేసి మేము వచ్చేసాము" అంది.

అవును. ఇందాక ప్రక్క ఫ్లాట్‌లోకి సామాను చేరేస్తున్నారు. నేను పెద్ద పట్టించుకోలేదు.

"సారీ మర్చిపోయాను. రండి లోపలికి" అని ఆహ్వానించాను.

"ప్రొద్దుపోయింది. రేపొస్తాలే. నువ్వు ఏమనుకోకపోతే ఓ చిన్న కప్ పెరుగు ఇస్తావా? అంకుల్ కి పెరుగులేందే తినలేరు. ఇప్పుడు బయటకు వెళ్ళితెచ్చుకోవటానికి ఓపికలేదు" అంది రిక్వెస్ట్‌గా.

"ఓ.. ష్యూర్" అంటూ లోపలికి నడిచాను.

ఆమె కూడా నా వెనకాలే వచ్చారు. నేను ఫ్రిజ్ తీసి పెరుగు ఇచ్చే లోపు పిల్లలని పలకరించి వాళ్ళ పేర్లు, చదువులు గురించి తెలుసుకుంది.

ఆమె వెళ్ళేముందు "రేపు మా ఇంటికి రండి. తాతగారిని పరిచయం చేస్తాను" అని చెప్పి వెళ్ళిపోయింది.

వస్తూనే ఆవిడ అలా వరసలు కలిపెయ్యటం నాకు నచ్చలేదు.

నేను ఏదో పలకరింపుగా నవ్వటం తప్ప పెద్దగా ఎవరితోనూ కలవను. ఇరుగు పొరుగు ఫ్లాట్స్ వాళ్ళతో ఎప్పుడన్నా నీళ్ళు రానప్పుడో, ఫ్లోర్ ఊడ్చే వాళ్ళు ఎగ్గొట్టినప్పుడో ఏదో అవసరం కోసం మాట్లాడటం తప్ప గాఢమైన స్నేహం ఎవరితోనూ లేదు.

దానికి కారణం కొంత నా స్వభావం, మరికొంత నా పని. నేను చీరలు, చుడిదార్లు. మెటీరియల్స్ పైన బ్లాక్ ప్రింటింగ్, పెన్సిల్ డిజైన్, బాటిక్, మగ్గం వర్క్ డిజైన్ చేసి అమ్ముతాను. స్టార్ట్ చేసి రెండేళ్ళు అయింది. ఇప్పుడిప్పుడే పికప్ అవుతోంది. నాది సొంత ఫ్లాటే. ఫ్లాట్ కొనుక్కుని మూడేళ్ళయ్యింది. కానీ అపార్ట్‌మెంట్‌లో కమర్షియల్ యాక్టివిటీ చెయ్యకూడదు. అందుకని మా ఇంటినుండి రెండుమూడు కిలోమీటర్ల దూరంలో రెండు గదులు అద్దెకు తీసుకుని వర్క్ షాప్ పెట్టాను. వర్క్స్ చేయించటం, అమ్మటం అన్నీ అక్కడే

మా వారు ఓ ప్రైవేట్ కంపెనీలో మార్కెటింగ్ మానేజర్. ఆయనకి ఎప్పుడూ తీరుబడి ఉండదు. ప్రొద్దున వెడితే రాత్రికే వస్తారు.

"కొత్తగా వచ్చిన వీళ్ళు అతిగా చనువు తీసుకోరు కదా" అనుకుంటూ నా పనిలోకి ప్రవేశించాను.

●●●

మర్నాడు నేను వచ్చేసరికి పిల్లలు ఏవో వడలు తింటున్నారు. నన్ను చూడగానే "అమ్మా.. తాతమ్మ వడలు ఇచ్చింది. చాలా బావున్నాయి" అంటూ ఆనందంగా చెప్పారు.

"ఈ తాతమ్మ ఎవరు?" నా కర్థం కాలేదు.

నేను ఏదో అనేలోపే ప్రక్కావిడ ప్లేట్‌లో ఇంకాసిని వడలతో వచ్చింది.

"ఇదిగోమ్మా నువ్వు కూడా తిను" అంటూ నా చేతికిచ్చింది.

"అమ్మమ్మా వడలు చాలా బావున్నాయి. మీ మమ్మీకి అంటే తాతమ్మకి థాంక్స్ చెప్పు" అన్నాడు అనిల్.

"అలాగే బంగారు" అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

"ఈవిడ అమ్మమ్మా? ఈవిడ అమ్మ తాతమ్మా? ఎవరు చెప్పారు ఈ వరసలు?"

నా మనసులో ఆలోచన కనిపెట్టినట్లు "మమ్మీ ఇందాక ఈ ఆంటీ వాళ్ళ మమ్మీ వచ్చింది. ఆమె చెప్పింది. ఈ ఆంటీని అమ్మమ్మ అని, తనని తాతమ్మని, అమ్మమ్మ వాళ్ళ హజ్బెండ్‌ని తాతయ్యని పిలవమని చెప్పింది" తనకంతా అర్థమయిపోయిందనే ఉత్సాహంతో హుషారుగా చెప్పింది స్వాతి.

ఇదేదో శ్రుతిమించి రాగాన పడుతున్నట్లుంది. అప్పటికి నేనేమీ మాట్లాడలేదు.

●●●

మర్నాడు నేనొచ్చేప్పటికి పిల్లలు 'పులి జూదం' ఆట ఆడుతున్నారు.

"అమ్మా ఇందాక తాతమ్మ వచ్చింది. మాకు ఈ ఆట నేర్పించింది" ఉత్సాహంగా చెప్పాడు బాబు.

నాక్కాస్త చిరాకనిపించింది. వీళ్ళు ఎక్కువ చనువు తీసుకుంటున్నట్లున్నారు. వీళ్ళ వలన పిల్లల డిసిప్లిన్ చెడేటట్లున్నది. చదువు డిస్టర్బ్ అయ్యేటట్లుంది. నాకు మండిపోయింది.

"తలుపు ఎవరు కొట్టినా తియ్యద్దు. కొత్తవాళ్ళని లోపలికి రానియ్యొద్దు అని చెప్పానుగా! ఎందుకు రోజూ అందరిని లోపలికి రానిస్తున్నారు" అని కోపంతో వాళ్ళ మీద గట్టిగా అరిచాను.

"నిన్నేమో మేము నువ్వు స్నాక్స్ పెట్టిన డబ్బ మూత తీస్తుంటే క్రిందపడి అన్నీ నేలమీద పడిపోయాయి. ఈలోపు, వాచ్‌మాన్ మన కరెంట్ బిల్ వాళ్ళకి ఇచ్చాడని, అది మనకి ఇవ్వటానికి అమ్మమ్మ వచ్చింది. నేలమీద పడిపోయిన స్నాక్స్ చూసి వడలు తీసుకు వచ్చి ఇచ్చింది" చేతులు, కళ్ళు తిప్పుతూ చెప్పాడు అనిల్.

"ఈ రోజేమో బయట ఆడుకుంటుంటే కాలు స్లిప్ అయ్యి అనిల్ పడిపోయాడు. దెబ్బ తగిలింది. నేను మెల్లగా చెయ్యిపట్టుకుని నడిపించుకొస్తుంటే తాతమ్మ చూసింది. తాతమ్మ వచ్చి కాలికి ఆయింట్‌మెంట్ రాసింది. 'ఈ రోజు నువ్వు ఆడుకోవటం లేదని బాధపడకు. నేను మీతో ఆడతాను' అని వాళ్ళ ఇంట్లోనుండి ఇవన్నీ తీసుకువచ్చి మాతో ఆడింది" చెప్పింది స్వాతి.

వాళ్ళది కానీ, ప్రక్క వాళ్ళది కానీ తప్పులేదన్నట్లు క్లియర్ గా చెప్పేశారు పిల్లలు.

"అవునా నాకు తెలీదుగా! అందుకే అలా అన్నాను. సారీ మనం ఫ్రెండ్స్" అంటూ వాళ్ళతో చేతులు కలిపి నన్ను నేను కంట్రోల్ చేసుకున్నాను.

●●●

పదిహేను రోజులుగా నా పని ఎక్కువయ్యింది. చాలా హై సర్కిల్లో ఓ కస్టమర్ పరిచయమయ్యింది. తన కూతురి పెళ్ళి సందర్భంగా బంధువులకు తను పెట్టె చీరలన్నీ కొంత వెరైటీగా ఉండాలని ఆమె కోరిక. ఆ అవకాశం నేను సద్వినియోగం చేసుకోవాలని

నా  తాపత్రయం. అందుకని ప్రత్యేక శ్రద్ధతో ఆమెకు డిజైన్ సెలక్షన్స్‌లో సహకరం అందిస్తున్నాను. తరువాత ఏమాత్రం తేడా రాకుండా వర్కర్స్‌తో పనిచేయిస్తున్నాను. అలాంటి డీల్ ఒకటి సక్సెస్ అయితే నాకు చాలా ఆర్డర్స్ వచ్చే అవకాశం ఉంది.

పని ఎక్కువవటం వలనో ఏమో ఈ రోజు ఒళ్ళు నొప్పులుగా ఉంది. షాప్‌కి మధ్యాహ్నం నుండి వెడదామని డిసైడ్ చేసుకున్నాను. వర్కర్స్‌కి ఫోన్‌లో గైడ్ చేస్తున్నాను.

ఈ పదిహేనురోజుల్లో నా పిల్లలు ప్రక్క వాళ్ళ దగ్గర 'దాడి', 'గవ్వలు' ఆటలు నేర్చుకున్నారు. కొన్ని కథలు విని నాకు చెప్పేశారు కూడా. నాకు మటుకు వాళ్ళ ఫ్లాట్‌లోకి వెళ్ళటానికి కుదరలేదు. ఆ 'తాతమ్మని' అదే పెద్దామెని చూడలేదు కూడా. వాళ్ళ మీద నాకు అసలు ఏ మాత్రం ఇంట్రెస్ట్ లేదు. పైగా నా పిల్లల 'క్రమశిక్షణ చెడిపోతుందేమో' అనే భయంతో ఒళ్ళు మంటగా ఉంది.

ఒకటి మటుకు గమనించాను. నేను బయపడ్డట్లు వాళ్ళ చదువు పెద్ద డిస్టర్బ్ కావటంలేదు. ఆటలు ముగించుకుని ఎప్పటిలాగానే నేనొచ్చే టైముకి హోం వర్క్స్ చేసుకుంటూ కూర్చుంటున్నారు.

కానీ ఈ ఆటలన్నీ ఎప్పుడో నా చిన్నప్పుడు మా నాయనమ్మ నేర్పింది. ఇప్పుడు వీళ్ళు యునో, బిజినెస్ ఆడుకుంటారు. కంప్యూటర్ గేమ్స్ కూడా ఆడతారు. నా పిల్లలే ఒకరినొకరు పేర్లతో తప్ప వరసలతో పిలుచుకోరు.  అలాంటిది వాళ్ళు వచ్చి వరసలు కలపటమేమిటి? ఈ రోజుల్లో ఈ వరసలు పెట్టుకుని పిలుచుకోవటం, పాత తరం ఆటలు ఆడటం. ఇవన్నీ అవసరమా? ఒకసారి ఆ పెద్దామెతో మాట్లాడాలి. కానీ ఏమి మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి అనేది అర్ధంకావట్లేదు.

ఆ రోజు వెళ్ళి ముందు పరిచయం చేసుకుంటాను. తరువత ఏం మాట్లాడాలో ఆలోచిద్దాము. "నా ఆలోచనల్లో నేనుండగానే "ఏంటమ్మా ఈరోజు వెళ్ళలేదా" అంటూ ప్రక్కింటావిడ వచ్చింది.

"రండి. కూర్చోండి. కాస్త లేట్‌గా వెడుతున్నాను" అంటూ ఆహ్వానించాను.

"అమ్మ నిన్న యాత్రలకి వెళ్ళింది. పదిహేను రోజులదాకా రాదు. అంకుల్ కూడా బ్యాంక్ పనిమీద బయటకు వెళ్ళారు. తోచనట్లయింది. అమ్మని విడిచి నేనుండలేను" అందామె ఏదో చిన్న పిల్లలాగ.

అంత పెద్దావిడ అలా అంటుంటే ఏదో తమాషాగా అనిపించింది. ఆమె అలా చెపుతున్నప్పుడు నేను కూడా కొంత ఇంట్రెస్ట్ తీసుకోవాలనే ఉద్దేశ్యంతో.

"మీ అమ్మగారు ఎప్పుడూ మీ దగ్గరే ఉంటారా?" అని ప్రశ్నించాను.

"మా అమ్మకు నేనొక్కదన్నే. నాకు నాలుగునెలల వయసులోనే నాన్నగారు పోయారు. అమ్మ ఏంతో కష్టపడి నన్ను పెంచింది. బయట వాళ్ళయితే ఏమి ఇబ్బంది పెడతారో అని నన్ను తన తమ్ముడికే ఇచ్చి పెళ్ళిచేసింది."

"అంటే.. మీకు మీవారు.?"

"సొంత మేనమామే"

"మీకు పిల్లలెంతమంది? ఏం చేస్తున్నారు?" అని అడిగాను.

"ముగ్గురు పిల్లలు. ఒకమ్మాయి వైజాగ్‌లో, ఇంకో అమ్మాయి చెన్నైలో ఉంటున్నారు. పెళ్ళి అయ్యి పిల్లలతో హాయిగా ఉన్నారు. సెలవులకు వచ్చిపోతుంటారు. అబ్బాయి అమెరికాలో  ఎమ్మెస్ చేసి ఉద్యోగం చేస్తున్నాడు. రెండు నెలల్లో వస్తున్నాడు. పెళ్ళి చేసి పంపాలి. సరే అమ్మా, నీ పనిచెడగొడుతున్నట్లున్నాను. ఇంక నేను వెడతాను" అని లేచి నిలబడింది.

మనసులో ఎలా ఉన్నా, పైకి మటుకు "అయ్యో అదేమీలేదండీ!" అని ఓ నవ్వు పులుముకుని సాగనంపాను.

●●●

నా పనితో బిజీగా ఉండటంతోనో ఏమో రోజులు తొందరగా గడుస్తున్నాయనిపిస్తోంది. పిల్లలకి ఎగ్జామ్స్ కూడాను. ఎగ్జాం రాసి మధ్యాహ్నానికే వచ్చేస్తున్నారు. రోజూ నేను కూడా ఆ టైముకు వచ్చి వాళ్ళకి లంచ్ పెట్టి, కాసేపు రెస్ట్ తరువాత, మర్నాడు ఎగ్జాముకి చదవాల్సినవి, రాయాల్సినవి ఎలాట్ చేసి మరల రెండు మూడు గంటలు షాపుకి పోయి వస్తున్నాను.

ఈ రోజు లంచ్ టైములో రాగానే "తాతమ్మ ఊరినుండి వచ్చేసింది. మాకు తమాషా బొమ్మలు తెచ్చింది. ప్రసాదాలు ఇచ్చింది" అంటూ స్వాతి,

"ఇవిగో ఇవి కట్టింది" అని చేతికి కట్టిన కాశీదారాలు చూపిస్తూ అనిల్ కళ్ళల్లో ఆనందం నిండగా ఉత్సాహంగా చెప్పారు.

వాళ్ళ ఆనందం చూసి నాకాశ్చర్యమేసింది. 'ఈ కొద్ది రోజుల్లో ఇంత ఎటాచ్ మెంటా? దీని గురించి ఆలోచించాలి' అనుకుంటూ పైకి మటుకు "ఓ గుడ్ గుడ్! తొందరగా లంచ్ చేసేద్దాము. ఆకలి వేస్తోంది" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరికి నడిచాను. పని చేస్తూనే మనసులో నా చీరల మీద 'ఏ కలర్ కాంబినేషన్స్ బెస్ట్‌గా ఉంటుందా' అని ఆలోచించుకుంటున్నాను. పడుకున్నా ఆ చీరలు డిజైన్లు రంగులే కలలోకి వస్తున్నాయి. పిల్లల రాంక్స్ కూడా తగ్గకుండా చూసుకోవాలి.

కొంచెం సేపు తరువాత వాళ్ళని చదువుకోమని చెప్పి, షాప్‌కి వెళ్ళిపోయాను.

సాయంత్రం నేను వచ్చి తలుపు తీసేసరికి ఇద్దరూ ఏడుస్తూ వచ్చి నన్ను చుట్టేశారు. ఎప్పుడన్నా కొట్టుకుంటారు కానీ అంతలా ఏడవటం నేనెప్పుడూ చూడలేదు. నాకు కంగారు అనిపించింది.

"ఏమైందీ? ఊరుకోండి. ఏడవకండీ" అంటూ కళ్ళు తుడుస్తూ దగ్గరకి తీసుకున్నాను.

"మేము క్రింద ఆడుకునేటప్పుడు అంబులెన్స్ వచ్చింది. తాతమ్మ పడిపోయిందట. కళ్ళు తెరవలేదుట. అమ్మమ్మ ఏడుస్తూ తాతమ్మని అంబులెన్స్‌లో తీసుకెళ్ళింది. తాతయ్యకూడా వెళ్ళారు. నీకు ఫోన్ చేసాము. నువ్వు తియ్యలేదు" అంటూ వెక్కిళ్ళ మధ్య చెప్పారు.

"అయ్యో అవునా? సారీ ఇంటికి రావటానికి నేను స్కూటీ డ్రైవ్ చేస్తున్నాను కదా! ఫోన్ వినపడలేదు. మీరు కంగారు పడకండి. డాక్టర్స్ మంచి మందులు వేస్తారులే. తగ్గిపోతుంది" అని టి.వి.లో కార్టూన్ ఛానెల్ ఆన్ చేసి, ఏవో స్నాక్స్ పెట్టి వాళ్ళని డైవర్ట్ చేసాను.

ఆ పెద్దామె గురించి కనుక్కుందామంటే వాళ్ళ మొబైల్ నెంబర్ లేదు. ఫ్లోర్లో వేరే వాళ్ళ దగ్గరకి వెళ్ళి అడిగాను.

"మేమిప్పుడే ఫోన్ చేసి కనుక్కున్నాము. ఆమెకు బి.పి పెరిగి బ్రెయిన్‌లో చిన్నక్లాట్ అయ్యిందట. ఐ.సి.యులో పెట్టారుట" అని చెప్పారు.

మర్నాడు షాప్‌కి వెడుతూ దోవలో హాస్పటల్‌కి వెళ్ళాను. మా ప్రక్కావిడ చాలా విచారంగా ఉన్నారు. ఐ.సి.యులో పెద్దావిడని చూసాను. చాలా దృఢమైన మనిషి. పచ్చటి పసిమితో నుదుటన విభూది రేఖతో మన స్పృహలో లేనట్లు పడుకునుంది.

"డాక్టర్స్ ఏమి చెప్పారు?"

"క్లాట్ మందులతో కరగచ్చు. కానీ ఏజ్డ్ మనిషి కదా చెప్పలేమన్నారు" అంది ఆంటీ దిగులుగా.

"ధైర్యంగా ఉండండి తగ్గిపోతుందిలెండి" అని ఏదో రెండు మాటలు చెప్పి ఇంకో ఐదు నిమిషాలు ఉండి వెళ్ళిపోయాను. అవతల నాకు చాలా పనుంది.

●●●

పెద్దావిడని హాస్పిటల్‌లో చేర్చి పదిరోజులయిపోయింది. ఆవిడ మనుమరాళ్ళు పిల్లలతో సహా వచ్చేశారు.

మధ్యలో మా పిల్లలు 'తాతమ్మ ఎప్పుడొస్తుంది? మేము చూస్తాము' అని అడిగారు. వాళ్ళతో పెద్ద పరిచయమే లేదు. పెద్ద పూసుకుని తిరటం నాకు ఇష్టంలేదు.

"ఆవిడ ఇప్పుడు వీక్‌గా ఉంది. మాట్లాడలేదు. నాలుగురోజులు ఆగి వెడదాము" అని సర్దిచెప్పాను.

నాకు నా పనితో తీరుబడి లేకపోయినా 'బాగుండదేమో' అని ఇంకోసారి హాస్పిటల్‌కి వెళ్ళాను. అప్పటికి ఐ.సి.యు నుండి మామూలు రూములోకి షిఫ్ట్ చేసారు. నేను వెళ్ళిచూసినపుడు కూడా ముసలామె గాఢ నిద్రలోనే ఉంది.

"అట్లా ఎప్పుడూ నిద్రపోతూనే ఉంటోంది. "ఈమెని ఇంటికి తీసుకెళ్ళండి. ఇప్పుడు వాడే మందులు ఇంట్లోనే ఉండి వాడుకోవచ్చు. మెల్లగా రికవర్ అవ్వచ్చు. చెప్పలేము" అన్నాడు డాక్టర్స్. అందుకని రేపు ప్రొద్దున ఇంటి కొచ్చేస్తున్నాము" అని విచారంగా చెప్పింది ఆవిడ.

మరల అంతలోనే "పిల్లలు ఎలా ఉన్నారు? పాపం వాళ్ళని ఒంటరిగా ఉంచి వచ్చావా? ఇంతకు మునుపే మన ఫ్లోర్‌లో వాళ్ళు వచ్చి వెళ్ళారు. మీరంతా ఎంత అభిమానంగా వస్తున్నారు" అంటూ చెయ్యిపట్టుకుని ప్రేమగా చెప్పింది.

ఆ ఎమోషన్ ఎక్స్‌ప్రెషన్స్ నాక్కాస్త విసుగ్గా అనిపించింది.

●●●

ఆ పెద్దామెని ఇంటికి తీసుకు వచ్చి రెండు రోజులయ్యింది. ఆమెని చూద్దామని మొదటిసారిగా వాళ్ళ ఫ్లాట్‌లోకి వెళ్ళాను. ఇల్లంతా సందడిగా ఉంది.

మా ప్రక్కావిడ "రామ్మా రా. వీళ్ళందరూ మా పెద్దమ్మ కొడుకు, కూతుళ్ళు. అమ్మని చూడటానికి వచ్చారు" అని వాళ్ళని పరిచయం చేసి ఐదు నిమిషాల తరువాత నన్ను పెద్దావిడ రూంలోకి తీసుకెళుతూ ఆవిడ నన్ను చూసి 'స్వాతి, అనిల్‌ని' చూడాలనిపిస్తోంది. తీసుకురా" అని అడిగింది.

పెద్దావిడ పడుకుని, ఎదురుగా గోడకున్న ఎల్.సి.డి.లో భక్తి ప్రోగ్రాం చూస్తోంది.

కేవలం కొన్ని రోజుల పరిచయం ఉన్న నా పిల్లల గురించి ఆమె కలవరించటం నాకాశ్చర్యమేసింది.

"అమ్మా చూడు ఎవరొచ్చారో. అనిల్, స్వాతి వాళ్ళ అమ్మ జ్యోతి" అంటూ ఆ ముసలామె దగ్గరకి తీసుకెళ్ళి నన్ను పరిచయం చేసింది.

తన ప్రక్కలో చోటు చూపించి "కూర్చో" అందామె.

ప్రక్కవాళ్ళు, బాగుండదేమో అని పలకరించటానికి వచ్చాను. ఇలా చనువుగా కూర్చోవటం నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. కాదనలేక కూర్చున్నాను.

"అమ్మా జ్యోతీ, నీ పిల్లలు బంగారం. ఎంత ప్రేమగా ఉంటారో. అది నీ నుండే వచ్చుంటుంది. నన్ను ఎప్పుడు కలవకపోయినా, నువ్వు హాస్పటల్‌కి కూడా వచ్చి నన్ను చూసావట. మా అమ్మాయి చెప్పింది. ఎంత గొప్ప సంస్కారం నీది" అంది కళ్ళల్లో ప్రేమ నిండగా.

ఆమె మాటలికి నాకు ఏదో గిల్టీగా అనిపించింది. వాళ్ళకి వాళ్ళ కుటుంబంతో, బంధువులతో ఉన్న అనుబంధం గమనిస్తే, ఇంకొకరిని వాళ్ళు పలకరించవలసిన అవసరం కూడా లేదు. మమ్మల్ని వెంటపడి మాట్లాడించాల్సిన పనేలేదు. అయినా కూడా మాపైన ఎంత అభిమానం చూపిస్తున్నారు.

ఆమె మృత్యుముఖంలో ఉండి గత తరం ప్రేమలని భావి తరాలకి అందించటానికి వారధియ్యై ప్రయత్నిస్తోందనిపిస్తోంది.

నా మనసంతా ఏదోగా అయిపోయింది. ఆ పెద్దావిడ చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

నాలో ఏదో భావజాలం.

"చనిపోయేది ఎవరు? ఆమేనా? ఇరుగుపొరుగుల మధ్య ఉండే అభిమానం, పిలుపుల్లోని కమ్మదనం బంధువుల మధ్య ఉండే ఆత్మీయత ఇంకొక మనిషితో అవసరం లేకుండా కంప్యూటర్‌తో ఆడుకునే ఈ రోజుల్లో, 'ఆటంటే మనుషులు ఒకరితో ఇంటరాక్ట్ అవుతూ ఆనందించే అనుబంధం' అని చెప్పిన ఓ ప్రేమ చిహ్నం అనుభవాలని కథలుగా అల్లి యానిమేషన్ కథలకన్నా హృద్యంగా పిల్లలికి అందించే ఓ కథల పుస్తకం శిథిలమవుతోంది"

నాలో ఏదో కలవరం. నా కుటుంబంతో మాత్రమే కాదు ఇరుగుపొరుగులతో, పెద్దవారితో కూడా ఆత్మీయంగా ఉండాలనే ఆలోచన ఏదో రక్షించుకోవాలనే తపన చీరలకు రంగులద్దటం కాదు నా మనసుకు ప్రేమ, అనురాగం అనే రంగులు మరింత అద్దుకోవాలి. మెరుగులు దిద్దుకోవాలనే గాఢమైన కోరిక.

"అమ్మమ్మా, మా పిల్లల్ని తీసుకొస్తాను. వాళ్ళు రోజూ 'తాతమ్మ'ని చూడాలని అడుగుతున్నారు" అంటూ మొదటిసారిగా వాళ్ళతో మనస్ఫూర్తిగా వరసలు కలిపి మాట్లాడాను. పిల్లల్ని తీసుకురావటానికి నా ఫ్లాట్‌లోకి నడిచాను.

## కథ వెనుక కథ

టి.వి., ఇంటర్ నెట్, న్యూక్లియర్ ఫ్యామిలీ.......ప్రభావంతోను.......విద్య,ఉద్యోగాల ఒత్తిడులతోను కుటుంబసభ్యులే ఒకరితో ఒకరు గడిపే అవకాశం రోజ రోజుకు తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో పాత రోజుల్లో ఇరుగు పొరుగు మధ్య ఉండే ఆప్యాయతలను, కుటుంబములో ఉండే అనురాగాల మధురిమను నా తరం వారికి గుర్తుచేస్తూ, ఈ తరం వారికి అందించే ప్రయత్నమే ఈ నా 'మనసుకు రంగులు'.

- రచయిత్రి

# మిధ్యాబింబాలు ఆచార్య పి.కె.జయలక్ష్మి

రెండు వారాలయింది యు.యస్ నించి వచ్చి. ల్యాప్ టాప్ లో ఫేస్ బుక్ చూస్తుంటే అవినాష్, కాకినాడ అని కన్పిస్తే యాధాలాపంగా ప్రొఫైల్ చూసా. సందేహం లేదు ..నా మేనల్లుడు అవినాషే! దాంట్లో ఉన్న నంబరికి అదిరే గుండెలతో ఫోన్ చేశా. అట్నించి "హలో" అన్న స్వరం వినగానే గుండె గొంతులో కొట్టుకుంది.

వణికే కంఠం తో " నేను మాధవత్తని అవినాష్.. బెంగుళూరు నించి మాట్లాడుతున్నా" అన్నాను.

ఒక్క నిమిషం మౌనం రాజ్యమేలింది. బహుశా జ్ఞాపకం చేసుకుంటున్నాడనుకుంటా! పదేళ్లయిపోవస్తోంది కదా!

"మధూ అత్తా! ఎన్నాళ్లకెన్నాళ్ళకి? ఎలా వున్నావ్? ఏంటీ సర్ప్రైజ్?" అన్నాడు సంతోషంగా.

" హమ్మయ్య గుర్తుపట్టావు కదా? ఫేస్ బుక్ లో నీ నంబరు చూసి పట్టుకోగల్గాను. అంతా బాగున్నారా అవీ?" ఆప్యాయంగా పలకరించాను.

" అత్తా, నేను ప్రస్తుతం ఢిల్లీ కాన్ఫరెన్స్ లో ఉన్నా. ఎల్లుండి కాకినాడ వెళ్ళగానే ఫోన్ చేసి వివరం గా మాట్లాడతా. నీ నంబర్ ఇదే కదా? ఉంటానత్తా, బై " అని పెట్టేశాడు.

నా మనసు గతం లోకి జారిపోయింది.

★★★★★ ★★★★★★ ★★★★★★ ★★★★★ ★★★★★★★

కాకినాడ నా పుట్టిల్లు. ఎన్నో అపురూపమైన జ్ఞాపకాలు కాకినాడతో ముడిపడి ఉన్నాయి. నా పుట్టుక, బాల్యం, చదువు, ప్రేమ, పెళ్లి ... ఇలా జీవితం లో ముఖ్యమైన ఘట్టాలన్నిటికీ కాకినాడే సాక్షి. అమ్మానాన్నలకి అన్నయ్య, నేను రెండు కళ్లలా పెరిగాం. చిన్నదాన్ని కావడంతో నన్ను చాలా ముద్దుగా చూసుకునేవారు. అన్నయ్య రంగరాయ కాలేజ్ లో మెడిసిన్ చదువుతుంటే నేను విమెన్స్ కాలేజ్ లో ఇంటర్ చదివేదాన్ని. ఆ రోజులు నాకెప్పుడూ గుర్తే!

చదువుకోడానికి, సెమినార్ ప్రిపరేషన్ కనీ వాడి ఫ్రెండ్స్ ఇంటికి వస్తూ ఉండేవారు. అన్నయ్య క్లోజ్ ఫ్రెండ్ దిలీప్, క్లాస్ లో ఎప్పుడూ ఫస్ట్ వచ్చేవాడు. చాలా చురుకైనవాడని నాన్నగారు కూడా ఎంతో మెచ్చుకొనేవారు తనని. మా ఇంటికి ఎప్పుడొచ్చినా ఏదో ఒకటి అని నన్ను ఉడికిస్తూ ఉండేవాడు. ''ఏయ్ డాక్టర్?" అంటే ''ఏం పేషెంట్?" అని ఆటపట్టించేవాడు. కొన్నాళ్ళకి వాళ్ళ చదువు, నా డిగ్రీ పూర్తయ్యేసరికి పేషెంట్ ని కాస్తా ప్రేయసి గా మరి పెళ్లి వరకు వచ్చేశాం. వర్ణాంతరం కావడంతో ఇంట్లో ఒప్పుకోకపోవడాలు, అలకలు, గొడవలు... అన్నీ మామూలే! చివరికి అన్నయ్య ప్రమేయం తో , ఇరుపక్షాల సమ్మతితో మేం ఒకటయ్యాం. తర్వాత హైదరాబాద్ లో కాపరం పెట్టడం, శ్రేయ, సంతోష్ పుట్టడం , కాలచక్రం లో ఎన్నో సంఘటనలు సంభవించాయి ..... కొన్ని గుర్తుపెట్టుకోగల్గినవి, కొన్ని మర్చిపోదామన్నా మరవలేనివి.

అన్నయ్య, అమ్మవాళ్ళ ఇష్టప్రకారం మెడిసిన్ చదివిన అమ్మాయినే సాంప్రదాయ బద్ధం గా పెళ్లి చేసుకున్నాడు. వాడికి ఇద్దరు పిల్లలు... అవినాష్, అమల. పచ్చని పసిమి ఛాయతో ముట్టుకుంటే మాసిపోతుందేమో అన్నంత తెల్లగా అందంగా ఉండేది అమల .


కౌముది

దానికి తోడు మంచి కనుముక్కు తీరు, ఒత్తైన నొక్కుల జుట్టు. అంతా మేనత్త పోలిక అంటుంటే నాక్కొంచెం గర్వంగా అన్పించేది. నేను కాకినాడ వచ్చినప్పుడల్లా దాన్ని బొమ్మ లా తయారుచేసి ముచ్చటపడిపోతూ ఉండేదాన్ని. నేనన్నా అది చాలా ఇష్టం చూపించేది.

అమల ఇంటర్ చదువుతున్నప్పుడు అనుకుంటా కాకినాడ వెళ్ళాను సెలవులకని. మాటల్లో అన్నయ్యతో 'అమలని నా కోడలిగా చేసుకోవాలనుందని' చెప్పాను. వదినేమీ మాట్లాడలేదు.

కానీ అన్నయ్య 'దానికి ఇప్పుడే పెళ్ళేంటే?' అన్నాడు ముభావంగా.

"ముందు ఒక మాట అనుకుందాం లేరా.ఇంకా సంతోష్ ఎమ్మెస్ పూర్తవ్వాలి కదా" అన్నాను.

నా ప్రస్తావన వాడికి నచ్చినట్టు లేదని తెలుస్తోంది. 'మేనరికాలు మంచివి కాదే , నీకు తెలియదా ఏంటి?" అన్నాడు ఇబ్బంది గా. ఆస్తి,అంతస్తు , చదువు–సంస్కారం, అన్నిటికి మించి స్నేహం–బంధుత్వం కంటే కులానికి వాడు ప్రాధాన్యమిస్తున్నాడని నాకు మనసులో ఏ మూలో అర్ధమవుతూనే ఉంది. నేను వేరే కులస్తుడిని పెళ్లి చేసుకోవడం వల్ల అన్నయ్యకి తన కూతుర్ని నా కోడలి గా చేయడం ఇష్టం లేదని , ఆరాత్రి వదినతో స్పష్టం చేయడం నా చెవిని దాటిపోలేదు. ప్రేమించినవాడితో నా పెళ్లి చేయడం కోసం, అందరినీ ఒప్పించి నా ప్రేమని గెలిపించిన నా అన్నయ్యేనా వీడు? తన కూతురి విషయం వచ్చేసరికి సంతోష్ ని మేనల్లుడిగా కాకుండా దిలీప్ కొడుకు గా , పరాయి కులస్తుడి గా భావిస్తూ పిల్లనివ్వనంటున్నాడు.. అన్నయ్య మనసులో మాట అర్ధమయ్యాక ఇక పూర్వంలా ఉండలేనన్పించింది.

అలాగే సంవత్సరాలు గడిచిపోయాయి.అమ్మానాన్న కాలం చేసినప్పుడు కూడా అందరి బంధువుల్లాగే వెళ్ళి వచ్చాను. అన్నయ్యకీ ఇదే నచ్చినట్టుంది కాబోలు. పెద్దగా స్పందించ లేదు. తన భార్యాపిల్లలు,భార్య వైపు బంధువులు మాత్రమే ముఖ్యులయి న్నట్లు, నన్ను పరాయి కులస్తుడి భార్యగానే భావించి మొక్కుబడిగా వ్యవహరించాడే తప్ప మనస్ఫూర్తిగా చిన్నప్పటి అన్నయ్యలా ఆదరించలేదు.

కుటుంబం విస్తృతమయ్యేకొద్దీ, వయసు పెరిగే కొద్దీ మనిషి మనసు సంకుచితమవుతూ , ప్రేమ–ఆత్మీయతలు పలుచబడి బాంధవ్యాలు బలహీనపడతాయా అన్పించింది. వీళ్ళందరికంటే ముందు నించి వాడితో కలిసి పుట్టి పెరిగింది నేను. 'మనిద్దరిలో ఉన్నది ఒకే రక్తం. ఎందుకురా నన్ను దూరం పెడుతున్నావు?' అని అడగాలన్పించింది గట్టిగా. అమలని నా కోడలిగా చేసుకోవాలనుందని అడిగి తప్పు చేశానా? అందుకే నన్ను దూరం పెడుతున్నాడా? అన్పించింది. ఏది ఏమైనా మనుషుల మనస్తత్వాలు తెలిసి వచ్చాయి.. ఇది కూడా ఒక మంచి పాఠమే అనుకున్నా.

★★★★ ★★★★★ ★★★★★ ★★★★★ ★★★★★ ★★★★ ★★★★★

కాలచక్రం గిర్రున తిరుగుతూ ఎన్నో విచిత్రాలు చూపిస్తూ ఉంది. దిలీప్ కి నిమ్ హాన్స్ లో జాబ్ రావడంతో మేము బెంగుళూరు లో స్థిరపడిపోయాము. నా కూతురు శ్రేయ అమెరికా లో ఎమ్మెస్ చేసి తన క్లాస్ మేట్ ప్రశాంత్ నే లైఫ్ మేట్ గా చేసుకొని అక్కడే స్థిరపడింది. వాళ్ళిద్దరూ చిన్నప్పటి నించి క్లాస్ మేట్సు కావడమే కాక ప్రశాంత్ నా ఫ్రెండ్ కొడుకు కూడా అవడంతో స్నేహం బంధుత్వం గా మారి నందుకు మేమెంతో సంతోషించాం.

శ్రేయ దగ్గర ఏడాదిపాటు యూఎస్ లో వుండిపోయాను దాని డెలివరీ కి వెళ్ళి. ఆ టైమ్ లోనే అన్నయ్య, వదిన రోడ్ యాక్సిడెంట్ లో చనిపోయారన్న వార్త తెలిసి దుఖంలో మునిగిపోయాను. అవినాష్ పెళ్ళికి వెళ్లినప్పుడు చూడ్డమే వాళ్ళని చివరిగా. ఇండియా వచ్చాక అవినాష్, అమలల్ని పరామర్శించడానికి వెళ్లినప్పుడు తెలిసింది హడావిడిగా అమల పెళ్లయిపోయిందని, మంచి ముహూర్తాలు లేవని తొందరపడాల్సి వచ్చిందని, వాళ్ళు హనీమూన్ వెళ్ళారని!ఏ మూలో ఉన్న చిన్నపాటి ఆశ కూడా ఆవిరైపోయింది. వచ్చాక

మా ఇంటికి తప్పకుండా పంపమని ఆహ్వానించి వచ్చాను. తర్వాత వాళ్ళ దగ్గర్నించి ఏ కబురూ లేదు. నేనే మనసాగక, పుట్టింటి మీద ఆశ చావక ఫోన్లు చేస్తూ ఉండేదాన్ని. అన్నయ్య ఉన్నప్పుడే అంతంత మాత్రం .... ఇంక ఇప్పుడేం ఉంటుంది?

మా అబ్బాయి సంతోష్ విషయమే నన్ను కలవరపెట్టింది. బిట్స్,దుబాయి లో ఇంజనీరింగ్ చదువుతునేటప్పుడు లూసీ అనే ఒక ఆంగ్లో ఇండియన్ అమ్మాయిని సెలవులకొచ్చినప్పుడు హైదరాబాద్ తీసుకొచ్చాడు. ఫ్రెండేమో అని సరిపెట్టుకున్నా. కానీ చదువయ్యాక బాంబు పేల్చాడు. ఆ పిల్లని ప్రేమించాను పెళ్లి చేసుకుంటాను అని. దిలీప్ ,నేను ఎంత చెప్పినా వాడు వినలేదు. లూసీ చాలా మంచిదని,నాలుగేళ్లుగా తనకి తెలుసని, ఆ పిల్లకి కూడా తనంటే ఎంతో ప్రాణమని ఒత్తిడి తీసుకు వచ్చాడు. చేసేదిలేక వాళ్ల పెద్దవాళ్లతో మాట్లాడి చర్చి లో పెళ్లి జరిపించాం. నాకు చాలా విరక్తిగా అన్పించింది. మా పెళ్లి రిజిస్టర్ ఆఫీస్ లో నిరాడంబరం గా అవడంతో సంతోష్ పెళ్లి ఆర్భాటం గా , పద్ధతిగా చేయాలని కన్న కలలన్నీ కల్లలయ్యాయి. ఫ్రెండ్స్ అంతా తల్లిదండ్రులు ఇంటర్ కాస్ట్ అయితే కొడుకు ఏకం గా ఇంటర్ నేషనల్ మేరేజ్ చేసుకున్నాడు అని హాస్యమాడారు.

లూసీ కుటుంబం గురించి పెద్దగా చెప్పుకోడానికేమీ లేదు. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి స్కూల్ టీచర్, అక్క నర్స్ గా పని చేస్తున్నారు. లూసీ కూడా టీచరుగా చేస్తూ ప్రవేట్ గా ఎమ్మే కట్టిందట. నాకు , దిలీప్ కి ఆస్తిపాస్తుల మీద మోజు లేదు. దేవుడి దయ వల్ల సర్జన్ గా మంచి పేరుతో పాటు ఆస్తి కూడా దిలీప్ బాగానే సంపాదించాడు. ఇళ్ళు, భూములు, తోటలు.. దేనికీ లోటు లేదు. కుటుంబం, సాంప్రదాయం నాకు చాలా ముఖ్యం. కానీ ఆ విషయం లోనే తట్టుకోలేని దెబ్బ తగిలింది. నా కూతురు ఎంతో ఓదార్చింది..."మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అంటారు కదా మమ్మీ! సంతోష్ కి నచ్చిన పిల్లతో పెళ్లి చేశారు. వాడు సంతోషమేగా మనం కోరుకునేది. కొన్నాళ్లు నా దగ్గరకొచ్చి ఉండండి డాడీ,నువ్వు. నెమ్మదిగా అన్నీ అవే సర్దుకుంటాయి " అని.

లూసీ మమ్మల్ని బాగానే చూస్తుంది, కానీ పెళ్లైన తర్వాత కూడా తను మా పద్ధతులు అలవాటు చేసుకోకపోవడం నాకు బాధ కలిగించింది. ఆ పిల్లకి తన మతమంటే ఎంతో గౌరవం. చర్చ్ కి రెగ్యులర్ గా వెళ్లడమే కాకుండా ఇంట్లో కూడా జీసెస్ ఫోటోలు పెట్టి ప్రార్ధనలు చేస్తుంది. బొట్టు పెట్టుకోదు. సంతోష్ కూడా చెప్పడేమో? వాళ్ళ ఆహారపుటలవాట్లు కూడా నాకు ఇబ్బంది కలిగించాయి. మరో ఫ్లాట్ కొని వాళ్ళని అక్కడ ఉండమన్నాడు నా మనసు తెలిసిన నా భర్త. సంతోష్ బాధపడ్డాడు

" ఏంటమ్మా ఇది? మేము మీతో కలిసి ఉండడానికి పనికి రామా?" అని.లూసీ కళ్ళల్లో లీలగా తడి... నా దృష్టిని దాటిపోలేదు.

అదేం పట్టించుకోకుండా తను" ఏమైనా అనుకోరా. కొత్తగా పెళ్లైనవాళ్లు మీకూ ప్రైవసీ అవసరం. అయినా ఒక ఊళ్లోనే ఉంటున్నాం కదా. మీకు వీలయినప్పుడు వస్తూ ఉండండి. మీ అంతటి వాళ్లయ్యారు. ఎవరికి నచ్చినట్లు వాళ్ళుండడమే మంచిది." నిష్కర్ష గా చెప్పేసింది. లూసీ పద్ధతులు తనకు నచ్చకే ఇలాటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పైకి చెప్పకపోయినా వాళ్ళకి అర్ధమయ్యే ఉండాలి. తమ దేవుణ్ణి పూజించకపోయినా భరించగల్గింది గాని ముత్తైదుపిల్ల గాజులు, పుస్తేలు, పసుపుకుంకుమ లేకుండా గౌన్లు వేసుకొని తిరగడం, ఇంట్లో మాంసాహారం వండడం మాత్రం తట్టుకోలేకపోయింది. అడిగితే సంతోష్ కి అలవాటని వండుతున్నట్టు చెప్పింది

దిలీప్ మాంసాహారే అయినా ఏ మాటకామాటే చెప్పుకోవాలి ఏనాడూ తనని వండమని అడిగింది లేదు. వాళ్ళ తోబుట్టువుల ఇళ్ళకి వెళ్లినప్పుడు తినేవాడేమో!అంతేనా? ఇంగ్లీష్ తప్ప తెలుగు మాట్లాడదు. అమల గుర్తు వస్తే మనసు బాధతో మూలిగేది..అన్నయ్య మీద కోపం వచ్చేది కూడా. చక్కని చుక్క లాటి పిల్ల సాంప్రదాయబద్ధంగా చీర కట్టుకొని,పొడవైన జడలో పూలు తురుముకొని,బొట్టు కాటుక పెట్టుకొని, మెళ్ళో పుస్తేలు, నగలు , పసుపు పాదాలకి మెట్టెలు,పట్టీలు అలంకరించుకొని అత్తయ్యా అని అచ్చ

తెలుగు లో లక్షణంగా ఇంట్లో తిరుగాడాల్సిన మేనకోడలి స్థానం లో లూసీ ని కోడలి గా అంగీకరించలేకపోతున్నా. ఇంతటి సిరిసంపదలకి నా ముద్దుల మేనకోడలు వారసురాలిగా ఉండాల్సింది...నా ఖర్మ కాకపోతే ఎక్కడో దుబాయి లో పుట్టిన ఆంగ్లో ఇండియన్ నా కోడలిగా రావడమేంటి?

కొన్నాళ్ళకి లూసీ నాకు నచ్చినట్టుగా కొంచెం మారింది. అదే సంతోషం. ఈరోజుల్లో ఎవరినీ మార్చలేం కదా! వాళ్ళంతటవాళ్ళు మారాలే తప్ప. మనవడు విక్టర్ పుట్టిన నెలకే దిలీప్ హార్ట్ఎటాక్ తో చనిపోయాడు.అది మరో పెద్ద షాక్ నాకు జీవితం లో. చనిపోయే సంవత్సరం ముందు నా సమ్మతి తోనే ఆస్తులు పిల్లలిద్దరికి సమానంగా పంచేశాడు,మేము ఉంటున్న ఇల్లు కూడా నా తదనంతరం సంతోష్ పిల్లలకి చెందేలా వ్రాయమని చెప్పాను. నాకంటూ ఏమీ ఆస్తి లేదనే చెప్పాలి. ఆధ్యాత్మిక చింతన వైపు దృష్టి సారించాను. నాకు సాయంగా పనిపిల్ల ఎప్పుడూ ఉండేలా సంతోష్ ఏర్పాటు చేయడంతో గుళ్లూ గోపురాలు తీర్థయాత్రలు చేస్తూ ఉంటాను. ఓపికున్నంతవరకు నాకిదే కాలక్షేపం.అప్పుడప్పుడు శ్రేయ దగ్గరకి వెళ్తూ ఉంటాను.అది తన దగ్గరే ఉండిపొమ్మంటుంది. కానీ బెంగుళూరు వదిలి ఎక్కడా ఎక్కువ కాలం ఉండలేను.

★★★★★ ★★★★★ ★★★★★ ★★★★★ ★★★★ ★★★★★ ★★★★

కాలచక్రం గిర్రున తిరుగుతూనే ఉంటుంది. ఈ భ్రమణం లో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. లూసీ తెలుగు మాట్లాడ్డమే కాదు, వంటలన్నీ చక్కగా నేర్చుకుంది. నా మనవళ్ళిద్దరూ రోజూ నా దగ్గరకి వస్తారు గ్రానీ అంటూ ముద్దు ముద్దు గా తెలుగులో పలకరిస్తారు. ఇంకా నా కొడుకు సరేసరి . రాత్రి ఎంత లేటయినా నన్ను కలిసి, యోగక్షేమాలు విచారించి గాని ఇంటికి వెళ్ళడు. పెద్ద కంపెనీ కి డైరెక్టర్ అయినా అమ్మని ఎప్పుడూ విస్మరించడు.నాక్కావాల్సినవన్నీ వెంటనే అమిరిపోవాల్సిందే. ఆ విషయం లో నేను చాలా అదృష్టవంతురాలిని. లూసీ అయితే " మమ్మీ! అంతా కలిసి వుందాం, ఒక్కరే ఎందుకు?" అంటుంది. కానీ నాకు ఇలాగే బాగుంది. వారానికోసారి వాళ్ళింటికి వెళ్తూ ఉంటాను. ఇల్లు దగ్గరే కావటంతో లూసీ నాకు రోజూ ఏదో ఒకటి పంపిస్తూనే ఉంటుంది. ఇంటిక్కావాల్సిన సరుకులు, సామాన్లు వాళ్లే తెచ్చేస్తారు. పది రోజులకోసారి అంతాకలిసి బైటకెక్కడికైనా వెళ్తూ ఉంటాం. అయినా మనసులో ఏ మూలో నాకింకా అసంతృప్తి. అమల చోట్లో లూసీని అంగీకరించలేకపోతున్నా ఎందుకో? ఆ పిల్ల వేరే మతస్తురాలన్న సంగతి పక్కన పెడితే లూసీ లో ఎంచడానికేమీ లేదు. ఆ రోజు నాకు బాగా గుర్తు.

కిందటేడు సంతోష్ కంపెనీ పని మీద ఆస్ట్రేలియా వెళ్ళాడు. ఒక రాత్రివేళ నాకు గుండెల్లో నెప్పిగా అన్పించి వద్దనుకుంటూనే లూసీ కి ఫోన్ చేశాను. ఆగమేఘాల మీద వచ్చి అర్ధరాత్రి వేళ నన్ను కార్లో హాస్పిటల్ కి తీసుకు వెళ్లింది. వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు. సంతోష్ కి తెలిస్తే ఎక్కడ కంగారుపడతాడో అని ధైర్యంగా అన్నీ తానే అయి నిలబడింది. లూసీ యే లేకపోతే ఏమై పోయేదాన్నో? కానీ మళ్ళీ మనసులో .... నా మేనకోడలయితే ఇంకా బాగా చూసుకు నేదేమో? ఎంతయినా నా రక్తం కదా? ఏంటో ఇన్నేళ్లయినా అమల వైపే ఆలోచనలెప్పుడూ! ఇన్నేళ్లకి అవినాష్ మాట్లాడ్డంతో పాత జ్ఞాపకాలన్నిటిని నెమరు వేసుకోగలిగాను. అమల ఇప్పుడెలా ఉందో ఏంటో? అన్నయ్య, వదిన పోయినప్పుడు పదకొండేళ్లక్రితం చూడ్డమే. వాడున్నప్పుడే అంతంతమాత్రం కలయికలు.. ఆ తర్వాత అసలే లేదు. ఎవరి జీవితాల్లో వాళ్ళు బిజీ

★★★★ ★★★★★ ★★★★ ★★★★★ ★★★ ★★★★★ ★★★★★



కౌముది

అవినాష్ పదే పదే రమ్మని పిలవడంతో నాక్కూడా మనసులో పుట్టిన ఊరు చూడాలనే కోరిక ప్రబలంగా ఉండటంతో సంతోష్ కి చెప్పి పనిపిల్లని తీస్కోని కాకినాడ వెళ్ళాను.. అవినాష్ స్టేషన్ కి వచ్చాడు. సంతోషం ,విచారం మిళితమైన అవ్యక్త భావాలు నా మనసులో...అచ్చం అన్నయ్యలా ఉన్న మేనల్లుడిని చూడగానే కన్నీళ్లు ఆగలేదు. వాడి భార్య రూప ప్రశాంతంగా , ముచ్చటగా ఉంది. పిల్లలు 4,5 తరగతుల్లో ఉన్నారు. పొందికైన సంసారం. భోజనాలయ్యాక పాత సంగతులు, వాడి చిన్నప్పటి కబుర్లు ముచ్చటించుకున్నాం. అన్న వదినల్ని గుర్తుచేసుకుని బాధపడ్డాను. అమల గురించి మనసు కొట్టుకుపోతోంది నాకు ఒక పక్క.నెమ్మదిగా ఆ విషయాలు కూడా చెప్పారు. అమల తన క్లాస్ మేట్ ని వర్ణాంతర వివాహం చేస్కుందట. ఆ అబ్బాయి వాళ్ళింట్లో ఒప్పుకోకపోవడతో పెద్దవాళ్ళని ఎదిరించి చేసుకున్నారట. తర్వాత కొడుకుని వదులుకోలేక కలుపుకున్నారని చెప్పారు. నాది వర్ణాంతరమనే కారణం గా సంతోష్ కి అమలని ఇవ్వనన్న అన్నయ్య కి వేరే కులస్తుడే అల్లుడవడం ఆశ్చర్యం కలిగించింది నాకు.

అమలకి ఫోన్ చేస్తే " ఆ, బాగున్నావా అత్తయ్యా? నేను ప్రెస్ మీట్ లో ఉన్నాను. రేపు వచ్చి కలుస్తా" అని పొడిపొడిగా మాట్లాడి ఫోన్ పెట్టేసింది. మనసు చివుక్కుమంది. పోన్లే అదేదో బిజీ గా ఉన్నట్టుంది అని సరిపెట్టుకున్నా.

సాయంత్రం అలా వేణుగోపాలస్వామి గుడి వరకు వెళ్దామని బయలుదేరా. రూప కార్లో వెళ్లమంటే "వద్దమ్మా , నాలుగడుగులే కదా!కాస్త ఊరు కూడా చూసినట్టుంటుంది. పిల్ల తోడుంది గా, అలా తిరిగేసి వస్తా." అని రోడ్డు మీదకి వచ్చాను. చిన్నప్పుడు ప్రతి శనివారం ఈ గుడికి వచ్చేవాళ్లం. ఏమీ మారలేదు,అప్పటిలాగే ఆవరణలో వేప, రావి, పారిజాతం చెట్లు, బావి... ఎంతో ప్రశాంతం గా అన్పించింది. దర్శనం చేసుకొని ,కాసేపు ఆ చెట్ల కింద కూచుని. స్మృతులు నెమరువేసుకొని ఇంటికి వెళ్దామని లేస్తోంటే ఎవరో నా ఈడున్నావిడ దగ్గరకొచ్చి " నువ్వు... మీరు మాధవి కదా?"అని అనుమానంగా అడుగుతోంటే తాను తేరిపార చూసి " ఏయ్ రజనీ ఎన్నాళ్లకెన్నాళ్ళకి? ఎలా ఉన్నావే?"అంటూ అమాంతం కౌగిలించుకుంది చిన్ననాటి స్నేహితురాలిని.

"ఏమై పోయావే ఇన్నేళ్లు?ఇంకేం మాట్లాడకు పద, ఇంటికి" అంటూ పనిపిల్లని, నన్ను ఆటో ఎక్కించింది రజనీ.

దార్లో నా కుటుంబం గురించి ప్రశ్నలడిగి తన గురించి చెప్పుకొచ్చింది. కూతురు తాము చెప్పినట్లు బ్యాంక్ మేనేజర్ ని చేసుకుందట. కొడుకు మాత్రం తమ ఇష్టానికి విరుద్ధం గా ప్రేమపెళ్లి చేసుకున్నాడట. కోడలు కూడా కొంతకాలం ఏదో ఉద్యోగం వెలగబెట్టి టీవీ షో లని, మోడలింగు లని , తర్వాత రియల్ ఎస్టేట్ అని, ఫైనాన్స్ బిజినెస్ అని చేతులు కాల్చుకుందని, ఇంటిపట్టున సరిగ్గా ఉండదని, ఎవర్నీ ఖాతరు చేయదని చెప్పి బాధపడింది. అందంతోపాటు అహంకారం కూడా ఎక్కువగా ఉన్న కోడలు పిల్ల నిత్యం నరకం చూపిస్తోందట. ఇల్లు తమపేర రాసేసి కూతురింటికి పోయి ఉండమంటుందట. ఆడపడుచు గుమ్మం లోకి వస్తే నోటికొచ్చినట్టు మాట్లాడుతుందట.

"కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందే మధూ. దాన్నని ఏం లాభం? మన బంగారం మంచిదయితే? నా కొడుకు ఒక దద్దమ్మ. దాని తళుకు,బెళుకు చూసి మోజుపడి కట్టుకున్నాడు. మాలో ఎంత కట్నాలో నీకు తెలియందేముంది? దానికీ ఆశపడలేదు.ఒక్కగానొక్క పిల్లాడు వాడిష్టం కాదనడం ఎందుకులే అని రాజీపడ్డాం. అయిందేదో అయ్యింది తల్లిదండ్రులు లేని పిల్ల కదా ని కడుపులో పెట్టుకొని చూద్దామనుకున్నా. కానీ వచ్చిన మొదలు మా పొడ గిట్టందే? పోనీ వేరింటి కాపరం పెట్టుకోమంటే వెళ్ళమంటారు.అన్నీ చక్కగా జరిగిపోతున్నాయి కదా! మనవణ్ణి మా దగ్గరకి రానివ్వదు....పురుడప్పుడూ, పసివాడికింద చేయడానికి పనికి వచ్చాం గాని. వాడికి మా బుద్ధులు వచ్చేస్తాయిట అవును మరి మావి తప్పుడు బుద్ధులు కదా? పుట్టింటివాళ్ళిచ్చిన డబ్బు కాస్తా సరదాలకి, షోకులకి, బిజినెస్ లకి తగలేసి ఇప్పుడు ఈ ఇల్లు ఇచ్చేయమని పేచీ! అటు పుట్టింటి వాళ్లతోనూ సరిగ్గా ఉండదు. వాళ్ళిచ్చిన సొమ్మంతా తగలేసి ఇప్పుడింకా ఇమ్మని

పీక్కుతింటే ఎలా చెప్పు? వాళ్ళు మాత్రం ఎక్కణ్ణించి ఇస్తారు?అందుకే వాళ్ళు రావడం మానుకున్నారు. ఎవరితోనూ సయోధ్య లేదు" వెళ్లబోసుకుంది రజని.

నేను ఆశ్చర్యపోయాను. పెద్దవాళ్ళ ఇష్టానికి విరుద్ధం గా ప్రేమపెళ్లి చేసుకొని అత్తగారింట్లోనే ఉంటూ ఇలా వాళ్లని ఉసురు పెట్టే కోడల్నిఏమనాలో అర్థం కాలేదు. వాళ్ళు పెద్ద మనసుతో చేరదీస్తే ఆ పిల్ల రివర్సు లో వాళ్ళని వేపుకు తినడమేంటి? వాళ్ళని ఇంట్లోంచి పొమ్మనమనడం ఏంటీ.. చోద్యం కాకపోతే?

"సర్లే, అంతా మేం చేసుకున్న ఖర్మ ... నువ్వు ముఖం కడుక్కుని రా టిఫిన్ తిందువుగాని" అని పెరట్లో బాత్రూం చూపించింది.

"ఎక్కువ చేయకు. లక్ష పన్లుంటాయి. అన్నీ నీకు చెప్పి ,నీ పర్మిషన్ తీసుకోవాల్సిన ఖర్మ నాకు పట్టలేదు. తీరిగ్గా తిని కూచుని... ఆరాలు కావాలి... ఆరాలు .. ఎక్కడికెళ్లావ్, ఎందుకెళ్లావ్ అనుకుంటూ!"

బైటకి వస్తూ ఈ మాటల ప్రభంజనానికి హడలిపోయి అక్కడే ఆగిపోయాను. సందేహం లేదు రజని కోడలే !

" నోర్మూసుకుని పడి ఉండండి లేకపోతే నువ్వు,నీ మొగుడు మీ కూతురింటికి పొండి . అది రానివ్వకపోతే ఓల్డేజ్ హోం కి పొండి. మా నెత్తి మీద శని లా దాపురించారు అసలు ...."

ఇంకా ఏదో అరుస్తోంటే ఉండబట్టలేక ధడాల్న తలుపు తోసుకొని బైటకి వచ్చాను. కనిపించిన దృశ్యం చూసి నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. నేను చూస్తోంది రజని కోడల్ని.... కాదు.. కాదు నా ముద్దుల అందాల మేనకోడల్ని. ఇన్నేళ్లు ఎవరైతే నా కోడలు కావాలని ..... కాలేకపోయిందని తెగ మధనపడ్డానో ఆ అందాలరాశి వికృతమైన అసలు రూపాన్ని ! ఏది అందమైన జడ? పొట్టిగా కత్తిరించుకుంది, నుదుటిమీద బొట్టులేదు. మెళ్ళో పుస్తెలు, చేతికి గాజులు, కాళ్ళకి మెట్టెలు, పట్టీలు, వొంటి నిండా చీర ఏమి లేవు. వొళ్ళు కన్పించే బట్టలతో, వెగటు పుట్టించే మేకప్ తో,అంతకంటే అసహ్యమైన మాటతీరుతో అమల నిజస్వరూపాన్ని చూసి షాక్ కి లోనయ్యాను.

నన్ను అక్కడ ఊహించని అమల ఒక్క నిమిషం తొట్రుపడి వెంటనే సర్దుకుంటూ

"ఓహో నువ్వా? ఏంటత్తయ్యా?నేను వచ్చి కలుస్తానన్నానుగా. అంతలోనే వెతుక్కుంటూ వచ్చేశావా నా ఇంటికి?" అంది విష పూరిత చిరునవ్వుతో వ్యంగ్యంగా.

" నేను నీ ఇంటికి రాలేదు అమలా! నా స్నేహితురాలింటికి వచ్చాను" అన్నాను అంతకంటే కరకుగా.

"ఓహో! అయితే నాకోసం రాలేదన్నమాట. ఇంకేం? బాగా మాట్లాడుకోండి.వస్తా" అంటూ విసురుగా బైటకి వెళ్లిపోయింది. అవాక్కయిన రజని

" ఏంటి మాధవీ? అమలా నీ మేనకోడలా? సారీ, నాకు నిజం గా తెలియదు."అంటూ సంజాయిషీ ఇవ్వడం నాకు బాధ కల్గించింది.

ఏం మాట్లాడాలో తెలియని అయోమయావస్థ లో

"వస్తాను రజనీ, చాలా ఆలశ్యమైపోయింది, ఇంటి దగ్గర రూప చూస్తూ ఉంటుంది. నేను ఫోన్ చేస్తా వెళ్ళాక" అని ఇల్లు చేరాను.

★★★★★ ★★★★★ ★★★★★★ ★★★★★ ★★★★★★ ★★★★ ★★★★★

ప్రశాంతి ఎక్స్ ప్రెస్ లో కూచున్న నేను ఎప్పుడెప్పుడు నా కోడల్ని చూస్తానా అని ఉద్విగ్నం గా ఉన్నాను. ఎంత భ్రమ లో బతికాను ఇన్నాళ్ళు? వేరే దేశస్తురాలయినా, భాష, మతం, సంప్రదాయం వేరైనా కంటికి రెప్పలా చూసుకునే ఉత్తమురాలయిన కోడల్ని ఈ దౌర్భాగ్యు రాలితో పోల్చుకొని ఎంత తిరస్కారం గా చూశానో? అందమైన శరీరమే గాని సంస్కారం లేని అమల తన కోడలై ఉంటే దాని ప్రవర్తనతో భర్త, ఆస్తి లేని తాను ఈ పాటికి ఆత్మహత్య చేసుకొని ఉండేది కాదూ? ప్రేమించి పెళ్లి చేసుకున్నా తల్లికి ప్రాధాన్యమిచ్చే కొడుకు, మంచి మనసున్నకోడలు... ఇంతకంటే నాకేం కావాలి? మేలిమి బంగారం లాటి కోడలిని కళ్లెదురుగా పెట్టుకొని ఇన్నేళ్లు ఆ అహంకారిని కోడలిగా చేసుకోలేకపోయానే అని బాధ పడ్డాను.

ఇప్పుడు చనిపోయిన అన్నయ్యకి, కనిపించని ఆ భగవంతుడికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పుకున్నాను అది నా కోడలు కానందుకు. నిజంగా కోరుకున్న, కోరుకోదగ్గ కోడలంటే లూసీయే! కొడుకు,కోడలు,మనవలతో నేను కలిసి గడిప బోయే మనోహర దృశ్యం కళ్ల కి కట్టినట్టుగా కన్పిస్తుంటే నా అశాంతిని పటాపంచలు చేస్తూ ప్రశాంతి ఎక్స్ ప్రెస్ పట్టాలమీద ఉరకలు వేస్తూ నన్ను గమ్యానికి చేర్చడానికి ఉత్సాహపడుతోంది.

****

## కథ వెనుక కథ



నిజంగా చెప్పాలంటే ఇది నేను చూసిన కథే. మాకు బాగా తెలిసిన వాళ్ళలో జరిగిన కథ. ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఓ అమ్మాయి ప్రతిరోజూ ప్రత్యక్ష నరకం చూపిస్తుంది అత్తా మామలకి . వర్ణాంతర వివాహం చేసుకొని ఇలా శాడిస్టు లా ప్రవర్తించే కోడళ్ళని ఎవరూ చూసిఉండరు ఇంతవరకు. తప్పంతా ఆ పిల్ల మొగుడిదే అనుకుంటాం మేము. భార్య అంతలా రెచ్చిపోయి నోటికొచ్చినట్టు తల్లిదండ్రుల్ని తిట్టేస్తుంటే కిమ్మనకుండా ఎలా ఉంటున్నాడా అని ఆశ్చర్యపడుతూ ఉంటాము. ఏదయినా అంటే అతన్ని రోడ్డుకీడుస్తుంది. ఆ పిల్లాడు దాని అందం చూసి మోహించి పెళ్లి చేసుకున్నాడు.దానికి తోడు పిల్ల నోటి దురుసు మనిషి. ఈ పిల్లాడు చూస్తే నోట్లో నాలిక లేనివాడు నిజంగానే. అత్తామామలు చాలా సహృదయులు.. దేవుడు వాళ్ళ పక్షాన ఉండబట్టి కొడుక్కి దూరంగా ముంబై లో మంచి ఉద్యోగం రావడంతో ప్రస్తుతం ప్రశాంతంగా జీవితం సాగిస్తున్నారు.

ఈ కథ లో వర్ణాంతర కోడళ్ళ మానసిక వైవిధ్యాలని సమాంతరం గా వర్ణిస్తూ దూరపు కొండలెప్పుడూ నునుపుగానే ఉంటాయి అని మాధవి తెలుసుకొని పశ్చాత్తాప పడినట్లే, ఎందరో మాధవి లాటి అత్తగార్లకి కనువిప్పు కలగాలని కోరుకుంటున్నాను. మాధవి ఎప్పుడూ లూసీ తో కఠినంగా వ్యవహరించకపోవడం గమనార్హం.

- రచయిత్రి

# పార్టనర్ డి.సుధ

“కోట్ల కొద్ది ఉన్న జనాభాకి నేను ఏమి చేస్తున్నాను, నాకు ఏమి నచ్చింది, నా అభిప్రాయలు, నా ఆలోచనలుతో వాళ్ళకి పని ఏమి ఉంటుంది, ఒక కట్టు కున్న భర్తకి తప్ప. అదే పెళ్ళికి ఉన్న గొప్పతనం” అని సినిమా డైలాగ్ వింటున్నప్పుడు గుండె ఎంతో ఆనందంతో నిండిపోయింది. కానీ అది కొద్ది సేపు మాత్రమే అని తర్వాత తెలిసింది. ఆయనకి నచ్చింది కదా అని ఎప్పటి నుంచొ ఆయన కోరుకుంటున్న లక్ష రూపాయల టి.వి ని "సరే కోనుక్కోండి" అని అనలేక పోతున్నాను . అలా అని నేను వారి కోరికలని అడ్డుకుంటున్నాను అని మీరు అనుకుంటుంటే తప్పే.

పెళ్లి అయిన వెంటనే మా కాపురం మొదలయింది అమెరికాలో. డబ్బుకి లోటు అనేది లేదు, ఇరుగు పొరుగు, బంధువులు లాంటి బంధాలు అన్ని తీగలతోనే (అంటే ఫోన్లు,ఇంటర్నెట్టు). అప్పుడే ఎందుకు అని పిల్లల సంగతి కూడా పక్కన పెట్టేసాం. మరి కొన్ని ఏళ్ళలో ఇండియా వెళ్లిపోవాలి అని తెలిసినా మేము ఇష్టపడినట్లు మాకు నచ్చినవి కొనుక్కుంటున్నాము. ఆరు రోజులతో పూర్తి అయిపోయేది మాకు ఆరు ఏళ్ల వరకు హనీమూన్ లానే సాగింది . ఇంతలోనే మా పిల్లలు, ఇల్లు లాంటి లాంగ్ టర్మ్ విత్తనాలు నాటడం జరిగాయి. కొన్నాళ్ళు ఆ సరదాలు ముగిశాక , ఇంక అమెరికా చాలనుకుని, ఇండియాకి వచ్చేశాం.

సరే ప్రస్తుతానికి వస్తే నాటిన విత్తనాలు చాలులే అని మళ్ళీ కొత్తగా ఏమి చేద్దాం అని ఇద్దరం మాట్లాడుకుంటుండగా మా వారు పేపర్లో పడిన విషయం చదవమని ఇచ్చారు. నేను బహుశా 1+1 ఆఫర్ చీరలు, పిల్లల బట్టలూ అని ఊహించుకుంటూతీసి చూద్దును కదా! తీరా అది ఎనభై వేలు పెట్టి ప్లాస్మా టి.వి కొంటే ఆరు వేల మైక్రోవేవ్ ఉచితం.

“నీకు ఒకటి నాకు ఒకటి” అని నవ్వుతూ అన్నారు. పాపం నిజం చెప్పద్దూ 'సరే ' అనేద్దాం అనిపిస్తుంది. వారిని అలా అడగటం చూస్తే సంపాదించేది వారే కదా, పిల్లలకి నాకు ఏ లోటు రానివ్వటం లేదంటూ వారు అడిగింది కూడా అందరకి కలిపి ఉపయోగించేది అని. నేను అనవసరపు ఖర్చు అని అనుకునేది నా విషయంలో పొదుపు, వారి దృష్టిలో పిసినారితనం.

ఇంక గొడవలకి కొత్త కారణాలు

ఎందుకు మాకు!? రెండు మూడు రోజులు మూతి ముడుపులు.. మళ్ళీ జీవితం మామూలే. అలాంటి సమయంలోనే నేను నా మెదడుకి ఆలోచన పెట్టదలచుకున్నాను. ప్రతీ రెండు ఆలోచనలకి మధ్య చిన్న గీత ఏదో ఉండి ఉంటుంది అదే మా ఇద్దరి మధ్య పొదుపు, పిసినారితనం అని కొట్టుకుంటున్నాయి. దానికి కాస్త లోతుగా అధ్యయనం చెయ్యాలని, మా ఇద్దరి రుచులు ఏమిటో అని గుర్తుకు తెచ్చుకోవడం ప్రారంభించాను .

నేను ఆలోచిస్తున్నాను కదా అందుచేత ఆయన ఆలోచనలని నా దృష్టి పెట్టి చెపుతున్నాను అని మీరు అనుకుంటే పప్పులోకాలువేసినట్లే. ఎందుకుంటే నేను చెప్పేవి అన్ని మా ఇద్దరి మధ్య ఇన్నేళ్ళ సంభాషణలలో పైకి వచ్చిన అభిప్రాయాలు, భావాలే కాబట్టి ముందుగా వారి గురించి చెప్తాను.

ఆయనకి వాళ్ళ కుటుంబ స్తితి గతులు, అవసరం, అనవసరం విషయాలపై ఎంత అవగాహన ఉందంటే చిన్నప్పుడు దీపావళి పండగకి తెచ్చిన టపాకాయలు సగం వాళ్ళ అన్నయ్య తీసుకున్నా, మళ్ళీ కొనాలి, నాకు తక్కువ ఉన్నాయి అని ఏడవకుండా మిగిలిన సగం వాళ్ళ అక్కతో పంచుకునేవారట. కోరుకున్న అమ్మాయి కాదని అంటే బాధపడినా, "మౌన రాగం" సినిమా లో మోహన్ లాగ ప్రేమ త్యాగాన్ని కోరుతుంది అని సరిపెట్టుకుని ఆ అమ్మాయి ని ఒప్పించాలని మరింత ఇబ్బంది పెట్టకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నారు. అప్పుడప్పుడు రొమాన్సు పాళ్ళు తగ్గింది అని అనిపించినప్పుడల్లా ఇదే విషయం మీద అలుగుతుంటాను నేను అది వేరే విషయం అనుకోండి.

అలాగే క్రితం సంవత్సరం ఇల్లు కొందాం అని అనుకున్నపుడే వారికి సొంత డాబా ఇల్లు, పెద్ద లాన్, చుట్టూ మొక్కలు, పిల్లలకి ఆడుకునే స్థలం లాంటి కలల ఇల్లు ( డ్రీం హౌస్) ఇష్టమని తెలిసినా దానికి బదులు అన్ని సదుపాయాలు కలిగిన అపార్ట్ మెంట్కి సరే అన్నారు. చెప్పుకుంటూ పోతే ఇలా ఎన్నో విషయాలు..!

అయన ఇష్టము ఉన్నా లేకున్నా తాను అనుకున్నదే చేయాలని పట్టు పట్టకుండా ప్రాక్టికల్ గా అలోచించి, ఆ విషయాలు తనకు మాత్రమే కాక ఇతరులతో ముడిపడి ఉన్నాయి అని తెలుసుకొని ఆ ఇతరుల వైపు అలోచించి ఇంకా వివరంగా చెప్పాలంటే తల్లితండ్రులని మళ్ళీ టపాకాయలు ఎక్కువ కావాలని అడిగితే కొని ఇస్తారని తెలిసినా వారిని ఇబ్బంది పెట్ట కూడదని అడగటం మానేయటం. అలాగే ప్రేమించిన అమ్మాయి వాళ్ల పెద్దల ద్వారా వాళ్ళ కుటుంబ విషయాలకి ఆడపిల్ల వారి వైపు నుండి సంబంధం కలుపుకోవటానికి అభ్యంతరాలు ఉండదని తెలిసినా ఆ అమ్మాయికి తాను ఇష్టంలేదని ఏ రకమైన ఒత్తిడి చెయ్యకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవటం, ఎంతో ఇష్టమైన డ్రీం హౌసు ని వదులుకుని భార్యపిల్లలకి రోజువారీ ఇబ్బందులు లేని, అలాగే మాకు నచ్చిన అపార్ట్ మెంట్ లో ఉండే టప్పుడు కలిగే మా లాభాలనే దృష్టిలో పెట్టుకుని సొంత అపార్ట్ మెంటు ప్లస్ మిగిలిన మేము కోరుకున్న సదుపాయాలన్ని ఉండే గేటెడ్ కమ్యూనిటీ కి సరే అనడం లాగా అన్నమాట.

ఇంకా నా పద్దతి కి వస్తే నేను చేసే పనులు ఎలా ఉంటాయంటే నాకు ఇతరులని ఇబ్బంది పెట్టకూడదన్న ఆలోచన కాస్త తక్కువే , అదే పరిస్థితి లో నేను ఉంటే నేను ఇబ్బంది పడకుండా ఎలా చక్కదిద్ద గలను అని అనుకుని అలా చేస్తానన్నమాట. కొంచెం నేనే తికమక పడ్డాను. వివరంగా చెప్తాను. చిన్నపుడు వేసవి సెలవులకి మా ఇంటికి బంధువులు రావటమో లేక మేము వెళ్ళటమో జరుగుతూ ఉండేది. అలా నేను ఒకరి ఇంటికి వెళ్ళినప్పుడు వాళ్ళు వేసం కాలం ప్రత్యేకమైన బంగినపల్లి మామిడిపళ్ళు పెడితే , నాకు ఇంకా తినాలి అనిపించినా, ఆ బంధువుల అమ్మాయి నాకంటే చిన్నది అయిన ఆ అమ్మాయి

"చాలు మొర్రో ,నాకు వద్దు" అంటూ ఉన్నా ఎక్కువ పెడుతువుంటే,

"నాకు ఇంకా కావాలి" అని అడిగేదానిని కాదు. అప్పటికి సభ్యత, ఆసభ్యత పదాలు రాయటమే రాదు . అంటే అంత చిన్న దానినని. అప్పుడు ఇప్పుడు నా ఉద్దేశం ఒక్కటే. నాకు ఇంకా కావాలి అని అనిపించినా అది కాసేపే. నా దగ్గర ఉన్నదానితో నేను తృప్తి పడతాను అని నాకు నేను సమాధాన పడతాను. అడిగితే ఇచ్చే దాని కన్నా అడగకుండా పెట్టినది కొంచం అయినా నాకు రెండవదాని లోనే ఎక్కువ తృప్తి. ఒక వేళ ఆ పండు ఇంకా కావాలి అని అడిగి తింటే దాని సంతృప్తి కూడా కాసేపే . అలా అడగటం వాళ్ళ వల్ల పాపం పిల్ల నోరు తెరిచి అడిగేవరకు పెట్టలేదే అని వాళ్ళు బాధపడటం జరుగుతుంది. ఇచ్చిన పళ్లు తినటంతో నా కడుపు నిండుతుంది కాని వాళ్ళు

పడిన గిల్టీ ఫీలింగ్, నాకు గిల్టీ కలిగించి నన్ను బాధపెడుతుంది. ఏది ఏమైనా నేను ఒకరికి సహాయపడక పోయినా (అంటే ఇతరుల అవసరాలు చూసి ముందే మనమే సహాయం చేయటం లాంటివి ) అపకారం చేయాలనీ, జరగాలని అనుకునే రకం కాదు.

ఇంకా నా గురించి చెప్పాలంటే నాకు ప్రాక్టికాలిటీ ఎక్కువని నా అభిప్రాయం. మా వారు ఊరు అవతల పెద్ద ఇల్లు కటిస్తాను, మనం నచ్చినట్టు కట్టించుకోవచ్చు, నీకు నచ్చినట్టే కొంత కాలానికి అది మంచి పెట్టుబడి అవుతుంది అని చెప్పినా, నేను ఆయనతో ఒకటే అన్నాను. "మీరు ఖర్చు పెట్టి కట్టించినా ఆ ఏరియా లో నేను అంత పెద్ద ఇంట్లో వంటరిగా గడపలేను. ఇద్దరం సొంత ఇళ్ళలో పెరిగిన వాళ్ళమే, అందు చేత ఇద్దరికీ అది కొత్త కాదు, అందుబాటు లేనిదీ కాదు. నాకు రోడ్డు మీద ట్రాఫిక్ ని ఇంట్లో కుర్చుని తలుచుకుంటేనే టెన్షన్ మొదలవుతుంది. చిన్నప్పుడు తప్పక సైకిల్ తొక్కి ప్రైవేటు కి వెళ్లలేక వెళ్ళేదాన్ని. అంతకు మించి అవసరాలు ముందు ముందు ఉంటాయని తెలిసినా ఎలాంటి డ్రైవింగ్ నేర్చుకోలేదు. ఇప్పుడు ఇక్కడ రోజువారీ పనులకు అంటే కూరలు, స్కూల్ బస్సు స్టాప్, హాస్పిటల్, నిత్య అవసరాలు కావాలి అన్నా కనీసం రెండు కిలోమీటర్లు వెళ్ళాలి. పొద్దున్న ఆఫీసుకి మీరు వెళ్ళితే రాత్రి వరకు నాకు గాని, సాయంత్రం ఇంటికి వచ్చిన పిల్లలకి గాని అటు నాలుగు, ఇటు నాలుగు ఇళ్ళ వాళ్ళు తప్ప వేరే మనుషులు ఉండరు. మా అదృష్టం బాగుంటే మా ఈడూ వాళ్ళు వుంటారు లేక పోతే మేమే వేరొకరికి సహాయకులమై పోతాము ( విదేశాలలో ఉండే పిల్లల తలితండ్రులు , వారి విదేశి సంతానం చేసే స్వదేశి కబురులు వినేవాళ్ళం లాగ). నాకు మాట్లాడే తోడు లేక, పిల్లలకి ఆటలాడే తోడు లేక టి.వి లకి అంకితమైపోతాము, పోనీ పార్క్ కి వెళ్ళాలన్నా చీకటి పడ్డాక ఒంటరిగా ఇంటికి రోజు తిరిగి వెళ్ళలేము. నా చుట్టూ వున్నా వాళ్ళు నన్ను, నా షెడ్యూల్ గుర్తుపెట్టుకుని ఏమైనా మోసం, ఇబ్బంది కలిగిస్తా రని నా భయం. పిల్లలని వదిలి ఎక్కడికి వెళ్ళలేను. పొదున్న లేచిన తరువాత ఒక గంట, సాయంత్రం 3-4 గంటలు మాత్రమే మెలుకువగా మిగిలిన ముగ్గురు ఇంట్లో గడిపేది. ఆ సమయంలో కూడా వాళ్ళు చేసేది వాళ్ళ దినచర్య కార్యక్రమాలు. ఇంకా నేను ఒక పని మనిషి ని పెట్టుకొని లేదా నేనే ఒక పనిదానిలా ఇంటికి మెరుగులు దిద్దుతూ గడిపేయాలి. " మా రొటీన్ లైఫ్ లో సొంత ఇల్లు కట్టుకునే అవకాశం ఉన్నా అవసరం అంతగా లేదు అని గ్రహించి నేను అపార్ట్ మెంట్ కే నా అమోదముద్ర తెలిపాను.

మా వారికి లాగ , మీరు కూడా ఎప్పటిలానే "నేను కావలిసిందే సాధించుకుంది" అనుకుని నా మీద ఒక అభిప్రాయానికి వచ్చేసి ఉన్నారా.... అక్కడే ఆగండి. ఇదంతా ఎందుకు చెప్పాలిసి వచ్చిందంటే ఇద్దరి ఆలోచనలు ఎక్కువగా కలవలేదు కాని మా సంసారం ముందుకి సాగిపోతూనే వుంది. మా జీవితాలలో మేము కలిసినప్పటి నుండి కష్టాలు లేవు కాని ఇంకా తృప్తి చెందే అవకాశం వుంది అని నా భావన.

ప్రస్తుతానికి వస్తే కొత్త టీ.వి దగ్గర మా కొత్త సంఘర్షణ మొదలైంది. చిలికి చిలికి గాలి వాన అయినట్టు నా మిద పెద్ద అభాండం వేసి వదిలేసారు. నేను ఫీలింగ్స్ కి వున్న ఇంపార్టెన్స్ ని వస్తువులకి ఎప్పుడు ఇవ్వలేదు. కష్ట పడి చదువుకుని, అవకాశాలు తప్పినా అశాభావంతో ముందుకు పోయేవాళ్ళ అంటే నాకు ఇష్టం. ఒక సారి ఓడిపోతే నాలోని నిరాస నిస్పృహలతో కాలం నెట్టే నాలాంటి వాళ్ళకి పూర్తి విరుద్దం కాబట్టి, ఏమన్నారంటే "నేను నా కోసం ఏది కొనుక్కోలేను, ఒక్కపుడు అవకాశం లేక ఇప్పుడు నిన్ను నా ఇష్టాలకి మెప్పించలేక, నా కలలో తీరని కోర్కెలలో ఒకటై మిగిలిపోని" అని భారీ డైలాగ్ వదిలారు. చిరంజీవి మాస్ కామెడీ డైలాగ్ లకి ముసి ముసి నవ్వులకే మా వారి మొహం హై వోల్ట్ లతో వెలిగిపోతుంది అలాంటి సారు ఇలాంటి డైలాగ్ కి పెట్టిన ఫీలింగ్ నా గిల్టీ ఫీలింగ్ లకి బెండ్ అవ్వటం మొదలుపెట్టింది. కాస్త దీర్ఘంగా ఆలోచిస్తే నా పిసినారితనం కాదు, ఏదో నేను మనసుపూర్తి గా "సరే" అనలేకపోతున్నాను.

ఏదో కొత్త వస్తువు అప్పుడప్పుడు కొంటే కాని మా వారికీ కిక్ రాదు . రొటీన్ కి భిన్నం గా వీలు కలిగినప్పుడల్లా వీకెండ్స్, పిల్లలతో టూర్, ఫ్రెండ్స్ తో కలవటాలు, అలా చాలా చేస్తూనే ఉన్నా ఈ బోర్ ఇద్దరిలో బయటపడుతూనే వుంటుంది. నేను షాపింగ్, బంగారం, బట్టలు, వేరే తల్లి పిల్లలతో రోజంతా గడపటం, ఇలా నాకు తోచిన మార్పు కలిపించుకుంటూ ఉంటాను. తాను కూడా ఫోటోగ్రఫీ, ఫ్రెండ్స్ డిన్నర్, ఆఫీసు పార్టీ, క్లాసు మేట్స్ రీయూనియన్, బంధువుల ఫంక్షన్ అలా చేస్తునా ఈ " బోర్ " తప్పటంలేదు. ఈ సారి కొత్తగా మా నలుగురం ఇష్టపడేది చేయాలని, ఓ నిర్ణయానికి వచ్చాక ఏ పని చూసినా, చేసినా అవే అలొచనలు.

ఎప్పుడు చూసేది, చేసేది కూడా మన ఆలోచనలతో, మన అవసరాలకి, మన సందర్భానికి ఒక్కోసారి మనల్ని కొత్తగా ఆలోచింప చేస్తాయి. అలాంటి ప్రకటన ఓ శుభ ముహుర్తాన నా చెవిలో పడి అక్కడనుండి నా మెదడుకి వెళ్లి ఆ విషయాని కొత్తగా ప్రాసెస్ చేసి నాకు ఈసారి "నూత నత్వానికి " దారి చూపింది. సారాంశం ఏమిటంటే "గ్రీన్ బెల్ట్ " ఏరియాలలో మనం ప్లాట్ కొంటే మనకు నచ్చినట్లు మొక్కలు నాటుకోవచ్చు అంతే కాక మీ వంతు పర్యావరణని సంరక్షించిన వారు అవుతారు, సిటీ కి దగ్గర – దూరం కాని చోటున, వారంతరాలలో కాలుష్యానికి దూరంగా, ........ అంతే నేను ఫిక్స్ అయిపోయాను . మా ఇద్దరి ఆలోచనలు వేరు , దారులు వేరు అయినా గమ్యం ఒక్కటే. మా ఇష్టాల కి వేరొకరికి కష్టాలు కలగకూడదు. ఆయనకి కొత్త హౌస్ ప్రాజెక్ట్ కావాలి, ఇద్దరికీ మొక్కలంటే ఇష్టం, పిల్లలతో నాకు, ఆఫీసుతో తనకి టైం ఈ పని కోసం ఎక్కువ సమయం కేటాయించక్కర్లేదు. వాళ్ళదే ఆ తోట సంరక్షణ భాధ్యత. పల్లెటూర్లలో వేసవి సెలవులలో మా తాతగారి ఇంట్లో నేను, నా లాగే ఆయన వాళ్ళ తాతగారి ఇంట్లో తాను అక్కలు, తమ్ముళ్లు, అన్నలు, వదినలు, మేనమామలు, అత్తలు, పిన్నులు, పెద్ద లోగిళ్ళు ,పాలేరులు, గేదెలు, సొంత పాడి, మట్టి, కొబ్బరికాయ చెట్లు అబ్బో ఆని చెప్తే అసలు సంగతి ముందుకి వెళ్ళదు.

చెప్పేదేంటి అంటే మాకు ఆడుకోవటానికి డబ్బులుతో పనిలేదు. కావలిసింత స్నేహాలు, ఎప్పటికి తరిగిపోనంత ఆట వస్తువుల సమాహారం. ఇప్పటి షాపింగ్ మాల్ లలో ఉండే "గేమింగ్ జోన్" ఆటల మూలాలతో, టెక్నాలజీ , పవర్ కట్ బ్రేక్స్, లేని డబ్బులిచ్చి బొమ్మ డబ్బు కాయిన్ కొనుకోవలిసిన అవసరాలు లేని (ఎందుకంటే మాకు తెలిసిన బొమ్మల సంపద అంటే గోలీలు. గిల్లి దండ ఆడే కర్రలు , చింతపిక్కలు, పదునైన బెచ్చాలు....) మేము ఆడుకునే అవకాశం కలిగినందుకు, మా పిల్లల కి చెప్పినా అర్థం కొంతవరకే, వాటిని ఆస్వాదించాలంటే స్వయంగా తెలుసుకోవాలంతే. ఒక దెబ్బకి రెండు పిట్టలు. మా బాల్యం మేము, వాళ్ళు కలిపి "టైం మెషిన్"లో వెళ్లి ఒకేసారి చూసుకోవటం ఒక పిట్ట అయితే వాళ్ళకి నచ్చిన ఆటలు నిర్బంధాలు లేని సమయం, క్యూ గత్యంతరాలు లేకుండా, అన్నింటి కంటే ఉచితంగా రెండవ పిట్ట.

మా సొంతూరులో ఇప్పుడు పొలం పంటలు చూసేవాళ్ళు ఎవ్వరు లేరు. మేము ఇద్దరం అక్కడి సంతోషాలను అనుభవించం కాని ఇప్పుడు పెద్ద అయిన తరువాత ఆ పొలాలు, పంటలు, కౌలు అలాంటివి ఏమి తెలియదు అని చెప్పుకోడానికి సిగ్గు పడుతున్నాను. నాకు, ఆయనకు కూడా పొలం వుంటే బాగుంటుంది అనిపిస్తుంది కాని పూర్తి జీరో పరిజ్ఞానం ఉన్న పనిలో చెయ్యి పెట్టకూడదని పొలం కొనాలన్నా ఆలోచన వదిలేసాము.

అన్నట్టు ఈ గ్రీన్ బెల్ట్ కాన్సెప్ట్ లానే ఎవరికైనా పొలాలు ప్లాట్స్ లా కొని పంటలు పండిస్తే రైతులకు, భావితరాలకి, భూమాతకు, పర్యావరణానికి, మన మనసులకి, మన పిల్లలకి కి ప్రకృతి తో మన జీవితాలు ఎంత ముడిపడి ఉన్నాయో చెప్పటానికి (మా అబ్బాయి కి ఏమికావాలన్నా షాపింగ్ మాల్లో దొరుకుతాయి అని ధీమా, అక్కడికి ఎలావస్తాయి అన్నది ఆలోచించటం లేదు) పనికి

వస్తాయి. పనిలో పనిగా కార్పొరేట్ ఆఫీసులలో ఇచ్చే జీతాలు ఎక్కువ అయి కొత్త టెక్నాలజీ అని చెప్పుకుంటూ ఈ–వేస్ట్ కి తోడ్పడుతున వస్తువులు కొనే కంటే, టాక్స్ ఫ్రీ ఇలాంటి గ్రీన్ ప్రాజెక్ట్ లలో అంటే ఎక్కువమంది స్పందిస్తారేమో. సారీ సారీ ఆలోచనలు ఎప్పుడు పక్కకి వెళ్లి పోతున్నాయి .

అసలు విషయంలోకి వస్తే కొద్దిగా కమర్షియల్ గా అనిపించినా నాకు "మా తోట" ఉంటే బాగుండును అనిపించింది. మా వారి చెవిలో జోరీగలా నా ఉద్దేశాన్ని ఊదటం మొదలుపెట్టాను. అంత పెద్ద ప్లాస్మా టి.వి ఇప్పుడు కొన్న ఆరు నెలలకే (మరీ వారానికే అంటే ఒప్పుకోరుకాబట్టి) పాతది అయిపోతుంది, ఇంకా త్వరలో రాబోయే 3–డి టెక్నాలజీ కొంటే బాగుంటుంది, అన్ని మీద మీద పడతాయి (సెటైర్ ) అని ఇంకో ఏడాది పొడిగించాటానికి నా శాయశక్తులా ప్రయత్నాలు చేసి సఫలీకృతం కాగలిగాను. ఆ ధరకు గ్రీన్ బెల్ట్ ప్లాట్ అని మొదలుపెట్టితే అనుకున్న ధరలు ఆకాశాన్ని అంటడంతో సగం మాత్రమే వస్తుందని తెలిసి నిరాశ పడక రీసెర్చి మొదలుపెట్టాం. ఇంటర్నెట్ వచ్చాక పనులు కొంత సులువు అయింది, కొంత కాంప్లికేటేడ్ గా మారింది (ఆప్షన్స్ , అక్కర్లేని నాలేడ్జ్, ఎంత నిజ్జం ఎంత కల్పన తెలియక) . చూసినా ప్రతిదానిలో ఎవరో ఒకరికి ఏదో నచ్చక ఇద్దరి మధ్య బేధాభిప్రాయలు, ఒకరకం గా మరింత టైం పాస్ విత్ కమ్యూనికేషన్ ఇద్దరి మధ్య ( లేదంటే ఎవరి ప్రపంచంలో వారి ప్రపంచానికి వెళ్ళిపోకుండా ,పిల్లలు ,టి . వి సీరియల్స్ ,లేట్ నైట్ గ్లోబల్ కాల్ కాన్ఫరెన్స్ లు ). వీకెండ్ వస్తే పొద్దునే ఎక్కడేకడి కి వెళ్ళాలి , ఒక రకమైన ఉత్సాహం నాకు ( నో వంట , పిల్లల తో ఇద్దరం ఎప్పుడు మాట్లాడే విషయాలూ కాక కొత్త వి మాట్లాడటం ) ,పిల్లలకి (ట్రావెల్ ,గేమ్స్ ,బయట తినటం ),శ్రీవారికి (సిటీ ట్రాఫిక్ లేని నాన్ స్టాప్ డ్రైవింగ్ , ఫోటోగ్రఫీ బ్రేక్స్ ) . దీనినే పుణ్యం పురుషార్ధం అంటారేమో . ఇలా వీకెండ్స్ ఫ్యామిలీ ఔటింగ్స్ గా కొన్ని , ఆయన ఒంటరిగా కొన్ని , మేమిద్దరం కొన్ని తిరగ్గా తిరగ్గా ఓ శుభాముహుర్త న ఒక స్ధలం రిజిస్ట్రేషన్ చేయించే సాము . వివరాలు లోకి వెళ్ళితే మేము ఎవ్వరం చూడని స్థలం కొన్నాం . ఎవరో ఫ్రెండ్ ,ఎక్కడో ఎవరో అంటే అది మా వారు వింటే , ఓ సుభాముహుర్తన నా చెవిన వేయగా , ఆ శుభ గడియలలో గ్రహాలు కలవక ,మా ఇద్దరి ఆమోదం కలిసినందుకు , తొందరగా డీల్ సెటిల్ చేసుకోవలిసిన అవసరం కలిగిన ఆ "అనామక మహానుభావుడు"కి మనసులోనే ధన్యవాదాలు .

మేము సాధారణం గా కాస్త ఎక్కువ రీసెర్చ్ అనాలసిస్ చేసి కొంటూ ఉంటాం. (తిన్నది అరగక ఒక కారణం అయితే, ఇంట్లో పెద్దవాళ్ళు లేక). నాకు అత్తగారు, మావగారు లేకపోవటం మా వైపు వాళ్ళు నా అదృష్టం మీద ఈర్ష్య పడినా నాకు ఒక్కోసారి అది పెద్ద లోటుగా అనిపిస్తుంది. మా పిల్లలకి నానమ్మ, తాతగారుతో పంచుకునే అవకాశం లేకపోయినందుకు. నానమ్మలు ,తాతగార్లు కూతురి పిల్లలకి ఇచ్చినంత ఇంపార్టెన్స్ కొడుకు పిల్లలకి ఇవ్వరని అందరు అంటున్నా నాకు ఇంకా ఏదో నమ్మకం. ఎందుకంటే నాకు కూడా ఆ అవకాశం కలగలేదు, అందుచేత ఎవరేమి చెప్పినా ఆ రిలేషన్ మీద నేను అత్తగారితో సరిగ్గా ఉంటే నా పిల్లలని, వారి చిన్నతనాన్ని ఆవిడ, వాళ్ళ అబ్బాయి కూడా కలిపి వారి గతం తిరిగి అనుభవిస్తారని అనుకునేదాని. అంటే మా వారు, వాళ్ళ తల్లితండ్రులు, ఇప్పుడు మా వారు తండ్రి ఐన తరువాత కష్టాలు, ముచ్చట్లు పంచుకుంటూ వారి చిన్నతనాన్ని నెమరువేసుకుంటారని. మా పెళ్లికి ముందే మా మావయ్య గారు లేరు.

ఇంక మేము ఇండియా రాక ముందే అత్తయ్య గారు కూడా కాలం చేసారు. అసలు అమెరికా వెళ్ళటానికి కారణం వారికి చదువుకునే టప్పుడు రాని అవకాశం ఉద్యోగ రూపంలో రావటం వలన, తన కోరిక తీరుతున్నందుకు మా అత్తగారు సరే అనటం జరిగి, 15

రోజులలో మా సంబంధం కుదరటంతో అలా, అలా గ్రీన్ కార్డు కేసి కనీసం ఇద్దరం ఒకసారి కూడా సీరియస్ థాట్స్ ఇవ్వలేదు. మనసులో నాకైతే అమెరికా ఇష్టం ఐనా ఇండియా మీద అయిష్టం ఎప్పుడు లేక పోవడం తో అది పెద్ద సమస్యగా అనుకోలేదు.

మళ్లీ ప్రస్తుతానికి వస్తే రిజిస్ట్రేషన్ జరిగిన కొన్ని రోజుల తరువాత ఓ వీకెండ్ అసలు తోట, కథా కమామేషు తేల్చుకుందాం అని పొద్దున్నే టిఫిన్స్ ముగించుకొని కాస్త అన్నం, పప్పు, పెరుగు, ఆవకాయ, బంగాళా దుంపల వేపుడు, జంతికలు, చిప్స్ చెత్త వగేరాలతో పాటు బాడ్మింటన్, క్రికెట్ సామాను, ఓ దుప్పటి, రెండు దిండ్లు కారులో పెట్టి బయలుదేరాం. ఓ గంట ప్రయాణం; ఈ రింగ్ రోడ్ పుణ్యమా అని భలే సాగింది. పనిలో పనిగా ఆ దారులు కూడా చూడటం జరిగింది. ఇవే ఒకప్పుడు హైదరాబాద్ కి చుట్టూ కొండలు, అడవులట. మొత్తానికి సిటీ ట్రాఫిక్ దాటి, 6 లేన్ పై 80 కి మీ వేగంతో మా కారుని టెస్ట్ చేయించి, చుట్టూ తోటలు మొదలైన చోట రోడ్ వుందా లేదా అనే కచ్చా రోడ్ లాంటిది ఎక్కి పెద్ద గేటు ఉన్న కంచె కలిగిన తోటలోకి ప్రవేశించాము. గేటు పక్క లోపలి వేపు రెండు మూడు పెంకుటిళ్ళు ముందు ముగ్గురు, నలుగురు చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉన్నారు. అందులో ఒకరు వచ్చి గేటు లోపలి నుండి గడియ తీసిపెట్టారు. ఆల్ ఇన్ వన్ వ్యక్తి రిజిస్టర్ లో సంతకం పెట్టించు కొని మమల్ని ముందుకి వెళ్ళ మన్నాడు.

ఒక్కో ప్లాటు దాటు కుంటూ ముందుకు వెళ్ళాక తోట దట్టం తగ్గిన ప్లాటులలో మా పేరు ఉన్నది కనబడింది, మా పిల్లలు ఇది మనదే, మనదే అని గెంతారు. బావి చాలా లోపలికి ఉండటం వల్ల ఇంకా నీటి సౌకర్యం లేక, కొత్త యజమానుల అభిలాష నింపు కోటానికి అనుగుణంగా కాస్త ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు మాలాగా కొన్న వాళ్ళందరు ముందుకి వస్తే అవి కూడా గేటు దగ్గర చూసినంత నిండుగా తయారవుతాయట. తిరిగి వచ్చేటప్పుడు తీరికగా పరీక్షించి చూడటం మొదలు పెట్టాను. మాలా కాక ఎప్పుడో ముందు చూపుతో కొన్నవారి ప్లాట్లు. ప్లాట్లు మధ్య ఉన్న కచ్చా రోడ్ కి ఇరు వైపులా పెద్ద పెద్ద చెట్లు దానికి బోలెడన్ని ఖాళి గూడులు కింద అక్కడక్కడ పడి ఉన్నాయి. అవి మా పెద్ద అబ్బాయికి రెండు ఏరి ఇచ్చాను. ఒకటి మీ స్కూలు కి పట్టుకు వెళ్ళు అనగానే అప్పటి వరకు ఉన్న ఆనందం రెట్టింపు అయ్యింది. ఆ సన్నని దారికి రెండు వైపులా, సపోటా సీతాఫలం, మామిడి, హైబ్రిడ్ కొబ్బరి చెట్లు,

ఆయా ప్లాటు ఓనర్ అభిరుచి అనుసరించి పెంచుతున్న మొక్కలు. అన్ని నాలుగు అడుగులు మించి పెరగక పోవడంతో మా పిల్లలకి ఆ మొక్కలకి వేళ్ళాడుతున్న కాయలు ఆ మొక్కల స్వరూపాలు, వ్యత్యాసాలు వివరించడం మొదలు పెట్టాను. మా పెద్దవాడు అప్పుడే వాడి సైన్స్ క్లాసులో మొక్కలు పాఠం నేర్చుకుంటున్నాడు, మా చిన్న వాడు కూరలు, పండ్ల పేర్లు చెప్తూ ఉండటంతో ఇద్దరు ఆసక్తిగా వింటుండంగా మా వారు మొక్కల మధ్య ఇల్లు చూపి అది గెస్ట్ హౌస్, బహుశా ప్లాటు వాళ్ళు అందరు ఎప్పుడైనా బుక్ చేసుకొని వనభోజనాలు అంటే మోడరన్ డే ఔటింగ్, గెట్–టు–గెథెర్ లాంటివి ప్లాన్ చేసుకోవచ్చు అంటూ అప్పుడే ఆ గేధరింగు తాలూకు గేములు ఆటలు పాటలు అంటూ మైమరిచి పోతూ చెపుతున్నారు.

అందరం ఆ పక్కకి వెళ్లి చూసాము. బయట తాళం వేసి ఉంది, కిటికీలు తెరిచే ఉన్నాయి. ఆ ఇంటి చుట్టూ మందార మొక్కలు, కనకాంబరాలు, నిమ్మ చెట్టు, ఇంకా ఏవో తీగలు అల్లుకుని ఉన్నాయి. కిటికీ లోంచి చూస్తె లోపల అదో పెద్ద హాలు, ఓ పక్క వంట చేసుకునేందుకు గట్టు, గోడకి రెండు అరలు, ఓ నాలుగు కుర్చీలు ఉన్నాయి. పై భాగానికి వెళ్లేందుకు మెట్లు ఉన్నాయి. పైన బహుశా రెండు మూడు గదులు ఉండి ఉంటాయి, ఆ గదుల బయటకి వచ్చి డాబాలో కూర్చునేందుకు ఖాళీ జాగా కూడా ఉంది. ఈ సారి చుట్టాలు వస్తే అందరం కలిసి సరదాగా రోజుంతా ప్లాన్ చేసుకోవచ్చు అనిపించింది. ఎన్ని సార్లు అని ఆ ఐ–మాక్స్, చార్మినార్,

షాపింగ్ మాల్సు, ఇప్పుడు సగం పైన మా వాళ్ళందరూ అపార్ట్ మెంట్లలో ఉంటున్నారు. అందుచేత తప్పకుండ వాళ్ళకి ఇది ఒక వెరైటి అవుతుంది. ఎవరికో ఎందుకు నాకే, మేము నలుగురు ప్రకృతి లో గడిపే అవకాశం వచ్చింది అనిపించింది.

అలా నడుచుకుంటూ ఇంచుమించి మెయిన్ గేటుకి దగ్గరగా, ఓ పక్క పెంకుటిల్లుకి ఎదురుగ ఉన్న తోటలో చాలా నిండు గా మొక్కలు, చెట్లు చూసి అందులోకి వెళ్ళాము. బత్తాయి చెట్లు, మామిడి చెట్లు, ఉసిరి చెట్టు, పనస చెట్టు, గులాబి మొక్కలు, ఏవో పూల మొక్కలు, రంగు రంగు కాగితం పూల మొక్కలు,

రెండు పక్కల దడిలాగా మధ్యలో పెద్ద చెట్టు చుట్టూ చపటా. ఇంకా మా పిల్లలైతే సందడే సందడి తిరిగేసారు, ఒకరికొకరు పిలుచుకుంటూ, వాళ్లు కనుక్కొన్న మొక్కలు పేర్లు అరుచుకుంటూ, ఏదో స్వేచ్ఛా లోకం లో విహరించారానే చెప్పాలి ఎందుకంటే షాపింగ్ కి వెళ్ళినప్పుడు కూడా మనకు కనువిందు చేసేవి కనిపించినా వాళ్ళని, అది ముట్టుకోవద్దు, అది అడగద్దు, ఇది తినకూడదు, ఆ గేమ్ ఎక్కడానికి లేదు ఇలా ఏవో తెలియని కట్టడి పెడుతూ ఉంటాము. ఇక్కడ నేను ఏమి అనవలసిన అవసరం కనబడలేదు. కింద పడిన కాయలు తీస్తూ అలాగే చెట్టుమీద ఉసిరికాయలు చిన్న నిమ్మకాయలతో కొడుతూ (వాచమన్ కోసుకోమని అన్నాడులెండి), చిన్న చిన్న పురుగులు , తూనీగలు చూసి భయపడుతూ, మళ్లీ ఒకరినొకరు కవ్వించుకుంటూ, వారి పసితనాన్ని అసలు రూపం లో (బహుశా మళ్లీ నా పసితనాన్ని కూడా ) చూస్తున్నాను అనిపించింది. ఎక్కడా మా శ్రీవారు అని వెనక్కు తిరిగి చూస్తును కదా ఆయన ఆ ప్రకృతి ని తన కెమెరాలో బంధించుకుంటూ కనబడ్డారు. ఇంతలోనే అటు ఇటు దొంగ చాటు గా చూస్తూ కనబడేసరకి ఏంటబ్బా ఆయన ఏమి చెయ్యబోతున్నరో అని నాకు కుతూహలం పెరిగి ఏమి ఎరగనట్లు పిల్లల వైపు తిరిగి కూర్చున్నాను. మళ్లీ వెనక్కి తిప్పి చూసే సరికి ఆయన ఏదో చెట్టు కిందకి, దిగుతూ ప్యాంటు దులుపు కొని మా వైపు వచ్చి ఇంకా వెళదామా అన్నారు. అందాలు కళ్ళతో ఆస్వాదించడం మానేసి రీళ్ళు రీళ్ళు ఫోటోలు తీస్తూ ఉంటారు, ఇక్కడా అదే ప్రహసనం అని మనసులో గొణుకుంటండంగా , నా చున్నీ పట్టుకున్నారు.

అబ్బ ఏమిటండి అంటుండగా , చేతిలో కెమెరా ఆ చెట్టు గట్టు పై పెడుతూ ఆ వెనక దారిని దోర జాం కాయ తీసి నా చున్నితో తుడుచుకొని చిన్న చిలక కొరికిన కాయ అని చిన్నగా చిలక కొరికి నా నోటికి అందించారు. ఒక్క సారిగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి ఆనందంతో అని మీకు ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఇంతలో పిల్లలు వచ్చి ఏమిటి తింటున్నావు అమ్మా అని అడగనే అడిగారు. మా వారు అమ్మకి ముందు పెట్టింది తియ్యగా లేదని, మనం అమ్మకి మంచి పండు కోసుకు కోవచ్చా అని ఆ వాచ్ మేన్ ని అడుగుదాం అని ఇద్దర్ని తీసుకొని లేచారు. ఒక్కసారిగా ప్రేమ పొంగుకొచ్చి ఒక్క సారిగా మా వారిని పట్టుకున్నాను. అందరం తిరిగి కారు దగ్గరకి చేరేసరికి వాచమేన్ పిల్లలు మా వాళ్లకి ఏవో పళ్ళు రకాలు కలిపినా కవరు అందించారు. నేను ఆయనని డబ్బులు ఇవ్వండి అని అంటూ అంటే వద్దని అన్నారు, బలవంతం గా పిల్లల కోసం తీసుకు వచ్చిన చాకిలేట్లు, బిస్ కెట్లు వాళ్ళ చేతుల్లో పెట్టాను. ఆ పిల్లలు వాటికేసి చూసిన ఆనందం ఓ పక్కన, మా వాళ్ళు నిమ్మకాయలు విసిరి కొట్టి, ఏరిన ఉసిరికాయలు జేబుల్లో తడుముకుంటూ పొందుతున్న ఆనందం మరో పక్క కనబడుతుంటే నా ప్రయత్నం, నా ఆలోచన, నిర్ణయం పై నాకు గర్వం కలిగింది. మేము ముందు ముందు అక్కడ గడిపే ఫ్యామిలీ టైం తప్పకుండ అందరం పూర్తిగా సంతృప్తి చెందుతాము అని.

ఇది జరిగిని రెండు నెలలకు ఓరోజు అనుకోకుండా హై-టెక్ ఎగ్జిబిషన్ కి వెళ్లాము. అక్కడ 52 అంగుళాల టి. వి ఎదురుగా దర్శనం ఇచ్చింది. మావారు మళ్ళీ మైమరచి దాని వైపు చూస్తూ, దానికున్న ఫీచర్ వివరాలు అడిగి నిట్టూర్చుతుండంగా చిన్న

బాధ కలిగింది. అక్కడే ఇద్దరు ముగ్గురు స్నేహితులు కలిసాము . ఈ ఆదివారం ఫ్యామిలీ అందరం ఎక్కడ కలుద్దాం అనుకుంటూ ఉండగా, మా వాడు అమ్మ, మనం మన ఫామ్ హౌస్ కి వెళదాము అన్నాడు . అంటే మా వారు ఇందాక ఆ టి.వి సేల్స్ మాన్ తన చాతుర్యంతో రంగరించి జీవితంలో ఉండవలసిని అత్యాధునిక, అత్యవసర, వగైరా, వగైరా వస్తువులు అని ఎలా చెప్పాడో, మా వారు మేము తీసుకున్న ప్లాట్ వివరాలు చెప్పి, ఈ సారి ఆఫీసు పార్టీ అక్కడ జరిగితే ఎంత వెరైటీ గా ఉంటుందో అంటు ఉండగా నేను తప్పు చెయ్య లేదు అని నా మీద నమ్మకం పెరగడంతో మరింత శ్రద్ధగా మావారి ఆనందంలో పార్టనర్ అయ్యాను.

పి .యెస్: ఇప్పటికి అంటే ఇది జరిగి ఆరు సంవత్సరాలు అయినా ప్రతి ఏడాది కార్తీక మాసంలో ఒకసారి వనభోజనం, వేసవిలో మామిడి పళ్ళ కోసం, వర్షకాలం లో పచ్చదనంలో వచ్చే ప్రకృతిని మా మనసులో, మా వారి ఫోటోగ్రఫీ పక్షులను, ప్రకృతి ని బంధించే ప్రయత్నం చేస్తూనే ఉంటున్నాము. చివరి మాట పెద్ద టి.వి కొని మూడు సంవత్సరాలు అయిందండీ. దేని ఆనందం దానిదే!!.

# పరిమళం సన్నిహిత్

శని, ఆది వారాలు సెలవులు కాబట్టి , ఎప్పటి నుంచో ఉన్న పెండింగ్ పని ఒకటి పూర్తి చేద్దామనుకున్నాను. అది – సింహాచలం దేవస్థానం కి వెళ్ళి మొక్కు తీర్చుకోవడం. హైదరాబాద్ లో జాబ్ చేసుకుంటూ జీవితం వెళ్ళదీసే నేను ' అమ్మాయి పుడితే నీ కొండకు వస్తాను స్వామీ ! ' అని ఆ సిమ్హాద్రి అప్పన్న కు మొక్కుకున్నాను. వెంటనే ఆ స్వామి కరుణించాడు. మాకు అమ్మాయి పుట్టింది. మా ఇంట్లో సంతోషాన్ని పూయించింది. అందుకే వెంటనే వెళదామని ఇంటర్నెట్ లో టికెట్ బుక్ చేయమని మా ఆవిడకి పురమాయించాను. టైము తక్కువుంది కాబట్టి తత్కాల్ లో టికెట్ బుక్ చేస్తానంది. కంప్యూటర్ ముందు కూర్చుని కసరత్తు ప్రారంభించింది.

" అబ్బ ! ఎందులోనూ టికెట్ లు లేవండీ..అన్నీ వెయిటింగ్ లిస్టులే ! " అంటూ నిరాశ పడిపోయింది.

" నిజమా! బహుశా నువ్వు సెకెండ్ క్లాస్ లో చూస్తున్నట్లు ఉన్నావు.ఎంత పర్సనల్ ట్రిప్ అయితే మాత్రం అంత పిసినారి తనమా ? " జోక్ గా అన్నాను.

" అదేంటండీ ! సెకెండ్ క్లాస్ లో వెళ్ళకూడదా ఏంటి ? " ఆశ్చర్యంగా అడిగింది నా భార్య

" అమ్మో ! సెకెండ్ క్లాస్ లో నేను ట్రేవెల్ చెయ్యలేను బాబూ ! దరిద్రం...అంతా లో క్లాస్ వెధవలు ఉంటారు. న్యూసెన్సు. ఒక శుభ్రత గానీ , డీసెన్సీ గానీ ఉండదు. పైగా మన లగేజ్ ఎప్పుడు ఎవడు ఎత్తుకుపోతాడో తెలీదు. రాత్రంతా కాపలా కాస్తూ కూర్చోవాలి. అదే ఏసీ క్లాస్ లో అయితే సెక్యూరిటీ ఉంటుంది, డీసెన్సీ ఉంటుంది. మంచి మనుషుల కంపెనీ ఉంటుంది. హాయిగా ప్రయాణం చెయ్యవచ్చు . అందుకే ఏసీ క్లాస్ లో టికెట్స్ చూడు " అని చిన్నపాటి లెక్చరిచ్చాను.

" అలాగేనండీ " అంటూ నెట్ లో వెదకడం ప్రారంభించింది. ఆమె భీకర ప్రయత్నం తర్వాత , గోదావరి ఎక్స్ ప్రెస్ కి ఏసీ కోచ్ లో ఒక టికెట్ దొరికింది.

" హమ్మయ్య ! " అనుకుంటూ సంతోషంగా ఫీల్ అయ్యాను. అయినా దైవ కార్యానికి వెళుతున్నపుడు టికెట్ దొరకకుండా ఎలా ఉంటుంది...' సింహాద్రి అప్పన్నా ...మజాకా! ' అనుకుంటూ హుషరుగా లగేజ్ సర్దుకోవడం ప్రారంభించాను.

★ ★ ★

నేనెక్కిన ఆటో నాంపల్లి స్టేషన్ చేరుకునేటప్పటికి సాయంత్రం ఐదు గంటలు కావస్తోంది. గోదావరి ఎక్స్ ప్రెస్ కి ఇంకా పావు గంట టైముంది. చార్ట్ లో నా పేరు చూసుకుని కంపార్ట్ మెంట్ లోకి ప్రవేశించాను. ఏసీ బోగీ కావడంతో చల్లగా ఉంది. ఎక్కువ మంది ప్రయాణికులు లేరు, అక్కడొకరు అక్కడొకరు కూర్చున్నారు. గోదావరికి నాంపల్లి నుండి ఎక్కేవారు చాలా తక్కువ మంది. దాదాపు అందరూ సికిందరాబాద్ లో ఎక్కుతారు. ఎవరో నా లాగ నాంపల్లికి దగ్గర ప్రాంతం లో ఉండే వాళ్ళు మాత్రం ఇక్కడ ఎక్కుతారు. నాది లోయర్ బెర్త్. లగేజ్ బెర్త్ కింద సర్దుకుని రిలాక్సెడ్ గా కూర్చున్నాను.

కాసేపట్లో ట్రైన్ కదిలింది. వెంట తెచ్చుకున్న పత్రికలు చదువుదామని తెరిచాను,కానీ ఇంకా బోలెడంత ప్రయాణం ఉంది కాబట్టి ' తర్వాత చదవొచ్చులే ' అనుకుని వాటిని మూసేసి కిటికీ లోనుండి బయటకు చూడ సాగాను.

' జీవితం పూల పానుపు కాదు అంటారు ' అనుభవజ్ఞులు. నిజమే అనిపిస్తుంది ఒక్కోసారి. ఎందుకంటే నా జీవితంలో ఏదీ నాకు సులభంగా దక్కలేదు. విపరీతమైన కష్టం తర్వాతే అన్నీ లభించాయి. కానీ అందులోనే ఆనందం ఉంటుంది. దేవుడు అన్నీ మనకు ఇచ్చేస్తే ఇక చెయ్యడానికి ఏముంటుంది. జీవితం బోర్ కొడుతుంది. ఇప్పుడు ఈ వేదాంతం అంతా నెమరు వేసుకోవడానికి కారణం నా గతం. చాలా పేద కుటుంబం లో పుట్టిన నేను చదువు మెట్లెక్కి పైకొచ్చాను. సమాజంలో ఒక స్థానాన్ని సంపాదించుకున్నాను. సమాజంలో అటు పేద వర్గాన్ని , ఇటు ధనిక వర్గాన్ని కూడా చూసిన వాడిని కాబట్టి నాకంటూ కొన్ని అభిప్రాయాలు స్థిరపడ్డాయి. గొప్పగా జీవించే వాళ్ళ మనస్తత్వాలు కూడా గొప్పగా ఉంటాయని నా అభిప్రాయం. అందుకే వీలైనంత వరకు గొప్ప వాళ్ళ సర్కిల్ లోనే ఉండటానికి ఇష్ట పడతాను.... గొప్పగా ఆలోచించడానికి ఇష్ట పడతాను .....

ఆలోచనల్లోంచి తేరుకునేటప్పటికి సికిందరాబాద్ స్టేషన్ వచ్చింది. ఒకర్ని ఒకరు తోసుకుంటూ ప్రయాణికులు రైలు ఎక్కుతున్నారు.నవ్వొచ్చింది నాకు. రైలు ఇంకా చాలా సేపు ఆగుతుంది అయినా జనానికి కంగారు , ఎక్కడ ట్రైన్ మిస్ అవుతామో అని.

నా బెర్త్ కి దగ్గరలో ఉన్న ప్రయాణికులందరూ వచ్చి తమ లగేజ్ లని సర్దుకోసాగారు. అందరూ ఇంచుమించు ఏభై పైబడిన వాళ్ళే ! నా ఎదురుగా కూర్చున్న దంపతులు నన్ను చూసి నవ్వారు. నేను కూడా మర్యాదపూర్వకంగా నవ్వాను.

"ఎక్కడి దాకా వెళుతున్నావు బాబూ ? " అడిగాడు పెద్దాయన

" వైజాగ్ దాకా వెళుతున్నానండీ " చెప్పాను.

" మీది లోయర్ బెర్తా ? " అడిగాడు. " అవును " అని చెప్పాను. తర్వాత అతడు అడగబోయేది నాకు తెలుసు. అందుకే ముందే చెప్పాను." పడుకొనేటప్పుడు నేను పై బెర్త్ కి వెళతాను, మీరు ఇక్కడ పడుకుందురు గాని లెండి " అని.

" చాలా థాంక్స్ బాబూ ...నాకసలే మోకాళ్ళ నొప్పులు...పైకి ఎక్కలేను " అంటూ సంతోషపడిపోయాడు . నెమ్మదిగా మా సంభాషణ ఊపందుకుంది. స్వపరిచయాలతో మొదలై ఉద్యోగం, నివాసం వరకు సాగింది. ఇంతలో పక్క బెర్త్ వాళ్ళు మా సంభాషణలో తల

దూర్చారు. నేను ఇక ప్రేక్షక పాత్ర వహించాను. వాళ్ళు మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. రాజకీయాలు, సినిమాలు అన్నీ సంభాషణలో దొర్లుతున్నాయి. మేమెక్కిన రైలు కంటే కూడా వారి కబుర్లు జోరుగా సాగుతున్నాయి.

ఇంతలో " కాఫీ!కాఫీ! " అంటూ కాఫీ అమ్ముకునే అబ్బాయి వచ్చాడు. " సార్ ! కాఫీ కావాలా సార్ ! " అని అందరినీ అడుగుతున్నాడు. ఎందుకో తాగాలనిపించి "బాబూ...ఒక కాఫీ ఇవ్వమ్మా " అడిగాను

" అలాగే సార్ ! " అని డిస్పోజబుల్ గ్లాస్ లో పోసిచ్చాడు. డబ్బులు కోసం పర్సు తీస్తే వంద నోటు కనబడింది. చిల్లర లేదు.

" ఇవ్వండి సార్ ! నేను చిల్లర తర్వాత ఇస్తాను " అని చెప్పి అతను నోటు తీసుకొని వెళ్ళిపోయాడు. నేను కాఫీ త్రాగసాగాను.

నా ఎదురుగున్న పెద్దాయన " అదేంటండీ ! అలా వంద నోటు వాడి చేతికిచ్చేసారు ? వాళ్ళసలే దొంగలు...వాడు మళ్ళీ కనబడదు చూడండి " అంటూ హితబోధ చేసాడు. " అయ్యో ...అలాగా! " అంటూ బాధపడిపోయాను.ఆయన అంతగా చెబుతున్నాడు కాబట్టి ఆ డబ్బుల మీద ఆశ వదిలేసుకున్నాను.

ఇంతలో మీల్స్ ఆర్డర్ తీసుకొనే అబ్బాయి వచ్చాడు. " సార్ ! నైట్ డిన్నర్...నైట్ డిన్నర్ ! " అంటూ అందరినీ అడుగుతున్నాడు. కొంతమంది ఆర్డర్ ఇచ్చారు. నేను ఇంటి నుండి టిఫిన్ తెచ్చుకున్నాను కాబట్టి వద్దని చెప్పాను.

కాసేపటికి డిన్నర్ చేయడం ప్రారంభించాను. మిగతా వాళ్ళు కూడా తినడం మొదలు పెట్టారు.మా భోజన ప్రహసనం ఒక అరగంట పాటు సాగింది. పడుకొనే ముందు బాత్రూం కి వెళ్ళడం నాకు అలవాటు. అందుకే లేచి టాయిలెట్ వైపు వెళ్ళాను. వెళుతున్నపుడు అప్రయత్నంగా నా దృష్టి టాయిలెట్ల కి దగ్గరగా ఉన్న సీటల్లో కూర్చున్న వ్యక్తులపై పడింది. అక్కడ వయసులో ఉన్న ఒక జంట కూర్చుని ఉంది. ఆ అమ్మాయి చాలా అందంగా ఉంది. ఆమె భర్త మాత్రం కాకి ముక్కుకి దొండపండులా ఉన్నాడు. వాళ్ళకెదురుగా కొంచెం రఫ్ గా ఉన్న నల్లటి వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతడి చేతిలో పోలథీన్ కవర్ చుట్టి ఉన్న హాఫ్ లీటర్ థంసప్ బోటిల్ ఉంది. అందులోని ద్రవాన్ని అతడు కొంచెం కొంచెం త్రాగుతూ మంచి హుషారుగా ఎదురుగా ఉన్న జంటతో మాట్లాడుతున్నాడు. అతడికి అంత హుషారు ఇస్తున్న ద్రవం థంసప్ కాదని, మనుషులని మత్తులో ముంచి ఆడించే మద్యం అని చిన్న పిల్లాడికైనా అర్థం అవుతుంది. ఆ జంట కూడా అతడితో ఎంతో చనువుగా మాట్లాడుతున్నారు. బహుశా వాళ్ళకి తెలిసిన వాడేమో అనుకున్నాను. టాయిలెట్ లో నా పని పూర్తయ్యాక వచ్చేస్తూ వాళ్ళవైపు చూసాను. నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుకుంటున్నారు. ' మంచిదే ! బాగానే టైం పాస్ చేస్తున్నారు ' అనుకుంటూ నా సీట్ కొచ్చి కూర్చున్నాను.

నా చుట్టుపక్కల వాళ్ళు కూడా నెమ్మదిగా డిన్నర్ చేయడం ముగించారు. ఇక అందరం నిద్రకుపక్రమిస్తుండగా ఇందాకటి కాఫీ అబ్బాయి వచ్చాడు. " సార్ ! మీ చిల్లర తీసుకొండి...కొంచెం లేట్ అయింది...సారీ సార్ ! " అంటూ క్షమాపణ అడిగాడు. " ఇట్స్ ఓకే ! " అంటూ తీసుకున్నాను. నా ఎదురుగున్న పెద్దాయన దెబ్బతిన్నట్లు చూసాడు. తనకంటే తక్కువ స్థాయి మనుషులంతా మోసగాళ్ళనే అతడి అభిప్రాయం తప్పిందని కాబోలు.

కంపార్ట్ మెంట్ లో ట్యూబ్ లైట్ వెలుతురు స్థానే నీలి రంగు బెడ్ లైట్ వెలుతురు ఆక్రమించుకుంది. సెల్ ఫోన్ తీసి నా భార్యతో కాసేపు పిచ్చా పాటీ మాట్లాడాను. రైలు చీకట్లో శబ్దం చేసుకుంటూ , గమ్యం చేరుకోవడానికి వడిగా ముందుకు పరుగెడుతోంది. నేను ఆవులిస్తూ నిద్రపోదామని బెర్త్ మీద వాలాను.

★ ★ ★

మాగన్నుగా నిద్రపడుతోంది. ఇంతలో ఎవరో గట్టిగా అరుస్తున్న ధ్వని. లేచి చూసాను.

" ఏంట్రా నువ్వు చేసిన పని ...రాస్కెల్ ! " అంటూ విరుచుకు పడుతున్నాడు అందమైన అమ్మాయి భర్త. ఎవరి మీద అరుస్తున్నాడా ? అని ఆసక్తిగా చూసాను. వాళ్ళతో ఇప్పటి దాకా ఎంతో స్నేహంగా మాట్లాడిన ఆ నల్లటి వ్యక్తి మీద అరుస్తున్నాడు.

కంపార్ట్ మెంట్లో లైట్లు వెలిగాయి. అందరూ ఆ బెర్త్ దగ్గర గుమిగూడారు. అందరినీ చూస్తూ జనాంతికంగా " చూడండి సార్ ! ఈ రాస్కెల్ ...నా భార్యని గట్టిగా కౌగిలించుకున్నాడు " అని ఆవేశంగా చెబుతున్నాడు.

గుంపులోని ఒక వ్యక్తి " అదేంటయ్యా! ఇప్పటి దాకా బాగానే మాట్లాడుకున్నారు కదా...మీకు తెలిసిన వాడేమో అనుకున్నాము ! " ఆశ్చర్యంగా అడిగాడు.

" నా ముఖం ... వాడెవడో గొట్టం గాడు సార్ ! ఏదో కో పాసింజర్ కదా అని కొంచెం స్నేహంగా మాట్లాడాము ...అంతే !" అంటూ వివరించాడు

" అయినా మీరు ఉండగా అతడెలా పట్టుకున్నాడు మీ ఆవిడని ? " ఎవరిదో ధర్మ సందేహం

" నేను ఇప్పుడే టాయిలెట్ కి వెళ్ళాను సార్ ! నేనటు వెళ్ళగానే గబుక్కున నా భార్య పక్కన కూర్చుని ' చెల్లెమ్మా ! ' అంటూ కౌగిలించుకుని బుగ్గ మీద చేతులు వేసి నిమిరాడంట సార్ ! " జరిగింది చెప్పాడు. అతడి అందమైన భార్య జరుగుతున్న దానికి సిగ్గుపడి పైట నిండుగా కప్పుకుని తలదించుకుని కూర్చుంది.

" ఏరా ! చనువుగా మాట్లాడినంత మాత్రాన అలా ప్రవర్తించవచ్చా ? " అంటూ ఆ నల్లటి వ్యక్తి మీద అరిచారు ఒకరు

" లేదు సార్ ! నా చెల్లెలి లాంటిదని అలా పట్టుకున్నాను " ముద్ద ముద్ద గా సమాధానం చెప్పాడు . అందరికీ అర్థం అయింది అతడు బాగా తాగి ఉన్నాడని. ఇదేదో వాళ్ళు మాత్రమే తేల్చుకోవల్సిన వ్యవహారం అని.

ఆమె భర్త సెల్ ఫోన్ తీసుకుని " నాకు చాలా మంది పోలీసు వాళ్ళు తెలుసు...అవసరమైతే డి.జి.పి కి కూడా కంప్లెయింట్ ఇస్తాను " అంటూ ఎవరితోనో ఆవేశంగా మాట్లాడాడు. కాసేపటికి ఒక బట్ట తల వ్యక్తి అక్కడికి వచ్చాడు.

" వీడేనా అల్లరి చేస్తున్నది..." అంటూ నల్లటి వ్యక్తి వైపు తిరిగి " రేయ్ ! నేను డి.ఎస్.పి ని ...ఏంటి తాగి గొడవ చేస్తున్నావట ? " అంటూ కాలర్ పట్టుకున్నాడు. ఆ డి.ఎస్.పి ని చూడగానే నల్లటి వ్యక్తి ముఖం వికసించింది. కానీ వెంటనే దీనంగా మార్చి

" సారీ సార్ ! నా సిస్టర్ లా అనిపించి ప్రేమని ఆపుకోలేక దగ్గరికి తీసుకున్నాను " చెప్పిన కథే మళ్ళీ చెబుతున్నాడు. ఈ గొడవకి టికెట్ కలెక్టర్ కూడా వచ్చి అక్కడే నిలబడ్డాడు. అతడి వైపు తిరిగి

" ఇలాంటి తాగుబోతులని ఎందుకు మీరు కంట్రోల్ చెయ్యడం లేదు " అని టీసీని ప్రశ్నించాడు డి.ఎస్.పి.

" లేదు సార్ ! వాళ్ళంతా సరదాగా మాట్లాడుకుంటుంటే ప్రోబ్లెం లేదేమో అనుకున్నాను ! నాకేం తెలుసు ఇలా చేస్తాడని ! " చెప్పాడు టీసీ.

" సరే ! సరే ! నేను చూసుకుంటాలే " అని అందరికీ చెప్పాడు. ఎవరి సీట్లలోకి వాళ్ళు వెళ్ళిపోయారు. నేను కూడా నా బెర్త్ దగ్గరికి వచ్చేసాను.

" వాడు తమ ఎదురుగా కూర్చుని మందు కొడుతుంటే కూడా అంత చనువుగా మాట్లాడటం ఆ దంపతుల తప్పు కాదా ? " అని అనిపించింది నాకు. బహుశా ఆ అందమైన అమ్మాయి తన మాటలతోనో లేక బాడీ లాంగ్వేజ్ తోనో ఆ నల్లటి వ్యక్తిని రెచ్చగొట్టి ఉంటుంది. అందుకే అతడు ఆమెని లొంగ దీసుకోవడానికి ఒక రాయి విసిరి ప్రయత్నించి ఉంటాడు.

అయినా ఇంత జరిగినా కూడా ఆమె భర్త ఆ నల్లటి రౌడీ వెధవని కొట్టకుండా వదిలేయడం నాకు అర్థం కాలేదు. అది అతడి

సంస్కారమో లేక చేతగాని తనమో అయుండొచ్చు. . లేదా జరిగిందేదో జరిగిపోయింది , తర్వాత అతడి వల్ల తమకు ఏ హాని కలగకూడదని వదిలేసాడేమో అనుకున్నాను. ఏది ఏమైనా ఒక సంఘటన జరిగినప్పుడు ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తారు. కాబట్టి ఏం చెప్పగలం...

ఆ డి.ఎస్.పి ఏం చేసాడో ఏమో కాసేపటికి అంతా సద్దు మణిగింది. అందరూ నిద్రలోకి జారుకున్నారు. కానీ నాకు మాత్రం నిద్ర పట్టలేదు.ఆలోచనల పరంపర !

పెద్ద పెద్ద భవంతులలో నివసించే వాళ్ళు , ఏసీ కంపార్ట్ మెంట్లలో ప్రయాణించే వాళ్ళు , ఉన్నతంగా జీవించే వాళ్ళు ఎంతో సంస్కారంగా ఉంటారని తను అనుకునే వాడు. కానీ జరుగుతున్నవి చూస్తుంటే తన అభిప్రాయం తప్పు అని తెలుస్తోంది. మనిషి ప్రవర్తన అతడు జీవించే స్థితిగతుల మీద కాక , అతడి బుద్ధి మీద , విచక్షణ మీద ఆధారపడి ఉంటుందని అర్థం అయింది.

అంతు లేని ఇటువంటి ఆలోచనలతో ఎప్పటికో నిద్ర పట్టింది. పొద్దున్నే లేవడానికి సెల్ ఫోన్ లో అలారం పెట్టుకున్నాను.

పొద్దున్న నాలుగ్గంటలకి అలారం మోతకి నిద్ర లేచాను. ఇంకో గంటలో వైజాగ్ వచ్చేస్తుంది , అందుకే కాల కృత్యాలు తీర్చుకుందామని టాయిలెట్ కి వెళ్ళాను.చాలా మంది ఇంకా మంచి నిద్రలో ఉన్నారు. కంపార్ట్ మెంట్ అంతా బెడ్ లైటు కాంతితో మసగ్గా ఉంది. రైలు ఊయలూపుతున్నట్టు సాగిపోతోంది.

అక్కడ... టాయిలెట్స్ కి బయట ఉన్న వాష్ బేసిన్ దగ్గర నిలుచున్న ఇద్దరు వ్యక్తులని చూసి నాకు షాక్ కొట్టినట్లు అనిపించింది. వాళ్ళు – ఆ అందమైన భార్య మరియు నల్లటి వ్యక్తి. ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. నల్లటి వ్యక్తి కులాసాగా సిగరెట్ తాగుతూ పొగని పైకి రింగులుగా వదులుతున్నాడు. రాత్రి తాగిన మత్తు దిగిపోయినట్లు ఉంది , కొంచెం స్టేబుల్ గా ఉన్నాడు.

" మనిద్దరికీ ఇంతకు ముందే పరిచయం ఉందని మీ ఆయనకి తెలుసా ? " అడిగాడు ఆమెని.

" లేదు ...నేను చెప్పలేదు..అయినా పెళ్ళికి ముందు ప్రేమ వ్యవహారాలు మొగుడికి చెబుతారా ఎవరైనా ? " మెల్లగా చెప్పిందామె

" అయినా ఎందుకంత గోల పెట్టేసావు ? " విసుగ్గా అన్నాడు

" నాకేం తెలుసు ...ఆయన అంత తొందరగా టాయిలెట్ నుండి వచ్చేస్తాడని...ఏం చెయ్యాలో అర్థం కాలేదు ...అప్పటికే ఇద్దరు ముగ్గురు మనల్ని చూస్తున్నారు " సంజాయిషీగా చెప్పింది .

" పోనీలే ! ఏదో రకంగా మేనేజ్ చేసాను.చెల్లెలి సెంటిమెంట్ కి జనాలు నోరు మూసుకున్నారు. ఆ డి.ఎస్.పి కూడా నాకు బాగా తెలిసిన వాడే ! " అంటూ నవ్వాడు. అక్కడ నేనున్నానన్న స్పృహ కూడా లేదు వాళ్ళకి. వాళ్ళ దృష్టిలో నేను పనికి రాని వాడిని.

" సరే ! నేను వెళ్తాను...మా ఆయన లేస్తాడు...తర్వాత వీలు చూసుకుని కలుద్దాము " అంటూ గబగబా వెళ్ళిపోయిందామె.

నవ్వొచ్చింది నాకు. ఈ మొత్తం ఎపిసోడ్ లో ఆమె భర్త తో సహా మేమందరం వెర్రివాళ్ళం అన్న మాట ! వారిద్దరూ ఆడిన డ్రామాలో ప్రేక్షకులమన్న మాట !

***" మంచి దృశ్యమే చూశాను.. " అనుకుంటూ టాయిలెట్ లోకి వెళ్ళాను. భరించలేక ముక్కు మూసుకున్నాను. లోపల ఒకటే దుర్గంధం ! గొప్ప వాళ్ళ బ్రతుకుల్లోని చీకటి కోణం లాగ !***

****

## కథ వెనుక కథ



సంవత్సరం క్రితం మాకు అమ్మాయి పుట్టింది. ఆ మొక్కు తీర్చుకోవడానికి నాలుగు నెలల క్రితం నేను సింహాచలం వెళ్ళినపుడు జరిగిన అనుభవం ఇది. యధాతథంగా వ్రాసాను.కాకపోతే చివర్లో పెట్టిన ట్విస్ట్ కేవలం కథ కోసం కల్పించాను. " **రైల్లో తమ ఎదురుగా కూర్చున్న వ్యక్తి త్రాగుబోతు అని తెలిసి కూడా ఆ దంపతులు ఎందుకంత క్లోజ్ గా మాట్లాడి ఎంకరేజ్ చేసారు ? తమ పని తాము చూసుకోవచ్చు కదా !** " అన్న ఆలోచనల్లో నుండి పుట్టినదే ఈ కథ. మనుషులందరూ థ్రిల్ కోసం , ఎంటర్టైయిన్మెంట్ కోసం కొన్ని సంబంధాలు కొనసాగిస్తారు. తీరా అవి ప్రమాదకరం అనిపించగానే ఆ బంధాలను వదిలించేసుకొని బహిరంగంగా విలువల గురించి మాట్లాడుతారు. ఆ విషయాన్నే ఈ కథలో స్పృశించాను. జరిగిన సంఘటనకి నా విశ్లేషణ జోడించి ఈ కథ వ్రాసాను. మీకు వేరే యాంగిల్ కనపడితే దయచేసి నాకు చెప్పండి , సంతోషిస్తాను . వినమ్రతతో

మీ - సన్నిహిత్

# కుటీచకుడు — మంథా భానుమతి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ**

**వసంతం ప్రవేశించి వారం రోజులయింది.** వాతావరణం ఆహ్లాదంగా ఉంది. కానీ.. ఎక్కడో కనీ కనిపించనట్లు, వినీ వినిపించనట్లు వ్యాకులత గోచరిస్తోంది.

పశ్చిమాన నీరెండ లోపలికి ప్రవేశించి.. ఆవరణలో మూల మూలలా, తన హక్కన్నట్లు వ్యాపించింది. వెనువెంటే చల్లగాలి నీకు తోడు నేనున్నానన్నట్లు మెల్లమెల్లగా వచ్చి, చెట్లకొమ్మలతో సయ్యాటలాడుతోంది. జగమంతా ప్రకృతి అధీనం. ఆహ్లాదమైనా, ఆనందమైనా, ఆవేశమైనా, ఆగ్రహమైనా.. సమస్త జీవరాశీ ప్రకృతి మాత లయ విన్యాసాలతో ఆడవలసిందే! రెండు ఉడుతలు, ఒకదాన్నొకటి తరుముకుంటూ చెట్లమీద పరుగులు తీస్తున్నాయి. పక్షులన్నీ కొమ్మలమీద కూర్చుని, ఆ రోజు జరిగిన విశేషాలు కాబోలు. రకరకాల ధ్వనులతో సంభాషించుకుంటున్నాయి. మధ్య మధ్యలో రివ్వు రివ్వున అటూ ఇటూ తిరుగుతూ.

విశ్వనాధం ఇంట్లోనుంచి బైటికి వచ్చి తోటలో పచార్లు చెయ్యసాగాడు. ప్రతీ మొక్కనీ చేతులతో స్పృశిస్తూ పలకరించాడు. తనని చూసి కూడా ఏ మాత్రం బెదరకుండా ఆడుతున్న ఉడుతల్ని చూసి అతని వదనం ఆనందంతో విప్పారింది.

"తోడు జీవితానికి ఎంత ఆనందమిస్తుందో కదా! శ్రీశ్రీ గారన్నట్లు, 'తోడొకరుండిన అదే భాగ్యమూ, అదే స్వర్గమూ!' అయితే ఎవరికైనా ఎవరైనా ఎన్నాళ్లు తోడుండగలరు? ఎప్పటికైనా వంటరి జీవనానికి అలవాటు పడవలసిందే." తనలో తనే పైకి మాట్లాడుకుంటూ, వరండాలో పొడవుగా పరచుకొన్న ఎండపొడలో, లాల్చీ జేబులోంచి తీసి కాసిని జొన్న గింజలు చల్లి, పడక్కుర్చీలో వాలాడు. ఎక్కడ్నుంచి గమనించాయో.. టపటపా రెక్కలు చప్పుడు చేసుకుంటూ వచ్చేశాయి అరడజను పావురాలు. వెంటనే గింజలమీద పడకుండా విశ్వనాధం కాళ్ల దగ్గర తచ్చాడి గింజల వైపుకి మళ్లాయి.

"అన్నపూర్ణ బాగానే అలవాటు చేసింది.." నవ్వుకున్నాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది, ఉండుండి ఉడుతలు చేసే కిచకిచ ధ్వనులు తప్ప. పడక్కుర్చీలోంచే చుట్టూ పరికించాడు విశ్వనాధం. ఒకటో రెండో ఎక్కువగా వెయ్యి గజాలుంటుంది స్థలం. మధ్యలో ఇల్లు కట్టి చుట్టూ జాగా వదిలాడు విశ్వనాధం తండ్రి. అతనికి ఆ ఇల్లు గృహప్రవేశం బాగా గుర్తే.. తను యస్సెసెల్సీలో, తముడు ఫోర్తు ఫారంలో ఉండగా జరిగింది. సరిగ్గా అరవై ఏళ్లయింది. ఇంటి బయటి స్థలమంతా తవ్వించి కొత్త మట్టి వేయించి, షామియానాలు వేశారు. అమ్మా, నాన్నల మొహాల్లో తమ జీవితాశయాన్ని సాధించామన్న గర్వం.. ప్రతీ మాటలోనూ, చేతలోనూ ఆనందం.. నిన్న మొన్న జరిగినట్లుంది.

కొత్త ఇంటికి వచ్చినప్పట్నుంచీ నాన్నతో సమానంగా తను కూడా తోటపని చేసేవాడు. ఇప్పుడు ఎంతో ఎత్తుకి పెరిగిన వృక్షాలన్నీ తామిద్దరూ నాటినవే. కొన్నింటికి కాలం చెల్లి పోతే, మళ్లీ అదే స్థలంలో ఆ చెట్లనే పాతి అమ్మా నాన్నల స్మృతులని, స్పర్శలని నిరంతరం అనుభవిస్తూ వచ్చాడు. ఇంట్లో వాటా వద్దంటే, అప్పటి విలువని చెల్లించి అమెరికాలో స్థిరపడిన తమ్ముడి భాగాన్ని కూడా తనే తీసుకున్నాడు.. ఎప్పుడు వచ్చినా తండ్రి ఇల్లుగానే భావించి స్వతంత్రంగా ఉండాలని మాట తీసుకుని. సంవత్సరం క్రితం వరకూ ఆ విధంగానే గడిచింది..

ఎన్నెన్నిజ్ఞాపకాలు.. ఈ గుమ్మం దగ్గరే అన్నపూర్ణ సిగ్గుతో తన పేరు చెప్పకపోతుంటే చిన్నాన్నగారి అమ్మాయిలిద్దరూ లోపలికి పోనివ్వమని హఠం చేశారు. మొత్తానికి తమ్ముడే, వదినగారి బిడియం పోగొట్టి చెప్పించాడు. వాసు పాకుతూ ఈ గడప దాటినప్పుడే గారెలు చెయ్యాలంటూ అమ్మ హడావుడి చేసి, బంధువులందర్నీ భోజనానికి పిలిచింది. తమ్ముడి పిల్లలిద్దరూ అమెరికాలోనే.. అమ్మా నాన్నల మనవల ముచ్చట్లన్నీ తమ ఒక్కగానొక్క కొడుకు వాసుతోనే జరిగాయి.

"వ్వాటె బ్యూటిఫుల్ గార్డెన్.. స్ప్లెండిడ్.." అమెరికాలో పెరిగిన పంజాబీ కోడలు మెచ్చుకుంటుంటే, అన్నపూర్ణ తన కేసి అభినందనగా చూసిన చూపు మనసులో అలా నిలిచిపోయింది. మన భాష కాదు.. మన ఆచారాలు కాదు.. మన సంస్కృతి కాదు, ససేమిరా వీల్లేదని తను భీష్మించుకుని కూర్చుంటే అన్నపూర్ణ కొడుకు పక్షాన చేరి వాదించడం.. నిన్న మొన్న జరిగినట్లుంది.

"ఏ భాషైతేనేం.. ఎక్కడిదైతేనేం.. ఆడపిల్ల మనసు ఒకటే. పిల్ల చూస్తే సౌమ్యురాల్లాగానే ఉంది. మనం కాదన్నంత మాత్రాన చేసుకోక మానదు. మనస్ఫూర్తిగా కుటుంబంలోకి ఆహ్వానిస్తే మనల్ని తల్లిదండ్రులుగా భావిస్తుంది."

"అంతేలే.. నువ్వు మొదట్నుంచీ స్త్రీవాది వేగా.. నా మాటెక్కడ సాగిందీ!"

"ఏ వాదమయినా నేను న్యాయ పక్షాన నిలబడతాను." మొత్తానికి సంతోషంగానే.. హారతిచ్చి ఆహ్వానించారు, ఈ సింహద్వారం దగ్గరే.. తండ్రి వరంగల్ నుంచి టేకు తెప్పించి చేయించిన తలుపులు.. రాజుల కాలం నాటి డిజైన్. ఇంటికి వచ్చిన వారంతా మెచ్చుకునే వారే.

విశ్వనాథం కళ్లుమూసుకుని అరవై ఏళ్ల కాలగమనాన్ని మనో నేత్రంతో చూసుకున్నాడు.. సంవత్సరాల వారీగా! కన్ను మూసి తెరిచేలోగా కాలం రెక్కలతో ఎగిరినట్లు గడిచి పోయింది.

ఒక్కసారిగా అనేక పక్షులు రకరకాల కూతలు కూసుకుంటూ పైకి ఎగిరిపోయాయి. ఫెళ ఫెళ్లాడుతూ పెద్ద చప్పుడు.. ఉలిక్కిపడి కళ్లు తెరిచి కుర్చీలోనుంచి లేచాడు.

నైరుతి మూలకి కొద్దిగా ఇవతలికి ఉన్న పెద్ద మామిడి చెట్టు శబ్దం చేసుకుంటూ గోడ మీదికి ఒరిగి పోయింది. అందమైన ఆర్చిలతో కట్టిన ప్రాకారం.. ఆ మూలగా పదడుగులు పైన కూలిపోయింది.

ఒక్క క్షణం విశ్వనాథానికి జరుగుతున్నది అర్థం అవలేదు.. మనసంతా స్తబ్దుగా.. శరీరం నిస్త్రాణగా.. స్థంభం పట్టుకుని నీరసంగా నిలబడి మళ్లీ గతం లోకి వెళ్లాడు.

......................................

"లేత మామిడి పిందెలు ఏరుకుని రండి.. టెంక కట్టకూడదు. జీడి లేతగా ఉండాలి. అప్పుడే పులుపు, వగరు కలిసి ఉంటాయి." అన్నపూర్ణ వరండాలో నిలబడి అరిచింది. అప్పుడే స్నానం, తులసి పూజ అయిపోయినట్లున్నాయి. మడి పట్టుచీర కట్టుకునుంది.

ఇంకా తెల్లగా తెల్లారలేదు. మసక చీకట్లో నడుస్తున్న విశ్వనాథం తలూపాడు. ఏమిటో.. చాదస్తం. ప్రతీ ఉగాదికీ ఇలాగే అరుస్తుంది.

"వినిపించిందా.. లేత.." ఇంకా గట్టిగా..

"కింద పడ్డవి ఏరి తెస్తాను. లేతో, ముదురో.. అందులో పక్షులు ఎంగిలి చెయ్యనివి ఏరి తీసుకో!" విశ్వనాథం కేక పెట్టాడు. వరండాకీ చెట్టుకీ మధ్య చాలా దూరమే ఉంది. అరిస్తే కానీ లాభం లేదు.

ఎర్రని చిగుళ్లమధ్యలోనుంచి కోకిల గట్టిగా కూసింది.. ఇది నా సామ్రాజ్యం. ఇక్కడ నీకేం పని అన్నట్లు.

"ఐదు నిముషాలు.. వెళ్లిపోతా. అక్కడ అమ్మ గొడవపెడుతుంది. తెలుసుకదా!" కోకిల అర్థమైనట్లు నెమ్మదిగా కూ.. అంది.

"త్వరగా స్నానం చేసి రండి. ఇవేళ పూజ అయ్యాకే కాఫీ!"

"పూజకీ కాఫీకీ సంబంధమేమిటో.." గొణుక్కుంటూ స్నానం చేసి అర్ధాంగి చెప్పినట్లే చేశాడు.

"ముందుగా ఉగాది పచ్చడి తిన్నాకే ఇవేళ ఏదయినా.."

"అబ్బా! నా వల్లకాదే ఇంక.. కాఫీ ఇస్తావా లేదా!" ఇంక ఓపిక లేదు..

"సరి సరి.. ఒక్క నిముషం. బట్టలు మార్చుకుని రండి." ఎప్పుడు తెల్ల జెండా ఊపాలో బాగా తెలుసు.

"అయ్యగారూ! కాఫీ.."

"వద్దులే.. ముందు పచ్చడే పెట్టు.."

వంటమనిషి బిత్తరపోయింది.

"అయ్యగారూ! కుర్చీలో కూర్చోండి. అబ్బాయి వచ్చేస్తాడు. ఒంట్లో ఎలా ఉంది?" గాభరాగా కాఫీ గ్లాసు బల్ల మీద పెట్టి, విశ్వనాథాన్ని చెయ్యి పట్టుకుని తీసుకెళ్లి పడక్కుర్చీలో కూచోపెట్టి, గ్లాసు చేతికిచ్చింది.

"అబ్బే! ఏం లేదు సుందరమ్మా! ఏదో జ్ఞాపకం వచ్చింది." కాఫీ చప్పరిస్తూ అన్నాడు. సరిగ్గా సాయంత్రం ఆరుగంటలకి కాఫీ అలవాటు చేసింది అన్నపూర్ణ. ఏమిటో ఈ అలవాట్లన్నీ.. తల విదిలించాడు.

"అయ్యగారూ.. చెట్టు పడిపోయిందే.. మధ్యాన్నం అంతా కరెంటు రంపంతో కోసి, ఎప్పటికీ పడకపోతుంటే, రేపొస్తామని వెళ్లారు పనివాళ్ళు. అబ్బో.. ఎన్ని కాయలో. ఇవన్నీ ఏం చేస్తారండీ?"

"మీ పిల్లల్ని తీసుకొచ్చి అన్నీ నువ్వే పట్టుకెళ్లు. వాడుకున్నన్ని వాడుకుని మిగిలినవి పంచిపెట్టు. అమ్మగారికి అమ్ముకోవడం ఇష్టం ఉండదు. జాగ్రత్తగా కోసుకోవాలి. చెట్టుకొమ్మలు అడ్డదిడ్డంగా పడిపోయుంటాయి.. గుచ్చుకోగలవు."

"అలాగే అయ్యగారూ.." సుందరమ్మ సంబరంగా ఖాళీ గ్లాసు తీసుకుని లోపలికి వెళ్లింది.

.......................................

ఏమంత పెద్ద ఒడిదుడుకులు లేని జీవితం విశ్వనాథానిది. ఒక జాతీయ బాంకులో కొన్ని ఉన్నత పదవీ సోపానాలు ఎక్కి, దూర ప్రదేశాలకి బదిలీ అయితే కొన్ని వదులుకుని, మానేజరుగా రిటైర్ అయ్యాడు.

నిస్సహాయంగా ఒరిగిపోయిన మామిడి చెట్టునే చూస్తున్నాడు. చిత్రంగా.. అతని కళ్లలోకి చెమ్మ రాలేదు. నిజం చెప్పాలంటే ఇంటి కంటే ఆ చెట్టుతోనే తమకి అనుబంధం ఎక్కువ. ఆ చెట్టుకి మొదటి కాయ కాసినప్పుడు తనూ, తమ్ముడూ సంబర పడిపోవడం.. అది ఎంత పెరిగిందో రోజూ చూస్తూ ఉండడం, చివరికి రేపో ఎల్లుండో కోద్దామనుకుంటుండగా.. ఎక్కడ్నుంచి వచ్చిందో కోతి, పొట్టకి పిల్లని కరిచి పెట్టుకుని మరీ.. దోరగా, ముగ్గ బోతున్న కాయని కోసేసి, పారిపోవడం.. అదీ తమని చూసి వెక్కిరిస్తూ.. తను మూడు రోజులు పైగా ఆ కాయని తలుచుకుని బాధ పడుతుంటే,

"వెర్రి నాయనా! ఆంజనేయ స్వామే వచ్చి తీసుకుపోయాడనుకో! వచ్చే ఏటి నుంచీ లెక్కలేనన్ని కాయలు కాస్తాయి." అమ్మ బుజ్జగించి అన్నం కలిపి నోట్లో పెట్టడం..

పడక్కుర్చీలో తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకున్నాడు విశ్వనాథం.

అమ్మ చెప్పినట్లే మరుసటేడు నుంచీ లెక్క పెట్టలేనన్ని కాయలు. ఆవకాయ పెట్టుకున్నాక, ముగ్గేస్తే తియ్యని రసాలు.. ఆ రుచి తలుచు కుంటేనే విశ్వనాథానికి నోరంతా తియ్యగా అయిపోయింది. తోటలో ఎన్ని చెట్లున్నా ఈ మామిడి చెట్టంటే ప్రత్యేక అభిమానం తమందరికీ. ఈ చెట్టుకిందే అప్పుడప్పుడు వన భోజనాలు చేసే వాళ్లు.. అదే ఊర్లో ఉన్న చిన్నాన్నగారి కుటుంబం కూడా వచ్చేది. వాళ్ల అమ్మాయిలిద్దరూ వదిన గారిని ఆటపట్టిస్తూ ఉంటే.. అందరూ సరదాగా పేక కలుపుతే, సాయంత్రం ఎలా అయిందో తెలిసేది కాదు.

"నాన్నా! ఏదీ గాని వేళ నిద్ర పోతున్నారా?" వాసు కుర్చీ దగ్గరగా జరుపుకుని కూర్చున్నాడు.

"నీకు ఇంకా ఈ సంగతి గుర్తుందిరా!" ప్రసన్నంగా అన్నాడు విశ్వనాథం.

"ఊహ తెలిసినప్పట్నుంచీ చేసిన అలవాట్లు ఎలా మర్చిపోతాను? ఇప్పటికీ వీలున్నప్పుడు, ఈ సంధ్యా సమయం.. ఒక పావుగంట పచార్లు చేస్తూ, అస్తమిస్తున్న సూర్యుడ్ని మధ్యలో గమనిస్తూ.. ఏ ఆలోచనా లేకుండా తిరుగుతుంటాను. ఆ తరువాత మనసులో ఎంత ప్రశాంతంగా ఉంటుందో! పగలంతా పనులు చేసి, అలసి పోయిన శరీరం, మనసు.. రాత్రి తీసుకునే విశ్రాంతిలోగా ఈ విధంగా ఏ పనీ చెయ్యకుండా ఉంటే రిలాక్స్ అవుతాయని చెప్పింది అమ్మ. నిజమే కదా!" తండ్రి చేతి మీద చెయ్యి వేసి నిమురుతూ అన్నాడు వాసు.

విశ్వనాథం, అవునన్నట్లు తలూపి మామిడిచెట్టుకేసి దృష్టి సారించాడు.

"అరే! సాయంత్రం వరకూ మొరాయించి ఇప్పుడు పడి పోయిందే చెట్టు!"

"అవును. పద చూద్దాం." ఇద్దరూ, తోటలో లైట్లు వేసి అటు పక్కగా నడిచారు.

.......................................

వంద అడుగుల దూరం నుంచే ఎక్కడా నడవడానికి వీల్లేకుండా ఉంది. చెట్టుకి చిన్న పిందెల దగ్గర్నుంచీ, ముదిరిన కాయల వరకూ ఉన్నాయి. కింద పడినవి ఎక్కడెక్కడికో దొర్లి పోయి.. కాళ్ల కింద పడుతూ.. విశ్వనాథం జారబోయాడు. వాసు, చటుక్కున పట్టుకున్నాడు.

"మీరు నడవలేరు నాన్నా! లోపలికి వెళ్దాం పదండి."

చెట్టుని దీర్ఘంగా పరికించి, వాసు ఆసరాతో ఇంట్లోకి నడిచాడు విశ్వనాథం.

"ఇంత బాధ పడుతూ ఎందుకు తీసుకున్నారు ఇటువంటి నిర్ణయం? మీకు ప్రాణప్రదమైన ఈ ఇల్లు అమ్మెయ్య వలసిన అవసరం ఏమిటి?" విశ్వనాథానికి ఇష్టమైన పడక్కుర్చీలో కూర్చోపెడుతూ అడిగాడు వాసు.

"మీ తాతగారు ఈ ఇల్లు కట్టినప్పుడు ఇక్కడంతా గుట్టలు, కొండలు, లోయలు. సరైన రోడ్లు కూడా లేవు. కిలోమీటరు పైగా నడిచి బస్ స్టాప్‌కి వెళ్లే వాళ్లం. కాలక్రమేణా నగరంలో ఇటు ప్రక్క అభివృద్ధి బాగా జరిగి, ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఇక్కడి సదుపాయాలు కూడా మనందరం బాగా అనుభవించాం. గత పదేళ్లుగా మేమిద్దరం ఆలోచిస్తూనే ఉన్నాం, ఏం చెయ్యాలా అని! అదే.. ఒంటరిగా మిగిలిపోయినప్పుడు. వేదాంత మార్గంలోకి వెళ్లి భవబంధాలకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాం. క్రిందటి ఉగాదికి హడావుడి చేసిన మీ అమ్మ, ఈ ఉగాదికి లేదు. ఇద్దరం కలిసి అనుకున్నదే అమలు చేస్తున్నా. మీరు ఇంక అక్కడే స్థిరపడతామని చెప్పారు. అందుకని, నాకున్నదంతా అమ్మేసి నీకు ఇచ్చేద్దామని అంతా ఏర్పాటు చేశాను. ఈ తోటా, ఇల్లూ అంటావా.. ఇప్పుడు కాకపోతే ఇంకొక రెండేళ్లు.. ఎప్పటికైనా చుట్టుపక్కల వచ్చినట్లు అపార్ట్‌మెంట్లు రావలసిందే. ఇదొక్కటే కొండల మధ్య లోయ అయిపోయింది ఇప్పటికే. అందుకే అమ్మేశాను. నాలుగు రోజుల్లోగా ఇల్లు ఖాళీ చెయ్యాలి. నేను ఋషీకేశ్‌లో స్వామీజీ ఆశ్రమంలో చేరిపోదామని నిశ్చయించుకున్నాను. అందులో ఉండడానికి ఒక కుటీరం, భోజనం వంటి ఏర్పాట్లు ఇదివరకే చేశాను."

"అదేంటి నాన్నా! మీరు కూడా మాకు దూరంగా ఉంటారా?" వాసు గద్గద స్వరంతో అడిగాడు.

"మేం ఎప్పట్నుంచో దూరంగా ఉన్నాం.. భౌతికంగా సరే అనుకో! మానసికంగా కూడా. నువ్వు గమనించ లేదేమో కానీ!"

వాసు మౌనంగా ఉండిపోయాడు. పదేళ్ల నుంచీ ఎన్ని సార్లు రమ్మన్నా అమ్మా, నాన్నా తన దగ్గరికి రాలేదు. తామే మూడుసార్లు వచ్చారు. వచ్చినప్పుడల్లా.. చుట్టాలు, స్నేహితులూ, షాపింగులూ అంటూ తిరగడమే కానీ, ఇంట్లో స్థిరంగా ఒక పూట గడపలేదు.

"నాకు మీ పేరెంట్స్ అంటే ఇష్టం.. ఎందుకంటే, వాళ్లు మన దగ్గర్నుంచి ఏమీ ఆశించరు.. డబ్బు కానీ, సమయం కానీ. అధికారం చెలాయించరు. ఎప్పుడూ చిరునవ్వుతో స్వాగతిస్తారు." భార్య ఎప్పుడూ అంటుంటే గర్వంతో పొంగిపోయాడు.

"ఇందులో నీ తప్పేం లేదు. మా దగ్గర లేవని కోపంతోనో, రోషంతోనో ఈ నిర్ణయం తీసుకోలేదు. హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం ఉన్న నాలుగు వర్ణాశ్రమ ధర్మాలు పాటించాలని ఎప్పుడో అనుకున్నాం మీ అమ్మా, నేనూ. బ్రహ్మచర్యం, గృహస్థ ధర్మాలు సరిగ్గానే పాటించాను.. నాకు సాధ్యమయినంత వరకూ నిన్నూ, అమ్మనీ ఎప్పుడూ కష్టపెట్టలేదు. అడిగింది కాదనలేదు. ఇంటికి వచ్చిన అతిథులని ఆదరిస్తూనే వచ్చాము. చుట్టు ప్రక్కల వారిని సంతోష పెడుతూ వచ్చాము. తల్లి దండ్రులని చివరి వరకూ గౌరవంగా చూసి సేవ చేసుకున్నాం. మూడవది వాన ప్రస్థం. అదే ఇందాకా నీకు చెప్పింది. మేమిద్దరం ఆధ్యాత్మిక మార్గానికి మళ్లి పది సంవత్సరాలయింది. అందులో భాగంగానే నాకున్నదంతా నీకు ఇచ్చేశాను. ఇంక మిగిలింది సన్యాసం. అదే ఇప్పుడు తీసుకుందామని నిర్ణయించుకున్నాను. ఈ విధంగా మన పెద్దలు చాలా మంది తీసుకున్నారు."

"మరి.. మీరు ఒక్కరూ ఉండ గలరా? డయాబెటిక్ కూడానూ.. నాతో మిమ్మల్ని తీసుకు పోదామని అన్ని ఏర్పాట్లు చేసుకుని వచ్చాను. మీరూ, అమ్మా ఒకరికొకరు తోడుగా ఉన్నారు కదా అని ఇన్నాళ్లూ బలవంతం చెయ్యలేదు."

"నిజమే.. వయసు, శరీరం సహకరించవు కనుకనే 'కుటీచకుడిగా' ఉండిపోదామనుకుంటున్నాను."

"అంటే.."

"సన్యాసం.. లేదా సర్వసంగ పరిత్యాగం నాలుగు రకాలు. అందులో మొదటిది కుటీచకం. బహూదకం, హంస, పరమహంస మిగిలిన మూడు రకాలు. చివరి రెండూ.. ఆది శంకరులు, రామకృష్ణ పరమ హంస వంటి మహాత్ములు పాటించినవి. బహూదకుడు ఒక చోట ఉండ కూడదు. బిచ్చ మెత్తుకుని జీవించాలి. ఇంక మొదటి సన్యాసి.. కుటీచకుడు, ఒక కుటీరంలో అన్ని ఏర్పాట్లు చేసుకుని, ధ్యానం, యోగం చేస్తూ.. బ్రతకడానికి మాత్రమే తింటూ జీవించాలి. అందరూ సుఖ దుఃఖాలకి అతీతంగా ఉండాలి. ఆహార్యం కంటే.. మానసికమైన స్థిరత్వం ముఖ్యం. ప్రశాంతమైన ప్రకృతి స్థిర చిత్తానికి ఎంతో సహకారం చేస్తుంది. అమ్మ ఉన్నప్పుడు ప్రతీ ఏడూ ఋషీకేశ్ లో కొన్ని నెలలు ఉంటూ వచ్చాము. మాకు బాగా నచ్చింది."

"సరే నాన్నా! మీ ఇష్టం. నాకు రెండు కోరికలున్నాయి. అవి కూడా మీరు తీర్చేస్తే నేను సంతోషంగా ఒప్పుకుంటాను. నాకోసం ఇంత చేసిన మీకు ఇవేం పెద్ద కష్టం కాదు."

ఏమిటవి అన్నట్లు చూశాడు విశ్వనాథం.

"నేను ఋషీకేశ్ వెళ్లి ఆశ్రమం చూసి వస్తాను. నా తృప్తి కోసం. మీరు అక్కడికి వెళ్లే ముందు నాదగ్గర రెండునెలలైనా ఉండాలి. ఆ తరువాత మీ ఇష్టం. ఈ లోగా నేను ఒక సారి అమెరికా వెళ్లి రావాలి.. అర్జంట్ పనొకటి చేసుకోవాలి."

"నీ మాట ఎందుకు కాదనాలి.. అలాగే కానీ. నేను కూడా ఇక్కడ ఒక నెల ఉండాల్సొచ్చేట్లుంది. రెండు మూడు స్థలాలున్నాయి.. అవి కూడా అమ్మేయాలి. పక్క సర్వీస్ అపార్ట్‌మెంట్లో ఒక ఫ్లాట్ తీసుకున్నా. అక్కడికి మారాలి నాలుగు రోజుల్లో."

..........................................

"ఆయియే పప్పాజీ!"

కాలింగ్ బెల్ మోత వినగానే తలుపుతీసిన కోడలు, వంగుని పాదాభివందనం చేసింది.

"హాడ్ ఎ నైస్ జర్నీ!" వాసుని చూసి చిరునవ్వుతో చేతిలోని బాగ్ తీసుకుంది.

"తాతగారూ.." పది హేనేళ్ల మనుమరాలు, పన్నెండేళ్ల మనుమడు.. కాళ్లకి నమస్కారం చేసి, సంభ్రమంగా చూస్తూ నిల్చున్నారు. తెల్లని పైజామా, లాల్చీతో, కనుబొమ్మల మధ్య చిన్న కుంకం బొట్టుతో విశ్వనాథం వింత వెలుగుతో ప్రకాశిస్తున్నాడు. నవ్వుతూ ఇద్దర్నీ దగ్గరికి తీసుకుని, తల మీద చెయ్యి పెట్టి ఆశీర్వదించాడు.

"తాతగారి సామాన్లు లోపలికి తీసుకురండి. మీరు రండి నాన్నా! మేం ఈ ఊరు వచ్చాక మీరు రాలేదు కదూ.. మీ వసతి చూపిస్తాను." వాసు లోపలికి తీసుకెళ్లాడు.

వాసు ఉన్న ఊరు పసిఫిక్ మహా సముద్రాన్ని ఆనుకుని ఉన్న కొండల మధ్య ఉంది. పచ్చని ప్రకృతి, సరోవరాలు, ఆ ఊరి ప్రత్యేకతలు. వాసు ఎప్పటి నుంచో అక్కడ స్థిరపడిన వైద్యుడు. ఎకరం పైగా ఉన్న ఆవరణ.. లాన్లు, ఆకాశాన్నంటే సెడార్ చెట్లు.. మధ్యలో ఒక కాలువ పాయ కూడా ఉంది.

తండ్రిని, ఇంటినానుకుని ఉన్న ఒక భాగానికి తీసుకెళ్లాడు వాసు. ఆనుకునే ఉంది కానీ.. ప్రత్యేకంగా ఉంది, ఇంటితో సంబంధం లేకుండా. పెద్ద హాలు లాంటి గది.. కిటికీలకి పాకిన పూల తీగలు.. కావలసినంత మాత్రమే ఉన్న సామాను. ఒక పక్కగా విశ్వనాధానికి ఇష్టమైన.. పార్వతీ పరమేశ్వరుల ఫొటో. ఇండియాలోని తమ పూజగదిలోనుంచి పట్టుకొచ్చాడు వాసు. ఎదురుగా నేల మీద పరచిన కృష్ణాజినం. అది కూడా అక్కడిదే.

అక్కడి ఏర్పాట్లు చూడగానే విశ్వనాథం కళ్లు పెద్దవయ్యాయి.. సాలోచనగా.

"ఇట్రండి నాన్నా!" క్రిష్ణాజినం ఎదురుగా ఉన్న కిటికీకి ఉన్న తెర తొలగించాడు వాసు. పచ్చని చెట్లతో నిండిన కొండలు, లోయలు.

తండ్రి చెయ్యి పట్టుకుని వెనుక ఉన్న డెక్ మీదికి తీసుకెళ్లాడు. ఋషీకేశ్ లోని ప్రకృతి అందాలకి ఏ మాత్రం తీసిపోకుండా ఉంది అక్కడ.

అంతలో వాసు పిల్లలిద్దరూ విశ్వనాథం పెట్టె తెచ్చి, అందులోవన్నీ సర్దేశారు,

హాల్లోనే ఒక పక్కగా పుస్తకాల అల్మారా.. అందులో విశ్వనాథం చదివే వేదాంత సంబంధిత పుస్తకాలన్నీ ఉన్నాయి.

"అక్కడ మనింట్లో మీ లైబ్రరీలో ఉన్నవన్నీ రాసుకుని ఆర్డరిచ్చి తెప్పించాను." విశ్వనాథం కనుబొమ్మలు పైకి లేపి చూస్తుంటే అన్నాడు వాసు.

"పప్పాజీ! ఆప్ ఫ్రెష్ అప్ కర్‌కే ఆయియే! కాఫీ రెడీ.." తల మీదినుంచి చున్నీ కప్పుకుని ఫ్లాస్క్, స్టీలు గ్లాసు తీసుకుని వచ్చింది కోడలు.. పెద్ద ఇంట్లోనుంచి ఉన్న తలుపు తీసుకుని.

విశ్వనాథం భ్రుకుటి ముడిచి చూశాడు. ఇదంతా ఏమిటి అన్నట్లు.

"ఇది మీ కుటీరం నాన్నా! మీరు ఇక్కడే సన్యాసిగా ఉండచ్చు. మిమ్మల్ని అందరం స్వామీజీ అనే పిలుస్తాం. మమ్మల్ని మీ శిష్యులుగా భావించండి. ఋషీకేశ్ వెళ్లినప్పుడు అక్కడి పెద్ద స్వామీజీని అడిగాను. కుటీచకుడికి ఇంకొక నిర్వచనం కూడా చెప్పారు. కొడుకు కట్టించిన కుటీరంలో ఉంటూ.. వారు పెట్టింది మాత్రమే తింటూ, ధ్యాన యోగ వేదాంత పరమైన జీవనం చేసే వాళ్లు కూడా కుటీచకులే. తనకి తెలిసింది నలుగురికీ పంచడం కూడా వారి బాధ్యతే. ఇక్కడ యాభై దాటి ఆధ్యాత్మిక మార్గం వైపుకి మార్గదర్శకం చేసే గురువు కోసం కొంతమంది చూస్తున్నారు. మీకు ఇష్టమైతే ప్రతీ శనివారం సత్సంగం చేసుకోవచ్చును.

మీరు ఇక్కడే ఉండి పోవాలని మా కోరిక. మీరు గృహస్థ ధర్మాలు నెరవేర్చినట్లు, మేం కూడా చేసుకునే అవకాశం ఇమ్మని కోరుతున్నాను. మీకు ఏ ఇబ్బందీ కలుగకుండా చూసుకునే బాధ్యత నాది. ఇదిగో.. మీ పాస్పోర్ట్.. ఏడాది లోపు ఎప్పుడైనా వాడుకోగలిగే రిటర్న్ టికెట్. అన్నట్లు.. మీరు ఇచ్చినదంతా స్వామీజీ నడిపే అనాధశరణాలయానికి ఇచ్చేశాను. ఇంక మీ ఇష్టం."

వాసు భార్యా, పిల్లలతో సహా సాష్టాంగ నమస్కారం చేసి, తన ఇంటి వైపుకి వెళ్లి పోయాడు.

..................................

ఆరునెలల తరువాత.. విశ్వనాథం తెల్లవారుఝామునే లేచి స్నానం చేసి, సూర్యనమస్కారాలు చేశాక.. ఫ్లాస్కులో ఉన్న పాలు తాగాడు. అప్పుడే హాస్పిటల్‌కి వెళ్లబోతూ వచ్చి పాదాభివందనం చేసిన వాసు చేతిలో పాస్‌పోర్ట్, టికెట్ ఉంచాడు.

"ఏ కుటీరమైనా ఒక్కటే.. ఇక్కడి పదిమందికీ ఉపయోగ పడేలా ఉన్నప్పుడు.. ఆ పరమేశ్వరుడి ఆజ్ఞ అనుకుంటాను." కృష్ణాజినం మీద కూర్చుని, ధ్యానం లోకి వెళ్లిపోయిన స్వామీజీని చూసి తృప్తిగా వెనుతిరిగాడు వాసు.

# కథ వెనుక కథ

మా తరంలో చాలా మందికి పిల్లలు విదేశాల్లోనే ఉంటున్నారు. ఏ నలుగురు కలిసినా భవిష్యత్తేమిటి అనే ప్రశ్న ఉదయించక మానదు. ఇద్దరూ ఉన్నప్పుడు ఫరవాలేదు.. ఒకళ్లు జబ్బు పడినా, ఇంకొకరు పడుతూ లేస్తూ పని వాళ్ల సహాయం తీసుకుని నడిపించ వచ్చు బండి.

అదే.. ఒకళ్లు ఒంటరిగా మిగిలిపోతే ఏం చెయ్యాలి..

తలుచు కుంటేనే భయం..దడ, వణుకు. కానీ ఆ స్థితి తప్పనిదే.

మా మేనకోడలు శుభ వచ్చినప్పుడు ఈ చర్చ వచ్చింది. పిల్లల దగ్గరైతే మళ్లీ సంసారం.. బాధ్యతలు. అప్పుడేనా ఆధ్యాత్మికత ఉండాలి కదా. ఏదైనా ఆశ్రమానికి వెళ్లి ప్రశాంతంగా, భవభంధాలకి అతీతంగా బ్రతకడమే మంచిదన్నాను.

అదే.. ఆశ్రమానికి వెళ్ల నక్కర్లేకుండా, అందరితో ఉంటూనే అతీతంగా ఉండచ్చు.. ఆ విధంగా ఉండే వాళ్లనే కుటీచకుడు అంటారు. అది సన్యాసంలో ఒక విధం అని చెప్పింది తను.

అప్పటి వరకూ సన్యాసుల్లో అన్ని రకాలుంటారని తెలియదు. కొంత శోధన చేసి కుటీచకుడు కథ రాశాను.

బహుమతి ఇచ్చి ప్రోత్సహించిన కౌముది నిర్వాహకులకి ధన్యవాదాలు.

# రెప్పపాటు ప్రయాణం — శారద పోలంరాజు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

"అబ్బో అప్పుడే పదకొండయిందే. ఆయనగారి ధర్మ సందేహాల కార్యక్రమం అయిపోయినట్టున్నది. టివి నోరుమూతపడింది. ఇంక పడుకోవాలి. అయినా పొద్దున్నే లేచి చేసే రాచకార్యాలు ఏమున్నాయి కనుక. ఇద్దరికి వంట చేయటానికి అరగంట సమయం చాలు. ఆ తర్వాత రోజంతా కాళ్ళు బారచాపి కూర్చోవటమేగా! ఈ ఒక్క కథ చదివి షట్ డౌన్ చేయొచ్చులే." అన్ని స్వగతాలే.

గోడకు ఏటవాలుగా దిండ్లు ఆనించుకొని మంచం మీద వాలుగా పడుకొని వళ్ళో పుస్తకం సైజ్ లో వున్న లాప్‌టాప్‌లో అంతర్జాల పత్రికలు బ్రౌస్ చేస్తూంటే టైమే తెలియటం లేదు.

"ఎవడు కనిపెట్టాడోకాని ఈ నోట్‌బుక్, వాడి జన్మ ధన్యం. అమ్మో! తెలుగులో ఇన్నన్ని అంతర్జాల పత్రికలు వస్తున్నాయని తెలియను కూడా తెలియదే! రూపాయి ఖర్చులేకుండా, ఇంకొకరికి డిస్టర్బెన్స్ లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రచురితమవుతున్న సాహిత్యమంతా హాయిగా చదివేయవచ్చు. కాలక్షేపానికి కాలక్షేపం. సాహిత్యప్రియులకు కడుపునిండా మేత. ఇంట్లో పాత పత్రికల చెత్త పోగెయ్యకుండా ఎప్పుడు

కావాలంటే అప్పుడు పాత సంచికలు కూడా మళ్ళీమళ్ళీ తిరగెయ్యవచ్చు. ఎన్ని లైబ్రరీలు తిరిగినా ఇంత మేత కాదు కదా ఇందులో గడ్డిపోచంతైనా దొరకదు. అయినా కొమ్మూరివారి నవలలు ఎప్పుడో చిన్నప్పుడు చదివాము. ఈ అంతర్జాల పత్రికల పుణ్యమాని మళ్ళీమళ్ళీ చదివే అవకాశం వచ్చింది."

పదేళ్ళ క్రితం కాలేజీలో జరిగిన చర్చ గుర్తుకొచ్చి నవ్వొచ్చింది. "త్వరలో పేపర్లెస్ సొసైటీ వస్తుందండీ." ఎవరో అనగానే ఒక వితండవాది ఒక్కసారి నాలుక చప్పరించేసాడు. "ఆఁ సింగినాదం కాదూ, ఈ జన్మలో అది సాధ్యం కాదు. ఏదో టైప్‌రైటర్ బదులు టిక్కుటిక్కు మంటూ కంప్యూటర్‌మీద నాలుకు లెటర్లు కొట్టగానే పేపర్లెస్ అయిపోతుందా ఏమిటి?" అతను ప్రతి మాటకూ సింగినాదం కాదూ, అనటం ఒక అలవాటైనందున అతని పేరేమర్చిపోయి సింగినాదం గారు అనటం అలవాటయింది.

"ఎవరికైనా దమ్ముంటే చెప్పండి. పేపర్ వాడకం లేకుండా అఫీషియల్ ఫైల్స్ ఎట్లా కదుల్తాయి? అరే, మీకేమండీ కలలు కంటూ కూర్చోండి. నోట్లో సిగరెట్ పెట్టుకొని ఒక చేత్తో కాఫీగ్లాసు పట్టుకొని పెరట్లో కుర్చీ వేసుకొని న్యూస్‌పేపర్ చదవటం, ఒక పుస్తకం చేత్తో పట్టుకొని కూర్చోవటంలో వున్న ఆనందం ఈ బోడి మిషన్ల వల్ల ఎక్కడుంటుంది?"

"అదేంటండీ, లాప్‌టాప్‌లు వున్నాయి. ఇంటర్నెట్‌లో ఈ బుక్స్ ఎన్ని అందుబాటులో లేవు? న్యూస్‌పేపర్ల కోసం తెల్లారే దాకా ఎదురు చూడకుండా అర్ధరాత్రయ్యేటప్పటికే చదవవచ్చు. వుత్తరాలకోసం రోజుల తరబడి పోస్ట్‌మాన్ కోసం ఎదురు చూపులు చూడక్కరలేదు. అక్కడ వుత్తరం టైప్ చేసి బటన్ నొక్కగానే ఇక్కడ ప్రత్యక్షం."

"ఆఁ సింగినాదం కాదూ. ప్రయాణం చేసేటప్పుడు హాయిగా పై బెర్త్ మీద పడుకొని పుస్తకం చదవటంలో ఎంత ఆనందం వుందో మీకేం తెలుసు?"

ఆ సంభాషణ గుర్తుకొచ్చి సింగినాదం గారు ఎక్కడున్నారో? ఇంకా వితండవాదన చేస్తూనే వుంటాడేమో?

ఆఫీసులలో ఒకరికి ఒకరు మెసేజి పంపించాలంటే ఆన్ లైనే. హాయిగా ట్రైన్లో ఫ్లైట్లో కూడా ఎంత ఆనందంగా ఎంజాయ్ చేస్తున్నారో కదా! పుస్తకాల కన్నా ఈ ఒక్క బుజ్జి పెట్టె, ఒక డాటా కార్డ్ వుంటే చాలు. హాయిగా ఆఫీసు పని చేసుకోవచ్చు. వెబ్‌కెమెరాలో ఎక్కడెక్కడి వాళ్ళనైనా చూస్తూ కబుర్లు చెప్పుకోవచ్చు. మధ్యమధ్యలో రిలాక్సేషన్ కోసం సినిమాలు చూడవచ్చు. పడుకొనేటప్పుడు హాయిగా మాగజైన్స్ చదవవచ్చు. పుస్తకాలకన్నా ఇదే నయం. ఇంకొకరికి లైట్ వేసి డిస్టర్బ్ చేయనక్కరలేదు. చిన్నప్రింట్ తో ఇబ్బంది పడనక్కరలేకుండా ఎంత కావాలంటే అంత సైజ్ జూం చేసుకోవచ్చు. పేపర్ అటుఇటు తిప్పకుండా ఒక్క వేలితో బటన్ నొక్కితే చాలు. ప్రపంచమంతా మన గుప్పిట్లోనె వున్నట్టు ఫీలింగ్.

ఇదేదో కంపెనీ తరపున వకాల్తా పుచ్చుకొని వాదిస్తున్నట్టు వున్నది. ఆలోచనలతో పాటే కథ చదవటం పూర్తయింది.

"అయ్యో ఈబెడ్ పక్కన లైట్ స్విచ్ ఈ రోజు కూడా బాగు చేయించలేదు. అబ్బ ఇప్పుడు లేచి లైట్ ఆపాలంటే బద్ధకం. గుడ్. ఒక ఐడియా. నా జీవితాన్నే మార్చేస్తుంది." సెల్‌ఫోన్ అందుకొని మిస్డ్‌కాల్ ఇచ్చి చటుక్కున దుప్పటి కప్పుకొని పడుకొంది.

తలుపు తెరిచి లోపలికి తొంగి చూస్తూ, "ఏమిటోయ్ ఈ వేళ్టప్పుడు? ఇంకా పడుకోలేదా?" అన్న ప్రశ్నకు,"ప్లీజ్ లైట్ ఆపండి. లేవాలంటే బద్ధకం." అన్నది నవ్వుతూ.

"యూ ఇడియట్. ఏం అవసరం వచ్చిందోనని కంగారు పడ్డాను. ఇంకనైనా ఇట్లాంటి అల్లరి మానవా?"

"లేదు మానవా, నేను మానను. థాంక్యూ ఇంక పోయి నిశ్చింతగా పడుకోండి."

★★★

"అబ్బో అప్పుడే టైం తొమ్మిదయిందే. ఆయనగారి గదిలో టివి వినిపిస్తున్నది."

"లేచావా? ఇదిగో నీ కాఫీ."

"అప్పుడే కలిపి పెట్టేసారా? అంటే చల్లటి కాఫీ నా మొహాన పడేయటానికి నిశ్చయించుకున్నారన్నమాట."

"అబ్బ లేదు లేవోయ్. నువ్వు బాత్రూం లోంచి బయటికి వచ్చిన అలికిడి విని తెచ్చి పెట్టాను. కుక్కర్లో ఇడ్లీ కూడా పెట్టాను. ఆ చట్నీ ఏదో చేసేస్తే అది కూడా లాగెయ్యవచ్చు."

"అదీ గుడ్ బాయ్ లక్షణాలు. అది కూడా మీరే చేసేయకపోయినారా? ఆడది వంటచేస్తే బాధ్యత, మగాడు చేస్తే కళ అని ఇంగ్లీష్ వింగ్లీష్ లో చెప్పారుగా! సరే ఈ వేళ్టికి కళను పక్కన పెట్టి బాధ్యతనే నిర్వహిద్దాం"

టిఫిన్ అయింది. మళ్ళీ ఇంకో రౌండ్ కాఫి కూడా అయింది. ఇద్దరూ చెరొక న్యూస్‌పేపర్ పట్టుకొని కూర్చున్నారు. మళ్ళీ రొటీన్.

"అయ్యబాబోయ్. మీ పుత్రికా రత్నం పెందరాడే లేపమంది. తొమ్మిదికల్లా సెమినార్ ఎటెండ్ అవాలట. మర్చేపోయాను. మళ్ళీ చెండుకు తింటుంది." ఫోన్ అందుకో బోయింది.

"రిలాక్స్. ఆపని నేనెప్పుడో చేసాను. అది లేవటం సెమినార్‌కు వెళ్ళటం కూడా అయింది."

"అయినా వెధవ గారాబం చేసి దాన్ని చెడగొట్టారు. ఇక్కడున్నన్నాళ్ళూ మేలుకొలుపులంటే ఏదో అనుకోవచ్చు. డిల్లీలో వుద్యోగం చేసుకుంటూ కూడా ఈ మేలుకొలుపులేంటండీ బాబూ? రోజూ ఫోన్ చేసి నిద్ర లేపలేక చస్తున్నాను."

"అబ్బో. అక్కడికి రోజూ తెల్లారే లేచి నువ్వే దాన్ని లేపుతున్నట్టు పోజులొకటా! చూస్తాముగా, అమెరికాలో వున్న తమరి పుత్రరత్నం గారు నిద్ర లేపమని ఆర్డరిచ్చాడుగా. ఇంక సాయంత్రం ఆరింటినుండి మొదలవుతుంది మీ ఇద్దరి భాగోతం. లేవరా నాన్నా, అని ఒకసారి. బ్రష్ చేసుకొని కాఫీ తాగరా కన్నా అంటూ ఒకసారి. ఒరేయ్ టైం అయిపోతోంది త్వరగా స్నానం కానీయరా అంటూ కనీసం పది ఫోన్‌కాల్సు అయినా లేకపోతే ఆయనగారు ఆఫీసుకు వెళ్ళినట్టే."

"చాల్లేండి మాటికి ముందు వాడిని ఆడిపోసుకోవటమే మీ పని."

★★★

"నాన్నా, తొందరగా బయలు దేరరా. అన్నీ తీసుకున్నావా? మొబైల్ ఆన్లోనే వుంచు. నాన్న నీతో తరువాత మాట్లాడుతారుట. టేక్ కేర్ కన్నా.బై."

"అయిందా తమరి పుత్ర రత్నాన్ని ఆఫీసుకు పంపటం? ఇంక బయల్దేరుదామా?

"అయినా ఇదెక్కడి మాయదారి గోలో? ఢిల్లీకెళ్ళినా అమెరికాకెళ్ళినా వీళ్ళను మేలుకొలపటం మటుకు తప్పటం లేదు."

"అనుభవించు. ఏదైనా చిన్నప్పటినుంచే అలవాటు కావాలి. పెందరాడే పడుకొని తెల్లారగట్టే లేచి చదువుకొనే వాళ్ళం. అటువంటిది వీళ్ళేమో తెల్లవార్లూ మేలుకొని చదువులు, అయ్యో పాపం అంటూ అర్ధరాత్రి అపరాత్రి అనక నువ్వేమో టీలు కాఫీలు అందించటం. పొద్దున్నే నిద్రచాలక వురుకులు పరుగులతో పరీక్షలకు వెళ్ళటం. ఇప్పుడనుకొని ఏం లాభం?"

పెళ్ళి నాటికి అంతులేని బాధ్యతలు. తమ్ముళ్ళ చదువులు చెళ్ళెళ్ళ పెళ్ళిల్లు. ఇంత బరువైన బ్రతుకులలో తనకు ఇప్పట్లో సంతానం మరో బరువైతుందేమోనని బాధ్యతలన్ని పూర్తయ్యేదాకా ఆ విషయంలో ఆలస్యం చేసారు. ఆ కారణంతోనే రిటైర్ అయేవయసు వచ్చేటప్పటికి పిల్లలకు ఇంకా పెళ్ళిళ్ళు కాలేదు.

"ఇద్దరికి సంబంధాలు చూసి పెళ్ళిల్లు చేసేస్తే సరి. వాళ్ళ గోలేదో వాళ్ళు పడతారుగా. మొన్న చూసిన సంబంధాలు బాగానే వున్నాయనుకుంటున్నారుగా కానిస్తే సరి."

"అంత ఆశలు పెట్టుకోకు. అప్పుడు ఇద్దరికి కాదు నలుగురికి మేలుకొలుపులు పాడాల్సి వస్తుంది జాగ్రత్త. అందరూ అందరే. అర్ధరాత్రి దాకా పెత్తనాలు. తెల్లారి వురుకులు పరుగులు."

"సరే సరే, ఆసంగతి తరువాత చూద్దాము. పద తొందరగా. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది."

టాంక్‌బండ్  బెంచి మీద  జంటను నీళ్ళల్లో వున్న బుద్ధభగవానుడు ఆప్యాయంగా పలుకరించాడు. ప్రతి పౌర్ణమి సాయంత్రం అదే బెంచి మీద కూర్చొని నిండు చంద్రుడిని చూడటం ఆ దంపతులతో పాటు బుద్దుడికి కూడా అలవాటు అయింది.

మెల్లిగా తల అతని భుజం మీద వాల్చింది.

"వావ్! వాటె రొమాంటిక్ కపుల్? మనకు పోటీగా ముసలాళ్ళు కూడా టాంక్‌బండ్ మీద చేరితే మనగతి ఏమిట్రా?" కామెంట్ విని నవ్వుకున్నారు.

మౌనంగా కాలం గడిచిపోతున్నది. హుస్సేన్‌సాగర్ చుట్టూ అమర్చిన రంగురంగు లైట్ల కాంతి నీళ్ళల్లో పడి, నీళ్ళకింద మరో లోకం వున్నట్టుమెరిసిపోతున్నది. ఆ లైట్ల కాంతి మధ్యలో నిశ్చలమైన నీళ్ళల్లో చంద్రుడు కూడా తలఎత్తి ఆ దంపతులనే మురిపెంగా చూస్తున్నాడు.

"ఇంక బయల్దేరుదామా, పెందలాడే లైట్‌గా తింటే రేపు తొమ్మిదికల్లా టెస్ట్‌లకి వెళ్ళాలి."

చివ్వున తలఎత్తి కోపంగా చూసింది. "ఆమాట ముందరే ఎందుకు చెప్పకూడదు? అంత పొద్దున్నే నేను లేవలేనని తెలుసుకదా! నేను రాను బాబూ." బుంగమూతి పెట్టి గునిసింది.

"మా బంగారం కదూ. ఖాళీ కడుపున టెస్ట్ చేయాలికదా! నా మాట వింటే రేపు నీకొక సర్ప్రైజ్."

"ఆ ఏముంది? హోటల్‌కి తీసుకెళ్ళి సినిమాకు అంటారు అంతేగా,"

"అదేం కాదు. నిన్ను సర్ప్రైజ్ చేద్దామని చెప్పలేదు. ఈ రోజు పొద్దున నువ్వు లేవక ముందు మీ ఫ్రెండ్ ఫోన్ చేసింది. రేపు ఫ్రెండ్సందరూ ఫామిలీస్‌తో గెట్ టుగెదర్. లంచ్‌కి ఇన్వైట్ చేసింది."

"వావ్ నిజమా! పొద్దున్నించి చెప్పనేలేదు. ఛీ." అంటూ పిడికిలితో కొట్టింది.

"మరి బయల్దేరుదామా?"

"ఏమండీ ఇంకా కొంచం సేపు కూర్చుందామండీ. మళ్ళీ పూర్ణిమనాటికి బుద్ధభగవానుడి దర్శనం వుంటుందో వుండదో............?"

నీళ్ళల్లో బుద్దుడు కూడా దిగులుగా చూసాడు.

భుజం చుట్టూ వున్న అతడి చేయి బిగుసుకుంది. తలఎత్తకుండానే ఓరగా చూసింది. చుట్టూ వున్న లైట్ల వెలుగు నీళ్ళలో పడి పరావర్తనం చెంది అతని కంటికొస నుండి కింద పడదామా వద్దా అన్నట్టు వున్న నీటి బిందు మీదపడి ఏడురంగులుగా మారింది.

"ఏమండీ, ఒకసారి  ఫ్లాట్ చూసి వద్దామా? చిన్నాచితకా కొరవ పనులున్నాయన్నారు. ఈ పాటికి అవి అయిపోయే వుంటాయి. మంచి రోజు చూసుకొని పాలుపొంగించి  కొన్నాళ్ళపాటు అక్కడే వుందాము. ఆ వాతావరణం కూడా అలవాటు కావాలిగా! ఒక్కసారిగా వెళ్ళి వుండటం అంటే ఇబ్బందిగా వుంటుందేమో! "

"ఊ." గొంతు పూడుకున్నట్టు వచ్చింది శబ్దం.

"కేర్‌టేకర్‌కు ముందే అన్ని వివరించాను. మీకు ఏ వేళ్టికి ఏం కావాలో చూసుకుంటుంది. సీనియర్ సిటిజెన్స్ కంపెనీలో అన్ని మర్చిపోవచ్చు. చివరి వరకు పిల్లలకు ఏమీ చెప్పవద్దు. ముందరే తెలుస్తే బెంగపడిపోతారు."

"అట్లాగే ఆశ్రమంలో పిల్లలకు పుస్తకాలు కొనటం ఫీజులు కట్టటం కూడా చేయాలి. ఈ ఏడు వాళ్ళ చదువులు పూర్తయి ఒడ్డునపడితే ముందరే అనుకున్నట్టు మన ఫాక్టరీలో వుద్యోగంలో చేరారంటే, మరో పదిమంది పిల్లల చదువుకు ఏర్పాటు చేయవచ్చు. ఈ పద్ధతి నిరాటంకంగా కొనసాగుతూనే వుండాలి.

అన్నట్టు మన రంగమ్మ కూతురు పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకోబోతున్నారట. ఎటుపోయి ఎటువస్తుందో! మంగళసూత్రం గొలుసు రెండుపట్టుచీరలు బీరువాలోనే దాచాను. భోజనాలకు కూడా ఒక పదివేల రూపాయలు పక్కన పెట్టి వుంచాను." అప్పగింతలు పెడుతున్నట్టు చెప్పసాగింది.

అప్పటివరకు ఆగిన కన్నీటి చుక్కకు మేముకూడా తోడున్నామన్నట్టు మరిన్ని తోడై ధారకట్టాయి.

కొంత తడవుకు తేరుకొని భుజం మీద వున్న చేతితో చెంపల మీద మెడమీద నెమ్మదిగా రాసాడు. రెండో చేత్తో ఆమె చేతులు పట్టుకున్నాడు.

"హేయ్, ఏమిటి చేతులు చెవులు మెడ బోసిగా వున్నాయి?" ఆ గొంతులో అంతకు ముందరే ఎమోషనల్ అయిన సూచన ఏమీ లేకుండా అడిగాడు.

చటుక్కున తలఎత్తి చిలిపిగా కళ్ళల్లోకి చూసింది. "నిజం చెప్పనా? అబద్ధం చెప్పనా?" నవ్వుతూ అడిగింది.

మెల్లిగా నెత్తి మీద మొట్టి నవ్వుతూ, "నీకు అలవాటేగా ఏదో ఒకటి ఏడు. కోతీ." అన్నాడు.

"అన్ని తీసేసి రెండు భాగాలుగా చేసి, ఆనిక్కి మళ్ళీ కూతురు కోడలు పోట్లాడుకోకుండా, రెండు పెట్టెలలో సర్దేసాను. సరేనా?"

"సరే నీ అబద్ధం అద్భుతంగా వుంది. ఇప్పుడు నిజం కూడా కక్కేసేయ్."

"రేపు టెస్ట్‌కెళ్ళినప్పుడు అన్ని తీయాలి కదా. హడావుడి అవుతుందని ఈ రోజే తీసి పెట్టేసాను."

"మొండి రాక్షసి. అన్ని తెలిసే మళ్ళీ నా దగ్గర నాటకాలా?"

★★★

కాలం ఆరు నెలల గతంలోకి వెళ్ళింది.

"గత కొద్దికాలంగా ఏదో చికాగ్గా వుంది. ఆయనకు చెప్పితే అనవసరంగా కంగారు పడతారు. ఒకసారి కంప్లీట్ చెకప్ చేయించుకుందామని వచ్చాను." డాక్టరుగా వున్న చిన్ననాటి ఫ్రెండ్ వద్దకు వెళ్ళినప్పుడు తెలిసిన భయంకర నిజాన్ని జీర్ణించుకోవటానికి కొంత సమయం పట్టింది.

"ఇటువంటి పరిస్థితిలో ఒంటరికా కాకుండా మీ ఆయన్ని కూడా తోడు తెచ్చుకోవలసింది." అన్న డాక్టర్ మాటలకు తేరుకొని,

"వద్దొద్దు ఆయనకు ఇప్పుడే ఏమీ తెలియాల్సిన అవసరం లేదు. ఆ పరిస్థితే వచ్చినప్పుడు ఎట్లా చెప్పక తప్పదు. ఇప్పటి నుంచే ఎందుకు?" అని కొట్టిపారేసింది.

పెళ్ళయిన కొత్తల్లో జరిగిన సంఘటన ఆ సమయంలో గుర్తుకొచ్చింది.

ఆయన మేనత్త భర్తకు జబ్బుచేసి ఇంక ఆరునెలలకన్నా ఎక్కువ బతకడు అని డాక్టర్లు చెప్పారు. అంతే. ఆయన భార్య అప్పుడే భర్త మరణించినట్టు "ఓరి నా దేవుడో నన్నన్యాయం చేసి పోతున్నావా? ఈ తోడేళ్ళ మధ్య నేనెట్లా బతికేదిరో దేవుడా. నీతోటే నన్ను తీసుకెళ్ళవయ్యా." అంటూ పెద్దపెట్టున ఏడుపులు పెడబొబ్బలు పెట్టసాగింది.

ఆ ముసలాయన అనారోగ్యం సంగతి పక్కన పెట్టి ఆవిడ ప్రతిరోజూ చేస్తున్న రాద్ధాంతంతో ఇంట్లో వున్నవాళ్ళకు మనశ్శాంతి లేకుండా పోయింది. అటు అనారోగ్యంలో ఉన్న ఆయనని చూసుకోవాలా? ఇటు పెడబొబ్బలు పెడుతున్న ఈవిడను సముదాయించాలా?

వీటి పర్యవసానంగా ఇంకా ఆరునెలలదాకా డోకా లేదన్న పెద్దమనిషి రెండునెలలలోనే చచ్చి వూరుకున్నాడు. ఆవిడ మాత్రం ఆ తరువాత ఇంకో పాతికేళ్ళు రాయిలా బతికింది.

ఇదంతా చూసి డిస్కస్ చేసుకొనేవాళ్ళు. ఎవరు ముందో ఎవరు వెనకో. జాతస్య మరణం ధృవం. ఎటువంటి ఒడిదుడుకులు వచ్చినా ప్రశాంతంగా ఎదురుకోవాలి, తాము బాధపడి ఇతరులను అంతకన్నా హింసల పాలు చేయకూడదని నిర్ణయించుకున్నారు.

కాలేజీలో వుద్యోగం చేసే రోజుల్లో సందర్భం వచ్చిన ప్రతిసారీ తను చెప్పే డైలాగ్ గుర్తు చేసుకుంటూ వుంటుంది.

"ఏమి జరిగినా బి పాజిటివ్, బి ప్రాక్టికల్." అని అనగానే కొలీగ్స్ ఎగతాళి చేసేవారు.

"నీ బ్లడ్ గ్రూప్ బి పాజిటివ్ అయినంత మాత్రాన అందరూ పాజిటివ్ గా వుండాలా ఏమిటి", అని "కెమిస్ట్రీ లాబ్‌లో స్టూడెంట్స్‌తో ప్రాక్టికల్స్ చేయిస్తూ జీవితమంతా లాబ్‌గా మార్చేస్తావా ఏమిటి?" అంటూ సరదాగా అనేవారు.

ఇప్పుడనిపిస్తున్నది. కాలేజీలో లాబ్‌కు జీవితానికి తేడా లేదు. అక్కడ కెమికల్స్‌తో ప్రయోగాలు చేస్తే ఇక్కడ భగవంతుడు మనసులతో భావాలతో ప్రయోగాలు చేస్తున్నాడు.

ఆ రోజే చూసిన సినిమాలో డైలాగు మనసుకు హత్తుకుంది. "జననం ఎలా ఉన్నా జీవనం గొప్పగా ఉండాలి. మరణం అంతకన్నా మహోన్నతంగా ఉండాలి."

నిజమే. ఇంతకాలం నవ్వుతూ అందరినీ నవ్విస్తూ, ఎక్కడ వుంటే అక్కడ ఆనందం వుంటుంది అనిపించే వ్యక్తి తన అనారోగ్యం బహిర్గతం చేసి అందరి సానుభూతి చూపులు భరించటం ఇష్టం లేదు. సెల్ఫ్ పిటీ అంతకన్నా ఇష్టం లేదు. జీవించినంత కాలం ఇట్లాగే నవ్వుతూ తుళ్ళుతూ గడిపేయాలని నిశ్చయించుకుంది.

ఇంతకాలానికి మళ్ళీ తనకు తాను చెప్పుకుంది. "బి పాజిటివ్. బి ప్రాక్టికల్."

భర్తతో చాలా మామూలుగా ప్రవర్తించసాగింది. కాని ముప్పయ్యేళ్ళ సాహచర్యం. ఒకరిలో ఒకరుగా ఇమిడిపోయిన బంధం. ఆమె భావాలు బాధలు దాచితే దాగేవి కాదు

భార్యలో తెలియని మార్పు గమనించాడు. అడిగితే ఏమీ చెప్పదని తెలుసు.

ఉండబట్టలేక ఒకసారి స్వయంగా డాక్టర్ వద్దకు వెళ్ళాడు. అదే సమయానికి భార్యకు ఎపాయింట్‌మెంట్ ఉన్నదని కాని, "లోపల వేరే ఎవరో వున్నారు, కొంతసేపు కూర్చోండి" అన్న నర్స్ మాటలకు ఆమె బయటనే కూర్చొని ఉన్నదని కాని అతనికి తెలియదు.

డాక్టర్ నుండి వివరాలు తెలుసుకున్న అతను తేరుకోవటానికి సమయం పట్టింది.

"మీరు అనవసరంగా ఆందోళన పడవద్దు. మనం చేయవలసింది మనం చేద్దాం. ఆ తరువాత భగవదేచ్ఛ." తలుపుదాకా వచ్చిన డాక్టర్‌తో,

"థాంక్యూ డాక్టర్. అందరి కష్టాలు భుజం మీద వేసుకోవటమే కాని తన కష్టం ఇంకొకరికి చెప్పే అలవాటు లేని వ్యక్తి. తనను జాగ్రత్తగా చూసుకోండి. మరి నేను వెళ్ళొస్తాను." అంటూ బయటకు వస్తున్న భర్తను చూసి గతుక్కుమన్నది. కాని అతను ఆమెను గమనించకుండా తలదించుకొని భారంగా వెళ్ళిపోయినాడు.

ఇల్లు చేరిన తరువాత తోడుదొంగలలాగా ఒకరికొకరు తెలియకుండా మామూలుగా మసులుకోసాగారు.

కాని ఆత్మవంచన ఎంతో కాలం సాగలేదు. చివరకు ముఖాముఖి ఇద్దరు కూడా వాస్తవాన్ని ఎదురుకోవటానికి నిశ్చయించుకున్నారు.

అందులో మొదటగా తామిద్దరికి డాక్టర్‌కు తప్ప నాలుగో మనిషికి రాబోయే విపత్తు గురించి తెలియకూడదు. ముఖ్యంగా కొడుకు కూతురుకు.

రెండవ విషయం పిల్లల పెళ్ళిళ్ళు. త్వరపడి ఎవరికో ఏదో అవబోతోంది అని వాళ్ళను పెళ్ళికి ఒత్తిడి చేసి, సెంటిమెంట్ తో వాళ్ళకాళ్ళకు బంధాలు వేయకూడదు. ఎవరికి ఎప్పుడు ఎట్లా జరగాలో అట్లాగే జరగాలి. అంతే.

ఇంతకాలం ప్రతివిషయంలోనూ స్వేచ్ఛ ఇచ్చి ఇప్పుడు పెళ్ళి విషయంలో వాళ్ళను శాసించి కాళ్ళకు బంధాలు తగిలించటం తగని పని అనిపించింది.

మరణానంతరం ఆరోగ్యంగా వున్న అవయవాలన్నిటిని దానం చేసేలా అతి ముఖ్యమైన నిర్ణయం తీసుకొని తమ ఫామిలీ డాక్టర్ వద్దకు వెళ్ళారు సంబంధించిన పార్మ్స్ నింపారు.

చేతనైనంత వరకు సంఘ సేవ కొనసాగిస్తున్నారు.

మనిషికి కావలసిన ముఖ్య అవసరాలు కూడు గుడ్డ నీడ. అందరికి స్వంత నీడ ఏర్పాటు చేయలేకపోయినా కనీసం కూడు గుడ్డ అయినా సమకూర్చాలన్న ఉద్దేశంతో అనాధాశ్రమం లోని పిల్లలకు తమకు తోచిన సహాయం చేయటం ఆ దంపతులకు అలవాటు.

అడపాతడపా టెస్టులు, వేళ్టికి మందులు. తప్పిస్తే మనసుల్లో ఎన్ని బాధలూ దిగుళ్ళూ ఉన్నా జీవితం మటుకు మునపటిలాగే మూడునవ్వులు, ఆరుసరసాలుగా సరదాలతో గడిచిపోతున్నది.

నిజమే. జన్మించాము కనుక బతకాలి. జీవించాలి కనుక జీవించాలి అని కాకుండా జీవితానికి ఒక పరమార్ధం వుండాలి. బతికి ఉన్నా లేకపోయినా పదిమందికి ఉపయోగపడాలి అన్న ఆదర్శంతోనే ఆ దంపతులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

★★★

రాత్రి పక్కెక్కి మళ్ళీ ఇంటర్నెట్లో అంతర్జాలపత్రిక ఓపెన్ చేసి అమెరికాకమ్మ కథలు చదవసాగింది. మధ్యమధ్యలో పట్టలేక పకపకా నవ్వుతోంది.

మాస్టర్ బెడ్‌రూంలో టివి మెల్లిగా వినిపిస్తున్నది.

ఆయనకు కూడా తన పరిస్థితి తెలిసిన తరువాత గట్టి నిర్ణయం తీసుకుంది.

అతను తను లేకుండా బతకటం అలవాటు చేసుకోవాలి. కాదు కాదు తానే అలవాటు చేయాలి.

మొదటి అడుగుగా ఆయన టివి తనకు డిస్టర్బింగ్ గా వున్నదన్న నెపంతో వేరే గదిలోకి తన మకాం మార్చింది.

కావాలనే రాత్రిళ్ళు చాలసేపు లాప్‌టాప్ తో కాలక్షేపం చేస్తూ ఆలస్యంగా నిద్ర లేస్తూ ఆయన చిన్నపెద్ద పనులకు అలవాటుపడేలాగా చేసింది.

అన్నిటికన్నా చివరగా  అన్ని హంగులూ వున్న రిటైర్మెంట్ హోమ్స్‌లో ఒక ఫ్లాట్ కొనిపించింది. ఆ రూపాన పిల్లల మీద ఆధార పడకూడదు. నాన్న ఒంటరిగా వున్నాడు అన్న భావన పిల్లలను వేధించకూడదు.

ఇవన్ని ఒక ఎత్తయితే తనను తాను మెంటల్‌గా ప్రిపేర్ చేసుకొంది. ఎంతకాలమో డాక్టర్ కూడా చెప్పలేదు. నెలలు గడవవచ్చు, సంవత్సరం కూడా గడవ వచ్చు. లేదా రోజుల్లోనే పోవచ్చు. దేనికైనా సిద్ధపడే వుండాలి.

ఈ రోజంటూ ప్రతి మనిషికి ఏదో ఒక నాడు తప్పదు. ఒకరు ముందు ఒకరు వెనుక. తను చదువులు, తెలివితేటలు, చలాకీతనం, ఇట్లా అన్నిట్లోనూ ముందే వుండేది. కాకపోతే నిష్క్రమణ విషయంలో ఇంకా చాలా ముందే వుంది.

కంప్యూటర్లో టైం పదొకొండున్నర.

పొద్దున్నే డాక్టర్ ఎపాయింట్‌మెంట్ ఉన్నదన్న సంగతి గుర్తుకొచ్చి ఎనిమిదింటికి అలారం సెట్ చేసుకొంది. ఆరోజే రిపైర్ అయిన బెడ్ దగ్గర లైట్‌స్విచ్ ఆపేసి దుప్పటి కప్పుకుంది.

తలుపు తోసిన అలికిడి అయి కళ్ళు మూసుకొని నిద్ర నటించింది. దాదాపు ఇది ప్రతిరోజూ జరిగే ఘట్టమే. అర్ధరాత్రి మధ్యమధ్యలో వచ్చి తనివి తీరా భార్యను చూసుకొని పోతూ వుంటాడు.

అతను మంచం దగ్గరకు వచ్చి కళ్ళు మూసుకున్న ఆమె పక్కన కూర్చొని మెల్లిగా తల చెంపలు నిమిరాడు. కంటి నుండి రాలిన నీటి చుక్క ఆమెచేతి మీద పడింది. తలుపు చేరేసి తన గదిలోకి వెళ్ళిన అతను మనసారా ఏడుస్తాడని ఆమెకు తెలుసు. కాని తప్పదు.

టివిలో పాతపాటల కార్యక్రమం కాబోలు వినిపిస్తున్నది. "గుండె మంటలారిపే చన్నీళ్ళు కన్నీళ్ళు. వుండమన్న వుండవమ్మ చాన్నాళ్ళూ."

తనను తాను సముదాయించుకుందే కాని ఏ రోజు కూడా ఆయనను సముదాయించే ప్రయత్నం చేయలేదు. అవును. ఇప్పటినుండే మానసికంగా ఆయన సిద్ధపడాలి. అసలు సమయం వచ్చేటప్పటికి ఇంక బాధ ఏడుపు అన్నవి దరి చేరకూడదు. పిల్లలను ఓదార్చే గుండెనిబ్బరం వుండాలి అంటే ఆ కళ్ళల్లో నీరు  ఇప్పుడే ఇంకి పోవాలి.

"కాళ్ళు తడవకుండా సప్తసముద్రాల్ని దాటగలిగిన మనిషి కళ్ళు తడవకుండా జీవితాన్ని దాటలేడు" అన్న కవి మాటలు జ్ఞాపకం వచ్చాయి.

తప్పదు కొంతకాలం ఈ కన్నీళ్ళు కలవరాలు. తరువాత అలవాటు పడుతారు.

★★★

ప్రతిరాత్రి అనుకున్నట్టే అనుకున్నది.

ఈ మూసిన కళ్ళు రేపనేది చూస్తాయా? ఇదే చివరి రాత్రా?

ఏమో?.........ఎవరికి తెలుసు, విధాత లీలలు?

కన్ను తెరిస్తే జననం

కన్ను మూస్తే మరణం

రెప్పపాటే కదా ఈ ప్రయాణం




**నేను బాధతో విలవిల్లాడిపోతున్నాను.** చేయి ఎత్తి చొక్కా వేసుకోలేను. విప్పలేను. బాహుమూలంలో పెద్దగడ్డ. అక్కడంతా, ఎత్తుగా, ఎర్రగా ఉంది.

''ఏమయ్యిందమ్మాయ్?'' రాజుమామ్మ ప్రశ్న.

''అదే తెలియడంలేదు. నిన్న సాయంకాలం వరకూ బాగానే ఉన్నాడు. అదిగో ఆ ఇంటిముందు పోసిన ఇసక కుప్పలో మిగిలిన పిల్లలతో చేరి బాగానే ఆడుకున్నాడు. రాత్రి ఏమైనా..'' మా అమ్మ వివరంగా చెబుతోంది. నేను మా అమ్మకు చేరబడి, ఆమె చెంగులో ముఖం దాచుకుని, మధ్య మధ్యలో రాజుమామ్మను చూస్తున్నాను.

''బాగుంది. ఇంతలో ఏమయ్యిందమ్మా. బంగారంలాంటి పిల్లాడికి'' రాజుమామ్మ నన్ను ముందుకు లాక్కుని చొక్కా ఎత్తి పరిశీలించింది.

''ఏమిటోనమ్మా! మాయదారి రోగాలు. ఆడుకునే పిల్లల మీదే పడుతున్నాయి. ఉండు, మన గుర్రాల సాయిబుకి చూపిద్దాం. మధ్యాహ్నం భోజనానికి వస్తాడుగా'' అంది రాజుమామ్మ ఓదార్పుతో. మా అమ్మ ముఖంలో కాస్త ప్రశాంతత వచ్చింది.

"సాయిబు మంత్రాలు వేస్తాడు లే. తేలుకుట్టినా, చప్పి వచ్చినా, నడుము బెణికినా సాయిబు రెండు మంత్రాలు వేసాడంటే ఎక్కడిదక్కడ పోతుంది. ఉండు. సాయిబు పెళ్ళాన్ని అన్నీ కనుక్కువస్తాను. వీడిని లోపలికి తీసుకుపోయి అన్నం పెట్టు" - రాజుమామ్మ మా వీధి చివరిలో ఉన్న సాయిబు ఇంటివేపు కదిలింది.

"ఆటలు - ఆటలు, ఒకటే ఆటలు, ఏమయ్యిందో, ఏమిటో!" నా భుజాన్ని పట్టుకుని ఇంట్లోకి లాక్కెళ్ళింది మా అమ్మ. ఆటలాడితే ఇలాంటి తెలియని రోగాలు వస్తాయని ఇప్పుడే తెలిసింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతోంటే చంకలో చేయిపెట్టుకుని గడ్డను రుద్దుకుంటూ మా అమ్మ వెనక బయలుదేరాను.

రాజుమామ్మ చాలా ఎత్తయిన మనిషి. కాళ్ళకు వెండి కడియాలు, నుదుట పెద్ద కుంకుమ బొట్టు మెడలో రవ్వంత బంగారం కుటకతో ఉన్ననల్లపూసలు, చెవి తమ్మెలకు దుద్దులుకు బదులు చీపురు పుల్ల ముక్కలు. ఆ చిన్న వయసులో గానీ ఆ తరువాత గానీ నేను గమనించినదేమంటే రాజుమామ్మ, మా వీధిలోని ఆడోళ్ళందరికీ హెడ్ గొప్ప సలహాదారు. ఆమెకు తెలియంది లేదు - తెలియకపోతే ఎక్కడన్నా అడిగి తెలుసుకుని అయినా మనకు ఫ్రీగా చెబుతుంది. ఏదయినా సరే ఆమె చెవిన వేస్తే చాలు. సమస్యకు ఓ పరిష్కారం మనకు కనపడుతుంది. మా ఆయనకు ఆసనంలోంచి రక్తం పడుతోంది - మూలశంక కాబోలు నిలబడలేడు, కూచోలేడూ అని ఎవరన్నా అంటే "ఎందుకూ! ఈ పని చెయ్యి - ఇంకా తగ్గకపోతే డాక్టర్ దగ్గరకు పోవచ్చు. లోతు గరిటెలో నాలుగు చుక్కలు ఆవు నెయ్యి వేసి అందులో వెల్లుల్లి రెబ్బలు నాలుగైదు వేసి నిప్పులు మీద మరిగించి, చల్లార్చి ఆ రెబ్బలు తిని, ఆ నెయ్యిని నాకేయమను, ఇలా పదిరోజులు చేస్తే ఎక్కడి బాధలు అక్కడే పోతాయి. అన్నట్టు అమ్మాయ్ - ఆ దిక్కుమాలిన ఆవకాయలూ, కారాలు మానెయ్యమను" అంటుంది. "అయ్యో! మా అబ్బాయికి గోరుచుట్టు" అని మరో ఆమె అంటే, "ఎందుకూ.. జిల్లేడు పాలు నాలుగు చుక్కలు దానిమీద వెయ్. అదే పోతుంది" అని సలహా ఇస్తుంది.

ఆ పక్కనే ఉన్న మరోకామె - "మా అమ్మాయి చేతిమీద సెగ్గెడ్డా" అంటే "అయ్యో! అమాయకత్వమా! చంద్రకాంతం ఆకుకి ఆముదం రాసి వేడిచేసి, గోరంత వేడిలో ఆగెడ్డ మీద వేసి కట్టు కట్టువమ్మా, అదే చితుకుతుంది" అని చెప్పగలుగుతుంది. "గచ్చాకూ, పుచ్చాకూ అనకండి. ఇవి మన పెరడ్లలో దొరికేవే, మనవంటిళ్ళల్లో ఉండేవే" అంటుంది రాజుమామ్మ.

సాయంకాలం దీపాలు పెడతారనగా - గుర్రాల సాయిబును వెంటబెట్టుకుని వచ్చింది రాజుమామ్మ. ఈ సాయిబును రోజూ మా వీధిలో చూస్తున్న వాడే అయితే ఇతడు మంత్రాలు వేస్తాడనీ, తాయెత్తులు కడతాడనీ ఇపుడే తెలిసింది. చిరుగడ్డం, నెత్తిన మాసిన అల్లిక టోపీ, అదే రంగుతో మోకాళ్ళదాకా ఉన్న అంగరఖా, కింద షరాయి, నవ్వితే గారపట్టిన పళ్ళూ -

నోట్లోని బీడీని దూరంగా విసిరి అరచేతులు రెండు క్షణాలు పాముకుని "ఈ బచ్చాకేనా? బీమార్" అంటూ నా వేపు చూశాడు.

నేను గుడ్లప్పగించి చూస్తున్నాను.

నాకొచ్చిన రోగమేమిటో చెబుతూ మా అమ్మ నా వంటి మీది చొక్కా విప్పింది.

"కుడీ చెయ్యి కింద సాయిబుగారూ! పిల్లాడు నొప్పితో అల్లల్లాడుతున్నాడూ" అన్నది రాజుమామ్మ, సాయిబు అంగరఖా జేబులోంచి ఓ కత్తిని తీసాడు, బీడీకట్టా, అగ్గిపెట్టే కిందపడ్డాయి. ఆ కత్తి తుప్పుపట్టి ఉంది. దాని పిడి అలాగే ఉంది.

నన్ను స్టూలు మీద కూచోమని ఆ కత్తిని గాల్లో తిప్పి రకరకాల విన్యాసాలు చేసి మంత్రాలు చదువుతూ పళ్ళతో పట్టి నోట్లోకడ్డంగా పెట్టుకున్నాడు. నాకదంతా చిత్రంగా ఉంది భయంకూడా పట్టు కుంది.

స్టూలు దిగి మా అమ్మ వెనక్కి పరుగెత్తి దాక్కోవాలనిపించింది.

నన్ను గమనిస్తున్నాడు కాబోలు సాయిబు "ఏం భయంలేదు బేటా! తగ్గిపోతుందిలే" అని పళ్ళతో పట్టిన కత్తిని బయటకు తీసి నా చంకలోని గడ్డ మీద మెల్లగా రాశాడు. అలా ముమ్మారు చేశాడు.

"రేపు ఇదే వేళకు వస్తాను బాబును ఎటూ బయటకు వెళ్ళనివ్వకమ్మా! ఇలాంటివి మూడు మంత్రాలు వేస్తే చాలు, అదే తగ్గిపోతుంద"ని చెప్పి వెళ్ళిపోయాడు. రెండు రోజుల్లో రవ్వంత మార్పు వచ్చింది. కొంగున కట్టుకున్న రెండు అణాలూ అతడి చేతిలో పెట్టింది మా అమ్మ.

"నేను చెప్పలేదా అమ్మాయ్. సాయిబు మంత్రాలు గురించి" అన్నది రాజుమామ్మ.

మా అమ్మకు ఆనందం వేసింది.

ఆ మంత్రాలకి తగ్గిందో, మరోలా తగ్గిందో గానీ నా చేతి నొప్పి తగ్గింది - ఇంతకీ మా వీధి అందరికీ తలలో నాలుకలా మెదిలే ఈ రాజుమామ్మ ఎవరు? నాకు కొంచెం ఊహ వచ్చిన తరువాత మా అమ్మను ఇదే ప్రశ్న వేశాను ఆమె ముఖం అదోలా అయిపోయింది.

"వెనుకటి తరం మనుషులు ఇంతే! ఆడదానికి ఆడదే శత్రువు" అంది ఎటో చూస్తూ. అది ఎటో చూడ్డంకాదు గతంలోకి చూడ్డం-

విశాఖపట్నానికీ, తునికీ మధ్య గ్రాండ్ ట్రంక్ రోడ్డుమీద ఉన్న ఓ మాదిరి ఊరు అది. ఆ రోడ్డుమీద రెండు మూడు హోటల్స్ ఉన్నాయి. అందులో ఒకటి భోజన హోటల్, చూరుకు వేలాడుతున్న బోర్డు మీద అలాగే రాసి ఉంటుంది. ఎడమ చేతివేపు రెండు మెట్లెక్కితే వాకిలీ, ఆ వాకిలికి మధ్యలో తులసికోట, - భోజనాలు చేసేవారు చేతులూ, కాళ్ళు కడుగుకోవడానికి పీటలూ, విస్తర్లూ వీధివరండాలో ఓ మూల బల్ల వేసుకుని కూచుంటుంది ఆ హోటల్ ఓనర్ అచ్చమ్మ. బొడ్డులో డబ్బు చిక్కం దోపుకుని. ఈమె కొడుకు రామచంద్రుడు లేక రామచంద్రరాజు. గడుసువాడే గానీ తల్లిమాట జవదాటలేని శ్రీరామచంద్రుడు - అయినా ఇంతవరకూ జవదాటలేని సమస్య ఏం వచ్చింది గనక?

అచ్చమ్మ మహా గడుసుదనీ ఆకుకూరలతోనే అరవై ఆరు రకాల వంటలు చేసి డబ్బు చేసుకుంటుందనీ ఆ హోటల్ భోజనం చేసిన వారు చెప్పుకునేవారు. "రోడ్డు ఎక్కి వ్యాపారం చేస్తున్నాం, అందులోనూ రకరకాల మనుషులతో, ఆ మాత్రం నోరుపెట్టకపోతే బతకలేం" అన్నది అచ్చమ్మ వాదన. ఆ తల్లీ కొడుకులిద్దరే ఆ హోటల్ యజమానులు కాబట్టి ఇన్నాళ్ళూ సరిపోయింది. ఇప్పుడు ఆ ఇంట్లోకి కోడలు రూపంలో మరో కొత్తజీవి వచ్చింది. ఇకపై ఎలా ఉంటుందో?

ఎలా ఉంటుందో అన్నది రెండో నెలలోనే తెలిసిపోయింది. కోడలు ఇంట్లోకి అడుగుపెట్టగానే పనిపిల్లను మానిపించింది అచ్చమ్మ. ప్రతి చిన్న పనికీ కోడలుమీద రుసరుసలాడ్డం, వీలయినంత విసుక్కోవడం పనికి వంకలు పెట్టడం, ఆ అమ్మాయి బీద ఇంట్లోంచి వచ్చింది కాబట్టి మాటిమాటికీ ఆ బీదరికాన్ని గుర్తుచెయ్యడం, నీకు ఇది తప్ప మరో బ్రతుకు లేదని హెచ్చరించడం అచ్చమ్మ అలవాటు చేసుకుంది.

తెల్లవారి లేచిన దగ్గర్నుండి పని, పని, పని -

వచ్చిన ఆ కోడలు పేరు రాజమ్మ. పని వత్తిడితో వంటి మీది బట్టలేకాదు, దుఃఖంతో కళ్ళూ తుడుస్తున్నాయి రాజమ్మకు.

భర్త రామచంద్రుడికి ఇటు భార్యనూ ఓదార్చలేక అటు తల్లికీ చెప్పలేక అతని నోరు పడిపోవడం మొదలెట్టింది "అది కాదమ్మా! " అంటూ ఒకవేళ రామచంద్రుడు కలగచేసుకుంటే - "పెళ్ళాం బెల్లం ముక్క, కొంగున కట్టేసుకుందేమిట్రా వెధవా" అని అచ్చమ్మ కేకలు. కళ్ళప్పచెప్పడం మినహా ఏమీ చెయ్యలేని నిస్సహాయస్థితి రామచంద్రుడిది. మొగుడే అలా ఉంటే తానేంచేయగలదు, దుఃఖం వస్తే కొంగుతో కళ్ళు తుడుచుకోవడం తప్ప.

వంటలు, వడ్డనలు, నీళ్ళు నూతి నుండి మోయడాలూ, ఎంగిలి విస్తళ్ళు ఎత్తడాలూ, ఈ భార్యాభర్తల పని - ఏ మూడు గంటలకో అమ్మగా మిగిలిన మెతుకులు కంచంలో రాల్చుకుందామని రాజమ్మ పీట ముందు కంచం వాల్చుకు కూచుంటే, దారంట పోయే వాడెవడో 'భోజనం ఉందా' అంటే - ఉందని రాజమ్మను పీట మీద నుండి పక్కకు పంపి ఆ అన్నాన్ని వాడి ముందుకి తోసి 'వేళగాని వేళవచ్చావ్' అని మంచిమాటలాడి డబ్బులు వసూలు చేసేది అచ్చమ్మ. ఇన్ని మజ్జిగ నీళ్ళు గొంతులో పోసుకుని ఆ పూటకు కాలక్షేపం చేయవలసి వచ్చేది రాజమ్మకు.

రోజులు నెలలుగా, ఆ నెలలు సంవత్సరాలుగా మారాయి. రాజమ్మకు కూతురు పుట్టింది. ఆ పసిదాని పేరు సూర్యకాంతం అని పేరుపెట్టుకుంది. దుఃఖం కలిగినప్పుడల్లా ఊయల్లో ఆడుకుంటున్న ఆ పసిదాన్ని చూస్తే దుఃఖం ఎగిరిపోయి ఆనందం కలిగేది. అయితే రాజమ్మ జీవితంలో ఆ ఆనందం కూడా ఆవిరి అయిపోయి తనతోపాటు మరో జీవినీ పస్తుల్లో పడుకోబెట్టవలసిన పరిస్థితి వచ్చేది క్రమేపీ -

చంటిది పాలకోసం గుక్కపెడితే పాలుపట్టి పడుకో బెట్టవలసి వచ్చినా అత్తగారు ఏమంటారో అని భయపడవలసివస్తోంది రాజమ్మకు.

"ఇక్కడ పాలు పెడుతూ కూచున్నావటే? అదే ఏడిచి ఏడిచి నిద్రపోతుందిలే. పోయి గదిలో ఉన్న ఎంగిలి విస్తళ్ళు ఎత్తు. భోజనాలు కావాలని మరో నలుగురు వచ్చారు" అని వెర్రి కేకలుతో అచ్చమ్మ విరుచుకుపడిన రోజులున్నాయి.

ఇంత కష్టాన్నీ ఎదురుగా చూస్తున్న మొగుడు నోరెత్తకపోవడం - అతడు మంచివాడో - చేతకానివాడో నిర్ణయించుకోలేకపోతోంది రాజమ్మ. ఒకరోజు రాత్రి పసిదానికి అటూ ఇటూ పడుకున్న రాజమ్మా, రామచంద్రుడయితే - తల్లి మాటను జవదాటలేక వంటలపాలు, ఎంగిలాకులపాలు చేస్తున్న రామచంద్రుడు. తన కష్టాలకీ, దుఃఖానికీ అంతం లేదన్నమాట. ఎంత రోతయిన విషయం.

మంచి రోజులు మనకు రాకపోవు అంటే అచ్చమ్మ చనిపోయిందాకా ఈ అవస్థలు తప్పవా? రాజమ్మ పక్కకు తిరిగి కళ్ళు మూసుకుంది చంటిదాని పక్కదుప్పటి సరిచేసి -

మరుసటి రోజు ఎప్పటిలాగే తెల్లవారింది. చీకటి చీకటి ఉండగానే పనులు మొదలుపెట్టింది రాజమ్మ. అంట్లగిన్నెలు తోమడం, గదులు కడగడం, వంటలు కోసం పొయ్యిలు ముట్టించడం దూరంగా ఉన్న నూతినీళ్ళు తెచ్చుకోవడం - మధ్య మధ్య కొంత భయంగానే పసిదాన్ని చూసుకోవడం.

కొంచెం ఎండ ఎక్కగానే భోజనాలు తిని వెళ్తున్నవారి ఎంగిలి విస్తళ్ళు ఎత్తడం, అన్నం అయిపోయిందన్నప్పుడు మళ్ళీ ఇన్ని బియ్యం కడిగి పొయ్యికి ఎక్కించడం అన్నీ అవుతున్నాయి.

రామచంద్రుడు చెయ్యవలసిన పనులు అతను చేస్తూనే ఉన్నాడు.

సాయంకాలం మూడుగంటలయ్యింది. అంతవరకూ గుక్కెడు నీళ్ళన్నా, గుప్పెడు మెతుకులన్నా ఎరుగని రాజమ్మకు ఆకలితో కడుపు మాడిపోతోంది. వీధి వరండాలో బల్ల ముందుకూచున్న అచ్చమ్మ డబ్బులు లెక్కపెట్టుకుంటోంది. రామచంద్రుడు గదిలోని పీటలు ఎత్తి, నేలమీద ఎంగిలి మెతుకులు తుడుస్తున్నాడు సత్తుగిన్నెలో రెండు గరిటెల అన్నం వేసుకుని, కూరగిన్నె, మంచినీళ్ళ గ్లాసు దగ్గర పెట్టుకుని అన్నం తినాలని రాజమ్మ గదిలో కూచుంది.

చంటిది చాపమీద నిద్రపోతుంది.

దారంట పోతున్న ఓ నలుగురు భోజనం కోసం హోటల్ ముందున్న మెట్లు ఎక్కుతున్నారు. డబ్బులున్న చిక్కాన్ని రొంటిలో దోపుకుంటున్న అచ్చమ్మకు కోడలు రాజమ్మ కట్టుకున్న చీర రంగు చూసి అనుమానంతో ముందుకు వంగింది. రాజమ్మ అన్నం తినబోతోంది. అంతే ఆమె కళ్ళల్లో నిప్పులు పడ్డాయి.

''అప్పుడే ముద్దకు వేళయ్యిందంటే - ఇలా అయితే దరిద్రాన్ని కొంపలోకి తెచ్చుకున్నట్టే'' కుర్చీని ఓ తాపు తన్ని విసురుగా గదిలోకి వచ్చి రాజమ్మ ముందున్న సత్తుగిన్నెను తీసి వాకిట్లోకి విసిరింది. రాజమ్మ క్షణంలో సగం మ్రాన్పడిపోయింది. దుఃఖం వరదలై ఎగతన్నింది. కొంగును నోటికడ్డంగా లాక్కుంది.

వాకిట్లో పడ్డ సత్తుగిన్నె తులసికోటకు తగిలి వెనక్కు దొర్లి భోజనం కోసం వస్తున్న ఒకరికాలుముందు ఆగింది. అతను కిందకు చూశాడు. అతనిపేరు వీరయ్య.

వాకిలి నిండా అన్నం విరజిమ్మింది. మరో నాలుగు బూతులు కూసి, అచ్చమ్మ అంతలోనే శాంతపడి వాకిట్లోకి చూసి ''రండి బాబూ! అన్నం వేడిగా ఉంది'' అన్నది.

వీరయ్య వాకిట్లో ఉన్న గిన్నెవేపు, దుఃఖంతో గోడవేపు తిరుగుతున్న రాజమ్మ వేపూ చూసి మిగిలిన వారితో మెట్లెక్కాడు.

రామచంద్రుడు ఎక్కడున్నాడో తెలియదు.

●●●

నూతిలోనుండి నీళ్ళు తోడి బిందెలో పోసుకుని, బిందెను విసురుగా నడుమున చేర్చి వెనక్కి తిరిగింది రాజమ్మ. పైకెత్తి రొంటిలో దోపుకున్నా, చీరకుచ్చిళ్ళు తడిసిపోయి ఉన్నాయి. జుట్టు చెమటతో తడిసి మెడకు అంటుకు పోయింది. అప్పటికది పన్నెండో బింది, తొట్టెను త్వరగా నింపాలి. ''రాజమ్మా!'' అన్న పిలుపుతో అడుగువెయ్యబోతున్న రాజమ్మ ఆగిపోయింది.

పక్కకు తిరిగి చూస్తే వీరయ్య తెల్లని బట్టల్లో నిలబడి ఉన్నాడు.

ఎపుడూ అతన్ని ఇక్కడ చూడలేదు. పైగా మాటాడింది లేదు. ''ఇంకా వంటలు పూర్తవలేదండీ అంది''

''రాజమ్మా! నిన్ను అవమాన పరచడం కాదు - సంవత్సరం నుండీ నిన్ను గమనిస్తున్నాను. నీ దుఃఖాన్ని చూడలేకపోతున్నా. ఎపుడూ కన్నీటితో రెప్పలు తడిసే ఉంటున్నాయి - నీ విషయంలో రామచంద్రుని ఆలోచనలు ఏమిటో తెలియదంలేదు. అచ్చమ్మగారికి సమాధానం చెప్పలేని చేతగానివాడా? మొన్న వాకిట్లో అన్నం గిన్నె -'' అన్నాడు మెల్లగా.

అయితే ఆ మాటల్లో ఎంతో స్పష్టత, నిదానం ఉంది.

రాజమ్మలో దుఃఖం పొర్లు కొచ్చింది.

ఇంతకష్టపడినా ఆ రోజున, ఆ నాలుగు మెతుకులూ దక్కలేదు. గుర్తొస్తోంది.

తిరిగి వీరయ్య అన్నాడు.

''నాకు పెళ్ళి కాలేదు - నేను వాచీలను బాగు చేస్తాను అంతో ఇంతో సంపాదన ఉంది. నాతో వస్తానంటే నాకేం అభ్యంతరం లేదు. నీ మీద పెత్తనం చెలాయించే వారు అసలే లేరు ఆలోచించుకో'' అని వెంటనే అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

రాజమ్మ బిందె మోస్తూనే ఆలోచనలో పడింది. పిడికెడు కూడుకోసం ఎంత నరకం. పైగా దెబ్బలు, చీవాట్లు, ఎప్పటికయినా మంచిరోజులు రావా అని బేలగా ఆలోచించే చాతకాని మగడు -''

వారం రోజులు గడిచి ఉంటాయి.

రాజమ్మలో ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చాయి. ఇంతకన్నా చెడిపోయిందేం లేదు. నిశ్చయించుకుంది ఓ తెల్లవారు ఝామున చంటిదాన్ని భుజాన వేసుకుని గుమ్మం దాటింది రాజమ్మ.

వీరయ్య తీసిన ఇల్లు బాగుంది. రోజురోజుకీ ఇది నీ ఇల్లు అని నమ్మకం కలగచేస్తున్నాడు వీరయ్య. రాజమ్మలో భయం పోయి భద్రత చోటు చేసుకుంటోంది. చంటిది సూర్యకాంతం సయితం తప్పటడుగులు వేస్తూ వీరయ్య వడిలో కూచుంటోంది.

వీరయ్య వాచీలు రిపేరు చేస్తుంటాడు నమ్మకమయిన షాపుల్లో, నాలుగు డబ్బులు వస్తాయి, అయితే వంటా, వడ్డనా తెలిసిన రాజమ్మ ఊరికినే కూచోలేకపోయింది. కొబ్బరి ఉండలు, శనగ ఉండలు, జీళ్ళు చేసి కిల్లీ దుకాణాల్లో వేసి అమ్మకం చేయిస్తోంది. అందులో నాలుగు డబ్బులు వస్తాయి. వేడినీళ్ళకు చన్నీళ్ళు వీరయ్య ప్రేమపొందుతూ, రెండు పూటలా తింటున్న రాజమ్మ మరో ఇద్దరు పిల్లల తల్లయింది. సూర్యకాంతంతో కలిపి ముగ్గురు పిల్లలు ఆ ఇంట్లో నడయాడుతున్నారు.

●●●

ఒకరోజు వీరయ్య ఓ పెద్దమనిషిని వెంటపెట్టుకు వచ్చాడు, వాకిట్లో దబ్బ చెట్టుకింద కుర్చీవేసి కూచోపెట్టాడు - లోపలికి పోయి త్వరగా కాఫీ చేసి తెమ్మనమని చెప్పాడు. రాజమ్మ కాఫీచేసి అది ఆవిర్లు చిమ్ముతోంటే వాకిట్లోకి వచ్చింది గ్లాసుతో - ఎదురుగా వీరయ్యతో పిచ్చాపాటీ మాట్లాడుతూ నవ్వుతున్నాడు రామచంద్రుడు. గతుక్కుమంది మొదట -

ఏమని సంభోదించాలో అర్థంకాలేదు.

మెల్లగా "ఎలా ఉన్నావు" అని రామచంద్రుడు అనగానే కళ్ళలో నీరు తిరుగుతోంటే "బాగున్నాను' అంది అంత నెమ్మదిగానే రాజమ్మ.

"వద్దు - కన్నీరు పెట్టుకోకు" అన్నాడు రామచంద్రుడు, ఆ ఓదార్పుకు ఇంకా దుఃఖం తన్నుకొచ్చింది రాజమ్మకు. నోటికడ్డంగా కొంగులాక్కుంది.

"వద్దు హాయిగా ఉండు- చంటిది - అదే సూర్యకాంతం ఎక్కడ?" అన్నాడు.

రాజమ్మ కదల్లేదు.

వీరయ్య లేచి ఇంట్లోకి పోయి పిల్లల్ని బయటకు పిలుచుకు వచ్చాడు.

రామచంద్రుడు అదే పనిగా సూర్యకాంతాన్ని చూస్తున్నాడు.

"అది మీ పోలికే" అంది రాజమ్మ.

రామచంద్రుడు మనసారా నవ్వుకున్నాడు తన కూతురు తన పోలికతో కాకపోతే ఎలా ఉంటుంది - మిగిలిన ఇద్దర్ని చూసి వాళ్ళను దగ్గరకి తీసుకున్నాడు.

"నేను చేతకాని వాడనే - మా అమ్మను ఎదురించలేకపోయాను - ఆవిడ నన్ను ఎంతో కష్టపడి పెంచింది. నా తండ్రిపోయిన తరువాత - నేను మరో స్త్రీ చేతుల్లోకి వెళుతున్నానన్న అభద్రతాభావం ఆమెలో కలిగి ఉండవచ్చు. దానికి తోడు అత్తగారినన్న అహంకారం తోడయ్యింది. చివరకు నేను చేతకానివాడుగానే మిగిలి పోయాను. తిరిగి పెళ్ళిచేసుకోలేదు. దగ్గర్లోనే అనకాపల్లిలోనే మీరు ఉంటున్నట్లు గడియారాలు బాగుచేస్తూ బతుకుతున్నట్టు తెలిసింది నేను ఇటే వస్తుంటాను. ఎప్పటికయినా కనపడకపోతారా అనుకునేవాడిని. అలాగే వీరయ్యగారు కనపడ్డారు మా అమ్మ చనిపోయిన తరువాత హోటల్ మూసేశాను. అంతకు ముందు అలవాటున్న లారీ డ్రయివర్ వృత్తే చేపట్టాను.

అయినా చేతకానివాడనే...

నడుస్తున్న న లారీకి ఎదురుపడిన వారు పక్కకే తప్పుకుంటారు -

రాజమ్మ పక్కకు తప్పుకుంది. ఇది వాస్తవం.. కట్టుకున్న భార్య కన్నీరు పెడుతోంటే ఆ కన్నీటిని తుడవలేని పరిస్థితి నాది. ” రామచంద్రుడు రెండు చేతులూ జోడించి లేచాడు.

సూర్యకాంతం వేపు చూస్తూ అన్నాడు "నా తల్లికి నేనే పెళ్ళి చేస్తాను" రాజమ్మ చిన్నగా నవ్వింది.

వీరయ్య నమస్కరిస్తూ "వస్తూ ఉండండి" అన్నాడు.

"తప్పక వస్తాను"

రామచంద్రుడు మెట్లు దిగాడు.

రాజమ్మ కళ్ళను తుడుచుకుంటూ అనుకుంది.

రామచంద్రుడు నిజంగా ఆ పేరుకు తగ్గ శ్రీరామచంద్రుడే ఒకటే బాణం, ఒక్కరే భార్య. భార్యను వెతుక్కోలేక మరొకర్ని ఆశ్రయించి వెతకమని చెప్పాడు ఆ శ్రీరామచంద్రుడు, కనపడగానే నిందమోపాడు. ఈ రామచంద్రుడు చేతకాని తనాన్ని ఒప్పుకున్నాడు. కనపడినా నిందమోపలేదు. అంతేతేడా! తరువాతి జీవితంలో ఆటుపోటుల అనుభవంతో అందరి మంచీ కోరుతూ చేతనయిన సాయం చేస్తూ ముందుకు సాగిపోతోంది రాజమ్మ అదే అదే. రాజుమామ్మ.

## ప్లాసిబో

చామర్తి ఆచార్య

"**దేవుడంటూ ఎక్కడో ఉండదు**. మనుషుల్లోనే ఉంటాడు. వాడినే మనం అంతరాత్మ అంటాం."

★ ★ ★

"నా పెళ్ళి కుదిరింది సార్. మీరు తప్పగ రావాలి," అంది కొత్తగా నా ఆసుపత్రిలో చేరిన నర్సు. శుభలేఖ తెరిస్తే మొత్తం తమిళంలో ఉంది.

"ఎక్కడా పెళ్ళి?" యథాలాపంగా అడిగాను.

"మా వూరులో సార్... కురత్తి అరై అని నాగర్‌కోయిల్‌కి దగ్గర– చాల బావుంది రండి సార్"

"అంత బావుండేదేముంది మీ వూర్లో?"

"నాగర్‌కోయిల్‌లో నాగరాజర్ టెంబుళ్, మా వూర్లో మా సామియార్... అంటే మా వూరి బాబా అన్నమాట్ట. చాల పవర్‌ఫుళ్ సార్. నేచురోబది, యాక్యుప్రెషర్ లాణ్టివి ఏవేవో చేసేస్తారు. మీ చాల ఇండరస్టింగ్ గా వుంటుంది... రండి సార్"

అని చెప్పుకుపోతున్న ఆమెని ఆపి,

"మనం వైద్యులం. బాబాలని నమ్మకూడదు. ఒకవేళ నమ్మినా, ఇలా బయటకి చెప్పకూడదు," అని నవ్వాను.

"మీక్కు కోబం వస్తుందని ఇంతవరకు ఎప్పుడూ చెప్పలేదు సార్. మా సామియార్‌కి 'శాబ సామియార్', 'శాబం పెరుం సామియార్' అని పేరు. మా చుట్టు పక్కల వూరుల్లో ఎక్కడైనా దప్పు జరిగితే మా సామియార్ శాబం పెడతారు. వారం రోజుల్లో ఆ తప్పు చేసినవాడు వాడంతట వాడు దొరికిపోతాడు..." అంటూ ఆమె చెబుతూంటే... ఆ క్షణాన్నే... ప్రయాణానికి నిశ్చయించేశాను.

కురత్తి అరైలోను, ఆ చుట్టుపక్కల ఊళ్ళలో తగవులన్నీ బాబా రాకముందు వాళ్ళ వాళ్ళ పంచాయితీల్లోనే తీరేవట. కోర్టులూ అవీ అక్కడి ప్రజలకి తెలియవు. ఈ బాబా వచ్చాక పంచాయితీ కంటే కూడా ముందు ఆయన తీర్పునే కోరుకుంటున్నారు జనం. ఒక్కో బాబాకి ఒక్కో ప్రత్యేకత ఉన్నట్టు ఈ బాబా– శాపాల బాబా! ఇది వినగానే శర్మ అయి వుండొచ్చుననిపించింది. అందుకే బయలుదేరిపోయాను.

★ ★ ★

కురత్తి అరైలో పెళ్ళి అయ్యాక, బాబా ఆశ్రమానికి తన తమ్ముణ్ణి తోడిచ్చి పంపింది మా నర్సు. నేను ఆశ్రమానికి చేరేసరికి ఓ పాతికమంది జనమున్నారక్కడ. మధ్యన ఉన్నాడు మా శర్మ. పోల్చటానికి కాస్త కష్టమైనా, వాడే– మా శర్మే.

అక్కడ జరుగుతున్నది వివరించాడు నర్సు తమ్ముడు. అది గతవారం జరిగిన తగవు. ఇంట్లో బంగారం దొంగిలించిందని అక్కడ వున్న ముసలామెని ఆమె కొడుకు, కోడలూ ఇంటినుంచి గెంటేశారుట. ఆమె వచ్చి మొర పెట్టుకుంటే సామియార్ 'పాపం చేస్తున్నవాళ్ళకి తిన్నది ఏదీ అరగక వారం రోజుల్లో నాశనమైపోతా'రని శపించారట. ఇవాళ అత్తాకోడళ్ళిద్దరూ కడుపునొప్పితో బాబాదగ్గరకొచ్చారు! అసలు జరిగింది కోడలు చెప్పేసింది– ముసలామె నోరు మంచిది కాదట. ఇంట్లో కూర్చొని కోడల్ని కొడుకునీ నానా సాధింపులూ వేధింపులూ పెడ్తోందట. ఇది భరించలేక తానే ఇంట్లో బంగారాన్ని దాచేసి నేరాన్ని అత్తపైన మోపింది కోడలు. కొడుకు గెంటేశాడు.

జరిగింది విని తగవు తీరిందని కొందరు సంతోషిస్తున్నారు. కొందరు రట్టైన గుట్టును విని నవ్వుతున్నారు. అందరూ కలిసి 'సామియార్... సామియార్...' అంటూ శర్మకి మొక్కుతున్నారు.

అలజడి కాస్త తగ్గనిచ్చి, నేరుగా శర్మ ముందుకు పోయి మోకరిల్లాను. "నువ్వొచ్చి ఓ ప్రాణాన్ని నిలబెట్టాలిరా శర్మా! ...రంగడు చావుబతుకుల్లో ఉన్నాడ్రా... నీ గురించే కలవరిస్తున్నాడు!" అన్నాను.

నన్ను పోల్చుకోడానికి అరక్షణం పట్టింది.

"మీరు... రవంణా నువ్వా? ...రంగడికి చావా?!" అన్నాడు

మరునాడు నాతో పాటు రైలెక్కేశాడు. చుట్టుపక్కల పల్లెలనుంచి ఓ వందమంది వరకు స్టేషనుకొచ్చి తమ సామియార్‌ని దిగబెట్టారు.

ఎవరేమనుకున్నా, శర్మ ఒక గొప్ప సైకియాట్రిస్ట్ అవుతాడని నాకు చాలా నమ్మకముండేది. ఇలా గడ్డాలు, మీసాలు, జడలు కట్టిన జుట్టుతో, తమిళనాడు మారుమూలలో బాబాగా కనిపిస్తాడని ఎప్పుడూ అనుకోలేదు.

అయితే, ఎప్పుడో ఒకప్పుడు తారసపడతాడనీ నేను రమ్మనగానే వెంట వచ్చేస్తాడనీ నా సిక్స్త్ సెన్స్ చెబుతూ వచ్చింది.

★ ★ ★

శర్మ పూర్తి పేరు గోపాల శర్మ. మా బడిరోజుల్లోనే అందరూ వాడికి పెట్టేసిన పేరు శాపాలశర్మ.

రంగడితో కలిసి నేనూ శర్మా పార్వతీపురం సర్కారుబడిలో చదివాం.

మొదటినుంచి శర్మ తంతు వింతగా వుండేది. అమిత మితభాషి. నిరంతరం ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. మాకు జీర్ణంకానంత లోతుగా మాట్లాడేవాడు. ఎవరిజోలికీ ఎప్పుడూ పోని ఆ మనిషిని రగిలించామా– పట్టరాని కోపంతో ఊగిపోయేవాడు... చివరికి 'శపించేవాడు'! ఆ శాపానికి గురయిన వాడు శర్మ చెప్పిన గడువులోపు శర్మ చెప్పినట్టే బలైపోయేవాడు. వాడి ఆజానుబాహు విగ్రహమా, గాంభీర్యానికే గుబులెత్తించే వాడి స్వరతంత్రమా, ఎదుటివాడిని కట్టిపడేసే ఆ కళ్ళ తీక్ష్ణతా? శక్తి దేనిదైనా ఈ వింతకి మేం ప్రత్యక్షసాక్షులం.

మా తొమ్మిదో తరగతిలో మొదటిసారిగా వాడి శాపాలవింత వెలుగులోకొచ్చింది. మాకు తెలుగు చెప్పే రాజారావు మాష్టారికి బూతుపంతులని పేరు. మాది బాలురపాఠశాల కావడంతో మరీ మితిమీరిపోయేవాడు. శర్మ రగిలిపోయేవాడు. ఆరోజు 'పార్వతి తపస్సు' పాఠం. తరగతి గదిలో రాజారావు మేష్టరు చెబుతున్న దరిద్రానికి శర్మ కోపం హద్దులు దాటేసింది. బలహీన క్షణం రానే వచ్చింది. రాజారావు పాపం పండిపోయింది.

దిగ్గున లేచిన శర్మ చరచరా వెళ్ళి మేష్టారి చెయ్యి పట్టుకున్నాడు. మరో చేత్తో తన జంధ్యాన్ని బయటకి తీసి పట్టుకుని, "గురువన్న గౌరవం కొద్దీ మిమ్మల్ని ఇన్నాళ్ళూ భరించాం సార్. మీరా అర్హతని పోగొట్టుకున్నారు. ఈ రోజు పదో తారీఖు. మీరు చేస్తున్న పాపం మీ వెనుకనే మీకు నిలువెత్తు గొయ్యి తీస్తూ వస్తోంది. ఇది మీకు లోలోన తెలుసు. ఈ రోజు పదో తారీఖు. ఈ నెలాఖరులోపు మీరు చేసిన కర్మ ఫలితం అనుభవిస్తారు. మీ పాపాలు మిమ్మల్ని పట్టి పీడించే కాలం వచ్చింది. అనుభవించండి..." అనేసి, చరచరా వచ్చి కూర్చున్నాడు.

రాజారావు మేష్టరుతో పాటు పిల్లలమంతా బిత్తరపోయాం. తేరుకున్న కొందరు ఏం చెయ్యాలో తెలీక ముసిముసిగా నవ్వుతున్నారు. కొందరు, 'వీడికివ్వాళ బడితపూజే' అని గొణుగుతున్నారు.

చిత్రంగా, రాజారావు మేష్టరు శర్మని ఏమీ అనలేదు. ఏదో ఆలోచిస్తూ అలాగే చాలాసేపు నిలిచుండిపోయాడు. గంట కొట్టాక ఎటో చూస్తూ వెళ్ళిపోయాడు. అలా వెళ్ళినతన్ని మేం మరి చూడలేదు. శర్మ శపించిన రెండో రోజున ఎప్పటినుంచో జబ్బుతో మంచాన పడి ఉన్న అతని భార్య కాలం చేసింది. కొద్దిరోజుల తర్వాత రాజారావు మేష్టరు కూడా మంచం పట్టేశాడు. పక్షవాతంతో పోయాడు.

అప్పట్లో అది పెద్ద సంచలనం. బడిపిల్లలకి శర్మ ఒక జానపద నాయకుడూ, మాంత్రికుడూ అయిపోయాడు. నేనా ఊసుల్ని శర్మకి చెప్పేవాడిని.

"నీకు కూడా నేనంటే భయమా?" అన్నాడో రోజు.

"తెలీదు... అయినా మేష్టారి భార్యని నువ్వేం అనలేదుగా. అయినా ఆవిడ పోయారు మరి..." అన్నాను. నిజంగానే రాజారావు మేష్టరుకి శర్మ శాపం తగిలిందని నేను మనస్ఫూర్తిగా నమ్మలేదు. అలా అని జరిగినదంతా కాకతాళీయమని కొట్టిపారేసేందుకూ మనసొప్పలేదు.

"నువ్వు చెప్పు... నీ మాటకి మహిముందంటావా?" అని నిలదీస్తే–

"దేవుడున్నాడు. ఆయనదీ అసలు మహిమ," అన్నాడు.

ఇదే ప్రశ్నని నేను చాలాసార్లు అడిగాను. సూటిజవాబు ఎప్పుడూ రాలేదు.

మొత్తానికి మా ఊరి జమీందారీ కుటుంబం నుంచి వచ్చిన నేను, ఊరి చివరన ఓ చిన్న పెంకుటింటికి వారసుడైన శర్మా మంచి స్నేహితులమయ్యాం. శర్మ తండ్రికి ఒక ఎకరం పొలం ఉండేది. దాని మీద, ఊరి పౌరోహిత్యం మీద వచ్చే ఆదాయంతో వాళ్ళ కుటుంబం నడిచేది.

మా కుటుంబగౌరవం నిలబెట్టెయ్యాలని నేను, కేవలం నేనెళ్తున్నాననే శర్మా– ఇద్దరమూ ఎంబీబీయెస్ ఎంట్రన్స్‌కి వెళ్ళాం. నాకంటే మంచి ర్యాంకొచ్చిన శర్మని చూసి వాళ్ళ నాన్న పొంగిపోయారు. అంత ఖర్చు చదువు అవసరమా అని మా నాన్నతో సహా ఊరంతా వారించినా, వాడిని నాతోపాటు కాలేజీ మెట్లెక్కించారు.

హాస్టల్‌లో మొదటిరాత్రి ర్యాగింగ్ అన్నారు. చేయకూడని పనులూ, వికృత చేష్టలూ. శర్మ గురించి తెలియని సీనియర్లు చేతులు కాల్చుకున్నారు. శర్మ కోపానికీ శాపానికీ గురయిన వారంరోజుల్లో ఒకడింట్లో శవం లేస్తే, మరొకడికి ఇల్లే కాలిపోయింది. మరో వారానికి జరిగిన ప్రమాదంలో ఒకడికి కాలు విరిగింది, మరొకడికి కన్నుపోయింది.

మళ్ళీ నా ప్రశ్నని శర్మ ముందుకు తీసుకొచ్చాను. "ఇదంతా నీ శాపఫలితమే అంటావా? ఎవరో పోవడం, ఎక్కడో ఇల్లు కాలడం... అనుకోకుండా జరిగినవి కాదంటావా?"

"దేముదున్నాడు. ఆయనే అన్నింటినీ జరిపిస్తాడు," అని జవాబు. పదాలు మారినా అదే భావం.

రెండో ఏడాది పరీక్షలయ్యాక శర్మ నాన్నగారు కాలం చేశారు. శర్మ చదువుకి సాయం చేయమని మా నాన్నని శతవిధాల బ్రతిమిలాడాను. కానీ ఫలితం లేకపోయింది. నా బాధ చూసి శర్మే నాకు నచ్చజెప్పాడు.

"బహుశా డాక్టరు కావటం నాకే ఇష్టం లేదేమో. నన్ను డాక్టర్ని చేయాలనే మా నాన్న సంకల్పం కూడా గట్టిది కాదేమో– లేకపోతే ఆయన ఇంకా బ్రతికేవారు. నాకు విచారం లేదు. నువ్వు బాధ పడటం కూడా అనవసరం," అని మా ఊరెళ్ళి పొలం పనీ, పౌరోహిత్యమూ మొదలుపెట్టేడు శర్మ.

మరో నాలుగేళ్ళకి మా ఊర్లోనే నానూ స్వంత ఆసుపత్రిని ప్రారంభించాను. చుట్టుపక్కల ఊళ్ళకి మంచి డాక్టరుగా, వాళ్ళ పాలిటి దేవుడిగా పేరుపడ్డాను. ఆ సమయంలో మా మధ్యకొచ్చాడు రంగడు. మా పదవ తరగతి తర్వాత మాయమయిన రంగడు!

పీడకలల్లాంటి రోజులవి.

పోలీసుజీపు ఇంటిముందాగి, "ఎస్పీగారు మిమ్మల్ని తీసుకురమ్మన్నారండీ," అంటే బయలుదేరేను. విజయనగరం ఎస్పీ ఆఫీసులో 'సర్‌ప్రైజ్' అంటూ రంగడు ప్రత్యక్షమయ్యాడు.

పెరిగిన హోదాతో మరీ డాంబికంగా తయారయ్యాడు. ఆఫీసులోనే చిన్న ఫ్రిడ్జ్ పెట్టించి అందులో బార్ పెట్టేశాడు. అందులోంచి ఆకుపచ్చని లిక్కర్ సీసా తీసి 'ఆబ్సింథె' అన్నాడు. మద్యాలన్నింటిలోకి అతి ఎక్కువ ఆల్కహాల్ స్థాయి ఉండేది అదే అని దాని ఖరీదు పైన ఒక ఉపన్యాసమిచ్చి, పింట్ గ్లాసుల్లో పోసి, లైటర్‌తో అంటించి, మంటతోపాటే నోట్లో వంపుకుని తాగేశాడు. నేను తటపటాయిస్తుంటే బొకబొకా నవ్వేసి జానివాకర్ సర్వ్ చేశాడు.

కాస్త మత్తెక్కాక బడిరోజుల్ని తలచుకున్నాడు. "మన బడి వదిలేశాక హైదరాబాదెళ్ళిపోయాను. పెద్ద ఊళ్ళల్లో ఉండటం వల్ల మన ఆలోచనల స్థాయి పెరుగుతుందిరా– నువ్వు ఏమైనా అనుకోగాని," అన్నాడు. "ఇప్పుడూ నిన్నే చూడు. అంత డాక్టరు చదువూ చదివేసి ఠంచనుగా మీ ఊరెళ్ళిపోయావు. పోనీ అంతటితో ఆగావా? సొమ్మంతా తగలేసి అక్కడే పెద్ద ఆస్పత్రి కట్టేసేవు. నీకు తెలీదని కాదు. అదే అలా ఏ విశాఖపట్నమో, విజయనగరమో వచ్చి ఓ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్ కట్టేవనుకో. ఈ పాటికి మీ ఆస్తి డబలైయుండేది గదా? ...

రవ(ణా, సంపాదించే సమయంలోనే సంపాదించుకోవా(లా. కనీసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో విజిటింగ్ డాక్టరుగా ఉండు. కావాలంటే నేను రికమెండ్ చేస్తానిక్కడ," అన్నాడు.

నాకీ పరుగులు ఇష్టముండవు. నాన్న సంపాదించినది నేనేం తగలబెట్టెయ్యలేదు. మా హాస్పిటల్ కట్టడానికి అయిన ఖర్చు మరో రెండేళ్ళలో తిరిగొచ్చేస్తుంది. చుట్టూ ఉన్న పది పదిహేను ఊళ్ళకి ఆ ఆస్పత్రే పెద్ద దిక్కిప్పుడు. ఆ ప్రపంచం, అందులో దొరికే గౌరవం నాకు ఇక్కడ ఆస్పత్రుల మధ్యన పరుగుల్లో దొరకదు. అదంతా వాడికి చెప్పడం అనవసరమైన సంజాయిషీ ఇచ్చుకోడమే. నేను మౌనంగా ఉండిపోడం చూసి, "సర్లేరా నాయనా... అనవసరంగా కెలికేను. నన్ను క్షమించెయ్. ఇంకా మన వాళ్ళ విశేషాలేంటి?" అన్నాడు.

"మన వాళ్ళంటే– శర్మ గుర్తున్నాడా... మా ఊళ్ళోనే ఉంటున్నాడు."

మత్తుగా మూసుకుపోతున్న కళ్ళను గభాలున తెరిచి, భళ్ళున నవ్వి, "ఎవడు? ఆ శాపాల శర్మగాడా?" అన్నాడు.

"గుర్తున్నాడా?"

"ఎందుకు లేదు? ఇంకా శాపాలమీదే బ్రతుకుతున్నాడా? ఒరే దయచేసి ఆ ఊరినొదిలెయ్యరా బాబూ... బోల్డంత ప్రపంచముంది బయట."

"ఏరా! శర్మ అంటే అంత భయమా? ఏకంగా ఊరొదిలెయ్యమంటున్నావ్?" నవ్వుతూ అడిగాను.

"నేనయితే నమ్మింది లేదు. కానీ మనం నమ్మలేనివి మన చుట్టూ చాలానే ఉంటాయ్. అలాంటి తలనొప్పులకి మనం వీలైనంత దూరంలో ఉండటం మంచిదంటున్నాను. చేతగాని వాళ్ళ మధ్యన తిరుగుతుంటే మనమూ అలానే తయారౌతాం. అర్థమైందా?" అన్నాడు. అప్పటికే మనిషి తూలుతున్నాడు. చీకటి పడిందంటూ లేచాను.

"సారీరా... భోజనానికి ఇంటికి తర్వాతెప్పుడైనా వెళ్దాం. తాగి ఇంటికెళ్తే గొడవలైపోతాయ్..." అని పళ్ళు ఈగరించాడు.

★ ★ ★

రంగడి పరిచయమైన వారానికి ఓ రోజు పొద్దున్నే శర్మ మా ఇంటికొచ్చాడు.

"రవ(ణా... తొందరగా బయల్దేరు," అన్నాడు.

"ఎక్కడికి?"

"నా పొలానికి. కుప్ప నూరుస్తుంటే పంట వాడింటికి తోలుకుపోతున్నాడు జగ్గడు. వెంట సూరిగాడినేసుకొచ్చాడు"

జగ్గడు మా వూరి ఒకప్పటి కరణం. వాడి కొడుకు సూరి– ఊరికి రౌడీ.

పొలానికి మేం చేరేసరికి జనం బాగానే చేరారు. కానీ జగ్గడి ముందు ఎదురు మాట్లాడే ధైర్యం ఎవరికీ ఉండదు. అది జగ్గడికి బాగా తెలుసు.

"జగన్నాథంగారూ! ఊరి పెద్దని తీసుకొచ్చాను. ఇప్పుడు చెప్పండి," నన్ను ముందుకు తోస్తూ అన్నాడు శర్మ. నేను కూడా తగవుల్లోకి చొరవ చూపే మనిషిని కాను. అది కూడా జగ్గడికి తెలుసు. నింపాదిగా నా చేతిలో దస్తావేజు వుంచి అన్నాడు జగ్గడు–

"మామూలు కథే సార్. ఈయనగారి ఎంబీబీయెస్‌కి ఈయన తండ్రిగారు ఈ పొలాన్ని తాకట్టు పెట్టారు. అప్పు తీర్చే దిక్కెలాగూ లేదు. పంట జప్తుకు కూడా అడ్డు చెప్తున్నారు. గతేడాదే జప్తు చేయాల్సింది పొలాన్ని..."

జగ్గడి వైపు నిప్పులు కక్కేలా చూస్తూ, "అందులోని సంతకాలు మా నాన్నవి కావు రవఁణా... మా పొట్టకొట్టి ఏం బాగుపడతావ్? ఇప్పటికే ఎంతమంది నాలాటివాళ్ళ ఉసురు తగిలిందో, కన్న కొడుకు వీధిగూండాగా తయారయ్యాడు..." అన్నాడు శర్మ. మనిషి కోపంతో రగులుతున్నాడు.

ఇరుపక్షాలనీ శాంతపరచాలని, "సంతకాల దగ్గర పేచీ ఉన్నపుడు వీలైనంత తొందర్లో ఊరి పెద్దల మధ్యన పెట్టి తేల్చేద్దాం జగన్నాథంగారూ" అన్నాను.

"మీరు ఊరి పెద్దలే కదండీ. స్నేహితుడికోసం ఎన్ని ధర్మపన్నాలైనా చెబుతారు మీరు. అప్పిచ్చిన వాడిని నేను. నష్టపోతున్నది నేనే. పంచాయితీలకీ కోర్టులకీ నేను రాను. మీరు వెళ్తామూ అంటే అడ్డూ పెట్టను. తప్పకుండా వెళ్ళండి సార్," చేతులు జోడించాడు జగ్గడు. వాడి వినమ్రత చూస్తే నాకే ఒళ్ళుమండిపోయింది. శర్మ విషయం చెప్పాలా!?

ఒక్క ఉదుటన వెళ్ళి జగ్గడి చొక్కా పుచ్చుకున్నాడు. చింతనిప్పుల్లాంటి కళ్ళతో, "జగ్గా! మోసాన్ని తిని బతుకుతున్నావు... ఇది నిన్ను మింగేస్తుంది..." అంటున్నాడు శర్మ. జంద్యం బయటకి తీయడానికి రెండో చేయి చొక్కాలోకి పోయింది.

జరుగుతున్నది అందరికీ అర్థమైపోయింది. మొదట తేరుకున్నది సూరి. శర్మ మీదకి దూకి బలంగా తోసేశాడు. ఆ ఊపుకి శర్మ కాళ్ళూ చేతులూ గీరుకునిపోయి రక్తమోడింది. అదే ఊపుకి జగ్గడు కూడా కూర్చున్న కుర్చీతోనే తిరగబడిపోయాడు. సూరి మనుషులు జగ్గడ్ని లేవదీస్తుంటే నేనెళ్ళి శర్మని పట్టుకున్నాను.

శర్మ వల్లిస్తూనే వున్నాడు– "ఇదే నీ ఆఖరి మోసం జగ్గా... గుర్తుంచుకో. దేవుఁడు వేస్తున్న లెక్కల్లో నీ వాటా పూర్తైపోయింది..."

మరొక్క మాట మాటాడితే చంపేస్తానన్నాడు సూరి. శర్మ తగ్గితేనా? బలవంతంగా లాక్కెళ్ళిపోయాను.

ఆరోజు రాత్రి రెండింటికి మా ఆస్పత్రి నుంచి కబురొస్తే పరుగెత్తేను.

జగ్గడికి గుండెపోటు తిరగబెట్టింది. ఇది మూడోసారి. గంట పోరాడితే ప్రాణాలు దక్కాయి. కానీ పక్షవాతం కమ్మేస్తోంది.

సైగలతో సూరికేదో చెబుదామని ప్రయత్నిస్తున్నాడు.

తెల్లవారుతుండగా శర్మ మా ఇంటికొచ్చాడు. జగ్గడిని కలసి, తనకి జగ్గడిపైన కోపం లేదనీ, ఏమీ కాదనీ, అయితే తనకు మాత్రం అన్యాయం చెయ్యొద్దనీ చెబుతానంటాడు!

జగ్గడి పరిస్థితి చెప్పి, శర్మని చూడగానే వాడి ప్రాణం పోయే అవకాశముందనీ నచ్చజెప్పి, బలవంతంగా శర్మ ఇంటికి తీసుకెళ్ళాను. శర్మ ఇంటి దగ్గర మాకు సూరి దర్శనమిచ్చాడు! నూర్చిన పంటంతా ఇంటి వసారాలో పెట్టిస్తున్నాడు.

పనివాళ్ళని పంపేశాక శర్మ చేతికి దస్తావేజులిచ్చాడు. "శర్మా! నీ పంట ఇంటికి చేరింది. నీ దస్తావేజులు నీకు ముట్టాయి. ఇంక మా నాన్నని విడుదల చెయ్యి. సాయంత్రంలోపున మా నాన్న ఇంటికి రాలేదో, నీకూ నీ ఇంట్లో ఎవరూ మిగల్రు. నీ తల్లికీ పెళ్ళానికీ ఇదే ఆఖర్రోజవుతుంది," అని వెళ్ళిపోయాడు.

★ ★ ★

మా ఊరి పోలీసుల చుట్టూ తిరిగాక జగ్గడి ప్రాబల్యం పూర్తిగా తెలిసొచ్చింది మాకు. దాంతో విజయనగరం బయల్దేరాము– రంగడికోసం.

నాలుగు గంటల నిరీక్షణ తర్వాత, "మిమ్మల్నొక్కర్నే లోనికి రమ్మంటున్నారండీ సారు," అన్నాడు అటెండర్ నన్నుద్దేశించి.

శర్మని బయటుంచి లోపలికెళ్ళాను. నన్ను చూస్తూనే ఖస్సుమన్నాడు రంగడు. "ఆ శర్మగారినెందుకు తెచ్చావిక్కడికి?" అని రంకెలేశాడు.

విషయమంతా చెప్పాను.

"అందుకే ఈ టక్కుటమార విద్యలొద్దనేది. వాణ్ణి మీ ఏరియా అంతా చేతబడులు చేసేవాడనుకుంటోందిరా... ఇప్పుడు వాడికి నా ప్రొటెక్షనా? మీ లోకల్ పోలీస్ స్టేషన్‌కి పొండిరా నాయనా..."

"అదీ అయ్యిందిరా. మా ఎస్సైకీ, సీఐకీ కూడా జగ్గడితో లాలూచీ ఉన్నట్టుందిరా. ఎంత చెప్పినా, 'అలాగే, సరే' అంటున్నారుగానీ కదలట్లేదు. నువ్వు చెబితే వింటార్రా..."

"ఆ యెదవలు ఇంతవరకూ మీ కరణం దగ్గర ఎంత తిన్నారో! లోకల్ ఎమ్మెల్యేనో ఎంపీనో వీళ్ళందరి వెనకా వుంటారు. రవంణా! స్నేహం అని చెప్పి పెంట తీసుకొచ్చి నా నెత్తిమీద పెడుతున్నావ్..."

"అలా అనెయ్యకురా. స్నేహితులని కాదు. నీ పరిధిలోని తగవుగా తీస్కో. నువ్వు తలుచుకుంటేనే నీ పేరు చెప్పుకుని వాడి కుటుంబం బతుకుతుంది"

"సర్లే. ఏదో బెదిరించి వుంటాడుగానీ వీడి శాపాల భయానికి ఆ సూరిగాడు కూడా వీడి జోలికి రాడు. ఆ ఎస్సైగాడితో నేను మాటాడతాను, నువ్వు బయల్దేరు" వీలైనంత విసురుగా అన్నాడు.

బయల్దేరే సరికి చీకటి పడుతోంది. కాసేపటికే మా ఆస్పత్రినుంచి ఫోను– జగ్గడు పోయాడు... ఏ హడావుడీ లేకుండా.

వెంటనే రంగడికి ఫోన్ చేశాను. స్విచ్‌డ్ ఆఫ్.

జగ్గడు పోయాడనీ, శర్మకి ప్రొటెక్షను అవసరమనీ మెసేజ్ పెట్టేను.

ఊర్లో ప్రవేశించాక నేరుగా శర్మ ఇంటికే కారుని పోనిచ్చాను. వీధిలోకి తిరుగుతుండగానే తగలబడిపోతున్న శర్మ ఇల్లు కనబడింది.

★ ★ ★

శర్మ పిచ్చివాడిలాగా అయిపోయాడు. పెళ్ళాం, తల్లీ పోయిన రెండోరోజు ఆ తగలబడిపోయిన ఇంటి చుట్టూనే తిరుగుతూ ఉంటే చూసి వాడిని మా ఇంటికి తీసుకొచ్చాను.

మాట లేదు. తిండి లేదు. పెరట్లో గంటల తరబడి మౌనంగా గడిపేశాడు.

చీకటి పడుతుండగా రంగడొచ్చాడు. ఇంతకుముందటి దర్పంలేదు. లోనికి రమ్మంటున్నా వరండాలోనే కూర్చుండిపోయాడు. చాలాసేపు తటపటాయించి, సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్టు అన్నాడు– "సూరిగాడిని పట్టుకున్నాం... కేసుని నేనే దగ్గరుండి చూస్తున్నాను... ఆ రోజు ఎస్సైకీ సీఐకీ చెబుదామని... నిజంగానే... ప్రయత్నించార్రా... ఇద్దరూ ఫోన్లో దొరకలేదు. కబుర్లు పెట్టినా లేటైపోయింది. ఎస్సై పైన యాక్షన్ కూడా తీసుకుంటాను..."

"ముందుకు లోపలికి రారా"

"ఫర్లేదురా... జగ్గడు పోయిన రోజునుంచి నేను దీనిమీదే పనిచేస్తున్నాను. శర్మకి నేను ఏ హాని చేయలేదురా. ఇది చెప్పిపోదామనే వచ్చాను," అని లేచాడు. తన కారువైపు నడుస్తూ కూడా ఇంకా గొణుగుతున్నాడు– "ఎవరు నమ్మినా నమ్మకున్నా, నేను వాడికి నేరుగా నేను ఏ హాని చేయలేదు..." అని నా వైపు అనుమానంగా చూస్తూ అడిగాడూ, "వాడు నన్ను ఏమైనా అన్నాడా?"

"అంటే?"

"అంటే... తిట్టుకున్నాడా?" పాలిపోయిన ముఖంలో అంతులేని భయం.

"అదేం లేదు. శాపాల గురించేగా? నీ పైన ఎలాంటి శాపాలూ పెట్టలేదు. జరగకూడనంత హానీ జరిగిపోయాక వాడు ఇంక ఎవరిని శపించాలి? తిడితే ఆ దేవుడ్ని తిట్టాలి," అన్నాను కసిగా.

కారెక్కబోతుంటే అక్కడున్నాడు శర్మ! రంగడు కొయ్యబారిపోయాడు.

"మాటలూ, చేతలూ మనవి. నటనలన్నీ మనవి. పాపాలేంటి, పుణ్యాలేంటి– పద్దులన్నీ బేరీజు వేసి బాకీలు తీర్చేదీ మనమే... అక్కడ భగవంతుడు వట్టి ప్రేక్షకుడు..." నిద్ర లేక ఎర్రబడ్డ కళ్ళూ, మాసినగడ్డం, తిండిలేక పీక్కుపోయిన ముఖంతో ఉన్నశర్మని చూస్తూ వాడు వల్లిస్తున్న మాటల్ని వింటుంటే నాకే గుబులు పుట్టింది.

తత్తరపడుతూ కారెక్కి వెళ్ళిపోయాడు రంగడు. ఆ చీకటిలోనే శర్మ కూడా మాయమయిపోయాడు. అప్పటినుంచి ఊళ్ళోను, చుట్టుపక్కలా ఎంత వెదికించినా ప్రయోజనం లేకపోయింది.

★ ★ ★

ఏడాది తర్వాత రంగడు మా ఇంటికొచ్చాడు– భారీ ఊబకాయంతో.

"బాగా తాగుతున్నావా?" అడిగాను చనువుగా.

చప్పున నా చేతులు పట్టుకున్నాడు. "శర్మతో అర్జెంటుగా మాట్లాడాలా. ఎక్కడున్నాడో చెప్పావా, ప్లీజ్!" అన్నాడు.

"వాడు నాకు కనబడి ఏడాది దాటుతోందిరా. ఎక్కడని చెప్పను?"

"సరే... సరే... ఒకవేళ నీకు ఎపుడైనా కనబడితే మాత్రం, వెంటనే నాకు చెప్పు, ప్లీజ్" అంటూ ఆపుతున్నా వెళ్ళిపోయాడు.

తెల్లారాక మళ్ళీ ఇంటి అరుగు పైన రంగడు...

"ఏమైందిరా?" అన్నాను ఆతృతగా.

"శర్మతో మాట్లాడాలా... నేను చెప్పినవన్నీ... అంటే సూరిగాడ్ని మూసెయ్యడం, ఎస్సైని ఇంటికి పంపెయ్యడం– అన్నీ చేసేశాను. సూరికి యావజ్జీవం ఖరారౌతుంది... మీ ఊరి వాళ్ళ సాక్ష్యాలు కూడా పకడ్బందీగా తీసుకున్నాను..."

చెప్పుకుపోతున్న రంగడిని కుదిపి అడిగాను. "రంగా! ఇవన్నీ నాకు తెలుసు. అసలు విషయం చెప్పు"

"ఇదంతా శర్మకి చెప్పాల్రా రవణా!" బేలగా అన్నాడు. వణుకుతున్నాడు. "వాడి శాపం నాకు తగిలిందిరా... నా కుటుంబాన్ని తినేస్తోంది. ఏడాది క్రితం మాకు పుట్టిన ఒక్కగానొక్క పాప హాస్పిటల్‌లోనే ఉండిపోయింది. ప్రిమెచ్యూర్ బేబీ. మా ఆవిడ పిచ్చిదాన్లా అయిపోతోంది. ఈ మధ్య గ్యాస్ట్రిక్ ట్రబులని వెళ్తే... అదేంటి... లివర్ స్లెరోసిస్ అంటున్నారు నాకు"

నిస్పృహగా అన్నాను– "రంగా! లాజికల్‌గా ఆలోచించరా. శర్మ శాపానికీ వీటికీ సంబంధం ఏంట్రా!? నువ్వు ముందు ఈ ఆలోచనలు పక్కనపెట్టి తాగుడు తగ్గించు. నీ భార్యతో ఎక్కువ సమయం గడుపు. నీ కూతురి రిపోర్ట్స్ నేను చూస్తాను"

"అవన్నీ కూడా చేద్దాంరా... కానీ, ఇవన్నీ శర్మ ఇల్లు కాలిపోయాకనే మొదలయ్యాయిరా. ఎందుకైనా మంచిది, శర్మ ఎక్కడున్నదీ వాకబు చెయ్యి. మా డిపార్ట్‌మెంట్ ద్వారా కూడా ప్రయత్నిస్తునాను... నాకీ సాయం చెయ్యిరా..."

డాక్టర్లకి ఇప్పటికీ లొంగనిది మనిషి మనసు. అపరాథభావంలో కూరుకుపోతూ శర్మనుంచి క్షమాభిక్ష కోసం తపించిపోతున్న రంగడిని అశక్తుడనై చూస్తూ ఉండిపోయాను. మరో యేడాది గడిచేసరికి ఉద్యోగం వదిలేసి చావుకోసం ఎదురుచూసే స్థితికొచ్చేశాడు.

ఆ సమయంలో మళ్ళీ ఇలా కనబడ్డాడు శర్మ.

★ ★ ★

"నా కంటే మెరుగ్గా- మెచ్యూర్డ్‌గా ఆలోచించగలవాడివి శర్మా! జీవితంలో అన్ని కష్టాలూ చూసినవాడివి. నీకు క్షమించడం గురించి చెప్పాలంటావా?" అని మొదలుపెట్టాను.

నవ్వుతూ, "రంగడిపైన నాకు కోపం అనీ ప్రతీకారంలాంటివేవో నాలో ఉన్నాయనీ ఊహిస్తున్నావా? అలాంటివి ఉంటే నేను నీతో వెనక్కి వచ్చేవాడినే కాదు కదా రవణా?" అన్నాడు.

చాలా ఆనందమేసింది. "అలా అయితే వాడిని మనం రక్షించవచ్చు శర్మా! నిజానికి నువ్వు మాత్రమే బతికించగలవు"

"నువ్వు చెప్పు. ఏం చేయమంటావు?"

"నీకు జరిగిన అన్యాయానికి వాడిని నువ్వు శపించావనీ తన కష్టాలన్నిటికీ కారణం అదేననీ నమ్మకూడని స్థాయిలో నమ్ముతున్నాడ్రా రంగడు. ఆర్నెల్ల క్రితం వాడి కూతుర్ని హాస్పిటల్ నుంచి ఆరోగ్యంగా డిస్చార్జ్ చేసేశారు. ఆ పిల్ల ఇల్లు చేరాక వాడి భార్య కూడ కోలుకుంటోంది. వాడికున్న ఒకే ఒక సమస్య ఇపుడు తాగుడు, దానివల్ల చెడిన కాలేయం. కొన్ని నెలలుగా తాగుడు కూడా తగ్గిస్తూ వచ్చాం. లివర్ రెస్పాండ్ అవుతోంది. కానీ వాడు శాపాల నమ్మకంలో ఎంతలోతు కూరుకుపోయాడంటే, తను హాస్పిటలైజ్ అయ్యాకనే భార్యా కూతురూ బాగుపడుతున్నారనడం మొదలుపెట్టాడు. తాను పూర్తిగా బలైపోతేనే ఆ భార్యా కూతురూ క్షేమంగా బతికిపోతారంటాడు! ఆ నమ్మకాన్ని బద్దలు చేయడం మన ముందున్న ఛాలెంజ్. హాస్పిటల్‌లోని సైకాలజిస్టూ నేనూ కలసి వాడి ఆలోచనల్ని అదుపుచేస్తూ వస్తున్నాం. తార్కికతని వాడి ఆలోచనల మూలాల్లోకి చొప్పించడానికి ప్రయత్నిస్తున్నాం. ఇక ఇప్పుడు నువ్వే ప్రత్యక్షంగా శాపాలు కల్ల అని చెబితే ఖచ్చితమైన ఫలితం ఏదైనా ఉండొచ్చని సైకాలజిస్టు ఆశ. నాకూ అది సరైన ఆలోచన అనిపిస్తోంది."

శర్మ నవ్వాడు. భరోసా నిండిన కళ్ళతో.

★ ★ ★

"రంగా! శర్మ వచ్చాడ్రా!" అన్నాను నెమ్మదిగా.

వాడి ముఖంలో ఆనందం, ఆతృత- "ఎక్కడ?" అన్నాడు.

"బయటున్నాడు. వస్తాడు. నీతో మాట్లాడతానంటున్నాడు. వాడు చెప్పేదంతా నువ్వు శ్రద్ధగా విను. నీకు కావలసినంత సమయం తీసుకుని, బాగా ఆలోచించి, ఏ అనుమానాలున్నా దాచుకోకుండా అడుగు. అర్థమైందా?" అన్నాను.

సైకాలజిస్టూ, శర్మా లోనికొచ్చారు. సైకాలజిస్ట్ ఏదో అందామని మొదలెట్టబోతుంటే "ష్..." అని ఆపేశాడు శర్మ. గంభీరంగా రంగడి దగ్గరకెళ్ళి నుదుటిపైన చెయ్యి వేశాడు. రెండో చేతిలోకి జంధ్యాన్ని తీసుకొని కళ్ళు మూసుకున్నాడు.

గడ్డాలూ మీసాలూ జటలు కట్టిన జుట్టులోని శర్మని తదేకంగా చూస్తున్నాడు రంగడు.

"రంగా! రెండు వారాలక్రితం నీ శిక్షాకాలం ముగిసిందిరా. నీకు ఒక కూతురు కదూ?" అన్నాడు శర్మ కళ్ళు తెరుస్తూ.

"ఔను శర్మా!" రంగడి గొంతులో పరవశం.

"మంచి భవిష్యత్తు ఉందిరా. నీ భార్య కూడా నీ కోసం ఎదురుచూస్తోంది... ఈ నెలాఖరుకి ఇంటికెళ్ళిపో," అని చేతిని తట్టి వెనుదిరిగాడు.

"అంటే... నువ్వు నన్ను క్షమించినట్టే కదా?" ఆశ, విస్మయం ఆ మాటల్లో.

"ఇంకేమీ లేదు... ఇకపై అంతా బాగుంటుంది," అని బయటికెళ్ళిపోయాడు శర్మ.

"రవఁణా... సూరిగాడికి యావజ్జీవం పడిందని శర్మకి చెప్పరా..."

"మనం చెప్పక్కర్లేదు... వాడికన్నీ తెలుసు," అనుకోకుండా అనేశాను.

చరాలున లేచెళ్ళిపోయాడు సైకాలజిస్టు.

★ ★ ★

నా ముఖంలో చిందులేస్తున్న ఆనందం నాకు తెలుస్తోంది.

కార్లో నా ప్రక్కన కూర్చున్న శర్మతో అన్నాను–

"నీకు తెలిసే వుంటుంది. 80ల వరకు క్యాన్సర్ రోగులకి డాక్టర్లు ఇంకా ఎంతకాలం బ్రతుకుతారో చెప్పేవాళ్ళు. ఆ రోగులు సరీగ్గా అంత కాలం మాత్రమే బతికేవాళ్ళు. డాక్టరు చెప్పినదే వాళ్ళ జీవితకాలం! డాక్టరు కట్టిన లెక్క తప్పవచ్చు, అసలు లెక్క కట్టేందుకు ఆస్కారమే లేని కేసుల్లో కూడా డాక్టరు చెప్పినదే జరిగేది. అంటే, రోగి జీవిత ప్రమాణం తన డాక్టరు పైన ఉన్న నమ్మకం పైన ఆధారపడేది. ఆ రోగి దృష్టిలో క్యాన్సరుకున్న శక్తి పైన ఆధారపడేది! మరే తర్కమూ లేదక్కడ!! మనిషి మనసూ, నమ్మకమూ చేసిన అలాంటి వింతలెన్నో. అలాగే ఇవ్వడానికి తన దగ్గర మందేదీ లేదని డిస్టిల్డ్ వాటర్ ఇంజెక్షను ఇచ్చినా, రోగి జబ్బులు నయమైన సందర్భాలూ ఉన్నాయి... "

"ప్లాసిబో," శర్మ ముఖంలో చిన్న నవ్వు.

"ఇపుడు రంగడికి నీ మీదున్న నమ్మకం పనిచేయటం మొదలౌతుంది. అయాం ష్యూర్, నెలాఖరుకి వాడు డిస్చార్జ్ అయిపోతాడు."

వైద్యుడిగా నా వివరణ తప్పుదారి పడుతోందనిపించింది. అందుకే మళ్ళీ అన్నాను–

"నిన్ను నేను పూర్తిగా సమర్థిస్తున్నాను అనుకోకు శర్మా! పని జరిగింది, ప్రాణం నిలబడింది. అదే నా ఆనందం. కానీ రంగడిపైన నువ్వు చేసినది కనికట్టు. పూర్తిగా అశాస్త్రీయం. అందులో నీ స్వార్థం కూడా ఉండి ఉండొచ్చు... అంటే– నీ శాపాల్నీ మహిమల్నీ బతికించుకొనే నెపం!"

"అవసరం తీరాక ఎన్ని మాటలంటున్నావ్!?" నవ్వాడు. "నా మాటలు మంత్రాలు కాదని, తిట్లు శాపాలు కాదనీ నువ్వూ మీ సైకాలజిస్టూ కలిసి రంగడిని ఒప్పించటానికి చేసిన ప్రయత్నాలేమయ్యాయి? అంత గాఢంగా మూఢంగా వాడు నమ్ముతుంటే నేనెళ్ళి నావి

శాపాలు కావు, అసలు శాపాలే లేవంటే– వాడిని బ్రతికించడానికి నువ్వే నా చేత ఆ మాటలు చెప్పించావనుకుంటాడు. కాదంటావా? ఆ పైన నన్ను కూడ అనుమానిస్తాడు. అలా వాడిని బ్రతికించేందుకున్న ఒక్క మార్గమూ మూసుకుపోతుంది. రంగడికిప్పుడు కావలసింది శాపాలున్నాయా లేదా అనే తర్కం కాదు. వాడికి కావలసింది శాపవిమోచన!"

"శాపవిమోచన... ఏ కాలంలోకి తీసుకెళ్తున్నావ్ మమ్మల్ని?"

"తర్కానికి అందనిదాన్ని అసలు లేనే లేదు అంటే మనిషి మేథావి ఐపోడు రవ౦ణా. శాపాలు లేవూ అనేస్తే సరిపోదు. ఆస్ట్రేలియా దగ్గర్లో సాల్మన్ దీవులని వున్నాయి. అక్కడి ఆదిమజాతులకి లోహాలూ పనిముట్లూ తెలియవ్. కట్టెలు కావాలన్నా, పోడు వ్యవసాయానికి అడ్డంపడినా చెట్లని శాపాలతోనే పడగొడతారట. రోజూ నిద్రలేచిన వెంటనే ఆ చెట్టు దగ్గరకి పోయి దాన్ని తిడుతూ నానా శాపాలూ పెడతారట. 30 రోజుల పాటు సాగే ఆ తతంగానికి ఎంతటి చెట్టూ మోడైపోతుంది."

"సంగీతంతో వైద్యం కూడా చేయొచ్చన్నదీ నిరూపణ ఐంది. కానీ, ఈ విజ్ఞానాన్ని ఒక నమ్మకంగా వాడుకోడం సరైన పద్ధతి కాదూ అంటున్నాను."

"మనిషి కోరుకున్నదాన్ని దక్కించుకోడానికి కష్టపడాలి రవ౦ణా! కష్టపడలేనివాడు, కష్టానికి ఇష్టపడనివాడూ తప్పుదుదారి తొక్కుతాడు. జగ్గడు డబ్బుతో, ఎస్సై హోదాతో, సూరిలాంటివాడు బలంతో... అవి వాళ్ళ ఆయుధాలు. వాళ్ళాడే ఆటల్లో బలైపోయే నాలాంటి చేతగానివాళ్ళకి మిగిలిన ఆయుధం– మనసుతీరా తిట్టటం, శాపనార్థాలు పెట్టటం. ఇది పైకి మానసిక సాంత్వన కోసమన్నట్లు కనిపించినా, దాని అసలు ప్రయోజనం వేరే ఉంది. బలైపోయేవాడి తిట్లు ఊరకనే పోవు. అవి దౌర్జన్యం చేస్తున్నవాడి అంతరాత్మని తాకుతాయి. వాడి ఆత్మ సాక్షిని తట్టి లేపుతాయి..."

"అంతరాత్మ, ఆత్మసాక్షి... అవి లేనివాళ్ళుంటారుగా..."

"నేను మనుషులని నమ్ముకున్నాను. మృగాలజోలికి పోను," నవ్వాడు.

"మరి దేవుడున్నాడంటూ దైవం మీదకి నెట్టేవాడివేం?"

"అప్పటికి నాకు తెలిసినదది. దేవుడనే వాడెక్కడో ఉంటాడు. పాపాలు చేసే వాళ్ళని శిక్షిస్తాడూ అని."

సాలోచనగా ఆగేడు.

"నా జీవితం మంటల్లో కాలిపోయాక అది ఏ పాపానికి శిక్షో అర్థం కాలేదు. తర్కించుకుంటూ పిచ్చివాణ్ణయిపోయాను. మెల్ల మెల్లగా బోధపడుతూ వచ్చింది అసలు తత్వం. అహం బ్రహ్మో2స్మి. దేవుడు వేరుగా ఎక్కడో లేడు. ఈ సృష్టి అంతటా నిండి వున్న శక్తే దైవం. ఈ విశ్వాన్నంతటినీ కలుపుకుని వున్న వ్యవస్థే దైవం. ఇందులోని ప్రతివస్తువు ప్రతివస్తువుతోనూ ముడిపడి ఉంది. ఈ వ్యవస్థలోనే నువ్వూ, నేనూ, రంగడూ, సూరిగాడూ– అంతా ఉన్నది. మనమంతా కలిస్తేనే ఈ విశ్వమూ– వ్యవస్థా– భగవంతుడూను.

నువు చేసే పాపానికీ పుణ్యానికీ ఈ వ్యవస్థ కర్మసాక్షి మాత్రమే. ఆ పాప పుణ్యాల లెక్కలుగట్టి నీ చేత బాకీలు తీర్పించే దైవాంశ నీ నుంచి వేరుగా ఉండే ఆస్కారమే లేదు. అది మనిషి మనిషిలోనూ దీప్తిస్తూ ఉంటుంది. అదే ఆత్మసాక్షి– అంతరాత్మ– మానవత్వానికి మూలబిందువు.

మనిషి మనిషిపై చేసే దౌర్జన్యాలని అరికట్టటం కోసం మనిషి చట్టాన్నీ, పోలీస్‌స్టేషన్లనీ, కోర్టులనీ సృష్టించుకున్నాడు. వాటిని సృష్టించిన మనిషి నే నేను నేరుగా నమ్ముకున్నాను. వాడిలోని అంతరాత్మని నమ్ముకున్నాను. నిద్దరోతున్న వాడి ఆత్మసాక్షిని తట్టి

లేపుతున్నాను. మానవ వ్యవస్థ, సమాజం ఈ మాత్రం సజావుగా నడుస్తున్నందుకు కారణమైన పాపభీతిని, మానవత్వాన్ని సజీవంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నాను. నేను చేస్తున్నది అశాస్త్రీయమైతే కావచ్చు. కానీ పూర్తిగా నైతికం రవంణా."

రైల్వే స్టేషన్‌కి చేరాం. కార్ దిగుతూ అన్నాడు–

"వీలైతే నువ్వు చేసే వైద్యంలో ఈ సూత్రాల్ని చొప్పించేందుకు ప్రయత్నించు. శరీరంతో పాటు ఆత్మకి కూడా వైద్యం చెయ్..."

"ఇపుడెక్కడి ప్రయాణం?" జవాబు నాకు తెలుసు.

"కురత్తి అరైకి. నీకు నీ ఆసుపత్రి ఒక అర్థాన్నిచ్చింది. నాకంటూ ఒక అర్థం 'సామియార్'గా దొరికింది."

ఒక ఆలింగనం.

ఒక వీడ్కోలు.

ఒక ప్రయాణం కొనసాగుతుంది.

మరో ప్రయాణం మొదలౌతోంది.

❦❦❦

# సబ్బుబిళ్ళ

కుంతి

**చుట్టూరా జనసముద్రముండి,** ఒంటరిగా ఉండాలనుకునేవాళ్ళకు రైల్వే ప్లాట్ ఫారమును మించిన చోటు మరొకటి లేదు. రోజూ గంటసేపు ఇంటి దగ్గర్లో ఉన్న రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారముపై వాకింగ్ చేసి, చివర్లో కాసేపు స్టేషన్ చివరి సిమెంట్ బెంచ్‌పై కూర్చుని రిలాక్స్ అవ్వడము రాధాకృష్ణకు అలవాటు. ఆ రోజు సెలవు దినము కావడముతో పగలంతా ఇంట్లో ఉండి, సాయంత్రము ఇల్లు వదిలి, కాసేపు వాకింగ్ చేసి, ఎప్పటిలాగే సిమెంట్ బెంచ్‌పై కూలబడ్డాడు.

ప్లాట్ ఫారము పై పెద్దగా రద్దీలేదు. వాతావరణము చల్లబడింది. ఇంకొక ప్లాట్ ఫారముపై లింగీ, లింగడు పాలమూరు బండి కొరకు ఎదురు చూస్తున్నారు. మళ్ళీ ఊచల యాదగిరి ఏదో దొంగతనము చేసినట్లున్నాడు. రైల్వే పోలీసులు పట్టుకెళుతున్నారు. చాయ్ అబ్దుల్లా 'చాయ్! చాయ్!' అంటూ అరుస్తూ అప్పుడే బయలుదేరిన ట్రైన్‌లో ఎక్కాడు. చాయ్ అబ్దుల్లా ప్రక్కన ఒక వ్యక్తి కనిపించాడు. అతడిని చూస్తే ప్రయాణికులకు మత్తుమందు కలిపిన బిస్కట్లు ఇచ్చి సర్వము దోచుకునే వాడిలా కనిపించాడు. చూపులు మరల్చాడు. తాను కూర్చున్న సిమెంట్ బెంచ్ పక్కనుండి ఒక మహిళ పోతూ కనిపించింది. ఆమెను చూస్తే చైన్ స్నాచర్ లాగా అనిపించింది. 'ఏమిటో ఎవరిని చూసినా దొంగల్లాగే కనబడుతున్నారు' అనుకున్నాడు.

గత కొన్ని సంవత్సరాలుగా తెలిసిన ప్రదేశాన్ని, తెలిసిన వ్యక్తులను తెలుసుకున్న విషయాలను అనాసక్తిగా గమనించసాగాడు. బయట వాతావరణము ఆహ్లాదకరంగా ఉన్నా, మనసు మాత్రము చేదుగా ఉంది. గతవారము రోజులుగా జరిగిన రెండు, మూడు

సంఘటనలు అతడి మనసును తొలుస్తున్నాయి. ఆఫీస్ బాయ్ పీటర్ గుర్తుకు వచ్చాడు. వారం రోజులక్రింద 'సార్! మా అమ్మకు చాలా సీరియస్‌గా ఉంది. ఒక్క వెయ్యి రూపాయలు ఇవ్వండి' అని అడిగాడు. వాడి కళ్ళల్లో నీళ్ళు, వాడి మాటల్లో ఆర్ద్రత చూసి, తనకు కొంచెము ఇబ్బందిగా ఉన్నా వెయ్యి రూపాయలు ఇచ్చాడు. తీరా తరువాత తెలిసింది, వాడు చెప్పింది అబద్ధమని. వాడు రెండు రోజులు ఆఫీసుకు డుమ్మాకొట్టి బారు చుట్టూ, సారాకొట్టు చుట్టూ తిరిగాడని. విషయము తెలిసి నిలదీస్తే, అబద్ధమాడి డబ్బు తీసుకున్నందుకు సిగ్గూ, భయము లేకపోగా, 'ఒక్క వెయ్యి రూపాయలిచ్చినందుకే నన్ను ప్రశ్నిస్తారా సార్. నీ డబ్బులు నీకు పడేస్తానులే' అని పెడసరంగా సమాధానమిచ్చాడు. అతడలా మొరటుగా సమాధానము చెప్పినందుకు కోపం రాలేదు. కానీ తల్లి అనారోగ్యము పేరు చెప్పి తనను మోసము చేసినందుకు బాధగా అనిపించింది.

అదేవిధంగా తను ఉండే వీధిలో నివసించే శంకర్రావు గుర్తుకు వచ్చాడు. ఒకే వీధిలో ఉండడము వల్ల కాస్తా పరిచయమే. 'ఒకరోజు సాయము వేళ ఇంటికి వచ్చి, సార్! సిరిచిట్ ఫండ్‌లో నేను లక్ష రూపాయలకు చిట్ కడుతున్నాను. నాకు డబ్బు అవసరముంది. చిట్ పాడుకుంటున్నాను. వాళ్ళు ష్యూరిటీ అడుగుతున్నారు. దయచేసి ష్యూరిటీ ఇవ్వండి. ఇంకా పది నెలలు డబ్బుకట్టాలి. నేను డబ్బు విషయములో చాలా ప్రాంప్ట్, మీకు ఇబ్బందికాకుండా చూస్తాను' అన్నాడు. తాను మొహమాట పడడము చూసి, 'మనుషులు కష్టాల్లో ఉన్నప్పుడు మానవత్వము చూపితేకదా సార్, మనిషి జీవితానికి అర్థము' అంటూ భారీగా డైలాగ్ వేసాడు. ఆ డైలాగుకు కాకున్నా ఏదో కష్టాల్లో ఉన్నాడు, సాయంచేస్తే అతడి కష్టాలు తీరుతాయి అని నమ్మి ష్యూరిటీ ఇచ్చాడు. అతడు లక్ష రూపాయల చిట్ పాడుకుని, ఎవరికీ చెప్పాచెయ్యకుండా కాలనీ నుండే ఉడాయించాడు. ఈ సంఘటన జరిగి రెండు నెలలైంది. ఆ కంపెనీ వాడు ష్యూరిటీ ఇచ్చిన పాపానికి డబ్బు కట్టూ అంటూ వారం రోజుల క్రింద నోటీసు ఇచ్చారు.

మనుష్యులను నమ్మడము కష్టాల్లో ఉన్న వాడికి అండగా నిలవడము తప్పా. మనిషన్నాక కాస్తా జాలీ, దయా, సహాయ గుణము ఉండాలి కదా. కానీ మనుషులిట్లా తన నమ్మకానికి తూట్లు పొడిస్తే ఎట్లా? ముసురుకున్న ఆలోచనలనుండి తేరుకుని ఒక్కసారిగా నిట్టూర్చాడు. రైల్వే స్టేషన్ వంకా, ప్లాట్ ఫారము వంకా చూడసాగాడు. ఇంతలో ఒక ఆగంతకుడు అటుకేసి వచ్చాడు. సగము ఇన్‌షర్ట్ బయటపడింది. ముఖములో ఏదో ఆందోళన, కళ్ళల్లో ఏదో దిగులు కనబడుతుంది.

వచ్చి ఒక ప్రక్కకు కూర్చున్నాడు. అతడు రాధాకృష్ణకేసి అదోలో చూసాడు. రాధాకృష్ణ యధాలాపంగా చూసాడు. ఆగంతకుడు సందిగ్ధపడుతూ, అటూ ఇటూ చూస్తూ, సిగ్గూ, మొహమాట పడుతూ మెల్లగా గొంతు సవరించుకుని

'సార్!' అన్నాడు.

'ఏమిటి?' అన్నట్లుగా చూశాడు రాధాకృష్ణ .

'మాది విజయవాడ. పొద్దున సికింద్రాబాద్‌కు ఎక్జామ్ రాయడానికి వచ్చాను. స్టేషన్ పక్కన ఉన్న లాడ్జ్‌లో దిగాను. వెంటనే ఎగ్జామ్‌కు వెళ్ళాను. మధ్యాహ్నము పరీక్ష అయిపోవడముతో మళ్ళీ లాడ్జ్‌కు వెళ్ళాను. స్నానము చేయాలనిపించింది. సబ్బు లేకపోవడముతో లాడ్జ్‌లోని గదికి తాళము వేసి స్టేషన్ పక్కనున్న పెద్ద బజారుకు వెళ్ళాను. నాకు ఇష్టమైన సాండల్ సబ్బుబిళ్ళ కొనుక్కున్నాను. వెంటనే లాడ్జ్‌కు వెళ్ళబుద్ధి కాలేదు. ఊరికి వెళ్ళాల్సిన ట్రైన్ రాత్రికి కదా, కాసేపు ఈ స్టేషన్‌లో రిలాక్స్ అయి వెళ్ళవచ్చు అనుకున్నాను. ఒక గంట కిందట ఇక్కడికి వచ్చి కూర్చున్నాను. కాసేపయిన తరువాత లాడ్జ్‌కు వెళ్ళాను. తీరా అక్కడికి వెళ్ళాక చూస్తే, నా జేబులో పర్స్, సెల్ ఫోన్, తాళపు చేతులు కనబడడము లేదు. నేను మళ్ళీ ఇక్కడికి వచ్చి వెదికాను. ఆపై పెద్ద బజారుకు వెళ్ళి అక్కడా వెదికాను. మళ్ళీ ఇక్కడికి వచ్చాను.' అని చెప్పడము ఆపాడు.

'అహా! అలాగా!' అన్నాడు రాధాకృష్ణ.

ఆ ఆగంతకుడు 'హోటల్ వాడికి పొద్దున్నే మొత్తము గది అద్దెకట్టాను. వాళ్ళ దగ్గర డూప్లికేట్ కీస్ ఉంది కాబట్టి నా బ్యాగ్ నేను తీసుకోవచ్చును. కానీ ప్రస్తుతము నా దగ్గర చిల్లు గవ్వకూడాలేదు. రిటర్న్ టికెట్ కూడా పోయింది. ఇపుడు మా ఊరికి ఎలా వెళ్ళాలో అర్ధము కావడము లేదు. మీరు మంచివాడిలా కనబడుతున్నారు. నాకు కాస్తా సహాయం చేయండి. ఒక 200 రూపాయలు అప్పుగా ఇవ్వండి. మీ అడ్రస్ చెబితే ఇంటికి వెళ్ళగానే మళ్ళీ డబ్బు తిరిగి పంపిస్తాను' అన్నాడు.

రాధాకృష్ణ అతడు చెప్పింది విని అసహనంగా కదిలాడు. తలతిప్పుకుని ఎటో చూసాడు.

మళ్ళీ ఆ ఆగంతకుడు 'అసలు మిమ్మల్ని ఇలా డబ్బు అడగాలంటేనే చచ్చేంత సిగ్గుగా, అవమానంగా ఉంది. నన్ను నమ్మండి' అన్నాడు.

రాధాకృష్ణకు ఇలాంటి మోసాల గూర్చి అతడికి పరిచయమే. రైల్వే స్టేషన్లలో, బస్‌స్టాండ్‌లలో ఇలాంటి వాళ్ళు తిరుగుతూ రకరకాల కథలు, కహానీలు చెప్పి అమాయకుల దగ్గర డబ్బు గుంజడము కూడా తెలుసు, అసలే తాను ఇతరుల చేతిలో మోసగింపబడ్డాడు. పుణ్యానికి పోతే పాపము ఎదురైంది. ఇప్పుడైనా జాగ్రత్తగా ఉండాలి అనుకున్నాడు. ప్రతీసారి మోసపోతే తాను ఒక మూర్ఖుడిని కావడము ఖాయము అనుకున్నాడు. అందుకే పట్టించుకోనట్టుగా ఉన్నాడు. అతడు పక్కనే కూర్చున్నాడు. కళ్ళల్లో నీళ్ళు బయటపడకుండా అటూ ఇటూ చూస్తూ కూర్చున్నాడు. కాసేపు నిశ్శబ్దంగా గడిచింది. ఆ అగంతకుడూ, 'బహుశా మీరు నన్ను అనుమానిస్తున్నట్లున్నారు. నేను అలాంటి వాడిని కాదు. చదువుకున్నాను, ఉద్యోగవేటలో ఉన్నాను. ఈ రోజు జరిగిన గ్రూప్స్ పరీక్షకు వచ్చాను' అన్నాడు.

రాధాకృష్ణ కష్టపడి తొక్కి పెట్టిన అతడిలోని మనిషి చీల్చుకుని బయటికి వచ్చాడు. మనసు ద్రవించింది. ఎవరికైనా కష్టాలు వస్తాయి. కొందరు మోసము చేసినంత మాత్రాన ప్రపంచాన్ని అంతా అనుమానించడము తప్పు అనుకున్నాడు. అయినా తొందరగా బయటపడవద్దు అనుకున్నాడు. ఆలోచించడము మొదలు పెట్టాడు. కానీ అతడికి ఆగంతకుడు చెప్పిన మాటల్లో లాజిక్ కనిపించలేదు.' ఎందుకైనా మంచిది పరీక్షిస్తే సరిపోతుంది అనుకున్నాడు' అనుకుని అతడు వైపు చూసాడు. ఆగంతకుడు ఆశగా చూసాడు.

రాధాకృష్ణ ఆగంతకుడిని ప్రశ్నించడము ప్రారంభించాడు.

'లాడ్జ్ నుండి డైరెక్ట్‌గా ఎక్కడికి వెళ్ళావు?'

'పెద్ద బజారుకు'

'అక్కడ ఏమి చేసావు?'

'అక్కడ ఒక 'టీ' తాగాను. సాండల్ సబ్బుబిళ్ళ కొనుక్కున్నాను'

'ఆ తరువాత?'

'ఇక్కడికి వచ్చాను. కాసేపు కూర్చుని, మళ్ళీ బయలుదేరాను. లాడ్జ్‌కు వెళ్ళాను. జేబులో చేయి పెడితే తాళము చెవిలేదు. ఇంకొక జేబులో చేయి పెడితే పర్సు, సెల్లు కూడాలేదు. వెంటనే ఇక్కడికి వచ్చి చూసి, మళ్ళీ పెద్ద బజారుకు వెళ్ళి అక్కడ అంతా వెదికి మళ్ళీ ఇక్కడికి వచ్చాను'

'ఇక్కడికి వెళ్ళిన తరువాత లాడ్జ్‌కు వెళ్ళావు కదా. అక్కడ డూప్లికేట్ కీస్‌తో రూమ్ ఓపెన్ చేసుకుని చూసావా?'

'లేదు'

'పర్సు, సెల్లేనా ఇంకా ఏమైనా పోయిందా?'

'పర్స్, సెల్ మాత్రమే పోయింది'

'కథ అంతా బాగా అల్లుకుని వచ్చావు. కానీ సబ్బు బిళ్ళ విషయము మాత్రము మరిచిపోయావు. సబ్బు కొనుక్కుని ఇక్కడికి వచ్చవు కదా. మళ్ళీ నీవు లాడ్జ్ గదిలోకి కూడా వెళ్ళలేదు. మరి ఇప్పుడు నీ చేతిలో సబ్బు ఏమైంది?' పోలీస్ ఇంటరాగేషన్‌లో దొరికిన చిన్న క్లూ ఆధారంగా ముద్దాయిని ప్రశ్నించినట్లు ప్రశ్నించాడు ఆగంతకుడిని రాధాకృష్ణ. ఆగంతకుడు ముఖము అదోలా పెట్టాడు.

నీ అబద్దం బయట పెట్టాను అన్నట్లుగా రాధాకృష్ణ ఆగంతకుడికేసి చుసాడు.

'బహుశా నేనిక్కడికి వచ్చి ఈ ప్రాంతము అంతా వెదుకుతుండగా షర్టు దులుపుతూ, జేబు దులుపుతూ ఉండగా ఇక్కడెక్కడో పడిపోయి ఉంటుంది. నన్ను నమ్మండి' అన్నాడు.

ఆగంతకుడి సమాధానాలతో కన్విన్స్ కాలేని రాధాకృష్ణ, 'మీలాంటి వాళ్ళను రోజూ ఎంతోమందిని చూస్తుంటాము. డబ్బు సంపాదించడానికి ఏవో కహానీలు తయారు చేసుకుని రైల్వే స్టేషన్లలో, బస్ స్టాండ్‌లలో తిరుగుతూ అమాయకులైన ప్రయాణికులను మోసము చేస్తుంటారు. నా దగ్గర అలాంటి ఆటలు సాగవు. వెళ్ళు' అని కోపంగా అన్నాడు.

అతడు దీనంగా ముఖము పెట్టి, మారుమాట్లాడకుండ అక్కడి నుండి లేచి ముందుకు వెళ్ళాడు. అతడు అలా కొద్దిదూరము వెళ్ళగానే రాధాకృష్ణ కాలికి ఏదో తగిలినట్లనిపించింది. బెంచ్ కిందకి చూసాడు.

సబ్బుబిళ్ళ. సాండల్ సోప్.

అరెరే! అతడు చెప్పింది నిజమేనే. ఏమిటో నమ్మించి మోసము చేసే వాళ్ళు ఎక్కువకావడముతో నిజంగా బాధల్లో ఉన్న వాళ్ళను కూడా నమ్మలేకపోతున్నాము.

కష్టాల్లో ఉన్న వాళ్ళకు సాయం చేయకపోవడము, బాధల్లో ఉన్న వాళ్ళను నమ్మలేకపోవడము, మానవత్వమేనా అనిపించింది. వెంటనే ప్లాట్ ఫారము కేసి చూసాడు. అతడు నెమ్మదిగా మెయిన్ గేట్ వైపు వెళ్ళుతున్నాడు. గట్టిగా కేకేసాడు. అతడు చూడగానే, రమ్మని సైగ చేసాడు. ఆగంతకుడు వచ్చాడు.

'ఇది మీ సబ్బు బిళ్ళేనా?' అడిగాడు. 'ఔను' అన్నట్లుగా తలూపాడు.

'సారీ! ఈ మధ్య ప్రతి ఒక్కడు ఏదో రకంగా మోసము చేయడముతో నిన్ను నమ్మలేదు' ఫీలవుతూ అన్నాడు.

'పరవాలేదు సార్!' తలవంచుకుని జవాబిచ్చాడు.

జేబులోంచి 200 రూపాయలు తీసాడు. అలాగే పెన్నూ, పేపర్ తీసి తన అడ్రస్, ఫోన్ నంబర్ రాసి, డబ్బులు, అడ్రస్ కాగితము అతడి చేతిలో పెట్టాడు. 'ఊరికి వెళ్ళగానే డబ్బులు తిరిగి పంపు. అలాగే నీ అడ్రస్ చెప్పు, రాసుకుంటాను' అని చెప్పి, అడ్రస్ అడిగి తీసుకున్నాడు.

అతడు 'థాంక్స్' చెప్పి, రెండు రోజుల్లో మీకు డబ్బు పంపిస్తానని హామి ఇచ్చి వెళ్ళిపోయాడు. చేసింది మంచి పనో, తెలివి తక్కువ పనో తెలియక అలాగే కూర్చుండిపోయాడు. ప్లాట్ ఫారము పై సంధ్యా కాంతులు పరుచుకున్నాయి. ఇంటికి వెళదామని లేవబోతుండగా ఒక నడి వయస్కుడు వచ్చి ఆ సిమెంట్ బెంచ్ పరిసర ప్రాంతమంతా వెదుకసాగాడు.

'ఏంటి మాస్టారూ! దేనికొరకు వెదుకుతున్నారు?' అడిగాడు రాధాకృష్ణ.

'ఒక గంటకింద కాసేపు ఇక్కడ కూర్చుని పోయాను. అపుడు నా సాండల్ సోప్ ఒకటి పడిపోయింది. దానికోసము వెదుకుతున్నాను' సమాధానమిచ్చాడు.

# సినేమా కథ ఎస్.ఎస్.వి.రమణరావు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ నగరంలో ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్ లో అసోసియేట్ ప్రొఫెసర్ అయిన రమణరావు తిన్నగా ఉండక ఒక సినిమా కథ రాశాడు. కథ రాసిన వెంటనే రమణరావు చేసిన మొదటి పని అదే అమెరికాలో ఒక పెద్ద సాఫ్ట్ వేర్ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్ చేసి ఆరోగ్యరీత్యా బ్రేక్ తీసుకుంటూ, పార్ట్ టైమ్ consultant గా ఇండియాలో, హైదరాబాద్ లో వుంటున్న రామారావు అనే తన చిన్ననాటి మిత్రుడికి ఫోన్ చేసి 'తన కథని సినిమాగా చూడాలంటే ఏం చెయ్యాలి?' అని డిస్కషన్ పెట్టాడు.కథని సినిమాగా తియ్యడం ఆలోచనని కథగా మలచినంత సులువు కాదని రమణరావుకి తెలియకపోవడం రామారావుకి కొంత వింతే అనిపించినప్పటికీ, ఆమాత్రం తెలివితేటలు వున్నవాడు సినీకథా రచయిత ఎలా అవుతాడులే అని సమాధానం చెప్పుకుని, తనకి ఒక సినిమా కవిగారి వియ్యంకుడు తెలుసని అతను కూడా రచయితేనని అతని ద్వారా ఫీల్డ్ లోకి ఎంటర్ కావచ్చని ఎంకరేజ్ చేసి రాజమండ్రి లో ఉంటున్న ఆ వియ్యంకుడి దగ్గరకి రమణ్రావుని తీసుకెళ్ళాడు.

ఆ వియ్యంకుడి పేరు శరత్. యాభైఏళ్ళ పైబడ్డవాడు. యుక్త వయస్సులో సినిమాఫీల్డ్ లో రచయితగా ఎంటర్ అవుదామని ప్రయత్నించి ఫెయిల్ అయినవాడు. రమణరావు చెప్పిన కథ వినగానే ఆయన ఊగిపోయాడు. "ఈ కథతో నాలుగు సినిమాలు తీయచ్చు అని, ఇది ఒక మల్టీ స్టారర్ సినిమా కథ అని మల్టీ స్టారర్ మూవీస్ ఆర్ ఆర్డర్ ఆఫ్ ద డే అని, అది కుదరకపోతే ఒక అద్భుతమైన టివి మెగా సీరియల్ క్రింద తీయచ్చని అది ఒక 'ఆర్య చాణక్య, మహాభారత్ ' సీరియల్స్ లెవెల్లో మెగా హిట్ అయిపోతుందని" రమణ్రావ్ ని ఒక గెగా ఊపు ఊపేసాడు. రమణ్రావుకి కొంత వయసు ,ఉద్యోగం,సంసారం వుంది కాబట్టి తట్టుకున్నాడు గాని, కొంచెం వయసులో వున్న కుర్రవాడయి వుంటే ఆ ఊపుడికి మర్నాడే ముంబై ఫ్లైటొ ,హైదరాబాద్ ఫ్లైటొ ఎక్కేసి ఏ 'ఎరోస్ ఇంటర్ నేషనల్' చుట్టో, యాష్ రాజ్ ఫిల్మ్స్ చుట్టో లేకపోతే రామానాయుడు చుట్టో, పవన్ కల్యాణ్ చుట్టో తిరుగుతో వుండేవాడు. సాఫ్ట్ వేర్ డెవలపర్ నుంచి ఒక మల్టినేషనల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదిగిన రామారావుకి ఒక కొత్త ప్రాజెక్ట్ ప్రపోజల్ బాస్ చేత ఓకె చేయించాలంటే ,మధ్యలో ఎంతమందిని ఒప్పించాలో, ఎన్ని కష్టాలు పడాలో బాగా తెలుసు. అందువల్ల రామారావుకి చిన్న అనుమానం వచ్చింది అంత ఊపులో కూడా. వెంటనే అడిగాడు.

"ఈ కథ చూస్తే ఒక ఎనభై తొంభై పేజీల మధ్య వుంది. చదవడానికే వారంరోజులు పడుతుంది. మనకేమో ఊరూ పేరూ లేదు ఈ ఫీల్డ్ లో. మనకోసం అంత టైమ్ కేటాయించే-------- ఎవడుంటాడు?"(నోట్: తెలుగు సినిమాల్లో కొన్ని కొన్ని సీన్స్ లో పాత్రల పెదాలు కదులుతుంటాయి గాని డైలాగ్స్ వినబడవు,అంటే అవి సెన్సార్ కట్ అయినవి అనమాట.అలాగే ఈ డాష్ కూడా) .అసలు ఆ మాట ఒక మర్యాదపూర్వక పరిచయం మాత్రమే వున్న వ్యక్తి దగ్గర తను ప్రయోగించినందునకు రామారావే ఆశ్చర్యపోయాడు.

'అంతా సినిమా ప్రభావం' అనుకుని "సారీ" అన్నాడు.

కానీ అతని ఆలోచనలకి విరుద్ధంగా ,ఆ మాటలు వింటూనే శరత్ చటుక్కున రామారావ్ వంక మెచ్చుకోలుగా చూస్తూ షార్ప్ గా అడిగాడు.

"మీరు తెలుగు సినిమాలు చాలా తక్కువగా చూస్తారు గదూ?"

అల్లోపతీ డాక్టర్ ప్రిస్కిప్షన్ మీద హోమియో మందులు రాస్తే ఎలా ఉలిక్కి పడతామో అలా ఉలిక్కి పడ్డాడు రామారావ్ ఆ ప్రశ్న వినగానే. వెంటనే రమణ్రావు వంక తల తిప్పి చూశాడు. అప్పటికే రమణ్రావు కళ్ళు పెద్దవి చేసి శరత్ గారి వంకే చూస్తున్నాడు. 'ఫరవా లేదు ,కనీసం వీడి బుర్ర తిన్నగానే పని చేస్తుంది' అనుకుని ,ఒక క్షణం సర్దుకుని "అదేం లేదు, బాగానే చూస్తాను"అని మరొక్క క్షణం ఆలోచించి " Yeah! You are right!!.It comes last in the list of my entertainments" అన్నాడు.

సగర్వంగా ఒక చిరునవ్వు మెరిసింది శరత్ గారి మొహంలో, ఆ సమాధానం వినగానే . ఆ నవ్వు చూడగానే శరత్ గారి మొహం వైపే కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తున్న రమణ్రావు కళ్ళు మరింత పెద్దవయ్యాయి ఆశ్చర్యంతో. దానికి కారణం ఉంది. గర్వంతో చాలామంది నవ్వుతారు. కాని శరత్ గారి నవ్వులో ఒక తేడా ఉంది. అది సాధారణ గర్వంతో నవ్విన నవ్వు కాదు. తరతరాలుగా రెండు దేశాల మధ్య రగులుతున్న, అంటే , ఇండియా, పాకిస్తాన్ ల మధ్య జమ్ము ఎండ్ కాశ్మీర్, ఇండియా, చైనాల మధ్య టిబెట్,దలైలామా, అరుణాచల్ ప్రదేశ్ , ఇంకా ,నేషనల్ రివర్ లింకింగ్ ప్రాజెక్ట్ ,గంగా రివర్ పొల్యూషన్ కంట్రోల్ ప్రోగ్రామ్ ఇటువంటి బృహత్తర సమస్యలన్నింటికీ ఒకే సమయంలో ఒకే వ్యక్తికి సమాధానాలు స్ఫురిస్తే, వాటిని అందరూ వెంటనే ఏకగ్రీవంగా ఒప్పేసుకుంటే అప్పుడు ఆ క్షణంలో ఆ వ్యక్తి హృదయంలో పుట్టిన ఆనంద సముద్రంలో ఎగసిన అల , మొహంలో చిరునవ్వై పొంగితే ఎలా వుంటుంది?! అల్లా వుంది శరత్ గారి మొహంలో మెరిసిన ఆ చిరునవ్వు. అందువల్లనే ఆ చిరునవ్వుని, చిరునవ్వుగానే వుంచడం అతనికి కూడా సాధ్యం కాలేదు. ఘాట్టిగా పైకి నవ్వేశాడు రమణ్రావుకేసి చూస్తూ

" హహహ. కనిపెట్టేశా, ఆ షార్ప్ నెస్ అందుకే కొట్టొచ్చినట్టు కనబడిపోతావుంది. తెలుగు సినిమాలు తక్కువ చూస్తాడంట.నే చెప్పలే. హహహ" అన్నాడు.

రమణ్రావు మొహం మాడిపోయింది. రామారావ్ పెదాలు బిగించి నవ్వు ఆపుకుని "బి బ్రేవ్" అన్నట్టు రమణ్రావు భుజంమీద తట్టాడు.

అప్పుడు ఆ శుభసమయంలో అంటే ,అదే, అన్ని సమస్యలకీ అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం ఏకకాలంలో ఏకవ్యక్తికి స్ఫురించిన ఆ మహత్ సందర్భంలో శరత్ గారు రమణరావుకు సినిమా ఫీల్డ్ లో కథ ఎవాల్యుయేట్ చేసే పద్ధతి ఏమిటో ఆ దేవ రహస్యం ఏమిటో చెప్పారు. అదేమిటంటే 'వన్ లైన్ వెర్షన్'.మనం రాసిన మొత్తం సినిమా కథని ఒక్క లైన్ లో చెప్పగలగాలి.

అంటే "సెంట్రల్ థీమ్ అన్నమాట" అన్నాడు రమణ్రావ్ సాలోచనగా.

"ఎందుకైనా మంచిది నీ మొత్తం సినిమా కథ అంతా వన్ వర్డ్ లోనూ , వన్ లెటర్ లోనూ చెప్పడానికి కూడా ప్రిపేర్ అయిపో గురూ "అన్నాడు రామారావు.

అలా వన్ లైన్ వెర్షన్ రాసిస్తే తను చేయగలిగింది చేస్తానని శరత్ గారు ప్రామిస్ చేయడంతో ఇద్దరూ ఆయన ఇంటి నుంచి బయటకొచ్చారు.

........... వన్ లైన్ వెర్షన్ పంపించి నెలరోజులైనా శరత్ గారి నుంచి ఉలుకూ లేదు పలుకూ లేదు. మంచివాడే అయినప్పటికీ ఆయన మాటలకి చేతలకీ చాలా దూరం వుండడానికి కారణం ఆయన చేతుల్లో ఏమీ లేకపోవడమేననీ రామారావుకీ, రమణ్రావుకీ వాళ్ళ ద్వారా వీళ్ళద్వారా తెలిసిన కొన్ని పెద్ద పెద్ద విషయాల వల్ల అర్థం అయింది. ఇప్పుడేం చేయాలా అని ఆలోచిస్తుంటే అప్పుడు గుర్తొచ్చాడు ఇద్దరికీ చిన్ననాటి స్నేహితుడు, ప్రస్తుతం అమెరికాలో వున్న లక్ష్మణ్రావు. లక్ష్మణ్రావు అన్నగారి భార్యయొక్క అన్నగారికి అంటే లక్ష్మణ్రావు వదినగారి అన్నయ్యగారికి ఒక ఆడియో రికార్డింగ్ కంపెనీ వుంది. ఆయనికి సినిమా వాళ్ళతో మంచి పరిచయమే వుంది.

వెంటనే లక్ష్మణరావుతో కాన్ఫ రెన్స్ కాల్ మాట్లాడారిద్దరూ. "ఇంకా  కథలు రాస్తున్నావా?" నిట్టూర్చాడు లక్ష్మణరావు."ఇద్దరం ఒకే కాలేజ్ లో బిటెక్, ఎమ్ టెక్ చదివినా నేనెందుకు అమెరికాలో వున్నానో ,నువ్వెందుకు ఇండియాలోఉండిపోయవో నాకిప్పుడు అర్థమయింది".

రామారావ్ అందుకున్నాడు. "అలా డిస్కరేజ్ చెయ్యకు గురూ. నేను కథ చదివాను. చాలా బావుంది.నువ్వేం చెయ్యగలవో చెప్పు"

"సరే తప్పుతుందా. కనుక్కుని ఏ విషయం నేనే ఫోన్ చేస్తాను". మళ్ళీ కొద్దిగా నిట్టూర్చినా "తప్పకుండా కనుక్కుంటానని" ప్రామిస్ చేసాడు  లక్ష్మణరావు. అన్నట్టుగానే మర్నాడే ఫోన్ చేసాడు.

" గురూ మంచి ఇన్ఫర్మేషన్ దొరికింది" లక్ష్మణరావు గొంతులో ఎక్సైట్ మెంట్ ధ్వనించింది " ఎవడో బ్రహ్మానందం అంట. హైదరాబాద్ లోనే ఉంటాడంట"

"ఎవరూ కమెడియన్ బ్రహ్మానందమా?"

"కాదు కాదు కానీ దాదాపు అదే టైప్ అంట. అతనేనంట తెలుగు ప్రొడ్యూసర్లకి, డైరెక్టర్లకి కథల బ్రోకర్. అతను గనక ఓకె అంటే మనకథ సినిమా అయిపోయినట్టే అంట."

"ఇంకేమైనా కొన్ని డిటైల్స్ చెప్పగలవా?" అడిగాడు రమణరావు.

" డిటైల్స్ అంటే అతని ఫోన్ నంబర్, ఎడ్రస్ చెప్పగలను"

"కుళ్ళు జోకులెయ్యకు" తగుల్కున్నాడు రామారావ్.

"హహహ" నవ్వాడు లక్ష్మణరావు" కథ అంతా విన్న తర్వాత అతను ఒక దాని వెంట ఒకటి మూడు ప్రశ్నలు అంటే మొదటి question ఆన్సర్ చేస్తే రెండో question , అది కూడా ఆన్సర్ చేస్తే మూడో  question  అలా మూడే మూడు  ప్రశ్నలు అడుగుతాడంట.ఆ ప్రశ్నలేమిటొ తెలుసుకుందామని ట్రై చేశాడు గాని తెలియలేదంట. అవి బ్రహ్మానందం ని ఎప్రోచ్ అయిన రచయితలకే తెలుస్తుందంట. ఎవడైనా ఇంటర్నెట్ లో పెట్టాడేమో చూసుకోమన్నాడు "

"సరే .ఒక వేళ మూడూ ఆన్సర్ చేస్తే?"

"అసలు ఇంతవరకూ మొదటి ప్రశ్న ఆన్సర్ చేసినవాడే లేడంట అందువల్లనే ప్రొడ్యూసర్లు డైరెక్టర్ లు పాపం అన్ని కష్టాలు అంటే కథ, మాటలు,పాటలు, డబ్బు,వగైరా వగైరా అన్నీ వాళ్ళే చూసుకుంటూ  పడరాని బాధలన్నీ పడుతున్నారంట"

"మూడూ ఆన్సర్ చేస్తే?" మళ్ళీ అడిగాడు రామారావ్.

అవతల అమెరికాలో ఫోన్ పెట్టేసిన శబ్దం ఇండియాలో రామారావ్ కి స్పష్టంగా వినబడింది.

బ్రహ్మానందం ఇంట్లో వెయిట్ చేస్తున్నారు రమణరావు, రామారావు దాదాపు రెండు గంటలనుంచీ. పొద్దున్నే ఏడు గంటలకల్లా వచ్చెయ్యమన్నాడు  బ్రహ్మానందం. టిఫిన్ చేసి రావడం  వల్ల చేతిలో లాప్ టాప్ ,డాటాకార్డ్ వుండడం వల్ల సమయం చురుగ్గా కదలక పోయినా నిస్పృహగా గడవలేదు. సమయం తొమ్మిది అయ్యేసరికి రామారావుకి సడన్ గా వాళ్ళబ్బాయి ఖాళీ డివిడిలు తెమ్మని చెప్పడం గుర్తుకు వచ్చి బయటకు వెళ్ళి టెన్ డివిడి బాక్స్ ఒకటి కొనుక్కుని తిరిగి వచ్చేసరికి  బ్రహ్మానందం దర్శనం అయింది.

"సారీ ఫర్ కీపింగ్ యు వెయిటింగ్" అన్నాడు బ్రహ్మానందం రామారావ్ ని చూస్తూనే." ఏంటి ఏవో డివిడిలు కొన్నట్టున్నారు. ఇంటర్నెట్ లోంచి ఇంగ్లీష్ సినిమాలు డౌన్ లోడ్ చేసి కాపీ కొట్టేద్దామనా? సారీ డోంట్ థింక్ అదర్ వైస్ అయామ్ జస్ట్ జోకింగ్ హహహ" గట్టిగా నవ్వాడు సినిమాలో  'బ్రహ్మానందం' లాగే.

రామారావ్ కూడా 'హీరో రవితేజ 'లాగ అంతకంటే గట్టిగా నవ్వుతూ "హహహ అదేం లేదు. మా అబ్బాయి ఏదో గేమ్స్ కోసం

కొనమంటే కొన్నాను అంతే హహహ" అన్నాడు.

బ్రహ్మానందం  వెంటనే నోరు మూశాడు. తరవాత, కొద్దిగా గంభీరంగా ఫేస్ పెట్టి "కథ చెప్పండి "అన్నాడు .

రమణ్రావ్ కథ మొత్తం చెప్పాడు. సెంట్రల్ థీమూ,వన్ లైన్ వెర్షనూ, సీనిక్ వైస్ డిస్క్రిప్షనూ ,పంచ్ డైలాగ్సూ,పాటలూ మొత్తం అలుపనేదీ లేకుండా లంచ్ బ్రేక్, టీ బ్రేక్ మినహాయించి పొద్దున్నించీ సాయంత్రం దాకా కంటిన్యుయస్ గా,ఉత్సాహంగా ,ఉత్సాహభరితంగా చెప్పాడు. రామారావుకి, బ్రహ్మానందానికి దిమ్మ తిరిగి పోయింది. రామారావుకి కూడా అదే ఫస్ట్ టైమ్ కథ అంతా పూర్తిగా రమణరావు నోటినుంచి ప్రత్యక్షంగా వినడం . శరత్ గారి దగ్గర చెప్తున్నపుడు పక్కనే వున్నా ఏవో అర్జంట్ కాల్స్ అటెండ్ అవాల్సి వచ్చి పూర్తిగా వినలేకపోయాడు. అదీగాక మధ్య గాప్ లో రమణరావు స్టోరీ మీద వర్క్ చేస్తూ, ఇంప్రూవ్ చేస్తూనే వున్నాడు. అందువల్ల శరత్ గారి దగ్గర వెర్షన్ కంటే బాగా వచ్చింది.

చెప్పడం పూర్తవ్వగానే వెంటనే లేచి రమణరావుని కౌగిలించుకున్నాడు రామారావ్ "అయామ్ ప్రౌడ్ ఆఫ్ యు "అంటూ.

"చాలా బావుందయ్యా. చాలా రోజుల తరవాత ఒక మంచి కథ విన్న తృప్తి కలిగింది" అన్నాడు బ్రహ్మానందం ఒక  ట్రాన్స్ లోంచి నిద్ర లేచినవాడిలాగ.

"థాంక్యూ సర్" అన్నాడు రమణరావు

"మీరు చెప్పిన కథ నాకు నచ్చింది కాబట్టి ఇప్పుడు నేను పెట్టబోయే టెస్ట్ కి మీరు అర్హత సంపాదించారు. నేను మిమ్మల్ని మూడు ప్రశ్నలు అడుగుతాను...." అంతా తెలిసినప్పటికీ శ్రద్ధ గా విన్నారు రావులిద్దరూ.

"మొదటి ప్రశ్న. ఈ కథ ఒరిజినల్ ఎక్కడ?"

రమణ్రావ్ ,రామరావ్ ఇద్దరూ ఒక్కసారిగా షాక్ తిన్నారు. " ఒరిజినల్లా?"

"అవునయ్యా"విసుక్కున్నాడు బ్రహ్మానందం  "ఒరిజినల్లే ,కాకపోతే సోర్స్, మీ సాఫ్ట్ వేర్ భాషలో చెప్పాలంటే సోర్స్ కోడ్, ఎక్కడా" రామారావు వైపు చూస్తూ అన్నాడు

"మా వాడు సొంతంగా రాశాడు సార్"

" ప్రతివాడూ చెప్పే కబుర్లేనయ్యా ఇవి. అయినా ఇంకొక్క నిజం చెపుతా. నిజంగా సొంతంగా రాసి వుంటే  అది తెలుగు సినిమాకు పనికి రాదయ్యా, ఏ తమిళంకో మళయాళంకో లేదా హాలీవుడ్ కో పొండి"

"సొంతంగా రాస్తే ఎందుకు పనికి రాదు?"

"సినిమా అంటే కోట్ల మీద వ్యాపారం అయ్యా? నీ తెలివితేటలు నమ్మి ఏ----  అంత రిస్క్ తీసుకుంటాడు?(ఈ డాష్ గురించి పైన వివరించడం జరిగింది,గమనించగలరు,థాంక్యూ- రచయిత) . మా తెలివితేటలమీద మాకు ఎప్పుడూ నమ్మకం లేదు.అప్పుడప్పుడు కలిగినా ఆ ఫీలింగ్ ని మేం పట్టించుకోం.మాకు ప్రజలే ముఖ్యం. ఈ ప్రజలున్నారే......." బ్రహ్మానందానికి ఆవేశంతో బిపి రైజ్ అయిపోయింది. పళ్ళు పట పట కొరికేసుకున్నాడు."......... గాళ్ళు.(ఓ గాడ్ డాష్ అగైన్!)  " కాబట్టి, ఆల్రెడీ ఏదో లాంగ్వేజ్ లో హిట్ అయ్యి వుంటే ,  మనం మేడిన్ తెలుగు అని స్టాంప్ కొట్టి రిలీజ్ చేస్తాం,అంతే " బ్రహ్మానందానికి కొంచెం ఆవేశం తగ్గి ఊపిరి పీల్చుకున్నాడు ."అయినా, మనిషన్నాక కొంచెం వేదాంత ధోరణి, బ్రెయిన్ ఉండాలయ్యా, ప్రపంచంలో ఎన్ని భాషలు వున్నాయి,ఎన్ని సినిమాలు వున్నాయి, సొంతంగా రాయాల్సిన కష్టం ఎందుకు, చెప్పండి. ఏవంటారు?"

"బ్రెయిన్ లోంచి రాశాను సార్" అన్నాడు రమణారావు ఆవేశంగా చేతివేలు తలవైపు చూపిస్తూ.

బ్రహ్మానందం కళ్ళు మెరిసాయి ఆ మాట వింటూనే " అద్గదీ .అసలు విషయం ఇప్పుడు చెప్పావయ్యా మీ ఫ్రెండు. బ్రెయినా? ఈ సినిమా పేరు ఎప్పుడూ వినలేదే? ఏ భాష నాయినా ఏ సినిమా? ఇండియన్ అయినా ఇంగ్లీష్ అయినా నాకు తెలిసిపోతుందే? సరే, ఏదయితే మనకెందుకు? డివిడి వుందా?"

స్పాంటేనియస్ గా బ్రహ్మానందం చెప్పిన ఆ 'ద డైలాగ్' కి ఇమ్మీడియట్ గా షాక్ తిని రమణరావు 'ఎక్కడకో' వెళ్ళిపోయాడు.

"ఉంది" పాత సినిమాల్లో పెళ్ళికూతురు తండ్రి పెళ్లి సమయానికి కట్నం ఇవ్వలేకపోయినప్పుడు పెళ్లికొడుకు తండ్రి లేదా పెళ్ళికొడుకు మాజీ భార్య లేదా మాజీ ప్రియురాలు సరిగ్గా తాళి కట్టే సమయనికి వచ్చి లేదా నిత్యపెళ్ళికొడుకు మరో పెళ్ళి చేసుకుంటున్నప్పుడు పోలీసులు వచ్చి జరుగుతున్న ఆ పెళ్ళిని 'ఆపండి' అని అరిచినట్టు రామరావ్ అరిచాడు. వెంటనే తన బాక్స్ లోంచి అప్పుడే కొన్న టెన్ డివిడి బాక్స్ బయటికి తీసి బ్రహ్మానందం చేతులో వుంచాడు.

"ఇదేంటీ, ఈ డివిడి లు ఇప్పుడే కదా కొన్నానని చెప్పావు"

"అది వేరే వుంది"

"లేదయ్యా అదే ఇది. సీల్ కూడా వుంది"

"సీక్రెట్ గా వుంటుందని నేనే సీల్ చేశా"

బ్రహ్మానందం కన్విన్స్ అయ్యాడు

"టాప్ సీక్రెట్ ,భలే చేశావయ్యా సీలు. ఇంతకీ ఏ భాష? చైనీసా?"

రామారావు తల అడ్డంగా వూపాడు.

"జపనీసా"

రామారావు తల మళ్ళీ అడ్డంగా వూపాడు

"మరి ఏ భాషయ్యా?"

"కొరియా"

"ఆ ! కొరియానా?

"నార్త్ కొరియా" బ్రహ్మానందం మొహం మీద మొహం పెట్టి అన్నాడు రామారావ్

" ఒకె ఒకె, కన్విన్స్ అయ్యాను.ఇప్పుడు మీరిద్దరూ రెండో ప్రశ్న ఆన్సర్ చేయడానికి ఎలిజిబిలిటీ సంపాదించారు. " బ్రహ్మానందం కొంచెం గాప్ ఇచ్చాడు సీన్ లో టెన్షన్ మెయింటెయిన్ చేయడానికి.ఇద్దరి వంకా ఒకసారి చూసి 'ఫరవా లేదు' అనుకుని రెండో ప్రశ్న సంధించాడు

" మీ కథలో ఐటమ్ సాంగ్ పెట్టగలిగే సన్నివేశాలు ఎన్ని వున్నాయ్?" అడుగుతూనే బట్టతల గోక్కుంటూ ఆలోచించాడు" మీ కథలో ఐటమ్ సాంగ్ పెట్టే ఊపున్న సన్నివేశం గాని, కారెక్టర్ గాని లేదయ్యా, డిజప్పాయింట్ అవద్దు, తమిళు,మళయాళం,హాలీవుడ్ అయినా ఫర్వాలేదు ,తెలిసినవాళ్ళు వున్నారు,రికమెండ్ చేస్తాను. చెప్తున్నప్పుడే అనిపించింది అంతా టూమచ్ క్లాస్ గా ఉందని, లాభం లే..."

"టైటిల్స్ ముందే పెట్టేద్దాం సార్" రామారావ్ గట్టిగా అరిచాడు బ్రహ్మానందాన్ని మధ్యలో కట్ చేస్తూ.

"ఏంటీ?"

"అవును సార్. అప్పుడు ఇంట్లో సర్దుకుని లేట్ గా వచ్చే ఫామిలీస్ కి కూడా హాపీగా ఉంటుంది స్టోరీ ఏమీ మిస్ అవ్వలేదని. కుర్రబేచ్

అంతా ఎలాగూ ముందే వచ్చి కూచుంటారు.ఎలావుంది?"

"అదిరిపోయింది. నాక్కూడా ఓ ఐడియా వచ్చిందయ్యా. ఇమ్మీడియట్లీ ఆఫ్ట ర్ ఇంటర్వెల్ ఇంకో ఐటమ్ సాంగ్ కూడా పెట్టేసుకోచ్చు. ఫామిలీస్ ఇంటర్వెల్ లో సమోసాలు. పాప్ కార్న్ లు,ఐస్ క్రీమ్ లు తిని తాపీగా రావచ్చు. ఈ లోపల రెండో సాంగ్ కూడా అయిపోతుంది."

"బ్రిలియంట్ సార్"

"సెకండ్ క్వశ్చన్ కూడా పాస్ అయిపోయారయ్యా. ఇంక థర్డ్ క్వశ్చన్" టెన్షన్ గాప్ కోసం కొంచెంసేపు ఆగబోయాడు బ్రహ్మానందం.

" అవసరం లేదు సార్, ఆల్రెడీ ఫుల్ టెన్షన్ లో వున్నాం, మీరు వెంటనే చెప్పెయ్యచ్చు"

కళ్ళు పెద్దవి చేసి ఇద్దరి వైపు ఒకసారి చూసి థర్డ్ క్వశ్చన్ రిలీజ్ చేశాడు బ్రహ్మానందం

"మీ కథలో కామెడీసీన్ లు వున్నాయా?"

కామెడీ అన్న పేరు వినగానే ' ఎక్కడకో' వెళ్ళిపోయిన రమణ్రావు తిరిగి ఈ లోకంలోకి వచ్చేశాడు. దటీజ్ ద పవర్ ఆఫ్ కామెడీ.

"అదేంటి సార్ ఎన్ని కామెడీ సీన్స్ చెప్పాను. మీరు భలే ఎంజాయ్ చేశారు కూడా?"

"నేను వేరయ్యా ప్రజలు వేరు. కామెడీ సీన్ అంటే కమెడియన్ కి ఇంకో కారెక్టర్ కి మధ్య నాలుగు సంభాషణలు నడిచాయనుకో ఆ కారెక్టర్ చేతిలో కమెడియన్ నాలుగు చెంపదెబ్బలు తినాలి లేదా ఆ కమెడియన్ చేతిలో ఆ కారెక్టర్ నాలుగు చెంపదెబ్బలు తినాలి , అటువంటి సీన్ లు ఏమైనా వున్నాయా?"

ఆ కామెడీ డెఫినిషన్ దెబ్బకి రమణ్రావు తిరిగి మళ్ళీ 'ఎక్కడెక్కడికో' వెళ్ళిపోయాడు. అలాంటి దెబ్బలు ఇంకో రెండు తగిలితే ఇంక తిరిగి రాని లోకాలకు వెళ్ళిపోతాడేమో అని భయం వేసి రామారావ్ రమణరావ్ ని తీసుకుని బయటపడ్డాడు. గడప దాటాక చివరగా ఇంకో ప్రశ్న అడిగాడు

" నాలుగో ప్రశ్న ఏంటి సార్"

"నాలుగో ప్రశ్నా? నీకెలా తెలుసు నాలుగు ప్రశ్నలున్నాయని?"

"మూడు ప్రశ్నలయాక నాలుగో ప్రశ్న ఉండొచ్చని ఊహించడం అంత కష్టమా?"

"ఊ... అది ప్రశ్న కాదయ్యా, పని. మూడు ప్రశ్నలూ సరిగ్గా ఆన్స ర్ చేస్తే ఆ పనేంటో చెప్తాను. ప్రశ్నలంత కష్టమైన పనేమీ కాదులే"

"ఏంటి సార్ ఆ పని?"

"ముందు ఆ మూడో ప్రశ్న కి సమాధానంతో రండయ్యా. కష్టమైన పనేం కాదని చెప్పానుగా" మృదువుగానే తలుపు మూశాడు బ్రహ్మానందం.

మర్నాడు ఇద్దరూ నిద్ర లేచేసరికి ఉదయం ఎనిమిది దాటిపోయింది. వంట మనిషి చేత కాఫీ ,తెలుగు ,ఇంగ్లీష్ రెండు న్యూస్ పేపర్ లు పంపించింది రామారావ్ భార్య.

కాఫీ తాగుతూ "ఆ నాలుగో ప్రశ్న, అదే పని ఏమై ఉంటుందంటావ్?" అడిగాడు రామారావ్. సమాధానంగా న్యూస్ పేపర్స్ రెండూ రామారావ్ కి అందించాడు రమణరావు.

హిందూ లో 'National Film Awards announced .The second largest speaking language in India and one of the oldest language of the world failed to get a single award in any category of film making'. తెలుగు పేపర్ లో 'వంద కోట్ల బిజినెస్ వైపు దృష్టి సారిస్తున్న బాలీవుడ్ ,టాలీవుడ్ దర్శకులు,హీరోలు,ప్రొడ్యుసర్లు'

"పని ఏదైనా ఫలితం ఇదే రావాలి"

నవ్వుతూ తల ఊపాడు రామారావు అంగీకారంగా.

# సాయం..? అనామకుడు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

ఆఫీస్ పని మీద టొరోంటో వచ్చాను కానీ అంతకన్న ముఖ్యమైన పని శారదను కలవడం.

శారద అంటే సాయం. సాయం చెయ్యడం కోసమే పుట్టింది. సాయం చెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఆ సాయాన్ని అందుకోలేని వాళ్ళు ఉంటారు. ఎవ్వరికీ అందివ్వద్దని అనేవాళ్ళూ ఉంటారు. శారద గురించి ఆలోచిస్తూ హొటల్ గదిలో కూచుని ఎదురుచూస్తుండగా –

బెల్ మోగింది. తలుపు తీసాను. ఎదురుగా శారద.

"వెళ్దామా?" అంది.

"లోపలకి రావా?" అని అడిగాను నేను.

"నువ్వు రెడీగా ఉంటే బయల్దేరుదాం. నిన్ను మా యింటికి తీసికెళ్ళి భోజనం పెట్టి మళ్ళీ ఇక్కడకి తీసుకొచ్చి దింపాలిగా" అంది.

గది తాళం తీసుకుని బయల్దేరాను నేను.

"నువ్వు ఉంటున్నది టొరోంటో నగరానికి మధ్యలో. మా యూనివెర్సిటీ ఉన్నది ఓ మూల. రెండు ట్రాములు మారి వెళ్ళాలి" అంది నడుస్తూ.

యూనివెర్సిటీ లో పని చేస్తోంది కారుంటుందని అనుకున్నాను. ఇండియాలో నాతో ఉద్యోగం చేస్తున్నప్పుడు కారుండేది. ఆ ఉద్యోగం మానేసి అయిదేళ్ళవుతోంది. మేం ఉద్యోగంలో  చేరిన రోజులు గుర్తుకు తెచ్చుకుంటోంటే –

"ట్రామ్ స్టేషన్ దగ్గరే, రెండు నిమిషాలు నడక" అంది.

"దూరమైనా పరవాలేదు" అన్నాను నేను.

"పొద్దున్న దిగావు ఊళ్ళో. ఏం చేసావు ఇంతసేపూ?" అని అడిగింది.

నేను చూసిన సీయెన్ టవర్ గురించీ, దాని పైకెక్కి అక్కడ నుండీ నగరమంతా చూడ్డం గురించీ, పై అంతస్తు మీదున్న గాజు

పలక గురించీ, ఆ గాజు పలక మీద పాకుతూ అంతెత్తునుండి కిందకి చూడ్డం గురించీ చెప్తోంటే –

"నేను ఆ టవర్ చూళ్ళేదు" అంది శారద.

నేను ఆశ్చర్యపోలేదు. తను చూసానంటే కూడా ఆశ్చర్యపోను నేను. శారద ఏం చేసినా నాకు ఆశ్చర్యం కలగదు.

మొదటి ట్రాం లో వెళ్తున్నంత సేపూ బిల్డింగులు కనిపించాయి. రెండో ట్రాం లో వెళ్తున్నప్పుడు అందమైన గార్డెన్స్ కనిపించాయి.

"అందమైన వనాలూ, భవనాలూ – బావుంది టొరోంటో నగరం" అన్నాను నేను.

"యునివెర్సిటీ అంతా చెట్లే" అంది శారద, ఇంటి తలుపు తెరుస్తూ.

ఓ చిన్న పడగ్గదీ, ఓ హాలూ కలిసి ఇల్లు. హాల్లోనే కూచోడానికి సోఫాలూ, తినడానికి టేబులూ, వండడానికి సామగ్రి.

"వంటైపోయింది. వేడి చెయ్యడమే. నువ్వు ఎప్పుడు తిందాం అంటే అప్పుడు తిందాం" అంది.

"యూనివెర్సిటీ చూద్దామా?" అన్నాను నేను.

"నీకు కావల్సింది అదే కదా – పద" అంటూ బయల్దేరింది.

నడుస్తూ తిరుగుతూ తన గది చూపించింది.

"నీ ఆఫీస్ లో నీ గదితో పోల్చుకోకు" అంది.

"నువ్వు అవన్నీ వదిలేసుకుని వచ్చావు కదా?" అన్నాను నేను.

"ఒకటి కావాలంటే ఒకటి వదులుకోవాలిగా" అంది.

"ఏం కావాలని ఇండియా వదిలి కెనడా వచ్చావు?"

"ఇక్కడ ఏదో కావాలని కాదు. అక్కడ ఏదో అక్కరలేదని." అంది

నేనేం మాట్లాడలేదు.

"మనం కలిసి అయిదేఏళ్ళైంది కదూ?" అంది శారద.

తను అనే వరకూ నాకు ఆ విషయమే గుర్తుకు రాలేదు. కొన్ని స్నేహాలు అంతే. ఎన్నేళ్ళ తర్వాత కలిసినా నిన్న కలిసినట్లే అనిపిస్తుంది. ముఖ్యంగా చిన్నప్పటి స్నేహితులు అంతే. శారద నాకు చిన్నప్పటి స్నేహితురాలు కాదు. ఐనా అలానే ఉంది.

"నువ్వు కెనడాకి ప్రయాణం అయినప్పుడు" అని అన్నాను నేను.

"కెనడా ప్రయాణానికి ఢిల్లీ వచ్చి, మిమ్మల్ని కలుసుకుని, కళ్యాణి పెట్టిన పెరుగన్నం తిన్నాను. ఎన్ని సార్లు తిన్నా తనచేతి పెరుగన్నం బావుంటుంది" అంది శారద.

శారద కళ్యాణి పెరుగన్నాన్ని పొగుడుతూనే ఉంటుంది. కళ్యాణి బాగా చెయ్యదని కాదు కాని అది నిజమో మమ్మల్నీ తృప్తి పరిచేందుకు అంటోందో తెలియదు. అదే మాట అన్నాను శారదతో.

"మీరిద్దరూ మంచివాళ్ళు. అందుకే మీయింట పెరుగన్నం రుచి" అంది. అలా అంటున్న శారద కంఠంలో ఏ భావమూ వినిపించలేదు.

అయిదేళ్ళ క్రితం ఢిల్లీలో నన్ను కలిసి మాట్లాడినప్పుడు కూడా ఏ భావమూ వినిపించలేదు. ఆ సంభాషణలు గుర్తుకు వచ్చాయి.

★★★★★★★★★★★★★★★

"పీహెచ్డీ చెయ్యడానికి కెనడా వెళ్తున్నాను" అంది శారద పెరుగన్నం తింటూ.

"పిల్లాడు అమెరికా లో ఉన్నాడు కదా – అక్కడకి వెళ్ళచ్చుగా?"అని అడిగాను.

"వాడికి పెళ్ళి చేసేసాను. వాడి మానాన వాడు ఉంటాడు. నేనెందుకు అక్కడ?" అంది.

"సుందరం గారు?"అని ప్రశ్నార్ధకంతో ఆగాను నేను.

"ఆయనకి అక్కడ ఉద్యోగం కానీ చదువు కానీ లేవుగా?" అంది శారద.

"సుందరం గారు అమ్మా నాన్నల దగ్గర ఉంటారా?" అని అడిగాను.

"తెలియదు. ఆయన ఇష్టం. వాళ్ళ ఇష్టం" ఇంకేం అడగకు అన్న ధ్వని వినిపించింది నాకు.

"ఏ విషయంలో పీహెచ్డీ?" అని అడిగాను నేను.

"చూడాలి. ఇంటర్నెట్ని అంధులకి అందించడానికి పని చేస్తున్న ప్రొఫెసర్ దగ్గర పీహెచ్డీ. ఆ విషయం మీదే చెయ్యగలిగితే బావుంటుంది."

"చాలా బావుంటుంది. చూపులేని వాళ్ళకి ఇంటర్నెట్ వాడే అవకాశం వస్తుంది కదా? అది ఎంత మందికో ఉపయోగం కాదూ?"

"నా వల్ల ఎవరికో ఒకరికి ఉపయోగం ఉంటే మంచిదేగా" అంది. అలా అంటున్న గొంతులో ఏ భావం వినపళ్ళేదు లేదు. ఓ ఉత్సాహం లేదు. ఓ నిరుత్సాహం లేదు.

★★★★★★★★★★★★★★

ఇప్పుడూ శారద గొంతులో ఏ భావమూ ప్రత్యేకంగా వినిపించడంలేదు. ఐతే అప్పటికీ ఇప్పటికీ శారదలో చాలా తేడా ఉంది. అప్పుడు ఓ నిర్లిప్తత అంతర్లీనంగా కనిపించింది. ఇప్పుడు ఓ పరిపూర్ణత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. తను చెయ్యాలనుకున్నది చేసిన తృప్తి స్పష్టంగా తెలుస్తోంది.

ఆమాటే అన్నాను. శారద ఏం మాట్లాడకుండా ఇంటి వైపు నడిచింది. తను తిననని నాకు వడ్డించి ఎదురుగుండా కూచుంది.

నేను తింటున్నాను. తను వడ్డిస్తోంది. ఇద్దరం ఏమీ మాట్లాడకోడం లేదు. మాటల అవసరం లేదనిపించింది. ముప్పై ఏళ్ళ క్రితం మేం హైదరాబాద్ లో కలిసి చేరిన రోజులు గుర్తొచ్చాయి.

★★★★★★★★★★★★★★★★★★★★

శారద ఓ స్కూల్ టీచర్ కూతురిగా పుట్టింది. చదువు తప్ప మరోటి లేదనుకునే కుటుంబం. పెద్దల్ని గౌరవించడం తప్ప మారు మాటాడ్డం తెలియని సంస్కారం.

పెద్ద చదువు చదువుకుని, మద్రాసులో మంచి ఉద్యోగం చేస్తున్న శారదకి మద్రాసులోనే పని చేస్తున్న సుందరంగారితో పెళ్ళైంది. పెళ్ళైన రెండు నెలలకే ఆయన ఆ ఉద్యోగం మానేసి హైదరాబాద్ లో మరో ఉద్యోగం లో చేరారు. అందుకే పెళ్ళైన కొత్తలో తన భర్త ఉద్యోగం కోసం తను చెన్నైలో చేస్తున్న ఉద్యోగం వదిలేసింది. భర్త చెప్పినట్లే హైదరబాద్ లో ఇంకో ఉద్యోగంలో చేరింది.

మేం ఇద్దరం ఒకేరోజు చేరాం. తనగురించి కబుర్లు చెప్పేది. అన్నీ భర్తతోనూ, అత్తామావగార్లతోనూ ముడిపడ్డవి. అవి కాకపోతే పుస్తకాల గురించి, కంప్యూటర్ల గురించి.

ఇప్పుడు ఆశ్చర్యంగా ఉంటుంది. ముప్పై ఏళ్ళ క్రితం మా ఆఫీసులో కంప్యుటర్ అన్న మాటే లేదు. దేశంలోనే కొన్ని పెద్ద పెద్ద సంస్థల్లో కంప్యూటర్లు వస్తున్న రోజులవి. వాటిని పెట్టడానికి బిల్డింగులు కావల్సి వచ్చేవి. వాటి మీద పనిచెయ్యడం చాలా కొందరికి మాత్రం తెలుసుండేది.

శారదకి కంప్యూటర్ల మీద పని చేసిన అనుభవం ఉంది. శారద అంతకు ముందు చేసిన ఉద్యోగం కంప్యూటర్ల మీద. ఆ కాలంలో కంప్యూటర్ల మీద పని చెయ్యడం అంటే చాలా అరుదైన విషయం . అక్కడే పని చేసుంటే ఎంత నేర్చుకునేదో. నేను ఆమాట అంటే ఇప్పుడు అన్నట్లే అప్పుడూ –

"ఒకటి కావాలంటే ఒకటి వదులుకోవాలిగా" అంది.

★★★★★★★★★★★★★★★★★★★★★★★

ఆ మాటల్ని గుర్తు చేసుకుంటూ నేను తింటున్నాను. ఇద్దరం మాట్లాడుకోడం లేదు. అవసరమూ లేదు. ఈమెయిళ్ళ ద్వారా తను చేస్తున్న పని గురించి రాస్తూనే ఉంది. గూగుల్ చేస్తూ నేను ఆ పని గురించి చూస్తూనే ఉన్నాను.

ఇంటర్నెట్ లేకుండా ఇప్పుడు ప్రపంచం లేదు. ఐతే అది పెరిగిన తీరంతా చూపు ఉన్న వారికోసమే. చూపు లోపించిన వారికి ఇంటర్నెట్ అందాలంటే దాని కోసం ప్రత్యేకంగా కృషి చెయ్యాలి. అదే చేస్తోంది శారద. అది చాల గొప్ప విషయం.

ముప్ఫ ఏళ్ళ క్రితం కంప్యూటర్ల మీద పని చేసే వాళ్ళే అరుదుగా ఉన్న రోజుల్లో శారద కంప్యుటర్ల మీద పని చేసింది. పెళ్ళితో మానేసింది. పెళ్ళంటే గుర్తొచ్చి శారద మెడవంక చూసాను. మెళ్ళో మంగళసూత్రం ఉంది. శారద ఆ మంగళసూత్రాన్ని తియ్యలేదు. నాలుగైదు కాసుల బరువు మొయ్యడం కష్టం కాదు. ఎంతైనా సుందరం గారిని భరించడం అంత కాదు.

ఆ విషయం నాకు పదిహేనేళ్ళ క్రితం తెలిసింది. అప్పుడు రెండేళ్ళు నేనూ శారదా బెంగుళూరులో కలిసి పనిచేసాం. నా బదిలీలు ప్రొమోషన్లతో అయ్యేవి. శారద బదిలీలు సుందరం గారితో అయ్యేవి.

★★★★★★★★★★★★★★★★★★★★

మేం బెంగుళూరులో పనిచేస్తున్నప్పుడు – అంటే శారదకి పెళ్ళైన పదిహేనేళ్ళకి – సుందరం గారి వల్ల శారదకి అన్నీ కష్టాలే అని నాకు తెలిసింది. అది శారద చెప్పి కాదు. తక్కిన స్నేహితులు చెప్పి.

సుందరం గారు ఓ చోట స్థిరంగా ఉద్యోగం చెయ్యరు. శారద సంపాదన మీదే ఆయన బతుకంతా. రకరకాల అలవాట్లు. శారదని మనశ్శాంతితో ఉండనివ్వరు.

శారద నలుగురికీ చేతనైనంత సాయం చేసే మనిషి. ఆ సంస్కారం అమ్మనాన్నల దగ్గర నుండి అబ్బింది శారదకి. అది సుందరం గారికి నచ్చేది కాదు. అనుమానాలతో అవమానించేవారు. అత్తగారూ అంతే. పెద్దవాళ్ళని ఏమీ అనకూడదని నేర్చుకున్న శారద అణకువగానే ఉండేది. అన్నింటినీ సహించేది.

శారద నాతో ఇవేమీ చెప్పేది కాదు. ఎప్పుడూ మంచి పుస్తకాల గురించీ, గొప్ప విషయాల గురించీ చెప్పేది. అప్పుడు నేను చేస్తున్న పీహెచ్డీ గురించి అడిగేది. నేను పీహెచ్డీ చెయ్యడానికి సాయంగా నా ఆఫీస్ పని కొంత తను చేసేది. నేను పనీ, చదువూ, ఆ ధోరణిలోనే ఉండేవాడిని. శారద కష్టాల గురించి అడిగేవాడినే కాదు. తనూ చెప్పేది కాదు.

నేను ప్రొమోషన్ మీద బెంగుళూరు నుండి వెళ్తునప్పుడు మాత్రం –

"నాకూ ఇక్కడ నుండి వెళ్ళిపోవాలని ఉంది" అంది.

"వేరే ఊరికి ట్రాన్స్ఫర్ చేయించుకో" అన్నాను నేను.

"ప్రయోజనం ఏముంది. అక్కడైనా ఇంతేగా" అంది.

"పోనీ . . ." ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తెలియక ఆగాను.

నేనేం చెప్పదలచుకున్నానో తెలుసుకోలేని తెలివితక్కువది కాదు శారద.

"పిల్లాడున్నాడు. వాడి చదువూ, పెళ్ళీ ఉన్నాయింకా. ఆ తర్వాతే సన్యాసం. అంతవరకూ సంసారం. ఒకటి కావాలంటే ఒకటి ఒదులుకోవాలిగా" అంది శారద.

శారద నాకు తన బాధ వినిపించేది కాదు. వినలేకపోవడం నా బలహీనతే కానీ, వినిపించకపోవడం తన బలం.

★★★★★★★★★★★★★

ఆ బలమే శారదని ఇంతదాన్ని చేసింది. టొరోంటోలో కూచుని ప్రపంచంలో మూల మూలల్లో ఉన్న అంధులకి ఇంటర్నెట్ వాడుకునే అవకాశాన్ని కలిగించే ప్రయత్నంలో ఉంచగలుగుతోంది.

ఎక్కడ మొదలైన జీవితం ఎక్కడకి చేరింది.

ముప్పై ఏళ్ళ క్రితం హైదరాబాద్ లో – సాయంత్రం ఆఫీసు ఐపోతూండగానే మొగుడి మోటార్ సైకిల్ వెనకెక్కి ఇంటికి వెళ్ళిపోయేది పాతికేళ్ళ శారద.

ఇప్పుడు టొరోంటోలో – ఐదున్నర పదుల శారద – తన్ని అర్థం చేసుకోలేని వాళ్ళని వదిలేసి తన అవసరం ఉన్న వాళ్ళ వెనక ఉంది.

మ్యూజియాల దగ్గర మెట్లతో పాటు వికలాంగులు ఎక్కడానికి అనువుగా దార్లు తయారు చేస్తారు. అవి ఎంత ఉపయోగకరమో, శారద లాంటి వాళ్ళు చేస్తున్న పనీ అంతే ఉపయోగం.

శారద మెళ్ళో మంగళసూత్రం, శారద ఒళ్ళో లేప్టాప్ ఒకదానితో ఒకటి మాట్లాడుకుంటే ఎలా ఉంటుందో. పాతికేళ్ల శారద కథ మంగళసూత్రం చెప్తుంది. కష్టాలతో కనీళ్ళతో నిండిన శారద కథ అది. గత అయిదేళ్ల కథ లేప్టాప్ చెప్తుంది. శారద ఆశయల కథ అది. ఎందరి ఆశలో తీరుద్దామనుకునే కథ అది.

ముప్ఫై ఏళ్ళ క్రితం చాలా తక్కువ మంది పనిచేసే కంప్యూటర్ల మీద పని చేసింది శారద.

ఇప్పుడు దృష్టిలోపం ఉన్నవారికి ఇంటర్నెట్ అందించే పనిలో ఉంది. ఇదీ ఎక్కువ మంది చేసేపని కాదు.

అప్పుడూ, ఇప్పుడూ అరుదైన మనిషి శారద.

ఒక దాని కోసం ఒకటి వదులుకోడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఐతే ఏది ఎప్పుడు వదులుకోవాలో తెలిసిన మనిషి.

పెళ్ళి చేసుకుని సంసారం కోసం ఉద్యోగం వదిలేసుకుంది. పిల్లాడిని పెంచి పెద్దచేసి పెళ్ళిచేసింది. అన్ని బాధ్యతలూ తీరాక సమాజం కోసం సంసారాన్ని పక్కనపెట్టింది.

నా ఆలోచనలన్నీ తనకి అర్థం ఐనట్లుగా –

"మరీ అంత గొప్పగా ఊహించేసుకోవద్దు నన్ను" అంది.

నేను వెళ్ళడానికి లేచాను. మళ్ళీ రెండు ట్రాములు. నన్ను దింపేసి వెళ్తూ –

"పిజ్జాలూ బర్గర్లూ ఏం తింటావు కానీ రేపు సాయంత్రం పెరుగన్నం తెచ్చిస్తా. బయట ఎక్కడా తినకు." అని వెళ్ళిపోయింది శారద.

శారద అంటే సాయం. సాయం చెయ్యడం కోసమే పుట్టింది. సాయం చెయ్యడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఆ సాయాన్ని అందుకోలేని వాళ్ళు ఉంటారు. ఇంకెవ్వరికీ అందివ్వద్దని అనేవాళ్ళూ ఉంటారు. వాళ్ళు మూర్ఖులు. అంటే భర్తలు.

# పీర్ల కోనేరు వాసుదేవ్

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2013)లో బహుమతి పొందిన కథ

"**సార్, గేట్ మూసేసే టైమ్ అయింది.అందరూ వెళ్ళిపోయారు**" సెక్యూరిటీ గార్డ్ నెమ్మదిగానే చెప్పినా కొంచెం కరకుగానే అన్పించింది. ఉద్యోగ ధర్మం మాటల్లో కన్పిస్తుందనుకుంటా మనవాళ్లల్లో....అతని ముఖంలోకి చూడకుండానే వెనుదిరిగాను.

అక్కడేదో వదిలేసి వెళ్తున్న భావన. నాతోమాట్లాడుతున్న వారెవరో హఠాత్తుగా మాయమయినట్లు, ఇక మాట్లాడరన్న దిగమింగుకోలేని భావన.

ఒక్కసారి అక్కడ లేని కోనేటివైపు తృప్తిగా(?) చూసి రెండు చేతులూ జేబులో పెట్టుకుని వెనుదిరిగాను. బయట సిమెంట్ బెంచీపై కూర్చుని కోనేటిపై పర్చుకున్న చీకటిని చూస్తూ అనుకున్నాను 'ఎంతపెద్దగా ఉండేది.ఇప్పుడిలా వీళ్ళకి చిక్కి, చిక్కి శల్యమై, ఆఖరికి ఇలా మిగిలిందా!...'. అప్రయత్నంగా నా ఆలోచనలన్నీ వెనక్కెళ్ళాయి. పుర్తిగా వెనక్కి. నేను ఈ కోనేటికి వచ్చిన మొదటిరోజు వరకూ వెనక్కి......

★ ★ ★ ★

**అనగనగా ఒక ఊరు**. నన్ను కన్న ఊరు.

విశాఖపట్నం.

పొడవాటిచేతులు చాచి సాదరంగా ఆహ్వానించే ఎత్తైన కొండలూ, ఎప్పుడెళ్ళినా అంతే ఆప్యాయతతో పలకరించి 'జీవితమింతే' అని చెప్పే సముద్రమూ మాఊరికి కవచకుండలాలు. అవెప్పుడూ కలిసే ఉంటాయి-ఒకదాన్లో మరొకదాన్ని ఇముడ్చుకుంటూ! మిమ్మల్నీ ఇముడ్చుకుంటాయి తమలో....ఆప్యాయంగా! ఔను, ఇంతకీ ఆప్యాయత చిరునామా వెతుక్కోవాల్సిన ఇప్పటి పరిస్థితుల్లో ఈ సముద్రం మనకి మంచి రచ్చబండ.

అయినా మీరు నమ్మరుగానీ, నగరం ఓ అందమైన అమ్మాయైతే మరి ఆ అమ్మాయి నాభి ఎంత అందంగా ఉండాలండీ... అంత అందంగానూ ఉండేది ఆ కోనేరు. నిజంగానే నడి'బొడ్డు' న ఉండేది ఆ పీర్లకోనేరు.

నాన్నగారూ ప్రతీరోజూ చేసే పూజలో వాడిపోయిన పూలన్నీ ఓ పొట్లంకట్టి అందులో విసిరేయమని పంపేవారు వారానికోసారి. అలా ప్రతీఅదివారం ఆ పీర్లకోనేరుకెళ్ళి ఎవరూ చూడకుండా పూలపొట్లం విసిరేసి కొంచెంసేపు అక్కడే ఉండి ఆకోనేటి అందాలని చూస్తూ కొన్ని గంటలు గడిపేవాణ్ణి. కోనేటిచుట్టూ కంచెలా ఉన్న ఇనుపచువ్వలని పట్టుకుని ఎంతసేపు ఉండేవాణ్ణో ఇంటికొచ్చేసరికి ఇంకా నాబుగ్గలపై ఆ చువ్వల మరకలు ఉండేవట.

***ఆకోనేరు బోలెడు కథలు చెప్పేది నాతో.***

నన్నెవరూ ముట్టుకోకుండా చూడు నీకింకా కథలు చెప్తాననేది. అది నా వల్ల కాదని అన్లేకపోయాను.

పచ్చగా, నిండుగా ఉండి కడుపులో దాచుకున్నదంతా 'ఎవ్వరికీ చెప్పనులే' అన్నట్లుండేది. నిద్రలో ఉలిక్కిపడ్డట్టు అప్పుడప్పుడు చిన్నగా మొదలై పెద్దవైతూ ఉండే వలయాలు నన్ను అక్కడికి లాక్కెళ్ళేవి.

ఎవరో నాతో మాట్లాడాలని అనుకుంటున్నట్టూ, దేనికోసమో గింజుకుంటున్నట్టూ..అస్పష్టంగానే అయినా నాకోసమే వాళ్ళెవరో ఎదురుచూస్తున్నట్టుగా అనిపించేది. రానురానూ ఆకోనేరు నాకు చాలా అపురూపమయింది.

ఆదివారం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేవాణ్ణి.

"ఎవరు బాబూ నువ్వు, ఏంచేస్తున్నావిక్కడ?" అని గద్దించే సెక్యూరిటీ గార్డ్ రాజు స్నేహితుడయ్యాడు కాలక్రమేణా. వాడిన పూవులపొట్లం విసరడంలో చేయూతనిచ్చేవాడు.

ఇంకొన్నాళ్ళకు ఇంకా దగ్గరయ్యాం . వయసులో నాకంటె పెద్దవాడు కావటంతో నన్ను చాలా అబ్జర్వ్ చేసేవాడు. నిజానికి అక్కడ పూలు కలపటం నిషిద్ధమైనా నాకోసం రూల్స్‌ని పక్కనపెట్టి మరీ నాకు దగ్గరయ్యాడు.

మనిషి ధృఢంగా ఉద్యోగానికి తగ్గట్టుగా, గతానికీ వర్తమానానికీ మధ్య అవస్థాంతరంలా ఉంటాడు. పావుగంటకోసారి ఆరిపోయిన బీడీని వెలిగించునప్పుడు ఆమంటలో మాత్రమే అతని ముఖంలో భావాలు చదవగలుగుతాం.

"ఏటిబాబూ, ఇక్కడేదో పోగొట్టుకున్నవాడిలా ఆ కోనేటివైపే సూత్తుంటావు వచ్చినప్పుడల్లా" అన్నాడొకసారి.

"రాజూ! దీన్ని కోనేరు అనే ఎందుకంటారు? చెరువనో, కొలననో అనొచ్చుగా" అని అడిగాను.

"ఏమో నాకవన్నీ తెల్దు బాబూ..నేనంత సదువుకోలేదు. కానీ దీనికింద ఏడు బావులున్నాయని మాత్రం సెప్పుకుంటారు.ఇంకా సాలా కతలు కూడ సెప్పుకుంటారు బాబూ" అన్నాడు. నా ఆసక్తిని గమనించి నాకేదో చెప్పాలనె ఉత్సుకత కన్పడింది రాజు మొహంలో.

"ఏంటా కథలు? చెప్పు చెప్పు నీకేం తెల్సో అవన్నీచెప్పు" ఆ కోనేరు మాములుకోనేరు కాదని ఏదో ప్రత్యేకత ఉందని నాకెందుకో గట్టి నమ్మకం.

"ఎప్పుడో సాన్నాళ్ళకిందట రాజులు, రాణులు ఉండేవారు కదా, ఇక్కడ కూడా రాజులు పాలించేవోరట బాబూ. ఎక్కడో ఆళ్ల కోట ఉండేది. అందుకనీసి ఇక్కడో ఇల్లు కట్టుకున్నారంట వచ్చినప్పుడు ఇస్రాంతి తీసుకోడానికన్నట్టు. దాన్నేదో అంటారట కదా--" ఆగాడు

"ఆ..గెస్ట్ హౌస్ అంటారు"

"ఆ అదె.అందులో ఉండేవారంట. అద్దదిగో ఈడకవుపడతాది. ఆ తెల్ల బంగ్లానే. అక్కడ ఓ రోజు ఏదో జరిగిందట బాబూ..." రాజు మొహంలో తటపటాయింపు స్పష్టంగ కన్పడుతోంది.

"ఏం జరిగింది రాజూ. చెప్పులే ఫర్వాలేదు. నేనెవరికీ చెప్పను. అయినా ఎప్పుడో వందేళ్ళకిందట జరిగుండాల కదా. ఇప్పుడేమవుద్ది మనం మాట్లాడుకుంటే?" నా ఆసక్తి అతన్ని ఇంకా ప్రోత్సహించింది.

"ఆ బంగ్లాలో ఒక్కరోజే ఇద్దర్ని సంపేసారంట. అదే జంట హత్యలంటారు కదా. సంపేసాక ఏం సెయ్యాలో తెలీక శవాల్ని ఇక్కడకు తీసుకొచ్చారంటా ఇంట్లో నమ్మకంగా ఉన్న పనోళ్ళూ. అప్పుడిది ఆళ్ళకి పెరడులాంటిది. ఇక్కడెవ్వరూ ఇల్లుకట్టుకుని ఉండేటోళ్ళు కారు. ఇక్కడేవీ ఉండేవీకావు, కానీ సుట్టుపక్కల ఉండేటోళ్ళు.. ఆళ్ళు ఇక్కడేదో తవ్వటం సూసిన సుట్టుపక్కోళ్ళు గొడవసేత్తే 'ఏం లేదులె ఎళ్ళిపోండి ఇక్కడ నూతులు తవ్వుతున్నాం' అని సెప్పిపంపేశారంట. ఆళ్ళేళ్ళిపోయాక ఈ శవాల్ని ఇక్కడె కప్పేసెల్లిపోయారంట బాబూ.."

"మరి ఈ కోనేరెలా వచ్చింది?" వెంటనే అడిగాను.

"మరి ఊరిపెజలకోసం ఏదో తవ్వుతున్నారని సెప్పారుకదా బాబూ మరి ఏదొ ఒకటి సెయ్యాలకదా? అందుకని ఏడు నూతులు తవ్వీసినారంట. ఆనీళ్ళే ఈ కోనేరు." ఆగాడు రాజు ఇక చెప్పడానికేమీ లేదన్నట్లు.

"మరి ఆ శవాలు? అవి ఎవరివి అయిఉంటాయి?" నాకు చాలా ఉత్సాహంగా ఉంది.

"ఆట్ని ఇక్కడె కప్పేసేరాంట. ఈ నూతుల మధ్యలొ ఎక్కడో. నాకూ సరీగ్గా తెల్దు. మరి ఆ శవాలెవరివో తెల్దుకానీ ఒకరు ఆడ మరొకరు మగ అని సెప్పుకుంటారు. మరి ఆ గొడవేటో వొవ్వరికీ తెల్దు. సాన్నాళ్ళయింది. ఆళ్ళోళ్ళందరూ పోయారు. ఇప్పుడూ కోటలూ లేవు రాజులూ నేరు కదా" రాజు దగ్గర ఇంకంతకన్నా ఇన్ఫర్మేషన్ లేదు.

కానీ అది చాలు నాకు చాలా సమాధానాలు దొరికినట్లె.

★ ★ ★ ★

కొన్ని గుబులుమేఘాలేవో ఆ కోనేటి అలలపైనుండి దుమికొచ్చి మరీ నన్ను ముంచేసినట్టు అనిపించేది. ఆ అనుభవాన్ని నేనొక్కణ్ణే అనుభూతించాలన్న భావన రానురానూ ఎక్కువై ఒక్కణ్ణే కోనేటి అంచున నిలబడి ఆస్వాదించాలన్న తపన పెరిగి సాహిల్ ని కూడా తీసుకెళ్లటం మానేసాను....

ప్రాణస్నేహితుని చెయ్యి భుజాలపైనుంచి జారిపోయింది.

**సాహిల్.**

వాడు నానీడ.

ఉండటానికి పక్కిల్లే అయినా నాతోనే ఉండెవాడు. రాత్రీ, పగలూ... స్నేహితుడు అని మాత్రమే అనిచెప్పి ఊరుకుంటే తక్కువే. మేం పంచుకోనిదంటూ ఏమీలెదు.. ఆ కోనేరుకి కూడా ఇద్దరం కల్సే వెళ్ళేవాళ్లం.

పువ్వుల్ని విసిరిన ప్రతిసారి అడిగేవాడు "పువ్వులని ఇక్కడే ఎందుకు కలపాలి? అవి ఎక్కడికి వెళ్తాయి?" అని

"దేవుడి దగ్గరకెళ్తాయంట, మా నాన్న చెప్పాడు" అనేవాణ్ణి అమాయకంగా.

వాడికి దేవుడికంటే నాపైనే నమ్మకం.

"అంటే ఇక్కడ ఏం కలిపినా దేవుడిదగ్గరకే వెళ్తాయా?" అన్నాడు

"అవుననుకుంటా.అయినా మీకు తెలియాలి కదా? పీర్లపండగ మీదేకదా.. మీ మతంలో ఉన్నదేకదా?"

"ఏమో అది ఇస్లాం పండగే అయినా మా కులంలొ లేదు.వేరే వాళ్ళు చేస్తారది.మేం చెయ్యం" అన్నాడు సాహిల్.

"మరి ఆరోజు ఈ కోనేరులో ఏం కలుపుతారోకూడా తెలీదా?" అన్నాను

తెలీదన్నాడు.

వాడికి నేనూ, నాకు వాడు.ఇంకెవ్వరూ మా మధ్యలోకి రాలేకపోయారు. వాడి మనసుకి ఎవ్వరూ దగ్గరకాలేకపోయారు. మాకు మతగొడవల్లేవు. పండగ తేడాలసలే ఉండేవికావు. దీపావళికి వాడే ఎక్కువకాల్చేవాడు––వీధిలోని అమ్మాయిలందరూ చూస్తుండగా.....వాడి రంజాన్‌కి నేను కుర్తా పైజామా వేసుకుని సంబరపడేవాణ్ణి. ఇద్దరం కలిసే డబుల్‌కామీటా పంచేవాళ్లం మొహల్లాలోని మిగతా ఇళ్ళకెళ్ళి.

అయినా, ఆదివారప్పూట కోనేరుకి తీసుకెళ్లటం మానేసినా నామనసు తెల్సినవాడిగా ఊరుకున్నాడు తప్ప ఏనాడూ దానిగురించి మళ్ళీ అడగలేదు.

ఆ తర్వాత కాలధర్మానికి బానిసలుగా ఇద్దరం విడిపోయాం. నేను మరోదేశానికి ఉద్యోగానికెళ్ళిపోయాను.వాడు మాత్రం అక్కడే బతుకుతెరువు చూసుకున్నాడు.

ప్రతీ ఏడాది శలవులకి ఇద్దరం కలవడం, కష్టసుఖాలు పంచుకొవడం మామూలె.

*మతాతీత ఆత్మబంధుత్వం మరి.*

మళ్ళీ కాలధర్మం నన్ను తన ఎటెన్షన్‌లోకి లాక్కుంది. సాహిల్ నుంచి ఫోన్.

అమ్మ పోయిందని.

మేఘాలపై వచ్చివాలాను. వాడికంటె నేనే ఎక్కువబాధపడతానని తెల్సు. అసలు నేను వస్తానో రానో అన్న సందేహంకూడా లేదు వాడికి.

మూడోరోజు నాదగ్గరికొచ్చాడు. కొన్ని వస్తువులని మూటకట్టి మరీ తెచ్చాడు. నా చేయి గట్టిగా పట్టుకుని "మీ కోనేరుకెళ్దామా" అన్నడు.

ఆశ్చర్యంగా చూసాను, నా చూపులకి వాడికర్థం తెలిసినట్లుగా మరెవరికీ తెలీదు. ఆఖరికి నా సహచరిక్కూడా.

"వెళ్దాం" అన్నాను.

"ఇవి అమ్మవి. మాకు అస్థికలుండవు. మేం దేహాన్ని తగులబెట్టం, నీకు తెల్సుకదా?" అన్నాడు దైన్యంగా.

వాడుమాటల్లో చెప్పినదానికంటే చెప్పనవే ఎక్కువ.

నేను అప్రయత్నంగా ఆ చిన్నమూట విప్పిచూశాను.

అమ్మ వాడిన కళ్ళజోడూ, పెట్టుడుపళ్ళూ!

ఇద్దరం మౌనంగా కోనేరుకెళ్ళాం...వెళ్ళేవరకూ ఏం మాట్లాడుకోలేదు. కోనేరు గేట్ దగ్గరకెళ్ళాక నోటమాటరాలేదు నాకు.

కోనేరు సగానికిపైగా కప్పబడింది. కోనేరుని కొనేశారు. దానిపై ఏవేవోకట్టడాలు.

"ఏంట్రా ఇది?" అన్నాను.

"నేనూ చూళ్ళేదు. నీతో అపుడెపుడో రావటమే. మళ్ళీ ఇటువైపు రాలేదు." అన్నాడు..వాడు ఏ ఉద్దేశ్యంతో అన్నా వాడిమాటల్లో ఏదో ధ్వనించింది..ముఖ్యంగా "నీతో అప్పుడెప్పుడో" అన్న మాట నాలో బాగానే దిగింది.

"పోన్లె సగం ఉందిగా కనీసం"అనుకుంటూ మేం వచ్చినపని పూర్తిచేశాం.

కార్లో కూర్చుంటూ అడిగాను

"మీ పీర్లకోనేరే కదరా, మీవాళ్ళచేత చెప్పించొచ్చుగా ఈ కలపడాలూ అవీ అఫిషియల్ గానే చేసుకోవచ్చుగా?"

"ఆ పేరేకాదు ఈ కోనేరుని మేమూ మావాళ్ళు మర్చిపోయి కొన్ని శతాబ్దాలయిందనుకుంటా" అన్నాడు కళ్ళలొ కన్నీటి జీరతో.

★ ★ ★ ★

మళ్ళీ కొన్నాళ్ళు మేం కల్సుకోలేకపోయాం.

క్యాలండర్లో కొన్నిఏళ్ళు చిరిగిపోయాక పెద్దరికం తెచ్చిపెట్టుకున్నాం...ఒక్కొక్కరి మరణానికి ముందు షాక్, ఆ తర్వాత అలవాటుపడ్డం, ఇలా..జీవితం తన కథల స్క్రీన్ ప్లే తనే రాసుకుంటూ పోతోంది.

ఈ సారి కాలగ్రహణం మూడేళ్ళు. ఎవరితోనీ ఏరకమైన కాంటాక్ట్స్ లేవు. ప్రయారిటీస్ మారుతుంటాయి జీవితాల్లో. కొందరి ప్రమేయం బాగా తగ్గితే మరికొందరు అనూహ్యంగా జీవితంలోకి చొచ్చుకొస్తారు.

అప్పట్లో సెల్ ఫోన్ లేని జీవితం ఎలా ఉండేదో ఇప్పటివారికి ఎంతచెప్పినా ఎలా చెప్పినా అర్ధంకాదు. మన వాళ్లతో మాట్లాడాలంటే ట్రంక్ కాల్స్ మాత్రమే. మన సహనానికి ఓ పెద్ద పరీక్ష అవి. అందుకని కేవలం ఎమర్జన్సీ అవసరాలకిమాత్రమే అవి వాడేవారు.

ఇండియాకి రావటానికి అన్ని కారణాల్లోకి ముఖ్య కారణం సాహిల్ ని కలవటం. నా ప్రయారిటీస్ లో వాడెప్పుడూ ప్రధమమే.

ఇండియాకి బయల్దేరేముందే వాడికివ్వాల్సినవన్నీ ఓ అందమైన బ్యాగ్ లో అమర్చి మరీ తిసుకొచ్చాను.

ఇంట్లోకి వచ్చీ రాగానే వాడికోసం పరుగులు. వాడు ఆ పీర్లకోనేరుపైన  కడుతున్న ఓ షాపింగ్ మాల్ లో పనిచేస్తున్నాడని ఎప్పుడో మా ఇంట్లో వాళ్ళు ఓ ఉత్తరంలో రాసిన గుర్తు.

క్రిందటిసారి వాడితోమాట్లాడినప్పుడూ కూడ వాడు ఇదే విషయం చెప్పాడు. ఓ పెద్ద మాల్ కడుతున్నారని అది త్వరలోనె పూర్తవుతుందనీ అది పూర్తయితే ఇక ఆ కోనేరు పూర్తిగా కప్పబడుతుందనీ.....సాహిల్ కెందుకో ఆకోనేరుని మూసేయాలనే కోరుకునేవాడు. చిన్నప్పుడూ ఆ కోనేటి పాటలకొసం వాడిని కొంచెం దూరం చేసాననే కోపం కాబోలు.

వాడిముఖంలొ ఆనందంకంటే కోనేరు ఎక్కువకాదు. ఆ ఆనందంలోనే అక్కడికెళ్లాను. ఏ రాస్తా మర్చిపోయినా పీర్లకోనేరుకి వెళ్ళే రాస్తా మర్చిపోలేను.

అక్కడి పరిస్థితులు అనుకున్నట్లుగానే పూర్తిగా మారిపోయాయి. కానీ సాహిల్ గురించి కనుక్కోవటం నేననుకున్నదానికంటె కష్టమైంది....

చాలా మందిని చాలా ఎంక్వైరీలు చేసాక బిల్డింగ్ సెక్యూరిటీ గార్డ్ కే అన్ని తెలిసుండాలి కాబట్టి అతనే అడగమన్నారు. గార్డ్ రాజు ఇంకా ఉద్యోగంలొ ఉంటాడనుకోలేదు..అసలతను బతికే ఉన్నాడొ లేదో కూడా తెలీదు.

"ఆయనా, పొడుగ్గా, ఎర్రగా ఉంటాడూ, సాయిబుల కుర్రాడు కదూ ఆ బాబు?" అన్నాడు చాలా కష్టపడి వివరాలు తీసుకున్నాక. ఇంకా చాలా వివరాలు అడిగాడు. ఆఖరికి నాపర్స్ లొ ఉన్న ఓఫోటో చూపించాను.

"ఆ..ఈయనేలే"అన్నాడు.

“ఈయనే. ఎక్కడున్నాడు" అన్నాను ఆదుర్దాగా

"ఇంకెక్కడున్నాడు, ఇది కడుతున్నప్పుడే మూడో అంతస్థునుంచి పడిపోయాడు. అయినా ఆ సామి మీకేమవుతాడు?"

"ఆత్మబంధువు" అని చెప్పబోయి వాడికెందుకులే అని "మా దూరపు బంధువు, మరి అతని బాడీ?" అన్నాను.

"కిందపడ్డప్పుడే బాడీ నుజ్జయింది, కానీ ప్రాణం కొట్టుకుంటూ ఉండింది. ఒక్కటే అడిగాడు. అతన్ని ఇక్కడే ఈ కోనేరులో కప్పేయమని"

"మరేం చేశారు?"

"ఎవర్రాలె. రెండురోజులు చూసినం.ఈడనే పాతేసినం" అని కోనేరులొ ఓ మూల చూపించాడు.

"సాహిల్" అన్న నా అరుపు నా గొంతులోనే ఉండిపోయింది. ఓ భారమైన, బలమైన బాధేదో గుండెని చుట్టేసినట్లైంది.

కొన్ని జ్ఞాపకాలకి మరణాలుండవు..కొన్ని మరణాలకి మరుపూ ఉండదు.

ఇప్పుడక్కడ కోనేరు ఆనవాలు కూడా లేదు. షాపింగ్ మాల్ కొచ్చేవారికోసమని ఓ పార్క్, అందులో బోలెడన్ని పూలమొక్కలు. అక్కడ సాహిల్ సమాధిపై ఉన్న మొక్కేదో తెలిసే అవకాశం ఎంతమాత్రమూ లేదు.

సాహిల్ తన చేతిని నా భుజాలపైనుంచి గుండెలమీదుగా కిందకు జార్చేశాడు.

***కొన్ని జ్ఞాపకాలకి మరణం ఉండదు. కొన్ని మరణాలకి మరుపుండదు.***

డాక్టర్ ఫాస్టస్ గుర్తొచ్చాడు. డామ్నేషన్ గురించి కొంచెం తెలిసొస్తోంది.

ఇక నేను నానీడ లేకుండానే ఉండాలి......

ఇక ఆ పీర్లకోనేరులో ఏం కలుపుతారని ఎవర్నీ అడగనవసరం లేదు.....

# సీతమ్మ లోగిలి — పి.కె.జయలక్ష్మి

టిఫిన్ తింటున్న విక్రమ్ భార్యని కేకేసి "రాణీ! అమ్మ గది నీట్ గా సర్దారా లేదా?పూజ సామగ్రి అంతా అందుబాటులో ఉంచారా? కిటికీలకి, గుమ్మానికీ లైట్ కలర్ కర్టెన్స్ వెయ్యండి, ముదురు రంగులు అమ్మకి నచ్చవు. తెల్సు కదా?"అని ఆదేశం జారీ చేశాడు.

"ఓ ఎప్పుడో రెడీ. కంగారుపడకండి సార్ . అన్నీ అత్తయ్యకి నచ్చినట్టే చేశాము." రాణీ మాటలకి శృతి కలుపుతూ "అత్తయ్యగారు ఇల్లు చూసి చాలా సరదా పడతారు, నేను గ్యారంటీ ఇస్తున్నా బావగారూ" అంది మరదలు గీత నవ్వేస్తూ.

ఉమ్మడికుటుంబ వ్యవస్థకి విలువిచ్చే గరుడాచలం, సీతమ్మ గారి పిల్లలు విక్రమ్,రాజీవ్,అనిల్. ముగ్గురన్నదమ్ములు బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేస్తూ పెళ్ళిళ్ల య్యి పిల్లలతో హాయిగా అంతా కలిసి ఉంటున్నారు. తండ్రి గరుడాచలం తన చివరి రోజుల్లో ఆస్తులు సమానంగా పంచుతూ, పిత్రార్జితమైన ఇల్లు కూడా వాళ్ళపేర వ్రాస్తూ" నాయనా! ఇది మీ తాత గారి హయాం నించి వస్తున్న ఇల్లు. ఈ ఇల్లంటే మీ అమ్మకి అమితమైన ఇష్టమని మీ అందరికీ బాగా తెలుసు. అదృష్టవశాత్తు మీకు ఈ ఊళ్లోనే ఉద్యోగాలు కాబట్టి అంతా కలిసి ఇక్కడే ఉండండి. అమ్మ ఉన్నంతకాలం ఈ ఇంటిని మాత్రం అమ్మకండిరా. తర్వాత మీ ఇష్టం" అని చెప్పడం వాళ్ళకి బాగా గుర్తే.

విక్రమ్ ఆడిటర్ గాను, రాజీవ్ ఇంజనీర్ గాను అనిల్ బ్యాంక్ ఆఫీసర్ గాను పనిచేస్తూ, క్వార్టర్స్ లో ఉండే సౌకర్యం ఉన్నా పాత ఇంటినే కాస్త బాగు చేయించుకొని తల్లి దండ్రుల కోర్కె మేరకు అంతా కలిసి ఉంటున్నారు. కోడళ్ళు కూడాబుద్ధిమంతులు కావడం, అత్తగారిని అమ్మలా ఆదరిస్తూ అరమరికల్లే కుండా స్వంత అక్క చెల్లెళ్ల ల్లా కలివిడిగా ఉండడం ఇంకో ప్లస్ పాయింటు. రెండోకొడుకు రాజీవ్ కి అనుకోకుండా ఆస్ట్రేలియా లో మంచి ఉద్యోగం రావడంతో భార్య, కూతురు తో వెళ్తూ తల్లి ని కూడా తనతో తీసుకు వెళ్ళాడు. వెళ్ళిన రెణ్ణెల్లకి

సీతమ్మ ప్రమాదవశాత్తూ బాత్రూమ్ లో జారి పడిపోవడంతో ఆమె కాలి ఎముక విరిగింది. పెద్దతనం కావడంతో అతకడానికి కాస్త ఎక్కువ సమయమే పట్టింది. రాజీవ్ అతని భార్య దేవి ఆమెకి సపర్యలు చేసి జాగ్రత్త గా చూసుకున్నారు. కాస్త కోలుకున్నాక సీతమ్మ కి సొంత ఇంటి మీద గాలి మళ్ళ టంతో రాజీవ్ ఆమెని దింపడానికి ఇండియా వస్తున్నాడు.

విక్రమ్, అనిల్ తల్లిని , తమ్ముడిని రిసీవ్ చేస్కోడానికి ఏర్ పోర్ట్ కి వెళ్లారు. ఇంటి ముందు కార్ ఆపగానే రాణీ,గీత పరుగున వచ్చి సీతమ్మ చేయి పట్టుకొని దించారు.ఆమె అనుమానం గా ఇంటి వైపు చూస్తూ " ఇదేంటి? ఇక్కడకెందుకు వచ్చాం? ఇదెవరిల్లు? మనింటికి వెళ్దాం. పదరా విక్కీ"అంది చిన్నపిల్లలా.

విక్రమ్ ప్రేమగా తల్లిని బుజ్జగిస్తూ " అమ్మా,ఇదిమనిల్లేనే! నీకు చక్కగాసౌకర్యంగా ఉంటుంది. నీగది చూద్దువుగాని రా" అంటూ ఆమె భుజంచుట్టూ చేయివేసి లోపలికి నడిపించాడు.

"ఒరేయ్ మీ అసాధ్యం కూలా! నన్ను పంపించి బంగారం లాటి ఇల్లు అమ్మేసారా? రాజీ నువ్వు చెప్పు , నీకు తెలిసే ఉంటుందిగా?" అరవడం మొదలెట్టింది.

"ఇది మరీ బాగుంది. మధ్యలో నన్ను లాగుతావేంటే ?అప్పుడు నిన్ను తీస్కోని వెళ్ళిన వాణ్ని మళ్ళీ ఇదే కదా రావడం?నాకేం తెలుసు ఇక్కడేం జరుగుతుందో?" చల్లగా తప్పుకున్నాడు రాజీవ్.

అనిల్ కల్పించుకుంటూ "అమ్మా, చాలా దూరం ప్రయాణం చేసి వచ్చావు. ముందు కాఫీ,టిఫిన్ కానివ్వు. ఇంతకీ నీ ఆరోగ్యం ఎలా ఉంది?"మాట మార్చే ప్రయత్నం చేశాడు.

"ఆరోగ్యం లేదు, ఆవకాయా లేదు. మీ నాటకాలు చాలించి ఇల్లేం చేశారో చెప్పండి ముందు"కసిరేసింది సీతమ్మ.

"అమ్మా అనవసరంగా టెన్షన్ పడకే . ఇది మన ఇల్లేనే. ఆ మనుషులే, ఆ రోడ్డే, అంతా అదే వాతావరణమేనే బాబూ" సహనం గా చెప్పాడు విక్రమ్.

"ఏరా,? కాస్త చూపు మందగించినంత మాత్రాన మీకు నేను గుడ్డిదాన్లా కన్పిస్తున్నానా?"అదే ఇల్లు అంటున్నావు? రెండేళ్ళు కాదు, రెండు శతాబ్దాలైనా నా ఇంటిని నేను మర్చిపోతానట్రా? ఏదిరా పెద్ద వరండా, నడవా?ఎక్కడ నా విశాలమైన పెరడు, పూల మొక్కలు, పారిజాతం, జామ, కొబ్బరి చెట్లు, తులసి కోట?" ఖంగుమంది ఆమె కంఠం.

ఈలోగా మనవలు "హాయ్ నాన్నమ్మా!" అంటూ గోలగా వచ్చి ఆమెని చుట్టుముట్టారు. ఇదే ఛాన్స్ అని కోడళ్ళు "అత్తయ్యా ముందు కాఫీ తాగండి. మీకిష్టమని పెసరట్టు,ఉప్మా చేశాం తినండి" అంటూ మర్యాదలు చేయసాగారు.విక్రమ్ కూతురు హాసిని ''నానమ్మా, చూడు నీకోసం గులాబ్ జామ్ నేనే స్వయం గా చేశా. నమిలే పనే లేదు.నోట్లో వేస్కుంటే కరిగిపోతుంది. ఏది ఆ, ఆ నోరుతెరు." అంటూ ప్రేమగా తిన్పించింది.

భోజనాల వేళయ్యింది. సీతమ్మ ఇంకా కోపం గానే ఉంది."మీరంతా నిజం చెప్పే వరకు నేను ఒక్క మెతుకు కూడా ముట్టను.. ఇది మనిల్లు కాదు. కొత్తింటికి వచ్చామంటే పాతిల్లేమైనట్టు? నాకు తెలియాలి., తెలియాలి!" అంది పంతంపట్టినట్టు సీతయ్య లాగా.

" అమ్మా, ఈ ఇంట్లో నీకేం నచ్చలేదో చెప్పు.మన పాతింటికంటే వసతి గా ఉందా లేదా? అది చూడు ముందు.అనవసరంగా ఆందోళన పడుతున్నావ్!" అన్నాడు పవన్ నచ్చచెప్తూ.

"అమ్మా, అన్నం చల్ల గా అయిపోతోందే. అందరం ఆకలితో కూచున్నాం. ముందు భోజనాలు కానిస్తే అన్నీ వివరం గా మాట్లాడుకుందాం. నా తల్లి కదా. అన్నం తిను" అనునయంగా చెప్పాడు విక్రమ్.

"నా కోసం మీరంతా కడుపు మాడ్చుకోవడం దేనికి? చెప్పానుగా నాకు ఆకలి లేదని. మీరెళ్లి తినండి." అంది విసుగ్గా సీతమ్మ.

చిన్న కోడలు గీత అత్త గారి దగ్గరకెళ్లి " మీ కాలు బాగయ్యి, క్షేమంగా వస్తే చిలుకూరు వస్తామని అంతా మొక్కుకున్నాము. సాయంత్రం అంతా కలిసి గుడికి వెళ్ళి మొక్కు చెల్లించు కుందామా అత్తయ్యా?" అడిగింది ఆమె చేయి పట్టుకొని.సరదా పడిపోయింది ఆమె మాటలకి.

" నిజం గానా? అసలు నేను లేచి ఇలా తిరగ గలుగుతానని కల్లో కూడా అనుకోలేదే గీతా! అంతా వెంకటేశ్వరుల వారి దయ. దేవి, రాజీ ఎంత సేవ చేశారని?వెర్రి కన్న నా కోసం ఎంత డబ్బు ఖర్చు పెట్టాడో, ముసల్దాన్నని వదిలేయకుండా?మనం గుడికి వెళ్ళాల్సిందే. పదండి అన్నాలు తినేసి, కాసేపు నడుం వాల్చి బైలు దేరుదాం." అంటూ లోపలికి నడిచింది.

అంతా ప్రశంసాపూర్వకంగా గీత వైపు చూశారు.

అంతా సాయంత్రం గుడికి బైలు దేరుతుంటే హఠాత్తుగా సీతమ్మకి స్ఫురణకి వచ్చింది.గేటు తీస్తూ "అవున్రా!మన గేటు ఇలా ఉండదు. మనిల్లు ఏమైందో ఇప్పటికైనా చెప్పకపోతే నేనెవరితో మాట్లాడను, ఎక్కడికీ రాను" అని భీష్మించుకొని ఇంట్లోకి వచ్చి ముఖం మాడ్చుకొని కూచుంది.

.ఇంక తప్పదని కొడుకులు ఆమె పక్కన చేరి " అమ్మా, మన ఇల్లు బాగా పాతబడిపోయిందే. వర్షం మొస్తే ఇల్లంతా ఒకటే కారడం. బాత్రూమ్ శ్లాబ్ అయితే నానిపోయి ఒక పక్కకి ఒరిగిపోయింది. ఇంటి గోడలు కూడా బీటలు వారిపోయాయి. అంతే కాదు ఇదివరకు లేదు గాని ఈ మధ్య ఎండాకాలం వస్తే నీళ్ళకి ఎద్దడి వచ్చేసింది మన ఏరియా లో. వేడి తట్టుకోలేక ఏ. సి పెట్టిద్దామంటే గోడలు మెత్తబడిపోయి అస్సలు అనువుగా లేవు తెల్సా అమ్మా? అనిల్ బ్యాంక్ క్వార్టర్స్ కి వెళ్దామన్నాడు కానీ మనందరికీ సరిపోదు. వేరు కాపురాలు పెట్టి నిన్ను బాధ పెట్టడం మాకిష్టం లేదు." అంటూ ఆగాడు విక్రమ్.

అనిల్ అందుకుంటూ "అందరం కలిసి ఉండాలంటే పెద్దిల్లు కావాలి. అద్దె ఇంటి కోసం వెతికినా లాభం లేకపోయింది. మాకు మాత్రం మనిల్లంటే ప్రేమ లేదా ఏంటి? కానీ ఎంత కాలం ఇబ్బందులు పడతాం? అవసరమేంటి అయినా?"అన్నాడు తల్లి కాలి మీద చేయి వేసి నిమురుతూ.

"అందుకే అన్ని ఆధునిక వసతులతో ఈ రెండంతస్తుల బిల్డింగ్ అమ్మకానికొస్తేధర కూడా అందుబాటు లోఉండేసరికి ఆ ఇల్లమ్మేసి ఇది కొన్నాం. కొత్తిల్లే ఇది, ఓనర్స్ కి వేరే దేశం లో ఉద్యోగం రావడంతో హడావిడి గా అమ్మకం పెట్టారు. మనకి తక్కువకి వచ్చినట్టే, మంచి సెంటర్ కూడా."అప్పచెప్పినట్టు గబగబా చెప్పేశాడు విక్రమ్.

మౌనం గా వింటున్న సీతమ్మ కళ్ల నించి ధారా పాతంగా కన్నీరు....! " మీ నాన్నగారేం చెప్పారో గుర్తు లేదురా మీకు? మీ అమ్మ బతికినంత కాలం ఈ ఇంటిని అమ్మకండిరా అని చెప్పారా లేదా? రేపు నేనూ పాతబడిపోయి ఇంకా ముసలిదాన్నయిపోతే నన్నూ బైట పారేయండి రా పీడా పోతుంది" అని వెక్కిళ్లు పెట్టసాగింది.

"ఎన్ని పండగలు,పబ్బాలు,శుభకార్యాలు జరిగాయిరా ఆ ఇంట్లో? ఒక్కసారి వంద విస్తళ్ళు లేచేంత పెద్ద నడవా.నలభై రెండేళ్ల క్రితం ఆ ఇంటికి కొత్త కోడలిగా మెట్టాను. గుమ్మం దగ్గర ఆడపడుచులు మా పేర్లు చెప్పించి, మేలమాడి హారతి పట్టారు.అది ఎంత అపురూపమైన జ్ఞాపకమో మీకెలా తెలుస్తుందిరా? పెద్ద ఉయ్యాలబల్ల మీద మిమ్మల్ని కూచోబెట్టి కథలు చెప్తూ గోరుముద్దలు తినిపించేదాన్ని. సాయంత్రాలు మన దొడ్లో పూచిన జాజి పూలు అక్కడ కూచోనే మాల కట్టుకునేదాన్ని. కొంచెం పెద్దయ్యాక దాని మీదే మీరు హోమ్ వర్కులు చేసుకునే వారు. శుభ కార్యాలప్పుడు పది గడపలకీ పసుపు రాసి కుంకం బొట్లు పెట్టి అలంకరించేదాన్ని. ఆ ఇంట్లో ఎన్నెన్ని జ్ఞాపకాలు నా జీవితం తో ముడివడి ఉన్నాయో మీకేం తెల్సురా?నన్ను చాలా బాధ పెట్టారు మీ అంతా కలిసి." అంది నిట్టూరుస్తూ.

★★★★★ ★★★★★ ★★★★★ ★★★★★★ ★★★★ ★★★★★★★★ ★★★★ ★★★★★

కొన్ని రోజులు గడిచాయి. సీతమ్మ ఎవరితోనూ సరిగ్గా మాట్లాడ్డం లేదు. ఒంటరిగా కూచుని ఏదో ఆలోచిస్తూ ఉంటుంది...ఎంత పెద్ద ఇల్లు?ఎంత పెద్ద కుటుంబం?పొద్దున్న ఐదింటికి పొయ్యి వెలిగిస్తే రాత్రి పది వరకు వండుతూనే ఉండేవాళ్లు తాను,అత్తగారు,పనిమనుషులునూ!ఎప్పుడూ పదిమంది బంధువులతో నిండుగా ఉండే ఇల్లు.పురుళ్లూ,బారసాలలు,అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు, పుట్టినరోజులు, ఉపనయనాలు,పెళ్ళిళ్ళు, వాళ్ళ పిల్లల పుట్టుకలూ... ఎన్ని మధురమైన జ్ఞాపకాలు ఆ ఇంట్లో?

చలికాలం లో తమ ఇంటి వరండాలో నులివెచ్చని సూర్యరశ్మి గుర్తొచ్చేది. ఇంత మంచి వాతావరణం ఎక్కడ దొరుకుతుందోయ్ అంటూ అక్కడ కుర్చీ వేసుకొని తనందించే కాఫీ తాగుతూ పేపర్ లో వార్తలు వినిపించే భర్త గుర్తొచ్చి.... ఇక్కడ ఎండ అనేదే కనపడదు కదా అని కుమిలిపోయేది. ఆమె పాత స్మృతుల నించి బైట పడలేక పోతోంది. ఒకటా, రెండా? ఆ ఇంట్లో అణువణువుతో నలభయి రెండేళ్ల అనుబంధం పెనవేసుకుంది. పెరట్లో కొబ్బరి, జామ,కర్వేపాకు, సపోటా,ఉసిరి తో పాటు పారిజాతం, మందార, జాజి,నందివర్ధనం, కనకాంబరం మొక్కలు కూడా నాటింది. తన పిల్లల్లాగే వాటిని ప్రేమగా పెంచుకుంది. ఎలా మర్చిపోగలదు ఇవన్నీ?మనోవ్యాధి పట్టుకుందామెని. డాక్టరికి చూపిస్తే " ఈమెకి ఏ జబ్బూ లేదు... మానసికవేదన తప్ప. కారణమేంటో మీకే తెలియాలి." అనగానే విక్రమ్, అనిల్ జరిగిందంతా చెప్పారు. "మీ అమ్మగార్ని ఆ ఇంటికి తీసుకు వెళ్తే ఆమె ఆరోగ్యం బాగుపడవచ్చు. అంతకంటే ఏమీ చేయలేం."అని సలహా ఇచ్చాడు డాక్టర్. తల్లి తమని ఎంత అల్లారుముద్దుగా పెంచిందో తలచుకొని, అనవసరంగా ఇల్లు అమ్మేసి అమ్మని కలత పెట్టాం, అని విక్రమ్ ,అనిల్ బాధపడ్డారు . తల్లిలా ప్రేమించే అత్తగారి పరిస్థితి చూసి కోడళ్ళు కూడా కూడా చలించిపోయారు.

డాక్టర్ సలహా ప్రకారం తమ ఇల్లు కొనుక్కున్న వాళ్ళని కలిసి సంప్రదింపులు జరిపారు.ఇల్లు పడగొట్టి ఫ్లాట్స్ కట్టే యోచన లో ఉన్నారు వాళ్ళు.కార్పొరేషన్ నించి ప్లాన్ అప్రూవల్ కి టైమ్ పట్టేలా ఉండటం తోప్రస్తుతం ఇల్లు ఖాళీ గానే ఉంది. వీళ్ళ అదృష్టం కొద్దీ ఇంకా పడగొట్టలేదు. సీతమ్మ పరిస్థితి విని వాళ్ళు సహృదయంతో కొన్నాళ్ళపాటు ఇల్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు.

గబగబా పాత ఇంటిని శుభ్రం చేయించి రంగులు వేయించారు.అంతా కలిసి మళ్ళా పాతింటికి వెళ్లడానికి సన్నాహాలు మొదలెట్టారు. కానీ కొత్త ఇంటికి అలవాటుపడ్డ పిల్లలు మాత్రం అక్కడికి రావడానికి ససేమిరా అన్నారు. దాంతో అనిల్,గీత నలుగురు పిల్లలతో కొత్తింట్లో ఉండేలా, విక్రమ్,రాణి తల్లితో పాతింటికి వెళ్ళేలా నిర్ణయించుకున్నారు.సీతమ్మకి ఇంత పెద్ద ఇల్లూ ఎందుకో ఖాళీ ఖాళీగా అన్పించింది. పగుళ్లు బారిన గచ్చులతో, పెచ్చులూడిన గోడలతో,బొందులు జారిపోతున్న కిటికీలతో ,శ్లాబ్ లోంచి ఇనుపచువ్వలు కన్పిస్తూ కళావిహీనం గా ఉంది ఇల్లు. వీళ్ళు వెళ్ళిన వారానికి ఒక రాత్రి కరెంట్ పోయింది. కాలనీ అంతా ఉంది కానీ వీళ్ళ ఇంటికేలేదు. విక్రమ్ ఫ్యూజ్ వేస్తే కాసేపటికి మళ్ళీ పోయింది. మరునాడు గీజర్ ,ఫ్రిజ్ కూడా మొరాయించాయి.ఎలక్ట్రీషియన్ చూసి తాత్కాలికంగా ఏదో రిపేర్ చేసి వైర్లు బాగా పాతబడిపోయినందు వల్ల ఇంటి మొత్తానికీ కొత్త వైరింగ్ చేయించాల్సిందేనని స్పష్టం గా చెప్పేశాడు.

ఇలా కొన్నాళ్లు గడిచాయి ఎలాగో! ఆరోజు సీతమ్మని కలవడానికి ఆమె చెల్లెలు శారద వచ్చింది. స్టేషన్ కి వచ్చిన అనిల్ ముందు కొత్తింటికి తీసుకు వెళ్ళి జరిగిందంతా వివరించి అన్నావదిన అమ్మతో కలిసి పాతింట్లో ఉంటున్నారన గానే ఆశ్చర్యపడుతూ ఇక్కడికి వచ్చింది. ఇద్దరూ కలుసుకొని మూడేళ్లు కావడం తో బోల్డు సంగతులు ముచ్చటించుకున్నారు.

శారద ప్రేమగానే అక్కని మందలించింది. “ఏంటే సీతా , ఇంత పాతబడ్డ ఇంట్లో ఉండడమేంటే?” అని.

“అదేంటే, అంత మాట అనేశావు . ఇది నా ఇల్లే. ఇక్కడే కదా నా వైవాహిక జీవితం మొదలయ్యి పరిపూర్ణమయ్యింది.” కసిరింది చెల్లెల్ని.

‘“చాల్లే ఊరుకో సీతా! ఈ పాతింట్లో ఏం మూలుగుతోందే? అమ్మేసి చక్కని ఇంట్లో హాయిగా ఉంటున్న వాళ్ళని మళ్ళీ ఇక్కడికి తెచ్చి పడేశావు చాదస్తమా? మూర్ఖత్వమా? ఎంతకని రిపేర్ చేయిస్తారు చెప్పు వాళ్లయినా?ఒక్క మాట చెప్పు. ఆస్ట్రేలియా లో రెండేళ్ల పాటు అంత సౌకర్యవంతమైన జీవితాన్ని హాయిగా అనుభవించి వచ్చిన దానివి ఇక్కడకి వచ్చి ఈ పాతింటి కోసం ఎందుకే అంత పాకులాడుతున్నావ్? ఏమన్నా బాగుందా అసలు? నువ్వు ఆస్ట్రేలియా లో ఉన్నప్పుడు ఈ ఇల్లు నీతో ఉందా చెప్పు? అయినా అక్కడ నువ్వు మనశ్శాంతి గానే గడిపావు కదా? మరి ఇక్కడకొచ్చి ఎందుకే అందర్నీ ఇబ్బంది పెడుతున్నావ్, నువ్వూ ఇబ్బంది పడుతున్నావ్? ఒసే ఒక్క మాట చెప్పనా నా కంటే పెద్దదానివి, తప్పుగా అనుకోకు. పోయేటప్పుడు ఏం కట్టుకుపోతామే?.వొట్టి చేతుల్తో పోవాల్సిందేగా ఎవరిమైనా! అలాటిది ఈ ప్రాణం లేని ఇంటి కోసమెందుకే నీకంత వ్యామోహం? పోయేటప్పుడు ఇంటిని కూడా తీసుకుపోతావేంటే పిచ్చిదానా?”నవ్వింది శారద. “అందరూ బతికిన నాల్రోజులూ పిల్లాపాపలతోఉన్నంతలో సుఖంగా, సౌకర్యవంతంగా బతకాలనుకుంటారు. నీ పిల్లలు మంచివాళ్లు కాబట్టి నీ ఆటలు సాగుతున్నాయ్. పెద్దరికానికి గౌరవమిచ్చి , నిన్ను సంతోషపెట్టడానికి పాపం వాళ్లెంత బాధ పడుతున్నారో చూడు. ముసలి తల్లిదండ్రుల్ని భారం గా భావించి వృద్ధాశ్రమాల పాల పడేసే కొడుకులే ఎక్కువ శాతం ఈ రోజుల్లో. మంచి ఉద్యోగాల్లో ఉన్న నీ పిల్లలు తలుచుకుంటే ఎవరి మానాన వాళ్ళు చక్కని బంగ్లాల్లో ఉండగలరు. కానీ అలా వెళ్లకుండా నీ మీద ప్రేమతో నీ ఇష్టాన్ని గౌరవిస్తూ నీకు నచ్చినట్టు ఈ పాతింటికే వచ్చేశారు. నీకు నీ పిల్లల కంటే ఇల్లే ముఖ్యమని అర్ధమౌతోంది.” అంది గంభీరంగా శారద.

“అదేంటే అంత మాట అనేశావ్? నా పిల్లల చిన్నప్పటి జ్ఞాపకాల కోసమేగా ఈ ఇల్లు వదులుకోలేకపోతున్నది?” అయోమయంగా అడిగింది సీతమ్మ.

"ఎందుకే అర్ధం లేని మాటలు? సంతోషాన్నివ్వని జ్ఞాపకాలు? గతం లో చాలా ఆనందాన్ని అనుభవించావు ఈ ఇంట్లో. కానీ వర్తమానం, భవిష్యత్ పిల్లలదే, దాన్ని హరించే హక్కు నీకు లేదు. ఈ పాత కొంప లో వాళ్ళకేం మధుర స్మృతులిస్తావో చెప్పు.తలా ఒక చోట... ఎందుకొచ్చిన తంటా? బుర్రపెట్టి సవ్యం గా ఆలోచించు." హితబోధ చేసి వెళ్లింది చెల్లెలు.

సీతమ్మ ఇంట్లో జరుగుతున్నవన్నీ గమనిస్తోంది. రాజీవ్, దేవి రోజు ఫోన్ చేసి పలకరిస్తూ ఉంటారు ఆస్ట్రేలియా నించి. అనిల్,గీత రెండ్రోజులకోసారి వస్తూ ఉంటారు. సీతమ్మకిష్టమైనవేమైనా తెస్తూ ఉంటారు.ఇంక విక్రమ్,రాణి చిన్నపిల్లలా చూస్కుంటూ ఉంటారు ఆమెని.మనవలెప్పుడైనా వస్తారు. వాళ్ళు కొత్త తరం పిల్లలు. సౌకర్యవంతమైన జీవన విధానానికి అలవాటు పడినవాళ్ళు. నచ్చే వ్యక్తులున్నా నచ్చని చోటుకి నచ్చ చెప్పుకొని రాలేని తరం వాళ్ళది.

ఒకరోజు సీతమ్మ డిక్లేర్ చేసెసింది... "విక్కీ, మనం కొత్తింటికి వెళ్లిపోదాంరా ,సామాన్లన్నీ సర్దేయండి" అని. ఆశ్చర్య పోయారు రాణి, విక్రమ్. "అవును రాణీ! ఇల్లంటే గోడలు,గడపలు, ప్రాణం లేని, ప్రయోజనం లేని జ్ఞాపకాలు కాదు. నా కొడుకులు,కోడళ్ళు, మనవలు తమకి నచ్చిన చోట హాయిగా నవ్వుతూ, తుళ్లుతూ, కళకల్లాడుతూ ఉండేదే అసలైన ఇల్లని కాస్త ఆలస్యంగా తెలుసుకున్నా. నన్ను సంతోష పెట్టడం కోసం మీరంతా తలా ఒక చోట ఉంటూ ఇబ్బందులు పడ్డారు ఇన్నాళ్లూ. ఇంక జరిగింది చాలు. నాకిప్పుడు బాగానే ఉంది. పదండి ఇవాళే మనింటికి వెళ్దాం".అంటూకొత్తింటికిప్రయాణంకట్టించింది.

ఇప్పుడు ఆమె పాత ఇంటిని గుర్తు చేసుకుంటూ ఉంటుంది కానీ మునుపటిలా దుఃఖపడ్డం లేదు.. సీతమ్మ తన కొత్త లోగిలిలో పాత జ్ఞాపకాల్ని పదిలపరచుకుంది.

# అహం బ్రహ్మాస్మి దూర్వాసుల విజయభాస్కర్

ఉదయం ఎనిమిదౌతోంది, లేచి కాఫీ తాగుతూ పేపర్ తిరగేస్తున్నాను. బయట భారీ వర్షం, రాత్రి నుంచీ కురుస్తూనే ఉంది. తెల్లవారుజామునేప్పుడో కరెంటు పోయినట్టుంది, ఇంకా రాలేదు. మా ఆవిడ వంటింట్లో ఏదో పనిలో బిజీ గా ఉంది. పేపర్ లో వార్తలు ఒకటీ ఒకటీ చదువుతున్నాను. కానీ మనసు వేరే ఎక్కడో ఉంది. జిల్లా ఎడిషన్ తీసేసరికి, అమృతం గురించే వార్త. "స్వామీ అమృతానందకి మళ్ళీ అస్వస్థత" అని. అమృతాన్ని ఇంతకు ముందు ఎన్నో సార్లు కలిసాను, కానీ నిన్న కలిసి మాట్లాడింది చాలా వేరుగా ఉంది. వాడు ఎలా తీసుకున్నాడో, మా మధ్య స్నేహం ఎలా ఉండబోతోందో. "నిజం" చేదు మాత్ర లాంటిది కదా.

అమృతం అసలు పేరు అమృతరావ్, నాకు మొదటి నుంచీ అమృతం అనే అలవాటు. వాడు నన్ను వాసూ అని పిలుస్తాడు. మా పరిచయం పాతికేళ్ళ నాటిది. మరీ ప్రాణ మిత్రులమేమీ కాదు కానీ, ఓ తెలియని అనుబంధం. ఇద్దరికీ మొదటి ఉద్యోగం ఒక్క చోటే, సబ్బవరం

దగ్గర ఓ చిన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో. నా సబ్జెక్టు తెలుగు, వాడిదేమో సైన్సు. చిన్న స్కూలు, మాట కాస్తో కూస్తో వినే విద్యార్థుల తరం అది, పాఠం చెప్పడం మినహా వేరే వ్యాపకం ఏదీ ఉండేది కాదు. సాయంత్రం అయితే వూరు బయట చెరువు దగ్గర కూర్చునే వాళ్ళం, ఏవో మాటలు. నేను స్వతగాహా అందరితో కలిసేవాణ్ణి కాదు, కానీ అమృతం తో ఎలానో మరి ఒక స్నేహం కుదిరింది. వాడికీ నాకూ అన్నీ వ్యత్యాసాలే, వాడు ఆజానబాహుడు. స్ఫురద్రూపి. బాగా కనిపించాలి అనే తపన కూడా ఎక్కువే. నేను వాటికి పెద్ద ప్రాముఖ్యత ఇచ్చేవాణ్ణి కాదు. ఎప్పుడూ బ్యాగ్ లో శరత్ బాబు పుస్తకాలో, టాగోర్ కవిత్వమో పెట్టుకుని తిరిగేవాణ్ణి. అమృతం మంచి మాటకారి, వాడితో కూర్చుంటే టైం అస్సలు తెలిసేది కాదు. ఏ విషయం మీదైనా ఇట్టే మాట్లాడగలడు, మనకి తెలీకుండానే బోల్తా కొట్టించనూగలడు. అదీ ఒక కళేనేమో. నాతో అభిమానంగా ఉండేవాడు. ఊరంతా వేరు నువ్వు వేరు వాసూ అనేవాడు. స్కూలు, పుస్తకాలు, అమృతం, ఇలా మూడేళ్ళు గడిచాయి. జీవితంలో పెద్ద మార్పేమీ లేదు. నావరకూ నేను మార్పుని ఆతృతగా కోరుకున్నదీ లేదు. కదులుతున్న రైలు బండిలో మనం వేగంగా నడిస్తే, గమ్యం చేరువవుతుందా.. కాల ప్రయాణమూ అంతే అనిపించేది నాకు, కానీ వాడి సంగతి అలా కాదు. ఓ రోజు చెరువు గట్టున కూర్చుంటే,

"ఏంట్రా ఈ జీవితం. మరీ బోర్ గా ఉంది. ఏదైనా చెయ్యాలి, సాధించాలి వాసూ. ఏంటీ గానుగెద్దు జీవితం.." అన్నాడు అమృతం.

"మార్పు మెల్లగా వస్తుంది రా, సహనం ఉండాలి దేనికైనా,. " అన్నాను.

"ఏమో రా, నేను ఏదైనా వేరేగా చేద్దామనుకుంటున్నాను. ఈ బడిపంతులు ఉద్యోగం ఇంక నా వల్ల కాదు. నాకు పేరు, పలుకుబడి కావాలి, సమాజం నా వెనుక తిరగాలి, దానికి డబ్బు కావాలి. ఇలా ఏ గుర్తింపు లేని ఒక అనామక జీవితం నాకు వద్దు. నా దగ్గర పోగొట్టుకోడానికి మాత్రం ఏముంది రా, "నేను" తప్ప. ఒకటి రెండు రోజుల్లో ఏదో ఒక నిర్ణయానికి వచ్చేస్తాను." అని ముగించాడు.

నేను వాడిని కన్విన్స్ చేసే ప్రయత్నమూ ఎందుకనో చెయ్యలేదు, వాడు నా అనుమతి అడిగాడనీ అనుకోను. జీవితం అంటే పరుగుపందెం అనుకునేవాడికి, దాని అసలు స్వరూపం అన్ని మైలురాళ్ళు దాటాకే అవగతం అవుతుంది. వాడు రాజకీయల్లోకి వెళ్తాడేమో అనిపించింది. విలువలకి తిలోదకాలిస్తే వాడు చెప్పినవి వేగంగా దొరికేది అక్కడే. కానీ వాడు నా అంచనాలని తారుమారు చేసాడు.

సరిగ్గా మూడోనాడు, సాయంత్రం కనిపించాడు అమృతం. స్కూలు బయట, హడావిడిగా..

"ఇంక సెలవు వాసూ, నేను యాత్రలకు వెళ్తున్నాను. మళ్ళీ ఎప్పుడో కలుద్దాం, కలవాలని రాసిపెట్టుంటే." అని అంటూ, వీడ్కోలు చెప్పేసాడు. నా మాట వినే టైం కూడా వాడికి ఆ రోజు ఉన్నట్టు లేదు. ఏంటో, వీడూ, వీడి వాలకం అనుకున్నా. అమృతానికి నా అన్నవాళ్ళు ఎవరూ లేరు, చిన్నప్పుడే తల్లిదండ్రులని పోగొట్టుకున్నాడు. పెంచి పెద్ద చేసిన బాబాయ్ కూడా ఆ మధ్యే కాలం చేసాడు. బాగా బ్రతికిన కుటుంబమే, కానీ బంధువులే రాబందులయ్యేసరికి, చివరకి. ఆస్థిగా చదివిన చదువు ఒక్కటే మిగిలింది.

వాడు వెతుకుతున్నదేదో, ఉందో లేదో కూడా నాకు తెలీదు, కానీ వాడికి అది దొరకాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను. కాల ప్రవాహంలో, నేను కొరుకున్నట్టే జరిగింది, కానీ, దారి పొడవునా వాడినే వాడు పోగొట్టుకున్నాడు.

అది జరిగిన ఏడాదికి అనుకుంటా, ఓ రోజు స్టాఫ్ రూమ్ ముందు ప్రత్యక్షం అయ్యాడు. నన్నే బయటకి రమ్మని సైగ చేసాడు. పొడుగాటి గెడ్డం, జుట్టు, నుదుట మీద పెద్ద బొట్టు. నాకు తెలిసిన అమృతం లా లేదు. ఏమైంది రా నీకు అన్నాను.

"ఏముంది, దేశ పర్యటన చేసి వచ్చాను. కొత్త అవతారం ఇది." అన్నాడు. కొన్ని రోజులకే చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. పెందుర్తి దగ్గరలో, ఒక ఆశ్రమం మొదలు పెట్టాడు అమృతం. స్వామీ అమృతానందగా పేరు మార్చుకున్నాడు. కొంత మంది శిష్యుల్ని చేరదీసాడు. బడి పంతులు నుంచి ఈ "గురువు" అవతారం, వాడి వృత్తో, ప్రవృత్తో తెలీలేదు, కానీ వాడి గమ్యం ఏంటో నాకు గుర్తుంది.

రోజులు గడుస్తున్నాయి, నేనే ఒకరోజు అమృతం ఆశ్రమానికి వెళ్ళాను. జనం బానే ఉన్నారు. ప్రార్థనా స్థలం, చిన్న దేవాలయం, భక్తులు ఉండడానికి వసతి, అన్ని హంగులూ ఉన్నాయి. బయట పెద్ద కటవుట్, అమృతానందది, తెల్లని దుస్తుల్లో. అసలే అందగాడు, ఈ కొత్త అవతారంలో ఇంకా బావున్నాడు అనుకున్నాను. ఫోటో క్రింద "అహం బ్రహ్మాస్మి" అని తాటికాయంత అక్షరాలు. లోపలికి వెళ్ళి కలిసాను, తన రూంలోకి తీసుకెళ్ళాడు. ఎన్నో మాట్లాడుకున్నాం, బాగా పుస్తకాలు చదువుతున్నట్టు అర్థమయ్యింది. అలవాట్లు ఏమీ మారలేదు, మనిషీ అలానే ఉన్నాడు. నా విశేషాలు అడిగాడు, కాసేపు ఉండి బయలుదేరాను.

ఆ తర్వాత ఎప్పుడైనా వెళ్ళాను కానీ, నాకూ ఆట్టే వీలు చిక్కేది కాదు. వాళ్ళ నోటా, వీళ్ళ నోటా, స్వామీజీ సంగతులు తెలిసేవి. నవ్వుకునే వాణ్ణి. నా పెళ్ళికి పిలిచాను కానీ, వాడు రాలేదు. ఈ లోగా, పిల్లలూ, బాధ్యతలూ, నేనూ అమృతాన్ని కలవలేదు. ఒకటి రెండు బదిలీలు, ప్రమోషన్లు తరువాత, నాకు కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల లో పోస్టింగ్ వచ్చింది. దగ్గరగా ఉంటుందని, HB కాలనీలో మకాం పెట్టాను. ఓ రోజు పేపర్ లో అమృతం గురించి వార్త పడింది, ఆశ్రమాన్ని సీతమ్మధార కి మార్చాడని. ఆ ఆదివారం, కొత్త ఆశ్రమానికి వెళ్లి కలిసాను. మనిషి అలానే ఉన్నాడు, కొంచం వయసు తెలుస్తోంది అంతే. నన్ను చూసి చాలా సంతోషించాడు. ఆశ్రమం రిసార్ట్ లా ఉంది. యోగా సెంటర్, AC హాల్స్, స్విమ్మింగ్ పూల్స్, స్పా వగైరాలతో. ప్రతీ చోటా "అహం బ్రహ్మాస్మి" అని కేప్షన్. ఏంటి ఇదంతా, అంటే, తప్పదు రా, కస్టమర్స్ కి కావాల్సిందే మనం ఇవ్వాలి, అన్నాడు. ఆధ్యాత్మికత ఒక అంగడి సరుకు అయిపోయిందన్నమాట. తన గదిలో చాలా సేపే కూర్చున్నాం. సంపాదన బాగా పెరిగినట్టుంది. బంగారు, వెండి విగ్రహాలు, ప్రముఖులతో ఫోటోలు. ఎప్పుడైనా వస్తూ ఉండు వాసూ, నేను నీకు ఎప్పుడూ అమృతాన్నే అన్నాడు, ఆప్యాయంగా.

తెలివైన వాడు, మాటకారి, అనతి కాలంలోనే స్వామీజీగా మంచి పేరు వచ్చింది. ఓ రెండేళ్లలో అనుకుంటా, విశాఖపట్టణం లో ఏ కార్యక్రమం జరిగినా అమృతం ఉండాల్సిందే. రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, డాక్టర్లు, లాయర్లు, ఒక్కరేంటి అందరూ, అమృతం చుట్టూ తిరిగేవారు. స్పీచులు, టీవీ కార్యక్రమాలు, విదేశీ పర్యటనలు, పూర్తి స్థాయి స్వామీజీ గా స్థిరపడిపోయాడు అమృతం. అడపాదడపా విమర్శలూ వినిపిస్తూ ఉండేవి, ఆశ్రమం ముసుగులో చేస్తున్నది రాజకీయం, సెటిల్మెంట్లు అని, కానీ అమృతం ప్రభ పెరుగుతూనే ఉంది. సాధించాను అనే గర్వం వాడి నవ్వులో కనిపిస్తూనే ఉంది. మనిషిని ప్రక్క దారులు తొక్కించే వ్యసనాల్లో కీర్తి కూడా ఒకటి.

అప్పుడప్పుడు, వెళ్ళి పలకరిస్తూ ఉండేవాణ్ణి. ఒక్కోసారి భక్తులు ఎక్కువ మంది ఉంటే, ఓ వారగా కూర్చుని ఎదురు చూసే వాణ్ణి. వాళ్ళని పంపి, నన్ను లోపలికి తీసుకెళ్ళేవాడు. భక్తులతో అమృతం మాట్లాడే తీరు భలే విచిత్రంగా ఉండేది.

ఓ రోజు ఓ పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి వచ్చాడు. ఆయన బాధలేవో చెప్పుకున్నాడు. అతను కొన్న భూమేదో కేసులో చిక్కుకుందట. ఉన్న ఆస్తంతా కర్పూరంలా కరిగిపోతోందని వాపోయాడు. అమృతం కాసేపు ఆలోచించి మొదలుపెట్టాడు..

"నాయనా, నువ్వు సాక్షాత్ భగవత్ స్వరూపుడివి, ఇన్నాళ్ళూ నువ్వు అనుభవించిన సిరి సంపదలు, గత జన్మలో నువ్వు చేసిన పుణ్య ఫలాలు. వాటితో నీకున్న ఋణం తీరిపోయే సమయం వచ్చింది. జీవితాన్ని వర్తమానం లో బ్రతకడం నేర్చుకో, రేపు గురించి భయపడకు. అన్నీ సద్దుకుంటాయి. దైవ చింతన చెయ్యి, అంతా మంచే జరుగుతుంది. నీ ప్రత్యర్థుల తరపు లాయర్ వివరాలు ఇచ్చి వెళ్ళు, నా వల్ల అయ్యేది నేను చేస్తాను. ఒక్కటి గుర్తు పెట్టుకో, నీతో పాటూ నీ పాప పుణ్యాలు తప్ప మరేవే రావు. అహం బ్రహ్మాస్మి." అన్నాడు. ఆ వ్యాపారి ఏంతో కుదుట పడ్డాడు. అలాగే స్వామీ, మీ మాటే మాకు శిరోధార్యం అంటూ బయలు దేరాడు. ఇలా కొన్ని సార్లు నాకు అమృతం మార్కు జ్ఞానబోధ వినే అవకాశం కలిగేది. నాతో మాత్రం సరదాగానే మాట్లాడేవాడు. ఆధ్యాత్మిక రంగం లో ఉన్న పోటీ గురించి, సాధక బాధకాల గురించి

చెప్పేవాడు. ముఖ్యంగా రాజకీయ నాయకులతో వచ్చే తలనొప్పుల గురించి.

ఓ సారి నేను వెళ్ళే టైం కి ఒక పేరుపొందిన డాక్టర్ ఉన్నాడు. అమృతం మాట్లాడుతున్నాడు, "నువ్వు, అని నువ్వు అనుకుంటున్నది, నువ్వు కాదు. ఈ శరీరం నీది కాదు. గాలి తలగడా లో గాలి తీసేస్తే ఎలానో, నీ ఆత్మ ఆ పరమాత్మని చేరే సమయం వచ్చినప్పుడు, ఈ శరీరాన్ని విడిచిపెట్టేస్తుంది. నీ చేతుల మీదుగా ఏ పొరపాటు జరిగినా, ఆ మురికి నీ ఆత్మకు అంటదు. భయపడకు నాయనా, ఆ పదిమంది తనువు చాలించాలని రాసిపెట్టి ఉంది, దానికి కేవలం నువ్వు సాధనం అయ్యావ్. అంతే. ఆ బాధ్యత నీది కాదు. అంతా ఈశ్వరేఛ్ఛ. అహంబ్రహ్మాస్మి."

నన్ను చూసి కాస్త తొందరగా ముగించేసినట్టున్నాడు. ఆ వైద్యుడు అక్కడ నుంచీ ప్రసన్నంగా బయలుదేరాడు.

గదిలోకి వెళ్ళాక, చిన్నగా నవ్వుతున్న నన్ను చూసి అమృతం అన్నాడు. "వాసూ, నా వద్దకు వచ్చేవాళ్ళకి పరిష్కారాలు కాదురా కావాల్సింది. కాస్త ఊరట, ఓదార్పు. తప్పు నీదే అంటే, ఎవడైనా మళ్ళీ నా గడప తొక్కుతాడా.. వాళ్ళు నమ్ముతోంది నన్ను కాదు, వాళ్ళ నమ్మకాన్నే. ప్రస్తుతానికి అది నాతో ఉంది అంతే."

"ఇంతకీ నీది ద్వైతమా, అద్వైతమా, అహం బ్రహ్మాస్మి అంటావు, ఆత్మ పరమాత్మ అని వేరు చేసి సాగనంపుతావు..? " అని అడిగితే, "నాది విశిష్ట వైద్యం" అంటూ నవ్వాడు.

అంటే.. ?

"అంటే.. ఏముంది.. రోగి బట్టి.. రోగం బట్టి.. మందు రూపాన్ని మార్చి ఇవ్వడం. "

మొదటి నుంచీ వాడితో వాదించే అలవాటు నాకు లేదు. వాడి భావాలు వాడివి. ఎదుట వ్యక్తి బలహీనతను వ్యాపారంగా మార్చుకోవడం ఏ రంగంలో అయినా తప్పే.

ఏళ్ళు గడిచాయి, జీవితం సాగిపోతోంది. అమృతాన్ని చూసి చాలా రోజులు అయ్యింది, పేపర్లో మాత్రం ఎక్కడో దగ్గర దర్శనమిచ్చేవాడు. ఓ రోజు అమృతం శిష్యుడు ప్రభాకర్ ఫోన్ చేసాడు, వీలయితే ఒకసారి రమ్మని. వెళ్ళేటప్పటికి ఇది వరకూ ఉన్నంత జనం లేరు. అమృతం కూడా కాస్త దిగాలుగా కనిపించాడు. ఇద్దరం లోపల గదిలోకి వెళ్ళాక అమృతం చెప్పడం ఆరంభించాడు. "మొన్న జరిగిన ఉపఎన్నికలు నీకు తెలుసు కదా, అధికార పార్టీ అభ్యర్థి ఓడిపోయాడు. గెలిచిన వాడు, నా భక్తుడు. నా సలహాల వల్లే అతను గెలిచాడని, అధికార పార్టీ వాళ్ళు నా మీద కక్ష కట్టార్రా. వారం క్రింద ఇన్కం ట్యాక్స్ వాళ్ళ దాడి. నిన్నటికి నిన్న ఆశ్రమానికి అనుమతి లేదంటూ, కార్పొరేషన్ వాళ్ళ నోటీసు. చాలా టెన్షన్ లో ఉన్నాను వాసూ. ఇన్ని సంవత్సరాలు నేను కష్టపడి కట్టిన సౌధం బీటలు వారుతోంది. ఇంత కీర్తీ సంపాదించి, చివరకి కటకటాల పాలౌతానేమో అని భయంగా ఉంది. "

ఏమనాలో తెలీలేదు నాకు. "నీకు తెల్సిన వాళ్ళ ద్వారా రాజీకి ప్రయత్నించలేకపోయావా ?" అన్నా. "ఆ ప్రయత్నమూ చేసాను. ఎలెక్షన్ మొత్తం ఖర్చు నన్ను తిరిగి ఇమ్మంటున్నారు. "

మనిషి బాగా డీలా పడిపోయాడు. కాసేపు కూర్చుని, నేనూ బయలుదేరాను. గెలుపు ఒంటరిది అనుకున్నాను, కాదు, అది చాలా మందినే పోగుచేస్తుంది. కానీ గెలిచిన వాడు మాత్రం ఎప్పుడూ ఒంటరే, అది తర్వాత అర్థం అయ్యింది. వాడిక్కూడా.

సరిగ్గా అమృతాన్ని కలిసిన రెండు నెలలకి అనుకుంటా, ఓ రోజు ఆశ్రమం నుంచీ ఫోన్, అర్జెంటు గా రమ్మని. వెంటనే వెళ్లాను. ఆశ్రమం బాగా రద్దీ గా ఉంది. "స్వామీజీ దర్శనం ఆపవేయబడింది" అని నోటీసులు అంటించారు. వెళ్ళడమే ప్రభాకర్ ని కలిసాను, ఏమైంది

అని. అమృతానికి ఆరోగ్యం బాగోలేదంట, ఆశ్రమంలోనే ఒక గదిని ఆసుపత్రిగా మార్చేసారు. అక్కడికి తీసుకెళ్ళాడు. అమృతాన్ని చూసి షాక్ అయిపోయాను. మనిషి నీరసించిపోయి ఉన్నాడు. చేతులు మీదా, మొహం మీదా, ఏవో మచ్చలు. ఊపిరి తీసుకోడానికి అవస్థ పడుతున్నాడు. నన్ను చూసి లేవబోయాడు, వారించాను.

"చూడరా వాసూ, చివరికి ఎలా తయారయ్యానో నేను. కేసులకి ఇప్పటికే ఇరవై కోట్లు ఖర్చుపెట్టాను. కానీ ఏదీ తేలేలా లేదు. దానికంటే ఘోరం, ఈ మొహం చూడు. ఇదేదో అంతుపట్టని చర్మ వ్యాధి, డాక్టర్స్ కూడా ఏంటో చెప్పలేకపోతున్నారు. నా మొహాన్ని అద్దంలో చూసుకోవాలంటే నాకే భయమేస్తోంది రా. అందుకే బయటకి కూడా వెళ్ళడం లేదు. " అంటూ కన్నీళ్ళ పర్యంతం అయ్యాడు.

ఏం చెప్పగలను నేను అమృతానికి. అహం బ్రహ్మాస్మి అంటూ, ఎన్నో సమస్యలకి సులువుగా సమాధానాలు చెప్పే అమృతం, అదే సమస్య తనదాకా వస్తే, ఎందుకిలా అయిపోయాడు. మౌనంగానే ఉండిపోయాను. "ఏదైనా చెప్పరా వాసూ" అన్నాడు. ఒక్కోసారి మౌనం మాటలకంటే ఎక్కువ బాధ పెడుతుంది.

"ఏంచెప్పను రా, నీకు సలహా ఇచ్చేటంతటి పరిజ్ఞానం కానీ, తెలివితేటలు కానీ నాకు లేవు. ఏదో సాధించాలని, ఉన్న ఉద్యోగాన్ని ఒదిలి, ఆధ్యాత్మికతను ఒక వ్యాపారంగా మార్చి, ఎత్తుకు పై ఎత్తు వేస్తూ, ఎదుగుతూ, వ్యక్తిగా నువ్వు దిగజారుతుంటే, అందుకే ఏ మాటా ఇంతవరకూ అనలేకపోయాను. నువ్వు ఎన్నడూ నా సలహా కోరలేదు కూడా. "

"ఎన్నో పర్యటనలు చేసావ్, ప్రసంగాలు ఇచ్చావ్. నీ వద్దకొచ్చే వారికి వేదాంత సారాన్ని మామోలు మాటల్లో బోధించావ్. జీవిత సత్యాలన్నీ అవపోసన పట్టావ్. కానీ వాటిలో ఏ ఒక్కదాన్ని నీ జీవితం లో పాటించ లేకపోయావ్ రా అమృతం. నేర్చుకున్నదాని విలువ శూన్యం రా, ఆచరించనప్పుడు. నీతో రాదు అని తెల్సినా, సంపద కోసం అర్రులు చాచావు, కోట్లు కూడబెట్టావు. శాశ్వతం కాదు అని తెలిసినా, శరీరాన్నే ప్రేమించావ్. కీర్తి ప్రతిష్టలకోసం వెంపర్లాడావ్.. ఇప్పుడు పాతాళం లోకి పడటానికి సిద్దంగా ఉన్నావు. సమాజాన్ని నీకు నచ్చినట్టు ఆడిస్తూ, గెలుస్తున్నాననుకున్నావ్, కాని నువ్వు ఓడిపోయావు రా. నీతోనే. ఇప్పటికైనా కళ్ళు తెరువు, ఈ అబద్దాల్ని వదిలి, నిజాన్ని స్వీకరించు."

పాతికేళ్ళ స్నేహం లో నేను ఎన్నడూ ఇలా మాట్లాడింది లేదు. ఇప్పుడు కూడా మాట్లాడకుండా ఉండాల్సిందేమో, వాడున్న పరిస్థితికి. కానీ ఆపుకోలేకపోయాను. కళ్ళు మూసుకున్నాడు. మాట మాట్లాడలేదు. ఓ అరగంట అలానే కూర్చున్నాను, వాడి ప్రక్కనే, చెయ్యి గట్టిగా పట్టుకుని. తర్వాత వీడ్కోలు చెప్పి బయలుదేరాను. వాడూ ఆపే ప్రయత్నం చెయ్యలేదు.

వర్షం ఇంకా తగ్గలేదు.. ఆ మాటలన్నీ మళ్ళీ ఇప్పుడు గుర్తొచ్చాక, మనసంతా ఏదో తెలియని బాధ. ఈ క్షణం వాడికి కావాల్సింది నా ఓదార్పేమో, వాడికి మాత్రం ఎవరున్నారు. వర్షం కాస్త తగ్గాక, మళ్ళీ వెళ్దాం అనుకున్నాను. పేపర్ చూడాలని అనిపించలేదు, ఈ లోగా కరెంటు వచ్చింది. టీవీ ఆన్ చేసి న్యూస్ పెట్టాను. ఒక్క క్షణం నిశ్చేష్టుణ్ణి అయిపోయాను. నా కళ్ళని నేనే నమ్మలేదు. "స్వామీ అమృతానంద అస్తమయం. శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ, ఈ రోజు తెల్లవారుఝామున నాలుగు గంటలకి కన్నుమూసారు. ఆయన భక్తులకి ఇచ్చిన చివరి సందేశం ఇలా ఉంది. "

"భక్తులారా, నా ప్రయాణం ముగిసింది. ఈ శరీరాన్ని వదిలి నేను వెళ్ళిపోయినా, మీ హృదయాల్లో చిరస్థాయిగా నిలచే ఉంటాను. మీ బాధలన్నీ తీరుస్తూనే ఉంటాను. నా భౌతిక దేహం కోసం ప్రాకులాడకండి, దాన్ని చూడను కూడా వద్దు. నా సమాధి బయట ఒక అఖండ జ్యోతిగా నేను వెలుగుతూనే ఉంటాను. దానిలోనే నన్ను చూసుకోండి. అహం బ్రహ్మాస్మి. "

స్థాణువు అయిపోయాను. వెంటనే ప్రభాకర్ కి ఫోన్ చేసాను.

"శ్రీనివాస్ గారూ, ఘోరం జరిగిపోయిందండీ. మీరు వెళ్ళాక, మళ్ళీ స్వామీజీకి సీరియస్ అయ్యింది. ఆక్సిజెన్ నిరంతరాయంగా పెట్టాలన్నారు డాక్టర్లు. గదిలో తోడుగా నేను ఒక్కడినే ఉన్నాను. భక్తులకి సందేశం రాయాలి, ఓ కాగితం కలం కావాలన్నారు.. తెచ్చి ఇచ్చాను. "ఒంటరిగా ఉండాలి, నువ్వు బయట ఉండు", అన్నారు, ఏదైనా అవసరం అయితే బెల్ కొట్టండి, అని చెప్పి నేను బయట కూర్చున్నాను. ఓ అరగంటలో మళ్ళీ గదిలోకి వెళ్ళేటప్పటికి అంతా జరిగిపోయిందండీ. ఆక్సిజెన్ మాస్కు పడిపోయి ఉంది. కాగితం మీద, మీడియా లో చూపిస్తున్న ఆ నాలుగు మాటలూ మిగిలాయండి.. ఘోరం జరిగిపోయిందండీ. తప్పు నాదే అండి.."

నాకు ఇంకేమీ వినిపించడం లేదు.

అమృతం అబద్ధం లోనే బ్రతికాడు. ఆ అబద్ధాన్ని నిజం చెయ్యడానికి వెళ్ళిపోయాడు. దూరంగా. కళ్ళల్లో నీళ్ళు ఆగడం లేదు. వర్షం తగ్గినట్టుంది.

కొందరి విషయం లో జీవితమే మాట్లాడుతుంది, మరికొందరి జీవితాల్లో మాటలే మిగిలిపోతాయి.

***

**కథ వెనుక కథ**

రామకృష్ణ పరమహంస వద్దకు, ఒక తల్లి తన పదేళ్ళ కొడుకుని తీసుకుని వచ్చి, వాడి చేత స్వీట్స్ తినడం మాన్పించమని వేడుకుందిట. రామకృష్ణ పరమహంస, రెండు వారాల తరువాత ఆమెని రమ్మని, అప్పుడు ఆ బాలుడుకి అర్థమయ్యే రీతిలో స్వీట్స్ తినడం మానమని ఉపదేశించారంట. ఆ మాటలు చెప్పడానికి రెండు వారాలు ఎందుకు వేచి చూసారని, ఆ తల్లి పరమహంస ని అడిగితే, ఆయన, ''అమ్మా, నేనూ తీపిపదార్థాలు ఎక్కువే తినేవాణ్ణి, నేను చేస్తున్నదే మానమని ఆ బిడ్డకి ఎలా చెప్పను. అందుకే ఈ రెండు వారాల్లో ముందు నన్ను నేను సరిచేసుకున్నాను, ఇప్పుడు చెప్పే అర్హత నాకు లభించింది'' అన్నారంట. అదీ మన సంస్కృతిలో గురువుల దృక్పథం. ఆధ్యాత్మికత ఒక వినిమయ వస్తువు అయిపోయిన నేటి తరంలో, ఎక్కడో కానీ మనకి ఇలాంటి గురువులు తారసపడరు. చెప్పింది ఆచరించడం మాట అటుంచండి, కనీసం సగటు మనిషి పాటిస్తున్న విలువలు కూడా కొందరు గురువులలో లోపిస్తున్నాయి. ఏ మనిషి జీవితంలో అయినా, నేర్చుకున్నది అర్థం చేసుకోవడం, దాన్ని అనుసరించే ప్రయత్నం చెయ్యడం చాలా ముఖ్యమైన అంశం. అది లేని నాడు సంపాదించుకున్న జ్ఞానం విలువ శూన్యం. ఈ కథలో అమృతం పాత్ర ద్వారా నేను చెప్పాలనుకున్నది అదే. ఎన్నో మాటలు చెప్పే అమృతం తనదాకా వస్తే ఎలా ప్రవర్తించాడో మనం చూసాం. బోధించేది పాటించనప్పుడు వచ్చే పర్యావసానాల్ని కథ రూపం లో చెప్పే ప్రయత్నం చేసాను. నిజానికి పేపర్ చూస్తుంటే, అమృతానికి మించిన ఆధ్యాత్మిక గురువులు కనిపిస్తున్నారు. కనిపెంచిన తల్లిదండ్రులు, ఓనమాలు దిద్దించిన గురువులు, చుట్టూ ఉన్న సమాజంలో విలువలతో మసలుతున్న ఓ నలుగురు.. వీళ్ళు చాలదూ నిజంగా బ్రతుకు పాఠాలు నేర్చుకోడానికి ? ఆధ్యాత్మికత అనేది మనలోంచి రావాలి, దాన్ని అంగడి సరుకులా కొనుక్కునే ప్రయత్నం ఎప్పటికీ వృధానే. రచయిత

# ఆనందభవన్

డా. చిత్తర్వు మధు

అసలు రాత్రి పదిగంటలకి బయలుదేరాల్సిన రైలు ఎందుకనో గంట లేటయింది! సికింద్రాబాద్ ప్లాట్‌ఫారం వదిలేసరికి పదకొండు అవుతుంది.

ఎక్స్‌ప్రెస్ తెల్లారి ఏడుగంటలకల్లా భీమవరం వెళ్ళిపోతుంది.

ఏ.సి. టూటయర్. నలుగురం స్నేహితులం. బాగా ఎంజాయ్ చేయాలనే 'కసి'తో రైలెక్కాశాం. అంటే.... ఫ్లాస్కులో ఐస్, టిఫిన్ కారియర్‌లో పెళ్ళాలు సర్దిఇచ్చిన స్నాక్స్. పేకముక్కలు. రెండు టీచర్స్ బాటిల్స్.

అవి కనపడకుండా హేండ్ బ్యాగ్‌లలో వున్నాయి.

ఎవరూ చూడకుండా, ఎవరికీ తెలియకుండా వాటర్‌బాటిల్స్‌లో ఐస్‌వేసి రెండు పెగ్గులు వేసి వాటర్‌తాగినట్లు తాగేయడమే!

ఆ తర్వాత ఇక రెండు సీట్లమధ్య పెట్టెలు ఎత్తుగాపెట్టి ఓ టవల్ పరిచి దానిమీద పేకముక్కలు పరిచి "కట్‌ఫర్ ప్లేసెస్!" అన్నాడు, మురహరి. మురహరి రాజూ, నేను చిన్నప్పటి క్లాస్‌మేట్స్‌మి.

"ఏడిశావ్‌లే! రైల్లోప్లేసులు ఎక్కడ మారతాం?"

"అరే మొదట ముక్కలు ఎవరు పంచాలో నిర్ణయించాలన్నా కట్‌చేయాలి కదా!" అన్నాడు కృష్ణారావ్. మూడోవాడు మూర్తి – నా పేరు భరద్వాజ.

నలుగురం స్నేహితులం. హైద్రాబాద్ నగరంలో బ్యాంకుల్లో ఇద్దరు, ఎల్.ఐసి.లో ఒకరు, డిగ్రీ కాలేజిలో ఒకరు పనిచేస్తున్నాం.

అదేమిటో హైస్కూలు నుంచి ఇప్పటిదాకా మా స్నేహం అలాగే నడుస్తోంది. వారానికోకసారయినా కలుస్తాం, కుటుంబాలు, పిల్లలు, చదువులు, జీతాలు, అప్పులు... ఇవన్నీ జరిగిపోయి జీవితం కుంటిగుర్రంలా నడిచిపోతోంది.

మా స్నేహం మాత్రం అటంకంలేకుండా కొనసాగుతోంది.

ముప్పై ఏళ్ళుగా ఏ సమస్యలూ పట్టించుకోం. కలుసుకున్నప్పుడు పూర్తిగా తలమునకలయేట్లు ఎంజాయ్ చేయడమే.

రేపు మా ఐదో ఫ్రెండు బంగారాజు కూతురిపెళ్ళి భీమవరంలో.

అందరికి కామన్ ఫ్రెండువాడు.

"తప్పదు. వెళ్ళితీరాల్సిందే" అన్నాడు మురహరి ఫోన్‌చేసి.

"వెళ్లడమే కాదు. వెళ్ళి పెళ్ళిచూసి తిరిగి వచ్చేదాకా ప్రతిక్షణం రసగుళికలాగా ఎంజాయ్ చేయాల్సిందే" అన్నాడు మూర్తి.

రోజూ ఆఫీసు, పెళ్ళాం సాధింపులు, పిల్లలు, ర్యాంకులు ఆఫీసరు బెదిరింపులు....

"ఓరేయ్ ఈ రెండ్రోజులు అన్నీ మరిచి తేలిపోవాలి" అన్నాడు కృష్ణారావ్.

అందుకనే ఇన్ని ఏర్పాట్లు.

రైలు కదిలింది.

"గంటలేటు. ఎందుకనో ఏమిటో!" అనుకుంటూ, ఎవరో బెర్త్ లు వెదుక్కుంటున్నారు. మేం నలుగురం కాబట్టి మా చోటు కొంచెం ప్రత్యేకంగా వుంది.

రైలు కదల్తుండగా ముక్కలు పంచుతున్నాడు మూర్తి.

"చిన్న చిన్న డిస్పోజబుల్ గ్లాసులుంటే బావుండేది" అన్నాడు మురహరి. వాటర్‌బాటిల్‌లోని చల్లటి "మద్య+నీటి" మిశ్రమాన్ని గడ గడ తాగి. "ఎక్కువ తాగుతున్నామో తెలీదు. తక్కువ తాగుతున్నామో తెలీదు ".

"అదే మజారా! ఎయ్యి ముక్కలు! అడుతున్నావా లేదా?"

"ఓకుకి రూపాయి కౌంటు, వంద ఫుల్ కౌంట్, డ్రాపు పాతిక, మిడిల్స్ 50"

"నేను డ్రాప్!" అన్నాను. అందరూ తమ తమ ముక్కలు చూసుకుంటు సీక్వెన్సులు సర్దుకుంటున్నారు.

రైలు వేగం పుంజుకుంది. కిటికీ బయట కర్టెను తీస్తే చీకటి అక్కడక్కడా లైట్లు, దూరానా ఆకాశంలో మెరిసే మెరుపులు.. వానపడుతోంది చుక్కలుగా.

"నీయబ్బ! కౌంట్ ఆర్ షో. కరెక్ట్ ముక్క ఏశావ్ కదరా" కృష్ణారావ్ రెండో రౌండ్‌లోనే షో చేశాడు.

"ఫుల్ కౌంట్ వంద" అన్నాడు మూర్తి.

"77 పాయింట్లు అంటే 80 రూపాయలు " మురహరి.

నాది డ్రాపు "పాతిక!" కృష్ణారావ్ బాగానే కొట్టాడు.

మళ్ళీ ముక్కలు పంచుతున్నారు, కెరియర్లు ఓపెన్ చేసి దాంట్లోవున్న రకరకాల తినుబండారాలు బయటకిలాగాను. పకోడీలు మిరపకాయబజ్జీలు మురహరి రాజు తెచ్చిన చికెన్65, మిక్చరు, పల్లీలు అన్నీ.

రైలు జోరు అందుకుంది. "బయట వాన బాగా పడుతున్నట్లుంది" అన్నాడు మురహరి ముక్కలు సర్దుకుంటూ.

"మామూలే కదరా! బంగాళాఖాతంలో వాయుగుండం పడిందట. తుఫానుగా మారిందట.ఇది ఈ రాత్రికే బందరు దగ్గర తీరం దాటుతుందట! రేడియోలు, టీవీలు కోళ్ళై కూస్తున్నాయి ఇనలేదా!"అన్నాడు మూర్తి.

"కోళ్ళంటే గుర్తుకువచ్చింది. రెండు చికెన్ ముక్కల్నియ్యా అన్నా"

"భరద్వాజగాడికి ఇంట్లో దొరకదు. ఇక్కడ నీయిష్టం! నమిలేయి!" అన్నాడు మురహరి.

ఎక్కడో పెటపెటా ఉరుములు చప్పుడు.

రైలు స్పీడందుకుంది.

"నీయమ్మ! వాన జోరుపెరిగింది. ఈడు ఎప్పటిలాగే స్పీడ్ ఎలిపోతన్నాడేంటో! తుఫానుకదా, కొంచం మెల్లగా ఎల్లచ్చుగా" అన్నాడు మూర్తి రైలు డ్రైవరుని వుద్దేశించి.

'టికెట్ ప్లీజ్' అన్నాడు టి.సి నల్లకోటు, లావుగా మీసాలు, కళ్ళజోడుతో గంభీరంగా వున్నాడు.

జేబులు పర్సులు వెదికి టికెట్లు చూపసాగాం.

టి.సి. టికెట్లు చూస్తూనే వాసన ఏదో తగులుతున్నట్లు అన్ని వైపులా చూశాడు.

విస్కీ వాసన నసాళం అంటుతోంది. కాని అతనికి బాటిల్స్ గ్లాసులు కనపడలేదు.

"థ్యాంకు సర్! కొద్దిగా నెమ్మదిగా మాట్లాడికోండి. స్లీపర్‌కోచ్ కదా! డ్రింక్స్ ప్రొహిబిటెడ్!"

"ఎబ్బె! ఇవి వాటర్‌బాటిల్స్ అండి" అన్నాడు మురహరి నీళ్ళబాటిల్ ఎత్తిచూపిస్తూ. "ఇయి చికెన్‌ముక్కలండి! తప్పులేదుకండి?" మాట ముద్దగా వస్తోంది.

టి.సి. మాట్లాడకుండా వెళ్ళాడు. అతను అటువెళ్ళగానే "ఇయ్యరా" అని కృష్ణారావ్ వాటర్‌బాటిల్ అందుకుని గడగడాతాగాడు.

ఆ తర్వాత మూర్తి మూడు గుక్కలు, నేను మూడు గుక్కలు.కృష్ణారావ్ ముక్కలు పంచడం. నీళ్ళుచేదుగా స్పిరిట్ వాసనగా వున్నాయి. సరిగా కలవకపోతే అంతే.

"నీయమ్మ! ఎంతవానైనా తుఫానైనా కంపార్టుమెంటు నిండిపోయింది. ఏసి అయినాసరే! డబ్బులు ఎక్కువైపోయినాయి జనాలకి!" అన్నాడు మురహరి.

నాకు కళ్ళు తేలిపోతున్నాయి మత్తు తలకెక్కింది.

పేకముక్కలు రంగురంగులుగా కనిపిస్తున్నాయి.

"నీ! రాణీ జోకరా" అన్నాను.

పదమూడు ముక్కల్లో నాలుగు రాణీలు ఇస్పేట, ! కళావరు, ఆటిన్ డైమాను.

"ఏం. బాగా వచ్చినయ్యా" మత్తి ఎక్కినకొద్దీ సంకోచాలు తగ్గినాయి. వుషారుగా వుంది! వెచ్చగావుంది. నోరు తెరిస్తే బూతులొచ్చేస్తున్నాయి.

"నీయమ్మ నాలుగు రాణీలున్నాయి కదరా? నాలుగు రంగులు దిగినాయి. కానీ లైఫ్ కావాలి కదరా! ఏయ్ ముక్క ఏదయినాసరే 'షో'నే!"ముద్దగా అన్నాను. ముక్కలు ముడిచి ఓ చేత్తో కాసిని పకోడీలు నోట్లో వేసుకొని.

మిగిలిన ముగ్గరికి నా ఆట నిజంగా బావుందా లేక బ్లఫ్ కొడుతున్నానా తెలీటంలేదు.

కృష్ణారావ్ "డ్రాఫ్ చేయాలా? ఆడాలా?" అనాడు జనాంతికంగా.

"ఆడరా నీ... పెతీదానికీ భయపడితే ఇంకేమడతావ్!" గట్టిగా అరిచాడు మురహరి. "భరద్వాజగాడికి ఆటరాదు. నాలుగు కాదు ఆరు రాణీలు దొబ్బిచ్చుకున్నా ఆడికి ఆట అవదు. భయపడమాక! ఆడు!"

ఆటసాగింది.

రైలు లయబద్ధంగా పరుగెడుతోంది.

ముక్కలు పడతున్నాయి. నాకు లైఫ్‌కార్డు రావటంలేదు. ఎలా పడేయను! మురహరి, కృష్ణారావు వేసిన ఇస్పేటు నాలుగు 'లటుక్కున తీసి సెంటర్లో పెట్టి 'షో' అన్నాడు. "కరెక్ట్ సీక్వెన్సు.. లైఫ్ షో కార్డు రా.. బలే ఏశావ్!"

"ఇన్నేళ్ళయినా కంట్రోల్ ఆడటం చేతగాదరా "లం.........." అని అప్యాయంగా తిట్టి! "ముంచేశావ్ కదరా! నాలుగు జోకర్లతో కౌంట్" అని లెక్కపెట్టసాగాను.100 పాయింట్లు వందరూపాయిలు.

రైలు ఎక్కడో అగుతోంది. వరంగల్ ఏమో, బయట వాన చప్పుడు, వానలోనే ప్రయాణీకులు పరుగెడుతున్న చప్పుడు. కొందరు తడిసిన బట్టల్లో ఏసి కంపార్టుమెంటు ఎక్కి బెర్తులు వెదుక్కుంటున్నారు.

ఆట సాగుతోంది, కృష్ణారావు షో మీద షో అప్పుడే నాలుగు అటలు కొట్టాడు.

రైలు మళ్ళీ కదిలింది. వేగం పుంజుకుంది.

వాన మాత్రం తగ్గడం లేదు. మళ్ళీ ముక్కలు పడ్డాయి. వాటర్ బాటిల్ ఖాళీ అయ్యింది.

మురహరి సంచుల్లో వున్న టీచర్ బాటిల్ తీసి సగానికి సగం వాటర్బాటిల్‌లో పోసి మళ్ళీ ఫ్లాస్క్‌ల్లోని ఐస్ సోడాలు దాంట్లో కలిపేశాడు.

విస్కీవాసన గుప్పుమంది. మళ్ళీ నీళ్ళబాటిల్ నలుగురి మధ్య గిరగిర తిరగసాగింది. రైలు వేగంగా పోతూనేవుంది. "షో" అన్నాడు మళ్ళీ కృష్ణారావ్.

మురహరి రాజు విసుగ్గా ముక్కలు చేతిలోని పెట్టెమీద వేసిన టవల్‌లో విసురుగాపడేసి ఓ బూతు పదం అందుకుని "ఛీ ఎప్పుడు కౌంటే! అసలు నా బతుకే అంత!"

ఉరుములు ఉరుముతున్నాయి. వానపడుతోంది. కండక్టర్ ఒకడు కాకీచొక్కాతో వచ్చి అనుమానంగా చూసి నిలబడ్డాడు.

"మందు తాగుతున్నారా సార్?"

మూర్తి ఓ వంద నోటు అతనికిచ్చి "కామ్ గా ఫో! నెక్స్‌ట్‌స్టేషన్‌లో సోడాలుంటే పట్రా! తెలిసిందా?"

"సర్ రైల్వేపోలీసు టి.సి. వూరుకోరు సార్! మందు తాగకూడదు సర్!

ఇంకో ఏభైనోటు చేతులు మారింది.

'ధ్యాంక్సు సర్' వెళ్ళిపోయాడు.

మురహరి తన విషాద యోగం, తాగినమైకం ఎక్కువ అవగా చేతుల్లో తలపట్టి హఠాత్తుగా ఏడవసాగాడు.

"ఒరె ఒరె ఒరే ఏందిరా! ఏడ్వకరా" అన్నాం అందరం సముదాయిస్తూ.

"నీయమ్మ" బెక్కుతూ "నీయమ్మ" మళ్ళీ బెక్కి "అన్నీ నా జీవితంలో కష్టాలే గురూ. కాలేజిలో ఇంటర్‌ఫెయిలు, డిగ్రీఫెయిల్. సుందరపల్లికి లవ్‌లెటర్రాస్తే లవ్‌ఫెయిల్. ఫారెన్‌ఛాన్స్ ఫెయిల్! అన్నీ ఇప్పుడు పేకాటలో కూడా ఫెయిల్" ఏడుస్తున్నాడు.

"ఊరుకోరా! ఉరుకో! ఈడికి కిక్ ఎక్కువయ్యింది! ఎప్పుడెప్పుడో తల్చుకుని ఏడుస్తావేంటి! ఎంజాయ్ దానెమ్మ సుందరపల్లి గురించి ఏడుస్తావ్. ఇప్పుడు! ఇప్పుడు!" కృష్ణారావ్ తిట్టసాగాడు.

నేను అన్నాను "ఊర్కోండేహె సరదగా పెళ్ళికెళ్తుంటే. అసలీడికి డబ్బులు పోయినందుకా ఏడుపు లేక సుందరపల్లి కోసమా? ఇదుగోరా! ఇదుగో తీసుకో!" రెండు ఐదువందలు చేతులో గుచ్చి అదిమాను.

"వొద్దురా వొద్దురా" మురహరి గింజుకోసాగాడు. "నాకు నీ డబ్బు ఒద్దురా!"

"మరైతే ఏడవబాక!"

రైలు పరుగెడుతోంది.

ఒంటిగంట రెండు, మూడు మూడున్నర ఈ సారి కృష్ణారావుకి నాలుగాటలు కౌంట్లుపడ్డాయి. మూర్తి షోలు చేస్తున్నాడు.

"డబ్బుదేముందిరా నల్లకుక్కని తంతేరాల్తుంది" మళ్ళీ ముక్కలు పంచుతూ అన్నాడు మూర్తి.

"ఎందుకురా ఏడుస్తావ్?" కృష్ణారావు అన్నాడు.

"నాకు లేవా కష్టాలు! కూతురు పెళ్ళికి అప్పులు, కొడుకు చదువుకి ఖర్చు. వాడికి ఉద్యోగం లేదు. ఒక్కోసారి ఛస్తే బావుండననిపిస్తుంది.

నేనన్నాను "నిజమే ఏం సాధించాంరా! సుబ్బారావ్‌గాడు చూడు! దూబయ్‌లో కోట్లు సంపాదించాడు. మా ఫ్రెండ్ నీరజ ఆమెరికాలో సిటిజన్ అయిపోయి పెద్ద ఇల్లు! అరడజనుకార్లు! మన బతుకులు ఇంతే! అన్నిటికీ అప్పే! ఛస్తే మేలు!"

పిడుగు పడినట్టు దూరాన పెద్ద ఫెళఫెళ చప్పుడు.

"ఔనా! నాకు అలానే అనిపిస్తుంది ఒక్కోసారి. కాని మళ్ళీ ఘంటసాల పాట విన్నప్పుడు శ్రీశ్రీ కవిత్వం చదివినప్పుడు, అక్కినేని సినిమా చూసినప్పుడు, భానుమతి ఆలాపన విన్నప్పుడు ఇంకా ఇంకా బతకాలనిపిస్తుంది." అన్నాడు మూర్తి.

అందరికీ డ్రింక్ తలకెక్కింది. కళ్ళు ఎర్రబడ్డాయి. ఏం ఆడుతున్నామో ఏం ముక్కలు వెస్తున్నామో తెలీదు. మధ్యలో జీవితం మీద డిప్రెషన్.

"బంగార్రాజు మాత్రం తక్కువేంటి? కోట్లకోట్లు సంపాదించాడు. కాంట్రాక్టులు చేసి! మనమేరా ఇలాగున్నాం!"

మళ్ళీ మురహరి గోల! 'ఓరే! ఓరేయ్ ఎందుకురా ఏడుస్తావ్! ముక్కలేయరా" విసుక్కున్నాడు మూర్తి.

కంపార్ట్‌మెంటు చాలావరకు నిశ్శబ్దంగా వుంది. మేమే ఎక్కువగా బిగ్గరగా మాట్లాడుతున్నాం.

వానా, గాలీకూడా బయట ట్రైన్ చప్పుడు మించి ఎక్కువయ్యాయి.

సమయం మూడుగంటల ఐదు నిమిషాలు.

"జోకరు కొయ్యరా!" అన్నాడు మూర్తి.

అప్పుడు ఒక్కసారి ఫెళఫెళ బ్రహ్మండం పగిలేంత శబ్దం ఒక్క క్షణంలో లైట్లన్నీ ఆరిపోయాయి.

ఎగిరిపడ్డాం నలుగురం.. చీకటి.

కంపార్టుమెంట్ పక్కకి ఎగిరిపడింది.

జనం నిద్రలో లేచి హాహాకారాలు, ఏడుపులు, కేకలు, మూలుగులు! సామాను చిందరవందరగా పడింది.

చీకటి! తలమీద, చేతులుమీద దెబ్బలు.

నేను తలకిందులుగా వున్నాను.నా కాళ్ళు కంపార్టుమెంటు కప్పుమీద.

నా పక్కన మురహరి అడ్డంగా పడివున్నాడు.

కృష్ణారావు అరిచాడు "ఏక్సిడెంట్.!! రైలు పట్టా తప్పింది".

"నీయమ్మ! అంటానేవున్నాను, అనుకుంటునేవున్నాను తుఫానులో స్పీడుగా పోతున్నాడు" ఆ తర్వాత నాకు స్పృహ తప్పింది. చీకటి తప్ప ఏంలేదు.

★ ★ ★

"నువ్వు లేరా!" అరిచాడు మూర్తి.

అందరికి దెబ్బలు తగిలాయి తలమీద కాళ్ళమీద. ముందు తలకిందులుగా పడ్డాం, అయినా సరే పాక్కుంటూ తలుపు దగ్గరికి వచ్చాం.

"దూకండి! దూకండి! బయటకి" అన్నాడు మురహరి.

కంపార్టుమెంటులు కొన్ని పక్కకి పడిపోయాయి.

కొన్ని చోట్ల పొగవస్తోంది.

వాన తగ్గనేలేదు. ఏడపులు, కేకలు, మూలుగులు అస్పష్టంగా వినవస్తున్నాయి.

"మురహరి, మూర్తి, కృష్ణారావ్.." అని అరిచాను.

అశ్చర్యంగా నాకు అన్ని దెబ్బలు తగిలినా నొప్పివున్నట్టు లేదు.

గాలిలో తేలినట్లుంది. వానలో తడుస్తున్నా.. చలి తగ్గింది.

"పదండి! పదండి!" ఎలాగో బయటపడ్డాం.

"ట్రైన్ ఏక్సిడెంట్! రా తప్పించుకున్నాం. అందరూ ఇరుక్కుపోయినట్టున్నారు."

"ఈ వానలో రైలు పట్టాలు తప్పి వుంటది! మనం తప్పించుకున్నాం. వెళ్ళిపోదాం రా బాబు! ఆగద్దు" అన్నడు మురహరి.

వానలో కుంటుకుంటూ నడిచి సన్నని కాలిబాట మీద నడిచాం.

రాళ్ళు!ముళ్ళు! అడివిలావుంది.

తెల్లవారుతోంది. "నాలుగున్నర టైం" అన్నాడు.

అందరికీ తాగిన కిక్ దిగింది.

పేకట, తాగడం పెళ్ళికి, బయలుదేరడం. అన్నీ కలలా వున్నాయి.

నలుగురు కొంచెం దూరం నడిచి వెనక్కి చూశాం.

మైలుదూరాన కిందగా రైలు సగం పెట్టెలు పడిపోయి, పొగలువస్తూ చచ్చిపోయిన పెద్ద కొండ చిలువలా వుంది.

"అమో! మనం పెట్టెలో చిక్కుకోలేదు బచాయించాం! బతుకు జీవుడా!" అన్నడు మురహరి.

వాడి పళ్ళు రెండు విరిగాయి. మాట్లాడుతుంటే నోట్లోంచి రక్తం జిమ్మినట్లుంది.

"ఆకలి!" అన్నడు మూర్తి.

"అవున్రా! ఆకలి కరకలాడుతోంది ఎలా!" అన్నాడు రావ్.

కాళ్ళతో రాళ్ళు తోసుకుంటూ చెట్లమధ్యగా అడవిలో వానలో నడుస్తూ పోతున్నాం. నడిచినా గాలిలో తేలినట్లుంది.

"అల్లదుగో చూడు! హోటేల్!" అన్నాడు మూర్తి.

"ఓరే భరద్వాజ! ఈ అడవిలో కూడా హోటల్వుందిరా! పొద్దున్నే టిఫిను దొరుకుతుందిరా నడవండి" అన్నాడు.

దూరాన చెట్ల మధ్య విశాలమైన చదునుచేసిన స్థలం. ఒక పందిరి.. దానిముందర లోపట రెండు మూడు గదులు.

గబగబా నడిచాం.

బాగా పాతకాలపు వెలసిపోయిన బోర్డు మీద

"ఆనంద భవన్– స్థాపితం 1924 – ఉడిపి కాఫీ హోటల్" అని రాసివుంది.

బోర్డుమీదగా ధారలుగా వాన కారుతోంది. నలుగురం ఒక్కవుదుటన లోపలికి ప్రవేశించాం.

ఎనభై ఏళ్ళు వెనక్కి వెళ్ళినట్లుంది. మాసిపోయి బూజుపట్టిన గోడలు.

నేలంతా మట్టిగా తడిగా తడిసిన ఆకులతో వుంది.

ఒక అరడజను పాత చెక్క కుర్చీలు. చెదలుపట్టినట్లుగా వున్న కాళ్ళతో బల్లలు.

పైకప్పుకేసి చూస్తే వైరుకి ఒకే ఒక అరవైకాండిల్ బల్బ్ వెలుగుతోంది.

నలుగురం ఓ టేబుల్ దగ్గరే కూలబడ్డాం.

టక్టక్ చప్పుడు ఆ పక్కనే బక్కచిక్కిన తెల్లజుట్టు ముసలి స్త్రీ ఒక నల్లటి కత్తితో ఉల్లిపాయలు టకటకా తరుగుతోంది సన్నటి ముక్కలుగా.

"ఓ!అమ్మాయ్! ఎవరైనా సర్వర్లుంటే పిలువు" అన్నాడు మూర్తి.

నేను చుట్టూ చూశాను. వాన నీళ్ళు కారుతున్నాయి గోడలమీద.

హఠత్తుగా ఒక నల్లటి బక్కచిక్కిన గుండుమనిషి ప్రత్యక్షం అయ్యాడు. వాడి ఒంటిన తెల్లటి జంధ్యం వంటగది పొగకి నల్లగా మాసిపోయింది.

బొగ్గులా నల్లగా మాసిన తువ్వాలు కట్టుకున్నాడూ. కళ్ళు ఎర్రగా నిద్రలేనట్లు. తలమీద జుట్టు లేదుకాని ఒక సన్నని పిలక.

పళ్ళికిలించి "ఏంకావాలి సార్?" అడిగాడు.

"ఏముందోయ్ తినడానికి వేడిగా?" అడిగాడు మురహరిరాజు. అతని గొంతు కీచుగా బొంగురుగా వచ్చింది.

"ఇడ్లి, కారప్పొడి, దోశ చట్ని... అంతే సార్ కాఫీ వుండాది, టీ వుండాది ఇయ్యమంటారా?"

"ఆహా ఇంత అడవిలో వానలో రైలు ఆక్సిడెంట్ తర్వాత వేడివేడి ఇడ్లీలు పెట్టే హోటల్ దొరకడం! పట్రా నాలుగు ప్లేట్లు ఇడ్లీ. నాలుగు కాఫీ త్వరగా!"

ఈ సర్వర్ వెనకాలే మరొకడు వచ్చి నిల్చున్నాడు.

వాడు ఇలాగే నల్లగా బొగ్గులంటి శరీరంతో ఎముకలు కనిపిస్తూ గుండుపిలకతో...

" ఏక్సిడెంటా!రైలా?" ఒక్క పక్కగా చూసి తలవాల్చాడు ఏదో వినబడినట్లు.

"అయితే ఇంకా కొంతమంది వొస్తారేమో! ఇంకా టిఫిన్సు రెడీ చేయాలి" మెల్లగా అన్నాడు.

నేను వెనక్కి తిరిగి చూశాను. ఇప్పుడు కనిపించాడు. చీకట్లో బల్లకుర్చీ వేసుకుని మరొక వ్యక్తి. అతడు ప్రొప్రయిటర్ కామోలు. వాడి బల్లమీద రశీదుకు కాగితాలు గుచ్చిన ఇనుపతీగా ఒక అగరత్తు స్టాండ్ వున్నాయి.

ఇటుచూశాను.

జోరుమని గాలిహోరు. చాలామంది సర్వర్లు హడావిడిగా తిరుగుతున్నారు.

అందరూ అదే డ్రస్సు! మురికిగా వున్న నల్ల తువ్వాళ్ళు జంధ్యాలు పిలకలు. బయట గాలీహోరు మెరుపులు ఎక్కువయినాయి.

నాకెందుకో భయం వేసింది "ఇలా రావోయ్!" అని ఒక్కడ్ని పిల్చి చేత్తో చప్పట్లు చరిచాను.

"ఈ అడవిలో హోటలు ఎందుకు పెట్టారు? ఎప్పట్నించి వున్నారు ఇక్కడ? ఇదేవూరు?"

"ఆనంద భవనండి. ఎనభైఏళ్ళ నుంచి వున్నామండి. ఇది గుంటూరు జిల్లాలో మల్లాపురం అనే గ్రామం దగ్గర ఆడివండీ!"

రోడ్డులేకుండా, వూరు లేకుండా హోటల్ ఎలానడుస్తుంది?

బయట చెట్లు.. గాలీ.. భీకరంగా.

ఓ సర్వరు నాలుగుపేట్ల ఇడ్లీలు కారప్పొడి చట్నీతో సహాతెచ్చి టక్‌మని బల్లమీద పెట్టాడు.

తినసాగాం. ఇడ్లీ తింటున్నట్లేవుంది కాని శరీరం తేలికయిపోయినట్లుంది.

తింటూ మురహరిరాజు కేసి చూశాను.

అతను నమిలితినే ఇడ్లీ గొంతులోంచి తెల్లగా క్రిందికి దిగి అహారనాళంలోంచి జఠరాశయంలోకి ప్రవహిస్తోంది.

భయంతో నేను కళ్ళు ఆర్పి ఆర్పి మళ్ళీ చూశాను.

మూర్తి అస్థిపంజరంలా వున్నాడు, ఇడ్లీ వాడి గొంతులొంచి పొట్టలోకి దిగుతోంది స్పష్టంగా కనిపించింది.

కృష్ణారావ్ కాఫీ తాగడం ఇంకా వింతగా వుంది. కాఫీ జలపాతంలాగా గొంతులోంచి పొట్టలోకి వెళ్తోంది.

ఉన్నట్లుండి నిశ్శబ్దం.. బయట వాన ఆగింది.

ఆకాశం తెల్లబడింది.

ఈ క్షణాన్నో మరుక్షణాన్నో భళ్ళున తెల్లవారేట్లుంది.

“బిల్లు?” అన్నాడు ఒక సర్వర్.

“ఎంత?”

“ ఏభై రూపాయిలు.”

"ఇంతేనా" అనిపించింది. అటూచూస్తే డజన్లకొద్దీ కళ్ళు అస్థిపంజరాలు లాంటి శరీరాలు నిలబడి చూస్తున్నాయి నావంకే.

వెనక్కి చూస్తే బిల్లు కలెక్ట్ చేసే ప్రొప్రయిటర్ స్థానంలో వ్యక్తి స్థాణువులా అయిపోయాడు. వాడు కదలడంలేదు.

బయటకి చూశాను. దట్టమైన చెట్లు. వాన తగ్గింది.. తెల్లవారింది.

ఎర్రటి సూర్యకిరణం ఒక్కటికి లోపలికి ప్రసరించింది.

"ఏమిటిదంతా? ఎవరుమీరు? ఎక్కడ్నించి వచ్చారు?" అన్నాను.

నాగొంతు నాకేవింతగా వుంది. అది ఇనపరేకమీద ముళ్ళచక్రం తిరిగినంత బొంగురుగావుంది.

"ఎవరుమీరంతా? ఏమిటిదంతా?" అనబోయాను.

"మేం కాదు. మీరే వచ్చారు! ఎనభై ఏళ్ళకిందనుంచి ఇక్కడేవున్నాం. ఇప్పుడు మళ్ళీ మీ నలుగురు మాలో కలిశారు." అన్నాడు ఒకడు.

అతనలా అంటుండగానే సూర్యకాంతి లోపలకి ఎక్కువగా రాసాగింది.

వాళ్ళు అందరూ స్థాణువులై పోయారు.

మేంకూడా అగిపోయాం. నా మిత్రులు ముగ్గురు తెల్లటి ఆకారాల్లా గోచరించారు.

పూర్తిగా కదలిక పోని ఒకడు అంటున్నాడు.

"మావాళ్ళు ఎవరూ మాకు అంతిమసంస్కారాలు చేయలేదు. పైకిపోలేం కిందకిరాలేం. అందుకని అందరం అర్ధరాత్రి హోటల్ నడుపుతుంటాం. పొద్దున్న తెల్లవారితే మనకి త్రిశంకు స్వర్గమే. రాత్రే మనకి కొంచెం శక్తి వస్తుంది. ఇక మీరు మాతోబాటే! మాతోనేవుంటారు." పూర్తిగా తెల్లవారింది. వెల్తురు విజృంభించింది.

నేను, మూర్తి, కృష్ణారావ్, మురహరి రాజు. క్షణంలో మర్రిచెట్టు కొమ్మల్లో ఇరుక్కొని వున్నాం.

దూరాన వున్న దృశ్యా,లు కళ్ళులేని నా ఆత్మకి అస్పష్ట సినిమాల్లా కనిపిస్తున్నాయి.

...చచ్చిన కొండచిలువలా దూరాన పడిపోయిన రైలుపెట్టెలు. దానిచుట్టూ హడావిడిగా జనం. రక్షణకార్యక్రమాలు అనుకుంటా. అక్కడకూడా ఏంబులెన్సులు అగివున్నాయి. స్ట్రెచర్ల మీద జనం.

“అయ్యో! అయ్యో” మురహరి రాజు విలపించసాగడు.

కాని అది ములుగులాగా కాక హోరుగాలి రొదల, గబ్బిలం నవ్వులా వినిపిస్తోంది.

వాళ్ళు కాదు! వాళ్ళు కాదు.... మనం...మనం...పోయాం.... మనవాళ్ళు మనకి సంస్కారం సరిగ్గా చేసేదాక మనకి రాత్రిళ్ళు ఆనందభవన్, పగలు మర్రిచెట్టే గతి!

మరణం తర్వాత కూడా స్నేహమే మిగిలిన మూడు ఆత్మలు నిశ్శబ్దంగా నిట్టూర్చసాగాయి.

మర్రిచెట్టుకింద పాడుబడిన భవనం గోడలు వానకితడిసి ఉదయపు ఎండకి తళుక్కుమన్నాయి. గాలీ వానలకి పాతబడిన నల్లటి బోర్డుమీద మాసిపోయిన అక్షరాలు.

ఆనందభవన్ – ఉడిపి హోటల్(స్థాపితం 1924)

# తెలుగు గోల

**డా. పుట్టపర్తి తులజాదేవి**

**"వాటీజ్ దిస్? " బాస్ గాండ్రుమన్నాడు.**

"యస్ సార్!" చేతులు కట్టుకుని తలదించుకుని తలవూపింది చింతామణి.

"వాట్ యస్ సార్? వాటి ఐ టోల్డ్, వాట్ యు తాట్? ఈజ్ దిస్ ది ప్రొసీజర్ ఐ టోల్డ్?"

"నో సర్!" అంతే వినయంగా అంది చింతామణి.

"అగైన్ యు ఆర్.." తల విసురుగా అటూ ఇటూ ఊపి "టేక్ యువర్ పేపర్ అండ్ టైప్ వన్స్ అగైన్ - ఇన్ దట్ ప్రొసీజర్ వాట్ ఐ టోల్డ్. అండర్ స్టాండ్?" పేపరు విసురుగా ముఖానపడేసినంత పని చేశాడాయన.

"ఎస్ సార్! స్టుడ్ సార్ (అండర్ స్టుడ్)" మామూలుగా తల ఆడించి పేపరు తీసుకుని వచ్చింది బయటికి చింతామణి. తీరా బయటికి వచ్చాక ఆ పేపరు చదివితే అది ఒరిజనల్ కాదు. అయినా ఈ పేపరు ఆయన టేబుల్ దగ్గరికి ఎలా వెళ్ళినట్లు? ఆయనైనా ఎలా చూచాడూ? అని తిరిగి ఆ విషయం చెప్పడానికి ఆయన గదిలోపలికి అడుగుపెట్టింది చింతామణి. ఎందుకొచ్చావ్ అన్నట్లు చూచాడు బాసు.

"సర్ మీరు చూచి, సంతకం చేయాల్సిన పేపరు ఇదికాదు. సార్. ఇదిగో ఇక్కడ ఉంచాను సార్.. దానికి సంబంధించిన ఫైల్." అని ఆయనకు కుడి చేతివైపు టేబుల్ మీద ఉన్న ఫైల్‌ను ఆయన ఎదురు గుండా పెట్టింది.

"అవునా?" అంటూ ఆయన ఫైల్ ఓపెన్ చేశాడు. కాదు కాదు. ఓపెన్ చేయబోయి మళ్ళీ కస్సుమన్నాడు.

"నేను చూచి, సైన్ చేయాల్సిన పేపరేదో అది మాత్రమే నా టేబుల్ ముందు ఉండాలని మీకెన్నిసార్లు చెప్పాను? అయినా మీరు సరిగ్గానే టైప్ చేస్తారనుకోండి. నేను బ్లైండ్ సంతకం చేసినా సరిపోతుంది అనుకుంటాను"

ఈ మాటలకు చింతామణికి చిర్రెత్తుకొచ్చింది.

"వై బ్లైండ్ సంతకం? యు రీడ్ సర్. ఐ సిట్" కుర్చీమీద చేతులుకట్టుకుని కూర్చుంది చింతామణి.

"అరే! ఇదేంటమ్మా కాంప్లిమెంటిచ్చినా కష్టమేనా? అర్థం చేసుకోరూ. అసలే బోల్డు పనితో బిజీగా ఉంటాను."

"అవునవును. ఊపిరి తీసుకోవడానికైనా టైమ్‌లేదు నీకు" మనసులోనే గొణుక్కుంది చింతామణి. చదివితీరాల్సిందే అన్నట్లు కుర్చీలో కదలకుండా కూర్చుంది.

ఆఫీసర్‌కు కోపం వచ్చింది. ఆ ఫైల్లోని పేపర్లమీద అక్కడక్కడా రెడ్‌లైన్లు కొట్టి - "ఇన్ని తప్పులా? నయం నేను సంతకం పెట్టలేదు. వెల్లు. మళ్ళీ సరిగా రాసి టైప్ చేసి తీసుకురాపో వెల్లమ్మా" ఏకవచనంలోకి దిగిపోతాడాయన - కోపం ఎక్కువయితే.

"వెల్లు ఏంటి వెల్లు? వెళ్ళమ్మా కాకపోతే వెళ్ళు అనాలి. తెలుగోడట తెలుగోడు." చింతామణి మనసు మండిపోయింది.

"ఒక్క లైను సరిగ్గా ఉందా? ఎందుకమ్మా జీతాలు నెలనెలా తీసుకునేది? తీసుకున్న జీతాలకు న్యాయం చేయొద్దటమ్మా? వెళ్ళి సరిగ్గా, నీట్‌గా టైపు చేసుకురా పో" పేపర్లు విసురుగా టేబుల్ మీద పెట్టి - దానిమీద ఎగిరిపోకుండా పేపర్ వెయిట్ పెట్టాడు.

"వెల్లు, వెల్లి ఏమిటి నీ బొంద? వెళ్ళు అనలేవా? చిన్న చిన్న తెలుగుపదాలు కూడా సరిగ్గా పలకలేని నీవొక బాసువు. నీ కింద నేనొక సబార్డినేట్‌ని" మనసులోనే తిట్టుకుంటూ - ఆ పేపర్లు తీసుకుని బయటికి వచ్చిందామె. బయటికి రాగానే ఎదుటి టేబుల్ వైపు చూచింది.

ఆఫీసర్ సతీమణి.. అంజాద్ ఖాన్లా ఉంటుంది అంత పొడుగూ అంత లావుతో. అయినా వాళ్ళిద్దరూ అలాగే ఉంటారులే.

ఆమె కూడా అక్కడ ఎంప్లాయినే. కాకపోతే - పోస్ట్‌లో జాయినయిన తర్వాత వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు. అందుకే - కంపెనీ రూలు ప్రకారం ముందుగా భార్యా భర్తలైన వాళ్ళకు అక్కడ ఉద్యోగం నిషిద్ధమే అయినా - చేరాక వాళ్ళు భార్యాభర్తలయ్యారు కాబట్టి వాళ్ళు ఎగ్జెంప్టెడ్ అన్నమాట. ఇప్పుడు ఇద్దరూ ఎంచక్కా అరవై వేలు దాదాపుగా నెలజీతాలు తీసుకుంటున్నారు.

చింతామణి బైటికి రాగానే అంతకు ముందు కొంగలా మెడసాచి అద్దాల కిటికీలోంచి తొంగి తొంగి చూస్తున్న ఆమె సర్దుకుని కూర్చుంది. ఆమెకేదో అనుమానం. ఆడవాళ్ళు లోపలికెళ్తే బయటికి వచ్చేవరకూ స్థిమితంగా సీట్లో కూర్చోలేదు.

ఆమెనో చూపు చూచి చింతామణి తన సీట్ దగ్గరికి వెళ్ళింది. అప్పటికే గుసగుసలు మొదలైన పది పన్నెండు కాబిన్ల ఆ హాలునంతా ఒక్కసారి కలయచూసి "సార్ ఈజ్ ఆన్ ఫైర్. డోన్ట్ డిస్టర్బ్" అని తలఫైల్లోకి దూర్చేసింది. పాడిందే పాడరా, పాచిపండ్ల దాసరి లాగా రాసిందే రాయాలి. తప్పుతుందా?

"ఏమైంది మేడమ్? సార్ మల్లీ మొదలెట్టాడా?" పక్క కాబిన్లోంచి పరిమళ అడిగింది.

"ఆ..ఆ.. మల్లీ మల్లీ మొదలెట్టాడు. అయినా నీవు కూడా... మల్లీ ఏంటే. మల్లీ? మళ్ళీ అనలేవా?" కోపంగా అంది చింతామణి.

"సరే మేడమ్. మీ మూడ్ బాగున్నట్లు లేదు. మల్లీ మాట్లాడుకుందాంలెండి"

"అదిగో మళ్ళీ! అబ్బా! ఈ తెలుగు భాషను ఖూనీ చేస్తూ - చెవుల్లో సీసం పోస్తున్నారు - వీళ్ళంతా."

ఇంట్లోనూ ప్రొద్దుట్నించీ ఇదే తెలుగుగోల!

"నీల్లొస్తున్నాయ్! నీల్లొస్తున్నాయ్! " అని పెద్ద పిల్ల గట్టిగా అరుస్తూ చెప్పింది.

వెంటనే వంటింట్లో కాఫీ కలుపుతూన్న చింతామణి అందుకుంటుంది. "నీల్లుకాదే నీళ్ళు అనాలి. అను పదిసార్లు నీళ్ళు నీళ్ళు అని. "

"పదిసార్లు చెప్పుకుంటూ కూర్చుంటే పున్యకాలం కాస్తా కరిగిపోతుంది. బిందెలిప్పు తొలచి పట్టి పెడతా! తర్వాత నీవు లోపల పెట్టుకో!"

"నీళ్ళు పట్టకపోయినా పర్వాలేదు. నీవు ముందు నీళ్ళు అనడం నేర్చుకో" అని చింతామణి మొండిగా బిందెలు ఇవ్వకుండా అడ్డుకుంది.

"ఏంటమ్మా నీవు? నీల్లు ఆగిపోతాయ్. మల్లీ మల్లీ మనమే మోయలేక చావాలి బయటి నుంచీ జరుగమ్మా పక్కకు"

"అదిగో! మళ్ళీ మళ్ళీ మనమే మోయలేక చావాలి. అనాలి మల్లీ మల్లీ ఏంటి మల్లీ మల్లీ?" ఈసారి కాస్త కోపంగా అంది చింతామణి.

"సరేమ్మా! ఇప్పటికిది అయిపోనీ రేపు కావాలంటే ఇంపోజిషన్ రాసి చూపిస్తాలే"బిందెలు బలవంతంగా చేతిలోంచి లాక్కుని బయట నల్లా దగ్గరకు పరిగెత్తింది పెద్దపిల్ల.

"అసలే ఎండాకాలం! నీల్లు తక్కువొస్తాయ్ పట్టిపెట్టుకోవడం తక్షణ కర్తవ్యం. భాష, బాగోగులు తర్వాత" అంటూ సర్ది చెప్పబోయాడు మణిరత్నం చింతామణి భర్త చింతామణి అతనితో కూడా ఏమో చెప్పబోయింది. ఆమెను అడ్డుకుంటూ "ఆ... ఏం తేవాలి షాపునుంచీ తొందరగా చెప్పు. కంది బేల్లు, మినబ్బేల్లు, మిరకపాయలు, వెండు కొబ్బరి, సోపులూ.. ఇంకా?"

"కందిబేల్లు, మినబ్బేల్లు ఏంటి? కంది బేడలూ మినబ్బేడలూ అనాలి. మిరకపాయలు కాదు మిరపకాయలు అనాలి. వెండు కొబ్బరి ఏంటి బెండు కొబ్బరిలాగా? ఎండుకొబ్బరి అనాలి. లేకుంటే ఎందుకొచ్చిన గోల? కందిపప్పు మినప్పప్పు అనండి. సోపులూ, చింతపండూ గట్రాతేవాలి తొందరగా వెళ్ళిరండి. మళ్ళీ ఆఫీసుకు టైమౌతుంది" అని తొందర చేసింది భర్తను చింతామణి.

"ఆ...ఆ నీవీ క్లాసు పీకకుండా ఉంటే ఈ పాటికి సామానుతో ఇంటికి వచ్చేవాడినే తిరిగి" సంచి తీసుకుని మణిరత్నం బయలుదేరాడు.

"అబ్బా! పెరడంతా కంపు కొడ్తూంది. చక్కగా మల్లె, జాజి, నంది వర్ధనం పూలతో అందంగా, మంచి వాసనతో హాయిగా అనిపించే పెరడంతా కోల్లచావిడితో చండాలంగా ఉంది" విసుక్కుంటూ అంటున్నాడు చిన్నాడు.

"కోల్లు ఏంట్రా కోల్లు? కోళ్ళు అనలేవూ? కోడికి బహువచనం కోళ్ళు. ఇంతమాత్రం తెలియకుండా చదువెలా చదువుతున్నారు స్కూల్లో?" గయ్ మంది చింతామణి

"స్కూల్లో మా టీచర్లు అలాగే మాట్లాడ్తారు.. అందుకే మాకూ అట్లాగే అలవాటైంది మరి. ఏం చేద్దాం?"

"ఏం చేద్దాం ఏంటి? నేనున్నాను కదా మీకు సరిగా నేర్పించడానికి. శుద్ధమైన తెలుగు మట్లాడండ్రా అంటే మీ టీచర్లు చెప్పిందే సరైందని వాదిస్తారే?" అంటూనే ఉంది చింతామణి. ఇంతలో మణిరత్నం ఖాళీసంచితో తిరిగొచ్చాడు.

చేతిలోని సంచి అందుకుంటూ చిన్నోడు అడుగుతున్నాడు, "ఏం నాన్నా! ఖాళీ సంచితో వచ్చావ్? రవిలేడా లేక రష్గా ఉందా?"

"లేదురా!రవి లేడు. వసూల్లకు బయటికి పోయాడట. ఆ పని వాడు నిదానం చేస్తున్నాడు. అక్కడే నిలబడితే ఆఫీసుకు లేటయ్యేలాఉంది. అందుకే సరుకుల చిట్టీ ఇచ్చి వచ్చా. కట్టి పెడితే సాయంత్రం తెచ్చుకోవచ్చు"

"వసూల్లు కాదు వసూళ్ళు అనాలి" అని మళ్ళీ క్లాసు పీకపోయింది చింతామణి.

"అమ్మాతల్లీ! ఇప్పుడింకా నీవు క్లాసు తీసుకుంటూ కూర్చుంటే అవతల టైం పరుగెడుతూంది. నీకు దండం పెడతాను. తొందరగా ఏమైనా చేసెయ్. కూరవుంటే కూరలేదంటే ఏ చిత్రాన్నమ్మో కలిపెయ్. బయల్దేరదాం" అంటూ మణిరత్నం టవల్ తీసుకుని బాత్రూంలోకి దూరాడు.

"అయినా నీవేంట్రా? ఎన్నిసార్లు చెప్పాలి? ఖాళీ సంచి కాదు ఖాళీ సంచితో అనాలని" ఇంకా ఆమె మాట పూర్తికానేలేదు - పిల్లాడక్కడలేడు.

వీళ్ళతో సరిగ్గా మాట్లాడించడం - వీళ్ళను పుట్టించిన బ్రహ్మదేవుడికి కూడా సాధ్యం కాదు. అరే! సరైన తెలుగు నేర్చుకోండ్రా - మినిమమ్ మార్పులు చేసుకుని - అంటే వినిపించుకోరే?

ఇంతలో బయటినుంచీ ఎవరో పిల్లలు పిలుస్తున్నారు "రాహుల్ రాహుల్" అని.

"ఎవరయ్యా? " అనుకుంటూ గుమ్మం ముందుకు వచ్చిన చింతామణికి ఎదురింటి శామ్యుల్ కనిపించాడు.

"ఆంటీ! రాహుల్‌ను ప్లే గ్రౌండ్‌కు తొందరగా రమ్మని చెప్పండాంటీ! వాల్లందరూ ఇప్పటికే అక్కడికి చేరుకుని ఉంటారు." అంటూ వాడు సైకిల్ వెనక్కు తిప్పుకున్నాడు.

"వాల్లందరూ కాదు వాళ్ళందరూ అనాలి" అని ఇంకా ఏదో చెప్పబోయిందామె పాత మూడ్ లోనే.

"సరే ఆంటీ! రాహుల్‌ని తొందరగా రమ్మని చెప్పండి నే వెల్తున్నా" అంటూ వాడు పారిపోయాడు.

మళ్ళీ వెనక్కొచ్చి "ఇఫ్ ఉయ్ గో లేటాంటీ - మమ్మల్ని ప్లేనుంచీ రిమూవ్ చేస్తారంతే తొందరగా పంపండి" అంటూ తుర్రుమన్నాడు వాడు.

"అమ్మా!" లోపల్నించి పెద్దపిల్ల పిలుస్తూంది.

"వస్తున్నా"!

"అమ్మా! మా ఫ్రెండు అక్కది పెల్లి" అనబోయి నాలుక్కర్చుకుని" అదే మారేజ్‌కి వెళ్ళాలి. మీతోపాటూ నేనూ బయల్దేరనా?"

"ఇలాగే బయట చుట్టాలముందూ మాట్లాడండి నా పరువు తీస్తూ. చదువుకున్న దానివి - పిల్లలకిలాగేనా నేర్పించేది అంటూ వాళ్ళు నాకు పెడతారు గడ్డి" అని ఇంకా ఏదో గొణుక్కుంటూ ఉండిపోయింది చింతామణి.

"తెలుగూ సరిగారాక - అటు ఇంగ్లీషూ అంతంత మాత్రంగానే - బట్లర్ ఇంగ్లీషు మాట్లాడి భాషా పారతంత్ర్యాన్ని వదులుకోలేకుండా ఉన్నారీ మనుషులు! రెంటికీ చెడ్డరేవడి అవుతున్నారు. ఎక్కడ చూచినా - విన్నా - ఇదే ఇంగ్లీషు యావ, తెలుగు భాష గోల. టీ.వీ ఆన్ చేసినా - సీరియల్స్ చూచినా ఖూనీ చేసినా తెలుగు భాష చిరాకెత్తిస్తుంది. సరైన గైడెన్స్ ఎవరిస్తారో ఏమో వీల్లకు" అనుకోబోయి నాలుక్కరుచుకుందామె - తానూ వాళ్ళదారిలో పడుతోందా అని సందేహిస్తూ వెంటనే చెంపలేసుకుంది.

